DAMAGE BOOK

UNIVERSAL LIBRARY
OU_204327
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T83 L195 Accession No. T 23320

Author లక్ష్మీ నరసింహారావు పానుగంటి

Title సుధాశరచ్చంద్రము.

This book should be returned on or before the date last marked below.

సుధాశరచ్చంద్రము

(LAKE OF PALMS)

రోమేశచంద్రదత్తు

అనువాదకులు:

బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంపంతులుగారు

వేంకట్రామ అండ్ కో

ప్రకాశక

రాజమహేంద్రవరమున

పిళ్ళారిశెట్టి ప్రకాశరావు అండ్ బ్రదర్సువారి

శ్రీరామముద్రాక్షరశాలయందు

ముద్రింపబడినది.

1937

సుధాశరచ్చంద్రము.

మొదటి ప్రకరణము.

బంగాళాదేశమందు నివాసయోగ్యంబైన తాల్పుకారను గ్రామముకలదు. తాల్పుకా యనఁగా బంగాళీభాషలో తాళ్ళచెరువని యర్థము. ఆగ్రామమున నొక చెరువుకలదు. ఆతటాకంబునకు పడ్డాణముపగిది చుట్టును వేనవేలు తాళవృక్షములు కలవు. ఈ తాళ్ళచెరువుంబట్టియే యాగ్రామమునకా నామము కలిగెను. ఆతటాక ప్రాంతమున వరిచేలు కనుపండువులై యుండును. మట్టమధ్యాహ్నము ప్రొద్దునెత్తి మీఁద నున్నపుడుతప్ప దక్కినసమయములందు ముఖ్యముగా నుదయాస్తమయములయందుఁ దటాకజలంబులు నిరంతరము తాఁటిచెట్లనీడచేతం గప్పఁబడి యుండుటచే సముద్రజలంబునుం బోలి నల్లనై యంధకారపూరితములైయుండును.

ఒక్కనాఁడు సాయంకాలము భానుఁడపరజలధిని గ్రుంగినపిదప నొక్కయంగన నడుములోతునీట స్నానము చేయుచు నిలిచియుండెను. ఒడ్డుననున్న మెట్లమీఁద తొమ్మిదియేండ్లప్రాయముగల యొకబాలిక తనచెల్లెలిం జంకఁబెట్టుకొని తల్లిరాక నిరీక్షింపుచుండెను. స్నానము చేయుచున్న యాయువతిప్రక్క నీరు గొంపోవ[illegible]సిన పెద్దకుండ యొకటి యుండెను. స్నానము చేయుచున్న

[illegible]తువుయొక్కయు గట్టుననున్న యిరువురు బిడ్డలయొక్కయు

దయనీయమైనది. ఆపడంతి గౌరవము గలకాయస్థకుటుంబ

[illegible] డనువానికిచ్చి వివాహము చేయఁబడెను. ఆ

[illegible] స్థితి గలవారు. ఆమె మగని కాలెకర

[illegible] చేత నాగలింబూని దున్నఁగూడదు.

[illegible] ఒక చిన్న భూమి సేద్యము చేయిం

[illegible] చాపలసిన పన్నులు, పాలేళ్ల

స్వకుటుంబ పోషణమునకు జాలమి హరిదాసు తఱుచుగా ద్రవ్యము లేక యిబ్బంది నప్పుడప్పు డితరుల సహాయము నపేక్షింప వలసినవాఁడగుచు వచ్చెను. హిందూ దేశమున నాలు మగఁడుఁ గంపెడుపిల్లలు గలకుటుంబము లనేకము లీతెఱంగున నే దినమునకు నాలుగైదణాల రాఁబడి గలిగి లోకయాత్ర నెంతో కష్టముగా గడుపు కొనుచుండుట మన మందఱ మెఱిఁగినదే కదా! హరిదాసు సంవత్సరము పొడుగున కష్టపడినను వాని కంతమాత్రమైనఁ జేఁజిక్కుట కష్టమయ్యె. హరిదాసుయొక్క పెదతండ్రి కుమారుఁడు తారుణీమల్లికుఁడు బర్ద్వాను (వర్ధమాన) పట్టణమున మహా రాజుగారి కొలువులో నుండెను. అన్నదమ్ములే పరస్పరసహాయము జేసికొనుట యరుదైన యీదినములలో పెదతండ్రి కుమారులవలన సహాయ మపేక్షించుట యాకాశవృక్షముయొక్క ఫలముల నపేక్షించుటయే యైన నప్పుడప్పుడు తారుణీమల్లికుఁడు, హరిదాసు సొమ్మున కిబ్బందిపడి తన్నడిగినప్పుడు చేబదులుగ పదిగాని యైదుగాని రూపాయలు బదులిచ్చి తిరిగి యతఁడా సొమ్మిచ్చివేయునప్పుడు వడ్డీమాత్రము గ్రహింపక నుపకారము చేయుచుండును. అట్లగుట హరిదాసు జీవనము మొదటినుండియుఁ గష్టతరమైన నతఁడు సంతుష్టుఁడై కాలక్షేపము చేయుచు వచ్చెను.

వివాహమైన పదియారు సంవత్సరములకు హరిదాసున కొకముద్దులకూఁతురు పుట్టెను. ఆ ప్రథమ సంతానమునకుఁ దలిదండ్రులు ముదితులై బిందుదేవి యని పేరు పెట్టిరి. లేకలేక పుట్టినబిడ్డ యగుటచే బిందు మిక్కిలిగారాబమునం బెరుగుచుండెను. జననీజనకుల గారాబము దారిద్ర్యమును రూపుమాప లేదుకదా! అందుచేత బిందు తలిదండ్రు లెంతముద్దుచేసినను బీదబిడ్డయే యైయుండెను. తారుణీమల్లికుఁడు దేవీ నవరాత్రములకు వర్ధమానపట్టణమునుండి స్వగ్రామమగు తాళ్ళదెవపురమునకుఁ బోయి తన కూఁతురైన యుమకు సన్నగుఱ్ఱాలు బంగారుమురుగులు వెండియందెలు కడియములు మొదలగునవి తెచ్చియిచ్చెను. అదిమొదలు తాను పేదవారి బిడ్డనన్నమాట
...దు తనకుకూఁడ నట్టివి తెమ్మని పోరుపెట్టుచు వచ్చెనందున దల్లిదండ్రు
...ప్పుచేసి బిందు చేతులకు గుల్లమురుగులు, కాళ్లకు గుల్లలందెలు
...న ఋణము హరిదాసు చాలాకాలమునకుఁ గానితీర్పలేక
...స్తురూపముగా నుండుటచేఁ గుటుంబమున కెప్పు
...చెప్పవచ్చును. హిందూదేశమున పేద కుటుం
...రికిఁ గలసొత్తగుటచేఁ దబ్బుమగాఁ గుటు
... మన మెఱుంగుదుము కదా! అందుచే

రైన తారుణీమల్లికుని యింటివద్ద లెక్కలకష్టముచేసి బిడ్డలుం దానును బ్రదుకఁ దలఁచి వాని యింటికిఁ బోయి వానిపాలం బడెను. అక్కడ నామె రెండుసారులు పంట జేయుటయే గాక గృహసంబంధమైన కృత్యములు నీచములనక యుచ్చము లనక చేయఁజొచ్చెను. తన గారాబుబిడ్డలగు బిందును, సుధను నేలఁగూర్చుండఁ బెట్టి తారుణీమల్లికునకూఁతు నెత్తుకొని మోయుచుండును. ఇంటికి గావలసినసరు దెచ్చుచుండును. అంట్లు తోముచుండును. కసవు నిమ్ముచుండును. అనాథ స్త్రీ జీవనము నిమిత్త మొకరియాధారము బడసినవారు మిక్కిలి యోర్పుగలిగి యుండ వలయును గావున నీవితంతువు చీవాట్లను లెక్కసేయక యెన్నఁడు నధిరస్పందన చేయకయుండెను. అప్పుడప్పుడు హృదయము దుఃఖపూరితమగుటయు నొంటిగా నొకతావున కడిగి కన్నీరువిడిచి మనంబున నీవిధంబున నీశ్వరుఁ బ్రార్థన చేయుచుం డును. "ఓదీనదయాళూ! నా చిన్నబాలికలగు బిందును సుధను రక్షింపుము. వారిద్దరు సుఖపడునట్లు లలాటములమీఁదఁ వ్రాయుము. నీకరుణామృతము వారిపై వెదజల్లుము. సుధకు బిందుకు నేను బ్రతికియుండఁగానే వివాహము లగునట్లను గ్రహింపుము. నాకెంతకన్న గావలసినది లేదు." చెఱువులో మొలబంటు నీటను దిగి స్నానము చేయుచున్న యాపడఁతియొక్కయు మెట్లపైనున్న యిరువురు బాలికలయొక్కయుఁ బూర్వచరిత్ర మిది.

కొంతసేపటికా యింతి నీరుముంచి కడవ భుజముపైఁ బెట్టుకొని "అమ్మా! బిందూ! యింక నింటికి పోదము లెమ్ము. నీవు చెల్లెలి నెత్తుకొనఁ గలవా? పాపము యింటివద్దనుండి నడచివచ్చినప్పటికి దానిలేతకాళ్ళు నొప్పులెత్తియుం డును. అది దూరమెట్లు నడవగలదు? అయ్యో! పాపము నిద్రకూడ పోయినది? యనుచు నీరు కడిలి బిడ్డలపై పుచ్చెను." "అవునమ్మా! చెల్లెలు నిద్రపోయినది. ఏలాగో నేనెత్తుకొనివచ్చెదనులే" యని బిందు తల్లికుత్తరముచెప్పెను. "నాతల్లి వద్ద నిద్రపోవుటచే బిడ్డ యెక్కువబరువుగా నుండును. కావున నీవెత్తుకొనలేవు. దానిని నాచంక కందిచ్చి నీవు నాచీరకొంగుపట్టుకొని నావెనక నేరమ్మా. అదిగో మబ్బులు కాలుక్రమ్ముచున్నవి. ఈరాత్రి తప్పక వర్షము పడియును. త్వరగా బోవుదమురమ్మా" అని తల్లి పలికెను. పలుకుటయు బిందు అమ్మా! సుధను నేనెత్తి కొని రాఁగలనే. మొన్నరాత్రి మునకాళిగారియింటికి నేను చెల్లెల నెత్తుకొని రా లేదా? ఈకొంచెము దూరమే మోయలేనా? యని బదులుచెప్పుటయు "సరే! ఆలాగే యెత్తుకొనిరా, కాని చాలచీఁకటిగానున్నది. నీవు పడి దానినిఁ బడ వేయక జాగ్రత్తగా నడువుము. మొన్న మనయుమ తీర్థములోనుండి వచ్చినప్పుడు

దారిలో బడెను. పాపము దానికి మొగిము మీఁద పెద్దగాయము తగిలి నెత్తురు వచ్చె"నని తల్లి యుపదేశపూర్వకముగాఁ బలికెను. ఆపలుకులు విని బిందు అమ్మా! ఏతీర్థమునకో మనయుమ పోయినది? అది కొని తెచ్చికొనిన బొమ్మలు నేను చూచితిని. యెంతబాగున్నవే? అంతమంచివి యిక్కడ దొరకనవో! యని యడిగెను. నాతల్లీ! నీవెఱుఁగవుకాబోలు. అగ్రద్వీపమున నేఁటేట గొప్పతీర్థము జరుగును. అక్కడికి లక్షలకొలఁది మనుష్యులు వత్తురు. చెట్లక్రింద వైష్ణవులు పంక్తులు తీర్చి భోజనము చేయుదురు. ఆయూరంతయు భజనలతోను సంగీతములతోను నిండియుండును. అని తల్లి పుత్రికతో బలికెను. అమ్మా! నీవెప్పుడైన నాతీర్థమునకు పోయియుంటివే యని బిందు ప్రశ్నవైచెను. అందుకు తల్లి యిట్లనియె. "నేను నీయంత పిల్లనై యుండఁగా నొక్కసారి యాతీర్థమునకుఁబోయి చూచితిని. మా యమ్మయు, నాయనయు నేను, మాచుట్టాలు కలిసి వెళ్ళి మూఁడునాళ్ళక్కడ చెట్లక్రిందనే బసచేసియుంటిమి. "చెట్లక్రిందనా? ఆయూరిలో ఇండ్లులేవా" యని బిందు మహాశ్చర్యముతో నడుగుటయు "నాతల్లీ! అందఱకు నిండ్లు దొరకునా? యేఁబదివేలమంది యాతీర్థమునకుఁ వత్తురు. అందుచేత నందఱు చెట్లక్రిందనే యుందురు. అక్కడొక పెద్దమామిడితోఁట యున్నది. ఆచెట్లక్రిందనే వర్తకులు దుకాణము పెట్టుకొని యన్నిసరకుల నమ్ముకొందురని తల్లి బిడ్డకు బదులు చెప్పెను. "అమ్మా! ఆతీర్థము నాకుఁ జూడవలెనని యున్నది. అది నాకొక్కసారి చూపెట్టవే? అని బిందు ముచ్చటపడి వేఁడఁ దల్లి సన్నకంఠముతో "అమ్మా! తీర్థమును నీకుఁ జూపించుటకు నేనందరివంటి యదృష్టవంతురాలనా? ఆప్రయాణమునకుఁ జాలడబ్బు కర్చగునని పలికెను. అయితే కష్టపడక డబ్బు పోనీ, ముందునాటికి నన్నుబంపు మన యుమ, కాళి, వెళ్ళి చూడఁగా నేనెందుకు వెళ్ళకూడదే? యని యజ్ఞానవశమున దనస్థితి యెఱుంగక వచించుటయు జనని యిట్లనియె. "నాతల్లీ! నీవు మంచిదానవు. మొండిపట్టు పట్టఁగూడదు. ఉమతండ్రి కాళీ తండ్రి భాగ్యవంతులు. కావున వారెక్కడకైనఁ బోఁగలరు. మీరు పేదరాలి బిడ్డలుకారా? మీకు ముచ్చటలు, వేడుకలు తక్కిన వారితోఁబాటు తీరునా! బ్రహ్మదేవుఁడు మీరు సుఖపడవలెనని మీనొసట వ్రాసినపక్షమున నాకడుపున నేలపుట్టుదురు. బంగారుబొమ్మలవంటి నాబిడ్డలిద్దఱు మఱియొకరియింటఁ గడుపుకూటి నిమిత్తమై యేలయుందురు? దైవమా! నీనిర్ణయము జరుగుచున్నది గదా!

కాఱుమబ్బులు, మబ్బుల ననుసరించి గాఢాంధకారములు నలుదిక్కుల వ్యాపించెను. మెఱుపు తళతళమని నడుమనడుమ మెఱయఁజొచ్చెను. మబ్బుపై గాలి చెట్లమూకలను గలగల లాడించుచు వీవఁజొచ్చె. గ్రామమంతయు నిశ్శబ్దముగ నుండెను. నక్కకూఁతలుతప్ప మఱియేధ్వనులు వాని చెవులకు వినఁబడవయ్యె ఆకసమున నొకటిరెండు నక్షత్రములు మార్గమున నేయింటనో మిణుకుమిణుకు మనుచున్న చిన్నదీపముతప్ప మఱియు వెల్తురు గానబడుటలేదు. ఆచిమ్మచీఁకటిలో బిందు తల్లి చీరకొంగుకట్టికొని చెట్లక్రిందనుండి యూరిపొలములో నడువసాగెను. చీఁకటియగుటచేతఁ దల్లి కన్నీరునెట్టికొని నడుచుచున్నదని బిందు కనుఁగొనలేక పోయెను. ఇట్లుపోయి తల్లి బిడ్డ లిల్లుజేరిరి.

రెండవ ప్రకరణము.

అక్క చెల్లెండ్రు.

తాళ్ళవెఱువు గ్రామమున పట్టమునకు పెట్టనిదలనమున నొకచిన్న గృహము కలదు. అదిమిట్టమధ్యాహ్నము. చుట్టుప్రక్కల పొలములు సుంకాసేసంగిఁ దీక్ష్ణ తరుఁడైన భాస్కరుని యెండలో మెఱయుచుం జొచ్చెను. పంటకాఁపులు రెండు జాములవఱకు పొలములలోఁ బనిచేసి నాగళ్ళు భుజములపై నెత్తికొని పశువులఁ దోలుకొని యిండ్లకుఁ బోవుచుందురు. అతిపరిశ్రమము చేసి నలసిపోయిన కొందఱు కాఁపులు గృహముల కరుగలేక పొలములోనే చెట్టునీడనో బడి విశ్రాంతి మందుచు వారి కొఱకు భార్యయో, బిడ్డయో, తోఁబుట్టువో యింటనుండి యన్నము గొనివచ్చు చుండెను. కన్నులు మిరుమిట్లుగొలుపు నామధ్యాహ్నపుటెండలో నీడగల యాగ్రామమే చల్లనితావు. గ్రామమునందలి ప్రతిప్రదేశమున విశేషముగఁ బెఱిగిన వెదురుపొదలయాకులు గాడ్పునకుఁ గదలఁజొచ్చె. తరుచుగా రెండుమూఁడుగులఁబడు వృంతము పనసపండ్లు తియ్యనినీరుగలకొబ్బరిబొండములు గ్రామమునఁ బ్రతి పాటి పెరటియందుఁ బ్రతియింటియందు బండుచుండును. మూఁడడుగుల పొడవుగల యరఁటిగెలలు నున్ననియాకులసమము త్రేలాడుచు గనులపండువు సేయును. గ్రామమునఁ గొన్నిచోట్ల వీధులకిరుప్రక్కల బొమ్మచెముడు మొదలగు ముండ్లచెట్లు

మొలిచి మార్గమును సన్నముగ జేసెను. ఊరిలో సగముభాగ మడవిమొక్కలతో నిండియుండును. ప్రక్కనున్న మామిడితోఁట రెండుమూఁడెకరములనేల నాక్రమించుకొని చల్లదనమునకు దావై నీడలనిచ్చుచు మనోహరముగ నుండును. ఆమధ్యాహ్నమున సూర్యుఁడు తీక్ష్ణములై శూలముల ట్లున్న తనధవళ కిరణములను తోఁటలోని చెట్లయాకులసందునుండి నేల మెఱయుచుండు పచ్చగడ్డిపైఁ బ్రసరింపఁజేయ జొచ్చె, ఆతోఁపునుండి యీలలను వినఁబడునట్లు నిమునమైన నెడతెగక కూయు పావురముపక్క దక్కినపక్షులన్నియు నెండవేడిమిచేత నోరెండి పలుకఁ జాలవయ్యె.

ఆయూర నీడగలయొకచోట నొకగృహము గలదు. దాని వీధిచావడికి నలుప్రక్కలఁ గొబ్బరిమొక్కలు గలవు. దాని వెనుక నొకవాకిలియు దానినంటి యొకగృహమునుగలవు. ఈగృహమే యింటివారికి నివాసయోగ్యమై శయనయోగ్యమైయుండును. దానికి ముందునై పొకపంచపాళిగలదు. ఈప్రక్కనొక చిన్నవంట యిల్లుగలదు. దొడ్డిలో నొకపసువులశాల యుండెను. అం దొక్కటే పాడియావున్నది. ఇవి యన్నియుఁ బ్రాఁటిపూరి గృహములే. ఈగృహమందు వసియించు కుటుంబములోనివా రప్పుడప్పుడే మధ్యాహ్నభోజనము ముగించియుండిరి. పొయిలోని నిప్పు నయిత మార్చివేయఁబడెను. కోరడిమీఁదఁ గొన్నిబట్ట లెండవేయఁబడియుండెను. దొడ్డిలోనున్న నగుతు బావినీటిలో వంటగిన్నెలు పళ్ళెములు వేయబడి యుండెను. కాని వానినప్పటి కెవ్వరుఁ దోమియుండలేదు. ఆబావియొద్దను గొన్ని యరఁటిచెట్లుమాత్రమేకలవు. తక్కినకొద్ది యంతయు ముండ్లచెట్లతో నిండియుండును. వంటకొనుగదితలుపు మూయఁబడియుండుటచే గదియంతయు నంధకారబంధురమయ్యెను. ఆగృహయజమానురాలు గదిలో నిట్టట్టు పచారుసేయుచుండెను. రెండేండ్ల వయసుగల యామె చిన్నబిడ్డ గదిలో నొకచాపమీఁద నిద్రపోవుచుండెను. ఆఱునెలల ప్రాయముగలకొడుకును నిద్రపుచ్చుటకై యామె గదిలో నిట్టట్టు దిరుగుచుఁ జేతితో బాలకుని నోకొట్టుచు నెడనెడ శ్రావ్యముగా జోలపాడుచునచ్చెను ఆయువతి రమారమి యిరువదేండ్లవయసుగలది. ఆమె కరచరణములు మిక్కిలి కోమలములైయుండెను. ముఖము మంజులమై యగును. కాని యేకారణంబుననో యించుక వెల్లబారియుండెను. ఆయొలనాగకన్నులు వెడదలై నీలోత్పలంబులవలె నిగనిగలాడుచు మొగమునకెంతయు వన్నె దెచ్చుచుండెను. అన్యదేశములందలి యువతులీవయస్సున నీమెకంటె శరీరదార్ఢ్యముకలిగి ముఖలావణ్యము కలిగియుందురు. హిందూదేశమున నువిద లిరువదియేండ్లు వచ్చునప్పు

టికి గృహిణులై యిద్దఱుముగ్గురు బిడ్డలతల్లులై యుండుటచేతను సంసార సంబంధములగు మనోవ్యధలు వారిం బీడించుచుండుటచేతను సాధారణముగ ముఖవర్చస్సు దొలంగి యుందురు.

కొంతసేపటికి బాలుడుం నిద్రవోయెను. పిమ్మట నామెయుం జేయి తలగడంగాం బెట్టుకొని కొండొకసేపు విశ్రమింపంబండుకొనెను. అదిమట్టమధ్యాహ్నమైనను ప్రచండమైన యెండవేండిమిచేత జన మర్ధరాత్రమందువలె మాటుమణంగి యుండెను. బహిఃప్రపంచమునందైనే గాలియు నిశ్శబ్దమునై యుండెను. బాలికయును దగిన యామాత బిడ్డలప్రక్క నిదురించెను. సంసారబాధ లాసమయమున నామెను విడిచి దవ్వరుగుటచే నాప్రశాంతసమయమున నామె మొగము మేలుకొన్నప్పటికంటె వికాసవంతమై యలరుచుండెను. ఆమె రమారమి యొకగంటసేపు నిదురించునప్పటి కేదోచప్పుడయ్యెను. ఆచప్పుడు విని యామె మేలుకాంచె. ఆమె కన్నులు తెఱచి చూచునప్పటికి మెఱయుగన్నుగవతోం జిఱునవ్వు వెన్నెలల్గాయుముఖచంద్రమండలముతో ముద్దులు మూటగట్టు నొకబాలిక పిల్లిపిల్లతో నాడుకొనుచు నామెయెట్టయెదుట గానంబడెను. ఆబాలిక చేతనున్నవస్తువు నందుకొనుటకు మాటిమాటికి పిల్లిపిల్ల యెగురుచుండెను. బాలికయు నావస్తువామార్జాలకిశోరమున కిచ్చునదియుం బోలె నందిచ్చుచున్నది. యందుకొనునప్పుడు దూరముగలాగుచు వినోదము నందం జొచ్చెను. ఆలేంత నొసటిమీంద మనోవ్యధకాని దీర్ఘాలోచన కాని మొలకలెత్తలేదు. ఆమెనయనారవిందము లానందమును గ్రక్కుచుండెను. పెదవులు చిఱునవ్వులతో వెలయుచుండెను. మృదువులైన యామె బాహువులు మెత్తని పూవుగుత్తులతో నిండినతీంగలలాగున మనోహరములై యుండెను. ఆమె కది పదియాఱవయేండు. బాల్యమునుండి యౌవనంబునకు సంక్రమించిన చాకచక్యము మొదలగున వామె నప్పటికిని బాయలేదు.

అటు లున్నయాముద్దుగుమ్మను జూచి గృహయజమానురాలు "సుధా! యెంత సేపైనదే నీవు వచ్చి" యని యడిగెను. అప్పు డాయక్కచెల్లెండ్ర[illegible] సంభాషణ జరిగెను.

సుధ—చాలాసేపైనదే! నీవు గాఢముగ నిద్రపోవుచుంటివని లేపలేదు. అక్కయ్యా చూండు. ఈపిల్లిపిల్ల నేనెక్కడికి పోయిన నక్కడకు నావెంట వచ్చును, నేను పంటయింటితలుపు మూసి యంటగిన్నెలం దోముటకు దిగుడుబావి కడకుం బోవ నదికూడ నన్ను వెంబడించినది.

అక్క—గిన్నెలందోమి గదిలోం బెట్టితివా?

సుధ—ఆ పెట్టితిని. ఆపని జేసికొని యీపిల్లిపిల్లను పసులశాలలోఁ బడవైచితిని. కాని యది తడకలసందునుండి దూఱి మరల నావద్దకే వచ్చినది. ఈవస్తువు దానికిఁ గావలె నఁట. కాని నేను దానికియ్యను.

అక్క—నీకు రాత్రికూడ సరిగా నిద్ర లేదుగదా! నీవు కొంచెమునే పెందుకు నిద్రపోవే?

సుధ—'అక్కయ్యా! పగలు నాకు నిద్రరాదే! అయినను రాత్రి నాకు సరిగానే నిద్రపట్టినది. నీపిల్లవాఁడేడ్చినప్పుడొక్కసారిమాత్రము నేను మేలుకొంటిని. పిల్లవాడీపూట నేలాగున నున్నాఁడు?'

అక్క—వాని కిప్పుడు నెమ్మదిగానే యున్నది. రాత్రియొడలు కొంచెము వేఁడిగా నుండును తండ్రి కాట్వానుండి యీపూట కొంచెముమందుఁ దెచ్చి వేయుదురు. ఆమందు జ్వరమును తగ్గించి సుఖముగా నిద్ర పట్టించును.

సుధ—అక్కయ్యా! కాట్వానుండి బావ యెప్పుడు వచ్చునే?

అక్క—సాయంకాలము వత్తునని చెప్పి వెళ్ళినారు. ఎందుకేమిటి?

సుధ—(నవ్వుచు) ఎందుకా నేను బావను కొంచెముహాస్యముచేయవలెనని యున్నదిలే! అది యేమిటో నే నిప్పుడు చెప్పను. బావరాగానే చూడఁ గలవు ఆవేళ నామీఁద పిరాపాడి వేసినాఁడు. అందుకు నే నిప్పుడు కసిదీర్చుకొనవలెను.

అక్క—నీ వేమి చేయఁదలచుకొన్నావో చెప్ప రాదుఁటే!

సుధ—చెప్పను. నీవుముందుగ నతనితోఁ జెప్పివేయుదువు.

అక్క—చెప్పను లే.

సుధ—చెప్పవుగదా! నిజముగా చెప్పవుగద?

అక్క—నిజముగా నే చెప్పను.

అంతట సుధ చీరకొంగుముడి విప్పి యొకచిత్రవస్తువుఁ బైకి తీయ మరల నక్కచెల్లెండ్రిట్లు సంభాషించిరి.

బిందు—అమ్మాయి! యిది యేమి టే?

సుధ—అక్కయ్యా! చూడఁగానే తెలియ లే దఁటే?

బిందు—తెలియు చున్నది. ఇదిజనపనార కాదఁటే?

సుధ—అవును. జనపనారయే కాని దానికి నేను కుసుంభవర్ణము వైచితిని.

బిందు—అట్లయిన నీకీరంగుపేఁ చెందు కే?

సుధ—ఎందుకో చెప్పుకో.

బిందు—నే నెట్లు చెప్పుకో గలను.

సుధ—ఇంతే ఇదేచెప్పకోలేవఁటే. ఈరాత్రి బావ నిద్ర పోవునప్పుడు నేనీ పీఁచాతనిగడ్డమునకు గట్టి యతఁడు లేచినప్పుడు పెద్దగడ్డంబావజీగారు వచ్చి నారని యెగతాళి జేసి నవ్వెదను. ఇది మంచివేళాకోళము కాదూ?

అని సుధ తనమాటలకుఁ దానే వికవిక నవ్వెను. బిందు లోపలినుండి వచ్చు చిఱునవ్వు నాపికొనలేక యొక్కసారి నవ్వి సుధయొక్క ముఖారవిందమునుఁ జూచి తనలోనిట్లని విచారించెను. "అయ్యో! నాతల్లి వెఱ్ఱిసుధ. నీచిరునవ్వు లెంత మనోహరములుగా నున్నవే? కటకటా! నీకర్మము కాలిన దనియు నీబ్రతుకు వృథ యైన దనియు నీ వెఱుఁగవుగద ఆపాపిష్టిదైవ మింతచిన్నతనములో నీమొగమున నెక్కడవైధవ్యము వ్రాసెనో గదా."

ఈ గ్రంథారంభమం దొక నాఁటి సాయంకాలము తల్లియు నిద్దఱుకుమార్తెలు తాళ్ళచెఱువు వద్దకు నీరునిమిత్తము వచ్చి యిప్పటికి పదియొకండుసంవత్సరము లైనది. మనము పైన చదివిన కథనుబట్టి యీనడుమ కాలగతి యెట్లు మాఱెనో తెలిసికొన వచ్చును. ఈబాలికలతల్లి జ్ఞాతిగృహమునందుండి బిడ్డలం బెంచెను. మగని మరణానంతరమామె సౌఖ్యమన నెట్టిదో యెన్నఁడెఱుంగక పోయినను దనకుమారికల కిరువురకు నెట్లయిన వివాహమైనంజాలునని యెల్లప్పుడు గోరుచుండెను. ముద్దుకూఁతుల పెండ్లిండ్లు కన్నులార జూచుకుతూహలముచేతనో వివాహము కాకుండఁ గన్యల నిలుపఁగూడదను మతనిర్బంధముచేతనో చాలకాలమువేచుకునిలిపిన మంచిసంబంధములు దొరకవను భయముచేతనో మనదేశమునఁ దల్లిదండ్రులు కూఁతులకే డేనిమిదేండ్లు వచ్చినది మొదలు భర్తల వెదకుచుందురు. అందుచేతనే తల్లి బిందునకుఁ బదియవయేఁడు రాఁగానే పెండ్లినిమిత్తము తొందరపడి వరుని వెదకఁజొచ్చెను. పరువుగల కుటుంబమునఁ బుట్టినను బీదబాలికల కనుకూలసంబంధములు లభించుట యరిదిగదా. పట్టణములందుండు నాగరికులగు తల్లిదండ్రులు కొడుకుల వివాహము లప్పుడు వేనవేలురూప్యములఁ గట్నములుగా నపేక్షించుట యీనాటి యాచారమైయున్నది. పల్లెలలో నీదురాచార మంతగాఁ బ్రబలి యుండకపోయినను జననీజనకులు తమకుమారులకు భాగ్యవంతుల కూఁతులందెచ్చి పెండ్లిచేయుటకై యత్నింతురుగాని మగఁడు మృతినొందఁ జుట్టములపంచను జేరి రెక్కలకష్టముఁ జేసి యెట్టెట్లో బిడ్డలం బెంచుకొనుచున్న పేదరాలికూఁతు నేతలిదండ్రులు తమకుమారునకు నెఱిఁగియెఱిఁగి వివాహము చేయుదురు? దిక్కుమాలిన యాయిల్లాలొక్కతయె బిందు వివాహమును గూర్చి బెంగఁగొని సంబంధములు వెదకఁ జొచ్చెను. కాని తారుణీమల్లికుడు పాపము తండ్రిలేని బిడ్డకదాయని జాలిదలచి బిందు పెండ్లిని

గూర్చి యేప్రయత్నముఁ జేయలేదు. చుట్టము లంతకంటె నుపేక్షఁ జేసిరి. పేద
వాండ్రు చుట్టములకు జుట్టములు కారుకదా. పేదతనమేగాక బిందునకు సౌందర్య
లోపముగూడ కలదు. ఇవి కారణములుగఁ జాలసంబంధములు కాలక్రమమున
వచ్చుటయు నవియెల్ల నేదోనెపమునఁ జెడిపోవుటయుఁ దటస్థించెను. తారుణీమల్లి
కుని భార్య సాయంకాలము లోపలివసారాలోఁ గూర్చుండి ప్రతిదినము బిందుతల్లి
చేఁ దలదువ్వించుకొనుచు నప్పుడప్పుడా పేదరాలి నీవిధముగనూరడించుచుండును.

"అమ్మాయి! పిల్ల పెండ్లినిగూర్చి నీకింత బెంగ యెందుకమ్మా? మనయింటి
యాడుపడుచు, పెండ్లిండ్లను గురించి బెంగ బెట్టికొననక్కరలేదు. వీండ్లకువివాహములు
కాకపోవు. మనకుటుంబస్థితి మన గౌరవము వర్ధమానపట్టణములో మీ బావగారి
కున్నయుద్యోగము నెవ రెఱుఁగరు? తలక్రిందులుగాఁ దపస్సుఁ జేసిన మనసంబం
ధము వంటి సంబంధము దొరకునా? అందుచేత నీవు బిందువిషయమున విశేషము
మనస్తాపమునొందకుము. మీ బావగారునవరాత్రములకు వచ్చినప్పుడు నేనాయనతో
మాటలాడి మనమర్యాదకుఁ దగినసంబంధము నడచునట్లు చేసెదను. అదియునుఁగాక
మాయమ్మాయి యుమకుఁగూడఁ బదియవయేఁడు వచ్చినదికదా! అన్నిప్రక్కల
నుండి దానినిమిత్తము పందలకొలఁది సంబంధములు వచ్చిపడుచున్నవి. దాని కిప్పుడు
పెండ్లిచేయుటకు నే నొప్పుకొంటినా కన్నులనద్దికొని దానిని దీసికొని పోవుదురు.
కాని యింతలో వివాహము చేయుట నాకిష్టములేదు. మాచిట్టితల్లికిఁ బెండ్లిచేయఁ
దలఁతుమేని మనకుటుంబమునకుఁ దగినసంబంధమే తీసికొని వత్తుముగదా! కాని
యుమకు బిందుకుఁ జక్కఁదనములోఁ గొంచెము భేదమున్నది. ఉమయెఱుపు.
బిందు నలుపు. దానికిఁదోడుగ నీవద్దడబ్బులేదు. నీమగఁ డెల్లవారివలె గడుసరి
కానందున నాలుగుడబ్బులు వెనుకవేసికొన లేకపోయెను. కుటుంబగౌరవము సమా
నమైనను పిల్లలిద్దరికిఁ గలభేదమిది. అయినను భయపడి అదే బెంగ పెట్టికొనకు.
నేను మనసారఁ బలపెట్టితినా నీకార్యము గట్టెక్కింపఁగలను" అని హస్తకంకణ
ములు ఘల్లుఘల్లున మ్రోయునట్లు తల ముడుచుకొనుచుఁ దొడికోడలు ధైర్యము సెప్ప
బిందుతల్లి విచారము విడిచి కూఁతురు పెండ్లినిమిత్త మువ్విళులూరు చుండును.

అనంతరము దేవీనవరాత్రములువచ్చెను. తారుణీమల్లికుఁడు వర్ధమానము
నుండి స్వగ్రామమునకు వచ్చెను. ఆయన వచ్చునప్పుడు పూజావస్త్రములు నగలు
దక్కఁ—చీరలు భార్యనిమిత్తము, మంచి పరికిణీగుడ్డలు మొదలగునవి కూఁతురునిమి
త్తము, కొన్నివస్తువులు నౌకర్లనిమిత్తముఁ దెచ్చెను. వర్ధమానమునుండి నాజరు
గారు విలువగల బహుపదార్థములతో వచ్చిరనువార్త గ్రామమంతయు వ్యాపిం

చెను. ఆయనదర్శనముఁ జేయుటకు జనులు గుంపులుగుంపులుగాఁ బోయిరి. పోయి వా రుదయాస్తమయము లొక్కవరుసనే వాని నూరక పొగడఁజొచ్చిరి. కొందరు పూజఁ జేసికొనుటకు సొమ్ము లేక బయలుదేరఁ బోయిరి. మఱికొందఱు వ్యవహారపు జిక్కులఁగూర్చి యాలోచన మడుగఁబోయిరి. ఒకఁడు తనకుమారునకు నుద్యోగ మిమ్మని వేఁడఁబోయెను. మఱియొకఁడు వానితోఁ బనియేమియు లేకయే వృద్ధాచార మనుసరించి యాయనదర్శనముఁ జేయుటకుఁబోయి కొంతసేపు సొగసి స్వగృహమునకుఁ బోయెను. ఈమహోత్సవములలో బిందుమాట యెవరికిఁ గావలెను? పూజలు ముగిసెను. పదునైదుదినములు సెలవులు గతించెను. తారుణీమల్లికుఁడు వర్ధమానపురమున కరిగెను. బిందు వివాహప్రసంగ మతనివద్ద రానేలేదు.

చుట్టములసాయ మట్లగుటచేత బిందుతల్లి యిరుగుపొరుగమ్మలక్కలఁ గలిసికొనినపుడు వారిని పుత్రికావివాహవిషయమున నోపినసాయముఁ జేయుఁడని వేఁడుచుండును. ఆయమ్మలక్క లామె వేఁడికోలువిని, తలయూఁచి "అమ్మా! దానికేమి; మీయమ్మాయికి సంబంధమే వెదకిపెట్టఁజాలమా? ఈపాటి సాయముఁ జేయుటకు నీకంతెను ముఖ్యావసరమ్మా? కాని యీఁడుపిల్లలకు పెండ్లిఁజేయుట యీదినములలో మహాకష్టమమ్మా. కట్నమిచ్చుటకు నీదగ్గఱసొమ్ము లేదాయెను. ఈయమ్మాయి తండ్రి యెప్పటిసొమ్మప్పుడే సంసారము క్రిందఁబెట్టెనేకాని కొంచెము తెలివి గలిగి నాలుగుడబ్బులు వెనుకవేయలేకపోయెను. మీ బావగారివలె కొంచెము సొమ్ము నిలువఁజేసినయెడల వివాహమున కింతకష్టమక్కఱలేక పోవునుగదా తల్లి. అప్పుడు నీమగనితో ఖర్చులలోఁ గొంచెము మితముగానుండుమని మేమెన్నివిధములనో చెప్పితిమి. కాని వినలేదు. మగవాఁ డేలాగునఁ ఖర్చుఁజేసినను నీవైన మా మాటఁ జెవిని బెట్టితివా? చూడు! మఱియిప్పు డెంతతలమీఁదకువచ్చినదో. పెండ్లి యనఁగా మాటలా. అయినదేమో యయినది. దానికేమి. ఎక్కడనో యొకచోట సంబంధము తీసికొనిరాలేకపోదుమా. ఎవరివిషయమునైన నూరకుందుముగాని చిట్టితల్లి, బిందు విషయమై యశ్రద్ధఁజేయుదుమా? యని చెప్పుచుందురు. మనసులో నున్నకోరిక ఫలముదూరమైనకొలఁది బాధయధిక మగుచుండునుగదా! అందుచేత బిందుతల్లి తనకోరిక గ్రామములో వయసుగడిచిన పెద్దలతోఁ జెప్పుకొని సహాయమును వేఁడ చెలువుగట్టిన వారింగలిసికొన్నప్పుడు, త్రోవలో నెదురైనప్పుడు విడువక యదేపనిగా వారంబలిమాలుచుండ వారును దమగొప్పతనము తేటపడునట్లామెతో నిట్లనుచుండిరి.

"బిడ్డా! యిన్నాళ్ళనుండి యీసంగతి మాతో నేల చెప్పకపోతివి? చెప్పక యూరకుండిన నెట్లు తెలియును? కాళితల్లి సంబంధము వెదకివెదకి వేసారి యెందునుగానక చిట్టచివర క్రిందటినెల మావర్తమానమంపినది. అప్పుడు మేమే వో చిక్కులుపడి యొకసంబంధముఁగుదిర్చితిమి. కాళికిఁగూడ మీయమ్మాయియీడే. దానికిఁగూడ పదియవయేఁడు వచ్చినది. ఎంతమంచిసంబంధము కుదిర్చినామో చూడుము. వర్ధమానపట్టణమందున్న రాయకుటుంబమువారు కుబేరునియంత ధనవంతులు. సకల భాగ్యభోగ్యములుఁ గలవు. పెండ్లికుమారునకు ద్వితీయము. వయస్సుకొంచెము ముదిరినదనుమాటతప్ప తక్కినవెలితియేమియు లేదు. కావలసినంత యైశ్వర్యము. ఆ పట్టణములో వారికున్న గౌరవ మెవరికిలేదు. ఎంతపలుకుబడి! యెంతవ్యవహారము! ఆయన తఱచుగ దొరలకు విందుచేయుచుండును. వారితోఁగలిసి గుఱ్ఱపుబండ్లమీద తిరుగుచుండును. వేయేల? ఆతఁడు జమీందారువైభవ మనుభవించుచున్నాఁడు. మేము తలఁచుకోఁబట్టికాని యీపిల్లతల్లి స్వయముగా వెదకికొనిన నిటువంటిసంబంధము దొరకునా? ఈకాలములలో మనుష్యులకు స్వాతంత్ర్యములు బలిసి పెద్దలతోఁ జెప్పక వ్యవహారములు చేయఁజూతురు కాని యవి నెఱవేఱునా? కాని యిప్పటికైన నీవు తెలివైనపనిఁజేసితివి. మావద్దకువచ్చి యిందులో మమ్మాలోచన మడిగితివి. మామాట జ్ఞాపకమున్నది; కొంతనయమే."

పాప మాపేదరాలు వారిమాటలు మనఃపూర్వకముగా వచ్చినవే యనికొని కంటఁదడిపెట్టికొని తానంతకాలము వారిదర్శనముఁజేయకపోయినందుకు వారి యాలోచన మడుగనందుకుఁ దనబుద్ధితక్కువను నిందించికొని వారిని మఱింతబతిమాలు వారు దయార్ద్రహృదయులై మరల నామెతో "నీవింకఁ బెండ్లివిషయమున బెంగపెట్టుకొన నక్కరలేదు. మాచెవిని వేసితివిగనుక నీకార్యము నెఱవేఱినదే యని నిశ్చయముగనమ్ముకో," యని ప్రత్యుత్తర మిచ్చుచుందురు. బిందుతల్లి యరచేతిలో వైకుంఠము గనఁబడినట్లు, చందమామ చేతికి దొరికినట్లు, మిక్కిలి యుప్పొంగి పరవశముఁజెంది నిద్రాహారములుసైతము మానికొనుచువచ్చెను. క్రమక్రమమున దినములు వారములు నెలలు గడచెను. రెండు సంవత్సరములు గతించినను గూఁతునకుఁ బండ్రెండవయేఁడు వెళ్ళవచ్చినను సంబంధమువెదకి తెచ్చువా రెవ్వరు లేకపోయిరి. హరిదాసు మల్లికున కాగ్రామమునందె యొక ప్రియమిత్రుఁ డుండెను. ఆయనకొక పుత్రుఁడు కలఁడు. అతని పేరు హేమచంద్రబోసు. హేమచంద్రుఁడు విద్యాభ్యాసముఁజేసి వర్ధమానపురమునఁ బ్రవేశపరీక్షయందుఁ గృతార్థుఁడై పైచదువులఁజదువునిమిత్తము కలకత్తానగరమునకుఁబోయెను. కాని

దైవవశమునఁ దండ్రి పరలోకగతుఁడు కాఁగా, హేమచంద్రుఁడు విద్య ముగింపకయె స్వగ్రామమునకుఁ బోయి యేయుద్యోగమున బ్రవేశింపక పిత్రార్జితమైన యాస్తితో గౌరవముగఁ గాలక్షేపముఁ జేయసాగెను. హేమచంద్రుఁడు బిందును బాల్యమునుండి యెఱుంగును; కావునఁ జక్కఁదనముకంటె గుణములయం దధికాసక్తుఁడై యా బాలికను వివాహమాడ నిశ్చయించుకొనెను. అతని యూరిలోని పెద్దలు తండ్రి స్నేహితుని బిడ్డయైనంతమాత్రమున నిఱుపేదలపిల్లను బెండ్లియాఁడఁ దలఁచుటచేత హేముఁడు బుద్ధిహీనుఁడు నిర్భాగ్యుఁడు నని తలంచిరి. అంతియు ముక్కుమూతులు విఱిచినవారే. హేమచంద్రుని చుట్టములు, కుటుంబగౌరవమునకుఁ దగదని సంబంధముఁ జెడఁగొట్టఁదలఁచిరి. కాని హేముఁడు స్వతంత్రుఁడు. పట్టుదలగలవాఁడు నగుటచే నెవ్వరిమాటలు సరకుసేయక బిందు తల్లికడకుఁ బోయి తానే స్వయముగ వివాహము నిశ్చయించుకొనెను. పెద్దలమాట హేముఁడు త్రోసిపుచ్చినాఁడను నీసున నూరిలోని యమ్మలక్కలు నీరాడు రేవులలోఁ జేరినప్పుడు "అక్కయ్యా! విన్నావమ్మా! యీచోద్యము; హేముని కెంతసిగ్గులేదో! వానిసాహసముకాల. పెండ్లికాకముందే బిందును దఱుచుగాఁ జూచుటకు వెళ్ళుచుండెనఁట" యని యొకతె యన మఱొకతె "వదినే అంతకన్న చిత్రము వినుము. బిందు సాయంకాలము చెఱువు వద్దనుండి వెళ్ళునప్పుడు హేముఁడు త్రోవలోఁ గాచికొని దానితో గుసగుసలు గసగసలును. మాయకలికాలము వచ్చెఁగదా!" యని వింతలు చూచినట్లే చెప్పుచుండును. ఎవరెట్లు చెప్పుకొన్నను సంబంధము నిశ్చయమయ్యెను. తారుణిభార్యకుఁ గూడ నీసంబంధ మిష్టముగానేయుండెను. ఆమె వెనుక నభయమిచ్చినట్లు బిందు వివాహమునుఁగూర్చి మగనితో మాటలాడకున్నను భాగ్యవశమున సంబంధము కుదిరినప్పుడుమాత్రము మనసారఁ సంతసించెను. అంతట సుముహూర్తము నిశ్చయమయ్యెను. తారుణీమల్లికుఁడు భార్యయుఁ బీటలమీఁద గూర్చుండి కన్యాప్రదాన మొనర్చిరి. ఈవివాహమైన కొలఁదికాలముననే తారుణిపుత్రికయగు సుమనుఁగూడ మిక్కిలిభాగ్యముగల సంబంధము వచ్చుటచే నాదంపతులు మఱింత యానందము నొందిరి. ఉమాబిందులకొక్కసంవత్సరమందె వివాహమయ్యెను. బిందునకు వివాహమైనది మొదలు తల్లి సుధనుఁగూడఁ బదియవయేఁడు వచ్చినందున దాని వివాహమును గూర్చి మనసున నెంతో యాత్రముపడుచు [illegible] నెడనిట్లు తలంచుచుండెను. "నేను బ్రతికియుండఁగానే దీనికిఁగూడ మూఁడుముళ్ళుపడెనా నే నేమైనను భయము లేదు. అప్పుడు నాకోర్కె సఫలమగును" అటులామె తలంచుచుండఁగనే యొక సంబంధము దొరకెను. వరుఁడు సుధకన్నఁ గొంచెము పెద్దవాఁడు. వివాహానంతరము

తల్లి యిరువురుకూతులఁ జేరియొక ప్రక్కం గూర్చుండఁబెట్టికొని కన్నుల నానంద బాష్పములు తొరగ "నాతల్లులారా! నాజన్మమిప్పటికి తరించిన"దని ముద్దిడి తన యంతటియదృష్టవంతురా లీలోకమున లేదని బ్రహ్మానందభరితయయ్యెను. పాప మీయిల్లాలు మగని మరణానంతరము నేత్రములనుండి యానందబాష్పములు విడిచి మనసార సంతసించిన దీ యొక్కసారియె. ఆహాహా! దైవమెంత యోర్వలేనివాఁడో కాని సుధకు వివాహమైన కొన్నినెలలకె చుట్టములను లోకమునను బరువైనదని కాబోలు సోదరాలు కష్టములుగట్టెక్కి సుఖపడుకాలమున నామె నెత్తికొని పోయెను. బిందు పండ్రెండవయేఁట దల్లిపోవుటచే నత్తింటి కరుగవలసివచ్చెను. హేమచంద్రుఁడు ప్రథమమునుండి యామెయం దనురాగబద్ధుఁడగుటం జేసి నవనాగరకుఁడగుటచే నెవ్వరికింజంకక యాబాలికకు విద్యయు బుద్ధియు జెప్పి దయతో నాదరించి యుక్తవయస్కురాలైన పిదప నామె తనయందధికభక్తివిశ్వాసములుకలిగి యుండునట్లు చేసెను. ఈఁడువచ్చినపిదప, బిందు పరపురుషుంజూచి యెఱుఁగదు. భాషించి యెఱుఁగదు. ఆమెకు పతియేదైవము. పతితోడిదె లోకము.

సుధయొక్కచరిత్రము మాత్రము మిక్కిలిదయనీయమైనది. పదియవయేట నామె వధువై పండ్రెండవయేట విధవయయ్యెను. వివాహ మగుట యేమో వైధవ్యము వచ్చుట యేమో యామెకు దెలియదు గదా! దిక్కులేని యాబాలవితంతువును బిందు తనయింటికి దీసికొని పోయెను. సుధ వివాహాలంకారములం దీసివైచి భవిష్యత్కాలమునం దనకు రా దలంచినకష్టము లేవియో యెఱుఁగక తన యీడుబాలికల కుచితమైన యాటలాడుచుఁ బాటలు బాడుచు గాలక్షేపము సేయ జొచ్చెను వెనుకటి ప్రకరణములో జెప్పబడిన తెలుఁగున నామె పిల్లికూనతో నాడినయాటలే దానికి దాత్కారణములు.

ఇట్లు నాలుగుసంవత్సరములు గడిచెను. బిందునకిరువురు బిడ్డలు కలిగిరి. కాళియు సుమయు భర్తలతో గాపురము జేయబోయిరి. వారప్పుడప్పుడు స్వగ్రామమునకు వచ్చి చిన్ననాటిచెలికత్తెయు సమానవయస్కురాలు నగు బిందునుజూచి కష్టసుఖముల జెప్పుకొనుచుందురు.

మూడవ ప్రకరణము.

దంపతులు.

అప్పుడు జాము రాత్రి యయ్యెను. తాళ్ళచెఱువుగ్రామము తాళ్ళవృక్షముల నీడలఁ బండుకొని నిద్రపోవుదానివలె నుండెను. చంద్రకిరణములు చెట్లయాకుల లోఁబడి క్రిందికిఁ బ్రసరింపలేక యలసి యయ్యాకుపాన్పులఁ బండుకొన్నట్లచటనే నిలిచెను. చెట్లు పొదలు తోఁపులు గృహములు తెల్లని ముసుంగులు వైచికొనిన చెలువమునవొప్పె. చందమామ కిరణములు తటాకమధ్యమునఁ దళతళ లాడుచు నీటి మీఁద నాట్యముసేయు తెఱంగున శోభనప్రదములై యుండెను. కాలపురుషుఁ డనుసేవకుడు గ్రామమంతటం బఱచినమల్లెపూల పాన్పుచందంబున వెన్నెలప్రతిపదార్థమును దెల్లబాఱఁజేసి సకలజంతువులకు బాహ్యతాపహారకముగా నుండెను. గ్రామవాసులలో ననేకులు భోజనము చేసి తలుపులుమూసికొని నిద్రింపఁబోయిరి. అక్కడక్కడనిదురరామి యొకముసలివాఁడు వీధియరుఁగుపై గూర్చుండి చుట్టద్రాగుచుండెను. ఇంటిపనియంతయు సత్వరముగాఁ జేసికొనలేని యాఁడుదియు నచ్చటచ్చటఁ దొందరతో నంట్లు తోముచు పళ్ళెములు కడుగుకొను చుండెను. నిశ్శబ్దమైన యానిశాసమయమునఁ దూరపుఁబొలములలో నిదురపట్టనికాపుఁవాఁడు పాడినపాటసూత్రము సన్నసన్నముగా మేలుకొన్నవారి చెవులం బడఁ జొచ్చెను. తక్కిన ప్రపంచమంతయు నిద్రాపరవశమై నిశ్శబ్దమై యుండెను. బిందు గృహకృత్యములన్నియు జేసికొని భర్త యెంతసేపటికి రానందున మేలుకొని తనగదియరుఁగుమీఁద గూర్చుచుండెను. చల్లనిచంద్రకాంతి యామె చీరమీఁదను విలాసవంతమైనమొగముమీఁదను బడి క్రొత్తసౌందర్యముఁ దెచ్చెను. సుభయు బావగారికి జనపపీఁచుగడ్డము కట్టి హాస్యముఁజేయఁ దలఁచినది. కావునఁ జాలసేపు మేలుకొని క్రమ్ముకొని వచ్చునిదుర నాపికొన లేక పండుకొనెను. ఆమె పెదవులు చిఱునగవు నవ్వునపుడు తెఱచి యున్నట్లె విడి యున్నందున చంద్రకాంతి పైఁబడినట్లె యేదో మంచికలయు నామె మనంబున బడి యుండ వచ్చునని బిందు తలంచెను. కొంతసేపు కనిపట్టికొని యుండునప్పటికి వీధితలుపులవద్ద నడుగులచప్పుడు కాఁగా బిందు వేవేగ లేచి పరుగుపరుగున [illegible] కవాటము దెఱచెను. హేమచంద్రుఁడు గృహమును బ్రవేశించెను. అప్పు[illegible]హేమచంద్రుఁ డిరువదినాలుగేండ్ల ప్రాయమువాఁడు. అతనిముఖము సుందరమై తెలివిని వ్యక్తము సేయుచుండును. అతని లలాట మున్నతముగానుండెను. చాలదూరము నడిచి వచ్చుటచే నతఁడు

మిక్కిలి యలసి యుండెను. పాదరక్షలు ధూళితో నిండియుండెను. బిందు పీట వేయ హేముఁడు దానిపైఁ గూరుచుండి యామె తననిమిత్తము దెచ్చినచల్లని నీటితోఁ గాళ్ళు సేతులు మొగముం గడిగికొనెను అంతట వారివ్విధంబున మాటలాడిరి.

బిందు—చాల ప్రొద్దుపోయి వచ్చినారే. ఇంకను భోజనము కాలేదుగాఁబోలు.

హేమ—నేను పెందలకడనే బయలుదేఱితిని. కాని కాట్వాలోనొక స్నేహితుఁడు నన్ను దనయింటికి దీసికొనిపోయి ఫలహారముఁజేయుమని బలవంతము పెట్టెను. మీ రందఱు భోజనము చేసినారా?

బిందు—సుధ భోజనము చేసి పండుకొన్నది. నాభోజనము కా లేదు. దానికేమితొందఱ. మీకు ముందు వడ్డించెద నుండండి!

"నా కంతవిశేషముగా నాఁకలి లేదు. తొందరపడ నక్కఱలేదు" అని భర్త యనుచుండఁగానే బిందు చప్పచప్పన నట్టింటఁగొంచెమునీళ్ళు చల్లి చిత్రాసనముఁ బఱచి వంటయింటికిం జని నొక పళ్ళెముతో నన్నము దెచ్చిపెట్టి పప్పు చేపఁలకూర కొన్ని కాయగూరలు మొదలగునవివడ్డించెను. ఈవంటకములకుందోడుగ నామె భర్తనిమిత్తము దొడ్డిలోనున్న నిమ్మచెట్టునుండి రెండునిమ్మకాయలు చెక్కలుగాఁ గోసి సిద్ధముఁ జేసి కొబ్బరిబొండము చన్నీటఁ బడవైచి యావుపాలుకాఁచి పంచదార కలిపి యుంచెను. ముఁడుచిత్రాసనమునఁ గూరుచుండి భోజన మారంభింప భార్య ప్రక్కను గూర్చుండి కావలసినవస్తువులు మారు వడ్డించు చుండెను. అప్పుడు సతీపతు లిట్లు సంభాషించిరి.

హేమ—నేను కుఱ్ఱవానికి మందు తెచ్చినాను. అది యిప్పుడు వేయకుము. నిద్రపట్టక యేడ్చినా వేయవచ్చును. నేను కాట్వా వెళ్ళినరెండవపని యేమియుం గాలేదు.

బిందు—ఎందుచేతఁ గాలేదు.

హేమ—కాట్వాలోఁ జిరకాలమునుండి నే నెఱిఁగినప్లీడ రొకఁడుండఁగా మీనాన్నగారిపొలములఁగూర్చి సలహా నడుగుటకు వెళ్ళి యుంటిని.

బిందు—ఆయన యేమనా[illegible]

హేమ—కోర్టుకు వెళ్ళినఁ[illegible] వ్యవహారము తేలదని చెప్పినాఁడు.

బిందు—ఛా! మా పెదబాబయ్యగారిమీఁదకత్తుఁగట్టి నేను కోర్టు కెక్కనా? అయ్యో! మానాన్న పోయినతరువాత నన్నుబెంచి పెద్దదానినిఁ జేసినందుకు మంచి

సంబంధముఁ దెచ్చి మీకు పెండ్లి చేసినందుకు నే నాయనమీఁద వ్యాజ్యము వేయనా? మా పెదతల్లి నే నన్న పంచప్రాణములు విడుచును. ప్రతి పండుగకుఁ బ్రతిపర్వమునకు నాకేవో బహుమానములఁ బంపుచునే యుండును. వారిమీద వ్యాజ్యము వేయుటకు నా మనసొప్ప కున్నది.

హేమ—(చిఱునవ్వు నవ్వి) నీ వివాహవిషయమై మీ పెదబాబయ్య గారి యుపకారము నే నేమియుఁ బొంద లేదు. నీ వప్పుడు చిన్న పిల్ల వగుటచే జరిగినసంగతు లెఱుఁగవు. నీ కవి తెలియ వలసినంత యవసరము లేదు. ఆయనతో వివాదము లాడుటకు నాకుఁగూడ నెంతమాత్ర మిష్టములేదు. తప్పక వచ్చినపుఁ డేమి చేయవలెను?

బిందు—ఏమయినను సరే కాని మా పెదబాబయ్యగారిమీద వ్యాజ్యములు వేయుట బాగుండదు. అంతే కాక మనకు డబ్బుకూడలేదు. వ్యాజ్యములకు బోయెడు సొమ్ము కావలయును. ఈస్థితిలో మనము కుటుంబసంరక్షణముఁ జేసికొని భగవంతుడిచ్చిన యీ యిద్దఱుబిడ్డలను పెంచికొనుచు, నొకరిని 'దేహి' యనియడగకుండ గౌరవముగఁ గాలక్షేపము చేసితిమా యదే పదివేలు. మన[illegible]కే వ్యాజ్యములు వద్దు. ఇతరులసొమ్ము మన కెందుకు? మీ భూములు రత్నగర్భములు. బంగారము పండును. అవి బాగుచేసికొనినయెడల మనము తిని యొకరికి పెట్ట వచ్చును. మన కేపదిమంది యున్నారు తినుటకు? మీతండ్రిగారి ధర్మమున మనకు దివ్యభవన మీయిల్లు దొఱకినది. ఇదియే మనకు రాజ్యము. మహారాజులలాగు మనము సుఖముగా నుండవచ్చును.

హేమ—నేను నిన్ను పెండ్లియాడినపుడు మన మెల్లకాలము దారిద్ర్యమనుభవింపవలసి యుండునని యనుకొన లేదు. నీవు పరమ శాంతురాలవు. సంతుష్టి కలదానవు. మంచిదానవు. గృహములో నిదియున్నది, యది లేదని విసుగుకొని యెఱుఁగవు. ఈవిషయమున దప్ప నాకెన్నఁడు నెదు రాడినదానవు కావు. ఐనను మగవాఁడ నగుటచే నీ కున్నంతశాంతము నాకు లేదు.

బిందు—మన మనభవించుచున్నది దారిద్ర్యమా? చాలులెండి. ఈయిల్లు, యీ దొడ్డి, యీ ఫలవృక్షములు నుండఁగా మనకేమికొదువ. హాయిగా రాజులలాగున నుండవచ్చును. ఇదిగో మహారా[illegible] దొఱకని క్రొత్తవస్తువు మీకొఱకు చేసి యుంచితిని తెచ్చెద నుండ[illegible]

హేమ—(చిఱునగవుతో) సరే. నేను రాజును. నీవు రాణివి ఏదీ రాజులకైయినను దొరకని యాయపురూపవస్తువు చూతము తెమ్ము.

భర్త రాకముందు బిందు దొడ్డిలోనున్న మామిడిచెట్టునుండి కొన్ని పచ్చికాయలు కోసి యెంతో రుచిగల్గునట్లు కూరవండెను. ఆమాట మగనిభోజనమునడుమ జ్ఞప్తికిరాఁగా నామె లోనికిఁజని యాకూర నొక తెల్లనిరాతిచిప్పలో వైచి మగని ముందఱ బెట్టి 'మహారాజుగారు దీనినారగింప వలయు' నని నవ్వుచుఁ బల్కెను. హేమచంద్రుఁడాకూర నన్నములోఁ గలుపుకొని యదిమిక్కిలి రుచిగానుండుటచే, నిది నిశ్చయముగా మహారాజులకుఁ దగినకూరయే. కాని మిక్కిలిరుచిదైన యీ కూర దినునదృష్టము మారాజ్యమువలన రాలేదు. మారాణిగారి చాతుర్యమువలననే గలిగినదని మెచ్చుకొనుచుఁ గూరలు మొదలగువానితోఁ గొంతయన్నము కలుపుకొని తిని కడపట చక్కెర గలిపినపాలతో మిగిలినయన్నము కలిపికొని తినుచు మంచిపాలిచ్చిన తమ యావును బాలలోఁ జక్కెర సరిగాఁ గలిపినభార్యను గొనియాడుచు భోజనము ముగించి చేయిఁ కడుగుకొని భార్య యదివఱకే మట్టి యప్పుడందిచ్చిన తమలపాకులచుట్టలు నోటనిడికొని నములుచు భూమివ్యవహారమునుం గూర్చి ప్రసంగము మరలరాఁగా వారిట్లు మాటాడిరి.

బిందు—మా పెదబాబయ్యతో నీవ్యవహారములో రాజీనామా చేసికొనుట బాగుండదా! మనకు మధ్యవర్తులుగా నుండి వ్యవహారముఁ బరిష్కరింపఁ గల పెద్దలు గ్రామములోఁ జాలమంది కలరు కదా!

హేమ—ఆప్రయత్నము నైనది. కాని కార్యకారి కాలేదు. ఆయన పొలము తనదే యనుచున్నాఁడు. అదితనభుక్తములోనే యున్నదఁట. పదియేండ్లనుండి మరమ్మత్తులఁ జేయించి పన్నులు చెల్లించినాఁడఁట. లెక్కలలోఁ దనపేరు నమోదుచేయించు కొన్నాఁడఁట. అందుచేత నేమైనను సరే విడిచిపెట్టఁడఁట. కాని నిన్ను సభను తనబిడ్డలవలెనే చూచికొను చుండుటచేత మీకాభూమిలోఁ గొంతభాగము దయాధర్మభిక్షముగఁ నిచ్చునఁట. భాగమనఁగా మూఁడవవంతో నాలవవంతో యని యాశ పడుచున్నావేమో, కళ్ళనీళ్ళు తుడుచుట కేదోయొక చవుటిపట్టి నిచ్చును. మనము పేదవాండ్ర మేమియుఁజేయలేమని యాతఁడు బాగుగ నెఱుఁగును. అందుచేతనే యీయాటలాడుచున్నాఁడు.

బిందు—నేనాఁడుదానను గదా! ఈవ్యవహారఁపుచిక్కులు నాకేమియుఁ దెలియవు. ఏమో పెద్దవాఁడు, చిన్న[illegible]డియుఁ బెంచి పెద్దవాండ్రను జేసినాఁడు. అందుచేత నతఁడేమిచ్చునో యది [illegible]చ్చుకొని యూరకుండుట మంచిది. పోనియ్యండి. అతఁడు తిన్నను మంచిదే. పరాయివాఁడు కాఁడుకదా! కోర్టుల కెక్కి తిరుగా బోలెడుసొమ్ము పోయవలెను. మనదగ్గఱ డబ్బులేదుగనుక నెక్కడనైన బదులు

తేవలయును. ఆబదులు తీఱుట యెట్లు? ఒకవేళ మనమే నెగ్గగలమనుకొనుఁడు. వ్యాజ్యమున కయినకర్చులక్రింద భూమి మనచేతులార మనమే యమ్ముకొనవల యును. నేలదక్కుదుసరేగదా మా పెద్దబాబయ్యతో యావజ్జీవము నోటిమాటకంటిచూపు లేకుండ నుండవలయును. నెగ్గకపోతిమా భూమికి సొమ్ముకుఁ గూడ చెడుదుము. కొద్దో గొప్పో యాయన యిచ్చినంత పుచ్చుకొని తగవులేకుండ జేసికొందము. నే నాఁడకూఁతురను. వ్యవహారములు తెలియనిదానను. మీరు మగవారు. అన్నియుఁ దెలిసినవారు కనుక బాగుగ నాలోచించికొని మీకు దోఁచినట్లు చేయుఁడు. నెట్టో మొట్టో నాకుదోఁచినమాట చెప్పినాను.

హేమ—(కొంతసేపాలోచించి మెల్లఁగా) అవును; నీవాఁడదానవే. నీ వంటియాఁడది యెవనికి భార్యయై యాలోచన చెప్పుచుండునో యతఁ డదృష్టవం తుఁడు. నేను ముందుగా నిన్నాలోచన మడుగక వెఱ్ఱివాఁడనై యెక్కడికో వెళ్ళి ప్లీడరులసలహా నడిగి వచ్చితిని. నీవు చెప్పినమాట నాకు నచ్చినది. ఆలాగే చేసెదను. మీ బాబయ్యగారు వచ్చినారఁట. రేపు వెళ్ళి యాయనతోఁ గలిసి మాటలాడి యేదో విధమున రాజీచేసికొనియెదను. ఇంకొకసారి నా కేవ్యవహారములోనైన సలహా కావలసి వచ్చినప్పుడు నాగృహదేవత యైనయీ పెద్దప్లీడరు గారినే యడిగెదను; కాని తక్కినప్లీడర్ల వద్దకుఁ బోను.

మగఁడుతన్ను గొప్పప్లీడరుగాఁ బ్రశంసించినందుకు బిందు ముసిముసినవ్వులు నవ్వుకొనుచుఁ బ్రసంగము చాలించి గదిలోనికిఁ బోయి పాన్పు సవరించి మఱి యొకసారి తాంబూలమిచ్చి మగఁడు పండుకొన్నపిదప నాతనిప్రక్కను గూ ర్చుండి చాలసేపు గృహకృత్యంబులఁ గూర్చి మాటలాడఁజొచ్చెను. ప్రేమాస్పదు లైనదంపతుల సంభాషణముల కంతముండదుగదా! అట్లుకొంతసేపు సంభాషణయైన పిదప భార్య భోజనము చేయలేదన్నమాట జ్ఞప్తికిరాఁగ హేమచంద్రుఁడు ప్రియు రాలి నుద్దేశించి నీవింకను భోజనముఁ జేయలేదు కాఁబోలు. వెళ్ళి త్వరగా భోజనము చేయుము. మనమాటలకు తెంపున్నదా. జెలయూరిన ట్లూరుచునే యుం డునని యామెను త్వరపెట్టి పంపెను. భర్తగు తనమీఁద గలగాఢానురాగము చేత బిందు తనవంటి యదృష్టవంతురాలు లేదని యుబ్బి రెండుజాములరాత్రి దాటినను భోజనమునకు ప్రొద్దుపోయెనని విచారపడ[illegible]ని పనిజేసికొని నిదురించుచున్న భర్త ప్రక్కను పండుకొని సుఖనిద్రఁ జెం[illegible]

నాల్గవ ప్రకరణము.

భవిష్యత్కాల సూచనము.

మఱునాఁడుసాయంకాలము హేమచంద్రుఁడు తారుణీమల్లికుని గృహంబున కరిగెను. ఆగృహావరణమున సింహద్వారము దాఁటగానే రెండుమూఁడు ధాన్యపుగాదెలు కనఁబడెను. ఒకప్రక్కను పెద్ద పశువులశాలయొకటి యుండెను. దాని నిండ నావులు నెద్దులుగలవు. కొంతదూరము వెళ్ళ దేవతార్చనగృహము కలదు. వేరొకచోట భాగవతములు జలక్రీడలు మొదలగునవి యాడించుటకు స్తంభముల మీఁదఁ గట్టినగొప్పపాక కలదు. బంగాళాదేశములో ధనవంతులు వినోదములనిమిత్త మిట్టివి గృహావరణములలో నిర్మించుకొందురు. పుణ్యదినములలో గ్రామమందలి జనులందఱువచ్చి యావినోదములంజూచి సంతసించిపోవుచుందురు. మననైపున నిట్టివినోదములు వీథులలోనే పందిళ్ళక్రింద జరుగుచుండును అప్పటికి రెండేండ్ల క్రిందట తారుణీమల్లికుఁడు లోపలియిండ్లకు సంబంధములేకుండ నిటుకగోడలతో నొక కచ్చేరిగది కట్టించికొనియెను. సూర్యాస్తమయ మగుటచే నొకయిత్తడిస్తంభముమీఁద నాగదిలో దీపము వెలుఁగుచుండెను. ఆగదిలో నొక ప్రక్క నెత్తుగా గట్టఁబడినదారువేదికమీఁద జముఖానముపై బాలీసునకుఁజేరఁబడి హుక్కాత్రాగుచు తారుణీమల్లికుఁడు కూర్చుండెను. ఇరుగుపొరుగువారు కొందఱు దర్శనమునకువచ్చి యప్పుడతనితోఁ బ్రసంగించుచుండిరి. హేమచంద్రుఁడు రాఁగానే మల్లికుఁడు దయగదుర సేమమడిగి సేవకునిఁబిలిచి లోపలికల్లునిఁ దోడ్కొనిపొమ్మని యానతిచ్చెను. స్త్రీలు వసియించుగదుల నసారాలకు నలుప్రక్కలు తడకలు కట్టఁబడియుండెను. మల్లికునిపడకగది విశాలమై మట్టిదిమ్మల మీఁద కట్టఁబడియుండెను. ఆగదిప్రక్కను విశాలమైన వంటయిల్లు మఱికొన్నిచిన్నగదులుగలవు. దొడ్డిలోనొక దిగుడుబావియుండెను. దానిచుట్టు మామిళ్ళు నారికేళములు మొదలగు ఫలవృక్షములతోట యుండెను. హేమచంద్రుఁడు సేవకునివెంట లోనికరిగి పెద్దత్తగారింగాంచి నేలఁజారగిలఁబడి యామెకు నమస్కరించెను. ఆమెయల్లునిదీవించి కుశలమడిగి లేచికూర్చుండుమని చెప్పెను. ఆమె నలువదియేండ్లు వయసుగలది. మొగము కలకలలాడుచుండును. చేతులు గుండ్రనై బొద్దుగనుండును. ఆమె పొట్టిగనుండినను నడకవైఖరి మొదలగునవి వికారముగనుండక యింపుగ గౌరవనీయముగనుండును. కాళ్ళనందెలు కడియములు మొదలగువెండిజతలు, చేతులఁగంకణాలు మురుగులు మొదలగుబంగారపు జతలు మెఱయుచుండెను. ఆ నగ లామెశరీరమునకుఁ దగియే

యుండెను. మందగమనములు మృదుభాషణములు లేనగవులు గొప్పవానిభార్యయగుటను సూచించెను. అయిననామె యప్పుడప్పుడించుక గర్వోక్తులఁ బలుకుచుండినను ముత్తముమీఁద గలిసికట్టుతనము గలిగి వచ్చినవారిని గౌరవించునట్టి మంచి స్వభావము గలదని చెప్పవచ్చును. హేమచంద్రుఁడు లేచి యొక కుర్చీమీఁద గూర్చుండినపిదప, నల్లునకు నత్తకు నీక్రిందిసంభాషణము జరిగెను.

అత్త—నాయనా! మీయిల్లు మాయిల్లు గుమ్మములో గుమ్మములాగున మిక్కిలిచేరువనున్నను నీవొకసారియైన నిన్నాళ్ళనుండి మాగడపఁ దొక్కవైతివిగదా? పెద్దదానను బ్రతికియున్నానో లేనోయింతమాత్రముకనుగొనకూడదా?

హేమ—అత్తయ్యా! మీరాలాగున ననుకొనవద్దు. మీక్షేమము ప్రతి నిమేషము దెలియుచునేయుండును. ఏమో పేదవాండ్రముగద నౌకర్లు చాకర్లు లేని వాండ్రము. రోజల్ల గృహకృత్యములతోను పిల్లలతోను సరిపోవుచున్నది.

అత్త—మంచిపంక దొరికినదిలే; నీమాటయటుంచు. మాబిందుకూడా నా కంటబడుటలేదుకద. దాని నీచేతులతోఁ బెంచి పెద్దదానినిఁజేసి నీకు పెండ్లిచేసితిని గదా. అదియొక్కసారి వచ్చి పెద్దదానినింజూచి పోఁగూడదా?

హేమ—అత్తయ్యా! రాకేమి. ఉదయాస్తమానములదివీమాటే పలవరించుచుండును. ఉమ పుట్టినింటికివచ్చినదని విన్నదిమొదలిక్కడకు నెప్పుడువచ్చి పడుదునాయని వేగిరపడుచున్నది. కాని, అత్తయ్యా! తెల్లవారిలేచినదిమొదలుకొని గంపంతపని. ఆపయిన యీనడుమ పిల్లవానికి గొంచెముజబ్బుచేసినది. దానదీన తీఱికలేక యిల్లుకదలలేదు. పోనీ యొకపరియాయమ యుమను మాయింటికంపండి. పిల్లలను దానినిఁజూచి యొకపూటక్కడనుండి తిరిగివచ్చును.

అత్త—అదిపీలులేదు. ఉమభాగ్యవంతుల కోడలయినది. గనుక అత్తవారికామె యిక్కడికి నక్కడికి వచ్చుట యిష్టములేదు గానియత్తవారు ధనపురములో మిక్కిలియెన్నికయైన గొప్పకుటుంబములోనివారు. నీవెనుక ధనపురమున నవాబులపద్ద దివాను ధనేశ్వరుఁ డుండెడువాఁడని వినలేదా? ఆల్లాయనవంశమువారే వీరు. అంతగొప్పవారికి చుట్టుప్రక్కలలేరు.

హేమ—అత్తయ్యా! ఆసంగతిని నేనెఱుఁగుదును.

అత్త—అవును నీవెఱుఁగకేమి! ధనేశ్వరునికుటుంబమెఱుఁగనివారెవ్వరు? దానములలోనేమి, ధర్మములలోనేమి యాచారసంపత్తిలోనేమి వారికీర్తి వారి గొప్పకుఁదీసిపోదు. వారింటియాఁడపడుచునే నీమామగారుద్యోగము చేయుచున్న వర్ధమానములో నొకనికిచ్చి వివాహముచేసినారు. నామాటనమ్ముదువో లేదో,

ఏబదివేలురూపాయలు కర్చుచేసినారు. అంతసొమ్ము కర్చయినదని వారికేమైన లెక్కయున్నదా వారికది యొకకర్చా?

హేమ--(ఇంగ్లీషు చదువుకొని యర్థశాస్త్రము నభ్యసించిన నవనాగరకుఁడగుటచే నత్తగారిపలుకులకిష్టపడక మెల్లఁగా) అత్తయ్యా! అది దూబరకర్చు కాదా ?

అత్త—అదిదూబరకర్చా! సరిలే. వేదబ్రాహ్మణులకు సంతర్పణలక్రింద, సంభావనలక్రింద, వస్త్రదానములక్రింద విశేషముగ కర్చుపెట్టినారు. ఒకబ్రాహ్మణులేకాదు. ఆనాటిజనులెల్ల నైదుదినములక్కడనే పడితిన్నారు. అది ధర్మగుణమనిపించుకొనును గాని దూబరకాదు. ఎంతపుణ్యమున్న దందులో. వేదములుచదువుకొన్న బ్రాహ్మణులకు, కర్మిష్ఠులకు, శాస్త్రవేత్తలకు విశేషముగ నప్పుడు బహుమానములుదొరికినవి. నాయనా ! పిల్లను మాయింటికే తిన్నగావారు రానీయరు. ఒక్క దేవీనవరాత్రములకు రానిచ్చుచున్నారు. మఱిదేనికీలేదు. మీమామగారీమధ్య వేసంగికిఁ గొన్నాళ్ళు సెలవుమీఁద వచ్చినారు. ఆయనవచ్చినదిమొదలెన్నోసారులు వర్తమానములు పంపఁగా బంపగా నిప్పుడొకసారి పంపినారు. రెండువారములకంటె నెక్కువయుంచుటలేదని స్పష్టముఁగా జెప్పినారు. పదునాలుగురోజులు కాఁగానే యొకగడియ యుండదు. అందుకయి చీరలు, పండ్లు, పసుపు, కుంకుమ తెచ్చుటకు వర్ధమానమునకు మనుష్యులనంపినాము. రాకరాక వచ్చినది గనుక వెళ్లునప్పుడేమయిన నీయవద్దా ?

హేమ—అత్తయ్యా ! పోనీ ఉమమాయింటికి వచ్చుటకు వీలులేనియెడల నేనే మీయమ్మాయిని, పిల్లలను మీయింటికి ఉమను జూచుటకు బంపెదను.

అత్త—తప్పకుండ బంపునాయనా ! బిందు నాబిడ్డవంటిదే. గనుక వీలయినప్పుడెల్ల నన్నుజూచుటకు రావలసినదేకదా.

హేమ—అలాగేవచ్చుచుండును లెండి. ఉమయిక్కడ నింక నెన్నాళ్ళుండును ?

అత్త—ఎన్నాళ్ళుండునా ! ఒక్కనిమిషముండదు. వర్ధమానమునుండి సరకులురాఁగానే పంపివేయుదును. షష్టివ్రతము దగ్గఱకువచ్చుచున్నది. అదియొక పెద్దకర్చు.

హేమ—అవు నవును.

అత్త—ఆషష్టినాఁడల్లునిఁ దీసికొనివచ్చి కట్నములు కానుకలిచ్చుట యొకయాచార మున్నదిగదా. ఏనాటి పెద్దలేర్పఱచినారో యది మనము మానకూడదు గదా, సరేగానీ నాయనా! మీపిల్లలు బాగున్నారా!

హేమ—చంటిపిల్లవానికి దారుదినములనుండి జ్వరము వచ్చుచున్నది. కాట్నావునుండి మందుఁదెచ్చి వేయుచున్నాను. కొంచెము నెమ్మదిగా నున్నది.

అత్త—మంచిపనిఁజేసినావు నాయనా! చిన్నప్పుడు పాపము బిందునకుఁ గూడ ఈలాగుననే తఱుచుగా జ్వరము వచ్చుచుండెడిది. అదెవట్టిదయా ఆ పిల్ల. ఏలో దైవానుగ్రహమువల్ల దానికడుపున రెండుకాయలు కాచినవిగాని, మా రంగు మొన్నటి పిల్లకాయఁట గాన్గ? [illegible] నెమ్మదిగా [illegible] నున్నాను. [illegible] చున్నపిమ్మట యన్నము పెట్టుమని నోరెత్తియడిగి యెఱుఁగదు గా. నేపెంచి పెద్దదానిఁ జేసితిని కద్దు. లేనిదో లేదు. మంచినీళ్ళయినను నంతేసుమా నాయనా! నేనంటే ప్రాణము కాదా దానికి. తండ్రిపోయినతరువాత వాళ్ళతల్లి వెంగ పెట్టినాని పిల్లలకు [illegible] జేయుటయేమానినది. అన్నము తినిపించుచునే నే. బట్టలుకట్టుచునే నే. [illegible] బిందుకూడ నాకాలాటిదే. అందుచేత నొకనాఁడు వచ్చి [illegible] నాయనా!

హేమ—అయ్యో! తప్పక వచ్చిచూచును.

అత్త—క్రిందటి నవరాత్రులకు బిందు మాయింటికివచ్చి యొకనాఁడే వెళ్లిపోయినది. ఈసారి యట్లుచేయక రెండుదినములుండును. అది మాయింటి కూఁతు పడుచు. పూజాదినములలో మాయింట మాతోపాటుగనుండి పనిపాటులలో సాయము చేయవలసినదే. [illegible], [illegible]. [illegible] కోసులలోనున్న పల్లెలలోని వారందఱును [illegible] మంచిమంచిలుగా వచ్చిపడుదురు. [illegible], [illegible] వెళ్లిపోవువాఁడవు కనుక [illegible]. [illegible] గాడిద్రోయలలో [illegible], [illegible], [illegible] వడిసి వార్చి పోసినను నిజముగానొక్క మెతుకైన [illegible]కాదు. ఏమిజనము! ఏమియన్నదానము! లెక్క పెట్టగలమా?

హేమ—చెప్పవలెనా. నాకుఁ దెలియదా? ప్రతిసంవత్సరము జరుగుచున్న పూజాదినములలో మీయింట నిరంతాన్నదానము జరుగుట యెవ్వరెఱుఁగరు?

అత్త—అయ్యోనాయనా! పెద్దలమర్యాద నిలుపవలెఁగదా అందుచేత మా మామగారట్లు చేయకతప్పదు. అందరు పూజలు చేయుచున్నారా? మాటవరుసకు జెప్పుచున్నాను నీవుమట్టుకు నీవు పూజచేయకపోయినను బాధలేదు. కొంచెము పేరుప్రతిష్ఠలు గలవారుగనుక మీమామగారు చేయకపోయినయెడల లోకులు నవ్వుదురు. మల్లికవంశముగొప్పదిగనుక దానిపూర్వగౌరవము నిలుపవలదా.

ఈవిధముగ మల్లికవంశగౌరవమునుగూర్చియు, నుమయత్తవారగు ధనపురము వారివైభవముం గూర్చియు, తనభాగ్యమును గురించియు దేవీనవరాత్రములను

డనయింటజరుగు ప్రాంతలగురించియు నెంతసేపటివఱకామె తెంపులేకుండ ప్రసంగించి నదో మనము చెప్పఁజాలము. పాపము ప్రొద్దుపోవుటచే హేమచంద్రుని కన్నులు నిద్రావశమున మూఁతలు పడుచుండెను. అందుచేత నతఁడత్తగారి యంతములేని సోదెవంటి సంభాషణమునకు విసుగుఁజెంది, యామె యేమనుకొన్నను సరే యని రెండుమూఁడు సారులు గట్టిగ నావులించెను. ఎంత విసుగుజెందిన, నామె తనగొడవ మాననందున బాగుండదని హేమచంద్రుఁడు నడుమనడుమ నామెయడిగిన ప్రశ్నములకు నవు నవునని యుత్తరమిచ్చుచుండెను. ఆ యుత్తరములనుబట్టి తనమాట లల్లుఁడు శ్రద్ధగా వినుచున్నాఁడని, మూఁడుమాసము లేనిగుఱ్ఱమునకై తనకథ నామె మఱింత సాగ నిచ్చుచు వచ్చెను. అప్పటికి పదిగంటలు దాటెను నిద్రాపరవశుఁడయిన హేమ చంద్రుని యదృష్టవశమున వారుమాటాడుచున్న గదితలుపువద్ద నందెల చప్పు డయ్యెను. ఆధ్వని జీవనదివంటియామె సంభాషణ ప్రవాహమున కడ్డుకట్టయ్యెను. ఉమ, ధనపురపు ధనేశ్వరకుటుంబమువారి కోడలు కావున వెలలేని బంగారునగలు, రత్న నాలతొడవులు మేనంతట మెఱయుచుండ జరీ ముద్దవంటి చీరఁగట్టికొని సొగసులు గుల్కునట్లు మందమందగమనములతో గది ప్రవేశించి కుసుమప్రశ్నమనునట్లు హేమచంద్రునియెదుట నిలిచెను. ఆమె ముఖమునఁబదియేండ్లకే మేలిచాయ సుస్పష్ట మువలె పచ్చనై లావణ్యము గ్రుమ్మరుచుండెను. నవయౌవన ప్రాదుర్భావము చక్క దనమునకుం గోడగుటం జేసి యాగ్రామమున నామెతోఁ బోల్పఁదగిన విలాసవతియే లేదు. కాఱుమబ్బులవంటి తలవెండ్రుకలను సిగ చుట్టికొనియెను. చందమామ రేలు విశాలఫాలభాగమున రతనపుం బాపటబొట్టు మెఱయుచుండెను. సిగపూఁవు వజ్రములు చెక్కిన బంగరుబొమ్మ డయమర్పఁబడెను. చేతులనున్న పోఁచీలు, కంక ణాలు మొదలగు బంగారుజతలు వర్ణింపఁదగినవి గావు. నడుమున వడ్డాణమునకు బదులు మేలుపసిండి మొలనూలు మెఱయుచుండెను. నవరత్నములు చెక్కిన బంగరు పట్టెడయు నైదుపేటల ముత్యాలహారమును మెడనలంకరించెను. ఆమె వేషమును జూచి హేమచంద్రుఁడు చిన్ననాఁడు తన కింగ్లీషుపాఠశాలలో స్త్రీలను నగలు వేయుంట కూడదనిన నాగరికుఁడగు మహోపాధ్యాయుఁడు చెప్పినమాట జ్ఞప్తికి దెచ్చుకొని మనలో "ఎందుకువచ్చిన డంబమిది. సొమ్ము పాడునకేగాని" యనుకొనెను. ఆభరణములు హిందూదేశ స్త్రీలకు జీవనాధారములైన యాస్తియని హేమచంద్రునకుఁ దోఁచలేదు. హిందూదేశ స్త్రీలందరు డంబమునకే యీయలంకారములను ధరింపరు. అలంకార రూపకమైనసొత్తు వారికి స్త్రీధనమై స్వాధీనమై పరమపవిత్రమై ఋణప్రదాతముఁ గాని దొరతనమువారికి గాని చేరుకొనుటకు వీలులేక యావజ్జీవ మభయప్రదా యకమైయుండును. ఆఁడుది వితంతువైనను సంతానహీనురాలైనను పయోల! యెంత

దిక్కుమాలిన దైనను స్త్రీధనము నొకింతమాత్ర మున్నను నమ్ముటకు వీలులేదు. కృషి వలన విందు కాఁపుకుటుంబము లనేకములు కరవు కాలములలో నాఁడువాండ్ర వెండిబంగారునగ లమ్ముకొని తినుటవలననే నశింపక నిలువఁగలిగెను. ఇంక భాగ్యవంతులలో పూర్వార్జితము లగు నగ్రహారములు మాన్యములు మేడలు మిద్దెలు మొదలగు సర్వస్వము కాలవశమున నన్యాక్రాంతములై పోయినను వంశపారంపర్యముగఁ బలుతరములనుండి గృహములనుండెడు రత్నాభరణములను సువర్ణాలంకారములను విక్రయించుకొనుట చేతనే కష్టకాలములలోఁ బెద్దింటిగౌరవముఁ గొంతయైన నిలువఁబెట్టికొని జీవించుచున్నారు. నగ లెన్ని యాపదలైన గడుపఁ జాలును కావున హేమచంద్రుఁ డనుకొనునట్లు గర్హ్యములు కావు. అంతట నుమా హేమచంద్రు లీతెఱంగున మాటలాడిరి.

ఉమ—బావా! ఇది సుదినము. ఈ వేళ యుదయమున నే నెవ్వని మొగముఁ జూచినానో కాని నీదర్శన మైనది.

హేమ—అదృష్టము నాది. నీది కాదు. ఏమా? మావంటి పేదవాండ్రకు సుకృతము లేనిదే మీవంటివా రగుపడుదురా!

ఉమ—సరి సరి బావా బాగున్నది. నేనిక్కడికి పదిదినముల క్రిందట వచ్చినను నీ వొక్కసారియైన నన్నుఁ జూడవచ్చితివి కావుగదా! పోనీ దాని కేమిలే, నీవు బాగున్నావు కదా! అక్కయ్య పిల్లలు బాగున్నారు కదా!

హేమ—ఆ! మేమందరము నెమ్మదిగా నున్నాము. నీవు కులాసాగా నున్నావు గదా!

ఉమ—ఆ! నీదయవల్ల. నీకు మామీఁద దయ యున్నది గనుక మా క్షేమము విచారించినావు. ఈరాత్రి నీవు దర్శన మిచ్చుటచేత నీకు మామీఁద నపారమైన దయ కలదు. ఇప్పటికైనను మాయింటి కక్కయ్య పంపబట్టి నీవు వచ్చియుందువు. చాల ప్రొద్దు పోవువఱకు నీవిక్కడ నుండకు. నీ వెక్కడికో వెళ్ళినావని యామె యనుమానపడఁ గలదు.

హేమ—(మఱదలు హాస్యపుమాటలను విని ముసిముసినవ్వులు నవ్వుకొని) ఉమా! సాధ్యమయినంత త్వరలోనే మీయక్క నిన్నుఁ జూచుటకు వచ్చును. ఆమె ప్రతినిమేషము నీమాటయే స్మరించుచుండును. తెఱపి చేసికొని రావలయునని చూచుచున్నది. రేపు తప్పక వచ్చునులే. అప్పుడు పిల్లలను జూడ వచ్చును.

ఉమ—సరే, రేపు పంపు. ఒక్కసారి పిల్లలను జూడవలయునని యెంతో ముచ్చటగా నున్నది. (ఉమకు బిడ్డలు లేనందున పిల్లలపేరు చెప్పఁగానే వారిని జూచుట కామెకుఁ గుతూహల మెక్కువయ్యెను.)

హేమ — తప్పక రేపె పంపుదును. నీవత్తవారియింట నున్నపుడుగూడ నీక్షేమసమాచారములు తెలియుచుగా మీయక్క కనుగొనుచునే యుండును.

ఉమ — అది నే నెఱుఁగనా. బిందక్కయ్యకు నే నంటే ప్రాణము కాదా, చిన్నపు డొక్కకంచములోఁ దిని యొక్కమంచముమీఁద పండుకొన్నవారము కామా. ఒకనిముసమైన నొకరినొకరము విడిచి యున్నవారమా. పెద్దవాండ్రమైన తరువాత గూడ మేమిద్దఱ మొకచోటనే యుండి ప్రతిదిన మొకరినొకరు చూచుచుండునట్లు లొక్కగ్రామముననే యుండవలయునని కోరుకొనుచుండువారము. కాని దైవయత్నమువల్ల నిద్దఱముఁ జెఱియొకయూరను బడిపోయి దూరమైపోయినాము. ఆచిన్ననాటి మాటలు ముచ్చటలుఁ దలంచుకొంటిమా యిప్పటికి నెంతో హాయిగ నుండును. రేపు తప్పక యక్కయ్యను పిల్లలను పంపుసుమా?

హేమ — సరే యిన్నిమాటలు చెప్పవలెనా?

ఉమను బిందును జూడ మనభిలాష మనసార జనియించెనేకాని నటన నిమిత్తము వచ్చినది కాదు. ఏలయన, గౌరవము సంపాదించుటకై గొప్పవారితో వియ్యమందిన తండ్రియొక్క డంబము కాని యెంత సేపైన విసుగు లేక తన గొప్పతనము తనగొడవలుఁ జెప్పుకొనుతల్లియొక్క వెఱ్ఱిగర్వము కాని యామెకడ లేనందునను మఱింతో చక్కని ఐశ్వర్య వెలలేనిరతనాలనగలు మేన దాల్చినదయ్యు మహాశ్రీమంతులవారి కోడలయ్యు రవంతియేని గరువము నందక చిన్ననాఁడు తాను బిందుతోఁ జేసిన నెయ్యమును హృదయమునం దుంచుకొనియె. ఆమె యొయ్యారము నామెయైశ్వర్యముఁ జూడగాఁనే యామె చుట్టములనెల్ల మఱచియుండునని మొట్టమొదట హేమచంద్రుఁ డనుమానపడెను. కాని యామె కొండొకతడవు మాటలాడి తన యత్తవారికుటుంబగౌరవమునకుం దగిన గర్వమున కెడమీయక హృదయపూర్వకమైన [illegible] తోడనే యానుమానము నశించెను. ఉన్నతస్థితి సంపద [illegible] మైత్రినిఁ దుదముట్టింపక యుండునేని ప్రపంచము సౌఖ్య[illegible] భాగ్యవంతులమై యుండుదుముకదా. హేమచంద్రుఁడట్లు పలికి స్వగృహమున [illegible] "బావా నీపాదధూళితో మాగృహమునుఁ బావనముఁ జేసి యనుగ్రహించితివి కాన చిన్నవిందారగించి మమ్ము మఱింతధన్యులఁ జేయఁ గోరుచున్నాను. కొంచెము ఫలాహారముఁజేసి వెళ్ళు" మని బతిమాలి రమ్మని యందెలు ఘల్లుఘల్లుమని మ్రోయ తానుముందునడవసాగెను. హేమచంద్రుఁ డామె మాట త్రోసివేయలేక యామెవెంట వెంటయింటికిఁ జనియెను. ఆయింట వెండికొప్పెర్లు పళ్ళెముల దీపములు ధగధగ వెలుఁగుచుండెను. ఒక వెండియాకులోఁ [illegible] పదార్థములు [illegible] నుండెను. [illegible] వెండిగిన్నెలతోఁ [illegible]

క్షీరాన్నము పాలు పెట్టబడి యుండెను. భాగ్యవంతులుగూడ సాధారణముగ వట్టియాకులలోను పళ్ళెములలోను భుజియింతురు. కాని యల్లుళ్లువచ్చినప్పుడు గొప్పమిత్రులు చుట్టములు వచ్చినప్పుడు తమవైభవముఁ జూపుటకు వెండియాకులు గిన్నెలుఁ బయిటికితీయుదురు. పాపము హేమచంద్రుఁడు జన్మమెత్తిన తరువాత నెన్నఁడు నంతవెలగలపళ్ళెరంబులలో గిన్నెలలో నంతరుచిగల పదార్థములను భుజించి యెఱుఁగఁడు. ఆపాత్రలకైనధనము తనకుటుంబమున కొకసంవత్సర గ్రాసమగునని యతఁడు తలంచెను. అంతట నుమ చతురమైన యొకచిత్రాసనము వెండియాకువద్దవేయించి, బావా! కూర్చుండుము మొగమాటపడక యీచిన్న విందారగింపుము. మావలన లోపములున్న నవి బుద్ధిపూర్వకముగాఁ జేయలేదు కావున క్షమియింపుమనిపల్కెను. హేముఁడు చిత్రాసనముమీదఁ గూర్చుండి భుజియించుచుండ నుమ వాని ప్రక్కనే కూర్చుండి మాటలాడుచుండెను. ఉమచక్కనిచుక్క. ధనపురము జమీందారుని కుమారుఁడు మిక్కిలిచక్కనిదానినేగాని పెండ్లియాడనని పట్టుపట్టుటచే నాతనితండ్రి తాళ్ళచెఱువుగ్రామమున నతిలావణ్యవతి యైన యీ బాలిక యున్నదని కర్ణాకర్ణిని విని యామె నిమిత్తము విశ్వప్రయత్నముఁజేసి పెండ్లిఁజేసెను. తారుణీమల్లికుఁడు సహజముగఁ గొంచెము మంచిస్థితిగలవాఁ డయినను ధనపురముజమీందారుతో వియ్య మందుటకుఁ దగినభాగ్యవంతుఁడు కాఁడు కావున నీవివాహముచేత నతఁడును, మాయామర్మము లెఱుఁగనివాని భార్యయు మునుపటికంటె నెక్కుడుగౌరవము కలిగి యించుకగర్వితు లయి యుండిరి.

ధనము సకలసౌఖ్యప్రదాయ మని యుమయు నెఱుంగును. కాని యంతటి భాగ్యవంతులకోడలై యామె సౌఖ్యపడుచున్నదో లేదో యిప్పటికి మనకుఁ దెలియదు. ఈకథాప్రచారమున ముందుముందు మనము ధనపురముజమీందారును గలిసికొనినప్పు డావృత్తాంతము నెఱుంగ వచ్చును. కాని ప్రస్తుత మొకమాట మాత్రము చెప్పగలము. ఆచిన్నజమీందారుఁడు బాల్యమును విడిచి యౌవనముఁ బ్రాప్తించిన పిదప చక్కఁదనములమీద నెక్కువమక్కువ గలవాడయ్యె ననియు, నొకయేఁడు పైబడిన కొలఁది భోగపరాయణుఁడగు చున్నాడనియు నొకవాడుక లోకమున నెల్లెడ నయ్యెను. తాళ్ళచెఱువుపల్లియలో నున్న పేదలచరిత్రల వ్రాయుచున్న మన కిపుడు భాగ్యవంతులు, మదోన్మత్తులు నయిన యాజమీందారుల గొడవ లక్కఱలేదు.

ఉమతో హేముఁడు చాలసే పనేకవిషయములను గుఱించి ప్రసంగించెను. ఆప్రసంగము రానురాను కొంతతడవున కామెయత్తవారి గొడవలలోనికి దిగెను. అత్తవారిప్రసంగము వచ్చినప్పు డామె బదులుపలుకక మౌనముతాల్చుచు వచ్చెను.

అదిచూచి హేమునిమనస్సునఁ గొంతయనుమానము దానితో వ్యాకులతయును గలుగఁ జొచ్చెను. తాళ్ళచెఱువునం బుట్టినయాఁడపడుచులలో నెల్ల లావణ్యవంతురాలు భాగ్యవంతురాలు సౌఖ్యవంతురాలు నని పేరువడిన యీముద్దుగుమ్మ యిప్పుడు మింతలేతవయసున జింతయను నగ్నిహోత్రముచేత గాల్పఁబడుచుండునా యని సందేహముఁ దోప హేముఁ డామెమొగముపంక రెప్పవాల్పక పలుమాఱు చూడ దొడఁగెను. చూడఁ జూడ ననేక రత్నాభరణముల యడుగుననున్న యామె మనస్సులో బైకి రాక యడంగియున్న విషాదము కనుకొలంకులయందు పైకి రాక యడఁగియున్న కన్నీరు వానికిం బొడఁగట్టినట్లయ్యెను. "ఈమెముఖారవిందమున గుప్తమగు విషాదము నిజముగా నాకగపడుచున్నదా లేక నాకన్నులు భ్రమఁ జెందినవా" యని హేముఁ డొకటి రెండుసారులు తనలోఁ దాను వితర్కించుకొనెను.

ఐదవ ప్రకరణము.

మిత్రదర్శనము.

అట్లు హేమచంద్రుఁడు బిందారగించి తారుణీమల్లికునిం గలిసికొని తన వ్యవహార మాయనతో మాటలాడి యింటికిఁ బోవ పయనమగునప్పటికి కర్ధరాత్రమయ్యెను. బిందు తలవాకిట నిలిచి భర్త మిత్ర మెదురు చూచుచుండఁ గొండొక దడవున కామె కతని దర్శనమయ్యెను. అగుటయు నామె మొగము సంతోషముతో వికసింప "నిప్పటికైన నింటిమాట జ్ఞాపక ముంచుకొని వచ్చినారు నయమే; యొక్కఁడనో దారి తప్పినా రనుకొని భయపడుచున్నాను పాపము మాయమ్మ తన యత్తవారిగొడవలు చెప్ప మొదలుపెట్టి యుండును. ఆ తియ్యనిపలుకులు చెవులు దొరపెట్టి వినుచు వదలి రాలేక పోయినారుకాఁబోలు" నని పరిహాసమాడెను. అనవుడు "బిందూ! యెందు కీమెత్తని మందలింపులు. అంతవిశేషముప్రొద్దు పోయినదా యేమి" యని హేముఁడు పలుక "అక్కే! యెంతోప్రొద్దు పోయినదా రెండుయామము లయినది. ఊరు మాటుమణిగినది. మీస్నేహితుఁడు చీకఁటిపడగానే వచ్చి వారిప్పుడే వత్తురో యప్పుడే వత్తురో యని మీనిమిత్త మెదురు చూచుచున్నా

డని బిందు ప్రత్యుత్తర మిచ్చెను. అనగానే హేముఁడు తొట్రుపడి యెవరు వచ్చినా రెవరు వచ్చినారు ఏఁడీ యెక్కడ, యన బిందు గండి చూతురు గాని, యని యాతని లోనికిఁ గొంపోయెను.

లోనికిం జనినతోడనే చక్కని కెంపుచాయయు సుందరముగు నెమ్మొగముఁ గల యొకపడుచువాఁడు హేమచంద్రుని కెదురుగా వచ్చెను. హేమచంద్రుఁ డాతనిని గొంతసేపటివఱకు గానవాలు పట్టలేక కలవర మందుచుండ బిందు చిరునవ్వులు నవ్వఁజొచ్చెను. కొంతసేపునకు హేముఁడు తనమిత్రుని గుర్తుపట్టి యోహోహో! శరచ్చంద్రుఁడా, యని పలుకరించెను. అంతట వారీక్రిందివిధమున సంభాషించిరి.

శర—అవును నేనే జ్ఞాపకము వచ్చినదే?

హేమ—నీవు కలకత్తానుండి యెప్పుడు వచ్చినావోయి. ఎంత మారిపోయినావు. నిన్ను నేను చూచి పదియేండ్లయినదిసుమా. నాఁడు మీయప్ప కాశీ పెండ్లిలోఁ గలిసికొనినాము అప్పుడు నీవుచిన్నపిల్లవాడవు వర్ధమానములోఁ జదువుకొనుచుంటివి. ఇప్పుడు చాలపొడుగైనావు. మీసకట్టు దట్టముగ తిరిగినది. అందుచేత నెంటనేపోల్చ లేక పోయినాను.

శర—అవును. మాయప్ప పెండ్లియైనకొద్దికాలములోనే మాతండ్రిగారు పోయినారు. అంతట మాయమ్మ నాతోఁగూడ వర్ధమానమునకు వచ్చినది. అందుచేత నప్పటినుండి యిక్కడకు రావలసిన యవసరము లేక పోయినది. అందుచేత కృతార్థుఁడనైపిదప ప్రథమశాస్త్రపరీక్షఁ జదువఁ దలచి కలకత్తాకు పోయితిని. మాయమ్మ నాతో రాక నీయూరికి వచ్చి యుండెను. ఇవి వేసవికాలపు సెలవులు గనుక నేనామెను జూడ వచ్చితిని. పదియేండ్లకరువాత నేనే మారిపోవుటయని యొక యాశ్చర్యమా! మీరందఱుమాత్రము మారలేదా? మాయిందుమతి నాకంటె నొకయేఁడు పెద్ద చిన్నమాటయేగాని మేమిద్దఱ మొకయీఁడువాండ్రవలెనె చిన్నప్పు డెంతో సంతోషముతో నాడుకొనువారము. ఒకరిని విడచి యొకర ముండువారముకాము. వారియింటికి నేనైనను బోవలయును; సుఫ నీత్తుకొనియామెయైన మాయింటికి రావలయును అప్పుడొకమా రామె మాయింటిప్రక్కవారిజామిచెట్టునుండి కఱ్ఱతోఁ గొంకెఁగట్టి జామిపండ్లు దొంగతనముగాఁ గోసికొని వచ్చినది. అమ్మా! చిన్నపుడు బిందెంత గజదొంగనుకున్నావు. అలాంటి దిప్పుడు పెద్దయారిందయై యిద్దఱుపిల్లలతల్లియై గృహయజమానురాలై కాపురముఁ జేయుచున్నది.

బిందు—(చిఱునవ్వుతో) చాలుచాలు! గజదొంగ లేదు గిజదొంగ లేదు. నాజోలికి రాక నీమాట జెప్పుకొనుము. నీవీయూరిలో నున్నంతకాలము మామిడి

చెట్లు నెక్కుడ నైన నొకపిందెయైన నుండినదా? అలాటివాఁడ విప్పుడు కలకత్తా కాలేజిలోఁ జేరి పెద్దచదువులు చదువుచున్నావు. చాల తెలివియైనవాఁడ వని యందఱుఁ జెప్పికొనుచున్నారు. ఆదినములలో నీలాగున చెట్లనవలీలగ నెక్కఁగల వాఁడుఁ తోఁట దొంగతనములు చేయఁగలవాఁడు లేఁడు. ఈదినములలో నీలాగున జదువునకు దెలివికి పేరుపడినవాఁడును లేఁడు. పదియేండ్లలో నెంత మార్పు చూడు!

శర—అబద్ధమాడకు. ఉన్న నిజమంతయు జెప్పు ఆదొంగతనములు చేయించినవారు యెవరు! చాటుననుండి నీవే కాదూ? మీదొడ్డిలో నున్న పచ్చిమామిడికాయలు తినవద్దని మీపెత్తల్లి యడ్డుపెట్టుచు వచ్చినందున నేను చీకఁటి పడగానే కోరడిదుమికి చెట్టెక్కి కాయలుకోసి వంటయింటివసారలో నీవు నిలిచి యుండగా నేను గిరివాట్టు నై చెడువాడను కానా? జ్ఞాపకము వచ్చినదా?

హేమ—(నవ్వుచు) చాలు చాలు. ఒకరిగుట్టు లొకరు బయటపెట్టికొనకండి. మీరు వేరే చెప్పుకొన నక్కఱ లేదు మీరిద్దరెంత గజదొంగలో నేనెఱుంగుదును. (అని శరచ్చంద్రునితో) చంద్రా! ఆదినములలో నేనుగూడ మీయింటికి వచ్చుచుండెడివాడను. జ్ఞాపక మున్నదా! అక్కడనే సుధాబిందు లిద్దఱు నుండువారు అప్పటికి సుధ యాఱేండ్లది. (అని సుధవంకఁ జూచి) సుధా! మీయక్కతో గలిసి వీరి యింటికి వెళ్ళెడుదానవు జ్ఞాపకము లేదటే

సుధ—(తన చిన్ననాటిసహకారి యగు శరచ్చంద్రఘోషు మొగము జూచి కొంచెము సిగ్గుపడి తలవంచి) అవును. జ్ఞాపకమువచ్చినది

హేమ—అయితే చంద్రా! నీభోజన మైనదా?

శర—అయినది. ఈవేళ బిందువదినె మామిడికాయపచ్చడి యెంతపసందుగా జేసిన దనుకొన్నావు. ఈలాటిపచ్చడి నెప్పుడు నేను తినలేదు.

బిందు—(పరిహాసముగా) సందెచీఁకటిలో మామిడిచెట్లెక్కి కాయలెత్తికొని వచ్చి తిన్నప్పటికన్న బాగున్నదా?

శర—సందేహమా? అంతకన్న బాగున్నది. పచ్చికాయలు పలుమాఱులు తిన్నాను కాని యిట్టిపచ్చ డెప్పుడు తినలేదు. జిహ్వా లేచివచ్చుచున్నది కాదా?

బిందు—అప్పుడు పచ్చడి చేసినదాఁక ఆగుటకు నీ కోపికయేది?

హేమ—(బిందుతో) సుధయు నీవు గూడ భోజనము చేసినారా?

బిందు—సుధ యన్నము తిన్నది. నాభోజనము కాలేదు. మీది కడుపు నిండిన బేరములాగున్నది. అత్తవారియింట విందారగించి వచ్చినట్లున్నారు. నేనింకఁ బోయి భోజనము చేసివత్తునా? మీ కీపూఁట నేమియు నాశ లేదుగదా?

హేమ—అవును. మీ పెదబాబయ్యగారియింటఁ గడుపునిండతిన్నాను. నీవు భోజనముఁ జేసి రమ్ము.

అంతట బిందు భోజనమునిమిత్తము వంటసాలకుఁ జనియెను. సుధ బావగారు వచ్చు వఱకు మేలుకొనియుండి యాయన వచ్చినపిదపఁ గొంతసేపు మాటాడి వసారాలో నొకచాపఁ బఱచికొని పండుకొనియెను. ఆమెలేఁతమనస్సు విచారములకు నిలయము కానందున బండుకొనినతోడనే మలయమారుతముయొక్కయుఁ బయిపయిం బ్రసరించు వెన్నెలలయొక్కయుఁ జల్లదనముచేత నామెకు హాయిగ నిదురపట్టెను. తాళ్ళచెఱువు గ్రామ మంతయు నిశ్శబ్దమై నిద్రావశమైయుండెను. శరచ్చంద్రఘోషు హేమచంద్రబోసుతో మఱల సంభాషణ మారంభించెను. వారిరువురుఁ జిరకాలమునను గలసికొన్నమిత్త్రులగుటచే వారిసంభాషణమున కెడతెంపులు లేక పోయెను. ఘోషుకుటుంబము బోసుకుటుంబము సంబంధబాంధవ్యములచేత పూర్వులనాటనుండియు బద్ధములై యుండెను. దానికిం దోఁడుగ నాయుభయ వంశానుకూలురు నగు హేమచంద్రశరచ్చంద్రులు చిన్ననాఁటనుండియుఁ బరమ మిత్త్రులు. హేమచంద్రుఁడుశరచ్చంద్రుని తనతమ్మునియట్లుభావించి యాతని యౌదార్యమును చిత్తనైర్మల్యమును సంభాషణవలనం గ్రహించి తద్దయు నాదరించెను. శరచ్చంద్రుఁడు హేముని దన యన్నయట్లు భావించి వానియెడ మిక్కిలి గౌరవ ముంచెను. ఎడతెగని యాయిరువుర సంభాషణముఁ జరుగుచుండగనే భోజనముఁజేసి బిందు వచ్చి తనచెల్లెలు సుధ తలగడలేక పండుకొనుటఁ జూచి యామెతలను మెల్లఁగ దనతొడపై నిడికొని ప్రేమాతిశయమున అలకలు నిమురుచు తానుగూడ సంభాషణములో దిగెను. అంతట వా రిట్లు ప్రసంగించిరి.

హేమ—చంద్రా! నీవిప్పుడు బియ్యేకుఁ జదువుచున్నావుగదా! ఇఁక నైదాఱు నెలలలోఁ బరీక్షయగును. పరీక్షలోఁ దేఱినపిదప నేమిచేయుదువు?

శర—ఆవిషయమై నేను యోచింపలేదు. మాయమ్మ కాశికివెళ్ళవలెనని సంకల్పించుకొన్నది. అందుచేత నాపరీక్ష ముగియగానే నన్నిక్కడకు రమ్మనియు మాభూమి పుట్ర చూచికొమ్మనియు నన్నామెబలవంతపెట్టుచున్నది. ఒప్పికొంచెము. దానివలన నేఁడాదికా ఱేఁడువందలరూపాలకంటె నెక్కువరాదు. మాయమ్మ కాశిలోనే దనజీవితకాలశేషముఁ గడపఁ దలచుకొన్నది గావున నామె నక్కడ ప్రవేశపెట్టి భూములమీఁద శిస్తామెకిచ్చుచు నే నేదైన తగినయుద్యోగము సంపాదించికొనవలయుననియున్నది. ఈసెలవులలో నేను మాయమ్మను గాశికిఁ దీసికొని పోవుటకుం దగునేర్పాటులు చేసినాను.

హేమ—నీయాలోచన బాగుగ నున్నది. మీతల్లి కాశిలో నివసింపఁదలఁచుకొన్నది గావున తప్పక యామె నక్కడ దిగవిడిచి తిరిగి కలకత్తాకుఁ బోయి కాలేజీలోఁజేరి కష్టపడి చదువు. పరీక్షచాలకష్టము. ఇదివఱకు నీవు ప్రవేశపరీక్షలోను ప్రథమశాస్త్రపరీక్షలోను గృతార్థుఁడవైనట్లె, యిందులోఁగూడ గౌరవముగ మొదటితరగతిలో గృతార్థుఁడ వగుటకే కృషిచేయుము.

శర—చదువుదును మతికష్టపడి, తరువాత దైవమున్నాఁడు. కలకత్తాకు సాధ్యమైనంతత్వరగా వెళ్లుదును. మీరుగూడవచ్చి కలకత్తాలోఁ గొంతకాలమున్న పక్షమున బాగుండును. ఎల్లకాల మీపల్లెటూరిలో నీ వేలాగున నుండఁగలవయ్యా! పదియేండ్లక్రిందట నీవు కాలేజీలోఁ జదివినప్పుడు స్వల్పకాలము మాత్రము కలకత్తాలో నుంటివి. ఇందువదినె కలకత్తా మొగమే యెఱుఁగదు. అందుచేత మీ రిద్దఱువచ్చి రెండునెలల పాటక్కడనుండఁగూడదా? ఊడుపులైపోయినవి కదా! అందుచేత నీవు నాతో వచ్చి కొన్నాళ్ళు కలకత్తాలో నుండవచ్చు. అంతగా రావలసివచ్చినపక్షమున కోఁతలరోజులలో రావచ్చును.

హేమ—చంద్రా! నీ వెంతో మంచివాఁడవు; కనుక నింతదయతో నన్ను రమ్మని పిలిచినావు సరే! నేనువచ్చి కలకత్తాలో నేమిచేయుదును? నీవంటే రేపు ప్రొద్దున పరీక్షలోఁ దేఱుదువు. మంచియుద్యోగము సంపాదించుకొందువు. అక్కడ నాకేమిపనియున్నదోయి తిని కూర్చుండనా?

శర—నీవుమాత్రము తలఁచుకొంటే నేదైన మంచియుద్యోగము సంపాదించుకొన లేవఁటోయి. ఈమూఱుమూల పల్లెటూరిలో నెల్లకాలము గడపవలయునా? నీవు ప్రవేశపరీక్షలోఁ దేఱినావుగదా! అది యటుండఁగా నీవు చదువు మానినప్పటినుండి యెల్లవారివలెకాక యెన్నో పుస్తకములు చదివి చాలజ్ఞానము సంపాదించినావు. నీ కున్నంతయింగ్లీషుపాండిత్యము బియ్యేల మని బడాయి చెప్పుకొను మాలో నెవరికి లేదు. ఇంతపాండిత్యము నింతయోపిక యంతపట్టుదల గల నీవంటివాఁడు ప్రపంచములో గొప్పవాఁ డగుట యొకకష్టమా?

హేమ—నాపాండిత్యమెంత. అతిస్వల్పము. నే నెప్పుడైనఁ బుస్తకము చదువుట పాండిత్యము సంపాదించుకొనుటకుఁ గాదు. ఏమియు దోఁచక కలకత్తా వంటి పట్టణములలో నెన్నో పెద్దపెద్దపరీక్షలలోఁ దేఱి గొప్పపండితులై యుద్యోగముల నిమిత్తము మేజువారీలు చేసిచేసి యుద్యోగములు లేక విసికి పోవుచున్నవా రెందఱోయున్నారు. అక్కడ నాలెక్కయేమిటి! అక్కడ నే నుద్యోగము

కొఱకు ప్రయత్నముఁజేయుటవ్యర్థ. చివరకు జరిగెడు దేమనఁగా కొన్నాళ్ళకక్కడ నుండి చేతులు నలుపుకొనుచు మఱల నీయూరురావలసివచ్చును.

శర — పోనీ ! అలాగే జరుగు ననుకో! వచ్చిననష్టమేమి ? మీరు నాతో బాటు గంజియో అంబలియో త్రాగియుండవచ్చును. కర్చులకు మీ కేయవసరము నుండదు. ఉద్యోగమునిమిత్తము గట్టిప్రయత్నముఁ జేసినవాఁడ వగుదువు. మనుష్యమహాసముద్రమని చెప్పఁబడిన యాకలకత్తాలోఁగూడ పేరు దెచ్చికొని మంచియుద్యోగము సంపాదించుకొనుటకు వీలున్నదని నాయభిప్రాయము. ఏదియు దొరకక పోయెనా మీయూరికి వచ్చుట యుండనేయున్నది. ఇందువలన నీకు వచ్చిననష్ట మేమియు లేదు. వదినెయు సుధయుఁ గలకత్తా జూచినవారగుదురు.

హేమ — (కొంచె మాలోచించి) నా కేకర్చులు లేకుండ నీతో బాటుగ నుండుమన్నావు కాని మేము వచ్చినపక్షమున వేరే బసలోనుండుటయే మంచిది. ఏలయన మేముండుటవలన నీచదువు తిన్నఁగ జరగదు అయినప్పటి కావిషయ మీరాత్రియే స్థిరపఱచనక్కఱలేదు. మాపెదమామగారు వర్ధమానము రమ్మను చున్నారు. నీవు కలకత్తా రమ్మనుచున్నావు. నాకుఁ గూడ కొంతకాలము స్థలముమార్చ వలయునని యున్నది. స్థిమితముగ నాలోచించి నీవు వెళ్ళక ముందే యేదోయొకటి చెప్పెదునులే. ఎట్లైన నీతో నాలోచింపఁకుండఁజేయను.

శర — వదినె? నీయభిప్రాయ మేమి టమ్మా ? కలకత్తావంటి మహాపట్ట ణముఁ జూడవలెనని లేదూ?

బిందు — చూడవలె నని లేకపోవునా ? నాయనా? ఉంటేమాత్రము సాగునా? మహాపట్టణము గాదా? మాటాడితే డబ్బుకావలెను. మేము పేద వాండ్రము. ఇక్కడ నున్నప్పుడే డబ్బు కెంతెంతోఁ జిక్కుపడు చున్నాము. ఇఁక నక్కడ నెట్లు బ్రతుకగలము?

శర — మీకంత డబ్బెక్కువ యుంటే పాఱవైచికొన వచ్చును. కాని మీ కేకర్చులు యవసరము లేదు. మీరు మాయింటనే యుండవచ్చును. మీరుం డుటవలన నాచదువు చెడిపోదు. తఱచుగా నేను గోజంతయుఁ జదువుకొని విసికివిసికి హాయిగ బ్రాణమిచ్చి మాటాడువారు లేక యెంతో విచారముగ నుందును. మీరున్నపక్షమున నాచదువు చెడిపోదు. సరే కదా, సంతోషము చేత మఱింత సాగును.

బిందు—(నవ్వుచుఁ బరిహాసముగా) మరేమి భయము లేదు కాని నీవు చదువుకొనుచు జదువుకొనుచు మధ్యమధ్య చిన్ననాటి ముచ్చటలు జ్ఞాపకము వచ్చినప్పుడు పుస్తకము లక్కడ పెట్టి వంటయింటికివచ్చి తోటలోఁ జేసిన మామిడికాయల దొంగతనము నాతోఁ జెప్పుచుందువని భయపడుచున్నాను.

శర—అలా గనుకొనకపోతే చుట్టుపట్లతోఁటలలో మామిడికాయ లేమైన నున్నవేమో దొంగిలించికొని గమ్మని నన్నే నీవు పిలుతువనుకొనరాదా? ఎట్లయిన మంచి పచ్చడి చేసి పెట్టెదవు కనుక లాభము నాదేలే.

బిందు—నీ వేలాగైన నదృష్టవంతుఁడవే నాయన! నేను నిన్న విన్నమాట నిజమో యబద్ధమో కాని నీకన్ని పచ్చళ్ళు నన్నివంటలు, చేసిపెట్టుటకొకమ్మాయిగారు సిద్ధమగుచున్నారని తెలిసినది.

శర—ఆయమ్మాయిగా రెవరమ్మాయి !

బిందు—ఏమినంగనాచి వోయి? పాపమేమియు నెఱుఁగవు. మీయమ్మ నీకు పెండ్లిఁ చేయుటకు సంబంధము వెదకుట లేదా? అబద్ధమాడక చెప్పు.

శర—(కొంచెము సిగ్గుపడి) పెండ్లి లేదు. ఏమీ లేదు.

బిందు—(నవ్వుచు) నిజమేయై యుండునని నాకుఁ దోఁచుచున్నది. నీవు సిగ్గుపడి చెప్పవు. మీయమ్మ కాశికి వెళ్ళకమునుపు నీసంరక్షణముఁ జేసి నిన్ను బాగుగఁ గనిపెట్టఁగల పెండ్లామును నీకు గట్టిపెట్టియే వెళ్ళునఁట!

శర—ఈవిషయములో మాయమ్మ పట్టుదల యంతగా లేదు. ఆమెవైరాగ్యమేమో యామె యేమో కాని యీగొడవ లామె కక్కఱలేదు! ఈపట్టుదల యంతయు మాయప్ప కాళిది. ఆమె వర్ధమానములో నాకుఁ దగినసంబంధ మొకటి విచారించినదఁట. ఇక్కడకు వచ్చినప్పటినుండియు నాసంబంధ మొప్పుకొమ్మని యామె మాయమ్మను బలవంతపెట్టుచున్నది. కాని బి. యే పరీక్షలోఁ గృతార్థుఁడనై కుటుంబపోషణముఁ జేసికొనుటకు మంచియుద్యోగము సంపాదించుకొనువఱకు పెండ్లిచేసికొననని వారిద్దఱితో స్పష్టముగఁ జెప్పినాను.

బిందు—పాపము కాళిని జూచి యెన్నాళ్ళో యైనది. అదియును, నేను చిన్ననాఁట నెల్లప్పు డొక్కచోటనే యుండువారముగదా! ఇప్పుడధమపక్షము మూఁడు మాసముల కొకసారియైన నొకరినొకరు చూచికొనుట లేదు. రేపు వాండ్ర నిద్దఱను నే నేదోవీలు చేసికొని తప్పక చూచి తీరవలయును.

శర—సరే, మాయక్కయ్య యీమెను చూచుటకు నేను వెళ్ళవలె ననుకొనుచున్నది. మీ పెదబాబయ్యగారి యింటికి వెళ్ళితివా, అక్కడ నీవిద్దఱినిఁ జూడఁగలవు.

బిందు—అక్కడికే వెళ్ళుదును. మీయప్పను జూడవలెనని నాకెంతో యుబలాటముగా నున్నది. పాప మది యెన్నాళ్ళకో గాని రాదు. వచ్చుటకు వీలులేదు. ఏమంటే కుటుంబము పెద్దది. పైఁగా మగఁడు రోగిష్టి. ఆయన కేబదియవపడి వచ్చినట్లున్నది. చూచి చూచి మీయమ్మ కాళిని దానికంటె నిరువదియేండ్లు పెద్దవానికి రెండవపెండ్లి వాని కిచ్చినదేమిటోయి!

శర—ఆమాట నన్నడుగ కమ్మా? మాయమ్మ కాసంబంధము సుతరా మిష్టములేదు. వారు కులీనబ్రాహ్మణు లఁట! అందుచేత తమ సొమ్మంత పడిపోయినట్లు మాచుట్టములు పురోహితులుఁ జేరి మాయమ్మను మెడలు విఱిచి యీసంబంధము చేయించినారు. పాపము దానికర్మ మాలాగున నున్నది. అది మేఁకపిల్లవంటిది గదా. ముసలి మగఁడైనను దానంతే పెట్టి పుట్టినానని తృప్తి జెంది యుండునుగదా! అట్టిపెండ్లిచేసినందు కొకరిని పల్లెత్తిమాటాడదుకదా. మగనిమీఁద పరమభక్తికదా.

అంతట ముగియక యీసంభాషణ మితరవిషయములలోనికిం దిగెను. మిక్కిలి ప్రొద్దుపోయినదని శరచ్చంద్రుఁడు లేచి "వదినె చాల ప్రొద్దు బోయినది. నే నింటికిఁ బోయెదను. రేపు మఱల వచ్చెదను. రేపే కాదు నేనిక్కడ నున్నంతకాలము ప్రతిదినము వచ్చి మామిడికాయ పచ్చడి కొంచెము రుచి చూచి పోవుచుందును. మీరు కలకత్తా వచ్చినపక్షమున నేను సుఖముగా రాచబిడ్డవలె నుందు" నని పలికెను "ఆవిషయము ముందుముందు విచారించికొనవచ్చునులే అన్నిటికన్న ముందు రేపు మీయప్పను కలిసికొని యీ రాచబిడ్డగారికి మామిడికాయపచ్చడిలో నేలోట రాకుండజేసి పెట్టగల చిన్నిరాణిని దీసికొనిరమ్మని గట్టిగ నొక్కి చెప్పెద" నని చిఱునవ్వుతో బిందు ప్రత్యుత్తర మిచ్చెను. శరచ్చంద్రుఁడును మందహాసము చేసి వారికడ సెలవుగైకొని గృహమునకరిగెను.

అప్పటికిని సుధ మేలుకొంచనేలేదు. కలువపువ్వు నెక్కసక్కెములాడగల సామె ముద్దుమొగముమీఁదఁ జందమామ తనకిరణపుంజము ప్రసరింపఁజేసి సహజమైన యీమెలావణ్యమున కొకవింతలావణ్యముఁ దెచ్చెను. అక్కతోడ తలగడగా నిదురించుచు సుధ నిదురలోసహితము మందహాససుధారసముఁ జిలుకఁజేయఁజొచ్చెను.

శరచ్చంద్రుఁడు బయలుదేఱి మనసులో నెన్నెన్నో తలంపులు మల్లడిగొన నాక సమువంకఁజూచి నడుచుచు తనలో నిట్లు వితర్కించికొనెను. "నేను కలకత్తా లోనువర్ధమానములోను గొప్పకుటుంబములను గొప్పమేడలను మిద్దెలను నెన్నోజూచి తిని. కానియాచిన్ని తాటియాకులయింటిలో నున్నంతసౌఖ్యము, సంతుష్టి, విశ్వాసము నెందుంగనియెఱుంగ. ఆహాహా! ఆహేమచంద్రునిహృదయ మెంతదయాపూరిత మైనదో! ఆబిందు మన సెంత మెత్తనిదో! ఆమెపలుకు లెంతమృదువులో! స్త్రీ స్వభావమంతయు నీబిందురూపము దాల్చిన ట్లున్నది. ఆసుధముఖారవింద మెంత ముద్దులు మూటగట్టుచున్నదో! ఆమెమనస్సు నిష్కలుషముగదా! ఈసాధుజన ముతోఁగలసిమెలసి కొంతకాలము చరియింతునేని బంధుప్రేమయెట్టిదో యెఱుం గని నాకఠినహృదయ మించుక మెత్తపడి యనురాగాస్పదము కాకుండునా? ఏ వేడుకలులేక వట్టియెడారివలెనుండు నాచదువులగది విడిచి నిజమైన మానవగేహ మని చెప్పదగిన యీసాధుజనుల నిలయమునఁ బ్రవేశించి యెన్నఁడైన సుఖింతునే! ప్రాణములేనిబొమ్మవలెనున్న నాకు నిజమైన చైతన్య మెన్నఁడైనఁ గలుగునే!"

అశ్రితులు.

ప్రభాతకాలము తల్లిచేత సింగారింపఁబడి బయటకు బంపఁబడిన పెండ్లి కూఁతురువలె నుండునని వేదములలో వర్ణింపఁబడి యున్నది. ఆకాశలక్ష్మికిం గారాబుకూతురై తెల్లనిదువ్వలువ గట్టినట్లు వెలయుప్రభాతకన్య తనరాకచే నెల్ల చీకటులను దవ్వుగదోలి జంతుకోటికి నవనవచైతన్యమును గలిగించెను. ఈప్రభాత కన్యం బట్టికొని పాణిగ్రహణము చేసికొనుటకు నరుణారుణముఖుఁడైనసూర్యుడు, సప్తవర్ణము లనియెడు సప్తతురంగములం బూన్చినయరదము నెక్కి యకన్య వెనువెంట దగిలెనోయన దూర్పుదిక్కునం దోఁచె కాని యాతనిరాకఁజూచి సిగ్గు పడి యవ్వలకుం దొలఁగెనో యన ధవళప్రభాతకన్య యదృశ్యయయ్యె.

బిందు ప్రభాతకాలమున లేచి యిల్లువాకిలి చిమ్మి పెరటిలోనున్న దిగుడు బావిలో రాత్రి వంటజేసినపాత్రలు తోముకొనుటకుఁ బోయెను. ఆమెయాపనిలో నుండగనే యెవ్వరో వీధితలుపు తట్టిరి. అప్పటికి సుధకు హేమచంద్రుఁనకు మెల కువరానందున సగముతోమినపాత్రల దిగుడుబావిలోనే యుంచి బిందు తలుపు దీయుటకు బోయెను. ఆవచ్చినది కులమున బెస్తవాఁడై వృత్తిని సేద్యకాఁడైన సనాతనుఁ డనువాని భార్య. బంగాళాదేశమున బెస్తలను కైవర్తులని వాడుదురు. ఈకైవర్తస్త్రీని బిందు చిన్ననాఁట వరుస కక్కయ్యా యని పిలుచుట కలవాటు

పడుటచే నప్పుడును "అక్కయ్యా! ప్రొద్దుననే వచ్చితి వేమమ్మా? ఆచేతిలోని దేమిటి" యని పలుకరించెను. అంతట వారికీ క్రిందిసంభాషణ జరిగెను.

కైవర్తస్త్రీ—ఊరక వచ్చినాను. నాచేతిలోనిది మఱేమిలేదమ్మా! మిమ్మునుజూచి యెన్నాళ్ళోయైనది గనుక నొకతూరి యీవేళ ప్రొద్దున్న జూడాలని నిన్నటి మాపనుకొన్నాను. వచ్చునప్పుడు వట్టిచేతులతో రానేల నని మన సుధకు పెరుఁగిష్టము గనుక గట్టిపెరుఁగు తోడుపెట్టి తెచ్చినాను. చిన్నమ్మాయి లేచినదా?

బిందు—లేవ లేదు. అక్కయ్యా! నీవెప్పుడు మాకోసమేదోకష్టపడి తెచ్చిపెట్టుచునే యుందువు. మీరుమాత్రము డబ్బున్నవాళ్లా! చేయునది సంసారము గదా. ఈలాగున మాటిమాటికి తేబోకమ్మా! పుచ్చికొనుటకు మాకు యెంతో గష్టముగా నుండును.

కైవ—ఇదేమంతభాగ్యమమ్మా! వరాలా మాడలా. ఇవి మాయావుపాలే కాని డబ్బుపెట్టికొన్నవికావు. అందులోకొంచెము తోడుపెట్టి మీకిచ్చినంత మాత్రాన నా సొమ్మంతయు పోవునా? మీనేల దున్నుకొని బ్రదుకుచున్నాము గదా తల్లీ! మాయావుమీదే. మాయిల్లుమీదే. మావన్నియు మీవే. ఈలాటివి మీకు లేకపోతే మఱెవరి కిచ్చికొందుము. మీరు కామందులు మేము పాలికాఁపులము.

బిందు—అంతభక్తితోఁ దెచ్చినప్పుడు వద్దనగూడదులే! అమ్మా! ఉట్టిమీఁద పెట్టి భోజనము చేయునప్పుడు పోసికొందుము. అక్కయ్యా! నీవు పెరుఁగు తోడు పెట్టిన ట్లెవ్వరును పెట్టలేరు. నీపెరుఁగంటే సుధ కెంతో యిష్టము (అని మొగముజూచి) ఇదేమిటక్కయ్యా! కన్నులు తడిగా నున్నవి. ఏడ్చుచున్నావా యేమిటి?

సానాతనునిభార్య యిదివర కెందుకో లోలోపల విచారించుచునే యుండెను. బిందు కారణమడుగఁగానే యది వెల్లివిరిసి పొంగెను. చేరకొంగుతో నామె కన్నీరు కొంతవఱకుఁ దుడిచెను గాని ప్రవాహ మాగలేదు. అదిచూచి బిందు మగలఁ "యే మక్కయ్యా ఇది! సానాతనుఁడు నెమ్మదిగా నున్నాఁడా" యని యడిగెను. అంతట నీక్రిందిసంభాషణ జరిగెను.

కైవ—ఆయనకేమి! ఆయన సుఖముగానే యున్నాడు.

—మీపిల్ల నెమ్మదిగా నున్నదా! అమ్మా!

—మీదయవల్ల పిల్ల బాగానే యున్నది తల్లీ!

బిం—అందఱు సెమ్మదిగా నుండె ప్రొద్దున్నే యీదుఃఖమెందుకమ్మా! అంత యేమిమునిఁగి పోయినది.

కైవ—మఱేమి లేదమ్మా! చీఁకటితోన మనఘోషుగారి యింటికి వెళ్ళి నాను అక్కడ—ఏమి చెప్పనమ్మా! (అని గద్గదకంఠముతో నేడ్వజొచ్చెను.)

బిం—అక్కడ నేమిజరిగినది? యెవ్వరైనాఁ దిట్టిరా కొట్టిరా?

కైవ—తిట్టుటయుఁ గొట్టుటయు నేమెవరిసొమ్ము తిన్నామని నామగఁడెంత తెలివిమాలినవాఁడైనను మీదయవల్ల నెముటూడ్చి కష్టపడి నాకింతగంజి తెచ్చి పోయగలఁడు. మే మెంత లేనినాళ్ళమైనను కొంచెము పరువుమరియాదలకోసము తంటాలు పడు చుందుము కనుక నెవరిచేత మాటలు పడము.

బిం—(మగఁడు తెలివిమాలినవాఁడని కైవర్తస్త్రీ చెప్పినందుకు చిఱునవ్వు నవ్వి) అయితే నీ కీయేడు పెందుకమ్మా పోనీ నిన్ను మగఁడుతిన్నఁగా జూచుట లేదాయేమిటి?

కైవ—ఆడిజిమ్మడా! నన్నుతిట్టడమే! నన్నుతిటితే ఆడికొంప సూసేవో రెవరు పొయిలో అగ్గేసేవో రెవరు. కంచములోకి కుంబంరావద్దూ! నే లేకపోతే ఆడీపాటి కేవల్లకాట్లో యుండునో! ఆమనన్ను తిట్టి పాణాలతో బతికిపోడమే గోకలుచ్చుకొని దుమ్ముత్తిరగ మొడవను!

బిం—(మరల చిఱునవ్వు నవ్వి కొంచెము కఠినముగా) అయితే నీబుడిబుడి దుఃఖమునకుఁ గారణ మేమిటమ్మా! ప్రొద్దున్నేయేడువ పలసినంతపుట్టేమి మునిగినది.

కైవ—ఏమి లేదమ్మా! యేమిలేదు. ఆగోసుగారియింటికాడికి ప్రొద్దున్నే యెల్లినప్పుడు—అయ్యో నాకర్మమూ! యేం జెప్పనుతల్లి.

బిం—(విసుగుతో) నీయిష్టము వచ్చినంతసేపేడు. సంగతిచెప్ప విదేమి పాపము. అవతల గంపంతపనియున్నది. నేను నీతోఁ నిలిచియుండుటకు వీలులేదు ఇత్తడిసామానులు కడతేఱ తోమలేదు. పాలు దాలిమీఁద పెట్టలేదు. పిల్లలు లేవగానే పాలు పాలని పోరుపెట్టుదురు. మాయసోడ యెంతకు తెమల్చవైతివి.

అంతలో సుధ మేలుకాంచి యప్పుడప్పుడే వికసించిన తామరపువ్వు చందమున విలాసమును వెదజల్లుమొగముతో నచ్చటికిఁబోయి తన యక్కప్రక్క నిలిచెను.

బిం—(సుధతో) అమ్మాయి! ఇంత పెందలకడ లేచినావే! ఇదిగో మన బెస్తక్కయ్య నీకోసము గట్టి పెరుఁగు ముంతలోఁ దోడుచ్చినది.

ఆవకన్నములోఁ బోసికొందువుగాని, నేను వెళ్ళి పొయిరాఁజవేసికొందును. పిల్లలు లేచువేళ యైనది.

ఆపలుకులు విని సుధ యాపెరుఁగుముంత లోనికిం దీసికొనిపోయి యుట్టి మీఁదఁ బెట్టి పరుగుపరుగున దిగుడుబావికిం బోయి తన యప్ప సగము తోమి విడిచిన పాత్రలం గడుగఁబూనెను. ఇక్కడ బిందు సానాతనునిభార్య చెప్పెడు గొడవ తెమలనందున విసికి లోనికింబోవఁ దలఁచి మెల్లఁగ మొగ మాపలకుఁ ద్రిప్పుచుండ నంతలో బెస్తయిల్లాలు కన్నులనీరు తుడుచుకొని గొంతు సవరించికొని "అప్పయ్యగారూ! నేనన్నమాట నిజమే నాండి" యని యడిగెను.

బిం—ఏమిమాట ?

కైవ—నేను గోసుగారియింట్లో విన్నమాటమ్మా !

బిం—అక్కడ నేమి విన్నావు ?

కైవ—అయితే నేవిన్నది నిజమే నమ్మా. ఈమాట విన్నానికే కామోసు దిక్కుమాలినబతు కిన్నాళ్ళు బతికినాను అయ్యో! అయ్యో! ఎంతపాపమమ్మా! మన సుధమొగము జూడకుండ నేనొక్కపూటుండ గలనా ?

అని మఱేమియు బలుకక యాబెస్తయిల్లాలు మహోపద వాటిల్లిన ట్లెలుగెత్తి హోరున నేడ్వసాగెను. ఈగోడనధ్వని నిద్రించుచున్న హేమచంద్రుని గదిలోనికి గొప్పభూకంపధ్వనివలె వినఁబడినందున నతఁడు కళవళము నందుచు మేలుకాంచి చివాలున లేచి తొట్రుపడుచు గది వెడలి వచ్చి బిందుం జూచి "ఆమనిషి యెందు కట్లు పెద్దపెట్టున నేడ్చుచున్న" దని యడిగెను. "ఎందుకు లేదు. ఆవిడ యెక్కడనో యేదో చెడుమాట విన్నఁదట. దానికై యేడ్చుచున్న" దనిబిందు భర్తకు ప్రత్యుత్తరము చెప్పెను. అది విని హేమచంద్రుఁడు పల్లెయిల్లాలిం జూచి "యేమియాపద మూఁడినది. నీ వేమి చెడుమాట విన్నావు. మావాండ్రందఱు నెమ్మదిగా నున్నారా?" యని యడిగెను. అనవుడు నాకైవర్తకాంత దుఃఖము నాపి కన్నీరుఁ దుడుచుకొని మగవారి యెదుట నట్టితలతో నిలుఁగూడదు గావున చీరచెఱఁగు మేలిముసుంగు వైచికొని వినయమునఁ దల యించుక వంచి దండము పెట్టి మెల్లగఁ "బాబయ్యగారూ! అంతా కులాసాగా నున్నామండి. ఇబ్బంది యేమి లేదండి. ఏదో పాడుమాటొకటి చెవిని బడినదండి. అది నిజమేమో కనుగొందా మని, అప్పయ్యగారికాడికి వచ్చినానండి" యని బదులు చెప్పెను. అది విని బిందు భర్తతో "ఆపాడుమాట

రేమిటో చెప్పుమని నేనరగంటనుండి పీకికొని తినుచున్నను, ఆవిడనోటనుండి యామాట చెప్పించుటకు నాతాతతర మైనది కాదు. మీరు చెప్పించఁ గలరేమో చూడండి" యని పలికెను.

అనవుడు హేమచంద్రుఁడు నవ్వుచు "ఆఁడవాండ్రగొడవ లాఁడ వాండ్రకే గాని మాకు దెలియవు. మీసోదెలు మగవాండ్ర కర్థములే కావు. రాత్రి మన మనుకొన్న సంగతులం గూర్చి మాటలాడుటకు నేనిప్పుడు శరచ్చంద్రుని యింటికి పోవుచున్నా నని యక్కడ నిలువక మెల్లఁగ నావలకుఁ పోయెను. అనంతరము బిందు కైవర్తి లీతెఱంగున మాటలాడిరి.

కైవ—అదిగో! అదిగో! నేను విన్నమాట నిజమే; బాబయ్యగా రక్కడికే పోవుచున్నారు.

బిం—(కోపముతో) నీకీవేళ దయ్యము పట్టినదా యేమి? ఎన్నఁడు లేనిది యీలాగున మాటాడ నారంభించినా వేమి? నీవేమిమాట విన్నావో చెప్పరాదూ?

కైవ—అప్పయ్యగారూ! ఈయాల పొద్దున్నే గోనుగారి యింటికాడి కెళ్ళి అక్కడె యిన్నానండి.

బిం—అబ్బబ్బా! చంపు చున్నావు గదా! ఏమి విన్నావు. ఆడుగ లేక నోరుపడుచున్నది.

కైవ—చెపుతా నప్పయ్యగారూ! కోపపడ కండి. బుద్ధి నేరనివాళ్ళము. గోనుగారియింట్లో నౌకరు—ఆడి జిమ్మడ! ఆడి మొకంమండా! ఆడి కేంపోయ్యె కాలమో కాని ఆడు చెప్పినాఁడు. ఆ మాటినఁగానే నాప్రాణం కెత్తింది. నాగుం డిప్పటికి దడదడ లాడుతోంది. చూడం డప్పయ్యగారు. అబద్ధ మేమో చూడండి.

బిం—అమ్మా! నీగుండె దడదడలు చూచుటకు నాకువ్యవధి లేదు. నేను వంట జేసికొనవలెను. (అని లోనికిఁ బోవుటకుఁ గిరుక్కున మఱలెను.)

కైవ—(బిందుచీరకొంగు బట్టికొని) వద్దప్పయ్యగారు కోపమువద్దు ఏమో మన నుండబట్టక మీమీ దాపేచ్చమూలాన్ని, ఆమాటనిజమేమో కనుక్కుందు కొచ్చినాను. మఱొకటేను నాకు కావాలాఅప్పయ్యగారు. చిన్నమ్మాయిగారి నొక్కపూట సూడకపోతే కడుపులో యెల్లాగో నుంటది.

ఆమాటలు వినక బిందు తనదారిం బోవు చుండెను.

కైవ—(చీరకొంగు వదలకయె కూడ బోవుచు) అప్పయ్యగారు వినండి. వినండి. గోనుగారినౌకరు—ఆణ్ణిమోసుకుపోను. ఆణ్ణోట్లోనిప్పు లొయ్య. ఆఁడి కొడుకునోట్లో నిప్పు లొయ్య. ఆఁడికోడలునోట్లో నిప్పులొయ్య. ఆఁడిల్లు దిబ్బగాను. ఆఁడు చెప్పినాఁ డమ్మా!

బిం—వినిపించుకొనకయె వంటసాలకు జనియెను.

కైవ—నే పుట్టించినమాట కాదమ్మా యిది! ఈలాటిపాడుమాటలు ఆఁడు చెప్పాలి కాని మఱెవరు చెప్పగలరు? మీరు మంచోరు మీ రాలాంటి పనులు చెయ్యరనుకొని నేను నమ్మ లేదు.

బెస్తయిల్లాలు తనవెంట నంటి రా బిందు వంటయింటిలోనికిం జనియెను.

కైవ—అప్పయ్యగారూ ఆమాయచచ్చినోఁడు యీలాగన్నాడండి. మీరంట మమ్మందఱిని యిక్కడ దిగబెట్టి కలకత్తా కాఁపురమెల్తారంట; అమ్మాయిగారూ యీ చేతులతో పెంచినానుకందా మిమ్మల్ని. కంటిసూపు నోటిమాట లేకుండా యెల్లిపోతా రామ్మా? చిన్నమ్మాయిగారికి నాపేరు గన్నా నేనన్నా పాణంగందా! ఇఁక నే నెందుకు నా పెరుఁగెందుకు?

బిం—(ఆమె ప్రాణము విసిగించినందు కించుక కోపించినను మూర్ఖతకు చిఱునవ్వు నవ్వి) ఈమాట చెప్పుటకేనా అప్పా! ఇంతసేపు యెముకలు కొఱికినావు. ఈమాత్రపుదాని కింతయేడు పెందుకు? వెళ్ళుటో మానుటో యిప్పటికి మాలో మాకే తేలలేదు. నిన్నరాత్రి శరచ్చంద్రుఁడు వచ్చి కలకత్తా రమ్మని పిలిచినాడు. వెళ్ళుటంటే మాటలా? అక్కడకర్చునకు సంసారము గుల్లయగును. మేము భాగ్యవంతులము కాముకదా.

కైవ—"అక్కయ్యా! ఛా? మంచివాళ్ళు మరేద గలోరు కలకత్తా యెల్తారా? అక్కడవర్ణం, ఈవర్ణం, అనితేడా లుండవంట. మంచి చెడ్డ ల్లేవఁట మాలమాదిగ తురకదూదేకులు బ్యామఁడు అంతాసంకర మంట గాదు. అమ్మ మీఁది బంగారమంటిల్లు. చల్లగ యిక్కడే వుండు తల్లి. ఆగోను బాబయ్యగా రెక్కడికైన యెల్తారు. ఆయనకేమమ్మా? పెళ్ళమా బిడ్డా? ఆయన తెల్లోళ్ళ యిసుకోలులో సదువుతున్నాఁ డంట. ఆసదు వవగానే సీమ కెల్తా డంట. అయ్యాదేవుఁడా! ఆలా గెళ్ళినోరు తమరు సల్లరుగుంటూరు ఉన్న సుట్టాలగొంతులమీఁదికి తెస్తారు. అమ్మా! సీమ యెక్కడుంది? గంగ దా టెల్లాలా, లంక దా టెల్లాలా?

బిం—సీమ వెళ్ళవలసినవారు చాలసముద్రములు దాటవలెను. గంగ దాటి లంకదాటి యింక బయుకి వెళ్ళవలెను.

కైవ—ఓలమ్మా! గంగమ్మతల్లి కెరటాలు దాటి బతగడమే! లంక దాటెల్లిన మనిషి మళ్ళీ బతి గొత్తాఁడా! ఒచ్చినా, ఆళ్ళు రాచ్చసులై యొత్తారంట ఒచ్చి నోళ్ళ మణుసుల్ని బతి గుండగానే పీక్కు తింటారంట గాదూ. అవు నవును. గోసుబాబయ్యా సీమెళ్ళకేంజేత్తాఁడు. ఆయనకు పెళ్ళమా బిడ్డా నాతల్లి. ఈకొంపకి నీవు మాలచ్చిమిలా గున్నావు. ఈయూరొదిలి పెట్టి యెల్లకమ్మా, కొంపకని పెట్టుకుండు.

బిం—ఆనక మళ్ళీరమ్మా. తరువాత మాటలాడ వచ్చును.

కైవ—అల్లాగే మామ్మా! సూతుండి అమ్మాయిగారు బోశేశినతరువాత పెరుఁగెల్లా గుందో సెప్పండి.

బిం—అలాగే.

కైవ—(కొంతదూరము పోయి మరల వెనుకకుఁ దిరిగి వచ్చి) అప్పయ్యగారూ! యీయింటికి మాలక్షింవి. కూంత నామాట గేపకముంచుకొని యిల్లొదిలిపెట్టి యెల్లకమ్మా.

బిం—అది మన మాలోచించుకొన వచ్చునులే. మేము వెళ్ళుటనుగూర్చి యింకానిశ్చయము కాలేదు. వెళ్ళినను గొన్ని నెలలేకాని యెల్లకాల మక్కడ నుండము. కోఁతలనాటికి తిరిగి వత్తుము. ఈయిల్లు విడిచి మేముమాత్ర మెక్కడికి పోగలము.

అట్లు బిందు తమ కలకత్తా ప్రయాణము నిశ్చయములేదని నాలుగైదు సారులు ధ్రువముగాఁ జెప్పినపిదప నాపల్లెయిల్లాలు మనశ్శాంతి గలిగి మెల్లఁగా నరిగెను. ఆదినముననే హరిమతి యను పేదగొల్లముసలిది వితంతువగు తనకోడలను వెంటఁబెట్టుకొని బిందుంజూడవచ్చెను. ఆముసలిదానికొడుకు బ్రతికియున్నప్పుడు వాండ్రకు గొంతభూమి కొన్నిపశువులు నుండెను. అప్పుడు పాలు పెరుఁగు లమ్ముకొని వాండ్రు సుఖముగాఁ గాలక్షేపము సేయుచువచ్చిరి. హరిమతికుమారుఁడు మృతినొందుటఁజేసి యాఁడువాండ్రిద్దఱు నేలమున్నుకొనలేక యితరుల కమర్చిరి. పాలికాఁపులు వాండ్రకిచ్చుశిస్తు మిక్కిలిస్వల్పము. ఇల్లు గడవక నొకదానివెనుక నొకటిగఁ బశువులనన్నింటిని వాండ్రమ్ముకొనిరి. చివర కొకటిరెం డావులు మిగిలెను అందుచేత నత్తకోడండ్రిద్దఱు బిందుగృహమునకువచ్చి బిడ్డలజబ్బుచేత గాని మఱియేకారణముచేత గాని యామెపనిఁజేసికొన లేనప్పుడు పనియంతయుఁ

Premchand Rao

జేసిపోవుచుందురు. బిందు వాండ్ర పేదతనము తీరునంత సాయము చేయలేకపోయి నను బంటలసమయమునఁ వాండ్రను మఱచిపోక చేతనైనసాయముఁ జేయుచు వచ్చెను. ప్రాఁతబట్టలే నైననున్నయెడల బిందు చలికాలము ముసలిదియు నామె కోడలు గప్పుకొనుటకు జాగ్రత్త పెట్టుచుండును. అత్తకోడండ్రలో నెవరికి రోగము వచ్చినను బిందు కనికరము పెంపున వారికి సగ్గుబియ్యము పటికబెల్లము సామాన్యములైనమందులుఁ బంపుచుండును. సాధారణముగ బీదవాండ్రు మిక్కిలి చిన్నయుపకారములకు సైతముఁ గృతజ్ఞులైయుందురు. కావున గొల్లముసలిదియు బిందు తనయెడ నప్పుడప్పుడు చూపుచు వచ్చినదయను నభిమానమునకుఁ గృతజ్ఞత కలదైయుండి బిందు కలకత్తా బోవుననువార్త నామెయువిని చూడవచ్చి కొంతసే పామె ప్రక్కం గూర్చుండి వెక్కివెక్కి యేడ్చెను. బిందు హరిమతినోదార్చి కోడలి కొక ప్రాఁతచీరనిచ్చి వారినిఁ బంపివైచెను. హరిమతిచనినవెనుక నాయూరి సాలెవానిభార్య వచ్చెను. ఈమె వికారరూపముగల దగుటచే మగఁడామెను సరిగ నొల్లక పోయెను. దానికిం దోడుగ నామె యెల్లప్పుడు రోగముఁ గలదై బలహీనురాలై పనిపాటలు సరిగాఁ జేయలేకపోవుటచే నత్తగారెప్పుడు దిట్టి పోయుచుండెను. కడచినశీతకాలములో నడుములో నొప్పిబయలుదేఱినందున నామె చెఱువునకుఁబోయి నీరు తేజాలదయ్యెను. అందుకుఁ గోపించి యత్తగా రామెను గొట్టెను. ఏమియుం దోఁచక యామె యపుడేడ్చుచు బిందుకడకుఁబోవ కృపారసపూరితయగుబిందు మందులు తెప్పించి వేయలేకపోయిన నేదో తైలముఁ దెప్పించి యామె నెండలోఁగూర్చుండబెట్టి యాతైలము నడుమునకుఁ గొన్నిరోజులు మర్దనముజేసెను. ఆరోగ మాచికిత్సతో నుపశమించెను. సాలెపడంతి యాయుప కారమును మఱవక బిందునెడ జాలవిశ్వాసముగలిగియుండి యామె గ్రామము విడచిపోవునని వినివచ్చి యేడ్చెను. ఆమెయేడ్చిపోయినపిదప హీర యను నొక బోయజాతియాఁడుది వచ్చెను. హీర మగఁడు పల్లకులమోసి కావలసినంతడబ్బు గడించుచుండును. కాని తెగత్రాగి యాసొమ్మెల్లఁ బాడుచేసి యింటికిఁబోయి పెండ్లామును బాదుచుండును. ఆకథవిని బిందు జాలినొంది భర్తతోఁ జెప్ప నతఁడు బోయి దానిమగనిం బిలిపించి చీవాట్లుపెట్టెను. అదిమొదలుకొని వాఁడు భార్యను మునుపటంతగా బాధపెట్టుట మానెను. అందుచేత హీర బిందు పేరుఁ జెప్పిన మ్రొక్కుచు నామెయెడ గడుకృతజ్ఞతగలదై యుండెను. ఆమెయు బిందు ప్రయా ణమునుఁగూర్చివిని తనపసిబిడ్డ కొక క్రొత్తగుడ్డఁ జుట్టబెట్టి యాబిడ్డనెత్తుకొని బిందువద్ద సెలవుపుచ్చుకొనుటకువచ్చి మీదయవల్ల యీతూరి నాలుగురూపాయలు వెనకేసుకొని యీయేడిల్లు నేయించుకొన్నాము. పుట్టిదానికి కొత్తరుమాలు కొను

కున్నాము. మీరెల్లకమునుపు దీవించుండమ్మా! నన్ను బిడ్డని దీవించుండని వేడికొనెను. బిందు తల్లిని బిడ్డను దీవించెను.

శేషియను బ్రాహ్మణస్త్రీ భామయను శటగోపస్త్రీయు శ్యామయను గోరి స్త్రీయు మోహమాయ యను చాకలిదియు నింక నిట్టి పేదవాండ్రు చాలమంది బిందుదర్శనముఁజేసి యామె తమ్ము విడిచిపోవునని విచారించిరి. పాపము బిందు వాండ్ర నందఱ నోదార్చి పంపివేయవలసివచ్చెను. ఆగ్రామములో బిందు కుటుంబముకన్న భాగ్యవంతములైనకుటుంబము లనేకము లున్నవి కాని దురదృష్టవంతులు పేదవాండ్రునగు నిరుగుపొరుగువాండ్రమీఁద నీభార్యాభర్తల కున్నంతకనికర మాయూరిలో నెవ్వరికినిలేదు. ఇంచుకదయ గవ్వంతయభిమానముఁగలమనుష్యుల యందు భయభక్తులుండుట లోకమందంతటఁగలదు. హిందూదేశమున నీవిధమైన యనురాగము మఱింతయెక్కువగఁ గనఁపడుచున్నది.

ఆఱవ ప్రకరణము.

చిన్ననాఁటి నెచ్చెలులు.

సాయంకాలము బిందు పెద్దతల్లిగారియింటికిఁబోయి యచట సుమను, గాళిని గలిసికొని కౌగలించికొనెను. మున్ను చిన్నబిడ్డలయి యాడుకొన్న యామువ్వురిప్పు డత్తింటికోడండ్రై వేఱువేఱు గ్రామముల వసించుచున్నను వారిహృదయములనుండి పిన్ననాఁటిప్రేమతొలఁగిపోలేదు. చాలకాలముఁ గడచినపిదప నొండొరులఁగలిసికొన్నందున నాముగ్వురు నాసాయంకాలము ప్రొద్దుపోవువరకుఁ జిన్ననాఁటిముచ్చటలను, ప్రస్తుతపుగృహకృత్యములను గష్టసుఖములను జెప్పుకొనిరి. కాళి నల్లనిమేనుకలదై సార్థకనామధేయయైయుండెను. ఆమెమొగము సుందరముగానుండెను కాని విచారములు, మనోవ్యథలు, నామెవయస్సు చిన్నదైనను ముఖలావణ్యమును దగ్గించెను. ఆమెకన్నులు కొంచెము గుంటలుపడియుండెను. ఆమెసన్నని చేతుల బంగారుమురుగులజతయుండెను. మృదువైనయామెకంఠమును శుద్ధసువర్ణమయమైన పట్టెడ యలంకరించెను. అప్పు డామె సాధారణమైనచీరఁ గట్టుకొనెను. ఆమెసహజముగఁ బలుచనిదైన తనతలవెండ్రుకలను సాఁదు ముడిగా

జుట్టుకొనెను. కాళి గడుసుదనము విశేషముగా నెఱుఁగనిసాధుస్వభావము కలది. ఆమె ప్రతిదినము గృహకృత్యమంతయు స్వయముగాఁజేసికొనుచు రెండుసారులు మాత్రమే భుజించుచు దైవవశమున వచ్చెడికష్టములను శాంతముతో సహించుచు జనసమ్మతవర్తనముఁగలిగి కాఁపురము సేయుచుండెను. అంతట నా చెలికత్తెలు మువ్వురకు నీక్రిందివిధమున సంభాషణముజరిగెను.

బిం—కాళీ! ఎంతకాలమైనదే నిన్నుఁజూచి.

కాళి—బిం దక్కయ్యా! ఇంతకంటె తఱుచుగా మనమేలాగున కలిసికొనఁగలము. పెండ్లికాఁగానే నేను వర్ధమానమువెళ్ళి యత్తవారియింటనే యుంటిని. పుట్టింటి కెప్పుడోగాని నన్నురానీయరు.

ఉమ—ఎందుచేతనే? నేను ప్రతిసంవత్సరము దుర్గపూజనాటికి పుట్టింటికి వచ్చుచునేయున్నాను.

కాళి—ఉమా! నీసంగతివేఱు. నీకుమాకుసామ్యమా. ధనపురములో నీకు గావలసినంతమందినౌకరులున్నారు. ఇంటిపని నీవేమీ చేయనక్కఱలేదు. సవారీలోఁగూర్చుండి హాయిగ వచ్చెదవు నీ కేమమ్మా! నీలాగు మాకేలాగున సాఁగఁగలదమ్మా! మాది పెద్దకుటుంబము. మావారు, మఱఁదులుఁ గలిసియున్నారు. తెల్లవాఱితే బోలెడుచాకిరి. నేను లేకపోతే పని యేలాగునజరుగును. ఇప్పుడు నేను వచ్చువఱకు పనిచేసిపెట్టుమని మాయాఁడబిడ్డను బతిమాలుకొన్నాను. ఏలాగుననో దయఁదలఁచి యావిడ యొప్పుకొన్నది. కొద్దిరోజులు గనుక నామె చేసిపెట్టును కాని చాలకాలమైన నామె యంగీకరించునా?

బిం—కాళీ! మీకగ్రహారములు భూములు నున్నవని విన్నాను. వాటిమీఁద మంచిరాఁబడియున్నదఁటకామా. మీయాయన కెన్నోగుఱ్ఱపుబండ్లున్నవట. అన్నిబళ్ళుపెట్టినయాయన యింటిలో నౌకరుల నెందుకుపెట్టఁగూడదు?

కాళి—బిం దక్కయ్యా! నౌకరులనుబెట్టి పనిచేయించుట మొదటినుండి యాచారములేదు. మాయత్తగారు చాలనిష్ఠకలవారు. వంటలక్కలు వండినవంటలు తినరు. నౌకరు లేవస్తువు ముట్టుకొనుటకువల్లకాదు. నౌకరులుచాలమందియున్నారు. వాళ్ళుకచేరీచావడిలోను, మావారిదగ్గఱపనిచేయుచుందురు. ఇంటిలోపలి పనినంతయు మాయింటికోడండ్రే యుదయము మొదలు సాయంకాలమువఱకుఁ జేసికొనుచుందురు. అదిగాక మీరనుకొన్నంతరాఁబడికూడ మాకులేదు. కర్చుబోలెడు. అప్పులుగూడ నగుచున్నవట. ఏమో లోపలపడియుండి యివి యెప్పుడైనను ...యేగాని మే మెఱుంగుదుము.

బిం——మీయాయన దొరలకు పెద్దపెద్దవిందులుచేసి చేసినప్పుడెల్ల మిక్కిలి డబ్బుకర్చుచేయుచుండుటకాదూ. అప్పులగుచున్నయెడల కర్చులు తగ్గించుకోరాదూ. నీ వామాత్రముసలహా మీవారికిఁ జెప్పలేవంటే.

కాళి——ఈలాటి వ్యవహారములలో నే నేమిటి, యాలోచనచెప్పుట యేమిటి. ఆయన కుటుంబయజమాని. నేనో, యొదిగియొదిగి యుండవలసిన కోడలను. అటువంటిసంగతులగుఱించి యాయనతో నోరెత్తి మాటలాడఁగలనా? మేనత్తలు చాల సారులు కూకలవేయగా విన్నాను. వాళ్ళమాట లక్ష్యమా ఆయనకు ?

బిం——అయితే మీవా రేమంటారు?

కాళి——అనుట కేమున్నది? కుటుంబము చాలగొప్పది. పేరుప్రతిష్ఠలు కలది. మనము వెనుకటి యన్నదానములు, నిష్ఠలు జరుపుటయే గాక గౌరవము నిలబెట్టికొనఁ దలఁచుకొన్న, వైభవముతో విందులు మొదలగునవి చేయుచుండవలె నని యాయన చెప్పుచుందురు. బిం దక్కయ్యా! నీ వెఱుఁగుదువో లేదో కాని, దొరలకాయనంటే ఎంతో యిష్టము. దొరలు ప్రతి కమిటీలోను మాయాయనను వేయుదురు. ఆయన లేని కమిటీ యీ యూర లేదఁట. ఆయన ప్రతిదినము నుదయమున సాయంకాలమున వారినిఁ జూడఁబోవు చుండును. అన్నివిషయములలో వా రేలాగునఁ జెప్పిన నాలాగునఁ జేయుచుందురు. అందుచేత దొరలు మావారిని బూర్వకాలఁపు పెద్దమనుష్యులని మెచ్చికొను చుందురు.

బిం——మీవా రస్తమానము దొరలనే జూచు చుందు రంటివి కదా. మఱి యింటి వ్యవహారము చూచువా రెవరు ?

కాళి——చూచువారు లేకేమి. మాయత్తగారు లేరూ? ఆవిడ డెబ్బది యేండ్ల దైన నిప్పటికి నడుము వంగ లేదు. తాటిచెట్టులాగున నిప్పటికి నిటారుగా నున్నది. ఇంటివ్యవహారములు చక్కబెట్టుటలో నామె కున్న యోపిక, యీపదుమకారులో నెవ్వరికిని లేదు. ఆవిడదే పెత్తనము. ఆవిడ మాటేమాట. అంతయధికారి మావిడదే. మావారి మేనత్తలు ధైర్యమైనవారె కాని మాయత్తగారి మాటంటే గడగడలాడుదురు. ఇఁక కోడండ్రము మామాట చెప్పనేల? ఆమెను మేము పూజింతుము. ఆమె పెత్తనముచేత నింటివ్యవహార మంతయు గడియారములాగున సరిగా జరుగుచుండును. గడియరాత్రి యుండఁగానే

యావిడ శీతాకాలమైనను సరే వర్షకాలమైనను సరే చన్నీటస్నానము ట్టు చీరఁగట్టికొని జపము తపము పూజయు రెండుగంటలసేపు చేసికొనును. ఆమె లేచినవెనుక మేము నౌకరులు లేచి యెవరిపని వారు చేసుకొను చుందుము. ప్రొద్దు పొడుచునప్పటికి నీళ్ళు తోడువాండ్రు, వాకిలియూడ్చువాండ్రు, పొయిలో నిప్పువేయువాండ్రు గజగజ లాడుచు బనులు చేయుచుందురు. ఆవిడ జపము చాలించి పిల్లలకుఁ జల్దియన్నములఁ బెట్టించి నౌకరుల కన్నములఁ బెట్టించి వంటలుచేయించి మగవాళ్ళభోజనమైనతరువాతఁ గోడండ్రనన్నములు తినుఁడని చిట్టచివర నామె భోజనముచేసి మధ్యాహ్నము కొంచెముసేపు పరుండును. మధ్యాహ్నము నిద్దుర లేచి మరల సాయంకాలపుఁబనిఁ జేయించి యందఱుఁ దిని పండుకొనువఱకు నెంతరాత్రియైన నామె నిద్దురపోదు. ఇంటిలో నేది యెవరికిఁ గావలసిన నది యామె నడుగ వలసినదే. మావారు తల్లి యెంత చెప్పిన నంత. ఆవిడగీచినగీటు దాటరు. ఇంటిలో నొకసంతర్పణ గానీ సమారాధన గానీ పెండ్లి కానీ మంచికానీ చెడ్డకానీ యేదైన నావిడచేతి మీఁదుగా జరగవలసినదే.

బిం—డెబ్బదియేండ్లు దాఁటినయావిడ యింతపనిఁ జేసినదంటే చిత్రముగానే యున్నది. ఆవి డెవరో యసాధ్యురాలు లాగున్నది.

కాళి—బిం దక్కయ్యా! నీవు వేళాకోళముచేయు చున్నావుకాని యాలాటి యావిడ మనదేశమున నెక్కడను లేదు. ఆవిడపూర్వకాలపుమనిషి. పూర్వపువాళ్ళు పాళ్ళు పంపుళ్ళు లేకుండ నొక యింటనే గలిసియున్నపు డీలాటి పెద్దవాండ్ర చేతిమీఁదుగా సంసారములు జరుగుచుండునవి. ఇప్పటివాండ్రు నాలుగురూపాయలు తెచ్చికొనుటకు శక్తి రాగానే తమపెండ్లాములఁ దాము వేరింటికాపురములు పెట్టి కుటుంబములోనుండి విడిపోవుచున్నారు. దేశములో విభాగములుకాని కుటుంబములు నూటి నాటి నొకటి రెం డెక్కడనో మా కుటుంబములవంటివేయున్నవి. కాని తఱుచుగా లేవు.

ఉమ—అయితే మీవారి మేనయత్త యీవిడయధికారమునకు లోబడి యున్నారా?

కాళి—ఉన్నారుమఱి. ఒకతలపెత్తనము లేకపోతే సంసార మేలాగున జరుగును? పెద్ద మేనత్త మంచిది. ఏగొడవలజోలికి రాదు. తక్కినయిద్దరు ఒకొక్కప్పుడు గుమగుమ లాడినను మాయత్తమాటప్రకారము నడిచి తీరవలయును,

మూడవయావిడ కొంచెము కోపధారి. అత్తగారికంటె నావిడకే మేమందఱ మెక్కువ జడియుదుము.

ఉమ యీమాట కుత్తరము చెప్పక కాళి యత్తవారింట వంటయింటిలోఁ దానుండినపక్షమునఁ బనిచేత, జనసమ్మర్దముచేత నూపిరి సలుపక తాను బాధ పడ వలసియుండునని మనస్సులో ననుకొనెను. ఉమ హిందూసుందరి యయ్యు వేరింటి కాఁపురమున కలవడినదగుటచేతను, బట్టణములలో వసించువారిమనంబులో నుండు నట్టి నవనాగరకపద్ధతు లామెమనస్సులోఁగూడ దృఢముగ నాటియుండుటచేతను ముప్పది నలువదిమంది యొకయింటనేఁ గలిసియున్నారనియు, నొకముసలమ్మ పెత్తనముక్రింద సంసారమంతయు జరుగుచున్నదనియు వినఁగానే కాళికుటుంబ స్థితి బాగుండలేదని యామె జాలినొందెను. కాని యుమ పూర్వాచారము లిష్టము లైనస్త్రీలాలోచించినట్లు తానుగూడ నీవిషయ మాలోచించినయెడలఁ గుటుంబము లవిభక్తములుగానుండుటవల్ల శరీరదార్ఢ్యము విద్య గలిగి ధనసంపాదనముఁ జేయు నదృష్టవంతుఁడు తనకుటుంబములో నున్న యప్రయోజకులను, దుర్బలులను సత్త్రములపాలు జేయక వీధులపాలుసేయక పోషించుటకు వీలుండునని యామెకుఁ దప్పక తోఁచియుండును. అటులామె తలపోయుచుండ నందఱొక్కనిమేష మూరకుండి పిమ్మట నీవిధమున సంభాషించిరి.

కాళి—ఉమా! మీవారు కలకత్తా వెళ్ళినారఁటే?

ఉమ—ఆ! వెళ్ళినారు. పదిపన్నెండు మాసములనుండి యచ్చటనే యున్నారు. ఈమధ్య నన్నుగూడ దీసికొనిపోవఁ దలఁచుకొన్నట్లు తల్లికి వర్తమానము పంపించినారు.

కాళి—ఔను. మాతమ్ముఁడు శరచ్చంద్రుఁడు చెప్పినాఁడు. మీయాయన కలకత్తాలో దివ్యభవన మొకటి యద్దెకుఁ బుచ్చుకొన్నారని ఎంతోసొమ్ము కర్చుపెట్టి చిత్రవస్తువులతో నింపినారని విన్నాను. ఒకజత నల్లగుఱ్ఱములను మఱొకజత గోధుమరంగుగుఱ్ఱములను గొన్నారట. మీవారెక్కుడుగుఱ్ఱపుబండ్లవంటివి సాధారణముగా రాజులకైన లేవని మావాఁడు చెప్పినాడు. అంతేగాక యాయనగారు కలకత్తాలోనున్న పేటలలో నెక్కడో యొకచోట బూఁదోటయున్న మేడ యొకటికొని పూలమొక్కలువేయించి, పొదరిండ్లుకట్టించి మేడయడుగున స్ఫటికపురాయి పఱపించి దానిని దేవేంద్రసభ జేయదలఁచుకొన్నారఁట. ఆహాహా! ఏమే యుమా నీయదృష్టము!

ఉమ—(చిఱునవ్వునవ్వి పిదప మొగమున విచారము తోఁప) కాళీ! నల్లగుఱ్ఱములజతలు, గోధుమగుఱ్ఱములజతలు, పూలతోఁటలు, స్ఫటికపురాళ్లు, తాపడముచేసినమేడలు మొదలగునవే యాఁడుదానికి సౌఖ్యము తేఁ జాలినపక్షమున మీయిుమయిు నదృష్టవంతురాలే. కాని బ్రహ్మదేవుఁడు మననుదుట నేమి వ్రాసినాఁడో యెవ్వరెఱుఁగుదురు. (అని యామె నిట్టూర్పు విడిచెను.)

బిం—(దానినిఁ జూచి) ఉమా? ఏమివ్రాసినాఁడో యననేల? అదృష్టమే వ్రాసినాఁ డనుకొనరాదూ?

ఉమ—బిం దక్కయ్యా! జ్ఞాపకమున్నదా? మన చిన్నతనములో నదృష్టములుచెప్పబైరాగివచ్చినాడు. నీకు జ్ఞాపక మున్నదోలేదో వాఁడు మనచేతులు చూచి మనయదృష్టములు చెప్పినాడు.

బిం.—నాకు జ్ఞాపకము లేదే.

ఉమ—కాళీ! నీకైనజ్ఞాపకము లేదఁటే.

కాళి—నాకసలే జ్ఞాపకము లేదు.

ఉమ—వాఁడుచెప్పినమాటలు నామనస్సుమీఁద నచ్చుగ్రుద్దినట్లు నాటినవి. అందుచేతనే నాకెక్కువజ్ఞాపకమున్నది. పండ్రెండేండ్లక్రిందట మన మీనెలలోనె యీచుట్టుప్రక్కలనే యాఁడుకొనుచుండఁగా నప్పుడే సాయంకాలమయినది. కొంచెముగ్రుడ్డివెన్నెలవచ్చినది. అప్పుడొకబైరాగి పెద్దజడలు తాను వచ్చి మనదగ్గఱ నిలుచుండెను. అప్పుడు భయముచే గడగడ వడకితిమి. అప్పుడతఁడు "భయములేదమ్మా! డబ్బులు తెచ్చికొనుడు. మీయదృష్టములు చెప్పెద" నని కూర్చుండెను. కాళి యొకడబ్బిచ్చి తనచేయి చూపించికొన్నది. మనకాళి గొప్పనిష్ఠ ప్రతిష్ఠగల కుటుంబములోనికి వెళ్ళునని యాతఁడు చెప్పెను.

బిం—ఆమహానుభావుఁడు నన్నుగురించి యేమిచెప్పినాఁడే!

ఉమ—ఇదిగోఁ జెప్పుచుండఁగానే—మీయమ్మ యప్పుడు చెఱువునకు వెళ్ళినది. చెఱువునకు వెళ్ళకపోయినను మాపిన్నిదగ్గఱ, పాపము డబ్బొకప్పుడున్నదాయేమి? డబ్బు తేలేక యూరకే నీవు చేయిచూపించికొంటివి. అప్పుడు నీచేయిచూచి వాఁడిట్లుపల్కెను. 'నాచిట్టితల్లీ! నీవు భాగ్యము, ప్రతిష్ఠగలకొంపలోఁ బడవు. పేదవానిచెట్టఁబట్టి వానితోఁగలిసి యింతకలో గంజో త్రాగుచుందువు.

బిం—ఏమిా! బాఁగుగానే యున్నదే. అతఁడు చెప్పినమాట నాకిష్టముగానే యున్నది. అయితే నిన్నుగురించి యేమి చెప్పినాఁడు.

ఉమ—చెప్పుచున్నాను విను. ఆవేళ మాయమ్మ నాకిచ్చిన నాలుగు డబ్బులు నేను వానిచేతిలోఁ బెట్టితిని. ఆడబ్బులు పుచ్చుకొని వాఁడు నామొగముకేసి చేతికేసి యెగాదిగాఁ జాలసేపు చూచి నన్నుదగ్గఱగాఁ బిలిచి చెవిలో నిట్లు గుసగుసలాడెను. "అమ్మా! నీవు భాగ్యవంతుని జెట్టఁబట్టెదవు కాని భాగ్యమే సుఖము తేఁగలిగినపక్షమున నీవు సుఖపడుదువు. గ్రహస్థితి మాత్రము సరిగా లేదని పలికి వాఁడు తన దారిం బోయెను. ఆమాటలు విని భయముచే నిశ్చేష్టురాల నయి యక్కడనే పాతుకు పోయినట్లు నేను నిలిచి యుంటిని. (ఈవృత్తాంత మెఱిఁగించునపుడు శరీరము వడఁకెను.)

బిం—(తొందరతో) ఏమే యుమా! ఆలాగున వడఁకుచున్నావేమే? ఎన్నఁడో పన్నెండేండ్లక్రిందట నెవఁడో బైరాగివాఁడు వచ్చి ప్రేలినయవకతవక మాటలు తలఁచికొని నిజమని నమ్మి నీ గ్రహచారము బాగు లేదనుకొనుచున్నావా? ఎంతవెఱ్ఱిదానవే! కష్టములు దుఃఖములు వచ్చునని భయపడెద వేమి? అంతభాగ్యము నంతవైభవముఁ గలదానవు నీవే యిట్లనుకొంటే యింక మే మేమనుకొనవలయును.

ఉమ—(కన్నీరు తుడుచుకొని, ధైర్యము దెచ్చుకొని గుంభనముతో) నాకేలోటును లేదు. ఆదేశదిమ్మరి బైరాగివాఁడు చెప్పినది నేనుమాత్రము నమ్మినానను కొన్నావా? అదేమోకాని కలకత్తా ప్రయాణముమాట తలఁచికొన్నప్పుడెల్ల నాకేదో కడుపులో బెంగగానుండును. కాని బిందక్కయ్యా! మీరుగూడ కలకత్తారానైయున్నారు కదా. మనకాళి వర్ధమానములో నుండును గదా? అది కలకత్తాకు మూఁడు నాలుగుగంటల ప్రయాణము. మనము ముగ్గురము చిన్నతనములో నక్కచెల్లెండ్రవలెఁ బెరిగినాము. యావజ్జీవము మనమాలాగుననే యుండుదము. మనలో నెవరికైనఁ గర్మము చాలక యేదురదృష్ట మయిన సంభవించినను మనలో మన యనురాగము పోకుండనుండిన నదేచాలును.

అని పలుకునప్పు డుమకంఠధ్వనిలో యంతర్గతములైనదుఃఖములు, నవ్యక్తములయిన మనస్తాపములు కాళికి, బిందుకుఁ బొడకట్టెను. కాళీబిందులు కారణము చెప్పుమని యామెను బలవంతపెట్టక తమచీరకొంగులతో నామెకన్నీరు దుడిచి

తమ యనురాగ మెన్నఁటికి మందగింప దని ధృవముగఁ బలికి యామెకు ధైర్యముఁ గొల్పిరి. ఒకయూరనే పుట్టి పెరిగిన చెలివికత్తె యైనందున నాముగ్వురుచీఁకటిపడ గానే యెవరి గృహములకు వారు పోవఁ దలఁచి లేచినప్పుడు ముగ్వురి హృదయములు చెదరి యేకాలమున కెవ్వరి కేకష్టములు మూఁడునోగదా యని భయపూరితము లయ్యెను.

ఏడవ ప్రకరణము.

మాతాపుత్రులు.

కలకత్తానుండి బొంబాయికిఁబోవు పట్టి సాయంకాలపుమెయిలుబండి మఱునాఁడు మధ్యాహ్నమున మొగలుసరాయిమకాము జేరెను. కాశి నెళ్ళఁదలచిన బాటసారులా బండినివిడిచి గుంపులు గుంపులుగా నక్కడనుండి కాశికిఁబోవు వేఱొక బండి నెక్కుటకు మూటలుచేతఁ బట్టికొని బయలుదేఱిరి. ఆరెండవబండి వారిని గంగాతీరమునకుఁ దీసికొని పోయెను. ఈకథాకాలమునాఁటికి గంగమీఁద వంతెన కట్టబడి యుండలేదు. కావున బాటసారులు చిన్నపొగయోడ నెక్కియో నావల నెక్కియో గంగానదినిదాఁటి యద్దరినున్న కాశి చేరవలసివచ్చెను. వచ్చిన తీర్థవాసులు నానావర్ణములవారు కదా. ఇట్లు నానాజాతులు సమావేశమగుట హిందూదేశమందే గన్పడును. ఆజానుబాహులు, దృఢశరీరులు నగువిహారదేశస్థు లొకచేత బాణాకఱ్ఱయుఁ, రెండవచేత మూటయుఁ బట్టుకొని కాశిలోఁ దిగిరి. ఈజనులు పాటుపడుటకుఁ గష్టములోర్చుటకు నలవడినవారు. ఒకపూట నన్నము లేనంత మాత్రమున శోషిల్లరు. సాధారణముగా సేయటుకులోఁ దిని కడుపు నిండించికొని పయనములు సలుపఁగలరు. హిందూదేశమునందు నానాభాగములందుఁ దిరిగి వర్తకము సేయుటకుఁ బ్రసిద్ధి కెక్కిన మారువాళి వర్తకులు రాజపుత్రస్థానమునుండి బయలుదేఱి, భాగ్యవంతు లగు తీర్థవాసుల కమ్ముటకు సీమమల్లుతానులు, జపానుపట్టుగుడ్డలు, బొంబాయిబట్టలు, చెన్నపట్టణపు చారలగుడ్డలు పూలయద్దకపు గుడ్డలు పెద్దపెద్ద పెట్టెలతోఁ వారణాసిలోఁ దిగిరి. పొట్టియాకృతులు, గట్టిశరీరములుం గలచోటానాగపురముజనులు పుణ్యక్షేత్రములకెల్లఁ బుణ్యక్షేత్ర మయిన కాశికానగరము వచ్చిరి. బంగాళాదేశమునందలి పల్లియలనుండియుఁ బట్టణముల

నుండియుఁ బయలుదేఱిన యాఁడువాండ్రు తమ యాజన్మమనోరథ మైన కాశీ కాపురగోపుర దేవాలయసందర్శనము నిమిత్తము తహతహ పడుచు, భాగీరథీపుణ్య జలంబుల బలుమాఱు తనివోవక చూచుచు, బెదరి యిటునటు గనుఁగొనుచు జనుల గుంపులనడుమనుండి యొక్క శ్రేణిగాఁ బోవఁజొచ్చిరి.

శరచ్చంద్రుఁడు గంగయొడ్డున దిగి యప్పటికి సాయంకాలమయినందున నుదయమునుండి నిరాహారిణియైయున్న తనతల్లినిఁ జిన్నయంగడియొద్దకుఁ దీసికొని పోయి ఫలాహారము చేయించెను. శరచ్చంద్రుఁడు తల్లిని, తల్లికి సాయముగా నుండుటకు నొకపనికత్తెను వెంటబెట్టికొని కాశికిఁ బయనమై, వర్ధమానపురమందు, బొగబండి నెక్కి నడుమ మొగలుసరాయివద్ద దిగి వేఱొకపొగబండి నెక్కి గంగ యొడ్డునుజేరెను. పూర్వాచారప్రియు లగుహిందువులు పొగబండి ప్రయాణములో నేపదార్థము నైన భుజించుట యనాచారము కావున, శరచ్చంద్రునితల్లి పయనము చేసిన యెనిమిదిజాములుగూడ నుపవసించెను. ఫలహార మైనపిదప నతఁడద్దనిమిత్త మేర్పడిన యొక చిన్నయింటికిఁ దల్లినిదీసికొనిపోయి సామాను లొకగదిలోఁ బెట్టించి భోజనము చేయించి పండుకొనుటకుఁ బ్రక్కవేయించెను. తీర్థవాసు లనేకులాపూటనే రేవుఁదాఁటి యద్దరినున్న కాశినిఁజేరుచున్న నారాత్రి యాకాశము మబ్బుతోఁ గప్పఁబడియుండుటచేతను, దఱుచుగా మెఱుపులు కన్పడుటచేతను, శరచ్చంద్రుఁడు మఱునాఁ డుదయమున, రేవుదాటవచ్చునని రాత్రి యీవలయొడ్డున గడపెను.

రెండుగడియలరాత్రి యుండఁగా లేచి ముసలమ్మ కాలకృత్యంబుల దీర్చికొని స్నాన మొనర్చి జపముఁజేసికొని సిద్ధముగనుండెను. అంతలోఁ గుమారుఁడు మేలుకాంచి తల్లినిఁ దోడ్కొని రేవుదాఁట నదియొడ్డునకుఁ బోయెను. అప్పుడే సూర్యుఁడుదయశైలము నలంకరించి గంగానదిలోఁ బ్రతిబింబితము లగుచున్న యా నగరగోపుర దేవాలయశిఖరసౌధములమీఁద బంగారు మేలిముసుంగుఁ గప్పెనో యన మెల్ల మెల్లఁ దనకాంతిం బ్రసరింపఁజేసె. గంగ కిద్దరినుండి చూచితిమా కాశీ నగరమువలె నయనానందకరముగా భక్తిజనకముగాగనంబడుపట్టణము ప్రపంచమున మఱొకటి లేదు. దేవాలయముయొక్క శిఖరము లాకాశమండలమును భేదించికొని పోవున ట్లున్నతములై చూడ నెంతో ముచ్చటగా నుండును. అడుగున నీటి దరినున్న దేవాలయఁపు మెట్టుమీఁద నెక్కువారు, దిగువారునై తీర్థవాసు లెడతెగక యుందురు. విశాలగర్భము గల యమ్మహానదియొక్క పుణ్యజలంబులు గుళ్ళ యొక్కయు, గోపురములయొక్కయు, మేడలయొక్కయు ముందటిభాగములఁ

దడిసి పావనముఁ జేయుచుండును. అనేక దేవస్థానములనుండి గంటల మ్రోఁతలు శంఖనాదములు గంభీరముగ నీదరినున్నవారి కా ప్రభాతసమయమున వినవచ్చెను. ఎఱ్ఱని ఱెక్కలు, తెల్లనిగొడుగులు దూరమున దృగ్గోచరములయ్యెను. అదివఱకెన్నఁడు నట్టిపట్టణముఁ జూచి యెఱుఁగమి కావున శరచ్చంద్రుని తల్లి కాశికానగరదివ్యసౌందర్యమును జూచినతోడనే హర్షమునకుఁ నద్భుతమునకు బరవశత్వమునకుఁ లోనయ్యెను. సంసారసంబంధములను దెగఁగోసి, బంధువుల విడనాడి, భూలోకస్వర్గమయిన యమ్మహానగరమున ధర్మకార్యములఁ జేయుచు భక్తితత్పరయై తన జీవితమునందలి చరమావస్థ గడుపం దలంచిన హిందూవితంతువునకు సాధారణముగా నిహలోకవైభవ మేదియు సంపాదింపలేని లోకసామాన్య సంతోషము కాశీసందర్శనమువలనఁ దప్పక గలుగును. అమాయకురా లయిన యా యవ్వ నదియొడ్డున నిల్చి దాని మహామహిమం దలంచి యానదిలో స్నానముఁ జేయునట్టిభాగ్యము, తన్నదీతీరమునందున్న కాశీనగరముఁ జూచునట్టిభాగ్యము భగవంతుఁడు మహానుగ్రహము పెంపున దనకుఁ గలిగించి జన్మము సఫలముఁ జేసి నందుకుఁ బట్టరానిసంతోషమొంది యానందబాష్పముల విడిచెను.

కాలేజిలో నింగ్లీషుఁ జదువుకొనుచున్న నవనాగరకుఁడయ్యు శరచ్చంద్రుఁడుగూడ నమ్మహానగరవైభవమును మొదటిసారి కనుగొనినప్పుడు మహాద్భుతమునొందెను. ఆర్యుల కళలకు, విద్యలకు, మతములకు మేలికొఠారని చెప్పఁదగిన యాపురముం జూడ మూఁడు వేల సంవత్సరముల క్రిందటి జనుల ప్రజ్ఞాదులు వారి తలఁపున బాఱెను. ముప్పది శతాబ్దముల క్రిందట నుత్తర హిందూస్థానము భారత రామాయణాదులగు నితిహాసములతో బ్రసిద్ధికెక్కిన కౌరవపాంచాలుర యొక్కయు గోసల విదేహులయొక్కయుఁ బరిపాలన క్రింద నున్నప్పుడు కాశీరాజులు పాండిత్యమునకుఁ బ్రతాపమునకుఁ బేరువడియుండిరి. పురాతనములైన యుపనిషత్తులుఁ గూడ నేఁటికిఁ బ్రసిద్ధులగు కాశీరాజుల చరిత్రములను జ్ఞప్తికిఁ దెచ్చుచున్నవి. మహాత్ముఁడగు గౌతమబుద్ధదేవుఁడు మొట్టమొదట నేవనమునందు నిష్కలుషములగు తనసిద్ధాంతములను జనులకు బోధించెనో యాలేఁడితోఁట సారనాథ మనియెడు పేరుతో నీవారణాసియందే యున్నదని బౌద్ధమతగ్రంథములు చెప్పుచున్నవి. ఈ నగరము శివుని త్రిశూలాగ్రమందున్న దనియుఁ బ్రళయకాలమందుఁ బండ్రెండుగురుసూర్యులు మింటనొకసారి వెలుగుచుఁ బ్రపంచమును భస్మపటలముఁ జేయువాఁడును, బుష్కలావర్తమేఘములు పొడ రేయింబవళ్ళు వర్షమునుగురిసి ప్రపంచమును ముంచునాఁడును వారణాశికి రవ్వంతయేని భయంబు లేదని పురాణములు

ళులుకుచున్నవి. ఆఱువందలయేండ్లు మహమ్మదీయపరిపాలనము వారణాసీపురము నప్పుడప్పుడు తుడిచిపెట్టి యుండవచ్చును. కొన్ని దేవాలయములను నేలగూల్చి యుండవచ్చును. కాని దుర్భేద్యమైన యార్యులమతవిశ్వాసము పరమతసహనము లేనియొకరిద్దఱు మహమ్మదీయ చక్రవర్తులచేతులలో లేదు. అందుచేతనే యెన్ని సారులు కొల్లపెట్టబడిన, నెన్ని దేవాలయములు నేలం గూల్పఁబడిన నీనగరము మూఁడువేలసంవత్సరములక్రిందట నెట్లుండెనో, నేడును నట్టులే చెక్కుచెదరక యార్యులకు వందనీయమై, దర్శనీయమై, స్మరణీయమై యొప్పుచున్నది. హిందూదేశమందలి మహారాజులు రాణులు దమ జన్మములు చరితార్థములు చేసికొనుటకు దానమున నొండొరుల మించునట్లు నీపుణ్యనగరంబున సత్రములు, చావళ్ళు, గుళ్లు, గోపురములుఁ గట్టించి నిరతాన్నదానంబులు నిత్యోత్సవంబులు జరుగునట్లు మాన్యముల, నగ్రహారంబుల ధారాదత్తముఁ జేసిరి. నేపాళ భూపాలురుఁ దక్షిణదేశపుఁ బ్రభువులు, హోల్కారుభార్యయగు నహల్యాబాయియు, శీకులదొరయగు రణజితసింగును, గాశీనగరమునకుఁ బ్రస్తుతసౌందర్యము గల్గించిన మాన్యులు. ప్రపంచమునం దనేకరాష్ట్రములు పుట్టిపోయినవి. అనేకమతములు తలయెత్తి నశించినవి. కాని హిందూరాష్ట్రము, హిందూమతముమాత్రము నశింపలేదు. అందుచేతనే హిందూదేశముయొక్క ప్రాచీనమతము ప్రాచీనవైభవము జనులహృదయముల నేఁటికిని నాటికొనియున్నది.

శరచ్చంద్రుఁడు, తల్లియు నొకచిన్న నావ నెక్కి గంగదాఁటి శ్రీవిశ్వేశ్వరాలయ మందలిగంట భగవంతుని యుదయకాలసేవలకు రావలసినదని జనులకు బిలుచుటకోయన మ్రోఁగుచుండఁగానే స్నానఘట్టములవద్ద దిగిరి. కుమారుఁ డదివరకే జాబులమూలముగాఁ గుదిర్చినయింటికిఁ దల్లిందీసికొని పోవం దలఁచెను. కాని యామె కానందపారవశ్యమున నేమాటయు వినఁబడదయ్యె. కన్నులకు మిఱుమిట్లుగొలుపుచున్న విశ్వేశ్వరాలయశిఖరము తప్ప మఱియేవస్తువా మెకుఁ గానబడదయ్యె. ఆకోవెల జూచినతోడనే యామె ముమ్మారు ప్రదక్షిణముఁ జేసి సింహద్వారమువద్ద ముమ్మారు సాగిలఁబడి లేచి యాలయముఁ బ్రవేశించెను. అపుడామె మనసున ప్రపంచమే లేదు. గర్భాలయములోఁ జిరకాలమునుండి యాత్రయించియున్న చీఁకటులను బోగొట్టనెంచుటకు విచారించి చిక్కెనో యనునట్లు మూఁడునాలుగు దీపములు కళాకాంతులు లేక వెలుఁగుచుండెను. అర్చకుఁడు వేదమంత్రముల జదువుచుండెను. కంగుకంగుమని పెనుగంటలు మ్రోగుచుండెను. నానాజాతులతీర్థవాసులు కనుపండువుగాఁ జూచుటకు గుంపులుగుంపులుగా

విశ్వేశ్వరవిగ్రహముచుట్టుం జేరిరి ధూపధూమములు గర్భాలయము నావరించి విశ్వేశ్వరు నర్చించువారికన్నులుకనబడకుండఁ జేసి మెల్లగ ద్వారమునుండి యావలకు వెడలిపోయి యాకాశమునం గలియుచుండెను. ప్రతిమనుష్యుఁడుఁ దాను తెచ్చినపుష్పములను సామియెదుటనున్న పళ్ళెరమునఁ బడవేయఁ జొచ్చెను, అర్చకుఁడాపుష్పములతో మహేశ్వరుం బూజించి, గంగానదీ పుణ్యజలంబులు తీర్థవాసులపైఁ జల్లు వారు ప్రార్థనలుముగించి మ్రోఁగెడుగంటలు మ్రోఁగుచుండఁగనే వచ్చెడుక్రొత్త తీర్థవాసులు వచ్చుచుండఁగనే జగదీశ్వరుఁడగు విశ్వేశ్వరునకుఁ గడపటిప్రణామముఁ జేసి పోవుచుందురు.

శరచ్చంద్రుఁడింగ్లీషుకాలేజిలోఁ బట్టపరీక్షకుం జదువుచున్న వాఁడగుటచే గుడిలోనికిం బోక యావలనే తల్లికొఱకుఁ గనిపెట్టికొని యుండెను. పోవకున్నను మహాగంభీరములైన వేదమంత్రములు చెవినిబడుటయు, భక్తిపరవశులగు తీర్థవాసుల సాష్టాంగ దండప్రణామములు కంటబడుటయు నతఁడుగూడ మనసుకరఁగ లోలోపల విశ్వేశ్వరుఁ బ్రార్థించె. క్రైస్తవమతబోధకులయొక్కయు నింగ్లీషు నేర్పు నుపాధ్యాయులయొక్కయు బోధనలు హిందూవిద్యార్థుల మనస్సులను దూరాచారములనుండియు ప్రాచీనమతమునుండియుఁ ద్రిప్పి వానియెడ ద్వేషముగల్గించెను కాని, యిటీవల నవీనమైన మతము దేశమున బయలువెడలి యతిపురాతనములైన యుపనిషత్తులలోని ధర్మములే యార్యులధర్మములనియు నవియే విశ్వసింపఁదగిన ప్రమాణములనియు హిందూబాలురకు బోధించుచున్నది. వేదాంతశాస్త్రమం దనగాఁ నుపనిషత్తులలో గంభీర వాక్యములతోఁ దొలుదొల్తఁ జెప్పఁబడినదనియు నీనాఁటి హిందువు లవలంబించుటకుఁ బ్రయత్నము సేయుచున్నదియునగు పరిశుద్ధాస్తికమతమును నిర్మూలించుటకు గ్రీకులు, పారసీకులు క్రైస్తవులు పోరాటంబులు సలిపిరి కాని యవియెల్ల వ్యర్థములయ్యె.

శరచ్చంద్రునితల్లి యన్నపూర్ణాలయమునకుఁ బక్కనున్న ముఖ్యాలయములకుఁ బోయినపిదపఁ గాని బసజేరుట కష్టమయ్యె. మాతృవిధేయుఁడైన యామనమారుఁడు తల్లివెంట జనసమూహముల నడుమనుండి యన్నిసందులలోఁబడి యొకగుడి నుండి మఱియొకగుడికిఁ బోయెను. ఆసందుల కిరుంకల మేడలు, మిద్దెలు క్రిక్కిరిసి యుండెను. వాఁటిక్రిందను నానాదేశములనుండి వచ్చిన నానాజాతి స్త్రీపురుషులు పలుపలువిధములగు చిత్రవస్త్రముల ధరించి, పలుభాషలు మాటలాడుచుఁ గ్రింద నడుచువారిం జూచుచు నిలిచిరి దుకాణదారులు తమదుకాణములలో బియ్యము,

పప్పు కూరగాయలు మొదలగునవి గంపలలోఁ బోసి యమ్మఁజూపిరి. ఆసన్నసందుల నుండి యాఁబోతులు ప్రక్కయరుఁగులమీఁది యంగళ్ళలో నున్న బియ్యము, ధాన్యము వీలయినపుడు నోరెడు తీసి బొక్కుచు నెవరిజోలికిం బోక, నెవ్వరిచేత నదపుసేయఁబడక స్వేచ్ఛగాఁ దిరుగుచుండును. ఎఱ్ఱనిజరీపట్టుచీరలు కట్టికొని మహా రాష్ట్రస్త్రీలు, కొంగులు వ్రేలాడ విలువకోకలు గట్టినబంగాళస్త్రీలు, నేలఁ దాఁకునట్లు పావడలం గట్టినయుత్తరహిందూస్థానస్త్రీలు దారిలోఁ జెట్లక్రిందను, దేవాలయములలోను గనంబడు దేవతావిగ్రహములకు డబ్బులు, పళ్ళు సమర్పించుచుఁ గలసి మెలసి తిరిగిరి. దేహమునిండ బూడిదఁ బూసికొన్నసన్యాసులు, గోపిచందనము మొగము నిండ మెత్తుకొనిన భక్తులు, తీర్థవాసులగౌరవంబునకును దానంబులకును, పాత్రులైరి. ఈవిధముగ నెడతెఱపి లేక తీర్థవాసులతో నిండి యున్నను వారణాసియందు నన్నినగరములందువలె వాణిజ్యము విశేషముగఁ జరుగుచుండును. అంగళ్ళు యూరపుఖండమందుఁ నాసియాఖండమందు బండిన సరకులతో నిండియుండును. గొప్పవర్తకులకొఠీలు హిందూదేశమంతకు హుండీలు వ్రాయుచు నితర వర్తకులహుండీలు చలామణి చేయుచు నుండును. నూలుగుడ్డలు, పట్టుబట్టలు, వెండి బంగారునగలు, కట్టాణిముత్యములు, జాతిరత్నములు, జయపురపు నినుపపాత్రలు, కాశీరాగిసామానులు, మాఱుమూల సందులలో సైతము కొట్లలో నమర్పబడి బాటసారులకు వెలకు దొరకును.

దివ్యస్థలసందర్శనము ముగించి మధ్యాహ్నము తిరిగినపిమ్మటఁ దల్లికొడుకులు మగల నొకసారి స్నానము చేయ వలయు నని గంగవైపరిగిరి. గంగలోపలనుండి పైవఱకు నున్నమెట్లన్నియు స్నానార్థమైవచ్చినయాఁడువాండ్రతో నిండి యుండెను. పురోహితులు, పండాలు భాగ్యవంతు లగుతైర్థికులవెంటఁ బ్రతిదివ్యస్థలము నకుఁ బోవుదురు. బ్రాహ్మణులు స్నానములు చేసి గంగలో మొలబంటినీళ్ళలో నిలిచి జందెములు చేతఁబట్టికొని మంత్రములు చదువు చుండిరి. దశాశ్వమేధఘట్టమునం దున్నమణికర్ణికా క్షేత్రముయొక్క మెట్లు భాగీరథీపుణ్యజలములలో మునిఁగి బహుజన్మసంచితమైన పాపమును గడిగివేయుదలఁచు తీర్థవాసులయొక్క కాళ్ళ రాపుడుచే నఱిగి పోయెను. జాముప్రొద్దువేళ కా మాతాపుత్రులు బసఁజేరి యేదోయింత వండికొనితినిరి. పాపమాయిల్లాలు భర్తృవియోగ మైనతరువాత నంతటియానందముఁ బొందినదిన మదే తప్ప యొండులేదు. పతి కాలధర్మము నందిన దినము మొద లామె కాశికానగరమునకుఁ బోయి యచ్చట నుపవాసములు,

పుణ్యకార్యములు, దానధర్మములు, దేవతాదర్శనములుఁ జేసి జీవనము గడప వలయునని తలంచినతలంపు నేఁటికి సఫలమయ్యెనని సంతసించెను.

శరచ్చంద్రుఁడు తల్లితోఁ గలసి మూఁడురాత్రులు, మూఁడుపగళ్ళు, కాశి కానగరమున గడపెను. తనయూర నున్నపుడే శరచ్చంద్రుఁడు కాశిలోఁ దన తల్లికొక బస కుదుర్పుమని యొక పండాబ్రాహ్మణునికి వ్రాసి యున్నందున నఁతడు వారు వచ్చునప్పటికి నదియొడ్డున నొక మేడలో రెండవయంతస్థుమీఁద రెండుగదులు కుదిర్చియుంచెను. ఆపండాబ్రాహ్మణుఁడు ప్రతిదిన మామెవెంట దివ్యస్థలములకన్నిఁటికరిగి, పురోహితుఁడయి సహకారియై, హితోపదేశకుఁడై మెలంగుచు వచ్చెను. తీర్థవాసులు పుణ్యక్షేత్రములను జేరఁగానే, పండాబ్రాహ్మణులు వారికి బసలు గుదిర్చి సౌఖ్యము లొనగూర్చి వారిచ్చుస్వల్పధనములు గ్రహించి సంతసింతురు. ఈబ్రాహ్మణులు క్షేత్రములకు వచ్చుతీర్థవాసులపేళ్ళన్నియు వ్రాసికొని వంశపరంపరగాఁదమ పుత్త్రపౌత్త్రుల కిచ్చిపోవు చుందురు. ఈజాబితాలలో మనపూర్వులెవ్వరు తీర్థయాత్రలు చేసిరో వారిపే ర్లుండును. ఇట్టిపండాలు, కాశిలో, ప్రయాగలో, మధురలో, బృందావనములో ననేకు లున్నారు.

ఆపండా శరచ్చంద్రునితల్లినిమిత్త మొకవంటలక్కనుఁ గుదిర్చెఁగాని యాయవ్వ యామెచేతివంట దిననిష్టపడక స్వహస్తపాకము జేసికొని వితంతువులకు విధింపఁబడిన యేకభుక్తమును జరపెను. అందుచేత నావంటకత్తె పనికత్తెయగుటకు మాఱు ముసలమ్మకుఁ జెలికత్తెవలె నుండి సాయ ముండుట కుపయోగించెను. ఇట్లు మూఁడురాత్రులు మూఁడుపగళ్ళు గడచుటయు ముసలమ్మ నాలుగవనాఁ డుదయమున స్నానము జపము ముగిసినపిదపఁ గొడుకుం బంపివేయవలసి వచ్చినందుకు మిక్కిలి విచారగ్రస్థయై కొడుకుం గలిసి విశ్వేశ్వరాలయమునకుఁ జని దేవతాదర్శనకాలము సమీపించినదని తెలుపుటకు మ్రోఁగుచున్నఘంటానాదము విని తీర్థవాసులు మందమందలుగా లోనఁజొరఁబడుచుండఁగా నామె లోని కరుగఁజాలక కొడుకున కెదురుగా నిలిచియుండి ముడుతలు పడినముదిచెక్కులనుండి కన్నీరు సోనలుగాఁ బ్రవహింపఁ గొండొకసే పూరకుండి విశ్వేశ్వరు నుద్దేశించి యిట్లు వేఁడుకొనియె. "ఓవిశ్వేశ్వరా! సంసారబంధములనుండి విడిపోవుట మిక్కిలి కష్టము. ఈదీనురాలు నీపాదసేవలే యేమఱక సేయునట్లు కటాక్షింపుము. ఈసేవకురాలియేకపుత్త్రుఁడు సంసారయాత్రలో గష్టములబారి బడకుండునట్లు దీవింపుము."

అంతట శరచ్చంద్రుఁడు తలవంచి తల్లియెదుట నిలువంబడుటయు న మ్మాతృదేవత కొడుకుతలపైఁ జేయివైచి, నిమిరి, యాశీర్వదించి యిట్లనియె. "నాయనా! వెళ్ళు మీ నాయనగారు నడచినధర్మమార్గములనే నడువుము. కులగౌరవము పెద్దల పరువుప్రతిష్టలు నిలువంబెట్టుము. పాపము మీయక్క కాళి నోరు వాయి యెఱుగనిది దాని నేలాగున కనిపెట్టెదవో. నేను నీకు వేఱే చెప్పనక్కఱలేదు. దాని భారమే నీది. హేమచంద్రుఁడు, బిందు, సుధ నీతోఁ జిన్నప్పటినుండియు స్నేహము చేసినవారుకదా వారందఱి కిష్టుఁడవై యెప్పటివలె నుండుము. వెళ్లు నాయనా! వెళ్ళు. ఈకాలఁపుచదువులుచదువుకొని, గొప్పవాఁడవై యుద్యోగములు చేసి, బిడ్డలతండ్రివై భగవంతుని పాపములే నమ్ముకొని యుండుము. ఆప్రభువే మన కన్నికష్టముల దాటింపఁగలవాఁడు నాయనా! మీ యమ్మమాట నీక తల పెట్టక యామె నీపుణ్యస్థలములలో విడిచిపొమ్ము. మనశాస్త్రములలోఁ బెద్దలు విధించినధర్మములను, జపతపములను జేసికొని, ఈగంగామృతమే ప్రతిదినము త్రావి కాలక్షేపము చేసి మీయమ్మ తనయస్థికల నీగంగలోనే గలుపును. తండ్రీ! నీవెక్కడనున్నను మీయమ్మదీవనలు నీవెంటవచ్చి నిన్నుగాపాడును. అని మఱియు నేదియో యనఁబోయెను కాని దుఃఖ మంతకన్న నామెను బలుకనిచ్చినదికాదు. శరచ్చంద్రుఁడు సహజముగ ధైర్యముగల పడుచువాఁడయ్యుఁ దల్లి కడసారిపలుకులకుఁ బ్రత్యుత్తర మీయలేక యామెయడుగులపైఁబడి వెక్కివెక్కి యేడువసాగెను. అంతలో విశ్వేశ్వరాలయములోనిగంటలు ఖంగుఖంగని మ్రోయఁ జొచ్చెను. వేదమంత్రనాదములతో గుడి ప్రతిధ్వనులిచ్చెను. అవి వినఁగానే తల్లికొడుకులహృదయములు దుఃఖమును విడిచి భక్తివశములయ్యెను. తల్లి కన్నీరుఁ దుడుచుకొని "బిడ్డా! నన్నువిడువుము. ఆవల స్వామిసేవాకాల మయినది. నేను గుడిలోనికిఁ బోవలయును. ధర్మము నెఱవేర్పవలసినప్పుడు పిటికికండ విడిచి ధైర్యముఁబూనుము. దయగలవాఁడవై పదిమందిచే మంచివాఁ డనిపించికొమ్ము. మీపూర్వులపద్ధతులే యనుసరింపుము. పెద్దలయాచారములే నడుపు" మని పల్కెను. అనవుడు మాతృభక్తి యావేశింప శరచ్చంద్రుఁ డామె కిట్లనియె. "అమ్మా! నీకోరికప్రకార మెల్లప్పుడు నడుచుకొనియెదను. నీయిచ్ఛకు విరుద్ధముగా సంచరించునప్పుడు నేను బ్రతుకకపోవుదునుగాక!" అని పలికి మరలఁ దల్లియడుగులకు మ్రొక్కి యామె పాదములు కనులనద్దుకొని యామెసెలవుఁగైకొని తననిమిత్తము కనిపెట్టుకొనియున్న నావనెక్కెను. పడవవాండ్రు వెంటనే యానావఁ ద్రోసిరి. అది క్షణములో నావలియొడ్డుఁజేరెను.

మరల దేవాలయఘంటానాదము, వైదికమంత్రధ్వనియు బయలుదేరెను. కాని యవి యాపుత్రరత్నలను శ్రవణగోచరములు గావయ్యె! సంసారబంధమునకుఁ జిక్కి యాయిల్లాలు భగవంతునిసేవస్థితము మఱచిన దీయొక్కసారియే. ఆమె ధ్యానమంతయు నామెభూలోకసౌఖ్యాధారమును, కన్నులచందమామయైన యాపుత్ర రత్నముమీఁదనే యుండెను. కన్నీటిచే మాలిన్యముఁజెందిన యామెదృష్టి కొడుకెక్కిన యాచిన్నినావ కంటికగపడినంతవఱకు దానిమీఁదనే నిలిచెను. అనంతరము గంటలు మ్రోఁగుట మానెను. వేదపనసోచ్చారణములు ముగిసెను. ఉదయప్రభాకరుఁడు గోపురములమీఁద దేవాలయములమీఁద దనకాంతి పర్వఁజేసెను. ఆయవ్వ యాలయముఁజొచ్చినప్పటి కామెమనసు మనసులో లేకపోయెను. అయినను జాలసేపామె విశ్వేశ్వరస్వామిం బ్రార్థించి పుత్రవియోగమునఁ బరువెక్కిన హృదయముతో మెల్లఁగ బసకుఁ జనియెను.

సుధాశరచ్చంద్రము

రెండవ భాగము

ఎనిమిదవ ప్రకరణము

పట్టణము.

బిం—సుధా! నీ వీలాగున నొకసారి వచ్చెదవా?

సుధ.—అక్కయ్యా! పిలుచుచున్నావా?

బిం—అవును. ఆచీర నుదికినాను. అది యింటిమీదఁ నారవేయుము. నూతిదగ్గఱ నీళ్ళుపోసికొని నిప్పంటించెదను. పాలది వచ్చువేళయైనది. అబ్బా! ఈనూతిదగ్గఱ స్నానముచేయుట నాకెంతో కష్టముగానున్నది. మనయూరిచెఱు వెంతమంచిదే! హాయిగ నీళ్ళలోదిగి స్నానముఁ జేయవచ్చును.

సుధ—(చిఱునవ్వునవ్వి) కలకత్తాలో నేదిచూచినను నీకుఁగిట్టదు. నా కిక్కడ స్వర్గములో నున్నట్లున్నది. ఇది యెంతమంచిపట్టణమే! ఆహాహా! ఆబజారులు, ఆదుకాణములు, ఆపెద్దపెద్దమేడలు, అంతములేనివీథులు, వేలకొలఁది మనుష్యుల గుంపులు, ఆగుఱ్ఱపుబండ్లుచూచి యెవరు సంతోషింపరు? మనతాళ్ళ చెఱువులో నిట్టివేమైననున్నవా?

బిం—బజారులకు దుకాణముల కేమిలే. పల్లెటూరైనను మనయూరు మన తాటాకులయిల్లు స్వర్గము కాదఁటే! అక్కడ హాయిగనిట్టటు దిరుగవచ్చును. మంచిగాలి వెలుతురు. దొడ్డిలో కావలసినన్నిపాదులు కూరలు గదా? తోఁటలో

మామిడిచెట్లు. ఈకలకత్తా యింటిలో నవి యెక్కడున్నవే? గుఱ్ఱములు బండ్లు భాగ్యవంతులకుఁగాని మనకెందుకు. మన కీపెద్దయిటుకయిం డ్లెందుకే. సరిగా వెలుతురైనలేదు. శుభ్రమైనగాలిరాదు. చుట్టాలనెవరినైనం జూడవలయునంటే పల్లకీలెక్కి తలుపులు మూసికొని వెళ్ళవలెను. మనమిక్కడ పంజరములోఁ జిలుకలవలె నున్నాము.

సుఖ—అక్కయ్యా! మనము పయికి వెళ్ళినప్పు డెన్నిచిత్రములు చూచుచున్నామో యాలోచించు. మొన్న బాప మనలనుబండియెక్కించి మ్యూజియమునకుఁ దీసికొని పోయినాఁడా! ఆహా! యెన్నిచిత్రవస్తువులు చూచినామే యక్కడ. అక్కడ నుండి అవేవోతోఁటలోనికి వెళ్ళినామా! అక్కడ చిత్రమైనపక్షులు, జంతువులు మనము చూడ లేదూ? ఇల్లు కదిలినామంటే అన్నీ చిత్రములే.

బిం—నాకెల్లప్పుడు బండ్లమీఁద తిరుగుట యిష్టములేదు. మనయూరిలో బండి యెక్కవలసినయవసరమేలేదు. ప్రతిదినము హాయిగనడిచి చెఱువునకువెళ్ళి స్నానము చేయఁగలముగదా. అక్క డందఱిని మన మెఱుఁగుదుము. మనల నందఱెఱుఁగుదురు. అందఱు మనలం జూడవత్తురు. మన మందఱను జూడఁబోదుము. అక్కడ మనకేగోషాలేదు. పట్టణమన్న పేరేగాని యీమహారణ్యములో నొకరినొక రెఱిఁగినట్లు కనఁబడదు.

సుఖ—అక్కయ్యా! కొంతకాలముంటే యిక్కడమనుష్యులు పరిచయమగుదురు. మొన్నను దేవీప్రసన్నుఁడుగారినౌకరువచ్చి వారియాఁడవాండ్రను జూచుటకు రమ్మని పిలవలేదూ! చంద్రనాథుఁడు నిన్నను కొన్నిపండ్లు మిఠాయిలుఁ బంపినాఁడుకదా!

బిం—సరే కొన్నాళ్ళుంటే, ఎవరోకొందఱు పరిచయులు కాకపోదురా యేమిటి? వాళ్లు భాగ్యవంతులు; మనము పేదవాళ్ళము. వాళ్ళకు మనకు మన సెట్లు కలియఁగలదు. వారు మనతో గౌరవముగా మాట్లాడుటయే మనకుగొప్ప.

సుఖ—ప్రతిరో జుదయమున శరచ్చంద్రుఁడు మనయింటికివచ్చి అందరి మనుష్యులనుగురించి యన్నిసంగతులంగురించి చిత్రచిత్రముగఁ జెప్పుచుండును గదా! అతఁడు పుస్తకములం జదివి యర్థముజెప్పినపుడు నాకూరకే వినవలయుననియే యుండును.

బిం—శరచ్చంద్రునంతమంచివానిని మనము సాధారణముగఁ జూడము. అతఁడు పగలెల్ల పరీక్షకుఁ జదువుకొని పాపము సాయంకాలము తప్పక మనలం

జూడవచ్చును. అతఁ డంతసేపు మనవద్దనెంటు కుండు ననుకొన్నావు! మన మొంటిగ నుండి పోదుమని. అతఁడిక్కడ నున్నంతసేపు పుస్తకము లవతల పారవేసి మన సౌఖ్యములనే జూచు చుండును. అతనికి డబ్బున్నవాఁడనని చదువుకొన్నవాడనని గర్వములేదు. అతనిది చాలమెత్తనిమనసు. ఈకాలఁపుకుఱ్ఱవాళ్ళలో నటువంటివా ళ్ళుండరు.

సుధ—అక్కయ్యా! పాలది వచ్చినది.

బిం—(పాలదానినిఁ జూచి) ఈవేళనైన కొంచెము మంచిపాలు తెచ్చినావా? లేక నిన్నటిలాగు సగము నీళ్ళు సగము పాలునా? కలకత్తాలో కావలసినన్ని కుళాయిలున్నవి. నీళ్ళకుఁ గొదవ లేదు కదా. ఇఁక పాల కేమికొదవ. నీవు తెచ్చునవి పాలుకావు. పాలరంగునీళ్ళు.

పాలది—అమ్మా? కామందులింటి కల్లాటి పాలిత్తానాండి. బోంచేసి సూడండమ్మా! మంచియో చెడ్డయో మీకే తెలుస్తాది

బిం—అవునేపిల్లా! నే నెఱుఁగుదును. మాయింటిదగ్గఱమాఆవు మూఁడు సోలలపా లిచ్చునది. అవే మాపిల్లలకు సరిపోవునవి. నీవు సేరుపా లిచ్చినను సరిపోవుటయే లేదు. ఎన్నిత్రాగిఁన పిల్లలకాఁకలి తీరుటయే లేదు. కాఁచుటకు కుండలోఁ బోసినప్పుడు నీళ్ళు పోసినట్లుండును కాని పాలుపోసిన ట్లుండవు.

పాలది—అమ్మా! మీయింటిపాలంటివి యిక్కడెల్లాగొస్తయితల్లీ! అక్కడావులు బయలకెళ్ళి కడుపునిండా మేసొస్తాయి. మంచిపాలిస్తాయి. ఇక్కడావులను సాల్లోకట్టిపెట్టి రోజల్ల మేపుతాము. ఇమ్మంటె మంచిపాలెల్లాగిస్తాయి?

బిం—నిన్న మంచిపెరుఁగు తెమ్మన్నాను. తెచ్చినావా?

పాలది—ఇదిగో నమ్మా తెచ్చాను. (అని గుప్పెడంతపిడత తీసియిచ్చెను.)

బిం—అబ్బో! యీపిడత నాలుగుడబ్బులా?

పాలది—నాలుగుడబ్బులికి మరెంతొస్తదనుకున్నారూ! మీనౌకర్ని ఊళ్ళోకి పంపించి కొనుక్కోండి. ఇంతకన్నావరైన నెక్కువిత్తే యిదూరికేనే పుచ్చుకోండి మీవాడికుంటే నేచాల్నిదేవుళ్ళాడుతాము, ముందాదగా మీదగ్గఱకే చేస్తామండి.

బిం—సుధా చూఁడమ్మా! వీరాడాబులకలకత్తా పెరుగుచూఁడు. ఇది నాలుగుడబ్బుల పెరుఁగఁట కొంచెము నీళ్ళు కలిపిపోసుకో లేకపోతే నీకైన సరిపోదు, ఎవరువారు? దాసీదా యేమిటి,

దాసి—(ఎదుటికివచ్చి) అవునమ్మా సేసే.

బిం—ఓసీ! ఈరోజున బజారుకు కొంచెము పెందలకడవెళ్ళు. ఈవేళ మావారు పదిగంటలకే యెక్కడకో వెళ్ళవలెనఁట. త్వరగా వంట గావలెనఁట. ఏచేఁపలు తీసికొని రాఁగలవు? మంచికోయిచేఁప తేగలవా!

దాసి—తేలేకే మమ్మా! అయి పిరం. మంచికోయిచాప రెండుమూఁడు నాలుగుడబ్బు లుంటది.

బిం—ఏమిటి? అయితే కలకత్తామనుష్యులు తిండితినకుండ ఊరకే బంగ్లాక్కి తిరుగు చుందురా యేమిటి?

దాసి—తిన కేమం డమ్మా; కరుచు చేసుకుంటారు తింటారు మేము నాలుగుడబ్బుల చాపలు తెచ్చుకుంటామండి. అదే సందాలా పొద్దున్న గడుపుకుంటాము.

బిం—అయితే మాగరుచేఁపధర యెంత?

దాసి—మాగరూ సెత్తైకమ్మా? అదొక్కొక్కటి నాలుగు డబ్బులో అయిదు డబ్బులో ఆఱు డబ్బులో. బజారు మండి పోతుందమ్మా. కొనలేము. మేము పల్లెటూలోళ్ళమే, అక్కడున్నప్పుడు సంతలో చాపలు కొనుక్కునోళ్ళం. ఆదరకే కలకత్తాలో రమ్మంటే సత్తాయా? రొంమపూటలూ పట్టెడన్నం యేలొస్తె రెడతారు గనుక మీపాదాల్నొడని బతుకుతూ వున్నాం గాని లేకపోతే చణముండ గల్మాండి.

బిం—సరే వెళ్ళు వెళ్ళు. మట్టగిడస కాని బొమ్మిడాయి కాని నీకు తోఁచినది మరేదో మంచిది తీసుకురా! ఒకడబ్బు రొయ్యలు తీసుకురా! వాటితో పులుసు కాచవలెను. ఒకడబ్బుతోటకూర కూడతీసుకురా. మాయూరిలోనున్నప్పుడు మాదొడ్డిలోఁ గావలసినంత బచ్చలికూర, ఎంతమందికో పెట్టి మేము తినేవాళ్ళము. బంగాళాదుంప లిక్కడ చాలప్రియము. అవిచాలా తీసికొనిరాకు; వాటిబదులు కందో పెండలమో చామో, చిలగడదుంపలో తీసికొనిరా! కొంచెము అరఁటిదూట అరఁటిపువ్వు తీసికొనిరా! యేమిపాపముపచ్చినదే, అమ్మా! అరఁటి దూఁట అరటిపువ్వు డబ్బుపెట్టి కొనవలసివచ్చినది. మాయూరిలో నరఁటిచెట్లప విలాగున పెరుఁగు చుండును.

అని బిందు పాలదానివద్దనుండి పాలుఁ బెరుఁగు తీసుకొని డబ్బు లిచ్చి దాసిని బజారున కంపి పాలుఁకాచి మేడమీదికి దీసికొనిపోయెను. అప్పటి కామె

బిడ్డ లిద్దఱు లేచిరి. ఆబిడ్డల కన్నము పెట్టి పాలు త్రాగనిచ్చి పక్కలెత్తి యామె గది యూడుచుకొనెను. అంతలో దాసి బజారునుండి కూరలు తెచ్చినందున బిడ్డల నాడించుమని దానికప్పగించి తాను వంటయిల్లు ప్రవేశించెను. సుగుణ సరసు లందిచ్చి యక్కగారికి సహాయురాలై పెసరు చేయుచుండెను. అందుచేత నామె బియ్యము కడిగి యిచ్చి కూరలు తరిగి నూనె యుప్పు మిరపకాయ తాళింపుసాళాలు చులుకుగా నందిచ్చెను. బిందు వంటఁజేసెను.

పైసంభాషణలంబట్టి హేమచంద్రుఁడు సుధా బిందులంగోడ్కొని కలకత్తా నగరమునకు వచ్చినట్లు చదువరులకుం దెలియును గదా! అతఁడట్లు వచ్చి కొన్ని దినములు శరచ్చంద్రుని యింటనుండి తరువాత రెండంతస్తుల మేడ నద్దెకుపుచ్చుకొని యందులోఁ బ్రవేశించెను. వారిని వేరింటఁ గాఁపురము చేసి సౌఖ్యము పాడు చేసికొనక తనతోఁ గలిసి యుండుఁడని శరచ్చంద్రుఁడు ప్రతిమాలెను. తమయునిక యాతనిచదువునకు భంగము కలుఁగఁజేయునని తలంచి వారక్కడ నుండరైరి. అందుచేత శరచ్చంద్రుఁడే వారి నిమిత్తము భవానీపురములో నెలకుఁ బదిరూపాయలయద్దె కొకయిల్లు కుదిర్చెను.

ఆచుట్టుప్రక్కల మనుష్యుల ననేకుల శరచ్చంద్రుఁ డెఱుఁగును. అందుచేత హేమచంద్రుఁడుగూడ వారికి బరిచితుఁడయ్యెను. అందులోఁ గొందఱు కలకత్తా హైకోర్టులో ప్లీడర్లు, కొందఱు గవర్నమెంటుకచ్చేరిలలోను తెల్లవారి వర్తకసంఘములలోను గుమస్తాలు, కొందఱుద్యోగములు లేక సొంతయాస్తి మీఁద జీవించువారు. కొందఱు చీనాబజారులోను బారాబజారులోను దుకాణములు పెట్టికొన్నవారు. వీరుగాక యనేకులు తగినజీవనాధారములేక యెప్పటికప్పుడే పట్టి [illegible] నామహాపట్టణమున కష్టపడి పొట్టగడుపుకొనుచుండిరి. భవానీపురములోనున్న భాగ్యవంతులు పల్లెటూరినుండివచ్చి సుగుణసంపదయు గౌరవమునుగల హేమచంద్రుని మిక్కలి యాదరించి తమ దివ్యభవనముల కప్పుడప్పుడతనిని బిలుచుచు హృదయపూర్వకమైనఁ మైత్రితో, దయతో, నాతనిం బలుకరించుచు వచ్చిరి. అప్పుడప్పు డాయనను కొందఱు విందులకుఁ బిలుచుచు వచ్చిరి. ఈవిధముగఁ బరిచయము క్రమముగ నభివృద్ధి పొందుటవలన నతని కక్కడకొందఱు మిత్రు లేర్పడిరి. హేమచంద్రుఁడు తనభాగ్యవశమునే తన పల్లెటూరుసౌఖ్యము, స్వేచ్ఛ, యిక్కడలేదని విచారపడుచుండును. కలకత్తాలోనున్న సందడిగొడవ వానికి గిట్టక పోవుటచేఁ దనయూరిస్నేహితులతోఁ గలిసియుండుటకు తనయూరి గొడవలు వినుటకుఁ గుతూహలముపడఁజొచ్చెను. క్రొత్తమిత్రులు తనయెడఁ జూపి

నదయ కతఁడు సంతసించెను. కాని మేడలపట్టణమని చెప్పఁదగిన కలకత్తాలో గొప్పవారికి భాగ్యవంతులకు సాధ్యమయినంతవఱకు కతఁడు దూరముగానే యుండెను. హిందూదేశపు రాజధానియైన యానగరమున నున్న గొప్పవారు గౌరవనను వారివలన గౌరవములు బిరుదులుఁ మెప్పులుఁ బడయఁ దలఁచి పనిపాటులను హేమచంద్రుఁ డొకమూలఁ గాఁపుర ముండియును సూక్ష్మబుద్ధి యగుటచేఁ గని పెట్టి యాశ్చర్య మొందుచు వచ్చెను. ఎక్కడఁ జూచినను గొప్పవారికి విందులు, వనసంతర్పణలు, నాట్యములు, సభలు, ఎక్కడఁ జూచిన గొప్పకార్యముల నిమిత్తము చందాలు, ఎక్కడఁ జూచిన నున్నతపురుషుల స్తోత్రపాఠములు, జనులకు తెగని వినోదములు మహోత్సాహముఁ బుట్టించు వ్యాపారములు గదా! ఈ ప్రయత్నములఁ జేయఁజేయ, నోపిక గల వేఁటకాని గురితప్పక యేటు తగిలి పడెడు జింకవలెనే, మనోరథములైన బిరుదులు మెప్పులు చిట్టచివర కపేక్షించినవారికి వచ్చుచుండును. హేమచంద్రున కట్టియాశలు లేమి యట్టిపోకలం బోక యాబిరుదుల వేఁటకాండ్ర చమత్కృతములు మాత్రము కనిపెట్టి యక్కజపడుచు వచ్చెను. ఆతనికి విశేష లోకానుభవమే యున్నపక్షమున నీయుత్సాహముకల కత్తానగరమందేగాక ప్రపంచమునం బ్రతిస్థలమునం దుండు నవియు జ్ఞానవంతులుఁ బ్రశాంతులు పరోపకార్థము తనవలెనే జీవింపఁ దలంచువారు పందెపు పరుగుల వంటి యీయాశలపొంతం బోవరనియుఁ దెలిసికొని యుండును.

ఎప్పటివలెనే జూను నెలలో వర్షములు కురియ నారంభించెను. ప్రపంచము నందలి యితర దేశములందువలెనే హిందూదేశమునందుఁగూడ గాలిమార్పులు విలక్షణముగ గన్పట్టుచుండును. శీతకాలమందు, అనఁగా నవంబరు నెల మొదలు ఫిబ్రవరి నెలవఱకు నాకాశము నీలమై మంచుకురిసెడు చలిగాలితో నిండియుండును. ఆకాలమున గోధుమలు మొదలగు ధాన్యములు పండును. పండుగలు వ్రతములు నోములు తీర్థయాత్రలుఁ జేసికొనుచు జనులిత్తర మహానందభరితులై యుందురు. సాధారణముగా మార్చి నెలలో వేసవికాల మారంభమగును. పశ్చిమోత్తర గ్రామములందు వీఁచు వేఁడిగాడ్పులు భూములార్చివేయును. నానాఁటికి సూర్యుఁడు మంటలం గ్రక్కునట్లు తీక్ష్ణుఁడై గ్రామంబులఁ బట్టణంబులఁ బిహాతహ నొందఁజేయును. పడమటిభాగముల నున్న యెడారులనుండి వేఁడిగాడ్పులు వీఁచి శరీరంబుల శోషింపఁజేసి జంతువులను నడపెనుఁగులను జేయును. కూలివాండ్రలసిపోదురు. [illegible] దారులు కునికిపాట్లు పడుచుందురు. పంటకాఁపులు వెచ్చనూర్పుచుండురు. సూర్యుఁడు సహస్ర కిరణములతో దేశములు దగ్ధము సేయునట్లుండుకాలమున

జంతుజాలమెల్ల చైతన్యము పెక్కినట్లుండును. బంగాళాదేశమందు వేడితక్కువే కాని తేమ యెక్కువగ నుండుటచే నావేఁడియే మిక్కిలి బాధకరముగ నుండును జూనునెలలో వానలు కురియఁగానే దేశము చల్లఁబడును. ఈవర్షములు రమారమి నాలుగునెలలవఱకు ననఁగా కార్తికమాసమువఱకు గుంభవృష్టిగ గురియును. ఈవర్షములచేత బంగాళాదేశమందు వేలకొలఁది మైళ్ళనేల జలప్రళయమునందున్నట్లుండును. పల్లెలు సముద్రమధ్యమందలిదీవులవలె కానబడుచుండును. చెఱువులు మడుగులు సరస్సులు జలపూరితము లగును. నదులు గట్లమీఁదనుండి పొరలి ప్రవహించును. ప్రతిగ్రామమునందు నీడ నొసంగెడి చెట్లతోఁపులు దట్టముగనుండును .వరిచేలు విశాలము లగుమైదానములమీఁద మొదట నాకుపచ్చగాను పండిన పిదప బంగారు పోతబోసినట్లు పచ్చగాను దర్శనీయములై పంటకాఁపుల నానందవార్ధి నోలలాడించును. వానలు పట్టణవాసులకు విశేషసౌఖ్యకరములు కావు. కావున మేఘచ్ఛిన్నమై నల్లనైన యాకాశమువలెనే హేమచంద్రునిహృదయము విషాదపూరితమై యుండెను. తొలుత భయపడినట్లే యారాజధానిలోఁ దగిన యుద్యోగము సంపాదించుకొనవలయునని యతఁడు చేసినప్రయత్నములు నిష్ఫలములయ్యెను. జీవనాధారములు దొరకక గిజగిజ తన్నుకొనుచు సర్వప్రయత్నములం జేయుచు నొండొరులం గెంటికొనుచు నానాశ్రమలం బడుచుండు జనుల మధ్య తన మొగము జూచువారు తనకుఁ దోడ్పడువారు దొరకరని యతఁడు నిరాశఁ జెందెను.

అతఁడు పట్టణమునఁ జూడవలసినవారినిం జూచి చేయఁదగు ప్రయత్నము చేసి గృహమునకు వచ్చునప్పటికిఁ బరమపతివ్రతయు సాధుశీలయు నగుబిందు భర్తనిమిత్తమేదో మంచివస్తువుచేసి యుంచును. చెఱకుముక్కలు పుచ్చకాయ బద్దలు పూరవేసినయుసిరికాయలు నిమ్మపండ్లరసముఁ జక్కెరయు కలపినచల్లనినీరు సిద్ధముచేసి బిందు మగనికి వేసవికాలశ్రమ దీర్చుచుండును. అవి త్రాగి సేదదేఱి హేమచంద్రుఁడు మనోవిషాదమునెల్లఁ దొలఁగించెడుబిందుసంభాషణలను విని సకలవ్యథలను భంగములను మఱచిపోవును. సాయంకాలమైనతోడనే బిందు తన ముద్దులబిడ్డలం దీసికొని డాబామీఁదికి బోయి భర్తసమీపమందుఁ గూర్చుండి తమ యూరిమాటలందలపెట్టి ప్రశాంతమైనయాగ్రామమునకును మనుష్యులగుంపులనెడు మహాతరంగములతో నిండియున్న యీపట్టణ మహాసముద్రమునకును గలభేదముఁ జెప్పుచు నాతనివినోదపెట్టుచుండును. ఆమె తనయూరనున్నప్పటికంటెఁ గొంచెము చిక్కెను. కలకత్తాలో నెల్లప్పుడు గాలి లేనిగదులలో నివసించుటచేత మొగము వివర్ణమై వికాసశూన్య మయ్యెను.

పరమమిత్రుఁడగు శరచ్చంద్రుఁడుమాత్రము ప్రతిసాయంకాలము వారినిఁ దప్పక చూడవచ్చును. అతఁడు రాఁగానే బిందు వంటయిల్లు విడిచి యాముదపు దీపము వెలిగించి చాపపఱచి యాతనికడఁ గూర్చుండును. శరచ్చంద్రుఁడు హేమచంద్రుఁడు సుధాబిందులం గలసి యిష్టగోష్ఠితో సాయంకాలము సుఖముగ గడుపుచుండును. శరచ్చంద్రుఁడు చాకచక్య మధికముగఁ గలవాఁడు. కాలేజీలో నేర్పబడి విద్యార్థులమనస్సులమీఁద ముద్రితములైనట్లు నాటుకొను ప్రకృతిశాస్త్రములు దేశచరిత్రములు మొదలగు నాంగ్లేయ విద్యలంగూర్చి యతఁడు విసుఁగు విరామము లేక వారితోఁ జెప్పుచుండును. అప్పుడప్పుడు కలకత్తానగరముయొక్క సంపదలు దారిద్ర్యములు మహాసౌఖ్యములు దుఃఖములు వర్ణించి చమత్కారముగ నుపన్యసింపుచుండును. అందు ముఖ్యముగ దన దేశస్థులైన మహనీయులు లోకోపకారార్థమై పడెడుపాటులం గూర్చి యుపన్యసించునప్పుడతఁడు కంఠమెత్తి తీవ్రమైనపలుకులం బలుకుచుండును. ఆ లోకోపకారులలో ముఖ్యముగ నేమహనీయుఁడు సంఘసంస్కారణమునకు బంగాళాభాషాభివృద్ధికిఁ దన జీవితము ధారవోసెనో యావిద్యాసాగరుని, తన్నిమిత్తమే శరీరసౌఖ్యము గోలుపోయి ప్రాణములర్పించిన యక్షయకుమారునిఁ బలుమాఱులు ప్రశంసించుచుండును. బంగాళాదేశమందు శ్రీరాజారామమోహనరాయలువలెనే యుత్తరహిందూస్థానమందు బరిశుద్ధాస్తిక మతముంబోధించిన శ్రీదయానందసరస్వతినిగూడ శ్లాఘించుచుండును. బంగాళాభాషలో ననేకచిత్రవచనగావ్యములు వ్రాసిన బకించంద్రచటర్జీయు నద్భుతమైనకవిత్వముఁ జెప్పినమధుసూదనదత్తు, విద్యావిషయమున జనులకు గొత్తక్రొత్త చవులు కొలిపిరని మెచ్చుచుండును. మఱియుఁ బ్రపంచమునందలి యితర భాగములలో బ్రిటిషువారి పాలనక్రింద నున్నజనుల కేస్వాతంత్ర్యములు కలవో యవియే మనదేశస్థులకుంగూడ సంపాదింపఁ జాల బ్రయత్నించిన రామగోపాలుఁడు హరిచ్చంద్రముఖర్జీ సంస్తవనీయులని భాషించుచుండును; శరచ్చంద్రుఁడు వెనుకటి మహనీయులప్రశంసతో దనివినొందక పూర్వులమార్గమునే యనుసరించి దొరతనమువారి కొలువుకూటములలో హిందూదేశస్థుల యభిప్రాయములుగూడ నెఱిఁగించి స్వాతంత్ర్యముల సంపాదింపఁ దలంచు నానాటి సత్పురుషులం గూర్చియు నెడనెడఁ జెప్పుచుండును. అప్పటిగవర్నరుజనరలుగారైన రైపను ప్రభువుగారు దేశపరిపాలనమందు హిందువుల యాలోచనమును సహాయమును స్వీకరించినందు కాయనను బలువిధముల బహుమాఱు కొనియాఁడుచుండును. శరచ్చంద్రుని యుపన్యాసములను హేముఁడు తమ్ముని మాటల కలయ

నన్నవలెనే విని సంతసిల్లుచుండును. చిన్నప్పుడు తాళ్ళచెఱువు గ్రామమున మామిడికాయలు జామిపండ్లు దొంగిలించిన కుఱ్ఱఁడగు శరచ్చంద్రుఁడు కలకత్తాలో బహువిద్యలనేర్చి యింతవాఁడైనాఁడని పక్షపాతముగదుర, తోబుట్టువట్టు వాతని ప్రజ్ఞకు మెచ్చి బిందు సంతసించుచుండును. మక మకలాడుచున్న చిన్నదీపము గలయాగదిలో శరచ్చంద్రుని యుపన్యాసములను బిందు హేమచంద్రులే గాక మఱియొకర్తు గూడ వినుచుండును. వికాసవంతమైన శరచ్చంద్రుని మొగము కనఁబడినతోడనే సుధ నిద్రాహారములు మఱచి యొకమూల కూర్చుండి యాతనిపలుకులే వినుచు నాతనివంకనే చూచుచుండును, దేశసేవలఁజేసెడు లోకోపకారులను మెచ్చుకొనుచు వారివలెనే తనజీవితముంగూడఁ బరోపకారార్థము, గడుపదలంచినట్లు పలికెను. శరచ్చంద్రుని మృదుమధుర సంభాషణలను సుధ విని సంగీతము విన్నంత హాయిజెంది పరవశ యగుచుండును.

శరచ్చంద్రుఁడు మేఱలేని తన యుపన్యాసముల సందఁడి బడి యొకప్పుడు చమురంతయుఁ గాలి దీప మాఱిపోవువఱకు రమారమి రెండుజాములరాత్రివఱకు వారికడనుండి విధిలేక వారినద్ద సెలవుపుచ్చుకొని యెన్నో క్షమార్పణలు చెప్పి బయలుదేఱి నక్షత్ర కాంతులుమాత్రమే గల యా నిశీధసమయమున నిశ్శబ్దములగు పురవీధులంబడి తనయింటికిం బోవుచుండును. అప్పుడు బిందు హేమచంద్రులు చాలసేపగుటచేతఁ జల్లబడి బిరుసెక్కిన యన్నముఁ దిని పండుకొందురు. సుధ మద్యమువలె పారవశ్యము నొందించు మహానందముతో నిద్రించును. నిద్రాసమయములోఁ గూడ నిశ్శబ్దములైన తక్కిన రెండు జాములలో నామె చెవులలో మనోహరుఁడైన యొకానొక పురుషుని శ్రావ్య కంఠధ్వను లమృతబిందువులవలె పడుచుండును.

తొమ్మిదవ ప్రకరణము

కాలము గడచినకొలఁది శరచ్చంద్రునకు నూతనచైతన్యము గనగినట్లుండెను. విద్యాభ్యాసమునిమిత్తము పల్లెటూళ్ళనుండి పోయి కలకత్తా మొదలగు పట్టణములలో నుండెడు బాలురు మనోల్లాసము లేక యెంతో విసుగుతో జీవితము గడుపుచుందురు. ఇంగ్లాండులో నున్నట్లు హిందూదేశములో విద్యార్థులకు విద్య

నభ్యసించుకళాశాలలో నేబసలుండవు గావున చిన్నతనమందె తలిదండ్రులకు జుట్టాలకును దూరస్థులై విద్యార్థులు గృహసంబంధ మైనసౌఖ్యమును గాని కుటుంబములతో గలిసి యుండుటవలన జనించెడు లాభములను గాని పొందక బడివిడిచిపెట్టగానే సాయం కాలమున గొంచెమునే పాటలాడియో కసరతు జేసియో బసకుఁబోయి సంవత్స రాంతమునందు రాఁబోవు పరీక్షకుఁ జదువుచుందురు. ఈపరీక్షలో విజయము కలుగుటయే జీవనముయొక్క భవిష్యన్మార్గమునకు నాధారమై యుండెను. హిందూ దేశములో, విద్యార్థులకు నుపాధ్యాయులకు కళాశాలలో నేకాని యింటివద్ద సం బంధముండదు. ఒజ్జలు విద్యార్థుల ప్రవర్తనముల కనిపెట్టి వారినడతం దిద్దుట కవ కాశముండదు. గురుశిష్యుల కన్యోన్యప్రేమ యల్పము. ఒజ్జలు బాలురు కలసి మెలసి చర్చలుచేయుటకుఁ గాని యాటలవినోదములం బ్రొద్దుపుచ్చుటకుఁ గాని తగినసంఘములు లేవు. ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాలలోనే కలిసికొని పాఠములు చెప్పుదురు. అనంతర మావిద్యార్థులు పెనుగొడవలు గల బజారువీధినో జనబాహుళ్యము లేని సందుగొందులనో యుండు తమబసలకుఁ బోయి రాత్రి ప్రొద్దుపోవువరకును తెల్లవారుజామునను శ్రమపడి చదివి భవిష్యద్వృద్ధి కాధార మైన పరీక్షయం దాటితేలుటకుఁ దమశక్తిని కాలమును వినియోగింతురు. దుస్సహ మైన యీవిద్యాపరిశ్రమచే ననేకులు పడుచుతనమందే కాలధర్మము నొందు చుందురు. అనేకులు బ్రతికియుండి పరీక్షలయందుఁ గృతార్థులై జీవచ్ఛవంబుల వలె దొరతనమువారి కొలువులో నేచిన్నయుద్యోగమో సంపాదించుకొందురు. బలిష్ఠమైన ప్రవర్తనము ప్రోన్నతమైనబుద్ధి గలకొందఱు దుస్సహములైన యీబాధ లలో నడఁగిపోక యాకఠినజీవనములోనే యుత్తమమైన మార్గము వెదకికొని యుత్సాహ పూరితులై యాదరిద్రస్థితులలోనే గొప్పయూహలను హృదయమున నంకురింపఁజేసికొని పెద్దలై సంసారయాత్రలోఁ బ్రవేశించినపిదప దమకాలము శరీరము దేశమునిమిత్త ముపయోగింతురు. అట్టి మహనీయులు మృతజీవులై దేశ చరిత్రమందు గనఁబడుచున్నారు.

శరచ్చంద్రుడు పట్టణములో నేకాంతజీవనముచేత ననేకులవలె బలహీనుఁ డుగాక దేహదార్ఢ్యము మనోదార్ఢ్యముగలవాఁడై బాగుపడెను. కాని తఱచుగా నెవ్వరితో మాటలాడుట కిష్టములేక నేదోయాలోచించువాఁడువోలెఁ జూచు వారలకగపడుచుండును. తాళ్ళచెఱువుగ్రామమునుండి బంధువియోగియై వచ్చిన యీపడుచువానికంటె కలకత్తానగరములో నున్న విద్యార్థు లెవ్వరు నెక్కువ పరిశ్రమఁ జేసియుండరు. ఈతనివలె నుల్లాసము లేనివారు నుండరు. విచారమే

యాతని స్వభావమున కచ్చముగ సరిపోయినట్లుండును. సాయంకాలమునఁ దోడి విద్యార్థులు షికారునకుఁ బోవునప్పుడు నయిన నితఁడిల్లు కదలక దీపములు పెట్టక మునుపు కనుచీఁకటి వ్యాపించు చుండఁగ దనచీఁకటిగదిలో నిట్టటు పచారులు చేయుచు నాంగ్లేయమహాకవులలోఁ దనకిష్టుడైన సత్కవి గ్రంథమునుండి యావేశము దెప్పించునట్టి పంక్తులను గొన్నిటిని గట్టిగ వల్లించుకొను చుండును. ఇట్లు శరచ్చంద్రుఁడు తనరహస్యములను మనోరథములను లోలోనఁ బెంచికొనుచు దాను వేరొక ప్రపంచమున నున్నట్లు జీవించుచుఁ గష్టపడి విద్యాభ్యాసము చేయుచుండెను. చిరకాలవియోగ మైనపిదప వెండియు నొకసారి చిన్నతనమందున్నట్లె సుధాబిందు హేమచంద్రులం గలిసి యుండెడిభాగ్య మొదగూడుటచే శరచ్చంద్రుని జీవనమునకు నూతనతేజము కలిగెను. ఆతనియభిలాషములలో నొకమార్పు కలిగెను. చక్కనిజవరాలివిలాస మేకాంతజీవనముచే లోలోనడఁగి యున్నదృఢానురాగము గలమనుష్యునికి మనసుమీఁద బనిచేసినట్లితర మనుష్యునికిమనస్సు మీఁద బనిచేయదు. స్త్రీజనస్వభావమైన దయతో నిండినయొక్కమాట యతని హృదయమును మరల్చును. స్త్రీసామాన్యలక్షణ మగునొక్కయాదరణ యతని నానందపరవశంజేయును. బిందుయొక్క సాధుస్వభావము నామె యాదరణము నామె కాతనియందు నాతనిగుణములయందుఁ గలమంచియభిప్రాయము శరచ్చంద్రున కదివరకెన్నఁ డేయాఁడుదానియందు గుదురని గౌరవ మామెయందుఁ గలిగించెను. ఆమెశాంత స్వభావము వానిమనస్సున కొక క్రొత్త వికాసము గలిగించెను. పేదతనములో నానందనిలయమగు నామెగృహము శరచ్చంద్రునిమనసు నాకర్షించెను. ఇట్లనేకమాసము లతఁడీక్రొత్త యానందప్రపంచమున బ్రొద్దులు గడపఁజొచ్చెను. జన్మమెత్తినతరువాత నతడు యోగ్యురాలగు స్త్రీయాదరణ మనియెడు నెండ కాఁగుట కిదియే ప్రథమము. హేమచంద్రునకుఁ గలకత్తానగరము గ్రొత్తతావగుటచేఁ దనయూరివాఁడు నెచ్చెలియగు శరచ్చంద్రుని రాకకుంగడు నలరివానిం దమ్ముని కరణి నాదరింప జొచ్చెను. సుధయు నర్థములేని చిఱునవ్వుల నవ్వుచు నింటికి వచ్చినప్పుడెల్ల నప్పబావలుం బోలె శరచ్చంద్రు నాదరించు చుండును.

ఇట్టు లప్రయత్నముగనే సుధమీఁదమృదువైన యనురాగమాతని హృదయమునం బ్రవేశించెను. ప్రభాతకాలమున నతఁడు గదిలో చదువునిమిత్తము కూర్చుండునప్పు డామె సుందరవిగ్రహము వానికన్నులయెదుట నిలువంబడినట్లు కానఁబడుచుండును. పుస్తకములమీ[illegible]ధ్యానము లేనప్పు డామెమీఁదఁ ధ్యానము

నిలుపుచు వచ్చెను. మనోహరములుగ నుండని ప్రాచీనదేశచరిత్రముల నంతకంటె రుచిలేని యీకాలతత్త్వ శాస్త్రములను జదువ నతఁడు ప్రయత్నించునపుడు మనసు వాటిమీఁద కరుగదయ్యె. పులకాంకురములు మేనంతయుఁ బొడమఁజొచ్చె. కాలేజీ యావరణములో నతఁడొంటిగఁ దిరుగునప్పుడు చెవిలో మృదువైనస్వరము లాతనికి వినఁబడ జొచ్చెను. తన మనోరథంబులకుఁ దన యనురాగంబులకు నిలయమైన యాగృహమునకు బ్రతిసాయంకాల మతఁడు పోవుచుండ వారింజూడ వలయునను కోరికగాక యంతకంటె నెక్కుడదేదో యాతనిని ముందుకు గెంటుకొచ్చెను. స్వసౌఖ్యప్రదమగు రహస్యాభిలాషను దీర్చుకొనవలయునని మనమేకోపనిఁ జేయునప్పుడు సయితము దానిని మఱచిపోయి, పరోపకారము నిమిత్తమే పాటుపడుచున్నట్లు మన మప్పుడప్పుడు తలంచుకొనుచుందుము గదా! అందుచేతనే ప్రతిదినము సాయంకాలము చదువుం గట్టిపెట్టి ప్రియజనదర్శనము చేయఁదలఁచి శరచ్చంద్రుఁడు భవానీపురమునకుఁ బోవునప్పుడెల్ల క్రొత్తపట్టణములో నెవ్వరినెఱుఁగక నొంటిగ నున్న తనయూరివారి కుపకారము సేయ బోయినట్లే భావించుకొను చుండును. ఆగృహంబునుండి యర్ధరాత్రమున నిర్మనుష్యములగు వీధులంబో నడిచి యతఁడు బసకుఁ బోవునపుడు తనసహాయ మపేక్షించిన చుట్టాలనిమిత్తము తాను చదువైన మానుకొని వెళ్ళినట్లతని మనస్సు సంతుష్టిఁ జెంది సంతోషముఁ జెందుచుండును.

ఒకనాఁడు శరచ్చంద్రుఁడు సాయంకాలమున మిత్రగృహమునకుఁ బోయినప్పుడు హేమచంద్రుఁ డప్పటి కింటికి రాలేదు. బిందు వంటయింట బనిఁజేసికొను చుండెను. సుధ డాబామీఁద శరచ్చంద్రుని సమీపమునఁ గూర్చుండెను. అప్పుడు నల్లని యాకాశమండలమున నక్షత్రములు వజ్రములవలె మెఱయుచుండెను. మలయమారుతములు చెట్లాకులం గదపఁజొచ్చె. పగటియెండల తహతహంబడినవారికి చల్లగాలి యెంతో సౌఖ్యప్రదమయ్యెను. చీకటులు తఱుముకొనివచ్చుటచేత విసవిసం బరువెత్తి దాఁగుకొనునో యనునట్లు సూర్యబింబ మప్పుడప్పుడె పశ్చిమసముద్రమునఁ గ్రుంకె. నిశ్శబ్దమైన యాసమయమున సుధ లెక్కకు మీఱిన యానక్షత్రములకాంతిని మిక్కిలి యక్కజముతో జూచుచుండెను. అత్తరి చంద్రబింబమువలె మెఱయుచున్న సుధ ముఖారవిందముఁ జూచి శరచ్చంద్రునకు వలపుక్రొవ్వులు తలకెక్కెను. అదివఱకు పలుమాఱులు తేజోరాసులగు నక్షత్రముల కాంతిగూర్చి వా రిరువురు ముచ్చటించిరి. శరచ్చంద్రు డదివఱ కెన్నోసారులు గ్రహరాజగు సూర్యునిచుట్టుఁ దిరుగుచు గగనమండలమును తేజోవంతముగ జేయు

గ్రహముల నామధేయముల నామెకుజెప్పి మూఁడువేల సంవత్సరముల క్రిందటనే మన పూర్వజ్యోతిశ్శాస్త్రజ్ఞులీగ్రహసంచారమును మిక్కిలి నేర్పుతోఁగనిపెట్టిరని బోధించుచువచ్చెను. మఱియు నక్షత్రము లనంతకోటు లనియు మనకన్నులకుం గనఁబడునవిగాక కానఁబడనివి కోటానకోటు లున్నవనియు దక్షిణదిక్కునుండి యుత్తరదిక్కునకు వ్యాపించి మనకన్నులకుఁ దెల్లగ నగపడు రేఖనే మన పెద్దలాకాశగంగ యని చెప్పుదురనియు బలుమాఱు చెప్పి జ్యోతిశ్శాస్త్ర సంబంధములైన మనపూర్వగాథల ననేకముల నెఱిఁగించుచు వచ్చెను. మఱియు సర్వనియామకుఁడగు భగవంతుని శాసనంబునఁ దమతమ కక్ష్యలలో నించుకేనియుఁ గ్రమముతప్పక సంచారములు చేయునవంతగ్రహములం గూర్చి యుపన్యసించి యాగ్రహములలో చిత్రవిచిత్రములగు జంతుకోటు లున్నవనియు లేవనియుఁ బండితులు సేయువాదములఁగూర్చి ప్రసంగించి జ్యోతిశ్శాస్త్రవిషయమునఁ జాలజ్ఞానమును గలిగించెను. ఈయుపన్యాసమువలన సుధ క్రొత్తప్రపంచముఁ జూచినట్లు సంతసించెను. నక్షత్రములంగూర్చి క్రొత్తకథ లనేకములు నేర్చికొనెను. ఈజ్ఞానముఁ గలిగించినజ్ఞాననిధానమైనబాలకునియందు మునుపటికంటె నెక్కువప్రేమము నిలిపెను. అట్లు కొంతసేపు చుక్కలవంకఁజూచి యామె సంతసించి "ఈరాత్రి నీవునక్షత్రముల గుఱించి చెప్పుట లేదేమి? వాటింగూర్చి నీవు చెప్పుచుండఁగా నాకు విననలెనని యున్న"దని శరచ్చంద్రునిం బలుకరించెను. శరచ్చంద్రుఁడు కలగనుచు మేల్కొన్న వానివిధమునఁ దెలివి దెచ్చికొని చుక్కల వెలుతురున మెఱయుచున్న సుధ నేత్రమువంక [illegible]చి నేనీవేళ నక్షత్రములం గూర్చి యాలోచించుట లేదని బదులుచెప్పెను. అ[illegible] సుధ తన సహజమైన యమాయకత్వముతో "అట్లయిన నీవు దేనినిగూర్చి య[illegible]చుచున్నా" వని యడిగెను. "నేనా! ఈప్రపంచమును గురించి; యందు[illegible]కుటుంబమును గురించి యాలోచించుచున్నా"నని బదులుచెప్పెను. "కుటు[illegible]ను గూర్చి నీవాలోచింప వలసిన దేమున్నది; తల్లి, అప్పగారు కావలసినంతమంది బంధువులు నీకున్నారు. మీయూరిలో నీకు మంచియిల్లున్న" దని సుధ నుడివెను. "మాయూరు నాకు మిక్కిలి ప్రియమైనదే కాని యెందరున్నను నాదెంకను సంపూర్ణమైన కుటుంబము కాదు గదా? అప్పలు చెల్లెండ్రు తల్లిదండ్రులు మొదలగు చుట్టముల వలనఁ గలిగెడు సౌఖ్యముగాక మనుష్యున కితరసౌఖ్యములు గూడ కలవుగదా" యనెను. అనఁగానే సుధ క్షణమూరకుండి యతఁడేవిషయమును మాటలాడుచున్నాఁడో యది తెలిసికొనలేక ననుమానము లేని మనస్సుతో "నీవన్నది నాకుఁ దెలిసినది లే, నీవు మంచియదృష్టవంతుఁడవు నీకు మంచికుటుంబసౌఖ్యమే కలు

గును. నీవు త్వరలోనే పెండ్లియగును. నీపెండ్లామంత యదృష్టవంతురా లెవ్వతెయు నుండదు. నీపెండ్లియైన తరువాత మేమందరము మీయింటికి వచ్చి నీపెండ్లామును జూచుచుందు" మని సుధ మాఱుపలికెను. అనవుడు సుధ పలికిన పలుకులకుఁ దగినయుత్తరము తనమనంబున దోపమి శరచ్చంద్రుడు మొగ మవ్వలప్రక్కకుం ద్రిప్పి తనచేతితో నామెచేయిం బట్టుకొనెను. అప్పటికిని సుధ యాతని మనోభావము గ్రహింపలేక "యేమోయి! నీచేతులు చల్లగ నున్నవేమి. మాటాడవేమి, నామీఁద కోపము వచ్చినదా యేమి. లేక నాకుఁ జెప్పఁ గూడదని దీర్ఘాలోచన యేమైన నున్నదా" యని ప్రశ్నవైచెను. వై మటయుఁ జిరకాలమునుండి మనంబున నడిగియుండిన యభిలాష పొంగి పొరల నేనోయొకమాట యనదలచిఁ "అందునా మానుదునా" అని యతఁడు కలవరము పడజొచ్చెను. ఎట్టకేలకు మాటయు నోటి చివరకు వచ్చెను కాని యాకాలము స్థలము వానియెడ శత్రుభావము వహించెను. అంతలో డాబా మెట్లమీఁద నడుగులచప్పుడు వినబడెను.

హేమచంద్రుఁ డింటికిఁ బ్రొద్దుపోయి వచ్చి బిందుంగోడ్కొని డాబా మీఁదికి వచ్చెను. బిందు సుధాశరచ్చంద్రులజూచి మగనితో "చూడండీ! యీకుఱ్ఱవాండ్రు. ఈనక్షత్రముల గొడవలో బడి యన్నముగూడ మఱచిపోయినారని పలికెను. ఆదంపతులు మెట్లెక్కివచ్చుచున్న జాడ గనిపెట్టి దొంగవలె సుధాసమీపము విడిచి డాబా చివరకు బోయి యేమియు నెఱుగనివానివలె నక్షత్రములు జూడ నారంభించెను. అతని గుండెలు తటతట గొట్టుకొనెను. అతనికాళ్ళు వణకసాగెను. అప్పుడతడు మనసులో "అమ్మయ్యా! దేవునిదయవల్ల నోటిచివరకు వచ్చినమాట జారవిడువ[illegible]దు నయమే; భగవదనుగ్రహమువలన పరువు దక్కినది కాని లేకున్న కొం[illegible]వ్వకొని పోవును. నమ్మి చనువిచ్చినవారియింట నేను ద్రోహము ద[illegible] దైవముకాపాడె" నని తలంచి తనకీయాపద గడువంబెట్టినందుకు భగవంతుని నొక్కనిముసము ప్రార్థించి మనస్సు కుదురు పరచుకొని బిందుకడకు వచ్చి యామెతో మెల్లగ నిట్లు మాటాడెను.

'బిందు వదినె! ఔను. నీవన్నట్లు నక్షత్రములవంక జూచుచు నింకె నవకతవక ప్రసంగముల జేయుచు తిండి మరచిపోయి కాలమువృథాగా పాడుచేయుచున్నాను. ఇఁకనైన జాగ్రత్తగ నుండ వలయును. పరీక్ష దగ్గరకు వచ్చుచున్నది. పరీక్షలో దేఱవలెనన్న గట్టిగాఁ గృషిచేయావలెను. మీకీయిల్లు ప్రస్తుతము సుఖముగ నున్నదిగద! మీకేమైన సదుపాయములు కావలసివచ్చినప్పుడు మీరు నాతోఁ జెప్పండి. ఇఁక ముందు మునుపటివలె ప్రతిసాయంకాలము, బహుళః వారమున కొక

సారియైన పద్ధతిని వీలుండదు’ అనవుడు హేమచంద్రుడిట్లనియె. ‘అదిమంచి పని. నీకాలము యీమూలమున వ్యర్థమైపోవుచున్నదని మేము తలచుచుగా ననుకొని భయపడుచున్నాము. మాకేమికావలసినను దప్పక నీకువర్తమాన మంపుదుము. మాకునీవు చేయదగినపని యేమున్నను నీసహాయము తప్పక పొందుదుము. మేము మరియొక లాగున ననుకొందుమని తలంపకు. మన మన్నదమ్ములవంటి వాళ్ళమే! పరీక్షకుమాత్రము గట్టిగా జదువుము. నీవు ముందుముందు వృద్ధి కాగలవాడవు నీపనిమాత్రము మానుకొనవద్దు. తనకుమాలినధర్మము కలదా!’ అనిన తత్క్షణమే వారు విడిపోయిరి. శరచ్చంద్రుడు సుధపంక మఱియొకమాఱు చూచి మఱే మియుం బలుకక వీధిలోనికిం బోయి చీకటి యనుమహాసముద్రమునబడి బసకు బోవ జొచ్చెను. అతడు మెట్లనెగి వెళ్ళినతోడనే ‘అక్కయ్యా! శరచ్చంద్రునకు మన మీద నెందుకైన గోపము రాలేదు కదా?’ యని వ్యాకులచిత్తముతోఁ బలికెను. పలుకుటయు బిందు ‘అబ్బే! కోపమెందుకే. అతఁడు తనపరీక్ష యేమగునో యని బెంగఁ బెట్టుకొన్నా’డని బదులు చెప్పెను. అనంతర మొకగంట తరువాత హేమచంద్రుడు భోజనము జేసి తన యెప్పటివాడుకచొప్పున వీధిలోనికి షికారుబోయెను; సుధాబిందులు నిద్రపోయిరి అప్పటికి జంద్రోదయ మయ్యెను. వెన్నెలతో నిండిన వీధులు కలకల నవ్వునట్లుండెను. హేముడు తనలో దానేదో యాలోచించుకొనుచు రమారమి యొకగంటసేపు తిరిగెను.

కలకత్తాలో నిశ్శబ్దములైన వీధులన్నియు జంద్రోదయమున దీపితములయ్యెను. హేముడు భవానీపురము దాటిచాలదూరముపోయి బాలిగంజియను పేటబ్రవేశించు నప్పటి కొక గుఱ్ఱపుబండి చప్పుడువలన నతని యాలోచన కంతరాయము గలిగెను. అప్పుడతఁడు వెనుకకు దిరిగి చూడ ధగధగ మెఱయుచున్న [illegible]దీపములు గల [illegible]గుఱ్ఱములబండి యొకటి వాని కగపడెను. హేముఁడు ప్రక్కకొత్తిగిలి నిలువఁబడెను. ఆబండి యాతని ప్రక్కనుండి రయముగఁ బోయి మంచిదీపముల చేత నలంకృతంబై తోఁటనడుమనున్న యొకగృహమువద్ద నిలిచెను. ఆబండి, క్షణాక్షణమునకు నల్లగుఱ్ఱములుగల మఱియొకబండి వచ్చి యాదారినే పోయి యాతోఁటనే బ్రవేశించెను. ఆబండి నడుచుచుండఁగా హేమచంద్రునకు లోపల కూర్చుండిన స్త్రీలనవ్వులు వినఁబడెను. అది యేమో తెలిసికొనఁగోరి యతఁ డాతోటద్వారముకడకుఁ బోవ నక్కడ గుమ్మముముందర నిట్టటు దిరుగుచున్న దీర్ఘదృఢకాయుఁడగు మనుష్యుఁడొకఁడు కనఁబడెను. లోపల నడుమటకుఁ జక్కఁగఁ దీర్పబడిన బాటను కలిగి నానావిధములగు మొక్కలు గలిగి

యక్కడక్కడ స్ఫటికవిగ్రహములు కలిగి చిత్రచిత్రముగ నీటిం బయికి వెదఁజల్లు ధారాయంత్రములు గలిగి యతిమనోహరమగు నొక యుద్యానవనము కనఁబడెను. అందుండు భవనములలో వెలిఁగించినదీపములకాంతి ప్రతిగవాక్షము నుండి మంటలట్లు గనఁబడు చుండెను. అవి యన్నియుం జూచి హేముఁడు మెల్లఁగాను వినయముగాను దర్వాన్‌జీ! యీతోఁట యెవరి దని యడిగెను. ఆ ద్వారపాలకుఁడు చేతితో గడ్డము మీసము సవరించుకొని యిట్లుత్తరము చెప్పెను. "అయ్యా! ఈతోఁటయిల్లు నెవరివో యెఱుఁగవా! ఈపట్టణమునం దున్నగొప్ప వారందఱీతోఁటయిల్లెఱుఁగుదురు. అందఱు నిందు విందారగించినవారె! నీవు క్రొత్తవాఁడ వని తోఁచుచున్నది" "అవును నేనీమధ్యనే యిక్కడకు వచ్చినాను. కాని యీవైపెప్పుడు రాలే"దని హేముఁడు బదులు చెప్పెను "అంతేకావచ్చును ఏమన నీచుట్టుప్రక్కల నున్న వారందఱు నీయిల్లెఱుఁగుదురు. గొప్ప బిరుదులు పొందినవారు, జమీందారులు, ప్లీడరులు, వర్తకులు వేయేల? కలకత్తాలో నున్న గొప్పవారందఱీతోఁటలోనికి వచ్చి పోవు చుందురని ద్వారపాలకుఁ డుత్తరముఁ జెప్పెను "నీవు చెప్పినది నిజమే. నేను పేదవాఁడ నగుటచేత నీయుద్యానవనము సంగతియు దీనియజమానుని సంగతియు నాకంతగాఁ దెలియ దని హేముఁడు పలికెను. అనవుడు ద్వారపాలకుఁడు చిఱునవ్వు నవ్వి యొకవిధమైనరీవితో "అవును మాయజమానుఁడు మీవంటి బీదవానిని పిలుచునా? ఈరాత్రి మంచి మేజువాణీ యున్నది. మాయజమానుని స్నేహితులందఱు వచ్చుచున్నారు. ఈయూరినాటకశాలలో నాట్యమునకు మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన దొకర్తుక యా మేజువాణీ జూచుటకు దయచేయును. కలకత్తాలో నున్న పెద్దమనుష్యులనేకులు దాని నగుమోము జూచిన మాత్రముననే తరింపఁగలమని దానికోసమే వత్తురని పలికెను. "మీతోఁటయజమానుఁ డెవరో చెప్పవైతి" వని హేముఁడు వానిని మరల నడుగ నతఁడు నవ్వుచు నిట్లనియె. "ఓయి వెఱ్ఱివాఁడా! నీవు నిజముగ నెఱుఁగనే యెఱుఁగవా? ధనపురజమీందారులైన ధనంజయప్రభువుగారిదీ తోఁట. ఈమాటలు వినఁగానే హేమచంద్రుఁడు పిడుగుపాటున నడగినట్లు భయపడి చప్పుచప్పున వీధిప్రక్కనున్న యొకయరుఁగుమీఁద చతికిలంబడి తన రెండుచేతులం బట్టుకొని కూర్చుండెను. అప్పు డతనికి నిమిష మొకయుగము వలె దోఁచె. కన్నులనుండి తొరఁగుబాష్పములు నేల తడుపంజొచ్చె. అప్పుడు కొండొక సేపువగచి నిట్టూర్పు విడిచి యాతఁడు తనలో నిట్లనుకొనియెను. "అయ్యో! ఊహా! భాగ్యము మేడలు మిద్దెలు నల్ల గుఱ్ఱములు తెల్ల గుఱ్ఱములు సౌఖ్యము నీయజాలవు గదా? ఇందుచేతనే నీవెల్లప్పుడెంతో చిన్నవోయి మన

నులో నేదో బాధపడుచున్నట్లె కనఁబడు చుండును. అట్లు తలంచుచు హేమచంద్రుఁ డరగంటసేపు నోటమాటరాక విచారించి యెట్టకేల కతఁడొక దృఢనిశ్చయముఁ జేసికొనెను. ధనంజయుఁడు వివాహమైనప్పటినుండి తాళ్ళచెఱువు గ్రామమునకు వచ్చుచుబోవుచుండుటఁజేసి హేమచంద్రునకుఁ బరిచితుఁ డగుటయేగాక యాతనియెడ గౌరవము జూపుచు వచ్చెను. అందుచేత నాతనికి మంచి సలహానిచ్చి దురాచారములనుండి యాతనిం ద్రిప్పఁ దలచెను. ఇట్లు చేయుట కారాత్రియే యాసందడిలోనే ధనంజయునిఁజూచి మాటాడుట మంచిదని హేముఁడు తలంచెను. తలంచి లేచి ద్వారముకడకుఁ బోవ, నీకేమి కావలయునయ్యా! చాలాసేపటినుండి యేమిపనిపాటలు లేకుండా నీవీ చుట్టుప్రక్కలనే తిరుగుచున్నావని ద్వారపాలకుఁ డడిగెను. "నేను మీయజమానునిఁ జూడవలయును. లోనికి బోవచ్చునా?" యని హేముఁడు మరల నడిగెను. అనవుఁడు ద్వారపాలకుఁ డిట్లనియెను. "ఈవిందునకు మిమ్ము బిలువలేదని నేతలంచుచున్నాను. ఇటువంటి మహోత్సవసమయములయందు మీవంటివారిని సాధారణముగ బిలువరు. మీరులోపలికిఁ బోవుట మాయజమానున కిష్టముండదు. అన హేముఁ డిట్లనియె. నాపేరు హేముఁడనియు నేను తాళ్ళచెఱువునుండి వచ్చితి ననియు మీయజమానునితో జెప్పుము; చెప్పగానే యాయన నాకు దర్శనమిచ్చును. అప్పలుకులకు ద్వారపాలకుఁడిట్లు బదులు చెప్పెను. చాలమంది పల్లెటూళ్ళవారు తాళ్ళచెఱువునుండి గీళ్ళచెఱువునుండి మాయజమానునిఁ జూడవచ్చు చుందురు. ఆలాటివారిని జూచుట కాయన కీపెద్దపట్టణములోఁ దీరుబడియే యుండదు. అన హేముఁ డీక్రింది తెఱంగున వానికి బదులుచెప్పెను. దర్వాంజీ! మీయజమానుని యత్తవారు తాళ్ళచెఱువు. అందుచేత బాల్యమునుండి యెఱిఁగినవాడనగు నన్ను లోపలకు రానియ్యకపోఁడు. ఈమాటలు వినఁగానే ద్వారపాలకునకు కొంచెము జంకు పొడమ 'నీయనను లోపలకు పోనిత్తునా' యని తలంచి సందేహించి మరల తనలో 'ఈయన మాయమ్మగారి పుట్టినింటివంకవాఁడైన పక్షమున నీయన కగౌరవము జేసితినని మాయజమానుఁడు కోపింపవచ్చు' ననుకొని యాయన కొకకుర్చీ నిచ్చి కూర్చుండబెట్టి యాయన రాక యజమానునకు నెఱిఁగింప లోపలకుఁబోయెను. హేముఁ డరగంట కనిపెట్టుకొని యుండ నెట్టకేల కాపరిజనుఁడు వచ్చి "యజమాని సెలవైనది లోపలకు దయచేయుఁ" డని చెప్పి తాను ముందుండి దారిచూపి విశాలములైన మెట్లమీదనుండి గొంపోయి మేడ యెక్కించి చావడిఁ బ్రవేశపెట్టెను.

ధనపురపు జమీందారులైన ధనేశ్వరకుటుంబము వారిలో ధనంజయుఁడే పెద్దవాఁడు. హేముఁడు లోపలి కరుగునప్పటి కతఁడు తన శృంగారపు చెలికాండ్రు పరివేష్టింప నొకగదిలోఁ గుర్చీమీఁద కూర్చుండెను. హిందువు లెంత భాగ్యవంతులైన నెంతదురాచారములలోఁ బడి భ్రష్టులైనఁ దమచుట్టములను గౌరవించుట మాత్రము మఱవరు. ధనంజయుఁడు కుర్చీమీఁదనుండి లేచి తన భార్య పినతండ్రికూఁతురు మగఁడగు హేమచంద్రునిఁ బలుకరించి కుశల మడిగి అతలఘుమెత్తలుగల కుర్చీమీఁద గూర్చుండ బెట్టెను. తోడియల్లుఁడు చేసిన గౌరవమునకు హేముఁడు మిక్కిలి సంతసించి గదినైపుఁ జూచి యచట చేయబడిన యలంకారమును గని యద్భుతము నంది నిశ్చేష్టుడయ్యెను. అతఁడదివరకు కొన్నిసారులు వీధిలో నిలిచియుండి నారంగియను పేటలో నున్న దివ్యభవనముల వంటి దొరలమేడలు చూచెను. మఱియు గవర్నరు జనరలుగారి మహామందిరముయొక్క సింహద్వారములను గూడ బలుమారు చూచెను. కాని సాహసించి యెన్నడు లోనంజేరలేదు. డాలహౌసీ చౌకులోను పాతఁకోర్టు వీధిలోను మహాశోభతో దీర్పఁబడి యుండు నింగ్లీషువర్తకుల యంగళ్ళ (షాపులు) గూడ కొంత దవ్వునుండి పలుమాఱు తొంగితొంగి చూచెను కాని జన్మమధ్యమం దెన్నఁడు ధనపురపు జమీందారు తోఁటలోనున్న మందిరమువంటి రాజమందిరమును ప్రవేశించి యెఱుఁగఁడు.

ఆజమీందారుని స్నేహితులలోఁ గొందఱు చమత్కార సంభాషణలకు దెలివి తేటలకుఁ బేరుపడినవారదివరకే యక్కడకు వచ్చియుండిరి. ధనంజయుని కుడిప్రక్క చిఱునవ్వులు నవ్వుచు సుమతి యనునొక నవయౌవనప్రాయుఁడు నల్లని యంచులుగల ధోవతిగట్టి యట్టియంచులేగల యుత్తరీయ మొకటి పల్లెవాటుగ వేసికొని కూర్చుండెను. ఈయన కేయుద్యోగము లేదు. ఈయన కలకత్తాలో గొప్పబిరుదులు కలవారి యొక్కయు భాగ్యవంతుల యొక్కయు నండను నంటిపెట్టుకొని తిరుగుచుండును. ఈతఁడు తేనెటీగవలె భాగ్యవంతుల గృహములనుండి ధనము స్వీకరించి తేనెపట్టువంటి తన యిల్లు నిండవేసికొనును. ఈయన జోడుగుఱ్ఱపుబండి పురజనుల కందఱకు నానవాలే. ఈయన తనఖాదస్తావేజులు వ్రాయించుకొనియు, ప్రామిస్సరీనోట్లు వ్రాయించుకొనియు సాధారణముగ వడ్డీ కప్పులిచ్చి ముఖ్యముగ ముందుముందు జమీందారులు కావలసిన మైనర్లకు సలహాలు చెప్పి వారికెంతో యాప్తుఁడై యుండునని యాయనం జూచినతోడనే చుట్టుప్రక్కలవారు గుసగుస లాడనారంభించిరి. కాని యా

మాటలు గట్టిగా నెవరు జెప్పఁగొనలేరు. సుమతి వద్ద చమత్కారసంభాషణలు ప్రజలు నోటిమంచితనములు గలవనుటకు సందేహము లేదు. ఆతని పొరుగున యదునాథు డను పెద్దమనుష్యుఁడొకఁడు కాపుర ముండెను. అయనయు జిత్రసంభాషణలకు విశేషజ్ఞానమునను నందివేసిన చెయ్యియని చెప్పవచ్చును; ఆయన ప్లీడరు. వేషభాషలయందు నాచారములయందు నీత డింగ్లీషువారిపద్ధతుల నవలంభించెను. అందుచేత నాంగ్లేయపద్ధతులమీఁద విందులు నడుపువా రావిషయములైనసంగతు లేవి తెలిసికొన వలసివచ్చినను వానికన్నిటికి నీయనయే ప్రమాణము. విదేశపు సారాయములలో నేదిమంచిదో యీయనయే చెప్పవలయును. విందులకు బిలుచునపుడు పంపబడు చీటుల విషయమున నాయనమాట ధర్మశాస్త్రమే. ఆయన యుపన్యాసము లిచ్చుటలో మేటి. ఆయన వెనుక నొకసారి హిందూజాతీయత్వము హిందువుల యాచారముల శ్రేష్ఠత్వము ననువిషయములంగూర్చి నగరమందిరమం దిచ్చినయుపన్యాసములు విని పురజనులు మహానంద భరితులైరి. ఆయన యదృష్టమేమోకాని పడుచువాండ్ర కందఱ కాయనమాట గురి. భాగ్యవంతుల కాయన పరమమిత్రుఁడు. వివాహసంబంధములు గావలసిన వారి కాయన యాలోచన మత్యావశ్యకము.

ఆయన వెనుక పూర్వపు పద్ధతిలోని వాఁడగు హరిశంకరుఁడు కూర్చుండెను. తెల్లకోటు, కోటుజేబునకంటి తళతళ మెరయుచున్న దట్టమగు బంగారపు గొలుసు గల పూర్వపద్ధతివేషము నాయన ధరించెను. ఈయన పూర్వకాలపు వాఁడగుటచే నూహలు మాటలు బూర్వకాలపువై యుండెను. ఆయన కింగ్లీషు భాషలో గల జ్ఞానము విశేషమైనదికాదు. కాని తెలివి మాత్ర మసాధారణమైనది. కావున బుద్ధిసూక్ష్మతకు బేరువడిన పడుచువాండ్రనేకులు హరిశంకరుఁడు సుఖముగా జేసెడుజీవయాత్రను జూచి రమ కట్టిది సంభవింప దయ్యెనని విచారపడుచు వచ్చిరి. నవనాగరకులగు నీకాలపు బంగాళీలవలె బోడితలతో నీయన కచేరీలకు వెళ్ళక సన్నని పొడగ చుట్టకుదురులాగున జుట్టి తలపైబెట్టుకొని పోవుచుండును. ఈయన మాటలాడునట్టి యింగ్లీషుకూడ పూర్వకాలపు వారి యింగ్లీషువలె మిక్కిలి యేసగానుండును. అందుచేత క్రొత్తపద్ధతులు నేర్చికొని పాడు గాక యున్న పూర్వాచార పరాయణుఁడని యారోపియను లతనిమీఁద దయ గలిగియుండిరి. అంతియెగాక పూర్వాచారములకు మతవిషయములకు నతఁడే ప్రమాణమనియు నవనాగరకులై పెద్దపిన్న తారతమ్యము నెరుగక తెల్లవారియెడ వినయము జూపక యుండునట్టి యీనాటి పడుచుబంగాళీ లందఱాయనం జూచిమర్యాదలు

నేర్చుకొనవలసిన దనియు యూరోపియను లభిప్రాయపడుచువచ్చిరి. హరిశంకరుఁడు లోకవ్యవహారవేదియై పూర్వకాలవేషము లాభసాటి వ్యవహారమని తోఁచినందున దానినే యవలంబించెను. అందుచేత హిందువులు తెల్లవారి వేషభాషల నవలంబించుట యిష్టము లేనియూరోపియనులు హరిశంకరుఁడు స్వతంత్రుఁడనియుఁ బాడుకానివాఁడనియు మెచ్చుకొని మాతనికంటె తక్కువ తెలివి, యెక్కువ చిరకాలానుభవము గలయుద్యోగస్థుల ననేకులను మూలకు ద్రోసి యీయనకే జీతము వృద్ధిజేయుచువచ్చిరి. ఈయనయు నలుగురతోడిపాటు స్నేహితులు హెచ్చరించుచుండ నొకగ్లాసు చీకటిగదిలోఁ బుచ్చుకొని యప్పటికి గృహమునకుఁబోయి పిదప పూర్వాచార పరాయణులు కడుపు చక్కలుగ నవ్వునట్లు నాటిరాత్రి యచ్చట జరిగిన వినోదములెల్ల రసపుష్టిగ జెప్పి త్రాగుబోతులను వెక్కిరించెను.

హరిశంకరుని ప్రక్కను పశ్చిమఖండాచారములు సర్వోత్తమములని, కంకణము గట్టుకొన్నవానివలె వాదించు కర్మకారుఁడు కూర్చుండెను. ఈకర్మకారుఁడు యూరపు ఖండమునకుఁ బోయి యచ్చటి నాగరకత నంతను దనతోఁ దెచ్చెనో యన్నట్లు ముడుతలు లేనికోటు మెడపట్టి క్రొత్తమాదిరి సులోచనముల జోడు దాల్చెను. యూరపుఖండములో నేక్రొత్తసారాయి బయలుదేఱినను దాని నీతఁడు చవిచూచి తీరవలసినదే. అతని యాంగ్లేయ భాషోచ్చారణము నిర్దుష్టమైనది. ఆయనయింగ్లీషు పద్ధతులు చిత్రములైనవి. వేయేల? ఆయన యింగ్లీషువారికంటె నెక్కువయింగ్లీషువాఁడు. ఆయనపద్ధతులు చేష్టలు చూచి యాయనకంటె తక్కువ చదువుకొన్న మిత్రులు మెచ్చి కొనియాడుచు నచ్చిరి. అజ్ఞానాంధకారమయమైన మనదేశముమీఁద నీయన పడమటిఖండమునుండి తెచ్చిన జ్ఞానతేజస్సును వెదజల్లుచున్నట్లు కొందఱు తలంచిరి. ఒకరిననుసరించు నిష్టముగల మఱివాండ్రు కర్మకారుని యభినయములు సంభాషణలుఁ గొంతవరకు పట్టుకొని తాము నాగరకతలో మిక్కిలి వృద్ధిపొందినట్లు తలంచుచు వచ్చిరి.

హరిశంకరుని రెండవప్రక్కను దిగంబరుఁడు విశ్వంభరుఁడును కూర్చుండిరి. వీరు తోఁటకు జుట్టుప్రక్కల నున్నవారిలో గొప్పవారు గొప్పవర్తకులకు ముక్తియారులు, వారివెనుక సన్నని తెల్లకోటులు పట్టుదువాళ్ళు దాల్చి దృఢశరీరములు గల పడుచువాండ్రు కొందఱు కూర్చుండిరి. కమ్మని తావియు మకరందముఁ గల పుష్పగుచ్ఛముమీఁదఁ దుమ్మెదలు ప్రాఁకినట్లు సొమ్ము నిష్ప్రయోజనముగాఁ బాడుచేయుటలో మితి యెఱుఁగని ధనపురపు చిన్నజమీందారుని చుట్టు

నానాపద్ధతుల మనుష్యులు చేరిరి. ఈవిధములైన కలయికలువిందులు మన పల్లెటూళ్ళు విడిచిపోయి చూచితిమా యితరఖండములయందు మేఱలేక కానఁబడుచుండును.

అటువంటి సభలోఁ బాపము హేమచంద్రుఁడు ధనపురపు జమీందారునకెట్లు సలహా చెప్పఁగలడు? ఆయన నెట్లుచీవాట్లు పెట్టగలడు? ఆయన హితముపదేశింపఁ బ్రయత్నించి వాని కుపోద్ఘాతముగా హేమచంద్రుఁడు తోఁట? తోఁటలోని మేడలు మిక్కిలి దర్శనీయములై యున్నవని పలికెను. పలుకుటయు నచట చేరిన మిత్రులందఱు క్రొత్తగ గొన్నమేడలు దివ్యసుందరములుగా నున్నవని బళిబళియని మెచ్చిరి. ధనంజయుఁడుగూడ నాతనిపలుకుల కలరి కొంచెము సేపుండి జరుగఁదలచిన మేజువాణి జూచి పోవలసినదని హేముని గోరెను. హేముఁడాసందర్భమున నుమయొక్క తండ్రి మాటయుఁ దాళ్ళచెఱువు గ్రామము మాటయు నించుక తలపెట్టెను. పేదబంధువులమాట తలపెట్టుట ధనంజయునకు బొత్తుగ నిష్టములేక పోయెను. జ్ఞానసంపన్నులైన యాతనిమిత్రులు హేముని సంభాషణలను ధనంజయునికంటె నెక్కుడయుపహసించు కొనిరి. కాలము వృధ యగుచున్నదని యందఱు తొందఱపడిరి. సమయానుగుణముగ శృంగారవేషములు ధరించిన నవవిలాసినుల నవ్వులు ప్రక్కగదినుండి వినంబడి యమ్మహారసికులకు వీనుల విందొనరించెను. ఆసభాసదులలో నొకఁడు వీణపై జేయివైచెను. మఱియొకఁడు సారాయిపోసి త్రాగెడు గ్లాసులవంక నువ్విళ్ళూఱుచుఁ జూడ సాగెను. వేరొకఁడు గడియారమువంక జూచెను. ఆసూచన లెఱింగి హేమచంద్రుఁడు ధనంజయునివద్ద సెలవుపుచ్చుకొని విచారగ్రస్తుఁడై పోయెను. ఇప్పటికి పాపము హేమునకుఁ గొంత ప్రపంచ జ్ఞానము కలుగబోలు. అతఁడు గృహమునకుఁ బోవునప్పటికి రెండుజాముల రాత్రి దాటెను. ఇల్లుజేరి యతఁడు భార్యతో మాటలాడక పండుకొనెను. పాపము దుఃఖాతిశయముచేత నతఁడు పలుకలేక పోయెను.

పదయవ ప్రకరణము.

తెల్లవారఁగానే హేమచంద్రుఁడు మేలుకాంచి తన మనోగత వృత్తాంతము నెవ్వరికిం జెప్పక దాచినందునఁ బ్రయోజనము లేదని గ్రహించి తనలో నిట్లనుకొనెను. "కష్టములు వచ్చినప్పు డాఁడవాండ్ర కాఁడవాండ్రే సహాయము చేయవలయును. కావున నాకుఁ దెలిసిన దంతయు నా భార్య కెఱిఁగించెద. ఆవిడ యేమిచేయవలయునో యది చేయును" అనియతఁడు తలంచుచుండఁగానే బుద్ధిమంతురాలగు బిందు విషాదమనియెడు నిడచే నావరింపఁబడిన మగని మొగమును జూచి భయపడి "యేదైన దుర్వార్త తెలిసినదా?" యని యడిగెను. హేమచంద్రుఁడు కడచిన రాత్రి తాను కన్నులారఁ జూచినదంతయు బూసగ్రుచ్చినట్లు భార్యకు వినిపించి చాల విచారపడెను. అంత సతీ పతులిట్లు మాట్లాడిరి.

హేమ—ధనంజయుఁడు తెలివిమాలిపడుచుతనము చేతఁ జెడుత్రోవలలోఁ బడి పాడైనాఁడు. ఆతనిచుట్టు పచ్చిదొంగలవంటి మోసగాండ్రు చేరినారు. అతనియాస్తి యతని స్వాధీనములో నెంతోకాలముండదేమో యని భయపడుచున్నాను. పాపము భార్యయొంటికత్తెయె. యేసంతోషము లేక బెంగఁపెట్టుకొని క్రమముగాఁ జిక్కి చచ్చిపోవునని నాకు విచారముగా నున్నది.

బిం—(ఈమాటలు భర్తనోట వెడలఁగానే కన్నుల నీరుపెట్టుకొని కొంత సేపటికి దన చీరకొంగుతో నీరద్ది) ఇంతమట్టునవచ్చునని నే నెరుంగుదు. నేనే కాదు పాపము! ఉమకూడ నెరుంగును.

హేమ—కలకత్తాకు రాకముం దామె యెల్లెరిఁగి యుండును.

బిం—అది నేను చెప్పఁజాలను. ఇక్కడికి రాకముందె యామెకు మగని దురాచారములు కొన్ని తెలిసి యుండును. కాని యామె గంభీరమైనది. గనుక మనోవ్యథలు పైకిఁ జెప్పుకొనుట కిష్టము పడినది కాదు. వెనుక తాళ్ళచెరువు గ్రామము విడిచి వెళ్ళునప్పుడామె తన ముందుస్థితి విచారకరముగా నుండునని కొంచెము గ్రహించినట్లు తోఁచుచున్నది. ఏమంటే ఊరు విడిచి వెళ్ళినప్పు డేదో పెద్దబెంగ పెట్టుకొన్నవాళ్ళేడ్చిన ట్లేడ్చినది.

హేమ—అయిన నిప్పుడు మన మేమిచేయఁ గలము. నేనువిన్నదానిని బట్టి చూడఁగా ధనంజయుఁడు కొద్దికాలములోనే యైశ్వర్యమంతయుఁ బోఁగొట్టుకొనును. విశేషించి రోగిష్టివాఁడగును. అప్పుడు పాపము అంతచక్కని యుమ డబ్బుకిబ్బందిపడి నానాబాధలు పడవలసి వచ్చును.

బిం—మీరెప్పుడో రెండేండ్ల సంగతినిగూర్చి విచారించుచున్నారు. నేను దాని ప్రస్తుత బాధను గురించి విచారించుచున్నాను. ఉమ యెంతో యభిమానము గలది. మగఁడు చేసెడు నిరాదరణ మెట్లు భరించుచున్నదో గదా! ధనపురములో నున్నప్పు డెంతోమంది చుట్టాలతోఁ గలసి మెలసి గాద యుండినది ఈకలకత్తాలో రెండవ యాఁడుదాని మొగమైనఁ జూడ కుండ ఖైదులో నున్నట్లేలాగున నున్నదో గదా! పోనీ వాళ్ళ గొడవలోఁ బడియుండుటకు బిడ్డలు పాపలు లేరుగదా! కొంచెము సేపు, ఊసుసు పుచ్చుకొనుటకు చుట్టాలు పక్కాలు లేరుగదా. మనసులో నున్న కష్టము సుఖము వెళ్ళబుచ్చుకొందమంటే ఆప్తులు లేరుగదా. పోనీ మీరైన వెళ్ళి యొకపర్యాయము దాని నెందుకు చూడలేదూ?

హేమ—రాత్రి తోఁటలో సంగతులు కన్నులారఁ జూచినతరువాత నాకు వారింటికి వెళ్ళుటకు మనస్కరించుట లేదు. పోనీ నీవువెళ్ళి కొంచె మోదార్చు. తరువాత భగవంతుఁ డున్నాఁడు.

ఆదినమే మధ్యాహ్న భోజనములైన తరువాత బిడ్డలను సుధ కప్పగించి బిందు సవారిలో గూర్చుండి తలుపులు మూసికొని భాగ్యవంతురాలైన యుమను జూడబోయెను. సుధయు నుమను జూడవలయునని ముచ్చటబడెను కాని బిందు "యీవేళ గాదు. వీలైనప్పుడు మరియొక సారి నిన్ను దీసికొని వెళ్ళెదనులే" యని చెల్లెలను వారించెను బిందు కూర్చున్నసవారి ధనపురపుజమీందా రున్న యింటివీధిగుమ్మము దాటి తిన్నగా లోపలికిఁ బోయెను. హిందూదేశములోఁ జిరకాలము మహమ్మదీయుల పరిపాలనము నిలిచినందున స్త్రీలకు ఘోషా ప్రబలుటచే నీదేశ స్త్రీలు ముఖ్యముగా నుత్తరహిందుస్థాన స్త్రీలుసాధారణముగా నొకరినొకరు చూడవలయునన్న నిదే పద్ధతి. దక్షిణ హిందూస్థానములో స్త్రీల కింత ప్రబలమైన ఘోషాపద్ధతి లేదు. బిందు సవారీదిగి మెట్లెక్కి మేడమీఁదికిఁ బోయి విశాలమైనపడకటిల్లు గాంచి యందు తలదువ్వుకొనుచుఁ గూర్చుండినయుమను గనుగొనియెను. కనుగొనినతోడనే భయముచే బిందు మేనించుక వడక "ఏమి! మా యూరిలోను దేశమంతటను జక్కనిచుక్క యని పేరుపడిన యుమయేనా యిది" యని సందియపడెను.

యేలయన నామెముఖము తెల్లఁబడి జబ్బుగా నుండెను. కన్నులుపూర్వ లావణ్యము నెడబాసి విషాదమును సూచించుచుండెను. భుజములయెముక లగపడుచుండెను. చక్కఁదనమునకు నిలయమైన యామెశరీరము శల్యచర్మావశిష్టమై యుండెను. అప్పటికినాలుగు మాసముల క్రిందట నవనవోన్మేషము గలిగి హాయలు గొలుపుచుండిన యాబాలికయప్పుడు జబ్బుగానుండి నలువదియేండ్లదాని వలె కనఁబడెను. పట్టెమంచముపై మేనమీఁదఁ బడు చుండెను. శుష్కించిన హస్తములకు ముడుగులు పడులయ్యెను. మెట్లమీఁదనుండి పైకి వచ్చుచున్నప్పుడు చప్పుడు విని యుమ తలయెత్తి బిందుంజూచి లేచి వెళ్ళఁబోయి మొగమున గొంత సంతోషము మొలక లెత్తఁ దన చిన్ననాఁటి చెలిమికత్తెను గాఁగిలించికొనెను. అంతట వారి కీక్రిందసంభాషణము జరిగెను.

ఉమ—చిట్టచివఱకు మీరిక్కడికి వచ్చినారా? ఈనాలుగు మాసముల నుండి నేనెన్నిమాట్లు నిన్ను దలఁచికొన్నానని చెప్పను. నీవు సుఖముగా నున్నావా? పిల్లలు బాగున్నారా?

బిం—(ఉమయొక్కస్థితి యామెముఖచర్యవల్లను దీర్ఘచింతం దెలియఁజేయు మాటలవల్లను దెలిసికొని తన మనోవిచారము నడఁచుకొని) అమ్మాయి! మేము బాగున్నాము. నీవేలాగున్నావమ్మా. నీవింతచిక్కిపోయినావేమే.

ఉమ—దాని కేమిలే. నేను కలకత్తాకు రాఁగానే నీటిక్రొత్తచేతఁ గొంచెము జబ్బుపడినాను. ఇప్పుడు నెమ్మదిగానున్నది. ఇప్పటికి దగ్గు అప్పు డప్పుడు వచ్చుచున్నది. ఈయూరినీరు పడదేమో మఱి తెలియదు. ధనపురపుగాలి యింతకంటె మంచిది.

బిం—ఇంతలో నీవు ధనపురము వెళ్ళుట గాని మనయూరు వెళ్ళుటగాని లేదా యేమి? మేము దేవీపూజలనాఁటి కక్కడిక వెళ్ళుదుము మీరు రారా?

ఉమ—బిందక్కయ్యా; అ మాట నే నేలాగునఁ జెప్పఁగలనే మావారు నన్ను వెళ్ళనిత్తురా?

బిం—అయిన నీసంరక్షణ మిక్కడ కనుఁగొనువారెవరు? మే మెక్కడో దూరమున నున్నాము. పిల్లలనువదలిపెట్టి వచ్చుట చాలకష్టము నీకు పాడుదగ్గు పట్టుకొన్నది చిక్కిశల్యమై పోయినావు. నిన్ను చూచువారెవరు ఉమా?

ఉమ—మీమరఁదిగారు డాక్టరును బిలుచుకొని వచ్చినారు. ఆయన ప్రతిదినమువచ్చి జూచుచున్నారు. ఆయన యిచ్చిన మందు పుచ్చుకొనుచున్నాను.

బిం—కావచ్చును. దాని కేమి. ఇప్పటి నీస్థితిలో నెవరో యొకరు చుట్టాలో మఱియొకరో నిన్ను గనిపెట్టుకొని యుండవలెను. మీయమ్మకు త్తర మెందుకు వ్రాసినావు కావు? వ్రాసినపక్షమున నావిడవచ్చి కొన్నివారములు నీవద్ద నుండును గాదూ? ఉండి కొంచెమునీకు జవ చేరినతరువాత నిన్ను తాళ్ళ చెఱువు తీసికొని వెళ్ళును. స్థలము మార్పుటవల్ల కొంతజబ్బు కుదుర వచ్చును.

ఉమ—మాయమ్మ నెందుకుకష్ట పెట్టవలెను? డాక్టరు వచ్చి యేదో మందిచ్చుచున్నాఁడు గదా? కావలసినంతమ్లుంది నౌకరు లున్నారు. వాళ్ళే కని పెట్టఁగలరు. ఏమో నా కేలోటు లేదు గదా! ఆవిడకు వర్తమాన మంపుట యెందులకు? విచారము గలుగజేయుట యెందుకు?

బిం—నీకు వైద్యులు లేకపోలేదు. నౌకర్లు లేకపోలేదు. తల్లి సంరక్షణము వంటిది మరియొకటికాదు. ఆలాటిదక్షత నీకిప్పుడు తప్పక యుండి తీరవలయును. నౌకరులే గాని, మీవారు కనుగొనుట లేదా?

ఉమ—(నెమ్మదిగా) కనుగొన కేమి. కావలసిన వన్నీ యియ్యానే యిచ్చు చున్నారు.

అనఁగానే తన మనోగత విచారమును లోకమం దెవ్వరికిని ప్రాణ మిత్రులకైనను జెప్పక యుమ లోలోన బాధపడు చున్నదని బిందు కనిపెట్టెను. "ఈమానమును నే నెట్లుభేదింతు నీరహస్యము నెట్లు తెలిసికొందు నీమె కెట్లు సౌఖ్యము నొడగూర్తు" నని బిందు తనలో వితర్కించుకొని సోదరీ స్నేహము పురికొల్ప నెండియు నిట్లనియె. "ఉమా నామాట వినవే. మీయమ్మ వచ్చి కొంత కాలము నీవద్దనుండుట మంచిదని నాకుఁదోఁచు చున్నది. అప్పు డప్పుడు మనము రోగములచేత దుఃఖములచేత బాధపడక మానము. అప్పుడాత్మ బంధువుల యాదరణము మన శరీర రోగములను మనోరోగములను మాన్పును. నీవు మిక్కిలి జబ్బుగాఁ గనఁబడు చున్నావు. ఆదగ్గుండ గూడదు. నీవు శరీర విషయమై జాగ్రత్త పుచ్చుకొనవలెను. మీయమ్మ కీవేళ జాబు వ్రాయుము. లేదా యింటికి బోయిన పిదప నన్ను వ్రాయనిమ్ము అమ్మాయి! కొన్ని నెలల క్రిందట నేను నిన్ను జూచినపుడు నీవెంతో బాగుంటివి. "ఇప్పుడా మనిషివే కావని తోఁచు చుంటివి. ఎంత మారిపోయినావే తల్లి" అని యామె మొగము మీఁద జేయివైచి యామెతల తన హృదయమునకు దగ్గఱగఁ జేర్చుకొనియెను మానమును భేదించుటకు మిక్కిలి ప్రశస్తములైన చులకని యుపాయములను స్త్రీలే యెఱుఁ

గుదురు గదా! అందుచేత నుమ ప్రేమరసభరితమైన బిందుప్రసంగముచే మెత్తపడియెను. దయారసశీతలములైన యాటువంటి పలుకులు నా చెవిని చిరకాలమైనది. ఆపలుకులతో నామె హృదయము నిండిపోవఁ గన్నులు దడిసెను. అంత వారిట్లు ప్రసంగించిరి.

ఉమ—బిందక్కయ్యా! చిన్నప్పటినుండి నీకు నేనంటే పంచప్రాణములు గదా! అమ్మా! (అని మఱి మాటాడ లేక కన్నీరు చీఱకొంగుతోఁ దుడుచుకొనఁ జొచ్చెను.)

బిం—వెఱ్ఱిపిల్లా! నీకు నేనంటేమాత్ర మంత ప్రేమ చిన్నప్పటినుండి లేదా; ఇప్పుడు లేదా?

ఉమ—అక్కయ్యా! నీవంటే నా కాలాగే యున్నది, నాకంఠములో ప్రాణమున్నంత కాలము నీమీఁద ప్రేమ నాకు పొమ్మన్నను బోదు.

బిం—అయిన నీమీఁద నెంతో ప్రేమ నాకున్నప్పుడు నామీఁద నెంతో దయ నీకున్నప్పుడు నీకడుపులో బాధ నాకు తెలియకుండా దాఁచవలె ననుప్రయత్నము నీ కెందుకే? నీమనసులో నెంతక్షోభపడు చున్నావో నాకు తెలియదూ? నీయాశలన్నియు నడుగంటిపోయిన వనియు నీవిప్పుడు తెగించి యున్నావనియు నేను తెలిసికొన లేదనుకొన్నావు? నీవు క్రొత్తగాఁ గాఁపురమునకు వెళ్ళినప్పుడు నీమగఁడు నిన్ను నేల నడువనీయకుండ నెంతో గారాబముతోఁ జూచుచుండువాఁడని సంతోషము కడుపులోబట్టలేక నీ వెన్నిసారులో నా చెవిలో రహస్యముగాఁ జెప్పితివి. ఆమాట లిప్పుడు జ్ఞాపకములేవా! ఆసంతోష మంతయు నేడు సన్నగిల్లి పోయినదని నేను కనిపెట్ట లేదనుకొన్నావా? ఇప్పటికి నాదగ్గఱ నీగుట్టు దాఁచఁ దలఁచుచున్నావా? అమ్మాయీ! నేనునీవు క్రొత్తవాళ్ళవలె యొకరిగుట్టొకరివద్ద దాఁచుకొన్నపక్షమున మన కిక్కడ తల్లితోడు ఎవరుందురు?

ఈపలుకులు హృదయమును జయించుటంజేసి యుమ తాళలేకపోయెను. మానము భేదిల్లెను. అంతట నుమ తన మొగము బిందుకడుపులో బెట్టుకొని కన్నీరు విడిచి కడుపుపగిలి కొంతసేపేడ్చి యవ్వల మొగమెత్తి యిట్లనియె. బిం దక్కయ్యా! నేనిదివఱ కెన్నఁడు నాగుట్టు నీవు దాఁచలేదు. ఇఁకముందు దాఁచఁ దలఁచుకో లేదు. నామాటవిని యీ వేళ కూరుకో! ఏమాటు వచ్చినప్పుడు నాకథ నంతయు నీకుఁ జెప్పెదను.

బిం—కాదు కాదు నీకథంతయు నాకీవేళనే చెప్పి తీరవలయును. కడుపులో దిగమ్రింగినపక్షమున బాధలు దుఃఖము మనస్సును దహించివేయును.

తల్లితోడుతో కష్టము సుఖముఁ జెప్పుకొన్నపక్షమున కొంత మనస్సునకుఁ దెఱపిగానుండును.

ఉమ—బిందక్కయ్యా! నే నేమియు దాఁచను నీదగ్గఱ దాఁచవలసినదేమియు లేదు.

బిం—ఉమా! నీశరీరములో నింతజబ్బుగా నున్నదిగదా! నీమగఁడు, ఈస్థితిలోఁ గనుఁగొనవలసినంతసరిగాఁ గనుగొని నిన్నాదరించుచున్నాఁడా?

ఉమ—నాకు కావలసినందతయు నిచ్చుచున్నారు నా చికిత్స నిమిత్తమొకవైద్యుని బెట్టినారు.

బిం—ఉమా! ఈలాగున, ఆకును అందకుండా పోఁకను పొందకుండా యేవో రెండు కల్లబొల్లిమాటలు చెప్పి నన్ను పంపివేయఁదలఁచుకొన్నావా? నేను క్రొత్తదాన ననుకొన్నావా? అన్నము, బట్ట, వైద్యుఁడు ఇవియేనా మనము భర్తలను కోరదగినవి? నే నివన్నియు నిన్నడుగ లేదు నీవు క్రొత్తగాఁ గాపురమునకు వెళ్ళినప్పుడు నీమీద చూపినంతగయుఁ నీభర్తగారిప్పుడు నీమీఁదఁ జూపుచున్నారా? అదినాకు కావలసినమాట! ఆఁడది యాఁడగాని నింతకన్న స్పష్టముగా నడుగవలెనఁటే? మగనియనుగ్రహమే భాగ్యవంతురాలికిఁ గూడ భాగ్యము పేదరాలికిఁ బెన్నిధానము ఆఁడవాళ్ళ కందఱకుఁబతి యనుగ్రహమే ప్రాణాధారము, బ్రహ్మానందము అటువంటి యనుగ్రహము నీమీఁద నీభర్తగారికిఁ గలదా? అనవుడు ఉమ నోటినుండి మాటరాక తలయూఁచి బిందుకడుపులోఁ జేర్చెను. బిందు చెల్లెలియవస్థఁ జూచి విషాదపూరితయై మెల్లన నిట్లనియె. ఉమా! పతియనుగ్రహము పోగొట్టుకోఁదగినది కాదు. పెనిమిటికి నీమీఁద దయతప్పి పోకుండ శక్తివంచన లేక చేయ వలసిన ప్రయత్నములన్నియు జేసితివా?

ఉమ—అక్కయ్యా! ఆయనదయ నిలుపుకొనుటకు నేపడినపాట్లు పరమాత్మ డెఱుఁగును. ఆయనకు నామీఁద ననుగ్రహము తప్పినను నాకాయనమీఁద దయపోలేదు. ఆయన నొక్కసారి కన్నులారఁ జూడవలయునని నే నెంతో తహతహపడుచుందు. పాపమాయనకు నామీఁద విసుగుపుట్టినది కాఁబోలు (ఈకడపటిపలుకులనునప్పు డుమ యెంతో చిత్తక్షోభము నొందెను.)

బిందు—నీకాయనమీఁద ప్రేమ యున్నదన్నమాట చెప్పవలయునఁటే తల్లీ నాకు తెలియదా? నీమనసు నే నెఱుఁగుదును నీకంఠములోఁ బ్రాణముండగా నీవాయనమీఁద ప్రేమ తీసివేసుకోలేవు కాని ఆఁడదానికి భర్తమీఁద ప్రేమయున్నంత మాత్రముచేత చాలదు. మగవాఁడుకూడా, ఆడుదానివద్దనుండి

యొక్క ప్రేమమాత్రమే కోరఁడు. గుంభన యెందుకు? ఆడది ఆఁడదానితో మాట్లాడినపుడు తోడఁబుట్టినది తోడఁబుట్టినదానితో మాటలాడినట్లు నేను నీతో మాటలాడెదను. పెనిమిటిని సంతోషపెట్టుటకు, ఆయనకటాక్షము తనమీఁద స్థిరముగా నిలుపుకొనుటకు, ఆఁడది యెన్నో నేర్పులు నేర్వవలయును; ఒక్క ప్రేమతో జాలదు.

ఉమ—అక్కయ్యా! చెప్పు చెప్పు వినుచున్నాను.

బిం—ఉమా! నీకు తెలియనిది నేనిప్పు డేమియు జెప్పలేను. నీకే గాదు; ఈజ్ఞాన మాడవాళ్ళకందరకు స్వతస్సిద్ధముగా నున్నది. మగఁడు మనకు ప్రాణస్నేహితుఁడు, సహకారి గనుక ఆయన వచ్చునప్పటికిల్లు కలకలలాడుచుండునటులు సంతోషము తాండవ మాడుచుండునట్లు, ఆయనమనసులో నుండువిచారము లన్నియుఁ బోవునట్లు మనము చక్కఁజేసి యుంచవలెను. పతికిఁ గోపము వచ్చినప్పుడు మనము శాంతము సహించవలెను. తిట్లు పెట్టినప్పుడు మన మవి మఱచిపోవలయును. ప్రతిదినము వచ్చునట్టి కష్టనిష్ఠురములను మనము మనస్సు పాడు చేసికొనక భక్తి వినయములుగలిగి యుండవలెను. ఈస్వల్ప విషయములు మనము నేర్చుకొన్నపక్షమున మనయిల్లు సంతోషమునకు పుట్టినిల్లయి యుండును. ఇవి నేర్చుకొనకపోతిమా బ్రతుకు పాడుబ్రతుకై యుండును. ఉమా! అతిభాగ్యములో నుండుటచేత లోకవ్యవహారము నీ కంతచక్కఁగాఁ దెలియదు. పేద సంసారము కలదాన నగుటచే లోకానుభవము నా కెక్కువగాఁ గలదు. నిష్కళంక చరిత్రలుగల మగవానిని సామపతివ్రతలైన యాఁడువారిని యెందఱనో యెఱుంగుదును. పరస్పర ప్రేమలోను వారికిఁ గొఱఁతలేదు. కాని వారిదాంపత్యములు దగ్ధపటలములైనవి. ఎందుచేతనో వారు పడునట్టిక్షోభ యింతంతగాదు. ఎల్లప్పుడు మగవాని మొగము మటమట. ఆఁడుదాని మొగము కొఱకొఱ. వారి గృహములు సంతోషరహితములై దగ్ధమైపోయిన సౌఖ్యానురాగముల స్మశానము లట్లు కనఁబడుచుండును. రవంతయోరిమి జీవనమున కెంతో వికాసమును దెచ్చును. ఓరిమి లేకపోయెనా యిల్లు చీకటికొంపవలె నుండును. మనస్సులు చెడిపోయిన తరువాత కార్యములేదు. ఎండినమొక్కలను చిగురించును గాని విరిగినమనస్సు లతుకుకొనవు. ఆశ లడుగంటిపోయినపిమ్మట అనురాగము అకాలమందే యంతరించిన వెనుక భార్యాభర్తలు తమతప్పులు తెలిసికొని "ఆ! మాలో నెవరికైనఁ గొంచెము శాంత మున్నపక్షమున సంసారమింత విషాదమయము గాకుండ, నీదినము లన్నియు నెంతో సౌఖ్యముగా వెళ్ళునుగదా" యని పశ్చాత్తాపము నొందుచుందురు.

పొందినగార్యమేమి? పాకము ముదిరిపోయినతరువాత దేహయాత్ర నడపుట మరియొకసారి యాడి చూచుట కాట గాదు. గతించినది గతించుటయే. యౌవనము మరలిరాదు. పోయిన సంసారము కుదురుపడదు.

ఉమా—అక్కయ్యా! నీవు చెప్పినది కఠినము గానున్నను సత్యమే. ఈ ప్రపంచమందనేకగృహములు గతించిన యనురాగములయొక్క ఛాయలచే నల్లబడి కేవలము స్మశానములవలె నున్నవి. మనచిన్నతనమందు పుస్తకములలో సీతారాములయొక్క దాంపత్యము, సావిత్రీసత్యవంతుల యనురాగముఁ జదివి వివాహమైనతరువాత మన జీవనములుగూడ నావిధముగానే యెడతేని సౌఖ్యపరంపరలైయుండునని యెంతెంతో యూట లూరితిమి కాని పెద్దవాళ్ళమై లోకవ్యవహారములు చక్కఁగా దెలిసికొన్న తరువాత వెనుకటి మనకోరికలు స్వప్నములని తెలియుచున్నవి. ఇప్పటికి కన్నులు తెరచినామని తెలిసికొనఁగలము. శాంతసంతోషములు తప్పక నిలుచునని తలఁచినచోట్ల ఎడతెగని వైరము నిలుచుట చూడఁగా శరీరము వణకునుగదా. అధికారము కొరకు, డాబులుకొఱకు ఆడఁవాళ్ళు, మగవాళ్ళు గిజగిజ తన్నుకొని చచ్చుట చూడఁగా ప్రపంచముమీఁద విసుగుపుట్టును. సజ్జనుల మంచితనములు కనిపెట్టి తాము సౌఖ్యపడు దుష్టమతుల మనము చూచు చుందుము. స్వలాభము జూచుకొనని యోగ్యులయొక్క నెత్తురు పీల్చివేయునట్టి యాత్మలాభపరాయణుఁల కూడ మనముచూచు చుందుము. తెంపులేని యీకయ్యము యేండ్లుగడచినకొలది మరింతపట్టమై భయంకరమగును. చిట్టచివర కిద్దరిలో నెవరో యొకరుచచ్చి బూడిదయైన తరువాత కలహమంత మగును. అప్పుడు కొంపమీఁద పెంకులెగిరిపోవునట్లు లేడుపులు, పెడబొబ్బలు, బయలుదేరును. చచ్చినవాని కన్నులు చేరడేసి యన్నట్లు పోయినవారలను వేయినోళ్ళఁ బొగడుచు కూని రాగముల దీయుచుందురు. చచ్చినతరువాతఁ జేసెడు విలాపముల కంటెఁ బ్రతికియున్నప్పుడు రసంతోకనికరము జూపినను, ఒక్క మంచిమాట యాడినను, యెంతో బాగుండి యుండునుగదా యని యప్పుడు పయివారికిఁ దోఁచును. బ్రతికియున్నప్పుడు కట్టుకొనుటకు బట్టలియ్యనివారు చచ్చినతరువాత శ్రాద్ధభోక్తలకు వస్త్రము లిత్తురు. బ్రతికియున్నప్పుడు తిన్నగాఁ దిండియైనఁబెట్టనివారు చచ్చినతరువాత భోక్తలకు మామిడిపండ్లు వడ్డించి పంచభక్ష్యపరమాన్నములతో భోజనమిడుదురు. ఇది మన బ్రతుకులలో నున్న విచారభాగము. మన పూర్వకవీశ్వరు లిటువంటికథల నెప్పుడు వర్ణించి యెఱుఁగరు. వారేగాదు; ఈనాటి ప్రబంధవేత్తలు గూడ నీకథల వ్రాయరు. ఇది వ్రాయుటకు వీలులేనంత యరుచిగా నుండునని గాంబోలు వారు వీటిని ముట్టరు.

బిం—ఉమా! నీవు చిత్రముగా మాటలాడుచున్నావేమి? నామాటలకు నీవు తప్పర్థము చేసికొన్నట్లు కనఁబడుచున్నది. కయ్యాలు ప్రతిగృహమందుఁ గలవు. కొన్నిండ్లలో నవి ముఖ్యముగా సంతోషమును గూకటివేళ్ళతోఁ బెల్లగించివేయును. ఇప్పుడు నేను చెప్పినమాట నాటనొకటిగాని యెల్లసంసారముల లోను జరుగునవిగావు. లోకములో నాఁడువాండ్రు మగవాండ్రు పరిపూర్ణులుగారు కావునఁ గొన్ని లోపములుండును. అయినను సంసారములో నొకరికొకరు సహాయముఁ జేసికొనవలసియున్నారు. కాబట్టి యోరిమి గలిగి యొకరితప్పుల నొకరు క్షమించుకొనుచు దేహయాత్ర నడపవలయును. ఉమా! నీవుచాలబాధలుపడినావు. అందుచేత సంసారము నిస్సారమని తలంచుచున్నావు. నీమాటలు వినఁగా నాకు భయమగుచున్నది. నీ సంగతి నాకు బోధపడినట్లే లేదు.

ఉమ—అక్కయ్యా! నాసంగతి నీకు బోధపడునట్టికాలము రాకపోవుటయే మేలు. జాలిగుండె గలవానిభార్యవు నీవు. అయోమయములవలె నున్న సంసారముల సంగతి నెట్లు తెలిసికొనగలవు? తాళ్ళచెఱువులో నున్న మీతాటియాకుల యిల్లు భూలోకస్వర్గము. వేయేండ్లకు నది యాలాగుననే యుండవలెను. నాఅదృష్టమువేరు. నేను నీవలెఁ జెనిమిటి కనుకూలముగా నడచుకొనుదానినైనాను. ఆయనగూడ నీభర్తవలె శాంతమూర్తిగారు. బిందక్కయ్యా! ఇన్నెందులకు? మాగోడవలు తఱచి తఱచి యడుగకు. ఈసంసారపుపందెము మేముగూడ నొక్కసారి వేసిచూచినాము. అందులో గట్టిదెబ్బ తిని యోడిపోయినాము.

బిం—ఉమా! ఓడిపోయినట్లు నీవనుకొనుచున్నావు కాని నీవోడిపోలేదు. ఏదో మగఁడు చిన్నతనముచేతఁ గొంచెము తప్పుత్రోవపడినాఁడని యిరువది యేండ్ల పిల్లవు సమస్తము మునిఁగిపోయిన దానివలె నన్నియు వదలుకొని కూర్చుండుట బాగులేదు. ఇది నేనొప్పుకోను. నీకు కావలసినంతయదృష్టము పట్టఁదలఁచియున్నది. ఏదో సాధనము చేసికొనుటకు వీలులేని యాపదలు లేవు. సరియైన ప్రయత్నముఁ జేసినయెడల మంచిమార్గమునకుఁ దిరిగనిమగవాఁడు లేఁడు. ఎడతెగని ప్రేమచేతను, బతిభక్తిచేతను, ఆఁడుది సుస్థపఱచుకొనుటకు వీలులేని సంసారముండదు. మన యజమానులు అనఁగా మగవారు తమ కుక్కలమీఁద చూపించినట్లే చిఱునవ్వులు నవ్వుచు నొకప్పుడనురాగమును జూపుదురు. మఱియొకప్పుడు మనము వారిపాదములపైఁబడి వేఁడుకొనుచున్నను ఆపాదపద్మములతోఁ దన్ని వేయుదురు.

ఓం — పైవిధమున నెంత బ్రతిమాలుచున్నను మనస్సు మాత్రము కలకదేఱి నందున నామెమాట లన్నియు నప్రియములై వెలుపుచుండెను. ఉమకు గలిగిన యవమానముల నామె నోటినుండి చెప్పించి యామెకు బాధ గలిగించినందుకు బిందు మిక్కిలి విచారించెను. ఏలయన నుమ సహజముగా గర్వము గాంభీర్యము గలది గావున తనయవస్థ నెవ్వరికిం దెలుపుట కిష్టము లేనిదై యుండెను. అట్లు కొండొకసేపు విచారించి బిందు మఱికొంతసేపు మాఱుమాటాడఁ జాలకపోయెను. అయిన నుమమీఁద నామె కధిక ప్రేమ యుండుటచేతను, ఆమెమనస్సు స్వస్థపర చగల ననునమ్మకముండుట చేతను దనకు డగ్గఱచుట్టముఁ బ్రియసఖియు నైన యామెను దుఃఖమహారణ్యమధ్యమునవిడిచి పోవుట కిష్టములేక యామెను మఱింత దగ్గఱదీసి యక్కునఁ జేర్చి తలమీఁదఁ జేయినైచి నిమిరెను. ఉమయు మిక్కిలి యలసిపోయిన చంటిబిడ్డవలె తల కడుపులోఁజేర్చి యామె యొడిలోఁ బండు కొనెను. అప్పుడు బిందు మెల్లగ నిట్లనియె. "అమ్మాయీ! ఉమా! నీవీలాటిమాట లాడకే. నీమాటలు వినఁగా నాకెంతో బాధగానున్నది. బాధలు దుఃఖములు మన కందరకు వచ్చును. మనస్థితిగతు లెట్లున్న నాకష్టములను ధైర్యముతో నెదురుకొని మనము వాటిని జయింపవలెను. పూర్వకాలములో నాఁడవాళ్ళు అత్తమామల లోను, ఆడబిడ్డలలోను, గాఁపురములు చేయుచుండెడివారు. కొడుకులు తమ సంపాదన మంతయుఁ దెచ్చి తండ్రిచేతిలోఁ బోసెడివారు. కోడళ్ళందఱు నత్త గారు చెప్పునట్లు నడచుకొని పనిపాటలు చేసెడివారు. తల్లిదండ్రుల పెత్తనము క్రిందనుండి సంసారము లెంతోగుట్టుగా గౌరవముగా జరిగిపోవుచుండెడివి. ఈమాయకాలములో పెండ్లాలు కాపుఁరానికి రాఁగానే యత్తమామలయదుపా జ్ఞలులేకుండ, మగఁడు పెండ్లాము వేరేయుండవలెనని బుద్ధులు పుట్టుచున్నవి. అన్నదమ్ములు వేరేయుండుటయేగాని మునుపటిలాగునఁ గలిసి యున్నకుటుంబ మొక్కటియు లేదు గదా. ఇదియొకందుచేత మంచిదేయై యుండువచ్చును. కాని క్రొత్తకాపుఁరములు పెట్టినపుడు మగవాఁడు ఇల్లు దిద్దుకొనుటకు సమర్థుఁడై యుండవలెను. ఆఁడది గృహకృత్యములు నేర్చి యుండవలెను. ఉబలాటపడి క్రొత్తకాఁపురములు పెట్టుటయే గాని మనవాళ్ళవిమాత్రము నేర్చుకొనుట లేదు. అందుచేత ననురాగ ముండవలసినచోట నలజడి, ఐకమత్య ముండవలసినచోట నరతశ్శితములు బయలుదేఱుచున్నవి. నామాటనమ్మ. మన సుఖదుఃఖములకు మన బుద్ధులు మనము కర్తలము గాని యదృష్టలోపములు గావు.

ఉమ — (కొంతవరకు మనస్సు కలకదేర) అక్కయ్యా! చూడగా నాబుద్ధికి మన పూర్వపుపద్ధతులే యింతకన్న సౌఖ్యములుగాఁ గనఁబడుచున్నవి.

పదియవ ప్రకరణము

పెద్దవారికి జడిసి పడుచుమగవాళ్ళు భయభక్తులు గలిగి యుండెడివారు. పనిపాటలు శ్రద్ధగలిగి చేసెడివారు.

బిం—అమ్మాయీ! మన మాటవాళ్ళము. ఈ మంచి చెడ్డలు డగినవాళ్ళము మనము కాము. ప్రపంచ మంతటఁ బూర్వపద్ధతు చున్నవనియు నిప్పటి పద్ధతి ప్రకారము మగఁడు పెండ్లాము వేరుగా భార మొకరికి తగలనీయకుండఁ దమకష్టసుఖములకుఁ దమరే పూచీపడి ఘోరయుద్ధమును జేయుటకు ధైర్యసాహసములు గలిగి యుండవలెనని మీ బా తరుచుగాఁ జెప్పుచుందురు. ఇవియే గాక మఱియొకటికూడ నున్నది. కుటుంబములనుండి బంధువులనుండి విడిపోయి యేదో సత్కార్యమును మీఁదవేసి కొని దాని నిమిత్తమయి తమయావచ్ఛక్తి వినియోగించువా రనేకులు కలరు. సకల సంసారబంధములు దెగఁగోసి యీశ్వరారాధనము నిమిత్తమే పాటుపడువారు కొందఱు గలరు.

ఉమ—అక్కయ్యా! ఈశ్వరారాధనమునకై తమజన్మము వినియోగించెడు వారు ధన్యులుగదా. అటువంటి మహానుభావులు సంసారములు వదలివేసి చేతనై నంతమట్టుకు లోకుల కుపకారములు చేయుచు నొకచోట నిలువక దేశాటనము జేయుచు నెల్లప్పుడు బ్రహ్మానంద మనుభవించు చుందు రనియు వారు వచ్చినపని ముగిసిన వెనుక ననాయాసముగఁ బరమపదము పొందుదురనియు మనశాస్త్రములు చెప్పుచున్నవి. ధనపురములో మేమున్నప్పుడు కాషాయవస్త్రముల ధరించుకొని మాయింటి కప్పుడప్పుడు యోగులు యోగినులు వచ్చుచుండెడివారు. నేను వారిని దఱుచుగా జూచెడిదానను. అప్పుడు నేమ వారినెంతో గౌరవించి భోజనము పెట్టి వారు చూచినదివ్యస్థలములను గురించి దేవాలయములను గురించి చిత్రచిత్రములుగ వర్ణించి వారు చెప్పుచుండఁగా రాత్రి ప్రొద్దుపోయెడిదనుక మేలుకొని యెంతో ఆశక్తితో వినుచుండెడిదానను. జ్ఞానులైన మన పెద్దలు దుఃఖభారముచేతఁ గ్రుంకిపోయినవారి కటువంటి జీవనమే యుత్తమ మని యేర్పఱిచినారు. అటువంటి నెమ్మది నాకుఁ గూడఁ గలిగిన బాగుండును.

బిం—ఉమా! వారు ధన్యులన్న మాట నిజమే కాని యది మనవంటివారి కొఱ కేర్పడినదిగాదు. ఈలోకములో మనవంటివారముగూడ ధన్యుల మగుటకుఁ గొన్ని ధర్మము లేర్పడి యున్నవి. అవి మన నిత్యకృత్యములలోనే యున్నవి. ఈకృత్యములను మనము భక్తిశ్రద్ధలతోఁ జేసితిమా మనము లోటు లేకుండ భగవంతునా రాధించినవారమే యగుదుము. దయాళుఁడైన భగవంతుఁడు మహా[illegible]

సుధాశరచ్చంద్రము

—, ఋషులయొక్క కార్యముల నెంతయాదరించునో మనచిన్న చిన్న గూడ నంతగానే యాదరించును. ఈవిధముగా శ్రమపడి మనధర్మములమనము మా యవసానకాలమందు గతదినములలో మనము జేసిన చర్యల నన్నిఁటి దెచ్చుకొని నిర్భయముగా మనము శరీరము విడువవచ్చును. సర్వసాక్షి వంతుడు గూడ మన చర్యలను మెచ్చును.

ఉమ—చెప్పు. అక్కయ్యా! చెప్పు. (అని బాష్పములతో నిండిన తన న్నులెత్తి యామెవంకఁ జూచి) సంతాపము నొందిననామనస్సునకు నీమాట లమృతమువలె నున్నవి. చిన్నపుడు నీమాటలు నే నెంతో ప్రీతిగా వినుచుండెడి దానను. ఇప్పుడు పెద్దదాననైన తరువాతఁగూడ నీమాటలు నీసలహాలే కావలసిన దాననైతిని. నేను పట్టి తెలివి తక్కువముద్దను. నాతల్లీ నీకు దండము పెట్టు దును. గాని నేను చేయవలసినపని యేమిటో తెలియజెప్పి నన్ను నీకడుపులోఁ బెట్టుకోవే.

బిం—"ఓసీ ఉమా! ఆలాగంటివా నీకుస్మారకము లేదనుకొనవలసి వచ్చును నీవంటినిగర్వు లున్నారఁటే. నీకున్న భాగ్యము, నీకున్నకీర్తి మఱొకరికున్న పక్ష మున జిన్నప్పటి స్నేహితులలో, అందుతో మావంటి పేదవాళ్ళతో పల్లెత్తిమాట లాడుదురా? ఇంత మంచి మనస్సున్న యాఁడుది అన్నికష్టములు దాటి గట్టెక్క తప్పక సుఖపడగలదు. ప్రస్తుతము నీకున్నబాధలను బోఁగొట్టుకొనుటకుఁ బ్రయ త్నించు. ఆఁడదాని కుండవలసినశాంతము, విశ్వాసము నీమనస్సులో నుంచుకో. అటుపిమ్మట పెనిమిటి మనస్సు మెప్పించినభార్యవై కుమాళ్ళ తల్లివై యెంతో అంత సుఖ పడుదువు" ఈమాటలు వినఁగానే యుమయొక్క పెదవులమీద వచ్చియు రానిచిఱునగవు కొంచెము మొలకలెత్తెను. కాని యామె దానికిఁ బ్రత్యుత్తరముమాత్ర మీయలేదు. అంతలోఁ దలవాఁకిట, గుఱ్ఱపుబండి చప్పుడు నౌకరుల పరుగులు గడబిడలు వినవచ్చెను. ఆధ్వనియేమో వెనుకటి యనుభవ మునుబట్టి యుమ చక్కఁగా నెఱుఁగును. అంతట నామె తన పినతండ్రి కూతురు వంకఁ జూచి లోలోపలనుండి వచ్చుచున్న గుబులు నడఁచుకొని మిక్కిలి మెల్లగా నామెతో నిట్లనియె "బిందక్కయ్యా! ఆకిటికీలోనుండి యొక్కమారు చూఁడు. మాసంసారసౌఖ్యము కొంతనీకగపడును" అనవుడు బిందావంకఁ జూచెను. చూడఁగానే యామెగుండె దడదడలాడెను. ధనంజయుఁడు కోటలోనుండి యింటికి వచ్చెను. ఆయనకట్టినవస్త్రములు చెదరిపోయి యుండెను. ఒంటిమీఁద గుడ్డయెఱుఁగక స్మారకములేక యున్న యాపురుషవిగ్రహమును సేవకులు పట్టుకొని

మేడమీఁదికి దీసికొనిపోయి త్రాగిన సారామత్తు నిద్రలో దిగిపోవుటకై పండుకొనఁబెట్టిరి. ఆయవస్థఁ జూడగానే బిందు కన్నులు బాష్పపూరితములు కాఁగాఁ ఉమదగ్గఱ నిల్చి కౌగలించుకొని, తల్లీ ఉమా! ఎన్నఁడు పడవలసిన బాధలు అనుభవింపవలసిన యనుభవములు ననుభవించుచున్నావే అమ్మా! నీవెంత బాధపడుచున్నావో దేవునకుఁ దెలియవలెను. నాలుగుమూఁడు మాసములలోనే యెంతో మారిపోయినావు. నీవు చిక్కి మారిపోయియున్నావు. అయితే అయినదిలేఅమ్మా! తొందరపడకు. కోపగించుకొనకు. ఎంతదుఃఖము వచ్చిన నంతదుఃఖము పడకు. ఈబాధలన్నియు నెంతో యోపికతో పడుము. యిప్పటికైన, ఆయనను సంతోషపెట్టుటకు మంచిమార్గమున ద్రిప్పుటకుఁ బ్రయత్నముఁ జేయుము. ఇంతకంటె దుర్వ్యసనములలోఁ దగిలి తిన్నగా భ్రష్టులై పోయి తిరిగి బాగుపడి పవిత్రమైన సంసారసౌఖ్యమును మరగి నడచుకొన్నవారి నెందఱినో యెఱుంగుదును. ప్రకాశమానమైన నీబ్రతుకున కడ్డము వచ్చిన దుఃఖమేఘములను దొలగింపజేయుమని నేను దైవమును వేయివిధములఁ బ్రార్థించెదను. ఇది భగవంతుడే చేయవలెను. మనుష్యమాత్రునివలనఁ గాదు.

ఉమ—భగవంతుఁడు గాదు. నామరణమే యీదుఃఖమును దీర్చును. అని మెల్లగాఁదనలో ననుకొనుచుండఁగా బిందు వెళ్ళెదునని చెప్పి కన్నులనుండి బాష్పములు దొరగ నామెను వదలివెళ్ళెను.

పదునొకండవ ప్రకరణము

దేవీనవరాత్రములు

దేవీనవరాత్రములు సమీపించినవి. దేశమంతయు నవనవ వికాసముతో నిండియుండెను. స్త్రీలు పురుషులు తమ బిడ్డలకు నూతనవస్త్రములు సంపాదించి యవిధరించుట కెంతో ముచ్చటపడుచుండిరి. పాకశాలలు కట్టివేసిరి పూజలు జరుగుచున్న గృహములలో నాటకములాడుటకు, జాతరలు చేయుటకు నేర్పాటు చేయఁబడెను. సింహవాహనము నెక్కిన వీరరసాధిదేవతయగు

కాళికాదేవియొక్క విగ్రహములు కుమ్మరవాండ్రు వేలకొలఁది చేసి యలంకరించి యమ్మఁజొచ్చిరి. గృహయజమానురాండ్రు, భోజనపదార్థములు సంగ్రహించుట మొదలగు ప్రయత్నములు విరివిగా జేయఁజొచ్చిరి. పెండ్లియైనకూతుళ్ళు గలతల్లులు తమ యల్లుళ్ళనిమిత్తమై మంచి మంచి పిండివంటలు వండి సిద్ధముచేసిరి. దూరప్రదేశములలో నుద్యోగములు చేయుచున్న పడుచువాండ్రభార్యలు పుట్టిన యిడ్లనుండి యీపండుగకుఁదప్పక తమ భర్తలువత్తురని నిశ్చయించుకొని దినములు లెక్కపెట్టుకొనఁ జొచ్చిరి. "నాగమనికి సెలవుదొరకునా? దొరగా రాయనను ఇక్కడికి రానిత్తురా? ఎందుకు రానీయరు? ఆగొరలుమాత్రము తమస్వదేశములో నున్న తమభార్యలను జూడవలయునని అప్పుడప్పుడు తలంచుకోరా?" అని భర్తలయాగమనమును బ్రతీక్షించుచున్నయువతులెంతోఁ దలంపఁ జొచ్చిరి.

భాగ్యవంతులకు విలాసవంతులకు భోగ మనుభవించు కాలమిదె. రహస్యస్నేహములు గలపడుచువాండ్రు తమ ప్రియురాండ్రతో గలిసి పడవషికారు వెళ్ళుటకై నావలద్దెకు పుచ్చుకొనిరి. నాటకశాలలలో నృత్యగానములు సల్పుటకై తగిన యేర్పాటులు చేయఁబడెను. ఈమహోత్సవమునకు సర్వవిధప్రయత్నములు జరుగును గనుక ఇది యున్నదా అది యున్నదా యని వేరుగ నడుగనక్కరలేదు. ఈపండుగ సంతోషము పట్టణములలోకంటెఁ బల్లెలలో విశేషముగా నుండును. భగవతియైన భూదేవి శరత్కాలపుపంటలను లోకమున కొసంగెను. రైతులు చేలుకోసి కుప్పలు నూర్చుకొని భూయజమానులకు శిస్తులిచ్చివేసి ఋణదాతలకు బాకీమొత్తములు తీర్చి ధాన్యములు గాదులలోను పురులలోను బోసికొనిరి. మంచిపంటలు పండించిన కాఁపుల పడుచుభార్యలు గాదులలోనిధాన్యము కొంత చాటుగఁ దీసికొని దగ్గరసంతలకుఁ బోయి ఆధాన్యమిచ్చి అంచుచీరలు, నల్లపూసలు, గాజులుకొని తెచ్చికొనిరి. స్త్రీలుఁ బురుషులు తమతమస్థితికిం దగినట్లు పోడిమిగఁ బంటపండుగులు చేసికొనిరి. మొత్తముమీఁద నీదేశములో నున్నట్లు పోడిమిగ తనివిగలిగి జీవించుపంటకాఁపులు లోకమందెక్కడను లేరు.

వానలు వెనుకబట్టినవి. మునుపు వందలకొలఁది మైళ్ళస్థలము నాక్రమించి పెచ్చు పెరిగి గట్లకెగదాసిన మహానదులు ప్రవాహములు కాలక్రమమున సన్నగిలి నిజగర్భముల మాత్రమే యాక్రమించుకొని యుండెను. భూదేవియుఁ బావనస్నానముజేసి క్రొత్తబట్ట కట్టుకొన్న దానివలెఁ బచ్చఁదనము దాల్చి రమణీయముగఁ గనఁబడెను. మనోహరమైన యాశరత్కాలమందు చంద్రమండలము సంపూర్ణప్రభావంతమై పొలములమీఁదను బురములమీఁదను గ్రామములమీఁదను ఆరామ

ములమీఁదను దనకిరణములం బ్రసరింపఁజేసి వెన్నెలలఁ గురియుచు మహానంద జనక మయ్యెను. వాయువులు వేఁడిమియును జలియును లేక సుఖముగ శరీరముల స్పృశియించుచు భోగ్యములై యుండెను. వేయేల? ప్రతివస్తువు పండుగ దినములలో నుండవలసినవిధముగ సుఖప్రదముగ శుభసూచకముగనుండెను. గ్రామములయందలి ప్రతిగృహమందు ధాన్యములను దంపుటవలన చెరుగుటవలనఁ గలుగుచప్పుడులు వినఁబడుచు వచ్చెను. గుడిసెలలోఁ గాఁపురము సేయుపేదలు గడ్డితోఁ దమయిండ్లను నేసికొనిరి. ఈశరత్కాలపుపూజ పంటకాలపుపూజయే యని చెప్పవచ్చును. ఏలయన, సింహరాసివెనుకవచ్చెడు కన్యారాశినే సింహము మీఁదనెక్కి వచ్చెడు పర్వతకన్యయైన పార్వతిగ జనులు భావించిరని తోఁచుచున్నది. సంతోషకరములైన ఈపండుగదినములు సయితము, ఉమకు సంతోషమును గలిగింపఁవయ్యె. స్వభావముచేత నామె మితభాషిణి. దానికిం దోఁడుగ మగని యనాదరణమును మనోరథభగ్నతయు నామె హృదయమున లోతుగా నాటుకొనియెను. ధనంజయుఁడు ఉన్నతచిత్తయైనయామెకంట నెప్పుడుపడిన నొకవిధమైన సిగ్గును జిన్నతనమును బొందఁజొచ్చెను. కాని యతనివద్ద నున్న మంచిగూడ మనము చెప్పుకొన వలయును. తప్పుమార్గమును బట్టి సొమ్ము వమ్ము చేయుచున్న యామూబ యసహ్యకరములైన తన దుర్వ్యసనముల మానవలయు ననియు మానలేకున్న నధమపక్షము పైకంతఘోరముగఁ గనఁబడకుండ నుండ వలయుననియు హద్దుమీరకుండ నుండవలయుననియుఁ గొన్నినాళ్ళు ప్రయత్నించెను. కాని యతఁడు దుర్బలుఁడుఁ బరాధీనుఁడు నగుటచేతఁ జిరకాలమునుండి యాశ్రయించిన దురభ్యాసములు వానిప్రయత్నముల నణగఁద్రొక్కెను. అదియునుఁగాక, అతనివలన బ్రతికి, అతనినెత్తురుఁ బీల్చుచున్న స్నేహితులతని కొకవేళ మంచిబుద్ధి పుట్టినను మనసు విరిచి దానిని క్షణములో ద్రిప్పివేయఁ జొచ్చిరి. అందుచేత నెప్పుడైన క్షణకాల మతఁడు వ్యసనముల జిక్కక యున్నను వెంటనే మునుపటికంటె నెక్కువయగాధములో మునుకుచు వచ్చెను. దానిఫలమేమన, తనభార్యకు మనోవ్యథ కలుగునేమోయని తెలివి వచ్చినప్పుడు కొంచెమాలోచించుకొని సాధారణముగ భార్యయున్న లోపలిమందిరమునకుఁ బోవుటయే మానుకొనెను. ఉమ సంభవించిన దురవస్థం దలంచి లోలోపల కుళ్ళి దుఃఖము దిగమ్రింగుటయే గాని యొకరిని నిందింప లేదు. తనకడుపులోబాధ నొకరితోఁ జెప్పికొనలేదు. బిందు వచ్చి యీమెదురవస్థను పగచినప్పుడు మీఁదపడి యేడ్చినప్పుడు గూడ ఉమ లేనిచిఱునవ్వు మొగమున దెచ్చిపెట్టుకొని తనగుట్టు చెప్పక యేవోమాటలతో నామెనోదార్చి పంపివేసెను. తనగృహకృత్యముల నెప్పటి

యట్లె తప్పక చేసికొనుచు నామె బిందుతో నెంతో శాంతముగాను అప్పు డప్పుడు సంతోషముగాను మాటలాడుచు వచ్చెను. అదియునుం గాక, ఆమె రుచిగలవంటకము లెన్నో స్వహస్తముతోనే వండి, "యనురాగబంధమును దెంపి వేసి లోపలికి రానొల్లని యాజీవితేశ్వరునికొఱకై చావడిలోనికిఁ బంపుచుండును.

అట శరచ్చంద్రుఁడు హేమచంద్రునియింటికి తరచుగ వచ్చుటమానెను. అప్పుడప్పుడు బిందుమాత్ర మతని నొకసారి రమ్మనివర్తమాన మంపుచు వచ్చెను. ప్రతిదినము మధ్యాహ్నమున బిందుయొక్కపనికత్తె కోసినచెఱుకుముక్కలు, పంచదార నద్దిన యనాసపండుముక్కలు మఱికొన్నిభక్ష్యములు శరచ్చంద్రుని నిమిత్తము కష్టపడి సుధ సిద్ధము చేయుచున్నదని యాతఁడు స్వల్పకాలములోనే గ్రహించెను. "పాప మీయాఁడువాండ్రు నానిమిత్త మింతకష్ట మేల పడ వలయును? నానిమిత్త మిటమీఁద నీవస్తువుల దీసికొని రావ"ద్దని యతఁడొకటి రెండుసారు లాపనికత్తెతోఁ జెప్పుచువచ్చెను. అట్లనుటయె గాని తెచ్చినవప్పుడెల్ల నొక్కముక్కయైన మిగుల నుండ నతఁడు భక్షించుచు వచ్చినందున నాబెట్టునరి పైపయిదే గాని మనఃపూర్వక మైనదిగాదని యాపనికత్తె గ్రహించి యెప్పటియట్లె ప్రతిదినము ఫలహారములఁదెచ్చి పెట్టుచు వచ్చెను.

ఇట్లు కొన్నివారములు గడువ దేవీనవరాత్రములు వచ్చెను. భవానీపుర మందు మిక్కిలి సంపన్నుఁ డయినదేవీప్రసన్నుని గృహమందు గొప్పయుత్సవ ములు జరిగెను. ఆగృహమందు గొప్పదుర్గవిగ్రహము పూజింపబడెను. అహో రాత్రము లెడతెరపిలేక గానములు జరిగెను. అచ్చటి జాతరలు నాటకములు చూచుటకు జనులు గుంపులు గుంపులుగ వచ్చిరి. దేవీప్రసన్నునిభార్య ముందు వసారాలోనొక తెరవెనుకఁ గూర్చుండి మూఁడు రాత్రులు దీపములు పెట్టినది మొదలు తెల్లవారువరకు మేలుకొని కన్ను మూయక జాతరలు చూచెను. ఇరుగు పొరుగున నున్నగౌరవము గలయిండ్లలో స్త్రీలందరు వచ్చి యామెచుట్టునుఁ గూర్చుండి యాయుత్సవములం జూచిరి. అక్కడి నాటకపుకథలు రాధాకృష్ణుల శృంగారకథలనుండితీసికొని వ్రాసినవి. పాడినపాట లెంతోరమ్యముగా పదవళము చేయునవిగా నుండెను. చూడవచ్చినస్త్రీలు తమబిడ్డలను గూడ దీసుకొనివచ్చి రాత్రియంతయుఁ దమలపాకుల నములుచు, కథాభాగముఁ జెవులు దోరజెట్టుకొని వినిరి. ఆనాటకప్రయోగమందు విరహతాపముచేత బాధపడుచున్నరాధ యను రాగ బద్ధుఁడయ్యుఁ దన్నువంచనజేసి పోయిన యాటక్కరి గోపాలకృష్ణునిలీలలను గూర్చి గానము జేసి యేడ్చినప్పుడు, చూడవచ్చిన స్త్రీలందరు విశేషముగ

దుఃఖించిరి. దేవీప్రసన్నునిభార్య బిందునుగూడ పిలిచినందున వెళ్ళకపోవుట మంచిదిగాదని యామెకూడ నుత్సవమునకుఁబోఁ దలఁచి యొకనాటిరాత్రి బిడ్డల నిద్దరను సుధ కప్పగించివెళ్ళి రాధాకృష్ణనాటకములను జూచెను. ఆమె తిరిగివచ్చి భర్తతోఁ గలిసి మాటలాడునప్పటికి తెల్లవారెను. "నాటకము చక్కగా నున్నది. ముఖ్యముగాఁ దనమీఁద మహాకోపము దాల్చినరాధను శ్రీకృష్ణుఁడు బతిమాలినకథపట్టు మిక్కిలి బాగున్నది మీరొకరాత్రి వెళ్ళి యెందుకు చూచి రాఁగూడదు?" అని బిందుభర్తతోఁ బలికెను. "చాలుచాలు; క్రొత్తగాఁ గాపురమునకు వచ్చినప్పుడు నారాధను నేను బతిమాలునప్పటికే నాప్రాణము విసికి పోయినది. ఆయనుభవము మఱొకసారి నాకక్కరలేదు" అని హేమచంద్రుఁడు పరిహాసముగా బదులు చెప్పెను. "లేనిపోనికథలు కల్పించకండి. నా నెత్తిమీద నపవాదులు వేయకండి. మీకు పాపము రాఁగలదు" అని తనచేయి మగనినోటి కడ్డము పెట్టెను.

దేవీపూజ, ఆశ్వయుజ శుద్ధ దశమినాటితో సమాప్త మయ్యెను. ఆదినము గొప్పయుత్సవము జరిగెను. క్రిక్కిరిసిన వీధులలోను, గృహములలోను కూడలి మొదలగు ప్రదేశములలోను నదీతీరములను మృదంగాది వాద్యముల ధ్వనులు పిక్కటిల్లెను. స్త్రీలు బురుషులు తమకుఁగలసమస్తాభరణములం ధరించి మేలివస్త్రములఁ గట్టుకొని సముద్రతరంగములవలె వెనుకకు ముందుకుఁ బోవుచు వీధులు నిండిరి. పేదలలోఁ బేదలుకూడ నెట్లో సంపాదించి క్రొత్తబట్టలఁ గట్టుకొనిరి. భాగ్యవంతులు వైభవములచేతను దానములచేతనుఁ దమభాగ్యముల బ్రకటించిరి. దేవీవిగ్రహములను భేరీమృదంగాది వాద్యములతోను సంగీతములతోను వీధుల వెంబడి నూరేగించిరి. సాయంకాలముకాఁగానే యీయూరేగింపులు కాగడాలతోను, నెర్రదీపములతోను బచ్చదీపములతోను జరిగెను. ఊరేగింపు కాఁగానే ప్రతివిగ్రహము నదిలో బాఱఁవేయఁబడెను. అనంతరము చిత్రమై సంతోషకరమై హిందూదేశమందు మాత్రమే వ్యాప్తమయిన యాచారము జరిగెను. అది యేదనఁగా గొన్నిమాసముల క్రిందటను సంవత్సరము క్రిందటను మిత్రులు బంధువులు, తల్లిదండ్రులు, బిడ్డలు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు నొక్కసారి కలిసికొని పరస్పరయోగక్షేమము లడిగి తెలిసికొనుట, పెండ్లియైనయాఁడు పడుచులు మేలిముసుఁగు వేసికొని భర్తలకును బెద్దలకును మ్రొక్కుదురు. చిన్న పిల్లలు గుంపులు గుంపులుగాఁ గూడి బంధువులదర్శనము చేయఁ దలఁచి వారు బసలుదిగి యున్నగృహము లన్నిఁటికిఁ బోవుదురు. ముసలమ్మలు బిడ్డలను గౌఁగి

లించుకొని కన్నుల నానంద బాష్పములు గారఁ జిరంజీవులు గమ్మని వారిని దీవింతురు. "నానెత్తిమీఁద నెన్నివెండ్రుకలున్నవో యన్నియేండ్లు బ్రతుకవలెను. లక్ష్మీదేవియు సరస్వతీదేవియు మీయిండ్లలో శాశ్వతముగాఁ బడియుండవలెను. మీరు బంగారపు కలములఁ జేతఁబట్టి పేరుప్రతిష్ఠ సంపాదింపవలయును. కుమాళ్ళుతండ్రులై మనుమలను మునిమనుమలను నెత్తి సుఖముగా నుండవలయును" విలువ గలదుస్తులు ధరించి వచ్చి తమపాదములకు భక్తితో మ్రొక్కిన చిన్నబిడ్డలను, తలలు నరసినవృద్ధస్త్రీలుకొందరు పైవిధమున మనఃపూర్వకముగా దీవించిరి. ఈయుత్సాహములోఁ బూర్వము మనస్సులో నాటుకొనియున్న కోపము, అసూయ మొదలగునవి యంతరించిపోయెను. అనేకసంవత్సరములనుండి మనస్సులు విరిగిపోయి మాటలులేక యున్నచుట్టములు స్నేహితులు ఆనాఁటిరాత్రి సమాధానపడినట్లును, తల్లిదండ్రులమీఁద కోపగించి యిల్లు విడిచి లేచిపోయిన పెంకి పిల్లలు పశ్చాత్తాపపడి యెంతో వినయముతో మరల మాతాపితలను జేరినట్లును అనేకనిదర్శనములు గలవు. సర్వజన సంతోషకర మైనయీదిన మనేకాభిప్రాయ భేదములను నణఁచి వేయును. అనేకహృదయవ్రణములను మాన్పివేయును. మరియు వైరములు శాశ్వతములు కావనియు పొందుగలిగి యున్నయెడల లాభము గలవనియు స్త్రీలకు బురుషులకుఁ దెలియఁజేయును.

బిందు రాత్రి భోజనము ముగించునప్పటికి రమారమి పదియొకండుగంట లయ్యెను. బిడ్డలు నిద్రపోయిరి. సుధయు భోజనముచేసి పండుకొనఁబోయెను. హేమచంద్రుఁడుగూడఁ బండుకొనెను. హిందూగృహములలో నున్న వాడుకప్రకారము గృహయజమానురాలొక్కతెయే భోజనముజేసెను. పనికత్తెయుఁ బగలెల్లపనిచేసి యింటికిబోయెను. భోజనానంతరము బిందు వంటయింటితలుపుమూసి గొళ్లెమువేసి మేడమీఁదికిఁ బోవఁదలచుచుండఁగా నెవరో తలుపుఁ దట్టినట్లు చప్పుడు వినఁబడెను. "ఇంత ప్రొద్దుపోయినతరువాత వచ్చువారెవరు చెప్మా" అని సందేహించి బిందు తలుపుఁదియక యూరకుండెను. అంతలో నాచప్పుడు రెండవమారయ్యెను. "ఎవరాతలుపుదగ్గర" అని యామె బిగ్గరగా నడిగెను. అందుకుఁ బ్రత్యుత్తరములేదు. భర్తకొరకెవరైనవచ్చి యుందురేమోయని యాయన నొకసారి యామెలేపఁదలఁచెను. కాని హేమచంద్రుఁడు మిక్కిలియలసి పండుకొని నిద్రపోవుటచేత వచ్చిన మనుష్యునిపేరు తెలియకుండ మగనిని లేపుటకామె యిష్టపడదయ్యెను. ఇష్టపడక మెల్లమెల్లఁగా నడుగులు పెట్టుకొనుచు వీధితలుపు దగ్గరకు వెళ్ళి నెమ్మదిగాఁ దలుపుతీసెను. తీయఁగానే యొకమనుష్యుఁడు లోపలఁ

ప్రవేశించెను. అతఁడెవరో చీఁకటిలో బిందునకుఁ దెలియ లేదు. కాని యొకనిమిషములోనే వచ్చిన యతఁడు శరచ్చంద్రుఁడని యామె తెలుసుకొనెను. కాని యతఁ డెంతో మార్పు జెంది యుండెను. అతని తలవెంట్రుకలు చాలకాలమునుండి కత్తిరించుకొనకపోవుటచేత మొగముపై బడ జొచ్చెను. అతనికన్ను లెప్పటి యట్లుండక మునుపటికంటె మెరయుచుండెను. అతని మొగము తెల్లబడెను. శరీరము మిక్కిలి శుష్కించి యుండెను. భుజములపైనున్న యుత్తరీయము ఉండ వలసినంత పరిశుభ్రముగా లేదు.

"బిందూ! ఇంతకాలమునుండి నిన్ను జూచుటకు రానందుకు నీవు నన్ను క్షమింపవలెను. ఈవేళ ఆశ్వయుజశుద్ధదశమి యగుటచేత నీకు నమస్కారములు చేసి పోవలెనని వచ్చితిని" అని శరచ్చంద్రుడు పలికెను.

"అబ్బాయి! నీవు చిరంజీవివై త్వరగాఁ బెండ్లికొడుకువుగమ్ము. నేను బ్రతికియుండగా నీవు ఒకయింటివాఁడవై హాయిగా నున్నప్పుడు నిన్ను చూడ వలెననియున్నది. అప్పగారు తమ్ముని కింతకంటె నెక్కువదీవన లేమి యివ్వ గలదు" అని బిందు బదులుచెప్పెను.

అందుకు శరచ్చంద్రు డేమియు నుత్తర మీయక వంగి బిందుపాదములకు నమస్కారముచేసెను. బిందు వానిని మరల దీవించి లేవనెత్తెను. అప్పుడు వారిట్లు మాటాడిరి.

బిం—నీక్షేమవర్తమానము మేము ప్రతిదినము వినుచుండుటచేతను మాకే దైన చిక్కు సంభవించినయెడల నీవు తప్పక వచ్చి సహాయము చేయుచుందువని నమ్మియుండుటచేతను నీవిన్నాళ్ళనుండి మాయింటికి రాలేదని నాకుఁ గోపము లేదు. కాని నాయనా! రాత్రి పగ లొక్కటేవరుసను జదివి శరీరము పాడు చేసుకొనుచున్నావేమి? ప్రాణములకంటెఁ బుస్తకము లెక్కువా? నీకండ్లుగుంటలు పట్టినవి. మొగము తెల్లబడినది. నీవు రాత్రి చాల ప్రొద్దుపోయినదనుక మేలు కొనుచున్నావని తోఁచుచున్నది. నీవు చిన్నప్పటినుండి యుక్తాయుక్తములు చక్కగా నెరిఁగినవాఁడవు. నీకు నేను చెప్పవలసినయవసరమున్నదా? నామాట విను. రాత్రులు సరిగా నిద్రపో. అన్నము వేళపట్టున తిను. నీవంటి తెలివి తేటలు గలవాఁడు పరీక్షలను గురించి భయపడనక్కరలేదు."

శర—(చిఱునవ్వుతో) బిందూ! పరీక్షలలో దేలుటవల్ల మనుష్యునికి సౌఖ్యము కలుగునా? మన హేమచంద్రుఁడు పరీక్షలయందు తేలినాడు? అతఁడు పొందెడు సౌఖ్యములలో నూరవవంతైనఁ బొందెడివా రెందరున్నారు?

బిం—ఇన్ని సంగతులు తెలిసినవాఁడవు పరీక్షకోసము బెంగపెట్టుకొని శరీరము చెడగొట్టుకోవలసిన యవసర మే మున్నది?

శర—పరీక్షను గురించి నాకు బెంగే లేదమ్మా!

బిం—అట్లయిన నీ కీమనోవేదన, బెంగ యెందువల్ల కలిగినది?

అందుకు శరచ్చంద్రుఁడు ప్రత్యుత్తరము చెప్పక యెత్తుగానున్న చప్టామీఁద బిందును గూర్చుండఁబెట్టి యామె ప్రక్కను దాను కూర్చుండి యామె రెండు చేతులు పట్టుకొని తన మొగముమీఁదఁ బెట్టుకొనెను.

బిం—ఇదేమిటోయి కంటనీరు పెట్టుకొనుచున్నావా యేమి? నేను వినగూడని బెంగ యేదైన నీమనస్సులో నున్నదా యేమి?

శర—మనమిద్దరము అప్ప తమ్ముఁడు పెరిఁగినట్లు పెరిగినాము. నీవు వినఁగూడని బెంగలు నాహృదయములో నేమియు లేవు. నీమనస్సులో నున్నది మర్మములేకుండ నీవు నాతోఁ జెప్పుదువు. అలాగే నేను నీతోఁ జెప్పుదును.

బిం—అది తెలిసియుండియు మన చిరకాల స్నేహము మఱచి నన్ను గ్రొత్తదానివలెఁ జూచుట నీకు ధర్మమా?

శర—నీవే గ్రొత్తదానవైతే ఇఁక నీలోకములో నావాళ్ళు అను శబ్దము నాకుండనే యుండదు. నాకడుపులో నున్నది దాచక నీదగ్గఱ వెళ్ళబోసుకొనుటకే వచ్చినాను. కాని నేను పట్టి దురదృష్టవంతుఁడను. నిర్భాగ్యుఁడను (అని ఆతఁడు గొంచెము వడఁకెను ఆతని కన్నులెర్రబడెను.)

బిం—(ఆతురతతో మెల్లఁగా) భయపడకు. నీమనస్సులో నున్నదంతయు అప్పగారివంటిదాన నగు నాతోఁజెప్పు.

శర—చెప్పనా? కాని నామనస్సు పాడుమనస్సు అయిపోయినది. నేను స్నేహమున్నచోట ద్రోహము చేసినపాపాత్ముఁడనైనాను. మాఅప్పవంటిదానవు నీవు కనఁబరచిన దయకు విశ్వాసఘాతుకుఁడనైతిని. నాహృదయము చీఁకటివలె నల్లగానున్నది. ఇటువంటి పాడు హృదయము నీకుమాత్ర మెట్లు వెల్లడిచేయగలను! (అని యతఁడు ఆమె వ్రేళ్ళు ఎర్రబడునట్లు బిందుచేతులు గట్టిగాఁ బట్టుకొనెను.)

శరచ్చంద్రుఁడు అప్పటికిని గడగడ వడకుచుండెను. ఆతనికన్నులు చింతనిప్పులవలె నెర్రపడెను. ఇటువంటి స్థితిలో నతని నెన్నఁడును బిందు చూచియెరుఁగదు. చిన్నతనమునుండియు వానిని సోదరభావముతోఁ జూచుచున్నతన విషయమున నతఁడు చెడ్డతలంపులు తలంచుచుండునా యని యామె యొకసారి

సందేహించి, అటువంటిది స్వప్నమందైన జరుగదని మరల నిశ్చయించుకొని మరల భయంకరాకారముతో నొడలు తెలియనియట్టు లున్నయాపడుచువానిని జూచి మనస్సులో భయపడి యాభయమును నివారింపఁ బ్రయత్నించి మునుపటివలెఁ జనువుతోఁగాక కొంచెము కఠినముగా "నేను నిన్ను చిన్నప్పటినుండి నాతమ్ముని వలె జూచినాను. మీయప్పవలె నీవు నన్ను చూచినావు. అందుచేత.అప్ప గారితోఁ దమ్ముఁడు చెప్పవలసిన విషయమైన యెడల నీ మనస్సులో నున్న సంగతి తప్పక చెప్పుము" అని పలికెను.

శర—అయ్యో! నామనస్సులో నున్న యూహలు అప్పగారితోఁ జెప్పఁ దగినవి కావే.

బిం—అయినఁ జెప్పకు. ఆఁడుదాని చేతు లీప్రకారముగాఁ నీవు పట్టుకొనగూడదు. అప్పగారియెడల నెంతగౌరవ ముండవలెనో యంతగౌరవముతో మాటాడుము. (అని కోపముతోను దుఃఖముతోను బదులు చెప్పెను.)

అంతట శరచ్చంద్రుఁ డామె చేతులు వదలివైచి తల వంచుకొనియెను. బిందుతత్తరపడి "అంతట దయాళుఁడై అంతటి సత్యవంతుడై అంత శాంతస్వభావుడైయున్న యీచిన్నవాఁడు అట్టి చెడ్డతలంపులను మనస్సులోఁ బెట్టుకొని యుండునా?" యని మరల వితర్కించి సందేహమునుండి విముక్తురాలై ధైర్యముతో నిట్లనియె "అబ్బాయీ! నేను వినఁగూడనిది నీమనస్సులో నేదియు నుండదు. నీమనసులో నున్నది స్వేచ్ఛగాఁ జెప్పు. నేను వినఁ దలచుకొన్నాను."

శర—ఈదయఁ జూపినందుకు భగవంతుఁడు నీకు సకల సౌఖ్యములిచ్చుగాక! నేను మర్మము విడిచి నామనస్సులో నున్నది నీతోఁ జెప్పెదనుగాని నేను చెప్పకమునుపు నాకొక అభయప్రదానమిమ్ము. ఈనాకోరిక నెరవేరక భగ్నమై పోయినయెడల నామాటలు నీహృదయములోనే స్థాపితములై యుండవలయును. గాని యెన్నఁటికినిఁ బైకి రాగూడదు.

ఆశ లడుగంటిపోవ, దీర్ఘవిచారమగ్నుండనై, బ్రతుక వలసిన దుర్గతి నాకుఁ బట్టవచ్చును. కాని నేను దానికి సరకుచేయను. నాకంటెపవిత్రయై, గౌరవార్హయైన పడఁతిని గురించి లోకులు కాకులట్లు తేలికమాట లాడుట నాకిష్టములేదు.

"శరచ్చంద్రుఁడా! నీవు నామాట నమ్ముము. నేను నీరహస్యమును బయటఁబెట్టను" అని బిందు ప్రత్యుత్తరము చెప్పెను.

అంతట శరచ్చంద్రుఁడు తన యంతరంగ సంక్షోభము నడఁచుటకో యనఁ జేతులను హృదయము మీఁదఁబెట్టి యదుముకొని ప్రార్థనపూర్వకముగా బిందు

హస్తమును బట్టుకొని తన మొగమామె కనఁబడకుండ చేయుటకై తలవంచికొని స్పష్టముగా వినఁబడని సన్నయెలుగుతో నిట్లనియె. 'నీచెల్లెలు' నిర్మలహృదయము గల యావితంతువు సుధ, భూలోకమునకుం దిగివచ్చిన యచ్చర.' ఆమె నాభార్య యగునట్లను గ్రహింపుము.

శరచ్చంద్రుని హృదయమందలి మోహపు జడివాన నిప్పుడు బిందు గుర్తెఱిఁగెను. కడచినయారుమాసముల చిత్రచరిత్ర యామెకప్పుడర్థమయ్యెను. హిందూవితంతు వివాహము బరమపాతకము; లోకనింద; ఆలోచించుటకు వీలు లేని వెఱ్ఱితలంపు.

అల్లెతెగియు నతఁడు చంచలమైన యామోహము పలికించినధోరణి నిట్లు పలుకఁజొచ్చెను. 'అక్కా! బిందూ! నామాట వినుము. నమ్మినందుకు ద్రోహము చేసిన దుర్మార్గునిమాట వినుము, మీరు చూపిన యాదరణకుఁ కృతజ్ఞత లేక విశ్వాసఘాతుకుఁడైన వానిమాట వినుము. తాల్పుకారుగ్రామమున మీయింట వితంతువై యుండిన మీచెల్లెలు సుధను నేను చూచి యాఱుమాసములైనది. చూచినతోడనే నాలోఁ గ్రొత్త జీవనము బైలుదేరినట్లు నేను తెలిసికొంటిని. అంతకుముందు నే నేకాకియగు విద్యార్థిని. పుస్తకములుతప్ప నాకు మిత్రులులేరు. చదువు తప్ప వేఱేవ్యాపారములేదు. పడుచువాండ్ర యన్యోన్యానురాగములంగూర్చి నేను పుస్తకములలో మాత్రమే చదివితిని. కాముకులు రంగస్థలము మీఁదినటులని తలంచితిని. ఈశ్వరదత్తములైన సహజమాధుర్య సౌందర్యములు కలిగి తన వైధవ్యమందభాగ్యత యేమీ గుర్తెఱుంగక యుండిన యాయమాయకురాలిని, ఆనవనీతహృదయురాలిని, ఆచిన్నదానిని నేను చూచినప్పుడు నాకదివఱ కెన్నఁడు గలుగని యిట్టిదని వర్ణింపరానియొక మనోవికారము కలిగెను. కాలమే క్రమక్రముగ నట్టివికారము నడంచు నని నేను నమ్మియుంటిని. నావిద్యాగోష్ఠి, తత్సంబంధమగు వ్యాపారములు దానిని తుడిచివేయునని విశ్వసించియుంటిని. కాని నేను కలకత్తాకు వచ్చినతరువాత, దినదిన మామెను జూచుచున్న తరువాత ఆవిష మంతకంతకు నాతలకెక్కినది. అక్కా! బిందూ! దినదినముమీయింటికివచ్చినప్పుడు నన్ను సోదరప్రేమముజూపి సమాదరించితివి. తమ్ముని గారాబము సేయునట్టి యన్నవలెనే హేముఁడు నన్ను గారవించెను. హృదయమందు మోహాగ్ని రవులుకొల్పుచు, మాటలయందు మాయసేయుచు నేను మీపవిత్రగృహముఁ జొచ్చితిని. అతిమానుషసౌందర్యము గల యాదివ్యవిగ్రహమును కనులపండువుగా నేను చూచినకొలఁది నిషిద్ధమైన యాప్రేమరసమును నేను జుఱ్ఱుకొన నారంభించితిని. పలుమాఱులు సాయంకాలమం దిక్కడకువచ్చి

నక్షత్రము లాకాశమున జ్యోతులవలెఁ బ్రకాశించువరకు నేనామెప్రక్కను గూర్చుండుచు వచ్చితిని. అపుడు నామనస్సున బైలుదేరినవికాసము నాయంతరంగము నుఱ్ఱూతలూపుచు వచ్చెను. నీకు దయకలదేని పిచ్చివాని విపరీతభావములను క్షమింపుము. నమ్మినవారియెడ ద్రోహముచేసిన మూర్ఖుని దురాలోచనలను మన్నింపుము" అని శరచ్చంద్రుఁడాగెను. ఆగుటయు బాష్పపూర్ణములైన యాతని నేత్రములు తళతళ మెరసెను. అట్లొకనిముషమాగి ప్రశాంతస్వరముతో మరల నిట్లనియె:

"ఒకనాఁటి సాయంకాలమున నేను కన్నులు తెరచితిని. నేనొకపెద్ద గోతిలోఁ బడుచుంటినని తెలిసికొంటిని. నేను సుధనుకూడ బాధించుచుంటి నేమోయను భయమునఁ బిచ్చియెత్తినట్లయితిని. నాయొనర్చిన యపరాధమునుండి పాపమునుండి భగవంతుఁడామెను గాపాడెనని నేను నమ్మి నామనస్సులో నేపడుచున్న యపారబాధ యించుకేనియు నామెకుఁ దెలియకుండఁ జేసితిని. ఆదినము మొదలుకొని నేనుమీయిల్లు వదలిపెట్టి తిరిగి గుమ్మము త్రొక్కిచూడలేదు. మరచిపోవుటకై ప్రయత్నించితినిగాని నాప్రయత్నములు వ్యర్థమయ్యెను. ప్రాణముతోనే గాని తుడిచివేయుటకు వీలులేనిభావములు కొన్నియుండును. పసిబిడ్డఁడు చేతులెత్తి ప్రవాహము నాపుటకుఁ బ్రయత్నములు చేసినట్లు నేనీరెండు మాసములు నాయనురాగ ప్రవాహము నాపఁ బ్రయత్నించి వ్యర్థుఁడనైతి. నామనస్సు పుస్తకములమీఁద స్థిరముగ నిలుపుటకుఁ బ్రయత్నించితిని. నాట్యరంగములకుఁ బోయి నామనస్సును వేఱొకమార్గమునకుఁ ద్రిప్పసమకట్టితిని. సెలవుదినములలో నాకళాశాలలోనివిద్యార్థులతోఁ గలసి మెలసి, యాడితిని; పాడితిని, ముచ్చటించితిని. ఎన్నోసంగీత సభలకరిగి గానమునువింటిని. కాని యొక్కదినముకాదు కదా? యొక్కనిముసమైన నేనీతలంపుల మరవఁజాలనైతిని.

ఈరెండుమాసముల చరిత్రము చెప్పి నీకు విసుగుపుట్టింపఁ దలఁచుకొనలేదు. తలదాఁచుకొనుట కిల్లులేక వీధిలోనే కాలక్షేపము చేయు నిర్భాగ్యుఁడుసైతము నాపడిన పాటులు పడియుండఁడు.

అక్కా! బిందు! నామనస్సులోనున్న దున్నట్లు చెప్పుటకు నీవనుమతించితివి గావున నేను నిర్భయముగఁ బలికితిని. ద్రోహిని గర్హించినట్లు గర్హింపక నామీఁద [illegible] చూపిన ప్రేమ చూపుము. మైత్రి తగ్గింపకుము. నేనెంతో పాపము [illegible] నేను నిన్ను వంచించితినను మాట పరమేశ్వరుఁడెరుఁగును.

నీవువారియెడలఁ దిరస్కారముఁ జూపుదు వేని, ప్రపంచములో నిఁక నామీఁద నభిమానముఁ జూపువారెవరు? నేను మునుపు గట్టి మనోధైర్యము కలవాఁడ ననుకొంటిని. నేనిప్పుడు పసిబిడ్డకన్న బలహీనుఁడను. అక్కా! బిందు! నన్ననుగ్రహింపుము. నన్ను దిరస్కరింపకుము.”

ఆ పలుకుల కేమని బిందు ప్రత్యుత్తర మీయఁ గలదు? హిందూ వితంతువు యొక్క వివాహము తలఁచుకొనుటయే వెఱ్ఱి. ఆకార్యము మహాపాతకము కంటె ఘోరకృత్యమని హిందూ ప్రపంచమంతయు మీఁద పడును. ఆమాట బిందు శరశ్చంద్రున కప్పుడెట్లు చెప్పఁ గలదు? ఆశాభంగము చేత నా పడుచువాఁడు ఘోరకృత్యమేదయినఁ గావించుకొనవచ్చును లేదా బ్రతికియుండఁగానే యతఁ డాశాభంగముచేత నుత్సాహ మెల్ల డీలుపడి మరణదుఃఖ మనుభవింపవచ్చును.

కాని యాయువతి, యువతీజన సామాన్యమైన విన్నాణము, వివేకము మెఱయ, లేనిశాంతముఁ దెచ్చిపెట్టుకొని యెంతో సానునయముగ నిట్లు పలికెను.

“శరచ్చంద్రుఁడా! దుఃఖపడకుము. బాపము చేసితినని, నేరము చేసితినని నిన్ను నీవు నిందించుకొనకుము. చిన్ననాఁటనుండియు నాతమ్మునివలె నిన్నుఁ జూచుకొన్నదానను నేను నిన్నుఁ దిరస్కరింతునా? భగవంతుఁడు నాకన్న దమ్ముల నియ్యలేదు. ఆప్రేమ విడనాడి యిప్పుడు నేను నిన్ను దిరస్కరింతునా? నేనాలాగున చేయలేను. సాధువైన యాఁడుదిగాని మగవాఁడుగాని తిరస్కరింపవలసినంత మహాపాపము నీవు చేసిన దేదియు లేదు. సంఘసంస్కర్తలు కొందఱు బైలుదేఱి యీనడుమ వితంతు వివాహములను మఱల నుద్ధరించినను, మనయాచారములు వితంతు వివాహములను సమ్మతింపవు. అబ్బాయి! నీవుకోరిన కోరిక మిక్కిలి యసాధ్యమైనది. నేనీవిషయమై భర్తగారితో మాటలాడి, యాయన యిష్టప్రకారము నిర్ణయింపవలెను. కావున దుఃఖింపకుము. నాభర్తగారు దీనిని సమ్మతించినను సమ్మతింపకపోయినను మేము బ్రదికి యున్నంతకాలము నీమీఁద మాకు మునుపటియనురాగమే, మునుపటి దయయే, మునుపటి మైత్రియే యుండునని నిశ్చయముగా నమ్ముము”

శరచ్చంద్రుఁడు—అక్కా! నీవింతదయగా మాటలాడినందులకు పరమేశ్వరుని యనుగ్రహవర్షము నీపైఁ గురియుఁగాక! నేను నాపాదములను దాపక యొప్పుకొనిన యీపాడుదినమున నాస్నేహితురాలు మహాకోపమున మొగము

తృప్తిపొనక యెప్పటిమైత్రినే నాపై నెఱపునట్లు చేసిన యీవాగ్దానమును నేనెన్నఁడు మఱవను."

బిం—"నీవు మాపైఁ జూపిన ప్రేమకు, మామీఁద గురిసిన దయావర్షమునకు మేము కృతజ్ఞులమై యుండక, యీమాత్రమున నేకోపించి మొగముల త్రిప్పుకొన్నచో మేము నాశనమై పోవలసినదే. గాని యీరాత్రి యీసంగతి మఱలఁ దలపెట్టకుము. మఱియొక ప్రసంగము చేయుదుము. నీవు భోజనము చేసినట్లు లేదు ఏమైనాతిందువా? మావారినిమిత్తము పలుచనియట్లు పోసినాను. అందులోఁ గొన్ని మిగిలినవి. కాళ్ళు చేతులు కడుగుకొని నాలుగట్లు భక్ష్యములుతిని యింటికి వెళ్ళుదువు గాని."

శర—అక్కా! నన్ను క్షమింపుము. నాకేమియుఁ దినవలెనని లేదు. తింటినా జబ్బుచేయును. నేనింటికి వెళ్ళుదును. నేను కొంచెము విశ్రమించవలెను.

బిం—అట్లయిన రేపుదయమున వచ్చి మా వారితో నాలోచింపుము. నీ మనస్సులో నున్న దంత వారి యెదుట వాదించి చెప్పుము.

శర—"హేముని యెదుట నా పక్షమున నీవే వహించి వాదింపుము. అంతయు నీకే వదలివేసితిని. ఈవిషయ మేదో తేలువరకు నే నతనినిఁ గలుసుకొనఁ జాలను."

బిం—"ఇది లోకములో లేని వ్యవహారము గనుక మావారు దీని నిటో యిటో తేల్చుటకుఁ గొంత కాలము పట్టును. ఈలోపున నీవెప్పటి వలెనే యప్పుడప్పుడు మాయింటికి వచ్చుచుఁ బోవుచుండుము."

శర—ఈ వ్యవహారము తేలువరకు హేమునిగాని సుధనుగాని నేను చూడఁ దలఁచుకొనలేదు. నన్ను క్షమింపుము. కాని యీసంగతిపొరబాటున నైనను, ఆమె చెవి చేరనీయకుము. ఆశాభంగము చేతను, దుఃఖము చేతను గుందవలసినట్లు నావిధి యుండవచ్చును. కాని సుధ బాధ పడవలసిన యవసరము లేదు."

బిం—"అయితే సరే. నీవె వచ్చి మమ్ముఁ జూచుట కిష్టములేక పోయిన పక్షమున మావారేమి నిర్ణయింతురో నీకు జాబువ్రాసి తెలియఁజేసెదను."

శర—"వద్దు వ్రాయవద్దు. నేనే యెప్పుడో వచ్చి యీసంగతి రహస్యముగా దెలుసు కొని పోదును. నే నెప్పుడు రావచ్చునో, యెప్పుడు మీనిర్ణయము తెలిసి కొనుటకు వీలుగా నుండునో చెప్పుము."

బిం—"అబ్బాయి! నే నెట్లు చెప్పఁగలను? ఒకపూట రెండు పూటలలో నిర్ణయించ గల విషయము కాదు గదా యిది! ఇది జాగ్రత్తగా నాలోచించ వలసిన విషయము. అందులో మావారుయోచన చేయుటకుఁ జాల కాలము పట్టును. రెండు మూఁడు వారములు తరువాత వత్తువా?"

శర—"అలాగే కానిమ్ము. అది దీపాలమావాశ్య యగును. ఆదినమున వత్తును."

పండ్రెండవ ప్రకరణము.

అమ్మలక్కల సంభాషణము.

శరచ్చంద్రుఁడు బిందుగృహము విడిచి వెళ్ళుచుండఁగా దేవీప్రసన్నుని గృహమునుండి పనికత్తె యొకర్తు దేవికి నివేదనమును చేసిన భక్ష్యములు కొన్ని తీసికొని లోపలికి వెళ్లెను.

అప్పుడు బిందుకు దానికి నీక్రిందసంభాషణము జరిగెను.

పనికత్తె—మాఅమ్మగారు మిమ్మందఱిని చాలాచాలా అడిగినానని చెప్పి దేవికి నైవేద్యము పెట్టిన పిండివంటలు కొన్ని మీకిమ్మని చెప్పినది. నేను మీయింటికే గాక చాలాయిండ్లకు వెళ్లి వచ్చినాను. అందుచేత ఆలస్యమైనది.

బిం—ఆపళ్ళెములోఁ బెట్టు; మీపళ్ళెము రేపుపంపెదను.

పనికత్తె యట్లు చేసి తనమేలిముసుఁగు సవరించుకొని, మొగమావలి ప్రక్కకుఁ ద్రిప్పి, యేదో భావగర్భితముగాఁ జిన్ననవ్వు నవ్వెను.

బిం—నీవెందుకే నవ్వుచున్నావు? ఈపూజాదినములలో మీయింట నేమైన వినోదములుగాని చమత్కారములు గాని యున్నవా యేమి?

పని—నే నెఱింగినంతమట్టుకు మాఅమ్మగారింట్లో అటువంటి వేమియు లేవు. (అని బిందు వినఁబడవలెనని కొంచెము మెల్లఁగాదనలోఁ దానిట్లను కొనెను.) ఇదే గొప్ప వినోదము. గొప్పవా రిటువంటిపనులు చేసిరా అది వినోదము. మావంటి పేదవారు చేసిరా అమ్మలక్క లాడిపోసికొందురు.

బిం—నీవేమిటి గొణుగుచున్నావు. వినోద మేమిటి?

పని—కాదమ్మా! కాదు; మేము కడుపుకూఁటికి పనిచేసికొను పేదవాళ్ళము. మాజీతములు తెచ్చికొని మాపొట్ట పోసికొందుమేగాని గొప్పవారి గొడవలెత్తుటకు మాకేమి హక్కున్నదమ్మా!

బిం—అమాట కర్థమేమిటి? స్పష్టముగాఁ జెప్పలేవఁటే పిల్లా!

పని—(మఱల మేలిముసుఁగొక ప్రక్కకుఁ దొలగించి విషపునవ్వు నవ్వి) లేదమ్మా! మరేమి లేదు. ఇప్పుడే మీలోపలినుండి వెళ్ళిన పడుచాయన యెవరు? ప్రొద్దుపోయిన తరువాత ఈలాటప్పుడు ఎవరైన స్నేహితుఁడు మిమ్ము చూడ వచ్చినాఁడా యేమిటి?

బిం—(కొంచెము భయపడి తనలో) వీధితలుపు తీసియున్నది. శరచ్చంద్రునకు నాకు జరిగిన సంభాషణ పొంచుండి యిది వినియుండునా? (ప్రకాశముగఁ దొట్రుపడుచు) ఏమే? నీకన్నులు పోయినవా యేమిటి? శరచ్చంద్రుని నీవెఱుఁగవా? ఎఱింగియుండి యెఱుఁగనట్లు నటించుచున్నావా?

పని—లేదమ్మా! లేదు. మీదయవల్ల నాకన్నులు పోలేదు. శరచ్చంద్రుఁడు గారే అనుకొన్నానమ్మా! కాని తల్లీ! గొప్పయింటి పడుచుఅబ్బాయిలు ఈలాగున చేయవచ్చునా? మీయూరిపద్ధతులు లేమో నాకుఁ దెలియవమ్మా! కలకత్తాలో నే నిరువది తొమ్మిదియేండ్లు పనిచేసినాను. కాని యిటువంటి సంగతి నే నెక్కడను జూడలేదు. గొప్పవారి పద్ధతులతో మాకేమిపని తల్లీ! మాజీతాలు, రెండుపూటల భోజనాలు మాకు సరిగా నుంటేచాలు. ప్రొద్దున్న, సాయంకాలము మాకడుపునిండ కూఁడు దొరికినన్నాళ్ళు మాచుట్టుప్రక్కల నేమిజరుగునో చూడవలసిన యవసరము మాకేమున్నది?

దేవీప్రసన్నుని యింటిపనికత్తెలు పెంకితనమునకుఁ బేరుపడినట్లు బిందు మునుపే యెఱుఁగును. కాని యిటువంటి యప్రతిష్ఠవాక్యములు పలుకునని యామె యెన్నఁడు తలఁచియుండలేదు. అయినను అటువంటి సమయమున శాంతమువిడిచి

కోపించుట వ్యవహారము మఱింత పాడుచేయుట యని యామె గ్రహించి లేని చిఱునవ్వు తెచ్చి పెట్టుకొని పలికెను.

బిం—ఏమే పిల్లా! శరచ్చంద్రుని పద్ధతులు పిచ్చివని నీవెఱుఁగవా? అతఁడు కుఱ్ఱవాఁడు. వివాహము కాలేదు. దీక్షగాఁ జదువుటచేతను, ఏకాకిలాగున నొక్కఁడే యుండుటచేతను మతి చెడినది. అతనిమాటలు, చేతలు లక్ష్యపెట్ట నక్కఱలేదు.

పని.—అమ్మా! మతిచెడిపోవచ్చును దానికేమి. కాని యీలాగునఁ జేయవచ్చునా? పెండ్లిపిచ్చి యెత్తినపక్షమున వెళ్ళి వివాహమాడవలెను. కాని నీముందర ఈవిధముగ వెఱ్ఱివెఱ్ఱి ప్రేలాపనలు ప్రేలుట మంచిదా? అమ్మా! ఆయనకు నిన్ను పెండ్లి చేసికొనవలెనని లేదుకద?

బిం—ఛీ! నీమొగము మండ! యీలాటిమాట లాడుటకు నీకు సిగ్గు లేదఁటే? కాదే పిల్లా! అతఁడొక చక్కని పిల్లని చూచినాడు. దానిని పెండ్లిచేసికొనవలెనని కోరుచున్నాఁడు. తల్లి కాశిలోనున్నదిగనుక ఆమెతోఁ జెప్పుటకు వీలులేక నాతో జెప్పుటకు వచ్చినాఁడు.

పని—అమ్మా! ఎవరా పిల్ల?

బిం—వివాహము స్థిరపడినతరువాత నీకే తెలియఁగలదు.

పని—అమ్మా! దాపఱిక మెందుకు? చెవులు లేవా కన్నులు లేవా మాకు! కనఁబడకపోవుటకు వినఁబడకపోవుటకు మాకంత ముసలితనము రాలేదు. గుండె పగిలి పోవునేమో యన్నట్లు మీసుధకోసమాయన మొఱఁబెట్టుట నే వినలేదనుకొంటివా? సరే. సరే. దాసుకోతల్లీ! కాకపోతే యింటిగుట్టు బైటపెట్టుకొని అపకీర్తి కొనితెచ్చుకొనువారు గలరా యేమిటి? ముండమోసిన పిల్లకు పెండ్లా? పేదవాని కొంపలో ఇటువంటిమాట పుట్టెనా కులమువాళ్ళందఱుఁ జేరి ఈపాటికి తప్పు పట్టరా? ఆధీనము తప్పినపిల్లకు పెండ్లా? చాకలికొంపల్లో మంగలికొంపల్లో సైతమిటువంటి మా టెప్పుడు వినలేదు.

ఈపలుకు చెవిని పడఁగానే బిందు మొదటిసారి భయపడెను. శరచ్చంద్రుఁడు తనయెడలఁ జూపిన మోటుతనమును గూర్చి ఆపాడుపనికత్తె మాటలాడినంతసేపు లక్ష్యము లేక పోయెను. ఒక పెంకిదానిమాటవల్ల తన నిష్కళంక జీవనమునకు మచ్చ కలుగదనియు, తనసదాచార సంపత్తి జగద్విదిత మగుటచే నట్టిదెవ్వరు నమ్మరనియు నామె యెఱుఁగును. కాని సుధ చిన్నబిడ్డ, వితంతువు; లోకనింద నలుసంత పుట్టినను యావజ్జీవము దానిపేరు చెడిపోవును. శరచ్చంద్రు

నికోరిక పిచ్చి కోరిక యని బిందు మనసులో నెఱుఁగును. ఆవివాహము జరుగునని కాదనియు నామె నమ్మకము. కాని సుభాశరచ్చంద్రుని పేళ్ళమీఁద నపనిందా చ్ఛాయయైన వ్రాలెనా, అది కాఱుచిచ్చువలె వ్యాపించి బాలికను, దానికీర్తిని నాశనము చేయును.

ఒక్కనిముసమువఱ కామె మనస్సు మితిమీఱిన బాధపడెను. బిందు మనోధైర్య మించుకేనియు కదలక చిక్కఁబట్టి పెట్టెతెఱచి యొకనాణెము తీసి యిచ్చెను. భక్ష్యములు మొదలగు నూడిదలు తెచ్చిన పనికత్తెలకు రెండుమూఁడ ణాలు బహుమాన మిచ్చుట సాంప్రదాయ సిద్ధము. ఆనంకఁబెట్టి బిందు రూపాయ తీసి యారాత్రి దానిచేతిలోఁ బెట్టి యిట్లనియె. "నీవు దేవీప్రసన్నుఁడుగారి యింట చిరకాలమునుండి పనిచేసిన పనికత్తెవు. ఈనవరాత్రములలో ఈరూపాయ పెట్టి క్రొత్తచీరకొని కట్టుకో. శరత్తువిషయమై నీవు విన్నది కన్నది రెండవ కంటివారికిఁ తెలియనీయకు. తెలివితేటలుగల స్త్రీలు పిచ్చివానిమాటలు పాటి సేయరు. ఈవివాహము జరుగునదికాదు. వితంతువునకు వివాహమన్నది కన్నదా, విన్నదా? కులస్థులలో ఇంతో అంతో పేరుప్రతిష్ట గలవాళ్ళము. మావారంటే ఇరుగు పొరుగువారికి, స్నేహితులకు మితిమీఱిన గౌరవము. శరచ్చంద్రుని తల్లి భూదేవతయని మహా పతివ్రతయని కాశిలోవారుసైత మామెనెంతో గౌరవము చేయుచున్నారు. అతని చెల్లెలను ఆచార వ్యవహారములు, మంచి సాంప్రదాయము గల గొప్పయింటివారు చేసికొన్నారు. అన్నిమర్యాద లడుగంటఁద్రొక్కి యిటు వంటిపెండ్లి చేయుటకు తరమా? లోకానుభవముగలవారు పిచ్చివాని ప్రేలాపనలు లెక్కసేయరు. అతని పిచ్చిచేష్టలు నీవు రెండవ కంటివానికిఁ దెలియనియ్యఁ గూడదు సుమా!"

ఆపనికత్తె బిళ్ళకుడుములాగున తెల్లనిరూపాయ చేతిలోఁ బడఁగానే శాంతించి వెనుకటిప్రసంగము మఱచిపోయెను. ఒక్కనిముసములోనే మారి యామె యెంతో వినయముతో బిందుతో మాటలాడెను.

పనికత్తె—"అమ్మా! మీరన్నమాట నిజము. పిచ్చివానిమాటలెవరు పాటిచేయు దురు? శరచ్చంద్రుఁడుగారు నేటిరాత్రి కొంచెము సిద్ధిపుచ్చుకొన్నారేమో? అది మనలో ఆచారమే కాని తప్పుకాదు. మాయింటిలో మాత్రము పడుచువారేమి చేయుచున్నా రనుకొన్నారు? వారు రాత్రి చాటుగా జాతివారిసారాలు తెచ్చి తప్పత్రాగుదురు. అమ్మా! వారిగంతులు, కేకలు నేనేమని మనవి చేయగలను! పిల్లలు తల్లిదండ్రులమాట వినరు. చుట్టాలయెదుట, పెద్దలయెదుట, ఇటువంటిపనులు

చేసినందుకు సిగ్గుపడరు. పాడుకాలము వచ్చినదమ్మా! పడుచువారు తమరు చేయవలసిన పనులు మఱచిపోయి చెడిపోయి అల్లరిగఁ దిరుగుచున్నారు. శరత్తుగారిమీఁద చేసెందుకు నిందలు మోపవలె? ఆయననడతను గుఱించి నేనొకరితో కొండెము లెందుకు చెప్పవలె? నామాట నమ్ముతల్లీ! నేనిది బయలుపుచ్చుదునని మీమనసులో శంక పెట్టుకొనవద్దు."

ఆపనికత్తె మిక్కిలి సంతుష్టిఁ జెంది యాయిల్లు విడిచిపోయెను. కాని గుడ్లను పెట్టుటకు సిద్ధముగానున్న కోఁడిపెట్టవలెనే యారహస్యమెక్కడ క్రక్కుదునా యని యామె తల్లడిల్లఁ జొచ్చెను. దానిస్వభావము తెలిసికొని తెలివిగలిగి రూపాయ పాడుచేసికొనక పోయినపక్షమున మిక్కిలి బాగుండును. ఎందుచేతననఁగా దాసిదానికి రహస్యము చెప్పి దాచుమనుట విరివిగా వెల్లడిచేయుటకు మొదటిసాధనము. కలకత్తాలో గృహములయందలి పనికత్తెలు తమ యజమానులగుట్టు మట్టు బైలుపెట్టునంత మహావేగమున విశ్వప్రపంచమందలి నానాభాగములయందుండు టెలిగ్రాపుతీగలు బహిరంగ వార్తలనైతము వెల్లడి చేయఁజాలవు.

దేవీప్రసన్నునిభార్య మఱునాఁ డుదయమునఁ దనయింట నొక చాపమీఁద గూర్చుండి ఇద్దఱు వృద్ధవితంతువులతో మాటలాడఁ జొచ్చెను. స్త్రీసామాన్యమునకు సహజమైన లోకనింద్యయే యామె పల్లవిగా నెత్తికొని, యంతము లేనివ్యాఖ్యానము చేయుచు, నిచ్చవచ్చిన తెఱఁగున ముచ్చటించెను.

"అక్కలారా! సరిగా నేననుకొన్నట్లే జరుగుచున్నదమ్మా! ఈసంగతి జరుగునని నే నెఱుఁగుదు. ఏమంటే ఈదినములలో గొప్పయింటివాళ్ళకు నీచులకు భేదమేది? అడ్డమైనది, ఆపల్లెనుండి ఈపల్లెనుండి వచ్చి నేను కాయస్థజాతి దాననని చెప్పుకొని కాయస్థులతోఁ గలిసి మెలసితిరుగుచుండును. వీళ్ళందఱుపరువు ప్రతిష్ఠలుగల కాయస్థులా తల్లీ! పదిపదునాలుగుతరములలో వీళ్ళెప్పుడైన గొప్ప కాయస్థకుటుంబములతో సంబంధములు చేసినారా యేమిటి? అలాటివాండ్లతోఁ గలసినందులకు మానోటిలో గడ్డిపెట్టవలెను గాని వాండ్లతప్పేమున్నదమ్మా! మావారు కచేరినుండి సాయంకాల మింటికి రానియ్యి. ఆయనతోనే నీసంగతి చెప్పకమానను. అమ్మా! ఇంతెందుకు? తనదర్జా, తనగొప్ప, తనపఱువు, తనప్రతిష్ఠ మావారు గుర్తెఱుఁగుకున్నారు గాని యెఱిఁగినపక్షమున ఇటువంటివారితో కలసిమెలసి యుండుట కిష్టపడుదురా? ఇది ఈలాగున జరుగునని నే నెన్నాళ్ళక్రిందటనో తెలిసికొన్నాను. వాండ్రు భవానీపురములో కాపురము చేయుటకు వచ్చి

నక్రొత్తలో, మాయింటికి వచ్చి మమ్మొక్కమాటు చూచుటకే తీరుబడి లేకపోయిందఁట. దానినిబట్టే వారెటువంటివారో నాకు తెలిసిపోయింది. అంతకన్న చిత్రమైనసంగతి చూచినారా! ఆవిధవపిల్ల అంచుచీరలు కట్టుకొని మగనితో కాఁపురము చేయుచున్నదానివలె నున్నదమ్మా! అయ్యో! అయ్యో! ఇది యంతయు జరుగునని నే నెఱుఁగుదు నమ్మా! ఏమంటే, మర్యాదలు పుట్టుకతో రావలెనుగాని నేర్చుకొంటే రావమ్మా! కిరస్తానులలోను తురకలలోను విధవ వాండ్రకు వివాహములున్నవఁట గాదు? అమ్మా! ఆలాగే అచ్చముగా ఆలాగే! తురకలకన్న, కిరస్తానులకన్న మనవాళ్ళ కేమంతమర్యాద మండిపోయినది.

అనవుడు వృద్ధవితంతువులలో శ్యామతల్లి యిట్లనియె. "నిజమే అమ్మా! నిజమే. ఇంతెందుకు? విధవపిల్ల అవునా! మంచివితంతువులందఱు చేసినట్లు ఆపిల్ల ఏకాదశినా డుపవాస ముండదుసుమా! పుణ్యస్త్రీలవలె చేపలకూడ ఆపిల్ల తినునఁట! ఈవేళ శుద్ధ ఏకాదశికదా, మన మీరాత్రి పగలు రేపుసాయంకాలము వఱకు కూడ నన్నమునీళ్ళు ముట్టుకోమన్నప్పటికి మనము ముట్టుకొందుమా?"

ఇంతలో భామితల్లి యందుకొని యిట్లుపలికెను. అక్కా! ఈచిత్రము విను. అవిధవపిల్లను గుఱ్ఱపుబండ్లమీఁద నెక్కించి షికారు తీసికొనివెళ్ళెదరు. ఏమి చెప్పను! మ్యూజియం చూచుటకు, పువ్వులతోటలు చూచుటకుఁ గూడ దానిని తీసికొని వెళ్ళినారఁట! ఇంతకన్న ఉన్నదా లోకనింద? ఈసిగ్గు చాలదు?

ఆయిద్దరు వృద్ధవితంతులు తనమాటాడుటచేత మఱింత యుత్సాహము కలిగి, దేవీప్రసన్నని యిల్లాలు మఱల విజృంభించి యిట్లనియె. "ఆపిల్లలకు, పిల్లనుగన్న తల్లికి ఇంతకంటె అప్రతిష్ట ఉన్నదా? ఆసిగ్గుమాలినపిల్ల తలమీఁద మేలిముసుఁగు వేసికొనకుండా బావగారితో ఎదుటఁబడి మాటలాడునఁట! శరచ్చంద్రునికి మంచిమంచి పిండివంటలు, వేపుడుకూరలు తయారుచేసి పంపించునఁట! ఇందులో శరచ్చంద్రుని తప్పేమున్నది అక్కా! అతఁడు మగవాఁడు; పైగా పెండ్లి కాలేదు. ఆపైని నెరజాణలు అప్పచెల్లెండ్రిద్దఱు పట్టి లాగుచుండగా వుర్రవాఁడు వలలో పడకపోవునా? ఆఅప్పచెల్లెండ్రను మాగుమ్మముదాటి రానియ్యను."

ఉత్సాహముతోఁ గూడిన ఈసంభాషణము యొక్కధ్వని దూరముగా నున్న నూతిదగ్గఱకు వినఁబడెను. ఇంటియాఁడపడుచులు, కోడండ్రు పడుచు హృదయములకు మిక్కిలి ప్రియమైన పుక్కిటిపురాణములు చెప్పుకొనుటలో

లోకాపవాదములు వినుటకు సాధారణముగా నేదో పనివంకఁ బెట్టి యక్కడకుఁ జేరుచుండురు. వారీవిధముగా మాటలాడిరి.

"అక్కా! ఏమిటమ్మా! యీగొడవ? ఈకోపము, ఈకంఠశోష యెందుకో" అని యొకతె యడిగెను.

"ఏమి? నీవు వినలేదా? అయ్యోనాతల్లీ! అట్లైన ఏమివిన్నావు?" అని మఱియొకతె బదులుచెప్పెను.

"చెప్పవమ్మా! ఎవరో మంచిపిల్లను గుఱించి లోపలమాటలాడుకొనుచున్నట్టు లున్నది."

"చెప్పెద నుండవమ్మా! ఏదోయూరినుండి యీమధ్య హేముఁడని ఒకతఁడు వచ్చి భవానీపురములో కాఁపురము చేయుచున్నాఁడు. ఎఱుఁగుదువా? అతనిపెండ్లాము మఱఁదలు ఉన్నారు. విన్నావా? ఆమఱఁదలువితంతువు. ఆవిధవపిల్ల శరచ్చంద్రుని వివాహమాఁడునఁట!"

"పుక్కిటి పురాణాలు చెప్పకు. నేనివి నమ్మెదుననుకొన్నావా యేమిటి? ఇంతచిత్రాలు ఉన్నవా? విధవపిల్ల యేమిటి? పెండ్లిచేసికొనుట యేమిటి? లేనిది పుట్టించకు."

"లేనిదేమిటమ్మా? గొప్పపండితులు విద్యాసాగరులవారినిగురించి నీవు వినలేదు? 'సీతావనవాస' మని ఆయన చేసిన పెద్దపుస్తకము మొన్ననే కాదటమ్మా నీవు చదివినావు; ఆవిద్యాసాగరులవారే మన హిందువులలో విధవలు తిరిగి వివాహము చేసికోవచ్చుననితీర్పు చేసినారు. ఆయనయే పురోహితులై కొన్నివివాహములు చేయించినారు. అంతదూర మెందుకు? ఆయనకొడుకే విధవముండను వివాహమాఁడినాఁడు."

"అక్కా! నిజమే నమ్మా! నిజమే. విధవముండలను వెదకివెదకి మగలను సంపాదించి పెట్టునట్టి ఆవిద్యాసాగరుఁడు గొప్పపండితుఁడే; ఆలాగైన పక్షమున ముసలిముండల కర్మ మేమికాలింది? వాండ్లుకూడ పెండ్లిచేసికొని హాయిగ ఉండవచ్చును."

"ఉండకేమి? ముడతలపడిన ఆముసలిమొగాలకు, ఆతొస్సినోళ్ళకు వలచి వచ్చు పెండ్లికొడుకు లున్నపక్షమున వారు పెండ్లిచేసికో వచ్చును."

"సరే. అట్లయినయెడల శ్యామతల్లికి, భామితల్లికి తిరిగి కల్యాణయోగము కలుగును కాఁబోలు! పాపము! ఆదిక్కుమాలినముండలు వైధవ్య బాధలు పడలేక, ఉపవాసములు చేయలేక నానాశ్రమలు పడుచున్నారు. ఎప్పుడో వకనాఁడు నోరు పట్టలేక ఒక చేఁపముక్క కొరికి, తినరానివస్తువులు తిని కక్కుర్తిపడి వైధవ్యపీడ మాన్పుకొనుచున్నారు. ఆకక్కుర్తి అక్కఱలేకుండా స్వేచ్ఛగా ఉండవచ్చును. అక్కయ్యా! నిజముగా విద్యాసాగరుఁడు వారి పాలిఁటి దేవుఁడై వచ్చి, వైధవ్యవిమోచనము చేయించి, పెండ్లిచేయించి, పుణ్యస్త్రీలనుచేసి మగలతో కాఁపురా లేర్పఱుప వచ్చును."

"అలాగున నోటికి వచ్చినట్లు మాటాడకు. ఈనీమాటలు ఆవిధవవాళ్ళు విన్న పక్షమున నీపని మట్టము చేయుదురు. శరత్తుమాట చెప్పనేల? అతఁడు తెలివిగల వాఁడు, ముందరికి రాఁదగినవాఁడు అనివిన్నాము. మంచిపిల్లవాఁడని కూడ చెప్పు కొనుచున్నారు. ఇటువంటి అప్రతిష్ఠపెండ్లి చేసికొని అతఁడెందు కపకీర్తి పాలు కాఁదలఁచుకొన్నాఁడో"

"వలపు కొలుపులోఁ బడినవారికి తెలివితేటలు చచ్చిపోవునని పెద్దలు చెప్పు దురు. వినలేదా! పాపమా చిన్నవాఁడు శరచ్చంద్రుఁడు ఆపడుచుముండ మాయ లలో బడినాఁడు. ఆవలపు విషములాగున తలకెక్కినది. ఇఁక వానిపని చెల్లె"

"ఆవిధవ పిల్లకు వయ స్సెంత?"

"పదహారని చెప్పుకొనుచున్నారు. అది యెఱ్ఱగా బుఱ్ఱగా ఉన్నది. మాయ నవ్వులు నవ్వుచు శరత్తును పలుకరించి బుట్టలోఁ బెట్టుచున్నది. పానకాలు, మజ్జిగతేఁటలు పంపునఁట. అందులో ఏమిమందులు కలుపుచున్నదో ఎవరెఱుగు దురు? పాపము శరచ్చంద్రుఁడేమి చేయఁగలఁడు? ఎంత చదువుకొన్నప్పటికి మగవాఁడు కదా! పెద్ద పెనుభూతములాగు ఆవిధవపిల్ల ఎదుగఁబడగానే ఈకుర్ర వాడవ కట్టు లాగగలడా? అతనిమనసు చెడిపోయి దాని స్వాధీనమై పోయినాఁడు.

"అట్లైన వారికి ఆదివఱకే స్నేహ ముండవలెను."

"వారిస్వగ్రామములో కలసి యున్నప్పుడు ఒకరినొకరు ఎఱుఁగుదురని ఆదివరకే స్నేహమున్నదని చెప్పవలెనా? అక్కడ ఏమి జరిగినదో నాకు తెలి యదు. విశ్వము తలక్రిందులు కానీ, వాళ్ళనుగుఱించి ఒక్క అబద్ధపుమాట

చెప్పను. వాఁడు కలకత్తాకు వచ్చినదిమొదలుకొని ఏమి జరుగుచున్నదో అందఱకు తెలిసియున్నదే. శరత్తు ఆపిల్లను తీసికొని వెళ్లి తనయింట్లో ఉంచుకొన్నాఁడు. దానినే కాదు. దానప్పను, అప్ప పెనిమిటిని గూడ తన దగ్గఱనే పెట్టుకొన్నాఁడు. ఇందుచేతనే కాఁబోలు హేముఁడు మనసులో అనుమాన మేదో తోఁచి వేఱే ఇల్లొకటి అద్దెకు పుచ్చుకొని పెండ్లామును మఱదలును తీసికొని అక్కడకువెళ్ళి పోయినాఁడు. అమ్మా! నాతల్లీ! ఆవిలాస మేమని చెప్పనునీకు? కృష్ణమూర్తికోసము బెంగపెట్టుకొని ఎంతచిక్కి శల్యమైనదో నీవెఱుఁగుదువు కదా! అలాగే శరత్తు ఊరిలో లేనప్పుడు ఆవిధవపిల్ల బెంగటిల్లి సగమై పోయిన దఁట. అప్పుడు పరుగుపరుగున శరత్తు వెళ్ళి ప్రక్కనుగూర్చుండి, బుజ్జగించి, రాత్రి పగలు వదలక ఓదార్చినాఁడు. అబ్బో! ఇది పెద్దచిత్రకథ అక్కా! అంతకథ నేఁజెప్పఁగలనా? విద్యయనుచిన్నది సుందరుఁడను చిన్నవాఁడు ఒకరి నొకరెంతమోహించినారో వినలేదా? వారు ఒకరినొకరు విడిచిపెట్టి ఉండలేకపోయినారు. సుందరుఁడు నేలసొరంగములోనుంచి విద్య పండుకొన్న గదిలోకి చల్లగా వెళ్ళినాఁడు. ఆకథే ఇప్పుడుతిరిగి జరుగుచున్నది. ఈనాఁటి పడుచుపిల్లకాయలందఱు సుందరుఁడుచేసినటక్కరితనము చక్కఁగా గుర్తెఱుగుదురు. గనుక జాగ్రత."

ఈయపవాదము నూతిదగ్గఱనుండి దాసీజనము పనిచేయుచోటికి మెల్లమెల్లఁగా ప్రాఁకెను. ఆపనికత్తెలు కదిపిన తేనెపట్టులోని తేనెఁటీగలవలె ఎడతెఱపిలేక అఱచుచు పఱచుచు ఝుంకారముతోఁ జెప్పుకొనఁజొచ్చిరి.

"అహ్హా! నిజమేనా? ఆవిధవపిల్ల నిజముగా పెండ్లిచేసికొనునా?"

"అందులో నీకు సందేహ మెందుకు? ప్రధానమై పోయినది. ప్రయత్నమీదివఱకే రైనది. మఱదలకు హేముఁడు పెండ్లిబట్టలు కొన్నాఁడు. నగలు చేయించినాఁడు. నిజమా, నిజమా అని మూలము తెలియక నీవడుగుచున్నావు."

"గొప్పవారియింట విధవవాళ్ళు పెండ్లి చేసికొనుట తప్పులేకపోతే పేదవాళ్ల ఇంటిముండలుగూడ నిర్భయముగా పెండ్లి చేసికోవచ్చును."

"ఏల చేసుకోగూడదు? ఆపల్లెపిల్లవాఁడు నీకు బజారులో కనఁబడినప్పుడు ఎన్నోసారులు నీవతనితో మాటలాడుచుండఁగా చూచినాను. వాఁడు దిట్టమైన విధవముండను చేసికో దలఁచుకుంటే వాఁడునీకు తగినవాఁడేనా?"

"నిర్భాగ్యురాలా! సిగ్గు, సిగ్గు; ఛీ అలాటిమాటలు నన్నువకు. నీసంగతినాకు తెలియదనుకొన్నావా ఏమిటి? ఆపదుంబకోమటి కీమధ్యభార్య చచ్చిపోయింది కద? ఏలకులు, లవంగాలు అమ్ముకొనేఅతన ఆయన కిల్లు చూచిపెట్టఁదగినవారు అన్నము వండిపెట్టువారు ఎవరులేరు. ఏదోయేలకులు లవంగాలు కొనవలెనని వంకఁబెట్టి, నీవెన్నిమాట్లో ఆయనదుకాణమునకు వెళ్ళి, అరగంటసేపేదో గుసగుసలాడుచుండగా నేను చూడలేదా? ఇల్లుచక్కబెట్టుటకు నీలాటి దిట్టమైన పిడిరాయివంటిముండను ఆయన చేసుకొంటే బాగుండును గాదు?"

"నీ మొగముమండ! నిన్నుకాటిలోఁబెట్ట! పొడుముండా! పేలకు"

ఉమయొక్కతల్లి యప్పటికిని తొల్పుకారుగ్రామములోనే యుండెను. ఈయపనింద యామెచెవినిఁగూడ పడెను. పడగానే గ్రుడ్లనీళ్ళు గ్రుక్కుకొని తనలోఁదానే విలపించి, అట్టి అప్రతిష్టకార్యము చేసి మల్లికవంశమునకు మచ్చ తేవలదని బావకూఁతురగు బిందుకు జాబిట్లు వ్రాయించెను.

"కూఁతురా! మీతండ్రిగారు బ్రతికియున్నపక్షమున తన వితంతుపుత్రిక మఱల వివాహము చేసికొనుట కొప్పుకొనునా? నాతల్లీ! నీయమ్మ బ్రతికియున్నపక్షమున ఈ యప్రతిష్టకార్యమున కామె సమ్మతించునా? సుధ ఏమియెఱుఁగును? అది చిన్నపిల్ల. తల్లివైనను దండ్రివైనను దానికి నీవేకదా బిందూ! ఈ భూమిమీఁద దానిని కష్టముల పాలుచేయకు. అది విధవదియై పరువుమర్యాదలతో బ్రదుకకుండ దానికి పెద్దమచ్చ తెచ్చిపెట్టకు. దానిని గంగలోదింపకు. దానిని మఱింత నిర్భాగ్యురాలిని చేయకు."

ఈవార్త వర్ధమాన పురమునకుఁ బ్రయాణము చేసెను. అక్కడ కాళీ జబ్బుచేసి మంచమెక్కి భర్తకుపచారములు చేయుచుండెను. ఆమె బిందు కిట్లు విచారముతో జాబు వ్రాసెను.

"మావారు మంచ మెక్కినారు. నేను రాత్రి పగలు ఆయన మంచము వదలి పెట్టక యున్నాను. ముందు శీతకాలములో వెచ్చనిచోటగుటచే రాణిగంజికి, ఆయనను తీసికొని వెళ్ళవలసిన దని వైద్యులు చెప్పుచున్నారు. మేమక్కడ ఒక యిల్లు కుదుర్చుకొన్నాము. ఒక వారము దినములలో మేమక్కడికి పోవుచున్నాము. నేనెక్కడున్నప్పటికి నాకు సుధకు ప్రేమతో మేలు కోరుచుందును.

"ఓసీ! బిందూ! సుధను గురించి కొన్ని చెడ్డవాదులు వినుచున్నాను. ఈవాదు లేమిటి? మచ్చలేని మన కుటుంబమునకు శరత్తుడాగు వేయఁ దలఁచు కొన్నాఁడా?

"బిందూ! నీవు తెలివి గలదానవు నీగుణము బంగారమువంటిది. మాతమ్మునకు పిచ్చియెత్తిన పక్షమున మాయింటి నుండి వెళ్ళఁగొట్టుఁడు. అప్రతిష్ఠపనికి ఒప్పుకొనవద్దు. విధవపిల్లను వివాహము చేయవద్దు. మీరటువంటి పెండ్లిచేసిన పక్షమున నాఅత్తవారి ఇంటిలోనివారు నామొగ మింక చూడరు. మీకాళి మీకిఁక మీఁద కనబడదు"

ఆ జాబులు బిందు తన భర్తకుఁ జూపి లోలోపల దుఃఖించెను. బిందు కడు రహస్యముగా దాఁచఁ దలఁచిన రహస్యము ఛేకీజిహ్వాగల యపవాదము దేశమంతటను వ్యాపింప జేసినది. పాపము! అమాయకురాలైన యామె చెల్లెలి పేరు ముందటి కీడ్చి తెచ్చి జనులు తిరస్కారము చేయ జొచ్చిరి.

శరచ్చంద్రుఁడు కోరిన కోరిక యేదోవిధముగ పరిష్కరింపఁ బడువరకా విషయము సుధ చెవిని బడకుండు నట్లు హేముఁడును బిందు సర్వప్రయత్నములు చేసిరి. ఎన్నఁటికిని మనోనాధుఁ డగుటకు వీలులేని మనుష్యునకు గాటంపువలపు గలదని వితంతువునకుఁ దెలుపుట, సంతోష శూన్యమైన యామె వ్యర్థజీవనమును మఱింత కష్టభాజనము చేయుట గాక యన్య ప్రయోజన మేమున్నది? ఏ యుపనిందతో జనులామె పేరు కలిపి వాడుచున్నారో, యాయపనింద నామె శ్రవణగోచరము చేయుట వలన నామె కుళ్ళికుళ్ళి యేడ్చి కృశించిపోక మానునా?

కొంతకాలము వారు చేసిన ప్రయత్నము సాగినది. కాని పూర్తిగా దాఁచుట యసాధ్యమయ్యెను. అనుమానములు లేని యమాయకురాలయ్యు సుధ గృహములో నేదో చిక్కు సంభవించిన దనియు, గొప్పసమస్యయేదో తన యప్పయొక్కయు, బావయొక్కయు మనస్సుల నాక్రమించిన దనియు జాడకట్టెను. సుధ తన యప్పయొక్క విచార సూచక మొగమును, మౌనభావమును పలుమారు విలోకించి, యటు లుండుటకుఁ గారణమేమని యడుగ దలఁచియు సాహసించి యడుగలేక పోయెను. మిత్రులనేకులు వచ్చి హేముని జూచి మాటలాడుటయు, నుదయకాలమందతఁడు పలు జాబులు వ్రాయుటయు, రాత్రి ప్రొద్దుపోవువరకు బిందుతోఁ గలసి యాలోచనలు చేయుటయు నామెకనిపెట్టెను. తనపేరు, శర

చ్చంద్రుని పేరు పలుమారెత్తినకొలది తమయింటి పనికత్తెతో నరగంటకంటె నెక్కువసేపు గుసగుసలాడుట యామెకు వినఁబడెను. వారమున కొకసారి వారియింటికిఁబోవు మంగలిది భావగర్భితముగ సుధనుజూచి చిన్ననవ్వు నవ్వి మనసు పట్టలేక యెట్టకేలకు స్వల్పకాలములోనే యింటి యజమానురాలవై యుండఁగా కన్నుల చల్లగా నిన్ను చూడఁగోరుచున్నానని పరిహాసముగాఁ బలికెను. రహస్యములు బయట పెట్టవద్దని తన కామాట చెప్పినవారెంతో యొట్టు పెట్టించుకొని చెప్పినను, చాకలిది శరచ్చంద్రునియొక్కయు సుధయొక్కయు బట్టలుతనకే యుదుకుటకు వేయమని కోరెను.

ఈయాఁడువాండ్ర యభిప్రాయ మేమైయుండును? పైకివేరర్థమిచ్చునట్టి దెప్పుడు మాటలతో నొక పేద వితంతువును వారు పీడించుచున్నారని యనవచ్చునా? అట్లు వారుచేయుదురని సుధ భావింపలేదు. ఏలయన నామె యెవ్వరి మనసు నొప్పించి యెఱుఁగదు. అంతకుమునుపెవ్వరు మిక్కిలి పేదరాలైన యాబిడ్డను మోటమాటలతో నొప్పింపలేదు. అట్లైన నిటువంటి మాటల భావమేమై యుండును? ఆపలుకులభావములు స్పష్టముగఁ దెలుపవలసినదని సుధ నొక్కియడిగెను కాని మంగలిది మౌనము వహించి నోరెత్తదయ్యె చాకలిది మాత్రమిట్లనెను. "శరచ్చంద్రుడుగారు తప్పక యాలస్యముగానో పెందలకడనో యెవరినో యొకరిని పెండ్లిచేసికొనక మానరు. పేదదానను గనుక ఆయింటి వాడుక నాకే యిప్పించవలసినదని యడిగినాను"

సుధ దానిమాటలలో యదార్థము గ్రహించినదో లేదో మన మూహింపఁజాలము. అనుమానములు లేని యమాయకస్త్రీ లొకప్పు డిటువంటి విషయములలో మన మూహింపలేనంత దీర్ఘదృష్టిఁ గలిగి లోతుగఁ బరిశీలింతురు. ఈచిత్రకథ యంతయు నామెకు మూలముట్టదెలియక పోయినను, చీఁకటితెఱమఱుగున నిలిచి యావలిగుట్టు తెలిసికొనుటకై గిజగిజ దన్నుకొనుచున్న స్త్రీబుద్ధికుశలత మార్గప్రదర్శియగు ప్రభాకిరణమును గనిపెట్టలేదని చెప్ప వలనుపడదు. అజాగ్రతగా నోట వెలువడు సామాన్యపు మాటల నామె యధికశ్రద్ధతోఁ చెవియొగ్గి వినఁజొచ్చెను. సాధారణముగా నెవ్వరుగాని సరకుచేయని యల్పసూచనల నత్యంత జాగ్రతతో నామె గమనించుచు వచ్చెను. తన భవ్యత్కాలస్థితిని, తన యదృష్టమును మఱుగుపఱుచుచున్న యారహస్యాంధకారమునఁ బ్రవేశించి చూచుటకు, ఆమెస్త్రీస్వభావము భగీరథ ప్రయత్నము చేయఁజొచ్చెను. ఆమె యెవ్వరి

నే ప్రశ్న లడుగలేదు. ఏసమాచారమునకైఁ బ్రయత్నింపలేదు. కాని వెల వెల బాఱుచుండిన యామెమొగము, కన్నులలోని తళుకు నిశ్శబ్దమైన యామె యాలోచనమును, హృదయగతమైన సంతోషమును వెలిపుచ్చుచుండెను.

ఎట్టకేలకు యదార్థమంతయుం దళుక్కుమని యామెమనస్సునెదుట మెఱిసెను. ఒకనాటిసాయంకాల మామె పండుకొనఁ బోవుచుండగా నేలమీఁద నొక నలిగిన కాగితము కనఁబడెను. అది యామె తీసి చూచెను. అందలి వ్రాత తన పినతల్లిదని యామె కనిపెట్టెను. అందు రహస్యము లుండునని యనుమానము తోఁచనందునను, తన పినతల్లి యేమి వ్రాయునో చూడవలయునను కుతూహలము పొడముటచేతను, జాబు నామె యాముదపుదీపముకడకుఁ దీసికొనిపోయెను అది బిందుపేర వ్రాసినజాబు బిందు చదువుకొని దానిని జాగ్రతగాఁ బాఱవైచెను. ఆజాబులోనిసంగతులు చదువుకొన్న కొలఁది సుధయొక్క చేయివడఁకెను. గుండె తటతటఁ గొట్టుకొనెను. కాగితము చేతిలోనుండి నేలజారిపడెను. చేష్టలుతగ్గి కొయ్యబాఱి వెనుకకు మఱలి తడబడుచు నెట్టెటో మంచముపైఁబడెను.

ఆట్టిసమయమున హిందూవితంతు వనుభవించు లజ్జాదుఃఖములు మొదటి భావములై యామెమనసులో మొలకలెత్తెను. అంత మంచివాఁడు, అంతదయ గలవాఁడు, అంతచదువుకొన్నవాఁడు, అంత బుద్ధిమంతుఁడు గదా శరచ్చంద్రుఁడు. అట్టివాఁ డిటువంటి యప్రతిష్ఠకార్యము నేల తలపెట్టెనో? ఆమెను తనకిమ్మని యేల యడుగవలె? ఏల యామెను నలుగురిలో నవమానపఱుచవలెను? ఈసంగతి పినతల్లికిఁ దెలిసినది. శరత్తుతోఁబుట్టువునకుఁ దెలిసినది. ప్రపంచ మంతకుఁ దెలిసినది. తనచుట్టములకు, ఇతరులకు నామె తన మొగమింక నేలాగునఁ జూపఁగలదు? అపవిత్రమై, యమంగళమైన విషయము తన పేరుతో మిళితమైనదన్న జ్ఞానము మితిమీఱిన లజ్జాభావము బాలిక మనసు నావరించెను. తలగడమీఁద మొగము పెట్టుకొని కన్నీరు వెలికిఁ దోపకుండ నేడ్చెను.

నిశ్శబ్దమైన యాచీఁకటిరాత్రియందు నిదుర లేక నిముసమైన విశ్రాంతి లేక యామె మంచముమీఁద బండుకొనియుండ, బాధకరములైన తలంపు లామె హృదయమును జీల్చివేయఁజొచ్చెను. ఆమె పరాభవ సముద్రములో మునిఁగిపోయెను. తాను పలుమాఱులు చదివియున్న రామాయణ మహాకావ్యమందలి కథానాయిక యగు జనకరాజనందనవలె భూదేవి రెండుపాయలుగాఁ బగిలి మానవుల కన్నులకుఁ దానెన్నఁడుఁ గనబడకుండఁ దన్ను నిజగర్భమునకుఁ దీసికొనిపోవు

నట్లు చేయుమని భగవంతుని వేఁడుకొనెను. గంటలు గడచిపోయెను. అర్ధరాత్రి ముందలి మహాంధకారరాశి క్రమక్రమముగా సన్నగిలి యుషఃకాలమందలి మందమంద తేజోరేఖగా మాఱఁజొచ్చెను. కాని సుధకు దుఃఖవిమోచనము కాలేదు. తెల్లవారగానే దగ్గఱిచుట్టములకు, దాపుముజతకత్తెలకు వారు వీరననేల, తన యప్పకు మొగ మామె యెట్లు చూపఁగలదు?

ఉదయకాలమందలి యరుణారుణప్రభలు తోఁచినతోడనే సుధ తనయప్పమొగముఁ దేటిపాటి చూచుటకును, మేడమెట్లు దిగిపోయి యెప్పటియట్ల గృహకృత్యములు నెఱవేర్పుటకును భయపడినదియుం బోలె నప్పుడు చేయకుండ తనమంచము దిగి, దొంగదానివలె లోపలికి వెళ్ళెను. వెళ్ళి యంట్లుతోమి, చెంబులు తోలిచి, వాకిలియూడ్చి, నీళ్ళుతోడి మనోవ్యథ మఱచుటకో యన నేదోపని చేయఁ జొచ్చెను. తలుపుతెఱచి సేవకుఁడు లోపలఁ బ్రవేశించినప్పుడామె యులికిపడి వడఁకెను. ప్రొయిలో నిప్పువేయుట కామె వంటయింటిలోనికిఁ బోయినప్పుడు నిత్యము పాలుతెచ్చుగొల్లది వచ్చెను. ఆమెనుజూచికూడ సుధ భయపడెను.

ఈవిధముగా దినములు నిశ్శబ్దమైన సంక్షోభముతోఁ గడచెను. గాఢమైన లజ్జాభావ మామెను దిగఁద్రొక్కఁజొచ్చెను. ఆమె లేతహృదయము మహాభారముచేత గ్రుంగిపోయెను. ఈచిత్తక్షోభముచాటున, నీమహాభయముమాటున నామె హృదయమున నాశయనియెడు రహస్యప్రభారేఖ మెఱయకపోయె నేని సుధ స్త్రీస్వభావమునకు విరుద్ధలక్షణములు కలది యగును. ధీరస్వభావము గల శరచ్చంద్రుఁడు పిన్నవాడయ్యు ప్రపంచమంతయు నేకమై భిన్నాభిప్రాయముఁ జూపినను సరకు సేయక దయారసపూరితమైన హృదయమున నామెయందు గాఢానురాగమును బెంచి, వారియింటికి రాకపోయినను సుధనే తలంచుచు, వివాహము చేసికొనుట కామెనిమ్మని తెగించి యడిగినాఁడుకదా! ఈతలంపు లామెమనస్సున దొంగలవలెఁ జొచ్చినప్పుడు యువతీజనసహజమైన రహస్యానందమును బొంది కంపమొందఁ జొచ్చెను. ఎడనెడ నది యపవిత్రమై యపరిశుద్ధమైన యానందమని తలంచెను. నవనవోన్మేషభాజనమైన యాయువతి హృదయమందలి యంధకారావకాశము నెల్ల మహాశాసూర్యప్రభలచేత దీపితంబులు కాకపోయినపక్షమున నామె మానవాంగనకంటె నతీతమో యధమమో యైన జంతువై యుండవలయును.

ఒకనాఁడు మధ్యాహ్నము బిందు సుధ పండుకొనుగదిలోనికిఁ బోయెను. అప్పుడు సుధ చేతిలో నొకపుస్తకముదాల్చి చదువుచు, గవాక్షములోఁ గూర్చుండెను. అక్కనుజూడఁగానే సుధ పుస్తకము మూసివైచెను.

"అమ్మాయి! నీవు చదువుచున్న పుస్తకమేమిటి?" అని తెలిసికొనవలయునను కుతూహలముతో బిందడిగెను.

"ఇది బంకించంద్రచటర్జీ చేసినపుస్తకము" అని సుధ సిగ్గునఁగన్నులు వంచి ప్రత్యుత్తర మిచ్చెను.

"ఆపుస్తకము పేరేమిటి?"

"దీనిపేరు, విషవృక్షము."

అనవుడు బిందు కోపదృష్టితోఁ జూచి కొంచెము కఠినస్వరముతో "ఆపుస్తకము నాచేతికిమ్మమ్మ. అది చదువవద్దమ్మాయి!" అని మందలించెను.

సుధ పుస్తక మప్పచేతికిచ్చి "ఇది చదువఁగూడని చెడ్డపుస్తకమా యేమిటప్పా!" అని మెల్లగా నడిగెను.

"సుధా! చెడ్డదికాదు. బంగాళీభాషలో నిది ప్రశస్తమైన చిత్రవచనకావ్యము. నీవు చిన్నదానవు. ఇపుడే యిది చదువఁగూడదు."

"అప్పా! పోనీ, దానికథ సంగ్రహముగాఁ జెప్పు. కథ యెట్లుపరిణమించునో తెలిసికోవలెనని కుతూహలపడు చున్నాను."

"కథచిన్నదే. ఒక బాలవితంతువు చిత్రకావ్యములోని కథానాయకుని వివాహమాడును. కాని పెండ్లిచేసికొని యామె సుఖపడలేదు. బహుకష్టముల ననుభవించి తుదకు విషము తిని చచ్చినది."

ఈమాటలు వినఁగానే సుధమొగము వెలవెలఁబోయెను. వెంటనే మాటు మాటాడక యామెగది విడిచి యావలకుఁ బోయెను.

---

*

*

పదమూడవ ప్రకరణము

దీపాలమావాస్య.

హిందూదేశము చిత్రము లగుపండుగులకుఁ బ్రసిద్ధి కెక్కినది. అవి యెన్నో గలవు. అందు దీపాలమావాస్యవలె మిక్కిలి చిత్రమైనదియు, మనస్సునకు నచ్చునదియు మఱియొకపండుగ లేదు. అది దేవీపూజలు జరుగు మాసమున ననఁగా నాశ్వయుజమాసమున నమావాస్యనాఁటి రాత్రి జరుగును. పల్లెయనక, పట్టణమనక, క్షుద్రగ్రామమనక, గొప్ప యూరనక దేశమందంతట ప్రతిగృహమందు దీపములు వెలిఁగింతురు. మహానందముతో బాణసంచ కాల్తురు. ఆదీపముల యొక్కయు, బాణసంచయొక్కయు, దేదీప్యమాన కాంతులముందఱ నమావాస్య నాటి కాఱుచీఁకటులు పటాపంచలై పోవును. ఆకాశమునందలి నక్షత్రములు భూమిమీఁది జ్యోతులముందట మినుకుమినుకు మనుచు వెలవెలఁ బాఱును. భాగ్యవంతుల భవనములు బహుదీపపంక్తులతో నలంకరింపఁబడును. నిఱుపేదరాలైన స్త్రీసైతము తాను చెమట యూడ్చి సంపాదించుకొన్న యొకటిరెండు డబ్బులు వ్యయముచేసి చమురు కొని పరమనిష్ఠతోఁ దనకుటీరముముందఱ నొక్కదీపమైన వెలిఁగించును.

ఈపండుగునాఁటి రాత్రి కలకత్తానగర మెప్పటియట్లే ప్రభాభాసమానమయ్యెను. ధనవంతులు పుణ్యము నిమిత్తమై దానపూర్వకముగాఁ గనక వర్షము గురిపించిరి. ఘనకార్యములు చేయ సమకట్టియున్న చాకచక్యము రవంతయు నడఁగి పోయిన తరువాత నేలమీద గలక్రిందుగాఁ గూలునట్టి యుత్సాహ పూరిత యువజనంబులవలెనే పేకజువ్వలు నక్షత్రమండల మంటి పెటుక్కున ప్రేలి క్రిందఁ బడజొచ్చెను. ఔటులు, నేలటపాకాయలు పెటేలునఁ బ్రేల గొప్పధ్వని చేసి యీనాఁటి యనేక యువకవిజనంబులవలెఁ బేరు లేక యదృశ్యములయ్యెను. లంకాపురులు మహోజ్వలము లగు నగ్నిచక్రముల వలె గిర్రునఁదిరిగి కొంతవడికిఁ దమ తేజంబుఁ గోల్పడ కొయ్యముక్కలుమాత్రమే మిగిలెను. వీధులలోను, వాకిళ్ళలోను, డాబాలమీదను పిల్లలు గుంపులు గుంపులుగాఁ గూడి యెఱ్ఱమతాబులు, పచ్చమతాబులు కాల్చి సంతోషించిరి. ఎండిన జనపకఱ్ఱ మోపు లంటించి కొందఱు పెద్దపెద్ద సెగడిమంటలు వేసిరి.

శరచ్చంద్రుఁడు వెలయుచున్న దీపములను, మతాబులు మొదలగు బాణసంచులను జూడక చెవులు దిబ్బడి వేయునట్లు మ్రోగుచున్న వేలటపాకాయల చప్పుడు, పేలుచున్న పేకజువ్వలచప్పుడు వినక, ప్రతిగృహమందు జనులచేత నాఁటిరాత్రి విధిగాఁ బూజింపఁబడిన కాళికావిగ్రహమును సరకు చేయక, యిల్లు వెడలిపోయెను. చప్పుడుకాకుండ నడుగు లిడుచు, గుండె దడదడఁ గొట్టుకొన నతఁడు హేముని బసఁజేరువఱకు భవానీపురమునందలి సందుగొందులం బడి బిసబిసనడిచిపోయెను. అనుకొన్న ప్రకారము బిందు వచ్చి తననిమిత్తము వీధిలో నిరీక్షించు చుండునని యతఁడు తలంచెను. కాని హేముఁడే వచ్చి యతనిరాక కెదురు చూచుచుండెను. అతఁడు శరచ్చంద్రుని చేయిపట్టుకొని వెలుపలి గదిలోనికిఁ దీసికొనిపోయెను. పాపమీ చిన్నవాఁడతనివెంటఁ దల వంచుకొని కొండంతయాసయుఁ, గ్రుంగఁదీయుభయము హృదయమును మల్లడిఁగొన గ్రుడ్డివాఁడువలె నెటుపోవుచున్నది చూడలేక లోపలఁ బ్రవేశించెను.

హేముఁడు దీప మెగసనఁద్రోసి యిట్లనియె "శరచ్చంద్రుఁడా! నీవు చెప్పినమాటలు నాభార్య నాతోఁ జెప్పినది."

అన నెట్టెటో మాటలాడుటకు ధైర్యము తెచ్చుకొని శరచ్చంద్రుఁ డీవిధముగ బలికెను. "నేనతిసాహసము చేసి యుంటిననిగాని, నీమంచితనమునకును, నీవు నాయందుంచిన విశ్వాసమునకును దగినట్లు నేను ప్రవర్తింప లేదని నీవెంచిన పక్షమునఁగాని, నీవు చిన్ననాటనుండియు నన్ను మిక్కిలి ప్రేమతో నాదరించితివి. గావున నాసాహసమును నీవు మన్నింపుము"

"అబ్బాయి! శరచ్చంద్రుఁడు! నీవు చేసినతప్పు లేదు. నేను మన్నింపవలసినది లేదు. లోకులందఱు నిన్ను నిందింపనీ, నాకు నీయెడగల గౌరవప్రేమలు మార్పుఁ జెందక యథాప్రకారముగానే యుండును."

ఆమాటల కుత్తర మిచ్చుటకు శరచ్చంద్రునికి మాట రాలేదుగాని యాతని కన్నులు నాగ్రాపముగాని కృతజ్ఞతను దెలుపుచుండెను. అది హేముఁడు చూచి ఉభయుల సంభాషణము మొదలు పెట్టెను.

"మీరు చిన్నపిల్లలైన నాటనుండియు నిన్ను నాభార్యయు సోదరునివలెఁ జూచుచువచ్చినది. ఇఁకముందుఁగూడ నామె నీయెడ వెనుకటి ప్రేమ చూపక మానదు. నీవు మమ్మడిగినదానికి మాకు నీపైగోపములేదు. ఎప్పటిగౌరవమే కలదు. ఈవిషయమున నీకుఁ గలదయకు, ధైర్యమునకు, నిన్ను మేము గౌరవించుచున్నాము.

"నీదయకు, ఇందు చూపినదయకు నేనాజన్మాంతము కృతజ్ఞుడనై యుండెదను" అని శరచ్చంద్రుడు పలికెను. హేముడు మనోరథసిద్ధి సూచింపని వ్యవహారసరళిలో మాటలాడుచున్నాడని శరచ్చంద్రుడు గ్రహించి దిగులుపడ జొచ్చెను.

అప్పుడు హేముడిట్లనియె "ఈవిషయమై మమ్ము నీవడుగకముందు సంగతి సందర్భములు చక్కగా విచారించినావా? క్షణభంగురమైన మోహావశమున నీవు పలుకుట లేదుకద?"

"హేముఁడా! నామాటనమ్ము. నేను మిమ్మడగకముందే చాలకాలము మిక్కిలి జాగ్రత్తగా ఆవిషయమై విచారించితిని. నేను మిక్కిలి చక్కగాఁ బనిచేసితినని నాయభిప్రాయము"

"నీవు నాకంటె నెక్కువ చదువుకొన్నావు. శరచ్చంద్రుఁడా! అయి నప్పటికి నాకన్న వయసులో నీవు చిన్నవాఁడవు. ఒకటి రెండు విషయములు నీకుఁ దోచకపోవచ్చును. అటువంటివి నన్నుఁ జెప్పనీ. నీవు చేసికొదలఁచుకొన్న వివాహము పూర్వాచారపరాయణుల కంగీకరింపరాని కసహ్యము."

"మూఢవిశ్వాసముచేత దురభిప్రాయము పెట్టుకొని గుడ్డివారివలె సన్మార్గముఁ గానక మాటలాడువారి యభిప్రాయములను నేను లెక్కచేయను. మనసులో నేవిధమైన బాధపడక, ఇటువంటి నిందల నే నిదివరకే భరించినాను. యావజ్జీవసుఖము నిమిత్త మిటువంటినిందలను నే నవలీలగా భరింపఁగలను."

"శరచ్చంద్రుఁడా! దీనికి నిన్నుఁ వెలివేయుదురని యెఱుఁగుదువా?"

"మన పూర్వాచార పరాయణులు కావలెనంటే వెలివేయనియ్యి"

"మిక్కిలి పరువుప్రతిష్ఠలు గల నీకుటుంబమున కిది కళంక మగునని యెఱుఁగుదువా?"

"హేముఁడా! ఇది పాపకార్యము కాదు కాఁబట్టి కళంకముగాదు. ఇది యపవిత్రమైన పాపకార్యమని నీకుఁ దోఁచినయెడల మానివేయ వలసినదని చెప్పు. నీమాట ధర్మశాస్త్రముగా నేను శిరసావహించెదను."

"వితంతువు పునర్వివాహము చేసికొనుటలో దోషమెంతమాత్రము లేదు. మన సనాతనధర్మశాస్త్రములు, మన యాచారములు సమ్మతించినదే యిది. ఇటీవల నేఁటికాలముననే అది చేయఁగూడదని జనులకు దానివిషయమై వ్యతిరేకాభిప్రాయము కలిగినది.

“దానిసంగతి అంతే అయినపక్షమున, తప్పులేదనియు తప్పక మేలు కలిగించునదియు నైన యీఘనకార్యమును మన మీమాత్రపుఁ బిచ్చియభిప్రాయములకే మానవలసినవారమా? ఏఁబదియేండ్లక్రిందట సముద్రముదాటి వెళ్ళకూడదని మనపెద్ద లందఱభిప్రాయపడినారు కాని యీదినములలో వందలకొలఁది యాఁడువాండ్రు మగవాండ్రు ఓఢ్రదేశమునకు, బర్మాకు, చెన్నపట్టణమునకు, సింహళమునకుఁ బ్రతివారము సముద్రముమీఁద బొగయోడలెక్కి వెళ్ళుచున్నారు. దీని పేరే యభివృద్ధి; మార్పు బొత్తిగా లేకపోవుటచేత చైతన్యరహితమై జాతినాశము నొందును.”

“శరచ్చంద్రుఁడు! నీవు మంచిబుద్ధిమంతుఁడవు. చక్కనియాలోచన గలవాఁడవు. విను; ఈవిషయమంతయు మర్మము లేకుండ నీయెదుట విప్పి చెప్పెదను. మనస్స్వభావ మొకప్పు డాకస్మికముగా నద్భుతోత్సాహపూరితమైయుండును. అది యావజ్జీవము వెనుకటి బలిమి గలిగి స్థిరముగా నుండదు. యౌవనప్రాదుర్భావమునకు సహజమైన యనురాగాతిశయముతోడను గాఢదయతోడను నీవు సుధను వలచుచుంటివని నే నెఱుఁగుదును. వయసుముదిరినకొలఁది వలపు నేఁడున్నంత దృఢముగా నుండకపోవచ్చును. ఇది అసంభవముకాదు. నామాటకడ్డమురాకు. నేను చెప్పఁదలఁచుకొన్న దేదో తుదముట్టఁ జెప్పనియ్యి. సావధానముగావిను. సుధపై నీకు నిజమైన గాఢానురాగము కలదా లేదాయని సందేహించను. అయినప్పటికి నేఁటిమక్కువ రేపు సన్నగిలవచ్చును. తొందరపడి చేసినకార్యము యావజ్జీవదుఃఖహేతువు కావచ్చును. నిన్ను వెలివేయుదురు. ప్రాతపద్ధతివారు నీకుటుంబముతో సంబంధబాంధవ్యములు మానికొందురు. నీకూఁతులకు మగలు దొరకరు. పదిమంది చుట్టాలుకలసి కూర్చుండినచోటికి నీకొడుకులను జేరనీయరు. పడుచుతనములో తొందరపడి సాహసకార్యముచేసి యుండక పోయినపక్షమునను, మిక్కిలి నాప్తులైన ప్రియమిత్రుల హితోపదేశములవిని యుండిన పక్షమునను, జీవితముయొక్క యవసానదశయందు బంధువైరము, బహుదుఃఖము కలుగుటకుమాఱు విశేషసుఖము, విశ్రాంతి కలిగి యుండుననియు, నీప్రియపుత్రులు బహిష్కరింపఁబడి నిరాదరింపఁబడక, కావలసినవారిచే గౌరవింపఁబడి యాదరింపఁబడుదురనియు ముసలితనములో నీవు వ్యర్థమైన పశ్చాత్తాపము నొందవచ్చును. చిన్నవాఁడవైనను నీవు స్వయముగా నెల్లవిషయములు చూచి, తెలిసికొనుటకుఁ దగినయీఁడు గలవాఁడవు. కలకత్తాలో ననేకకాయస్థగృహములలో సుధను మించిన చక్కనిపిల్ల లెందరో యున్నారు. నీవంటియల్లుఁడు దొరికినప్పుడు

కన్నుల నద్దికొని స్వీకరించని మామగారు కాయనులలో లేఁడు. ఇదమిద్ధమని నిర్ణయించుటకు ముందు లెస్సగా నాలోచించు. తొందరపడకు. చిరకాలము బ్రదుకఁదలచినవాఁడవు. ముందుమాట గట్టిగా నాలోచించుకో. పడుచుతన మందు వివేకముతో వర్తించి ముసలితనమునకై సుఖము మూటకట్టి దాచికొనుము"

ఆమాటలన్నియు శరచ్చంద్రుఁడు శాంతముతో నాలకించి మెల్లఁగా నిట్లు బదులుపలికెను, హేముఁడా! నన్ను నమ్ము. ఆకస్మికమనోవికారముచేతఁ గాని, బుద్ధివలపుచేతఁ గాని నే నీవ్యాపారములో దిగలేదని ముమ్మాటికి నమ్ముము. నాజీవయాత్రలో సుఖముపడఁ గోరుచున్నాను గాని పోనాడఁ దలఁచుకొనలేదు. వార్ధకమందు నాకుఁగలుగఁబోవు పశ్చాత్తాపమును గూర్చియు నీవు చెప్పినావు. నలుప్రక్కలఁ బరికించి యొకసారి చూడుము. మనజాతిలో గౌరవపాత్రము లైన ప్రముఖులెందఱున్నారో? చిన్నతనమందు ధైర్యముతోడను గౌరవముతో డను నమ్మినట్లు లాచరించి వార్ధకమున వగచి పశ్చాత్తాపము నొందినవాఁడొకఁ డైన వారిలోఁ గలఁడా? హిందూదేశములో సత్యములైన మతధర్మములు బోధించి నందుకు బహిష్కరింపఁబడినవారు పలువురు గలరు. ప్రతిష్ఠ, పాండిత్యము, మహాధికారము, గొప్పపదవి, మొదలగునవి సంపాదించుటకై యూరపు ఖండము నకు వెళ్ళినవారనేకులు గలరు. సంఘసంస్కరణము ప్రారంభించి తమ గృహముల యందు, తమ కుటుంబములయందు దానం బ్రవేశపెట్టి కార్యశూరులై ఘనకీర్తిఁ గాంచిన వారనేకులు గలరు. ప్రశస్తతరమైన సంఘజీవనమును సంస్థాపించిన యీమహాత్ములలో నొక్కఁడైన బాల్యకాలమునఁ దాను జూపిన ధైర్యసాహసము లకు వగచి పశ్చాత్తాపమునొంది బాధపడినవాఁడు గలఁడా? వెలివేయఁ బడినందుకు విచారించినవాని నొక్కనిని వేలు మడిచి చూపఁగలవా? బహిష్కారమున కిప్పు డంత భయములేదు. మునుపటిబాధ లిప్పుడుండుటకు వీలులేదు. ఇప్పుడు బహి ష్కరింపఁ బడిన వానికి ధర్మకార్యము నిమిత్తమై బాధలు పడితినిగదా ఇదే చాలునని సంతోషించుటకైన నవకాశము లేదు. తుపాకిమందుఁ గనిపెట్టిన తరు వాత, అమ్ములు విండ్లు మూలఁబడినట్లే పూర్వాచార పరాయణులచేత గొప్ప యాయుధమైన బహిష్కార మిప్పుడు మూలఁబడి త్రుప్పుపట్టుచున్నది. యూరపు ఖండములో విద్య నేర్పుటకుఁబంపని గొప్పకుటుంబము కలకత్తాలో నేఁటికాల మున నొక్కటైన లేదు. వారిని వెలివేయువాఁడెవఁడు? దేశమందున్న ఋజు వర్తనులను బుద్ధిమంతులను వెలివేసినపక్షమున సంఘములో నిఁక యోగ్యతలు, తెలివితేటలు మిగుల నేమిగలవు. మనల నడిపించువారు మనకు విద్య నేర్పువారు,

మనకై నానాశ్రమలు పడువారు, సంఘ సంస్కరణమునకై పాటుబడువారు, రాజకీయ విషయములలో మనయభివృద్ధికై పోరాడువారు హిందూ సంఘములో నుండి బహిష్కరింపఁ బడదగినవారే యగుదురా? ఇంతెందుకు? హేమచంద్రుఁడా! నీవెఱుఁగవా? ఎవరిపరిశ్రమ మనజాతి పురోవృద్ధికి మూలాధారమో యభివృద్ధిమార్గమున నడచునపుడు మనకెవ్వరి ఋజువర్తనము మార్గదర్శియై మనకు ప్రోత్సాహము కలిగించి, మనచేతఁగూడ ధీరకార్యములు చేయించునో అమహాత్ములందఱు, ఆ నాయకులందఱు వారే. మహానుభావుఁడైన విద్యాసాగరుఁడు, మనీషావంతుఁడైన మధుసూదనదత్తు, మహోత్సాహ పూరితుఁడైన కేశవచంద్ర సేనుఁడు దేశాభిమాని యగు సురేంద్రనాథ బెనర్జి మున్నగువారిని మనవారిదినములలో, పేరునకు మాత్రము వెలివేసినారు. ఈనాయకులను దలఁచుకొనకుండ హిందూసంఘముమాట లెవ్వరు తలఁచుకొందురు? ఈనాఁటి హిందువులలో మిక్కిలి గొప్పవారుగా శ్రేష్ఠులుగా సిరినే పేర్కొని గర్వింపని హిందువుఁడెవఁడున్నాఁడు? నాపిచ్చిమాటలు పాటింపక మన్నింపుము. ఈసంబంధములో నమ్మృతులైన యామహాత్ముల నామధేయములఁ బేరుకొన్నందుకు నన్ను క్షమింపుము. నేను నవనాగరకుఁడనుగాను. నాయకుఁడనుగాను. పేదవిద్యార్థిని. స్వసౌఖ్యముఁ జూచికొనునట్టి యాత్మలాభపరాయణుఁడను కాని యాదినములలో వెలివేయుట పిచ్చిప్రయత్నమని మాత్రము చెప్పఁదలఁచుకొన్నాఁడను. అధర్మము కానిదియు, అగౌరవము కానిదియు నైన కార్యమొకటి చిన్నతనమందుఁ జేసినందుకుఁ జెడిపోయినవాఁడెవఁడును లేడు.”

“నీవు మిక్కిలి సమర్థతతో లెస్సగా వాదించినావు. నీవు తొందరపడ లేదనియు గ్రుడ్డివలపునకుఁ జిక్కి పరవశుఁడవై పనిచేయలేదనియు నీనిశ్చితాభిప్రాయమును జెప్పినందుకు సంతసించుచున్నాను. నామాట వినుము. స్వయంకృతాపరాధములచేతను, సాహసములచేతను మనదుఃఖములను మనమే తెచ్చిపెట్టుకొందుము గాని లోకము మనకు దుఃఖము తెచ్చి పెట్టజాలదు.”

“హేముఁడా! నే నాలోచించ గలిగినంత నెమ్మదిగా నాలోచించి చూడఁగాఁ దేలిన పర్యవసానమేమనగా, నేను దురదృష్టములు తెచ్చుటకుఁ బ్రయత్నించుటలేదు. సౌఖ్య సంపాదనమునకే నేను ప్రయత్నించుచుంటిని. ఆమెను నే ననేక దినములు, అనేక వాసనములు పరిశీలించి చూచితిని. ఆమె నాయనురాగసిద్ధి చేసిన పక్షమున నన్నందఱికంటె నెక్కువ ధన్యునిఁ జేయఁ

గలదు. ఆమె యమాయికత్వమును బట్టియు, విశ్వాసమును బట్టియు, ఆమె దయారసమును బట్టియు, భక్తిని బట్టియు, ఆమె సత్యాసక్తిని బట్టియు, పవిత్రచరిత్రమును బట్టియు, నే నామె వలపు నిలిపితిని. ఎవని హృదయమును ఎవని జీవనమును తనయనురాగమిచ్చి యామె యనుగ్రహించునో అతనిని భగవంతుడు సైత మనుగ్రహించును. హేముఁడా! నే నెంతో నెమ్మదిగాను మోహావేశ శూన్యముగాను మాటాడుచున్నాను. ఈరెండు మాసములనుండియు నాహృదయమును బ్రద్దలుచేసి తలఁచుకొన్నప్పుడెల్ల నాకు వెఱ్ఱి యెత్తించునట్టి యావికార భావములను నేనిప్పుడు నామనస్సు చెంతకు రానిచ్చుటలేదు. కాని యొక్కమాట మాత్రము చెప్పెదను. ఏమనఁగా ఈవిషయములో నామనోరథము భిన్నమై, నాయాశ లడుగంటె నేని నాప్రయత్నములు వ్యర్థములు. నాజీవనము నిష్ప్రయోజనము. నే నెందుకు బనికిరాను. నేనింకఁ బ్రయత్నింప వలసిన విషయమే యుండదు. సంతోషరహితమై పరమార్థశూన్యమైన యీ బ్రదుకు నేనేమిచూచికొని బ్రదుకుదును?"

"శరచ్చంద్రుఁడూ! సిగ్గు సిగ్గు ఆలాగనబోకు. దేహమనోదార్ఢ్యములు గల నీవంటి పడుచువాఁడు తాను వలచినకన్య తనకుఁ జిక్కలేదని జీవితపరమార్థములను భ్రష్టములు చేసికొని, ప్రయత్నములు భగ్నములు చేసికొని పాడగుట భావ్యమా? సుధ నీకు చేజిక్కినదికాదని అటువంటిమేధను అటువంటిశక్తిని, వ్యర్థము చేసికొని యావజ్జీవము చేయఁదలఁచిన మహాకార్యము లన్నిఁటిని మానుకొని ఆశలడుగంటఁ ద్రొక్కికొని చెడిపోవచ్చునా?"

"హేముఁడా! నీనిశ్చయ మిదా? ఎంతదృఢమైన హృదయమైనను, జీవయాత్రలోఁ దనకుఁ జేదోడు వాదోడుగా నుండి కాపాడుటకుఁ బరసహాయ మపేక్షించునన్న మాట నీవు మఱచితివి. ఆశమీఁదనే మనుష్యుఁడు బ్రదుకుచుండును గాని భ్రానిస్వతె నిరర్థకముగా పనిచేయఁడు. నీవిదివఱకే ఏదోఫక్కిగా నిశ్చయించుకొన్న పక్షమున నావాదము వ్యర్థము. అందుచేత నీకును బిందుకును నేను చేసిన యపరాధము మఱచి పొమ్ము. చేయవలెనని నేనేయపరాధమును జేయలేదు గావున నా తెలివితక్కువను మన్నింపుము. మనయూరిలో నేను చిన్నపిల్లవాఁడనైనప్పటినుండి నామీఁద నీవు చూపుచువచ్చిన యాప్రేమతో నే [illegible]ప్పుడు తలఁచుకొనుము."

[illegible]చ్చంద్రుఁడు బాష్పబిందువులు వెడలుచున్న తనకన్నులు వానికగపడకుండ జేయుటకై తనమొగ మావలకుఁ ద్రిప్పికొనెను. హేముఁడు మెల్లగా

తనపై జేయివైచి యిట్లనియె. "నీమనస్సునకు నొప్పికలిగించితి నేనినన్ను క్షమింపుము. నీవు తొందరపడి క్షణభంగురమైన మనోవికారముచేత నిటుల చేయుచుంటివేమో కనుగొనుట సుధకు నీకుఁ గూడ క్షేమమే యని తలంచితిని. నీవు సంపూర్ణముగా నాలోచించి, యిది మంచిదేయని తలంచిన పక్షమున నీధైర్యమునకు నేను మెచ్చుకొనుచున్నాను. నీదయకు నేనాశ్చర్యపడుచున్నాను. నీవివాహమును నేను హృదయపూర్వకముగ నంగీకరించుచున్నాను. నాభార్య తనకీవిషయ మంగీకారమే యని తననోటితో తానే నీతో స్వయముగాఁ జెప్పుటకై మేడమీఁద నీకోసము కనిపెట్టుకొని యున్నది. అపారకరుణాసముద్రుఁడగు భగవంతుఁడు పాపము మంచిభాగ్యురాలగు సుధయొక్క జీవనమునకు సంతోషము, సౌఖ్యము ప్రసాదించి యనుగ్రహింపఁ దలచుకొన్నప్పుడు నాభార్యయు నేను దానికడ్డముగానిలిచి చెడగొట్టుదుమా? పరమేశ్వరుఁడు మీకెల్లవరములిచ్చి నిరంతరానందమిచ్చి రక్షించుగాక!"

ఆమాటలకు శరచ్చంద్రుఁడు ప్రత్యుత్తరము చెప్పలేకపోయె. శరచ్చంద్రుఁ డంతవరకుఁ బిగఁబట్టి యుంచిన బాష్పబిందువులు హేముని చేతులమీఁదఁ బడియెను. హేముఁడు మాఱుమాటాడక మేడమీఁదకు వెళ్ళుమని చేతితో సంజ్ఞచేసెను.

బిందు మేడమీఁద నాముదముదీపము పెట్టి నేలఁ జాపవైచికొని కూర్చుండెను. అప్పుడు శరచ్చంద్రుఁడు కలతపడిన మనస్సుతో, సిగ్గుతో చెదుమొగముతో నామెకడకుఁ బోయెను. తన కృతజ్ఞతను గౌరవమును దెలియజేయుటకై యతఁడు బిందు పాదమునకు నమస్కరించెను

"అంధకారబంధురమగు నాజీవనముమీఁద సూర్యప్రభ జిమ్మితివి. ఇందుకు నేను నీకేమి ప్రత్యుపకారముఁ జేయఁగలను, బిందూ!"

మన దేశములో స్త్రీలు తోఁబుట్టువుల భర్తలగు బావలను, మఱఁదులను హాస్యము చేయునట్టి యాచారము కలదు గావున బిందు శరచ్చంద్రుఁడు తన చెల్లెలికి మగఁడై, తనకు మఱఁదియైనట్టే భావనచేసి యిట్లు పరిహాసోక్తులు పలికెను. అబ్బాయీ! శరచ్చంద్రుఁడు! నాజోలికి రాకు; నాపాదములకు నమస్కరింపవద్దు. ఈవిధముగా బతిమాలుకొని అనుగ్రహముసంపాదించుకో వలసినవారు వేరే యున్నారు. నేను కాను"

శరచ్చంద్రుఁడు సంతోషపారవశ్యమునుండి తెలివిఁ దెచ్చికొని కృతజ్ఞతా సూచకముగా మరల నిట్లనియె. "నీవు నాపక్షముఁ బూని నీమగనితో వాదము

చేసినావు. ఈకార్యమున కతనిసమ్మతి పుచ్చుకొన్నావు. యావజ్జీవసుఖప్రదానము చేసినందుకు, నేను నీ ఋణము నేలాగునఁ దీర్చుకొనఁ గలను?"

"మాసమ్మతి యెందుకు నాయనా! పెండ్లికొడుకు తానే మనసిచ్చి ముందుగా పెండ్లికూతురిని వరించినాఁడు. పెండ్లికూఁతురు పెండ్లికొడుకుమీఁదఁ దన కటాక్ష మిదివరకే సమ్మతించినది. మధ్య సమ్మతించుటకు మానుటకు మే మెవరము?"

"బింబూ! నీమాటిపోటిమాట లొక్కనిమిషము కట్టిపెట్టు. ఇందుకు సమ్మతించితి నని మనఃపూర్వకముగాఁ జెప్పి మాయిద్దరిని దీవించవమ్మా! ఈభూలోకములో అన్నివిషయములకంటె నీదీవన నే నెక్కువగా భావించుకొందును! సుధ ఇప్పటికిని చిన్నపిల్లే కదా? అప్పగారు సెలవీయకుండ ఆమె యేలాగున సమ్మతింపగలదు?"

"అది ఇప్పుడు చిన్నపిల్లకాదు. చిన్నదైనను ఈవిషయములు మాకంటె దానికి బాగుగాఁ దెలుసును. అమ్మయ్యా! అదెక్కడ! చిత్రచిత్ర గ్రంథాలు చదువుకోఁగలదు. వలపులు గిలపులు దానికిచక్కగా తెలియును."

"వేళాకోళము కట్టిపెట్టి కొంచెమునేపు వ్యవహారసరళిగా మాట్లాడవమ్మా! నీకు దండము పెట్టెదను"

"నన్నీలాగున బతిమాలుకోవద్దయ్యా! మీయాబిడ కోపపడగలదు. నా చెల్లెలికి కోపము తెప్పించుట నాకిష్టములేదు. ఆమెవ్యవహారములలో జోక్యము కలుగఁ జేసికొని పెత్తనము వహించుట అంతకంటె ఇష్టములేదు."

"నే నోడిపోయినా నమ్మా! ఈయుత్కృష్టసమయమున మీసలహా పుచ్చుకొని వ్యవహారము పరిష్కరించుకోవలె ననుకొన్నాను. నేఁడేమోకాని నీవతి కఠినముగా నున్నావు! ఎంతబతిమాలుకొన్నను మెత్తబడ కున్నావు."

"వ్యవహారము పరిష్కరించుకో. ఎవరు వద్దన్నారు? పెండ్లికొడుకు పెండ్లికూఁతురుఁ గలిసి రహస్యముగా వారిష్టము వచ్చినట్లు వ్యవహార మిదివరకే పరిష్కరించు కొన్నారని నే ననుకొన్నానే! ఇఁక పురోహితుఁడు వచ్చి పీటలమీఁద కూర్చుండఁబెట్టి పెండ్లిచేయుటె తిరువాయి. మరచిపోయినాను; కాలేజీలలో చదువుకొను పిల్లవాళ్ళు మంత్రములు మానివేసి పురోహితుని పిలువక వివాహములు స్వయముగా తామే చేసికొందురేమో! ఆఁడవాళ్ళు చేయవలసిన లాంఛనములు కొన్నియున్నవి. అవి మేము చేయవచ్చునా? లేక పెండ్లికూతురే చేసికోగలదా? సుధను పిలుతునా? పోనీ, ఇప్పుడే వివాహము జరిగించుకోవచ్చును.

బిందుయొక్క హాస్యరసప్రసంగమున కారాత్రి విరామములు కనఁబడక పోవుటచే శరచ్చంద్రుఁడు విసిగి వెళ్ళిపోవుటకై లేచి కడసారి యొకవిన్నపము చేయఁదలఁచుకొని, యామెచేతులు రెండు పట్టుకొని యిట్లనియె నీవుకఠినము గాను నిర్దయగాను మాటలాడుచున్నావు గనుక నేను వెళ్ళిపోయెదను. నేను వెళ్ళకముందు దయతో ఒక్కమాటమాటాడి మావివాహము సరే, మంచిదే యని దీవింప వమ్మా! నీదీవన, నీప్రేమ నాకీలోకములో అందరి దీవనలకంటె, ప్రేమకంటె యెక్కువ. నీవంటివారు నాకీలోకములో లేరు.”

ఆ విన్నపము విని బిందు మెత్తపడి సామాన్యధోరణి నీవిధముగాఁ బలికెను.

“దయాసముద్రుఁడైన భగవంతుఁడు నాచెల్లెలికి వివాహసౌఖ్యము విధింప ననుగ్రహించి నప్పుడు నేను దానికడ్డము నిలుతునా? దిగఁబడినవారి కూఁత కోలలై లేవనెత్తి నిరుపేదలను నెనరుతో రక్షించునట్టి భగవంతుఁడు నాచెల్లెలికి సుఖము గలుగఁజేసి రక్షించుగాక! ఇటువంటి దృఢమైన హృదయము, దయా స్వభావము గల మనుష్యునకు ఎటువంటి గొప్పదశ దగియుండునో అటువంటి గొప్పదశ, అభివృద్ధి ఐశ్వర్యము నీకు కూడా భగవంతుఁ డీయవలెనని కోరు చున్నాను. సుధ నీకు విధేయురాలై, పతివ్రతయై, పదిమందిలో ఇటువంటి ఆఁడది లేదనిపించుకొనునట్లు నడచుకొని నీకు సుఖము కలుగఁ జేయవలెనని కోరుచున్నాను”

ఈ సంభాషణ మగునప్పటికి రాత్రి ప్రొద్దుపోయెను. శర్చంద్రుఁడు బిందు వద్ద సెలవు పుచ్చుకొని వెళ్ళెను. వెళ్ళునప్పు డతఁడు తనవంటి యదృష్టవంతుఁడు భూలోకములో లేఁడని యానందించెను. అతఁడు మెల్లమెల్లఁగా మేడమెట్లు దిగి ముందటి వాకిలిలోనికి వచ్చెను. వచ్చునప్పటి కతని కేదో చప్పుడు వినఁబడెను. వినఁబడఁగానే అతఁడు కదలక అక్కడ నిలిచెను. ఆమె మఱియెవ్వరు కాదు. చేతిలో దీపము పట్టుకొని సరకులకొట్టునకు తాళము వేయుచు సుధ వానికగపడెను. ఆముఖారవిందమును ఆసుందరవిగ్రహమును శరచ్చంద్రుఁడు సరిగా రెండుమాసములనుండి చూచుటలేదు. అందుచేత నతఁడు తన మనోరథమై, తన వలపులకాణాచియై వెలయుచున్న యాయమాయక విగ్రహమును ఱెప్పపాటు లేక చూచుచు, నిశ్చేష్టుఁడై నిలువఁబడెను. అతఁ డక్కడ మాటలాడఁజాలక

నిలువఁబడినప్పుడు మనోజ్ఞమైనకైపు తలకెక్కినట్లు మాటలచేత వర్ణించుటకు వీలులేని తలఁపులు తండోపతండములై యతని యంతరంగమునఁ బ్రవేశించెను.

సుధ తలుపు గొళ్ళెమువైచి, తాళము తగిలించి రెండవప్రక్కకు మరలెను. మరలినప్రక్కను నిశ్చేష్టుఁడై నిలిచి మాటాలాడఁజాలక తన్నుఁ జూచుచున్న శరచ్చంద్రవిలాసుని శరచ్చంద్రునిఁజూచెను. ముద్దులుమూటగట్టునామె మొగమున సిగ్గుతోఁచెను. ఆసిగ్గునఁ దలవంచికొనెను. శరచ్చంద్రుని దృష్టిప్రసారము నుండి తన మొగమును గప్పిపుచ్చుటకు మొదటిసారి యామె మేలిముసుఁగు కన్నుల కడ్డముగాఁ దీసికొనెను. నిలువఁబడినప్పు డామె మేనువడఁకెను. నులివెచ్చని నెత్తురు పైకి ప్రవహించి మొగమునకును, మూసికొనిన కన్నులకును సుందరమైన యరుణకాంతినిఁ గలిగించెను. అంతట నామె దీప మూఁది యార్పివైచెను. ఆర్పివైచిన సిగ్గుగలిగించుచున్న యాయవస్థనుండి తప్పించుకొనుటకై మరియొకయెడ కరిగి దాగి యుండెను.

భరతఖండములో వధూవరుల కింతకంటె యెక్కువ సమావేశములు, సంభాషణలుఁ గలుగవు.

పదునాల్గవ ప్రకరణము

మాతృశాసనము.

అర్ధరాత్ర మయ్యెను. పండుగురాత్రి వెలిగించినజ్యోతులు క్రమక్రమముగా నాటిపోయెను. సంతోషముతోఁ గలిసికొన్న మనుష్యులగుంపు లదృశ్యములయ్యెను. ఆసమయమున శరచ్చంద్రుఁడునిర్జనములై మాటుమణఁగి సందులగొందుల నుండి మాఱుమూలనున్న తనబసకుఁ బోయెను. నాఁటిరాత్రి జరిగిన వృత్తాంతములు తలఁచుకొన్నకొలఁది వానిగుండె దడదడఁగొట్టుకొన సాగెను. ఈమహాసౌఖ్య మనుభవించు నదృష్టమతనికిఁ బట్టునా లేక యాపండుగరాత్రి వెలిఁగించిన దీపములు జ్యోతులు క్రమక్రమముగ నారిపోయిన తరువాత నంధకారబంధుర

మగు ప్రపంచమునకైనే, యాస లన్నియు నడుగంటిపోవ నతనిహృదయము మును పటికంటె నధికముగ దుఃఖభాజన మగునా?

అడుగులు చప్పుడు కాకుండ నతఁడు తన బసఁజేరెను, చేరగానే సేవకుఁ డొకఁడు జాబొకటి తెచ్చి చేతిలో పెట్టెను. పెట్టఁగానే ముందతఁడు వడఁకెను. మేడమీఁది దీపములేదు. అతఁడు మేడమెట్లు మెల్ల మెల్లఁగా నెక్కుచుండ నేదో క్రొత్తకీడు తనకు మూఁడ బలచుకొన్నదని గొప్పభయ మతనిమనస్సునావరించెను. కడచిన రెండుమాసములనుండియు నతఁడున్న వ్యాకులము చేత నతని నరములు బల హీనములయ్యెను. ఆతఁడు దీపముకడకుఁ బోయి జాబు జదువ నమకట్టునప్పటికి వానిచేతులు వడఁకెను. దానిమీఁద కాశీ టపాముద్ర చూడఁగానే అతనికంపము మఱింత వృద్ధియయ్యెను.

ఆజాబు వానితల్లివద్దనుంచి వచ్చెను. అందులో నిట్లుండెను.

"బిడ్డా! శరచ్చంద్రుఁడా! నీవు నిరంతరారోగ్యముఁ గలిగి చిరంజీవి వగుటకు, నీప్రయత్నములు మనోరథములు సిద్ధిపొందుటకు, నీకెల్లప్పు డానందము కలుగుటకు భువనేశ్వరస్వామిని నే నెల్లకాలము ప్రార్థించు చున్నదానను.

కుమారా! నీవిషయమై నే నొక చెడ్డవాడుక విని మిక్కిలి ఖేదపడు చున్నాను. నీవు నాకు సుపుత్రుఁడవు. నీతల్లిమీఁద నీకు మిక్కిలి ప్రేమ. నీమీఁద నెంత చెడ్డవాడుక పుట్టినను నే నది నమ్మను. భర్తను గోల్పోయి దుఃఖించు చున్న తల్లిని మఱింతదుఃఖ పెట్టవని నే నెఱుఁగుదును.

ఆవిధవపిల్లను సుధను నీవు పెండ్లియాడుదు వని ఇక్కడ అందఱు చెప్పు కొనుచున్నారు. అది పాపకార్యము. అందువల్ల నీతండ్రిగారి కప్రతిష్ఠయు, నామ నస్సునకు మేర లేనిదుఃఖమును సంభవించును. నీవు నయవిధేయతలు గలవాఁడవు. మాతృభక్తి కలవాఁడవు. గనుక తల్లిమనస్సు నొప్పింపవు.

నాయనా! ఈప్రపంచములో నే నెన్నోకష్టములు పడి యున్నాను. మీ తండ్రిగారు నన్ను దుఃఖసముద్రములో ముంచి వెళ్ళిపోయినారు. నీచెల్లెలికోసము నే నెంత దుఃఖపడు చుంటినో నీవే యెఱుఁగుదువు. నీవే నా నిక్షేపము. నీవే నా ప్రాణాధారము. నేను నీమీఁద పుట్టెడాస పెట్టుకొని యున్నాను. నేను బ్రదికి నన్నాళ్ళు బ్రదుకఁబోను. కాబట్టి యీముసలితనములో బ్రతికియున్న నాలుగు దినములు నన్ను దుఃఖ పెట్టకు నాయనా!

నా తండ్రీ! నా తలమీఁద ఎన్ని వెంట్రుక లున్నవో అన్ని సంవత్సరములు బ్రదుకవలెను. దయాసముద్రుఁడైన విశ్వేశ్వరుఁడు నిన్ననుగ్రహించి, నీమనస్సు పవిత్రమై, ధర్మముమీఁద నిలుచునట్లు చేయుఁగాక! ఇంతకంటె తల్లి కుమారుని నిమిత్తము వేఁడఁదగిన దేమున్నది? నాయనా! నిన్నొకసారి చూచి పోవలె నని త్వరపడి కలకత్తాకు వచ్చితిని."

శరచ్చంద్రుఁ డా జాబు మొదటనుండి చివరవఱకుఁ జదువుకొనెను. అంతలోఁ దృప్తినొందక మఱలమఱలఁ జదువుకొనెను. అంతట జాబు పట్టు లేక చేతుల నుండి జారి క్రిందబడెను. శరీరము కంపించెను. కన్నులు చీకట్లు గ్రమ్మెను. ఒడలు తెలియక మూర్ఛిల్లి నేలఁ బడెను. తెలివి యెప్పుడు వచ్చెనో యతఁ డెఱుఁగఁడు. అతఁడు లేచి కిటికీతలుపు తెఱచి, చీఁకటివైపుఁ జూచుచు నిశ్శబ్దముగా గవాక్షములోఁ గూర్చుండెను. అప్పుడతని యంతరాత్మలో మహావేదన ప్రారంభ య్యెను. నోరు మెదపక, బాష్పములైన విడువక యతఁ డక్కడఁ గూర్చున్నప్పుడు, ప్రేతకళ యావహించినట్లుండెను.

తనయుత్సాహము భంగమైనందుకుఁ దుంక [illegible] మందలి సకలసౌఖ్యములను, వదలుకొని [illegible] రహితమై, వికాసశూన్యమై నిష్ప్రయోజనమై, నిరుత్సాహకరమైన జీవయాత్ర తాను చేయఁగలఁడు. కాని హేమచంద్రుని బింబమును దలఁచుకొన్నప్పుడు, తన యందు విశ్వాస ముంచిన యమాయకురాలగు సుగుణను దలఁచుకొన్నపుడు, నతని గుండెలు నీరైపోవఁజొచ్చెను. ఈవాదుకదే మంతట వ్యాపించిన ట్లతఁ డెఱుఁగును. తాను మొదట మాటయిచ్చి, పిదప సుగుణను జేకొనక వెనుకఁ దీసినపక్షమున లోక మంతయు నిష్కళంకమైన యాకుటుంబమును నిందించి కాకులు పొడుచునట్లు పొడుచునని యతఁ డెఱుఁగును. నిర్వ్యాజప్రేమతోఁ దన్నాదరించి సంతోషపెట్టినో యెఱుఁగని తనజీవనమును సౌఖ్యభాజనము సంతోషము చేసిన యాకుటుంబమునకు ఆ ప్రేమనిలయమునకు స్వయముగాఁ దానే పరాభవము కావించుట భావ్యమా యని యతనికిఁ దోఁచెను తోఁబుట్టువుకంటె నెక్కువగాఁ దన్నుఁ జూచినబిందునకు దమ్మునికన్న నెక్కువగా రము చేసిన హేమునకు దాను చేయవలసిన ప్రత్యుపకార మదియా యని యతడు చింతించెను. ఇంటిలో జేరి యింటివారినందఱిని గఱచి, చంపి, పిదప మెల్లమెల్లగా నావలికి బ్రాకిపోవు కోడెత్రాచువలె, మొదటనంత నమ్మ బలికి, యంతటి గ్రంధము జరిగించి, చిట్టచివఱకు వారినందఱి

నపకీర్తిపాలుచేసి, కుటుంబనాశనముజేసి వచ్చుటధర్మమాయని యతడువిచారించెను. "అమ్మా! ఒక్కవిషయములో నేను నీమాట వినజాలనందున క్షమింపుము. నేను వారిని మోసపుచ్చజాలను." అని తల్లినుద్దేశించి శరచ్చంద్రుడు బిగ్గఱగా బలికెను.

అనంతర మతడు మాయామర్మ మెఱుగనిసుధను, నిర్మలహృదయము గలసుధనుదన్ను నమ్మినసుధను దలచితలచి విచారించెను. ఆఱు మాసములక్రిందట నామె యేగొడవ లెఱుగక యుండెను. ఏపాప మెఱుగని యాచిన్నదానిమనస్సున కతడు క్రొత్తక్రొత్తయాసలు గొల్పెను. ఆయువతీహృదయము నతడు నవసంతోష రసముతో నింపెను. అట్టిపసికూన నిప్పు డతడు వదలివేయ వలసినదా? యావజ్జీవము అపనిందపాలై సుఖమెఱుగక దిక్కుమాలినదై యామె యుండవలసినదా? మొదలు వితంతువు వివాహము చేసికో దలచుటయే నింద. ఆనింద యెట్లో యోర్వవచ్చు ననుకొనగా, జేసికోదలచుకొన్న పురుషుడు చేసి కొనక, కారణము చెప్పక, యకస్మాత్తుగా మానికొనుటచే నేదోదోషము దానికడ నుండబట్టి, యతడు వదలివేసె నని లోకులు వ్రేలుపెట్టి చూపి కలకాల మామెను నిందింతురు. ఆమె పేరు సంసారస్త్రీల కెత్తకూడని పేరుగా నెంచి యమ్మలక్కలు గుసగుసలాడుదురు. ఇట్లు పరిత్యక్తయైన యామంగభాగ్యురాలు సడినోర్వలేక, మనోవ్యాధిపీడితయై మంచమెక్కవచ్చును. వెలికిబుచ్చుటకు వీలులేని దుఃఖ భారముచేత గ్రుంగి యనేకులు గతించినట్లే యామెయు నకాలమృత్యువు వాత బడవచ్చును. ఈతలంపులతో నతని తల గిఱ్ఱున దిరిగెను. ఆరేయి వీచుచున్న చల్లనిమందమారుతములు తనపై బ్రసరించి సేదదేర్పవచ్చునని యాతడు తల కిటికీలోనుండి యావలకు బెట్టెను. లోకమంతయు నిద్రించు చుండెను. అంధకారము భూమి నంతయు నావరించెను. ఆశరత్కాలరాత్రి యందు లెక్కకు మిాఱినచుక్కలు సమ్మోహావము జెందిన విశాలప్రపంచమును జూచు చుండెను.

కాలక్రమమున దూర్పుదెసయందు దెల్లనిరేఖలు పొడసూపెను. అంతలో నతనికి దల్లి జ్ఞప్తికి వచ్చెను. దుఃఖసముద్రములో మునిగియు దన్ను మితిలేని గారాబమున బెంచి, బ్రదికి నన్నాళ్ళు బ్రతుకజాలక, జీవిత శేషమందు సంరక్షకుడుగా, నూతకోలగా, నేడు గడయుగా దన్నె నమ్మకొని యున్న మాతృదేవత మనఃపథమున జొచ్చెను. "ఓతల్లీ! నీవు చెప్పినమాట వినక, నేను నీయెడల దుర్వినయము జూపవలసినదా? నీమనసునకు నేను నొప్పి' గలిగింపవలసినదా? ఈభూమిమిాద నీవుండవలసిన కడపటిదినములలో నీకేసౌఖ్యము లేకుండజేసి నిన్ను

నేను బాధింపవలసినదా? శతవృద్ధవైననీమనస్సు క్రొత్తదుఃఖములతో నింపి, నీ జీవితకాలము హ్రస్వముచేసి నీకు నేను శీఘ్రమరణముఁ గలిగింప వలసినదా? నాతల్లి మాట దాటిన తరువాత నేను బ్రతికి యెందుకు? చచ్చి పోవలసినదే."

అట్లు తలంచుచు నతఁడు గవాక్షము మీఁదనే తల పెట్టుకొని యుషః కాలము నందలి చల్లనిమందమారుతములు మేను సోఁక నిమేషకాలము నిదురించెను. ఉదయకాల సూర్యమండలములనుండి కెంజిగురాకులవంటియరుణకిరణములు గదిలోఁ బ్రవేశించుపఱకు నతఁ డావిధమున నిదురించి కొండొక వడికి మేలు కాంచి యెట్టయెదుట వెలవెలబారు మొగముతో దయారసముఁ గ్రక్కుచున్నఁ చూడ్కులఁ బ్రసరింపఁజేయుచు నిలిచి యున్నయొక యవ్వను జూచెను.

"నాయనా! నీ మొగమున నెత్తురు లేదు. వెలవెలఁబాఱు చున్నది. బెంగ బెట్టుకొన్నట్లున్నా వేమి? రాత్రి యంతయు ఎందుకు మేలుకొన్నావు తండ్రీ! పరుపుమీఁదపండుకో. కొంచెము ప్రొద్దెక్కినదాక నిద్రపో." అని తెల్లవారు జామున బండిదిగివచ్చిన తల్లి శరచ్చంద్రునిపైఁ జేయివైచి పలికెను.

తల్లి మాటలు చెవినిఁ బడఁగానే యతని హృదయము మీఁద పన్నీరు చిలికినట్లయ్యెను. వెంటనే యతఁడు కూర్చుండినచోటునుండి లేచి యామె పాదముల వద్ద గూర్చుండి కన్నీరుతో మాతృపాదారవిందముల కభిషేకముజేసి గద్గదస్వరముతో మాటలాడెను. "అమ్మా! నీమనస్సునకు నేను నొప్పి కలిగించినపక్షమున నాబుద్ధిహీనతను మన్నింపుము నేను నీమాట జవదాటను."

అని తల్లి యెదుటఁ బ్రియపుత్రుఁడు మాటలాడ వలసిన భయభక్తులతో మాటలాడెను. హిందువులమనస్సులో సమస్తభావములకంటె మాతృదేవతయెడల భక్తిభావము మిన్నయై వెలుఁగు చుండును గదా!

తన ముసలికన్నులు బాష్పబిందువులతో నిండి క్షణకాలము గ్రుడ్డి వగునట్లు లాయవ్వ యిట్లు లనియె. "అబ్బాయీ! కాఁటికి కాళ్ళు చాపుకొని యున్న తల్లిని బాధపెట్ట వని నే నెఱుఁగుదును. పుట్టి బుద్ధి యెఱిగినతరువాత నామాట దాఁటి యెఱుఁగవు. భగవంతుఁడు పాలించి నీ కన్నిసౌఖ్యములు కలుగఁజేయును."

ఇది జరిగినయొకవారముతరువాత నొకనాఁటిరాత్రి యొకపడుచువాఁడు స్టేషనుకడకు వెళ్ళుటకు హుగ్లీనదిమీఁదివంతెనమీఁదుగా నొక్కఁడు

బోవుచుండెను. బాటసారులు గుంపులుగుంపులుగా నతనిప్రక్కనుండి పోయిరి. ఎడతెఱపి లేక బండ్లు వేనవేలు పరంపరగా నడచెను. అనేకకంఠములధ్వని నభోమండల మంత వ్యాపించెను. కాని యూపడుచువాఁడు వంచినతల యెత్తక తనదారిం బోయెను. వంతెనమీఁద వెలిఁగించినదీపములు క్రింద నీటిలోఁ దళతళ మెఱసి సంచలించెను. హిందూదేశ మంతటితో నత్యధిక వ్యాపారము గల యూస్టేషనువద్దనుండి సరకుబండ్లు కట్టుకట్టు మని నడిచి, మహాపట్టణమునఁ బ్రవేశింపఁజొచ్చెను. కాని శరచ్చంద్రుఁడు దాని నంకఁ జూడనే లేదు. అతని మనసు విచారముతో నిండి యుండెను. అతని యడుగులు మెల్లమెల్ల గాఁబడెను.

దీపాలపండుగతరువాత మహావిచారపీడితుఁడై యతఁడు కలకత్తాలో నొక వారము గడపెను. అతఁడు మిత్రులను జూడ వెళ్ళుట మానుకొని గదిలోనే కూర్చుండెను. కాని యొకనాఁ డైనఁ జదివి యెఱుఁగఁడు. పుస్తకము తెఱువ లేదు. మూసిన పుస్తకములు మూసినట్లె యుండెను. అతనిమనస్సున కేవ్యాపారము సంతోషముఁ గలిగింప లేక పోయెను. ఏల యన జీవన మతనికంధకారబంధురమై, సంతోషరహితమై ప్రయోజనము లేని దయ్యెను. తల్లినిమిత్త మతఁడు స్వార్థమును విడిచెను. ఆస్వార్థత్యాగమువల్ల నతనియాశాబంధము తెల్లి దెగిపోయెను. అతని ప్రయత్నములు వ్యర్థములయ్యెను.

తన భర్తకు రుగ్మత యధిక మయ్యె ననియు, నందుచేత మగనిని వెంటఁ బెట్టికొని తాను రాణిగంజికిఁ బోయి యుండె ననియు సోదరి యగుకాళియొద్ద నుండి యతనికి జాబులు వచ్చెను. ఆజాబులు మఱలమఱలఁ జదువుకొనఁగా నతని మనస్సునకు, క్రొత్తతలంపు తట్టెను. తాను రాణిగంజికిఁ బోయి తన బావ కుపచారము చేయవలె నని యతఁడు నిశ్చయించుకొనెను. తాను వలచిన వలపులాడికి దూరముగా నుండ వచ్చునని యతఁ డీపనికి దొరకొనెను. ఒకరు వెడలఁగొట్టకుండ తనంతట తానే దేశభ్రష్టుఁడై ఇం దందు సంచారము చేసి కాలక్షేపము చేయ వలయునని యతఁడు సంకల్పించెను. తన జన్మస్థలములో నెవరికి జ్ఞప్తికిరాకుండ, బంధుమిత్రులస్మరణమునఁ దగుల కుండఁ గడుదూరమున హిందూదేశమం దేదో మూల నుండుట కతని కిచ్ఛ పొడమెను. అట్టియేకాంతజీవనమువల్ల కలకత్తాలోఁ దాను గడపుచున్నదుఃఖజీవనమునుండి తనకు విమోచనము కలుగు నని యతఁడు నమ్మెను. భూలోకములో నితరసంతోష మేదియు లేదు. గావున నట్టి ప్రవాసమే యతనికి దుఃఖోపశమనమై యుండును.

"అమ్మా! నన్ను వెళ్ళనీ. పాపము కాళి దుఃఖములో నున్నది. మహాసత్రము వర[illegible] యాయింటిలో దానిమగనికి సరిగా మం దిప్పించి యాదరింపువారెవరున్నారు?" అని శరచ్చంద్రుఁడు తల్లితోఁ జెప్పెను.

"నాయనా! కలకత్తాలో నన్నొక్కర్తెను విడిచి నీ వెట్లు వెళ్ళెదవు! మాట పలుకు ఆడువారు లేక, నాఅన్నవారు లేక, కాశీలో నుండక, కొడుకుదగ్గఱ లేక, ఈమహాపట్టణములో ఒక్కదానను నే నేలాగున నుండఁ గలను?"

"అమ్మా! నీ వొక్కర్తెవు ఉండనక్కఱ లేదు. నేను లేనప్పుడు హేముఁడే నీకొడుకు; బిందు నీకూఁతురికన్న నెక్కువగా నుపచారము చేయును."

"నీవు చదువుమాని యేలాగున వెళ్లుదువు? పరీక్ష దగ్గఱను వచ్చుచున్నది కాఁబోలునే?"

"అమ్మా! ఈసంవత్సరము పరీక్షకు వెళ్ళను. ముందుసంవత్సరము వెళ్ళుదును. కాళిమగనికి మన మిప్పుడు సరియైనవైద్యము చేయించక యశ్రద్ధ చేసితిమా, యావజ్జీవము విచారింపవలసి వచ్చును."

ఈప్రశ్న కామె యుత్తర మియ్యక యతఁడు పోవుటఁ కంగీకరించెను. రాణిగంజినుంచి యల్లునకు నెమ్మదిగా నున్నవార్త తెలియువఱకుఁ గొన్నివారములామె కలకత్తాలోనుండి పిమ్మట వారణాశికి వెళ్ళఁ దలచుఁకొనెను.

ఇందునిమిత్తమే హుగ్లీవంతెనమీఁదనుండి శరచ్చంద్రుఁ డొకనాఁటిరాత్రి హౌరాస్టేషనునకు వెళ్ళెనని యీవఱకు మీరు చదివియుండిరి. అతఁడు వెళ్ళబోవునప్పుడు హేమునిఁగాని బిందునుగాని చూచి తనప్రయాణవార్త చెప్పలేదు. అట్లు మర్యాద నతిక్రమించి వెళ్ళినందుకు హేతువు వా రూహించికొనఁ గలరని యతఁడెఱుఁగును. తనయెడఁ దప్పన్నపక్షమునఁ దనయందు దోషారోపణముచేసి నిందింప, వారు భగ్నమనోరథుఁ డైన మందభాగ్యునిదురవస్థకు జాలిఁదలఁచి, విచారింతురని యతనికి గట్టినమ్మకముగలదు.

ఎఱిఁగినవారి కెవ్వరికిఁ గనఁబడకుండ బండిలో నెక్కవలెనని శరచ్చంద్రుఁడు నిశ్చయించుకొనెను. అందు ముఖ్యముగా హేమునకుఁ గనఁబడకుండ వెళ్ళవలెనని యతనిసంకల్పము. ఏల యన హేమునిదర్శనము వెనుకటిమాటలు జ్ఞప్తికిఁ దెచ్చి బాధకలిగించును. కాని యాలాగున జరుగలేదు. స్టేషనుదాటి యరుఁగుమీఁదను వెళ్ళఁగానే యతనికి మొదట గనఁబడినమనుష్యుఁడే హేముఁడు.

కనఁబడఁగానే హేముఁడు శరచ్చంద్రుని కిష్టము లేకపోయినను దన చేతితో వానిచేయిపట్టుకొని యిట్లనియె "ఏమది? నాకుఁ గనబడకుండ మొగము చాటువేయుచున్నావేమి? ముఖ్యస్నేహితులను జూడకుండ వెళ్ళవచ్చునా? ఇంత తేలికగా స్నేహబంధము విడగొట్టుకొనుటకు మా కీలోకములో మ టెవ్వరైన స్నేహితులున్నారా?"

"హేముఁడా! కారణములు నీకుఁ దెలియవు గనుకనా? నన్నడుగబోకు. నా నీచపుగుణములును, నాపిఱికితనమును నాకు మఱల జ్ఞాపకము చేయకు."

"అబ్బాయి! శరచ్చంద్రుఁడా! లోకులు నిందించుచున్నారని నిన్ను నీవు నిందించికొనకు. నీవు మునుపు మంచి మనోబలము గలవాఁడవు. నీవు చేసిన దానిలో దోష మేమియు లేదని నీవు భావించినపక్షమున ఈదౌర్బల్యము పోయి యెప్పటి మనోబలము నీకుఁ గలుగును. పెద్దది, మాతృదేవత. ఆమె కిష్టము లేకుండ సుధను వివాహము చేసికొనుట ధర్మ మని నీవు తలంచుచున్నావా? నీతల్లి గుండె పగిలి, యేడ్చి, జెంగపెట్టుకొని త్వరగా చచ్చిపోవునట్టికార్యము చేయుటకు మేముమాత్ర మొప్పుకొందుమని నీ వనుకొనుచున్నావా? నీధర్మము నీవు నెఱ వేర్చితివి. లోకములో నెవనికి జడియనక్కఱ లేదు. పేరునకు నీసోదరుఁడనని అనిపించుకొనుటకు వీలులేకపోయినను, నిజమైన సోదరప్రేమ నీపైఁ జూపి నిన్నా దరించినమంచిస్నేహితుఁ డీలోకమున నీకొకఁడు కలఁడని నీ వెన్నఁడు మఱచి పోకుము."

అప్పుడు చిట్టచివరగంట వాయించిరి. ఆమాట లన్నిఁటికిఁ దగిన యుత్తరములు చెప్పుట కవకాశము గాని, శక్తి గాని శరచ్చంద్రునకు లేకపోయెను. "సోదరునికంటె నెక్కువవాఁడవు. నే నెక్కడఁట ఉండనీ, ఎన్నఁటికి, నీదయను, నీప్రేమను మఱచిపోను. మాఅమ్మకు నానమస్కారములు చెప్పుము. నామాట జ్ఞాపకముంచు కొమ్మని బిందుతో మఱిమఱి చెప్పు. నన్నెప్పుడు జ్ఞాపక ముంచు కొమ్మని—" అని యింక నేమో చెప్పఁబోవు చుండ జిల్లు మని కూసి బండి వెళ్ళిపోయెను. అందుచేతఁ గడపటిమాట చెప్పుటకు వీలు లేకపోయెను.

పదునైదవ ప్రకరణము

మగని విచారము.

హేమునిగృహము సందడిలేక సంతోషశూన్యమై చిన్నబోయి యుండెను. అందుచేత నతఁడు స్వగ్రామ మగు తాల్పుకారునకుఁ బోవఁ గోరుచుండెను. శరచ్చంద్రుఁడు వెళ్ళిపోవుటవలన హేమునిగృహమున కెంతో వెలితి గలిగెను. ఆవెలితి కందఱు విచారించుచుండిరి. తమ్మునికంటె నెక్కువగాఁ జూచుకొనుచున్న ప్రాణమిత్రుని వియోగమునకై హేముఁడు మనస్సున మిక్కిలి దుఃఖపడెను. శరచ్చంద్రుని యున్నతములైన యాశయములను సగర్వముగా విని, రసవంతములైన యతని సంభాషణములను సంతోషపూర్వకముగా నాలకించుచుండుటచేత బిందుయొక్క యాలోచనలు దీర్ఘములైన యాశీతకాలపు సాయంకాలములయందు వానిమీఁదికి బోవం జొచ్చెను. అంతకుఁ బూర్వము జరిగిన కార్యములంబట్టి హేమునిగృహము కొద్దికాలముక్రిందట మరణము సంభవించిన గృహమువలె నిశ్శబ్దమై శోభాహీనమై యుండెను. ప్రాణసమానుఁడైన యామిత్రునియెడఁ బాటు వారికి బంధుమరణమువలె దుంఖము కలిగించెను.

సుధ యెన్నఁడు నధరస్పందము చేయులేదు! ఆమె యుదయమునందు సాయంకాలమునందుఁ దన యప్పబిడ్డలకు సంరక్షణ సేయుచుండెను. తక్కిన వేళల నింటి పనిపాటల నెడతెఱపిలేక చేయుచుండెను. పూర్వవృత్తాంత సంబంధమైన తలఁపు హృదయమున నుండినను, వాగ్రూపమున దాని నామె యెన్నఁడు వెలిఁబుచ్చలేదు. ఆమె కన్నులయందు వెనుకటి ధాళధళ్యములేదు. మనోజ్ఞమైన బాలికావిలాసము పోయి "ప్రారబ్ధకర్మ మనుభవింపక తప్ప" దను వైరాగ్యముదయించెను. అయినప్పటికిని ముద్దులు మూటఁగట్టుచున్న యామెముఖము దీర్ఘవిషాదమును సూచించుచుండెను.

కలకత్తానివాసము తనకు దుఃఖహేతువయ్యెనని భావించి, తన కనుకూలమైన స్వగ్రామవాసముఁ జేయుటకై వారు ప్రయత్నములు చేయఁజొచ్చిరి. ఒకనాటి సాయంకాలము బిందు పనిచేత నలసి, చెక్కునఁ జేయిఁ జేర్చికొని యేకాంతమునఁ దన గదిలోఁ గూర్చుండ నొకజాబు వచ్చెను. పైపేరుచూడ నది యామె ప్రాఁత[illegible]గన[illegible]డెను.

అనుకూల మైనశీతకాలపుగాలి తగిలినతోడనే యమయొక్క దేహస్థితి బాగుపడెను. ఆమె తిరిగి యారోగ్యదశ నొందెనని బిందుకు వర్తమానము వచ్చెను. కాని జాబువిప్పి చూచినకొలది విచారసూచన లామె నేత్రము లలోఁ గఁనబడెను. ఇటువంటిదని యూహింపరాని భయావేశమున నామె హృదయము కొట్టుకొనెను. ఆజాబు చిన్నది. అం దిట్లుండెను.

"అక్కా! బిందూ! నిన్ను చూడవలెనని యున్నది. ఈసాయంకాలము రాఁగలవా?"

"కొన్నివారములనుండి చిత్రవిచిత్రములైన యూహలు నాతలలోఁ బ్రవేశించినవి. ఎన్నఁడు లేని నిశ్చయమొకటి నామనస్సు నాందోళపెట్టు చున్నది. అది యేమో నీ కిప్పుడు తెలియదు అది నీకు ముందుముందు తెలియఁగలదు. చిన్ననాఁటినుండి నాకు నీమీఁదఁ గల సోదరీప్రేమతో నేటిసాయంకాలము నిన్ను గట్టిగాఁ గౌఁగిలించికొనవలెనని యున్నది."

"ఇప్పటి నాబ్రదుకు తలఁచుకొన్నప్పుడు పిచ్చియెత్తు నేమోయని యొకప్పుడు నాకు భయము వేయుచుండును. ఆలాటప్పుడు తొల్లి కాలములో మనము చిన్నప్పుడాఁడుకొన్న ఆఁట పాటలు, ముచ్చటలు జ్ఞాపకము చేసికొందును. కొంత దుఃఖము దానితో నుపశమించును. మనలను సృష్టించినవాఁడు మనకు సుఖము గలుగఁజేయక పోఁడు. లేదా మనకు శాంతి యైన నియ్యక పోఁడు. బిందూ! అంతేనా?

"నీకు నామీఁద గల ప్రేమ నాదుఃఖమును బోఁగొట్టు చుండును. నామీఁద నీకున్నంత ప్రేమ మాఅమ్మకైనను లేదు. అందుచేతనే ఈ సాయంకాలము నిన్ను చూడవలెనని నాకంత గట్టికోరిక. తప్పక రావలెను సుమీ."

ఆమె యాజాబు నొకమాఱు చదువుకొని తనివి నొందక మరలమరలఁ జదువుకొనెను. చదువుకొన్నకొలఁది నామె కేదో యిట్టిదనరాని భయము తోఁచెను. అది యాకస్మికముగ వచ్చుటచేతను, దానిశైలి యసందర్భముగ నుండుటచేతను నామె భయము మఱింత యెక్కువ యయ్యెను. అంతటి యాత్మగౌరవము కలిగినది, యంతటి మితభాషిణియైనది, బాధ లెన్నిపడుచుండినను నంత నిశ్శబ్దముగా భరింపఁజాలినది యైన సుమ యీవిధముగా నెట్లు వ్రాయఁగలిగి

నది. ఆచిత్రవిచిత్రములైన యాయూహలేవి? ఆమెను గలిగిన యానిశ్చయమేమి? ఈశ్వరునివల్ల నపేక్షించుచున్న యాశాంతి యేది? అకలంకముగనున్న బిందుమనస్సున భయంకరములైన భావములు పొడకట్టెను. ఆమె మేనువడఁకెను.

ఆమె లేచి చెల్లెలిం బిలిచెను. "అమ్మాయీ! సుధా! పిల్లలను కొంచెము జూచి, అన్నము పెట్టి రాత్రి పండుకొనఁ బెట్టఁగలవా? ఉమ పాపము మనోవ్యాధితో బాధపడుచున్నది. దానిని నేను చూచుటకు వెళ్ళవలెను. నాకోసము కనిపెట్టుకొని యుండవద్దని, నేనొకవేళ ప్రొద్దుపోయి వచ్చినప్పటికి ఎందుకు రాలేదని బెంగపెట్టుకొనవద్దని మీ బావతో చెప్పు. ఉమ యెంతో కష్టములో నున్నదని నామనస్సులో విశేషము భయముగా నున్నది."

ఉమ జాబుతోఁగూడ నొకపల్లకిఁ బంపినందున బిందు దానినెక్కి వెళ్ళిపోయెను.

ఉమయొక్క గృహము ప్రవేశించుచుండఁగా నామె గుండెలు తటతటఁ గొట్టుకొనెను. కాని యుమను చూడఁగానే యాభయము కొంతవఱకు నుపశమించెను. బిందు పోవునప్పటి కామె నెమ్మదిగా బట్టలు సర్దుకొనుచుండెను. బిందును జూడఁగానే యామె చిఱునవ్వుతో సమీపించి, కౌఁగిలించికొనెను. మనోవ్యాధి గాని దుఃఖమును గాని పిచ్చి గాని సూచించుచిహ్నము లేవియు నామె మొగమునఁ గనఁబడలేదు. అంతకు మున్ను జబ్బుపడుటచేతఁ గాఁబోలు మొగమించుక తెల్లగానుండెను. ఎందుచేతనోగాని యామె కన్నులలో నదివఱకెన్నఁడు పొడకట్టని మెఱుపు కనఁబడెను. బిందు ప్రేమ యుట్టిపడునట్లు లామెను గాఢాలింగనము చేసికొని సహజమృదుమధురమైనవిధమున మాటలాడెను.

"అమ్మాయీ! ఉమా! నీజాబు చూడఁగానే నేను కొంచెము భయపడితిని. అందులో నీతప్పు లేదు. నాదే తప్పు. నేను తఱచుగా నిన్నుఁ జూచుటకు రావలసినది. ఆవిధముగా నేను వచ్చినపక్షమున నీమనసులో ఈవిధముగా చిత్రవిచిత్రములైన ఆలోచనలు పుట్టకపోవును. ఏమోగాని మనకుఁ గూడ కష్టములు సంభవించినవి. అందుచేత దుఃఖములపాలైనాము. నిన్నుఁ జూచుటకు నేను తఱచుగా రాకపోయినందువల్ల నీమనస్సునకు నొప్పి కలుగఁజేసితినేమో యని నేననుకొనుచున్నాను. అట్లైనపక్షమున నన్ను క్షమింప వలయును సుమీ? ఉమా! నీమీఁద నాకున్న ప్రేమ ఎన్నఁటికి మాఱిపోదమ్మాయి! ముమ్మాటికి మాఱి పోదు."

"నీకు నామీఁద నెంతో అపేక్ష యున్నదని నే నెఱుఁగుదును. మీరు పడుచున్న బాధలు గూడ నే నెఱుఁగుదును. ఈవేళ నిన్ను చూడవలెనని నాకెంతో అంత మనసైనది. అందు చేతనే నీకు జాబు వ్రాసితిని. నీవు తప్పక వత్తు వని నే నెఱుఁగుదును. అంతటిదయ నామీఁద నీకెప్పటికి ఉన్నది. పాపము సుధ యేలా గున్నది? శరచ్చంద్రుఁడు కలకత్తాను మిమ్మందఱిని కూడ వదలివేసి వెళ్ళినాడు కాబో లేమి?"

"అది కాదే, ఉమా! మనసుధబ్రతుకు అచ్చటలు ముచ్చటలు లేని దైపోయిన దని దానిమాట తలచుకొన్నపు డెల్ల నా కెంతో దుఃఖము వచ్చు చుండును. శరచ్చంద్రుడు ఇల్లు వాకలి వదలిపెట్టికొని దేశములపాలై పోయినాడు"

"ఈవ్యవహారము అతని తల్లికి తెలియదా? అర్థము లేనిపిచ్చిఆచార మేదో యున్న దని పట్టుపట్టి కొడుకును యావజ్జీవము పెండ్లిపేరంటములు లే కుండ చేసి నిర్భాగ్యుని జేయ దలచుకొన్నదా యేమి టావిడ!"

"అతనితల్లి తప్పేమున్నదమ్మా! యిందులో, అంతకన్న భూదేవత లోకములో లేదు. కాని మనమతము, ధర్మశాస్త్రము, అటువంటివివాహము లొప్పుకొన వని ఆమె నమ్మకము. మత విరుద్ధమైనపని కొడుకు చేసినపక్షమున ఆబిడగుండె పగిలి చచ్చిపోవును. అందులో మా దేతప్పు. మేము తొందరపడినాము. పడినందుకు ఫలమనుభవించినాము."

"మేలు చేయవలెననే చేసినావు. మన మెంతజాగ్రత్తపడినను, ఎంతదూరదృష్టితో బనిచేసినను, మూడదలచుకొన్నకీడులు రాకుండ ఆపలేము. భగవంతుని సంకల్ప మక్కయ్యా! చేతగానిమనుష్యులము మన మేమిచేయగలము? ఒకప్పుడు విశేషబాధ, మన మనుభవించ లేనంతవిశేషబాధ మనకుగలుగు చుండును. మనము పడవలె. ఆలాగే పడవలె."

"అమ్మాయీ! ఉమా! నీకడుపులో బాధేమిటో కొంచెము నాకు చెప్పవమ్మా? నీవు పడగలిగినబాధకంటె ఎక్కువబాధే పడుచున్నావు. నీవలె ఎంతో ఓరిమితో సాధారణముగా ఏయాడది యిటువంటి కష్టము పడలేదు.

"అక్కయ్యా! ఈకష్ట మొక కష్టముకాదు. నాకష్టములన్నిటిని నేను జయించ గలను?"

"ఈమధ్య జబ్బు పడినావు కదా! పూర్తిగా నిమ్మళించినదా జబ్బు? కొంచెము బలము చేరినదా?"

“బలము చేరకేమి? దయ్యము లాగున్నాను. ఒకప్పుడు దయ్యమువలె క్రూరముగా నుండవలెనని నామనస్సులో సంకల్పము కలుగుచుండును.

ఈమాటలనుచుండ నామెకుఁ జిఱునవ్వు పొడమెను. కన్నులు తళతళ మెఱసెను.”

“ఉమా! ఆలాగనకే. నీమాట వినఁగానే నాకు భయము వేయుచున్నది. పిచ్చిపిచ్చి ఊహలు ఊహించుకొనకు. ఈపిచ్చి యూహలకోసముకాదు బ్రదికి యుండుట. దుఃఖభారములు ఓరిమితో భరించుటకోసము.”

“కాని అక్కయ్యా! ఒకప్పుడు మిక్కిలి బలవంతుఁడు కూడ పడలేనంత కష్టము వచ్చినప్పుడు ఆకష్టము ఏలాగో ఒకలాగు పోఁగొట్టుకొన్నట్లు పుస్తకములలోఁ జదివినాను. యజమానుఁడు కొరడా పుచ్చుకొని వీపు బ్రద్దలగుచున్నట్లు కొట్టుచున్నప్పటికి దెబ్బలు తినునట్టి నీచపు బానిసవాఁడు నిరాశచే నవ్వుచుండు నఁట.”

“నీవేమో పిచ్చి పిచ్చి మాటలాడుచున్నావే ఉమా! నీవెప్పటి లాగున మాట్లాడుటలేదు. భూలోకములో నేయాఁడవాండ్రకు లేనంత ప్రేమ నీకున్నది. ఏయాఁడవాండ్రు పడనంత కష్టము నీవు పడుచున్నావు. నీవల్లదోషము న్నదని నేనేలాఁగున నవఁగలను? ఒకమూల ప్రేమ మనసులో నిలుపుకొని, ఒకమూల బాధపడుచు, మనకు భగవంతుఁడు విధించిన ధర్మము మనము చేయుచుండవలసినదని నీమనస్సే నీకు చెప్పగఁలదు. మనభారము మనతల పాఁగవేయకూడదు. మఱియొక ఆలోచన చేయఁగూడదు. ఈ జీవనమందు మనము పడు బాధలు కష్టములు గుర్తులమైన స్త్రీస్వభావము సహింపలేనంత వేదన కలుగఁ జేయుచున్నప్పటికి దేహములో శక్తి యున్నంతవఱకు మనము తప్పటడుగులు పెట్టుచునైనను, విశ్వప్రయత్నముచేసి మన ధర్మము మనము నడపవలయును. మన పాలఁబడిన ధర్మము మనశక్తిపంచన లేకుండ యథావిధిగా నెఱవేర్చి, అటమీఁద యేచెట్టుక్రిందపడి గుర్క్కడు ప్రాణము వదలినను సరే. ఇటువంటి ధర్మములు తల్లిపాలతో కూడ మన కబ్బినవి. ఈధర్మములు మఱచిపోకుండ నీవెప్పటికి మనసులో పెట్టుకొవలసినవి.”

“అక్కా! బిందూ! నీవు చెప్పినమాట లెప్పటికి సరియైనవే. నీవెప్పుడు మంచిదానవే. మనము చిన్నపిల్లలమైనప్పుడు ఈబుద్ధులే నీవు చెప్పుచువచ్చితివి. పెద్దదానవైన తరువాతఁగూడ అవే నీవు జ్ఞాపకముంచుకొని యాదరించుచున్నావు. ఏమోకాని ఈరాత్రి యవి నాతలకెక్కుటలేదు. అక్కయ్యా! ఆసంగతులు మాని

వేరేసంగతులు నాతో మాటలాడు. నాకెంతమాత్రము తోఁచుటలేదు. నామనస్సు కుదురుగాలేదు."

"ఉమా! అది నేనెఱుఁగుదును. ఆజాబువల్ల నేను తెలిసికొంటిని. విచారకరమైన యీస్థలమువిడిచిపెట్టి మఱొకచోటికి వెళ్ళుటకెందుకు ప్రయత్నము చేయవు?"

"అక్కయ్యా! నేనెక్కడికి వెళ్ళుదును?"

"ఎక్కడికా, మీయమ్మదగ్గఱకు వెళ్ళు. ఆబిడను ఇక్కడకురమ్మని నేను వర్తమానము పంపఁదలచుకొన్నాను. కాని నన్ను నీవు వర్తమానము పంపనీయవు కద. నీశరీరములో నెమ్మదిగానున్నది. గనుక ఒకసారి తొల్పుకారు గ్రామమునకు వెళ్ళు. మనోహరమైన యీశీతకాలమునందు గ్రామము నవనవలాడుచు మనమున కుల్లాసముఁ గలిగించుచుండును."

"వెళ్ళుదుననుకో; అమ్మగారియింట విశేషకాలము నేనుండుటకు వీలుపడునా? నీవెఱుఁగవఁటే అక్కయ్యా! అత్తింటికోడలు ఎంతకాలము పుట్టింట నుండగలదు? పెనిమిటిని వదలిపెట్టి విశేషకాలము పుట్టింట ఉన్నపక్షమున ఊరివారందఱు అమ్మను నన్ను కాకులు పొడిచినట్లు పొడవరా?"

"ఆలాగైన పక్షమున మీయత్తవారి తండ్రితాతలు పూర్వముకాపురముండిన ధనపురము వెళ్ళరాదా? అక్కడ కావలసినంతమంది చుట్టాలు బంధువులు ఉన్నారు. అక్కడ ఈలాగున నొక్కర్తెవు నుండనక్కరలేదు. కలకత్తాలో ఉన్నంతవిచారకరముగా నుండదు నీబ్రదుకు."

"అక్కయ్యా! అక్కడ అంతకంటె నెక్కువ విచారముండును. ఏమంటే ధనపురములో మాయిండ్లు ఎంతో పెద్దవి. చావళ్ళు విశాలమైనవి. గదిలో మాటలాడితే ప్రతిధ్వనులు బైలుదేరును. అవి నేను వింటినా, ఆధ్వనులు దయ్యముల మాటలలాగున భయపెట్టుచుండును. అక్కయ్యా ఆపాడుకొంప నాకువద్దే తల్లీ! నేనొక్కర్తెను దిక్కులేనిదాననై ఆయింటికి మఱల వెళ్ళుట నాకిష్టము లేదు."

"అయ్యో! ఏమే అమ్మా! ఈలాగున బాధపడుచున్నదానికి నే సహాయము చేయలేక పోవుచున్నాను. పోనీ, కొన్నాళ్ళు మాయింటికి వచ్చిఉండ గలవా? మేము స్వగ్రామము వెళ్ళిపోవువరకు మాతో నుండవచ్చును. నీకాప్తులైన దగ్గఱ చుట్టాలతోను బంధువులతోను కొన్నాళ్ళు హాయిగా నీవు గడుపదలచుకొంటే మీవారు మాత్రము ఒప్పుకొనరా?"

"అక్కయ్యా! మీకష్టాలకుసాయము నే నెందుకు? మీ రెక్కడ నున్నప్పటికి మీమనస్సునకు సుఖమున్నది. మీయింట విచారము లుండవు. నేను వచ్చి

తినా, మీ సుఖముకూడ చెడిపోవును. నావిచారములు నాకష్టములు మీరు ఈఁద వలసివచ్చును. నామనస్సుకు విసుఁగుపుట్టినదాక, నాతల దిమ్మెక్కినదాక నేనిటు వంటి యాలోచనలే చేసినాను. కాని నాకష్టము గట్టెక్కించఁగల ఉపాయము కనపడలేదు. అయినప్పటికి నావిచారములు జయించఁ గలనని ధైర్యమున్నది. చూచికొని తెలిసికోఁగలిగితే దిక్కుమాలిన ఆఁడదానికి శరణము లేక పోలేదు."

ఈకడపటిమాటనునప్పు డామె మొగమున లేనవ్వు తోఁచెను. కన్నులలో స్వభావవిరుద్ధమైన మెఱపు కనఁబడెను.

"అమ్మాయీ! ఉమా! నీమనసులో ఉన్నదేమిటో ఇప్పటికి నాతో నీవు చెప్పలేదు. నేను నీకు మునుపటిబిందునే కానా? చిన్నప్పటి స్నేహితురాలను గదా, ఇంతమాత్రము నమ్మఁ గూడదా?"

"నామనసులో ఇప్పటి కేనిశ్చయము చేసికో లేదే అక్కయ్యా! ఆలోచ నలు ఒకదానినొకటి తఱుముకొని వచ్చినట్లు మనసులో నిండి పోవుచున్నవి. నాకు తల విసురు పుట్టినది. ఈరాత్రి నీపరిపూర్ణదయ, నీప్రేమ నామీఁదఁజూపి ఓదార్చు. నీదయ కావలసినసమయ మిదే. నామనసులో నేమున్నదో అదియావత్తు కొద్దికాలములోనే నీకుఁ దెలియఁ గలదు."

"సరే. ఆలాగేకానియ్యవే ఉమా! నేను మఱల నిన్ను చూచుటకు త్వరగానే వచ్చెదను. ఆవచ్చినప్పుడు నీమనసులో నున్నదేమిటో వినిగాని వెళ్ళను. ఇప్పుడు రెండుజాములరాత్రి అయినది. నేఁనిక వెళ్ళవలెను. భగవంతుఁడే నీకు శరణమై నిన్ను రక్షించవలె నని నాకోరిక."

"దేవుఁడే మనకెప్పటికి శరణము." అనుమాటలే ఉమనోటనుండి కడపట వచ్చెను.

బోయిలు పల్లకి మేడక్రిందఁ బెట్టికొని కనిపెట్టుకొని యుండిరి. బిందును సాగనంపుటకై యుమ మేడమెట్లు దిగివచ్చెను. అక్కడవా రొండొరులను మఱల బిగ్గఁగౌగిలించుకొనిరి. ఉమ బిందుకడుపులోఁ దనతలఁ బెట్టికొని కొంచెముసేపు విచారించెను. అంతకాలమునుండి యామెహృదయములో గట్టితాళమువైచి బంధించిన దుఃఖమంతయు నొక్కమారు పొంగిపొరలి పైకుబికెను. కన్నీటివఱదలు విప్పతద్వారములై ప్రవహించెను. ఆమె చాలసేపు మాటలాడఁజాలక వివశయై వెక్కి వెక్కి యేడ్చెను. గుండె పగిలిపోవునా యన్నట్లాయువతీరత్నము నిట్టూర్పు విడిచెను. అట్లు దుఃఖపడుచు నామె తనయందత్యంత ప్రేమయు నభిమానముఁగలిగి

యాప్రాణమిత్రమును వదలలేక మాటిమాటికి బిగియారఁ గౌఁగిలించికొని, యేమి తోఁచెనోకాని యాకస్మికముగా బిందును విడిచి చివాలున మేడ మెట్లెక్కి తన గదులలోనికిఁ బోయెను.

"దుఃఖపడు. తల్లీ! దుఃఖపడు. ఈలాగున దుఃఖపడవలసిన దని భగవంతుడు నీనొసట వ్రాసివేసినాఁడు." అని యేడ్చుచు బిందు పలికి పల్లకిలోఁ గూర్చుండెను.

తరువాత గంటసేపటి కామెను నెమ్మదిగాఁ దనబట్టలు, నగలు సర్దుకొనుచుండెను. సుందరమైన కంఠమునుండి యామె కంఠె దీసివేసెను. మనోజ్ఞహస్తముల నుండి మురుగులు, పాదములనుండి యందెలుకూడ తీసివేసెను. అంచుచీర విడచి వితంతువులు కట్టుకొను సైనుపంచె తాల్చెను. గదిలోనిదీప మార్పివేసెను. అవ్వాల నెంతమాత్రము చప్పుడు కాకుండ బొటనవ్రేళ్ళమీద నడిచి యావలకుఁ బోయెను.

విశాలమైన యాగృహము నిశ్శబ్దమై యంధకారనిబిడమై యుండెను. సేవకులందఱదివఱకే పండుకొని నిద్రపోవుచుండిరి. వాకిట నున్న దీపములుసైత మార్పవేయఁబడెను. ఉమ మెల్లమెల్లఁగా ననేకద్వారములు దాటి, నడిమివాకిలి దాటి చప్పుడు కాకుండ వీధితలుపుగడియ తీసెను. తలుపు తీయఁగానే చలిగాలి రివ్వున వచ్చి తాకెను. చీకటిలో నుండి వచ్చియుండుటచేత వీధిలోని దీపములన్నియు నామె కన్నులలో మెఱపులట్లు మెఱసెను. ఒక్కనిమిషమువఱ కామె చేష్టలుదక్కి యుండెను. మఱి యొక్కనిముసము గడపపై నిలిచి వెనుకకు తిరిగిచూచెను. ఆనిముసము గడచిపోయెను. ఇరువదియేండ్ల ప్రాయంపు జవ్వని, భాగ్యవంతుఁడగునొక గొప్పజమీందారుని యిల్లాలు మహాంధకారబంధుర మగు శీతకాలపు రాత్రివేళ నేకతంబ కాలినడకను వీధులవెంబడి సంచరించుచు, నంతఃపురము విడిచి బాహ్యప్రపంచమునం బడియెను.

అరగంట నడచునప్పటి కామె యలసిపోయెను. ఆమె యలసిపోయి రాజవీధి ప్రక్కనున్న యొక చెట్టుచాటున నిలువంబడెను. నిలువంబడి చలి కోర్వలేక గజగజ వడఁకెను. ఆసమయమున మఱల నామె కధైర్యము తోఁచి గుండె కొట్టుకొనెను. మఱల నింటికి బోవఁదలచుకొన్న పక్షమున నామెకు గావలసినంత వ్యవధియుండెను. ఆమె యింటికి దారి యెఱుఁగును. వీధితలుపు నప్పటికినిఁ దెఱచియుండెను. ఆమె యిల్లుజేరి, యెప్పటియట్ల కాపురము సేయవచ్చును. తాత్కాలికమైన యీయున్మాదావస్థ రెండవకంటివానికిఁ దెలియదు. బిందు చేసినధర్మోపదేశములు, మందలింపులు చెవులలో గింగురు మని యామె కప్పటికిని వినఁబడుచున్నట్లే యుండెను. ఏదో యొకానొకశబ్దము మందస్వరముతో స్త్రీధర్మముల

నా మెహృదయమున నుపదేశము చేసిన ట్లామెకు దోఁచెను. ఆచలిగాడ్పులు మీఁద వీచి వణఁకించినప్పు డాయెలనాగ యాగి సందేహింపఁ జొచ్చెను. అప్పుడుసైత మామెయే గృహదేవత? ప్రపంచము శూన్యము.

అప్పుడు నల్లగుఱ్ఱములు లాగుచుండిన గుఱ్ఱపుబండి యాదారిని వెళ్ళెను. దాని దీపములు తళతళ మెఱసెను. ఆబండిలో స్త్రీలు నవ్వినచప్పుడు వినబడెను. తెల్లని జోడుగుఱ్ఱములు లాగుచుండిన మఱియొకబండి వెంటనే యాదారిని నడచెను. అదియామె కత్యంతసమీపమునుండి పోయెను. ఆబండిలోని దీపములకాంతి తళతళ మని హఠాత్తుగా నామె మొగముపైఁ బడెను. ఆమెచటుక్కునఁగదలి యాచోటు విడిచి చెట్టువెనుక దాగెను.

బండిదీపములనిమిషమాత్ర తేజములో నామె మొగము కనబడగానే బండిలో గూర్చుండిన మనుష్యులలో నొకఁడుకూడ లేవఁబోయెను. ఆతనిమిత్రుఁ డదికని పెట్టి, చెట్టుమఱుఁగున దాగిన మానవతివంకఁ జూచి "ఆమె మిక్కిలి చక్కనిది అంత అందమైన కన్నులు నేనెప్పుడు జూడ లేదు" అని పలికెను.

"ఆమె చక్కఁదనముమాట నే నాలోచించుటలేదు. వెలవెల బాఱుచున్న యామెమొగము చూడఁగానే నే నెఱిఁగిన స్త్రీ యొకర్తె నాకు జ్ఞాపకము వచ్చినది. ఆమె యీమెవలెనే యుండును. చాలకాలమునుండి నే నామెను జూచి యుండలేదు. మొగమును బోలిన మొగము లుండు ననుమాట నిజము. పోలిక చిత్రముగా నున్నది" అని రెండవయతఁడు బదులు చెప్పెను.

బండ్లు గబగబ వెళ్ళిపోయెను. చెట్టువెనుకనుండి యామె యావలకుఁ బోయి దాటిపోవుచున్న బండ్లవంక, దీపములవంక విరుద్ధముగాఁ జూచెను. "ప్రాణేశ్వరా! నీకు వేయినమస్కారములు. క్రుంగిపోవుచున్న నాహృదయమును మీరు పురికొల్పితిరి. ఏమి చేయవలెనో నాకిప్పుడు తెలిసినది." అని తనలో ననుకొని యామె యాచోటు విడిచి పోయెను.

మఱునాఁ డుదయమున ధనంజయునిగృహమున గొప్పకలవరము సంభవించినది. పెద్దపెట్టు నేడ్పు వినఁబడెను. ఎప్పటియట్ల పనికత్తెలకామె పరుపుమీఁదఁ గనఁబడలేదు. పరిచారికలు నూతిదగ్గఱ నడిమివాకిలిలోను జూచిరి గాని యామె యెక్కడను గనఁబడ లేదు. వాకిలి తుడుచునట్టిదాసి యామె దాల్చు ప్రాఁతసేలువ నడిమివాకిలిలో దొరికినదని పట్టుకొనివచ్చెను. వీధితలుపు తీసి యున్నదని ద్వారపాలకులు చెప్పిరి. చాలసేపిట్టట్టు వెదకిరి. కాని యామె కనఁబడలేదు. గృహయజమానురా లదృశ్య యయ్యెను.

వెదుకవలసిన దని పట్టణమం దన్నిచోట్లకు మనుష్యులు పంపఁబడిరి. అన్వేషణార్థమై ప్రతిబంధువునియింటికి, ప్రతిమిత్రునియింటికిని పలువురు మనుష్యులు వెళ్ళిరి. అట్లు వెళ్ళిన మనుష్యు లందఱు యజమానురాలివృత్తాంతము తెలియ లేదని యొక్కరొక్కరు దిగులుపడుచు వచ్చిరి. బిందుగృహమునకు వెదుకఁబోయిన మనుష్యులు నిశీథము వఱకుఁ గడచినరాత్రి యుమ యింటివద్ద నుండెనని మఱలి వచ్చి చెప్పిరి.

ధనపురమునకు, వర్ధమానమునకు, తాల్పుకాపునకుఁ గూడ మనుష్యులను బంపిరి. యజమానురాలివృత్తాంత మెంతమాత్రము తెలియ లే దని వారా సాయంకాలమే కాళ్ళీడ్చుకొనుచు వచ్చి చెప్పిరి.

ఉమ కనఁబడలే దని కలకత్తా పోలీసువారికి సమాచారము తెలియఁజేయఁబడెను. ధనము పోలీసువారిని విచారణకుఁ బురికొల్పును గావున సొమ్ము కర్చు పెట్టిరి. కాని పోలీసువారి విచారణలుకూడ వ్యర్థమయ్యెను. తెలిసికొనుట కాధార మేమియుఁ దెలియ లేదు.

భయంకరములైన యనుమానము లందరమనస్సులలోఁదోఁచెను. చెఱువులు నూతులు వెదకిరి. అదివ్యర్థమయ్యెను. దిక్కులేనివారిశవములను బెట్టుచోటికి సేవకులుపోయి వెదకిరి. ఆమెశవ మక్కడఁగనఁబడ లేదు.

ధనంజయుని గృహము నిరాశచే దుఃఖభాజన మయ్యెను. ఏడ్పుకొంతసేపటి కణఁగిపోయెను. పీనుఁగు వెళ్ళిన యిల్లువలె గృహము పాడువాఱి యుండెను. ప్రొద్దునిలువని శీతకాలపుదినమిట్టె వెళ్ళిపోయెను. కళాహీనమైన యాగృహము మీఁద వెఱపుఁ గొలుపునట్టి సాయంకాలచ్ఛాయలు వ్యాపించెను. చేసిన భోగట్ట యంతయు వ్యర్థమయ్యెను. వెదుక వెళ్ళినవా రందఱాశ వదలుకొని వెనుకకు వచ్చిరి. ఆమెను గుఱించి యేమియుం దెలియ లేదు.

దీపములు పెట్టినతరువాత మురికినబట్టలు తీసికొని యింటిచాకలిది వచ్చెను. యజమానురాలిని గూర్చి చాకలి దేమో చెప్పఁదలఁచుకొన్నందున విలపించు చున్నవారు దానిచుట్టుఁ జేరిరి; కాని దానికథ స్వల్పము. విచారకరము.

కలకత్తానగరమునందలిస్త్రీలు తెల్లవాఱుజామున హుగ్లీనదిలో స్నానము చేయుటకై పోవువేళకు ముందే యజమానురాలు నదియొడ్డున నొంటిగఁ దనకుఁ గనఁబడిన ట్లది చెప్పెను. పట్టణము మేలుకొనకమునుపే పెందలకడ స్నానముచేసి వెళ్ళుటకై యామె తెల్లవాఱుజామున నదియొడ్డునకు వచ్చి యుండవచ్చు నని చాకలిది తలంచి యొకటిరెండు మాటలుమాత్రమే యామెతో మాటలాడి తన దారినిఁబోయెను. అది మఱల నామెను జూడ లేదు.

చాకలి దీకథఁ జెప్పు చుండగాఁ వినువారు నోట మాట లేక చూడఁ జొచ్చిరి తమయజమానురాలు కలకత్తాలో నేవిధముగా జీవించెనో వారంద రెఱుఁగుదురు. ఆమెహృదయములో నెట్టితలంపు లుండెనో వారికిఁ దెలియును. చిరకాలక్లేశ మనుభవించు చున్న మందభాగ్యురా లగుతనయజమానురాలు తెల్లవారుజామున స్నానము చేయుటకుఁ గాక నిరంతరాయ మగువేదననుండి విముక్తిఁ బడయుటకై పరమపావనమగు భాగీరథీమాతృగర్భమున శాశ్వతనివాసము చేసి కొనుటకై నదీతీరమునకు వెళ్ళి యుండు నని వారిమనంబునఁ జనించెను. జనించినతోడనే గొల్లు మని పెద్దపెట్టున నేడ్చిరి.

కడచినరాత్రి ధనంజయుఁడు విలాసధామము లగుతనమిత్రులతోడ గుఱ్ఱపు బండ్లమీఁద నూరుబైటకు షికారుపోయి మిక్కిలిప్రొద్దుపోయిన తరువాత మఱలి వచ్చెను. అతఁడు బండి దిగునప్పటికి మద్యపు మైకమువల్లఁ గలిగినయెఱుపు మొగమునుండి జారలేదు. నడచునప్పు డడుగులు నిలువక తడబడెను. సేవకులు చేయూత యిచ్చి మేడలో నతని గదిలోనికిఁ దీసికొనివెళ్ళి యతనిభార్య కనఁబడుట లేదను వార్త మెల్లగాఁ జెప్పిరి. అదిపిడుగుపాటువలె నాకస్మికమై భయంకరమై యతనిపైఁబడి నిర్విణ్ణునిఁ జేసెను. మద్యపుమత్తుచేత నదివరకే తలతిరిగి తూలు చున్న యావయసుకాఁ డది విని నిశ్చేష్టుఁడయ్యెను.

అనంతరము భార్యగదిలోనికి వెళ్ళి మినుకుమినుకు మను దీపపువెలుఁగున నేమియుం దోఁచక తెల్లవారువఱకు నిట్టట్టు పచారు చేసెను. అతని హృదయము పూర్వము దయావంత మైన దగుటచే నతఁ డప్పు డెంత దుర్వర్తనుఁడైనను దురంత మైన యాదుర్వర్తనము వాని హృదయమునుండి జాలిని వెడలఁగొట్ట లేకపోయెను. తాపపూరితము లైన యాలోచనలచేత మద్యప్రకోప మెగిరిపోయెను. మగనిలాలనకుఁ బాత్రమైనవోఢ యెట్లువచ్చు నట్లే లలితవిలాసయై, లావణ్యరాశియై కొంజిగురాకువలె మెత్తనై కృపారసనిలయమై యామె యతనిం జేరెను. నూతనసమాగమ మైన యాదినములలో స్త్రీసహజ మైన యామె గాఢానురాగము, మధురవిలాసము, మనోజ్ఞమనోరథములు, రహస్యభావములు, శృంగారచేష్టలు, చిఱునవ్వులు నతని యధీనమే చేసెను. అతనికంటె నామెకుఁ బ్రేమస్థానము లేదు. అంతకంటె నన్యుఁ జూచి యెఱుఁగదు. తలచి యెఱుఁగదు. ప్రతిరాత్రి యాయెలనాగ యతని ప్రక్కను గూర్చుండి, తనహృదయ మాతని వక్షమునం జేర్చి మనోజ్ఞము లైన తనయాలోచనలను, తనకోర్కెలను, తనకష్టసుఖంబులను నతని చెవిలో రహస్యంబునఁ జెప్పి యతనిమన సుప్పొంగఁజేసెను. అతని కన్నులముందఱనే

యాచిగురుబోడి బాల్యమును విడిచి మిసమిసలాడు నిండుజవ్వని యయ్యెను. అలరుఁదీగ మ్రా నల్లుకొను తెఱఁగున నామె యతనివలపునకే తగులుకొని యుండెను. అంతే కాదు. ప్రాణాంతముగ నఱకు నప్పరమసాధ్వి మూగదియుం బోలె కుయ్యో, మొఱ్ఱో యనక, యెట్టిపరాభవములు ప్రాప్తించినను, నేమియు ననక కన్నులప్పగించి శాంతముగ నాని ననుభవించెను. ప్రియురాలు లేనియాశూన్యగేహముఁ జూచినకొలఁది నతనికన్నులనుండి చుక్కవెనుక చుక్క పొడమి, యెఱ్ఱని చెక్కులనుండి దిగజారఁ జొచ్చెను. తాను మొగముఁ జూడకపోయి నప్పటికి, నాత్మహత్య గావించి కొన వలసినంత దురవస్థకుఁ దోలినప్పటికిఁ దన్నే దైవముగా నమ్ముకొని ప్రేమించిన యాకాంత పై నతనితలఁపులు పాఱెను.

బండిదీపముల తళతళకాంతులు ప్రసరించునప్పుడు వీధిలో దనకుఁ గనఁబడిన యావెల్లమొగము మనస్సున మఱల నిలిచెను. ఆనడుమ జబ్బుపడినందున రోగచిహ్నము లామె ముఖమును బాయ లేదు. కాని దీర్ఘ విచారచ్ఛాయలు బలవత్తరములై, రోగచిహ్నములం గప్పిపుచ్చెను. ఆమెకన్నులు బండిలోఁ గూర్చుండి పోవుచున్నప్పు డొక్కనిముష మతనిపై నిలిచెను. ఆనిమిషమం దామెకు మనసులో నించుక యాశ వొడమి యుండవచ్చును. అది ప్రేమాస్పద మైననిమిషము. ఆకన్నుల కతఁడు తగిన ప్రత్యుత్తరమీయ లేదు. అందుచేత నవి శాశ్వతముగా ముకుళించుకొని పోయెను.

దీర్ఘ విషాదమున గుండె పగిలినయాయింతి సర్ది చక్కగా నమర్చిన ముద్ది నుసు చీరలను ధనంజయుఁడు మఱల సర్దెను. కాపురము చేసిన యెనిమిదేండ్లు ధరించి చిట్టచివరకుఁ గన ప్రాణనాథునికే విడిచిపోయిన నగల నతఁడు పైకిఁ దీసెను. ఆమెచక్కని నెన్నొసటిపై మున్ను వెలయుచుండిన వజ్రాల పాపటబిందువును, నామెవక్షస్స్థలము నలంకరించుచువచ్చిన యాణిముత్యాలహారమును, పునస్సంధాన మునాఁటిరాత్రి తాను స్వయముగా నిచ్చిన కంకణాలును, మఱికొన్ని యితరాభరణములును, నొక్కొక్కటిగాఁ దీసి వరుసగాఁ దనయెదుటఁ బెట్టుకొనెను. అందులో నొక్కొకదానిని జూచినప్పు డతని కొక్కొకపూర్వ వృత్తాంతము జ్ఞప్తికివచ్చెను. ఒక్కొక మహానురాగసమయము తలఁపునకుం దట్టెను. ఎన్నో మాసములనుండియుఁ గొన్ని సంవత్సరముల నుండియు నతనిని విడిచిపోయిన తలంపులు తండోపతండములుగా నప్పుడు వచ్చి యతని మనసు నాక్రమించెను. భార్య క్రొత్తగాఁ గాఁపురమునకు వచ్చినప్పుడు తనహృదయమును మధురముగాను బవిత్రముగాను జేసినయనేక విషయములు, పలుతావులు వానిసూన్యమనస్సున కప్పుడు జ్ఞప్తికి వచ్చెను.

తండ్రిపేరు పాడుచేసి, తల్లి మందలింపులు సరకుసేయక యతఁడు యథేచ్ఛముగా సంచరించెను. పితృపితామహార్జితమైన ధనము దుర్వ్యయము చేసెను. వీధులలోని మురికికాలువలలో నుండు బోదురుకప్పలకన్న నీచులగు స్త్రీపురుషులతో నతఁడు సహవాసము చేసెను. స్త్రీజనసహజమైన హృదయపూర్వకానురాగముతోఁ దనచెట్టఁబట్టివచ్చిన ప్రాణమిత్రముయొక్క ప్రేమను నిష్కారణముగా చెండనాడుకొనెను. అతఁడు భార్యాభర్తల కుండవలసిన ప్రేమబంధముల నెల్లఁ ద్రెంపివేసెను. మానవహృదయమునందుండు దయాధర్మములను దగ్ధము చేసెను. ఉన్నతభావములనెల్ల నీచపఱిచెను. తన్ను నమ్మి, వలచి యిలుఁజొచ్చిన పరమసాధ్వియైన భార్యను బహుమాసములు, బహుదినములు బాధపెట్టి, మనోవ్యథపాలుజేసి తుదకు బలవన్మరణము చేసికోవలసిన దుస్థితిపాలుచేసెను. తాను తెచ్చిపెట్టిన వినాశనమును దలఁచితలచి మాడ నాత్రాగుబ్రోతునకు, నాధూర్తవిటునకుఁ బశ్చాత్తాపము కలుగఁజొచ్చెను. ప్రియురాలిసంబంధమైన వస్తువులలో నప్పటికి మిగిలియున్న చీరలమీఁదను, నగలమీఁదను శూన్యమందిరములోని గోడలమీఁదను వానిదృష్టి ప్రసరింపఁగానే పట్టలేనంతదుఃఖ మతని మనంబునఁ బొడమి మనస్సు బ్రద్దలుచేసికొని పైకివచ్చి మందిరమందుఁ బ్రతిధ్వనించెను.

ప్రభాతకాలసంబంధములైన తెల్లనివెలుఁగులు గదిలోఁ బ్రవేశించి దుఃఖమలినమైన యాతని మొగముమీఁదను గుంటలు పడినయతనికన్నులమీఁదను బడెను. ఆవెలుగునఁ బ్రియురాలి చీరమడతలలోఁ దెల్లనివస్తువొకటి యతనికిఁ గంటఁబడెను. అది యొక జాబు. ధనంజయుఁడు చెదరినతలవెండ్రుకలను వెనుకకు సర్దుకొని, వడఁకు చున్నహస్తములతోఁ బ్రియురాలు వ్రాసినయాజాబు నందుకొనెను. ఆలేఖమీఁద వ్రాయునప్పుడు భార్య కంటనుండి పడినబాష్పబిందువుల డాగు లప్పటికినిఁ గానఁబడుచుండెను. ఆజాబునం దిట్లుండెను.

"భర్తగారూ!—నేను మీదృష్టికిఁ జిరకాలమునుండి భార్యను గాకపోయినను. నేను వెళ్ళిపోవుచున్నదానను గావున మధురమైన యాపేరుతో మిమ్ము కడసారి పిలువనిండు.

నేను మీయింటికి వచ్చి, మీయన్నముదిని, యెనిమిదిసంవత్సరములపాటు మీయిల్లాలనిపించుకొని, మీప్రేమ సంపాదించుకొని యుంటిని. పల్లెత్తి యొక్క పరుషవాక్యమైన పలుకక, కోపాలోచనము కొంచెమైన గుండెలలో నిలుపక నే నిప్పుడు మిమ్ము వదలిపెట్టి వెళ్ళఁదలచుకొన్నాను. నాప్రాణము 'హరీ'

యనుపఱకు నేను మునుపటి ప్రేమనే మీమీఁద నిలిపి మిమ్మే తలఁచుకొనుచుందును. మీరును మునుపు ప్రేమించిన చిన్నదానిని జ్ఞాపక ముంచుకొనుటకై ప్రయత్నింపుఁడు.

క్రొత్తగా నేను కాఁపురమునకు వచ్చిన దినములలోఁ నేను మీకంటె కసహ్యముగానుండక ప్రేమాస్పదురాలనై యుంటిని. ఆమంచిదినములనే తలఁచుకొని నేనిప్పుడు చనిపోయెదను. నేను మీపాదముల సన్నిధినిఁ గూర్చుండి కరుణారసముఁజిల్కు మీనేత్రములవంకఁ దనివితీరక చూచుచు, వలపులు గులుకు మీపలుకులచే నాచెవులకు విందుచేసికొనుచు నెప్పటికి నీరాత్రియే యుండ వలయును గాని తెల్లవారకూడదని కోరుకొనుచు దీర్ఘములైన యాశీతకాలపురాత్రులనే తలఁచుకొనుచుఁ బోయెదను. పగలెల్ల పాటుపడియో, పయనము చేసియో శ్రమపడి మీరువచ్చి మిక్కిలి మక్కువతో నన్ను బిగ్గఁ గౌఁగలించికొన్నప్పుడు మీబాహుమధ్యముకంటె స్వర్గము విశేషసౌఖ్యప్రదముగా నుండదని నేననుకొంటిని. అట్టినిమిషములను గొన్నిఁటిని నే నిప్పుడు స్మరించికొనియెద.

ఆయానందము శాశ్వతముగా నే ననుభవింతు ననుకొంటిని. కాని దైవనిర్ణయము మఱియొకలాగయ్యెను. అందుకు నేను చింతింపవలెను. నాహృదయ మెంతో పరితపించినది. నాతల దిమ్మపట్టినది. ప్రపంచ మంతయు చీఁకటికోణమై సంతోషశూన్య మైనందున దిక్కు లేక నేను భగవంతునే శరణుఁజొచ్చితిని.

నే నెంతెంతమనోవ్యథ పడుచున్నను పతివ్రతాధర్మము నడుపుటకై ప్రయత్నించితిని. నేను తెలిసియో తెలియకయో యెన్నఁడైన నాధర్మము తప్పి యుంటినేని ప్రాణేశ్వరా! మీరు నన్ను క్షమింప వలయును. మనసు విరిగి పోయినపుడు కోపోద్రేకముచే ననరానిమాట లాడినపక్షమునను, మనోవ్యథా భారమున నేను మీమొగముంజూడక విసువుకొన్నపక్షమునను, ప్రాణేశ్వరా! మీరు నన్ను క్షమింపవలయును. ఈజీవితములో నేను మిమ్ము కోరునట్టి నాకడపటికోరికయిదియే. బాష్పపూరితములైనకన్నులతో మిమ్మీకోరిక కోరుచున్నాను. మఱియొకకోరిక కోరుపఱకు నేను బ్రతుకను.

నేను పోయినతరువాత మీరు సుఖింపుఁడు. మీరు గొప్పకుటుంబములో పుట్టినారు. మీరన్న దేశమం దంతట గౌరవము కలదు. మీశక్య మగునేని మీవెనుకటి పిచ్చిజీవనమును మఱచిపొండు. మిమ్ము నాశనముచేయుచున్న మిత్రు

లను విడిచిపెట్టి స్వతంత్రముగా బ్రతుకుఁడు మీహృదయము మిక్కిలి మంచిది. అంతఃకరణశుద్ధిగా నడుచుకొనుఁడు.

ఆపద్బాంధవుఁడైన పరమేశ్వరునివైపునకు మీయాలోచనలను బ్రసరింపఁజేయుఁడు. వర్ధమానపట్టణమున నొక పావనస్థలము కలదు. అక్కడనూటయేనుబది దేవాలయములు కలవు. అవి యొకదానిప్రక్క నొకటిగా నున్నవి. ఒక్కొక్క దేవాలయమున నొక్కొక్కవిగ్రహము కలదు. అప్పుడప్పు డాదేవాలయములకుఁ బోయి, విగ్రహరూపముతో నెవ్వనిని గనఁబఱుచుటకు మనము వ్యర్థముగాఁ బ్రయత్నింతుమో యట్టిలోకేశ్వరుని భక్తితో నారాధింపుఁడు. మంచివా రనిపించుకొనుటకు, గొప్పకార్యములు చేయుటకుఁ బ్రయత్నింపుఁడు. మీకు సుఖజీవనమగు గాక! దుఃఖభాజన మైనతనజీవితముయొక్క తుదవఱకు మిమ్మే ప్రేమించిన మందభాగ్యురా లగునీస్త్రీని జ్ఞాపక ముంచుకొనుఁడు."

వణఁకు చున్న యాతనిచేతులనుండి యాజాబు క్రిందఁబడెను. ఆమందభాగ్యుఁడు తలతిరుగుటచే ముందుకుతూలి హస్తములు చాచి నేలఁబడి మూర్ఛిల్లెను.

సుధాశరచ్చంద్రము

మూఁడవభాగము.

పదునాఱవ ప్రకరణము

దేవాలయము.

స్వప్నము

పతివ్రతయైనకాళీ రాణిగంజిలో భర్తయైనజగత్కిశోరరాయులకు శ్రద్ధతో సంరక్షణ సేయుచుండెను. ఆగ కలకత్తానగరమున కెగువను రైలుమార్గమున నూటయిరువది మైళ్ళదూరమున నున్నది. అక్కడ బొగ్గుగను లుండుటచేత రమారమి యేఁబదిసంవత్సరములనుండి రాణిగంజి ముఖ్యప్రదేశ మైనది. ఇంగ్లీషు కంపెనీలు బొగ్గుగనులలో బనిచేయునిమిత్తము కూలివాండ్రను విశేషసంఖ్యలుగఁ బెట్టి దేశమునకుఁ గా వలసినబొగ్గంతను త్రవ్వించి సిద్ధము చేయు చున్నవి. ధనవంతులై, వ్యవహారకుతూహలు లైనహిందూదేశస్థు లనేకులుకూడ స్వయముగా గనులు త్రవ్వించుటకుఁ బ్రారంభించిరి. ఎన్నో చిన్నగనులలో వారిపెట్టుఁబడి మీఁదనే పని జరుగు చున్నది. గనులలోనుండి త్రవ్వితెచ్చినబొగ్గు హిందూదేశములో నున్న పొగబండ్లనిమిత్తము పొగయోడలనిమిత్తము నుపయోగపడుటయే కాక కలకత్తా మొదలగునగరములలో వంటకట్టెయులకు మాఱుగాగృహములలో నుపయోగింపఁబడు చున్నది.

గను లున్నయితరస్థలములవలెనే రాణిగంజియు మురికిపట్టణము. అక్కడి ‘గాలి బొగ్గుదుమ్ముతో నిండియుండును. అయినను నేల మిట్టపల్లములు గలిగి యెత్తుమీఁద నెత్తుగా నుండును. స్థలస్థితి బలము కలిగించునది గనులకు దూర

ముగా మంచిమంచిభవనము లున్నవి. అవి శీతకాలములో మిక్కిలిసుఖప్రద ముగా నుండును. కలకత్తానుండియు, వర్ధమానపట్టణమునుండియు జను లనేకులు తమదేహస్థితి చక్కఁజేసికొనుటకై రాణిగంజికిఁ బోయి యాభవనములలో నివ సించు చుందురు. జగత్కిశోరరాయులునిమిత్తము పెద్దభవన మొకటి యద్దెకుఁ బుచ్చుకొనిరి.

ఆరోగియొక్క దురదృష్టము చేత నతనివెంట తల్లి, భార్య గాక ముగ్గురు మేనత్తలు మఱికొందఱు దూరపుఁజుట్టములు, చాలమందిపిల్లలు వచ్చిరి. వారం దఱు తమ్ము రానిమ్మని బతిమాలుకొని రోగివెంట వచ్చిరి. అతనిభార్యతోఁ కలిసి యతని కుపచారము చేయ వలయుననియే వారిముఖ్యసంకల్పము. తనమీఁద వారి కంతదయ యుండినందుకు జగత్కిశోరరాయులు సంతసించెను. కాని పెద్దకుటుం బపుగొడవ మంచ మెక్కి ప్రశాంతినిఁ గోరుచున్న యారోగికి సరిపడక రోగము తిరుగఁబెట్టెను. తిరుగఁబెట్టినప్పుడు జీవించునా లేదా యని యెల్లవారికిని భయము కలిగెను.

ఆస్థలమందున్న యింగ్లీషువైద్యుఁడు క్రమముగా వచ్చి రోగినిఁ జూచి, శ్రద్ధతో మందిచ్చుచుండెను. కాని యింట్లోనున్న యాఁడవాండ్రు పలుమాఱు కవిరాజులను బిలిపించియు, సన్యాసులను రప్పించియు, శాస్త్రవేత్తలను బిలిపిం చియు, జ్యోతిశ్శాస్త్రజ్ఞులను రావించియు సలహా యడుగుచుందురు. బంగాళా దేశములో వైద్యులను గవిరాజు లందురు. ముసలమ్మలు చాలమంది కిశోరరాయుని తల్లివద్దకువచ్చి, తీర్థయాత్రలు చేసినందువల్ల మహాద్భుతముగా ననేకులకు రోగ ములు కుదురునని చెప్పుచుందురు.

అందులో నొక్కతె యిట్లనియె.

"అమ్మా! రాణిగంజిలో నున్న యింగ్లీషుడాక్టరుకు శస్త్రవైద్యము బాగుగాఁదెలియును. అకస్మాత్తుగా వచ్చినరోగముల కింగ్లీషువైద్యము పనికి వచ్చుట గాని మనదీర్ఘవ్యాధులసంగతి ఆడాక్టర్లకుఁ దెలియదు. తల్లీ! నామాట నమ్ము. మనకవిరాజులు పెద్దవాండ్రు. లోకానుభవము గలవారు. రోగలక్ష ణములను చక్కగా గ్రహించి నెమ్మదిగా వైద్యము చేసి, కొంచె మాలస్య మైనప్ప టికి రోగములను నిశ్శేషముగా కుదిర్చివేయఁగలరు. ఎన్నో నెలలు వర్ధమానపు మన్నెజ్వరము పట్టుకొని మాకుఱ్ఱవానిని పిల్పిపిప్పిచేసినది. మొదట నింగ్లీషు వైద్యునివద్దకు వళ్ళగా క్వయినా, పాషాణము, మాత్రమే యిచ్చినాఁడు. ఎప్పటి కదేమందు. క్వయినా కొన్నాళ్ళవరకు జ్వరమునణఁచి పెట్టినది. కాని రోగము

నిశ్శేషముగా మానలేదు. చిట్టచివఱకు నేను మాపిల్లవానిని సనాతకొంబటీలో నున్నకవిరాజువద్దకుఁ బంపితిని. ఆయనమందులు మహాద్భుతములు. ఆయనపేరు దేశమంతట మ్రోఁగుచున్నది. ఆయన మాకుఱ్ఱవాని నాలుగుమాసము లింటఁబెట్టుకొని, పథ్యపానములు స్వయముగాఁ జూచి నడిపి మంచిమందు లిచ్చినాఁడు. మాపిల్లవానిశరీరము వజ్రశరీరమైనది. హాయిగా నింటికివచ్చినాఁడు. అప్పుడున్నంత బలముగాను, ఆరోగ్యముగాను, మావాఁడు మఱెప్పుడు లేఁడు. మనకవిరాజులలోఁ బెద్దవారి నెవరినైన నడుగు తల్లీ! మనదీర్ఘవ్యాధులు వారెఱుఁగుదురు. క్షణములో కుదర్చివేయుదురు. పరమేశ్వరుఁడే మీకుమారునకు దీర్ఘాయువిచ్చి, సిరి, సంతతి నిచ్చి రక్షించఁగలఁడమ్మా!"

కిశోరరాయని కెట్లున్నదో విచారించుటకు వచ్చినమఱియొక యవ్వ యందుకొని యిట్లు చెప్పెను.

"వైద్యు లేమిచేయఁగలరమ్మా! చావుబ్రదుకులు సర్వేశ్వరుని చేతిలో నున్నవి. రోగములు తెచ్చిపెట్టఁగలవాఁ డతఁడే. కుదర్చఁగలవా డతడే. ఎన్ని సంవత్సరములో నేనుశూలనొప్పివల్ల నానాబాధలుపడిపడి, అన్నిమందులు మ్రింగలేదమ్మా? మందులవల్లకుదిరినదా నాకు? చిట్టచివఱ కొకసన్యాసి వచ్చి తారకేశ్వర క్షేత్రమునకు యాత్ర వెళ్ళవలసిన దని చెప్పినాఁడమ్మా. నేను కాలినడకనే ఆ క్షేత్రమునకువెళ్ళి అక్కడ తీర్థవిధులు చేసికొని, వెండ్రుకలు తీయించుకొని వచ్చితిని. మూఁడవనాఁడురాత్రి తారకేశ్వరునిదయవల్ల నే నొక కల గంటిని. ఆకలలో నా కెవరో యింతప్రసాదమిచ్చిరి. ఇచ్చినపురుషుఁడు కనఁబడలేదు గాని చేయికనఁబడెను. అదే నాకన్నిమందులకంటె నా కెక్కువమందైనది. తారకేశ్వరములో నే నొక వారముండి క్రొత్తదాననై వచ్చితిని. నాటికి నేటికి శూల నొప్పిరాలేదు. అనుగ్రహము వచ్చినా భగవంతుఁడే మనరోగముల నన్నిఁటిని మాన్పఁగలఁడు. మీకొడుకు కెంతోమందని బోషించుచున్నాఁడు. ఎంతోమందికి సహాయము చేయుచున్నాఁడు. భగవంతుఁ డాయనను జబ్బుకుదిర్చి బాగు చేయకపోఁడు."

తన యిద్దఱుపిల్లలను వెంటఁబెట్టుకొని వారింజూచి పోవుటకు వచ్చిన మూఁడవ ముసలమ్మ యీలాగనెను.

"తీసికొని పోగలవాఁడు భగవంతుఁడే. ఇవ్వగలవాఁడు భగవంతుఁడే. జగన్నాథస్వామివారియనుగ్రహము లేకపోయినపక్షమున నాకీపిల్లలిద్దఱుదక్కుదురా? ఎందుకమ్మా, నేను కాపురమునకు వెళ్ళినతరువాత పుట్టినప్రతిపిల్ల ఏదోరోగపడి,

చచ్చిపోయినది. ఇల్లు పల్లకాడై పోయినది. సంతోషము లేమిటో యీ మొగమున కన్నఁడు లేదు. ఆలాగుండఁగా జగన్నాథమునుండి ఒకపండా మాయింటికి వచ్చినాఁడు. ఆయన మాగోడవవిని భయములేదని చెప్పి దీవించి, జగన్నాథస్వామి యొక్కఁడే రక్షింపఁగలఁడు గాని యితరులకుసాధ్యము కాదని చెప్పి, జగన్నాథయాత్ర చేయవలసినదన్నాఁడు అమ్మా! జగన్నాథమంటే చాలదూరము. రైలుమీఁద కలకత్తా వెళ్లినాము. అక్కడనుంచి పొగయోడనెక్కి సముద్రము దాటినాము. సముద్ర మెంతో అల్లకల్లోలముగా నుండినది. కెరటము లెత్తుగా లేచినవి. కూర్చున్న గదులలోనికి నీరువచ్చినది. నాలుగు ప్రక్కల నల్లనీళ్లసముద్రమును చూచినప్పుడు నేను మఱల జన్మమధ్యములో నేలచూతు ననుకోలేదు. కాని నేను జగన్నాథ స్వామినే నమ్ముకొని రాత్రి నాలుగుజాములు ఆయనపేరు స్మరణచేసికొనుచుంటిని. మఱునాఁ డుదయమున మేము క్షేమముగా రేవుజేరితిమి. తరువాత ఏడుపగళ్లు, ఏడు రాత్రులు పుణ్యసరస్సులలో నేను స్నానములుచేసి, స్వామివారి రథోత్సవమును జూచితిని. ఏడవనాఁటిరాత్రి జగన్నాథస్వామి నాకొకస్వప్నము కలిగించెను. తరువాత నేనుమాయూరికి వచ్చితిని. ఆవల ఈరెండుకాయలు కాచినవి. ఈగడియ వఱకు ఈబిడ్డల మొగము చూచుకొని సంతోషించఁగలఅదృష్టము పట్టినది. పెద్దపిల్లవానికేడేండ్లు. చిన్నపిల్లవానికి అయిదేండ్లువయస్సు. అమ్మా! నాబిడ్డలనిద్దఱిని దీవింపు. నీవుపుణ్యాత్మురాలవు తల్లీ! భగవంతుఁడు నీదీవనలువిని, మావంశము నిలిపి యీయిద్దఱుపిల్లలను రక్షించును.”

చూడవచ్చినవారాయవ్వను విడిచి పోవునప్పటికి మిక్కిలి ప్రొద్దుపోయెను. రాత్రులు సరిగా నిద్రింపక కొడుకుమంచము కనిపెట్టుకొని, యతని యవస్థ చూచుచు పగలనిపథ్యపానములు చేయించుచు నొక్కనిముసమైన విశ్రాంతి యెఱుఁగక కష్టపడుచుండినప్పటికి కిశోరరాయనితల్లి దేహస్థితి యించుకేనియుఁ జెడ లేదు. ఈమెయేకాదు హిందూదేశమందనేకవృద్ధవితంతువులను రోగపీడితులైనవారి కుపచారము చేయుటయే పరమార్థము. ఆరాత్రి ప్రొద్దుపోయినప్పటికి నామె చూడవచ్చినవారితో మాటాడి సాగనంపి కుమారుఁడు పండుకొన్నగదిలోనికి వెళ్ళెను. కుమారుఁడు నిద్రించుచుండెను. కోడలు మగనిపాదములవద్ద కొంగు పఱచుకొని పండుకొనెను అనంతరమామె తనగదిలోనికిఁ బోయి కొంతసేపు మేలుకొని తెల్లవారుజామునఁ గన్నుమూసెను.

వేకువ నామె కొకస్వప్నము వచ్చెను. రోగపీడితుఁడైనకుమారునివిషయమై యత్యంతము తపించుచున్నయామెహృదయమున కాకల యమృతప్రాయమయ్యెను. ఆకల యిట్టిది. భయంకరమైనచీఁకటిరాత్రివేళ నామె యొక్క

యడవిలోఁ దనకుమారునివెంటఁ బయనమై వెళ్ళుచుండె నఁట. ఘాతుకమృగములు చింతనిప్పులవంటి పెద్దకన్నులు తెఱచి, యామెవంకఁ దేఱిపాఱిచూచు చుండె నఁట. దూరమునుండి నక్కలు కూయుచుండె నఁట. ఆమె దారితప్పి కాళ్లు పొక్కులెక్కునట్లు మిక్కిలి శ్రమపడి నడిచి కొడుకుతోఁ బయనము చేసె నఁట. కాని మార్గము దొరక లేదఁట. ఆదుఃఖములో నామె దుఃఖించి బిగ్గఱగా జగన్నాథస్వామినిఁ బిలిచి వేడుకొనె నఁట. వెంటనే తూర్పున వెలుఁగు కనఁబడెనఁట. దూరమునుండి యెవ్వరో చేయెత్తి "ఇదిదారి. ఇటు రండు, రం" డని పిలిచి రఁట. అప్పు డామెకు ధైర్యము కలిగె నఁట అంతట వా రందఱు మహారణ్యము గడుచు వఱకు, లేతసూర్యునియెండ పొలములమీఁదను గ్రామములమీఁదను వ్యాపించు వఱకు, నడిచి రఁట. తరువాత నామెకుమారుఁడు రోగముపోయి, బలముకలిగి సుఖముగా నింటికి నడిచి వెళ్ళె నఁట కాని యామెతన్నుఁ బిలిచినపురుషునిఁ బూజించె నఁట. అప్పు డీవిధ మైనధ్వని యామెకు వినఁబడెనఁట. "అవ్వా! సముద్రతీరమునందుఁ గాపుర మున్నవాఁడను నే నే" అంతలో మెలఁకువవచ్చెను. ఆమెకన్నులు తెఱచి చూచునప్పటికి జాలకమ్ములలోనుండి సూర్యునివెలుఁగుగదిలోఁ బ్రవేశించు చుండెను. మెలకువ వచ్చినప్పటికి స్వప్నములో వినఁబడినమాటల ధ్వని యామెచెవిలో ఖంగు మని కొంతసేపటివఱకు వినఁబడుచున్నట్టే యుండెను.

ఆమె తనకల గృహమందున్నవారి కందఱకుఁ జెప్పఁగానే, యింటిలోఁ బెద్దకళవళము పుట్టెను. అడిగినవారి కందఱకు విసుగు లేక యామె తాను కన్న కలతెఱంగు మఱలమఱలఁ జెప్పెను. విన్న ముసలమ్మ లెందఱో కన్నుల నానందబాష్పములుగార జగత్కిశోరరాయలకు శీఘ్రకాలములోనే యారోగ్యదశ ప్రాపించు నని చెప్పిరి. జగన్నాథస్వామివారియాలయమునకు జగత్కిశోరరాయలు యాత్ర చేసినపక్షమున నతఁడే రోగబాధ నివారింపఁజేయు నని, స్వప్నఫలము చెప్పుటకై వచ్చినపురోహితులు పండాలు కల విప్పి చెప్పిరి. కిశోరరాయనితల్లికి స్వప్నమువల్ల కలిగెడుఫలము కుమారునిదేహారోగ్యము బాగుపడుటయే గాక మఱేదో విశేషముకూడ నుండు నని తోఁచెను. కాని. యామె తనయభిప్రాయము నెవ్వరికినిఁ జెప్ప లేదు.

శరచ్చంద్రుఁ డామఱునాఁడే కలకత్తానుండి రాణిగంజికి వచ్చెను. రాఁగానే తోఁబుట్టువు శరచ్చంద్రునితో యావద్వృత్తాంతము చెప్పెను. అది విని శరచ్చంద్రుఁడు భయపడెను. "తమ్ముఁడా! జగన్నాథస్వామికి మనమీఁద ననుగ్రహము వచ్చినది. అందు కాకలయే ఆనవాలు. ఈసంకల్పము నీవు సహాయము చేసి నెఱవేర్పవలెను."

"కాని, అక్కయ్యా! ఇది పిచ్చిపని. శరీరములో దబ్బెత్తుబల మైనను లేనప్పుడు నీమగనిని తీర్థయాత్రకు దీసికొనిపోవుట కేవలము పిచ్చిపని. అదిదీర్ఘప్రయాణము. ప్రయాణపుబడలిక బావను జంపివేయును."

"కాదు. తమ్ముడూ! అలాగు కాదు. జగన్నాథస్వామి అనుగ్రహించిన పక్షమున ప్రయాణపుబడలికయే యుండదు. ఆయనతల్లికి ఈయాత్ర యిష్టము. మేనత్తల కిష్టము. మీబావగారు కూడ వెళ్ళ నిశ్చయించుకొన్నారు. తమ్ముడూ! నీవుసహాయము చేయవలెను. మాలోకెల్ల దృఢ మైనవాడవు నీవే. నీసహాయము లేనిదే యీపనికాదు. ఈతీర్థయాత్ర మాచేత నీవు చేయింపవలెను."

ఆమాటలు విని శరచ్చంద్రు డాశ్చర్యపడెను. రోగికి దనచేత నైనంత సాయము చేయుటకు, మంచివైద్యము చేయించి బ్రతికించుటకు గంపంతయాశతో నతడక్కడకువచ్చెను. కాని యొక ముసలమ్మ కన్నపిచ్చికలను బట్టి యామె యాజ్ఞాప్రకారము తీర్థయాత్ర చేసి, రోగిప్రాణము దీయుటకై యొకపన్నుగడ బయలుదేరెను.

ఆయాత్ర నాపివేయుటకు దనశక్యము కా దని యతడెఱుగును. అయినను తనశక్య మైనంతవఱ కాపన్నుగడ సాగకుండ జేయుటయును, బావగారికిదీర్ఘప్రయాణము చేయుటకు శరీరదార్ఢ్యము గలుగునట్లు యాత్ర నిలుపుచేయుటకును సర్వప్రయత్నములు విధిగా నతఁడు చేయదలచుకొనెను.

మధ్యాహ్న మతడు రాణిగంజిలోనున్న యింగ్లీషుడాక్టరును జూడబోయెను. రోగి విషయమై యతడు పుచ్చుకొను చున్నజాగ్రత్తను శ్రద్ధను శరచ్చంద్రు డతనియెడ దనకు గలకృతజ్ఞతను జూపుచు బ్రశంసించెను.

"ఉ—దాని కేమిలెండి, అందుకు నన్ను బ్రశంసింప నక్కఱలేదు. మాశక్యమైనదేదో మేము విధిగా జేయుదుము. మీబావగారికి శీఘ్రముగానే నెమ్మదిగా నుండును. పెద్దవాడు కాడు గనుక కుదురుటకు సందేహము లేదు."

"అయ్యా! మీరు సమర్థులు. శ్రద్ధచేసి యెట్లైనను రోగము మాన్పగలరని నేను నిశ్చయముగా నెఱుగుదును. కాని—కాని—" ఆమీద శరచ్చంద్రుడు మాటాడ లేక పోయెను.

కాని కాని యని శరచ్చంద్రు డాగుటచేత సందేహము కలిగి వైద్యుడు "నే నుదయమున జూచి వచ్చినతరువాత రోగము తిరుగ బెట్టెనా యేమి?" యని యాత్రముతో నడిగెను.

"అయ్యా! తిరుగబెట్టుటే నయము. అంతకంటే నధమమైనపని జరుగుచున్నది. వైద్యమువల్ల రోగములు మానును. కాని బుద్ధిపూర్వకముగ జేసినతప్పులు మానవు."

"రోగి యజాగ్రత్తచేత దేహస్థితి పాడుచేసికొనెనా యేమి?"

"తల్లి యేదోకల గన్నదట. అందుచేత జగన్నాథయాత్ర తనజాడ్యము కుదుర్చునని రోగి తలచుచున్నాడు."

"జగన్నాథయాత్ర! జగత్కిశోరుఁడు మిక్కిలి నీరసముగా నున్నాఁడే. జగన్నాథ మెంతదూరము? ఏలాగున ప్రయాణము చేయఁదలచుకొన్నాఁడు?"

"రైలుమీఁద కాదు, స్టీమరుమీఁద కాదు. రాణిగంజినుండి పూరీజగన్నాథము వఱకు రాచబాటమీఁదనే ప్రయాణము. శరీరస్థితి సరిగా లేనివాని కది బాధాకరమైన దీర్ఘప్రయాణము. అది మాబావమరణమునకే వచ్చినది." అని శరచ్చంద్రుఁడు తలవంచి యొకటి రెండు భాష్పబిందువులు విడిచెను.

వైద్యుఁడు కూర్చున్న చోటునుంచి లేచి, యిట్టటు పచారుచేసెను. బంగాళాదేశ మతనిగదిగోడమీఁద వ్రేలాడుచుండెను. ఆపటములో రాణిగంజి జగన్నాథపు రాచబాటను సూచించునట్టి పొడవుగీతను వ్రేలితో గీసినట్లు స్పృశించి పిమ్మట బల్లమీఁద నున్న కొన్ని వైద్యగ్రంథములు తెఱచి యేమో చదివి, మూసివేసి, శరచ్చంద్రునికడకు వచ్చి తన స్థానమున మెల్లఁగాఁ గూర్చుండెను.

"ఈపిచ్చిప్రయత్నము మాన్పించుటకు మీరు నాకు సహాయము చేయవలెను. డాక్టరుగారూ! శరీరస్థితి యీవిధముగా నున్నప్పు డిటువంటిప్రయాణము చేయుట చేతులార ప్రాణము తీసికొనుటయే అని మీసహాయముతో నేనాయనకు నచ్చఁజెప్పఁగలను."

"నే నాలోచించుచున్నాను. ఈప్రయాణమువల్ల అతని ప్రాణరక్షణము కావచ్చునేమో అని నే నాలోచించుచున్నాను." అని వైద్యుఁడు ప్రతిమాట దగ్గఱ నించుకయాగుచు మెల్లఁగా బదులు చెప్పెను.

"విశ్వాసబలము రోగము మాన్పఁగలుగు నని మీ రాలోచించుచున్నారా?" అని శరచ్చంద్రుఁ డాశ్చర్యముతో నడిగెను.

"నేను దానినిగుఱించి యాలోచించుట లేదు. విశ్వాసబలము రోగనివారణ చేయవచ్చును. గాని వైద్యులము ఆమాట తలచుకొనము. నేను మీబావకు సరిగా ఒకనెలమం దిచ్చితిని. ఆయనరోగము పట్టుబడిన దని నానమ్మకము. పైగామునపటి

వాఁడుకాఁడు. నలువదియేండ్లకంటె నెక్కువ లేవని తలఁచెదను. అనేక సంవత్సరములు వర్ధమానపట్టణమందలి మన్నెజ్వరము పీల్చి పిప్పిఁజేసి నీరసపెట్టినది. జాడ్యము కుదురుటకష్టము. కుదురునని నేను నిశ్చయముగాఁ జెప్పలేను. నీరస ఆయన నిప్పుడు క్రమక్రమముగాఁ జంపుచున్నది. సంవత్సరమంతటిలో మిక్కిలి మనోజ్ఞమైన యీశీతకాలములో బంగాళాదేశమందు మిక్కిలి యారోగ్యప్రదములైనజిల్లాలలోనుండి దగ్గఱ దగ్గఱమకాములు చేసుకొనుచు నేఁనాటి కానాఁడే క్రొత్తస్థలములఁ జూచుచు దీర్ఘప్రయాణము చేసినపక్షమున సంపూర్ణారోగ్యముఁ జెందుటయే గాక మీబావ క్రొత్తమనుష్యుఁడై, ముం దనేకసంవత్సరములవఱకు జాడ్య మన్నది యేమో యెఱుఁగకయుండును."

ఆమాటలు విని శరచ్చంద్రుఁడు మహాశ్చర్యము నొంది "ఈప్రయాణములో చలితగుల కుండ నతనినిఁ దీసికొనివెళ్ళుట సాధ్య మగు నని మీరు తలంచుచున్నారా?" యని వైద్యు నడిగెను.

"అట్టిజాగ్రత నీవే పెట్టవలెను. ఇట్టి జాగ్రతపెట్టుటకై నమ్మకము గల మనుష్యుఁడు కిశోరరాయునివెంట నే నెఱిఁగినంతమట్టుకు నీవు తప్ప మఱెవ్వరును లేరు. నీ వాయనతో వెళ్ళఁ దలఁచుకొంటే గాని, ఆయన యీప్రయాణము చేయుటకు నే నంగీకరించను."

"అయ్యో! నా కిది యిష్టమే."

"మంచిది. జగన్నాథప్రయాణము చేయుటే నిశ్చయము. రాత్రివేళ ఆయనను వెచ్చనిగదిలో నుంచుటకుఁ బ్రయత్నము చేయుఁడు. గాలి తగులకుండఁ జేయవలెను. పచ్చడములు ఒత్తుగాఁ గప్పవలెను. సూర్యాస్తమానమైనతరువాత గాని రాత్రి గాని ప్రయాణము చేయవద్దు. ప్రతిదినము సూర్యోదయమైనతరువాత నొకగంటకు బైలుదేఱవలెను. చిన్నచిన్నమకాములమీఁద వెళ్ళుఁడు. ఆయన పల్లకిలోనే ప్రయాణముచేయును కదా?"

"డాక్టరుగారూ! ఆవిషయ మంతయు నేను చూచికొందును లెండు."

"సాధ్యమైనంతవఱకు ఆయనతో జనము తక్కువగా నుండవలెను. ఇంటిలో నిజముగా మంచితలకాయ యున్నది. ఎవరంటే ఆయనతల్లి. ఆమె చాలపెద్దది. ప్రతివిషయములో నామెయేర్పాటు లెంతో ప్రయోజనకరములు. ఆమె తప్పక వెళ్ళవలెను కదా! భార్య అంటే నీతోబుట్టువే భార్య. పెనిమిటి కుపచారము చేయుటలో రాత్రి, పగలు విసుగులేకుండ, బద్ధకించ కుండ అంతజాగ్రతగ, అంత

శ్రద్ధగ, అంతభక్తిగ పనిచేయునటువంటియిల్లాలిని ఈదేశములోనే కాదు; మా దేశములోనే కాదు; నేనెక్కడ చూడలేదు. ఆమె లేనిదే క్షణము జరుగదు. కాఁబట్టి తప్పక వెళ్లవలెను. సరే, నీవుమూడవవాఁడవు. కొందఱు నౌకరులు తప్ప మఱెవ్వరిని ఆయనవెంట వెళ్లనివ్వవద్దు.''

“రోగి మేనత్తలమాటేమి? వారు కూడ జగన్నాథక్షేత్రము చూడవలెనని ఉబలాటపడుచున్నారు.”

“పాపము! ప్రేమగలమేనత్తలు పిల్లలమందలతో వచ్చి గొడవపెట్టి, రోజునకంగుళమంగుళముచొప్పున మీ బావను జంపివేయుచున్నారు. ఆకొంపలో నున్నంతమందిజనముతో రోగము కుదుర్చుకొనుటకై స్థలము మార్చి ప్రయాణము చేయువాఁడు మఱియొకఁ డుండఁడు. నామాటకు మీరు కోపగించుకొనవద్దు. మీమనస్సునకు నొప్పికలిగించవలె నని నే ననుట లేదు. మీసమిష్టికుటుంబముల శక్తి మిక్కిలి మంచి దని నేను నొక్కి చెప్పగలను. నిరుపేద లైనయెందఱో ఆఁడ వాండ్రు, ఎందఱో మగవాండ్రు దిక్కుమాలినవారై దురవస్థలపాలు గాకుండ ఈసమిష్టికుటుంబములే రక్షించుచున్నవి. ఆవిషయమై వ్యతిరేకముగా నే నేమియుఁ జెప్పఁదలఁచుకొనలేదు. కాని రోగి మావద్దకువచ్చినప్పుడు వైద్యులము గనుక మేము కొన్నిసంగతులు చెప్పవలసియుండును. కాని నాయభిప్రాయ మే మనఁగా జబ్బుగానున్న సమయములో జగత్కిశోరరాయలను పెద్దసత్రమువలె నున్న ఆకొంపలో ఆగొడవలో పెట్టి మీరు చంపివేయుచున్నారని, నేనాయనను జూడవచ్చినప్పుడు శుభ్రమైనగాలి గదిలోనికి వచ్చుటకు సాధన మేది యైననున్నదాయని వెదుకుచుందును. గాని సాధ్యముకాదు. అపేక్షగలచుట్టాలగొడవలోను, ఎద్దుమొద్దుస్వరూపములైన నౌకరులగోలలోను, మంచివానికైన వెఱ్ఱియెత్తించునట్లు పిల్లలు చేయుగడబిడలలోను రోగి కొక్కనిమిషమైన విశ్రాంతి లేదని నేను కనిపెట్టితిని. అయ్యా! అది యెప్పటికి సరిపడదు. నిజముగా నుపచారముచేయఁగలిగి తెలివిగల కొద్దిమంది మనుష్యులను దీసికొని నిరంతరము స్థలముమార్పులు గలదీర్ఘప్రయాణము చేయవలసిన దని నేను చెప్పుట కదొక ముఖ్యకారణము.”

“అయ్యా! డాక్టరుగారూ! మీయభిప్రాయ మేమిటో సరిగా నాకుఁ దెలిసినది. మీసలహాప్రకారమే నడిచెదను. ప్రయాణములో రోగినిఁ గనిపెట్టియుండుటకు కిశోరరాయునితల్లి కవిరాజు నొక్కనిని వెంటఁ దీసికొని పోవఁ దలఁచుచున్నది.”

"అది మానిపించు. మీకవిరాజులలో గట్టివారు కొందఱున్నారు. మేమింత వఱకు వాడి యెఱుఁగని కొన్ని మూలికలు, మందులు వారెఱుగుదురు. నేలవేము మొదలైనకొన్ని వేళ్లు పనిచేయుట చూచి, మామందులలోఁ జేర్చి మేము వాడుచున్నాము. కొన్నిదీర్ఘవ్యాధులలో నవి మిక్కిలియుపయోగించుచున్నవని నే నెఱుఁగుదును. నామిత్రుఁడొకఁడు పురాణగ్రహణివల్ల చిరకాలము నుండి బాధ పడుచుండెడివాఁడు. ఇన్ని మందులు పెట్టుకొని, మే మాయనరోగము కుదర్చలేక పోయినాము. అది కొంతవఱకు కాఁగినిబట్టికూడ నున్నది లెండి! రోగులలో నంతపనికిమాలినవానిని నేనెక్కడఁ జూడ లేదు. చప్పిడిభోజనముఁ జేయుమని మేము విధించి యుండగాఁ భక్షింపఁగూడని వస్తువులు కచేరిపెట్టెలో దాచుకొని, యెవ్వరుచూడకుండఁ దినుచుండెడివాఁడు. అయినప్పఁటికి గట్టికవిరాజొకఁడు ఆతనినిఁ జేరదీసి కఠినపథ్యము చేయించి, ఆఱువారములలో జబ్బు కుదిర్చినాఁడు. కాని మీకవిరాజులలో ననేకులు ప్రజ్ఞలేనివారు. బూటకపు వైద్యులు. మీబావ విషయమై వేఱే కవిరాజు లక్కఱ లేదు. కడచిననెలలలో కావలసినన్నిమందులు మ్రింగినాఁడు. ఇఁకమందులువేయనక్కఱలేదు. పరిశుభ్రమైనగాలి తగులనిచ్చి గొడవలు, గోలలు లేకుండఁ జేయుడు. మందు లక్కఱ లేకుండ ప్రకృతియే అతనిరోగము కుదుర్చును."

"డాక్టరుగారూ! మీరు మా కెంతో యుపకారము చేసినారు. మేము మీ ఋణము తీర్చికొనలేము. మీసలహాప్రకార మేర్పాటులు చేయుదును. మేము యాత్రకు వెళ్లునప్పుడు మా బావగారి మేనత్తలను వర్ధమాన పట్టణమునకుఁ బంపెదను."

"ముసలమ్మలందఱిని వర్ధమానపట్టణములో నున్న కిశోరరాయులపిత్రార్జిత గృహమునకుఁ బంపివేయుము. అది వారి కుండదగినచోటు. నామాట తప్పుపట్టుకో వద్దు. ఆముసలమ్మలమీఁద నాకెంతో గౌరవము గలదు. నేను రోగినిఁజూచి తిరిగి వచ్చునప్పుడు పాప మా ముసలమ్మలు త్రోవలో నన్నాపి, తెఱచాటునుండి కిశోరరాయునికి నెమ్మదిగా నుండునా లేదా యనియు, సరస్వతీ పూజనాఁటి కారోగ్యము కలిగి పీటమీదఁ గూర్చుండి పూజ చేయఁ గలఁడా లేదా యనియు రోగము కుదిరిన తరువాత వంశము నిలుచుటకై సంతానము కలుగునా లేదా యనియు నెన్నో ప్రశ్నలడుగుచుండెడివారు. మేము చదువుకొన్న చదువులను బట్టి, ఆ ప్రశ్నలలో నొకదానికైనను మేము నమ్మకముగాఁ బ్రత్యుత్తరము చెప్పఁ జాలము. వారు పాపము నాకు కొన్ని పుష్పములు పచ్చిబటానీలు తోటలోనుండి

పంపు చుండెడి వారు. నాభార్య వాటి నెంతో సంతోషముగా గ్రహించుచు వచ్చినది. ఏ మైన నేమి, రోగి మంచమువద్ద మాత్రము పీ రుండఁదగినవారు కారు. ఆయనతో జగన్నాథమునకు నీవు, నీతోఁబుట్టువు, రోగి తల్లిమాత్రమే వెళ్ళ వలసినది. ఈ మాట మనసులో పెట్టుకో. మఱి యేచుట్టాలు వద్దు. ఏస్నేహితులు వద్దు. ఏకవిరాజులు వద్దు. ఏమందులు వద్దు. ''

వైద్యుని కెంతో కృతజ్ఞుఁడై శరచ్చంద్రుఁ డాస్థలము విడువఁదలచెను. పూరీ జగన్నాథమునకు వెళ్ళుటవలన జగత్కిశోరరాయలు సంపూర్ణారోగ్యముఁ బడయుచచ్చు నని కోరుచు వైద్యుఁడు శరశ్చంద్రుని హస్తము స్పృశించి పంపెను.

పదునేడవ ప్రకరణము.

యాత్ర.

రాణిగంజినుండి జగన్నాథదేవాలయమువఱకు గొప్పరాచబాటకలదు. అది మూఁడువందలమైళ్లు నిడివిగలిగి యుత్తరదక్షిణములకు వ్యాపించియున్నది. ఇది మిక్కిలి మంచిబాట. ఈబాటకుఁ దూర్పున నంతములేనివరిపొలములతోను, గొప్ప పట్టణములతోను, లెక్కింప నలవిగాని జనసంఖ్యలతోను నిండియున్నబంగాళా దేశపు సమభూములు కలవు. ఈబాటకుఁ బడమటగా నేల క్రమక్రమముగ నెత్తుగ నుండును. అందుఁ గొన్నికొండలు గలవు. ఆకొండలమీఁద సాలవృక్షము లతో నిండినపురాతన మహారణ్యములు, మహారణ్యముల మధ్య సాగుబడికి వీ లైన స్వల్పభూములు, భూములచుట్టు చిన్నకొండపల్లియలు కానఁబడుచుండును. తూర్పు దిక్కున నిరుపమానమైన నాగరకత గలిగి యార్యమహాజనులకళలు పరిశ్రామిక విద్యలు నేర్చిన హిందూమహమ్మదీయజాతులు కలవు. పశ్చిమభాగమున సొతలుల వంటియాటవికజాతులు కలవు. వీరు మొదట ననార్యులైనను సగమువఱకు హిందువులై యున్నారు. వీరివృత్తి యిప్పటికిని వేటయే. అనార్యమైనవారిస్వంత భాషనే వారు మాటాడుచుందురు. ప్రాగ్భాగమున దేశచరిత్రలో ప్రసిద్ధి కెక్కినవర్ధమానము, నవద్వీపము, డక్కా, జెస్సోరు మొదలగుజిల్లాలు కలవు. ఈజిల్లాలు కళాస్థానము లనియు, విద్యానిలయము లనియు బహుశతాబ్దములనుండి

పేరుపడి యున్నవి. పశ్చిమమున చోటానాగపూరులోఁ జేరిన మిట్టప్రదేశములును, నుత్కలదేశములోఁ జేరినస్వదేశసంస్థానములును గలవు. ఈసంస్థానములలోని జనులు యుగయుగంబులనాఁటిమోటయాచారములు, మూఢవిశ్వాసములు గలిగి సగమునాగరకతఁ గలిగియున్నారు. హిందూదేశమునందలి యితరభాగములయందు వలెనే బంగాళాదేశమందుఁ గూడ నార్యనాగరకతాతరంగము వనపర్వతప్రాంతముల ననార్యజాతులకు వారిసంతతులకు వదలి పర్వతశూన్యము లైనసమభూముల మీఁదనే ప్రవహించెను. రాణిగంజినుండి పూరీనగరమునకుఁ బోవు బాటసారిగాని, తీర్థవాసుఁడుగాని సమభూములకు, బర్వతభూములకు నడుమను, నాగరకు లైనహిందూమహమ్మదీయ జాతులకును, విద్యాగంధశూన్యు లైనయాటవికజాతులకును నడుమ సరిహద్దుగా నున్న యారాజమార్గముమీఁదనే నడువవలసి యుండును.

డిశెంబరు నెలలలో నొకనాటి యుదయమున జగత్కిశోరరాయలు తన పరివారముతోఁ గలిసి యాబాటమీఁదఁ బ్రయాణముఁ జేయ నారంభించెను. దట్టమైనగవిసెన గలిగి, రోగికవసరము లైన యేర్పాటులు గలిగిన యొకపల్లకిలో రోగియైన కిశోరరాయలు గూర్చుండెను. మఱియొకపల్లకిలో నతనితల్లియు, భార్యయుఁ గూర్చుండెను. శరచ్చంద్రుఁడు గుఱ్ఱముమీఁదఁద పయనముచేసెను. గుఱ్ఱ మంతమంచి స్వభావముకలది గాకపోయినను, దినమున కనాయాసముగా ముప్పది మైళ్ళప్రయాణ మొక్కవరుసను జేయఁగలిగినట్టి దేశవాళీమోటతట్టు. రెండెడ్ల బండ్లు రెండుకూడఁగలవు. అందులో వంటసామానులువేసికొని నౌకరులు పయనము చేయుచుందురు. ఈబండ్లమీఁద సేవకులు రాత్రివేళ బైలుదేఱి తెల్లవాఱునప్పటికి ముందుమజిలీకి వెళ్ళి, యుదయమున బయలుదేఱి కిశోరరాయలు మొదలగువారు వచ్చునప్పటికి బసయేర్పాటులు మొదలైనవి చేసి, వంటచేసి సిద్ధముగ నుందురు. రైలుబండ్లు రాకమునుపు హిందూదేశములో గొప్పవారు పయనముచేయునట్టి విధానములివి. ఇనుపదారి పడనిభాగములయం దిప్పటికిని గొప్పవారిపయనము లివ్విధముగనే జరుగుచున్నవి. పేదలైన తీర్థవాసులు, సామాన్యపు బాటసారులు కాలినడకనుబోయి మట్టమధ్యాహ్నమువేళను, రాత్రివేళను, బాటలకు సమీపమున నున్న పూటకూళ్ళయిండ్లలో గాని, యంగళ్ళలోగాని బస చేయుదురు. అక్కడ మూఁడణాల డబ్బులకు వారికి బస భోజనము కుదురును.

రాణిగంజినుండి రెండుమైళ్ళకులోపుగాఁ బయనముచేసి యాజనము దామోదర నదీతీరముఁ జేరెను. ఈనది పశ్చిమమున జనియించి కొంతవఱకుఁ

దూర్పుగాఁ బ్రవహించి పిమ్మట దక్షిణముగాఁ బాఱి, బంగాళాఖాతసమీపమున హుగ్లీనదిలోఁ బడుచున్నది. వర్షకాలమున దామోదరనది పొంగి యనేకక్రోశములవఱకు దేశము నాక్రమించును. అట్టిసమయమునఁ బల్లియలు, చెట్లు జలావృతములై మెట్ట సముద్రమధ్యమందలి దీవులవలెఁ గాన్పించి నేత్రములకుఁ బర్వము చేయుచుండును. ఉత్తరపువైపున గొప్ప పోతగట్టబాదు వర్ధమానము మొదలగు పట్టణములను వరదభయమువలన రక్షించుచున్నది. దక్షిణవైపున నెన్నిమాఱులు గట్లు వేసినను, నది గట్లుఛేదించుకొని పొంగి పొరలుటచే నావైపున గట్లప్రయత్నము వదలుకొనఁబడెను. అందువల్ల వర్షకాలమున శ్రావణభాద్రపదాశ్వయుజమాసములలో దామోదరనది దక్షిణపువైపున నిరంకుశముగా వ్యాపించి రైతులు చల్లుకొన్న విత్తనము లంటకుండఁజేసి, పొలము లన్నిఁటిని నీటితో ముంచి విశేష నష్టమును గలిగించుచుండును. దీనిసహజఫలము చిత్రమై పొడకట్టుచున్నది. దక్షిణపువైపునఁ గల నేల యంతయు నదీప్రవాహముతో వచ్చినయొండుమట్టి వలన క్రమక్రమముగా నెత్తగుచుండుటయు, నుత్తరభాగమున నున్న ప్రదేశమంతయు మన్నెపుజ్వరములకు నివాసమైన పల్లపునేలగా నుండుటయు సంభవించుచున్నది. ఇంజనీరింగుశాఖలోని యుద్యోగస్థులను, దేశపరిపాలనాధ్యక్షులగు నధికారులను నిరంతరదీర్ఘాలోచనపాలు సేయునట్టి గొప్పసమస్యలలో నిటువంటి చంచలనదుల విషయములు ప్రధానములై యున్నవి. ఈనదులు వానకాలములో బహుదూరవ్యాప్తములై దుర్నిరీక్షములై యుండి శీతకాలము నాటికే మిగుల సన్నగిలి దారములట్లు దృశ్యాదృశ్యములై యిసుకతిన్నెలసందున దాగుడుమూతలాడు చుండును.

అది డిసెంబరు నెలయగుటచే జగత్కిశోరరాయులు సపరివారముగ దామోదరనది ననాయాసముగ దాటెను. ఒకరేవుపడవ పల్లకులను గుఱ్ఱములను నెక్కించుకొని లోతునీరు దాటించెను. తక్కిన నదిభాగము కొన్నిచోట్ల వట్టియిసుకతిప్ప. మఱికొన్నిచోట్ల రెండడుగులలోతుగల స్ఫటికస్వచ్ఛమైననీరు గలిగియుండెను. నది నుత్తరించి యీబాటసారులు శీతకాలపు టెండలో మఱలఁ బ్రయాణమారంభించెను.

రోగముచేత మంచ మెక్కి బందెలోఁ బడియున్నట్లు రేయింబగళ్ళు గదిలోఁబడియున్న యారోగికి నిర్మలమైనయీవాయువు, వెచ్చవెచ్చనియెండ సుఖప్రదముగా నుండుటం జేసి బైలుదేఱి కొలఁదిదినములే యైనను నప్పటికే యీమార్పువలన నతఁడు మునుపటికంటె శరీరదార్ఢ్యము కలిగినట్లు కనఁబడెను. అతనితల్లికిని భార్యకును గూడ నాప్రయాణము సంతోషదాయకమై యాశా

ప్రేరకమై యుండెను. కంటికగపడిన ప్రతివస్తువు క్రొత్తదే. ఇసుకతిన్నెల తోడ నదియు, బహుదూరవ్యాప్తములగు నరణ్యములు, పశ్చిమభాగమున నున్నతమై కనఁబడుచున్న దేశము వారికి నేత్రపర్వాయమానమై యుండెను. అన్నిఁటికంటె జగత్పావనమైన జగన్నాథస్వామియాలయము సందర్శింపనగువన్న యాశ వారిహృదయముల నానందభరితములు చేసి, మనస్సుల నుత్సాహపూరితములు చేసెను.

శరచ్చంద్రునిగుఱ్ఱము బావగారిపల్లకివెనుక మెల్ల మెల్లఁగా నడచిపోవుచుండుటచేత నతఁడా ప్రకృతిసౌందర్యమును గన్నులపండువుగాఁ జూచి మహానందము నొందుచుండెను. అందువలన నా ప్రయాణము శరచ్చంద్రునకుఁ గలుగఁజేసినంతయానందము తక్కినవారి కెవ్వరికిని, జగత్కిశోరరాయులకు సైతము కలిగించి యుండదు. ఇట్టియానందము నొందుచుండినప్పటికి శరచ్చంద్రుని మనస్సునుండి యతనికి గలిగినయాశాభంగము నిర్మూలింపబడదయ్యెను కాని కలకత్తాలోఁ దనజీవితమును మిక్కిలి దుఃఖభాజనము జేసిన విషయము లిక్కడ లేవు. ఇచ్చట నేకాంతముగ నతఁడు తన పూర్వవిషాదకరచరిత్రమును గూర్చి తలపోయఁ జొచ్చెను. నిరాశను నిశ్శబ్దముగ నిబిడము చేసికొనఁ గలిగెను. తన పూర్వస్థితికిఁ బ్రస్తుతస్థితికి నడుమ మహాంతరాయములు ప్రవేశించెను. జీవించుట వ్యర్థముగాఁ దోఁచెను. గంటగంటకు నతనియెదుట నొక భువనమోహనవిగ్రహము నిలిచి క్షణకాల మతని కూరటఁ గలిగించుచు వచ్చెను. కాని యావిగ్రహము స్పృశియించుటకు వీలు లేనిపవిత్రదేవతావిగ్రహమై, యామరణస్మరణీయమై యుండెను. అందుచేత నతఁడు దృఢతరోత్సాహపూరితులయ్యు విఫలమనోరథు లైన యనేక యువజనులవలె యావజ్జీవ మామెనే స్మరియించికొనుచు దేశద్రిమ్మరియై యుండ నిశ్చయించుకొనెను.

రాణిగంజినుండి పదియైదుమైళ్ళదూరమున గంగాజలఘాటీ యనుచిన్న గ్రామముండెను. ఆబాటసారు లాదినమున నక్కడ నిలిచిరి. శరచ్చంద్రుఁడు గుఱ్ఱము దిగి, చేయూఁత యిచ్చి కిశోరరాయలను బల్లకిలోనుండి మెల్లఁగా దింపెను. కాళి బసలో పక్కవేసి భర్తను గనిపెట్టుకొని యుండెను.

సూర్యాస్తమయమైన కొంతసేపటి కతఁడు నిద్రించెను. అతనితల్లి వంటయింటిలోఁ బని తెమలక యచ్చటనుండి రాకపోవుటచే రోగిదగ్గఱఁ గనిపెట్టుకొని కాళీశరచ్చంద్రులు మాత్రమే యుండిరి.

"తమ్ముఁడా! నీవు సుధను వివాహము చేసికోవలె నని ఆలోచించు చున్నావఁట నిజమా? పాపమది యాధీనముతప్పినపిల్లకదా? వితంతువును వివాహ మాడవచ్చునా? మనవంశమున కది కళంకము తెచ్చును సుమీ!" యని యామె పలికెను.

"అమ్మకూడ నట్లేయన్నది. అందుచేత నాసంబంధము విడఁగొట్టుకొన్నాను. చలచిత్తుఁడని, పొరపాటుచేసినాఁడని నీతమ్మునిమీఁదప్రేమ నీవు కోసివేసి కొందువా అక్కయ్యా!" యని యాతఁడు బదులుచెప్పెను.

"తమ్ముడా! నీమీఁదిప్రేమ నేను కోసివేసికొనఁగలనా? అమ్మయు నాన్నయు నన్ను గన్నట్లే నిన్నుమాత్రము గన లేదా? తమ్ముఁ డక్కకు ప్రేమాస్పదుఁడు గాక మఱి యొకలాగుండునా?"

మనోవేదన గలిగించునావిషయమై యక్కకుఁ దమ్మునకు జరిగినసంభాషణ మంతే. కాశి యామాట మరల నెన్నఁడెత్తలేదు.

మొదటినాఁటియుదయమువలెనే రెండవనాఁటియుదయము కూడఁ బ్రభా వంతమై యానందకరమయ్యెను. చెట్లమీఁదను గడ్డిమీఁదను నాణిముత్యములవలె మంచుబిందువులు వెలయుచుండెను. మంచుకురియుట మానినతోడనే వెచ్చని సూర్యరశ్మి వ్యాపించిన తోడనే బాటసారులగుంపు గంగాజలఘాటినుండి బైలుదేరెను.

బాట క్రమోన్నతమైన దేశముగుండఁ బోవుటచేతఁ బ్రకృతిసౌందర్యము నేత్రమునకు మనోజ్ఞమై, దర్శనీయమై యుండెను. పల్లపుభూమి యంతయు జాగ్ర తగా సాగుబడి చేయఁబడెను. చేలు పసుపుపచ్చవర్ణము కలిగి పొట్టలు పోసికొని కోఁతకు సిద్ధముగా నుండెను. తక్కినచేల తాతినేలయై యుండెను. ఆనేలలోఁ గనుచూపుమేర నెక్కడఁ జూచిన నడవియే. ఆయడవులలో నెద్దులు దున్నపో తులు తమ కట్టుగంటలు టక్కుటక్కు మని ధ్వనిచేయు, నాకుగుబురుల నడుమఁ గానఁబడకుండఁ బచ్చికమేయు చుండును. అక్కడక్కడ సాగుబడి చేసిన పొల ములు గలగ్రామములు కనఁబడును. కొన్నిచోట్ల గుడిసెలుమాత్రమే కానవచ్చును. తీర్థయాత్రాపరులకు, బాటసారులకు, గావలసినసరకు లమ్మెడియంగళ్ళు దూరదూర ముగా బాటప్రక్కల నక్కడక్కడఁ గొన్ని కలవు. పడమటిదెసను పదియైదు మైళ్ళదూరమున నున్నసుసూనియాపర్వతము సుందరముగా వారి కగపడఁ

జొచ్చెను. దాని కవ్వల నంతకంటె నెత్తైన పాచెటుమాన్యాకొండలు, వాని శృంగములు నభోభాగము నావరించెను.

మూఁడుగంటలు ప్రయాణము చేయునప్పటికి వారు తారకేశ్వర నదివద్దకు వచ్చిరి. ఇదియుఁ బడమటిదెస జనించి హుగ్లీనదిలోఁ గలియుటకై మొదటఁ దూర్పుగాఁ బ్రవహించి తరువాత దక్షిణముగా దిరిగినయొక చిన్ననది. ఇది దామోదరనదికంటె సన్నముగా నుండును. ఈనది దాటి మన బాటసారులు బంకూరా జిల్లాకు ముఖ్యప్రదేశమైన బంకూరాపట్టణమును జేరిరి. ఇటుకతోఁ గట్టిన యిల్లొకటి సౌఖ్యప్రదమైనది జగత్కిశోరరాయని బసనిమిత్త మాగృహాయజమానుఁడిచ్చెను. ఆనాఁటికి వారక్కడ నిలిచిరి.

పదునెనిమిదవ ప్రకరణము.

ఆటవిక బాలిక

వర్ధమానపుజమీందారుఁ డగుజగత్కిశోరరాయల పేరు బంకూరాపట్టణములోఁ బ్రసిద్ధము. పగటిపనులెల్ల ముగిసినతరువాత సాయంకాలపుదీపములు పెట్టినతోడనే గొప్పకుటుంబములోఁ జేరినస్త్రీలు కొందఱు కిశోరరాయనితల్లి దర్శనము చేయుటకునొక్క రొక్కరుగా వచ్చిరి.

“తల్లీ! నీవు మంచిపని చేసితివి. మీకుమారుని జగన్నాథము తీసికొని పోవుట లెస్సయైనపని. మనుష్యులమందులు పనిచేయలేనప్పుడు జగన్నాథదేవుఁడే జాడ్యనివారణము చేయఁగలఁడు. రోగబాధలు పడినవా రనేకులాయనకటాక్షము వల్ల బాగుపడిరి.” అని చూడవచ్చినవారిలో నొకర్తె చెప్పెను.

“అమ్మాయీ! ఆజగన్నాథస్వామి యనుగ్రహించి నాకొడుకునకు రోగ నివారణ చేయవలె నని మీరందఱు దీవించి పొండి. నాకుటుంబమున కాధారము వాఁడే కదా!

వాఁ డెంతో బాధపడినాఁడు: ఈమం దామం దనక యన్నిమందులు మ్రింగినాఁడు. వ్యర్థమైనవి. నేఁటికి మహానుభావుఁడు జగన్నాథస్వామి

యీయాత్ర చేయవలసిన దని యుత్తరువు చేసినాఁడు" అని కిశోరరాయనితల్లి పలికెను.

"అమ్మా! మీరు కలగన్న సంగతి మాకుఁదెలిసినది. భగవంతుని కట్టియను గ్రహముకలిగినది. గనుక మీ రెంతో యదృష్టవంతులు. భగవంతునియుత్తరువు ప్రకారము మీరునడుచుకొనఁ గలిగిరి. గనుక మీరు మిక్కిలియదృష్టవంతులు. జగన్నాథస్వామికో నెలమాచుభాగ్య మందఱికిఁబట్టునా? ఆయాత్ర మేము కూడ చేయవలయు నని చిరకాలమునుంచి యుబలాటపడు చున్నాము. కాని మేము పేద వారము. కాక ప్రయాణముచాలకాలము పట్టును. కర్చెక్కు వగును."

"అవు నది దీర్ఘప్రయాణమే. ఈప్రయాణ మేలాగున సాగునా అని నేను గంపెడుబెంగ పెట్టుకొన్నాను. భగవంతునిదయవల్ల మేము ప్రయాణ మెట్టెట్లో యారంభించినాము. ఇప్పటికి మాఅబ్బాయి మునుపటికన్న బాగున్నాఁడు. పాపముమాకోడలికి నెలదినాలనుండి రాత్రి నిద్ర లేదు. ఒక్కనిముషము పగలైన విశ్రాంతిలేదు. దానికి మగ డంటే యింత భక్తిగాదు. నాకెంతెంతో విధేయురాలు. నామాటజవదాటదు. అటువంటి కోడండ్రు ఈకాలములో సాధారణముగా నుండరు. అహోరాత్రములు నిద్రాహారములు లేక కనిపెట్టుకొని యుండుటచేత, అది పాలిపోయినది. శరీరములో రక్తమాంసాలు లేవు."

"నీవంటి అత్తగారికి భూదేవతవంటి అటువంటికోడలు దొరకక మఱొకర్తె దొరకునా? ఆమె వంశపువిత్తుకట్టె మంచిది. ఈకష్టములో మిమ్ముఁ గనిపెట్టి మీ వెంటవచ్చుటకు మీకోడలితమ్ముఁడు చదువుమానుకొని వచ్చినాఁడని విన్నాను"

"అవునమ్మా! శరచ్చంద్రుఁడు మంచివాఁడు. వినయవిధేయతలు గలవాఁడు. అటువంటి వానిని మనము సాధారణముగాఁ జూడజాలము. కాని పాడుకాలాలు వచ్చి కూర్చున్నవి. కాలేజీలో మనపిల్లలు రేపేమిదుర్బుద్ధులు నేర్చుకొందురో తెలియదు." అనుచుండ శరచ్చంద్రునివిషయమై యామెవిన్న లోకవాద మొకటి జ్ఞప్తికివచ్చెను. వచ్చినతోడనే యామె మెంగ మించుక మాడెను. అతలఁ పంత లోనే యంతరించినందున నామె మఱల నిట్లు పలికెను. అవునమ్మా! శరచ్చంద్రుఁడు జాలిగుండెవాఁడు. పట్టణవాసమువల్లఁ గలుగుపాడలవాటులు దరికి రా కుండఁ గొట్టినాఁడు. ఎల్లప్పుడు నాకొడుకును గనిపెట్టుకొని యుండును. తమ్ముఁడుసైత మంతజాగ్రతగాఁజేయుఁడనుకో. అటువంటికొడుకును గన్నతల్లి

అదృష్టవంతురాలు. రోగబాధ పడుచున్న నాకొడుకును శరచ్చంద్రుఁడు కని పెట్టుకొని యుండి యుపచారము చేయుట చూచినప్పుడు నాకన్నులనుండి నీళ్ళుకారును."

"అటువంటి జాగ్రత ఊరకేపోదు తల్లీ! ఆనాఁటికానాఁడు మీకుమారుడుకు బాగుపడి జగన్నాథస్వామిదయవల్ల పూరినుండి వజ్రశరీరముతో హాయిగా మరలివచ్చును. తరువాత మనుమలు పుట్టినదాక నీవు బ్రతికి యుందువు."

"అమ్మాయీ! మమ్ముగుఱించి యిటువంటి మంచికోరికలు కోరినందుకు నీమీఁదదేవునికి దయ యుండవలెను. నేను పెద్దదానను. మాఅబ్బాయికి జబ్బు కుదిరినతరువాత మాయింటిపెత్తణము మాకోడలే చేయవలెను. నేను జగన్నాథ స్వామివారిపాదములవద్దనే యింకమీఁద బ్రతికియున్న నాలుగురోజులు గడపెదను."

"అమ్మా! మీరుబంకూరాలో ఎంతకాల ముందురు? తిరిగి రేపువచ్చి మీదర్శనము చేయఁగల మమ్మా!"

"ఇక్కడెంతోకాల ముండుటకు వీలు లేదమ్మా! పూరి చాలాదూర మున్నది. మాఅబ్బాయి దేహస్థితినిబట్టి చిన్నచిన్నమజిలీలు చేసికొనుచు వెళ్ళవలెను. పూరివెళ్లుటకు పదియేనుదినములు పట్టు నని చెప్పుచున్నారు. అటువంటి యాత్ర వెళ్ళదలంచుకొన్నప్పుడు దారిలో ఆగుటకు వీ లెట్లుండును."

ఈవిధమున నెడతెంపు లేనియీసంభాషణము రాత్రి ప్రొద్దుపోవువఱకు జరుగుచుండఁ జూడవచ్చినస్త్రీలొక్కొక్కరుగా జారిరి. అప్పుడు కిశోరరాయనితల్లి వంటయింటికిఁ బోయెను. ఒకత్తెమాత్రము వెళ్ళక కనిపెట్టుకొనియుండెను. అది పదునాలుగు, పదియైదుసంవత్సరములవయస్సు గలబౌరీజాతిబాలిక. అది తక్కువజాతిది గావున లోపలికి వెళ్ళ లేక గుమ్మముముందఱ నున్నవసారాలోఁ గూర్చుండెను. వర్ధమానపట్టణమునుండి గొప్పకుటుంబము యాత్ర వెళ్ళు చున్నదని విని యామెగూడ వారినిఁజూచి దండముపెట్టి పోవుటకు వచ్చెను.

అప్పుడు జగత్కిశోరుఁడు గాఢనిద్రలో నుండెను. గుమ్మమువద్ద నెవరో బాలిక కూర్చున్నదని మగనిపక్కవద్దనుండి కాళి గ్రహించి యామెవద్దకుఁ బోయి, కృపారసమొల్కుసహజమృదుభాషణములతో నామెను బలుకరించెను.

కాళి యడిగినమాటల కామె యిట్లనియె.

"అమ్మగారూ! నేను బారిజాతిపేదదానను. మీరు వర్ధమానమునుండి వచ్చుచున్నారని జగన్నాథము యాత్ర వెళ్ళుచున్నారని విన్నాను. అమ్మా! నేను మిమ్ము చూడవలెనని యనుకొన్నాను. నా పెనిమిటి వర్ధమానములోనే పని చేయుచున్నాఁడు. నే నిక్కడ పొట్టగడుపుకొనలేక ఒంటిగా నున్నాను. పెనిమిటిదగ్గఱకు వెళ్ళవలెనని యున్నది."

"బిడ్డా! నీకథ యేమిటో చెప్పు. సంసారములో బాధలు మన కందఱకున్నవే నా చేతనైనయెడల నేను సాయము చేయుదును."

"అమ్మగారూ! మీ రెంతో మంచివారు. లేకపోతే బారిజాతిదానితో చనువిచ్చి మాటలాడుదురా? పూర్వము మేము కొంచెము కలిగి యున్నవాండ్రమే. మా నాయన పడమట ఉండినాఁడు. అమ్మా! ఈపట్టణమునుండి సుసూనియాకొండ మీరుచూడఁగలరు. అక్కడనే మేము చిన్నపల్లెలో ఉన్నాము. మా నాయన పొలముదున్నుకొని జీవించినాఁడు. నేను చిన్నపిల్లనైనప్పుడు మాయమ్మ నన్నుఁ దీసికొనివెళ్ళి పొలములలోఁ బనిచేయుట నాకు జ్ఞాపకమున్నది."

"పిల్లా! మీయమ్మ ఆఁడదికదా పొలములో ఏలాగునఁ బని చేయగలిగినది?"

"అమ్మగారూ! ఎఱుఁగరు కాఁబోలు. బారిజాతిఆఁడవాండ్రము గనుక మేమెల్లప్పుడు పొలములలోఁ బనిచేయుచుందుము. మేము హిందువులస్త్రీలవంటి వారము కాము. పొలములలోఁ బని చేసికొని బ్రదుకుచుందుము. మామగవాండ్రు నేలదున్నుట మొదలైన మోటపనులు చేయుదురు. తొలకరించినతరువాత ఊడుపు రోజులు వచ్చినప్పుడు ఊడుపుపని మాకు వదలివేయుదురు. బారిజాతి ఆఁడవాండ్ర వలె ఆ కూడ్వఁగలవారు మగవాండ్రలోఁ గూడ లేరు. మేము మోకాలులోతు నీళ్ళలో నిలువఁబడిహోరున వాన గురియుచున్నను, పెళ్ళున ఎండ గాయుచున్నను ప్రొద్దున సాయంకాలము వంచిననడు మెత్తకుండ ఊడ్వఁగలము."

"ఆలాగే నేనును విన్నాను. బంకూరాలో బారిజాతివాండ్రు ఎక్కువగా నున్నారు కాఁబోలు?"

"అవును నిజమే. ఈజిల్లా బారివాండ్రకు నివాసము. తక్కినజాతివారికంటె మాజాతివారే యిక్కడ ఎక్కువయున్నారు. మా నాయన మాజాతిలో కెల్ల మంచివాఁడు. వాఁడు మాయూరికి పెత్తనదారు. వాడు నేల దున్నుకొని పన్ను లిచ్చుకొనెను. అమ్మగారూ! ఆదెల్ల పోఁగొట్టుకొన్నాము."

"ఏలాగున పోయినది?"

"అమ్మగారూ! ఏలాగునా? పదేండ్లక్రిందట ఆకాశముమీఁదనుండి వాన ఒకచుక్కైనపడలేదు. అప్పుడు దేశములో గొప్పకఱవు వచ్చినది. మానాయన దుఃఖములో మునిఁగిపోయినాఁడు. వాఁడు బాధ తప్పించుకొనుటకు, పని సంపాదించుకొనుటకు గ్రామము విడిచి వెళ్ళిపోయినాఁడు. వెళ్ళినతరువాత ఒకవారము చూచినాము, ఒకనెల చూచినాము, అతనిజాడ మాకుఁ దెలియలేదు. ఇంటిదగ్గఱ మేము ఉపవాసము చేసినాము. కొన్నాళ్ళుపోయినతరువాత ముసలివాఁడొకఁడు మానాయన చచ్చిపోయినాఁడని వార్త చెప్పినాఁడు. ఉత్తరదేశములో ఎక్కడో సర్కారువారు కఱవుగొట్టువాళ్ళకుఁ బెట్టినసత్రములో పడి చచ్చినాఁడఁట."

"పాపము నీవు చిన్నప్పుడే తండ్రిలేనిపిల్లవైతివి కాఁబోలు?"

"అవును నాకప్పుడైదేండ్లున్నవి. అప్పుడు మాయమ్మ ఇంటింటికి వెళ్లి బిచ్చమెత్తి మమ్ము రక్షించినది. దొరకనంత తిని లేనప్పుడు పస్తుపండుకొని ఎన్నో నెలలు గడిపినాము. ఏదోతిని దినము గడుపుకోవలెనని మేమెన్నోసారులు కాయలు దుంపలు తెచ్చికొనుటకు అడవులకుఁ బోయితిమి. ఆలాగుండఁగాఁ గొన్నాళ్ళకు కఱవుకాలము వెళ్ళిపోయినది. మంచిరోజులు వచ్చినవి. భాముడయ్యవల్ల భూములు తెగపండినవి.

"పిల్లా! ఈభాడును మీరు పూజ చేయుదురు కాఁబోలు! అతఁడెవరు?"

"అమ్మగారూ! మాపంటలు పండించుదేవుఁడే అతఁడమ్మా! మాకన్నము బట్టయిచ్చి తనబిడ్డలలాగున మమ్ము రక్షించువాఁడాయనే. మాజాతిఆఁడవాండ్రు పంటకాలములో ఆయనమీఁద రోజురోజూ కావలసినన్ని కీర్తనలు పాడుదురు. ఆయనకు మేమెన్నోయుత్సవములు చేయుదుము."

"పిల్లా! ఏ పేరుతో పిలచిన నేమి? మీకన్నవస్త్రము లిచ్చి పంటలిచ్చి మిమ్మురక్షించునట్టి ఆదేవుఁడు మీ మొఱ లాలకింపఁడా?"

"వినకేమితల్లీ! ఆయన జాలిగుండెవాఁడు. మనమే పాపాత్ములము. పాపములుచేసి మనబాధలు మనమే తెచ్చికొందుము. పంటకాలములో మామగవాండ్రందఱు తెగత్రాగుదురు. పండినపంటలు, తెచ్చుకొన్నడబ్బు త్రాగుడుక్రిందనే పాడుచేయుదురు. మామగవాండ్రు సారాత్రాగుట మానుకొనువఱకు మేము హిందువులవలె మంచివాండ్రము కాలేము."

"మీవాండ్రు త్రాగునది వంటసారాలా?"

"అవునుతల్లీ! అదే వాండ్రను పాడుచేసి చంపివేయునది. పూర్వకాలమున బారివాండ్రు తమ సొంతగ్రామములో మంచి కల్లు తీసికొని త్రాగుచుండెడి వారని మానాయన చెప్పుచుండెడివాఁడు. అది యంతచెడ్డదికాదు. అది తిక్కరెత్తించినను దానివల్ల బలముకలుగుచుండెడిది. అదొకవిధమైన యాహారమే. ఈరోజులలో అయిదుమైళ్ళ కొకచోట, పదిమైళ్ళ కొకచోట సారాదుకాణము. మామగవాండ్రు ఎక్కువనిషా గలసారా త్రాగుటకే ప్రయత్నింతురు. సారా బలముచేయదు. అది యాహారము కాదు అది విషము. అది మనుష్యులను జంపి వేయును."

"పిల్లా! నీమాట నిజము. మీవాండ్రు ఎంతత్వరగా త్రాగుట మానివేయుదురో అంతమంచిది. హిందువులలో మహమ్మదీయులలోను వంటకాపులను, కూలి వాండ్రను చూడుము; వారు త్రాగరు అందుచేత సొమ్ము పోగుచేయుదురు. మీర డవిమనుష్యులు. హిందువులు తురకలు చేసినట్లే మీరుకూడ చేయవలెను."

"మాయమ్మ బ్రతికియున్నప్పుడు ఈలాగుననే చెప్పుచు వచ్చినది. అది నాపెండ్లిచేసినదాక బ్రతికియున్నది. నాపెనిమిటి పెండ్లికాఁగానే మాయూరు విడిచి పోయినాఁడు. నాఁటికి నేఁటికి మఱలఁగనఁబడ లేదు. పాపము నాతల్లి కూడఁ జచ్చిపోయినది. నేనిప్పు డేకాకిని దిక్కెవ్వరును లేరు." అని యాపేద బాలిక చేర మొగముపై వైచికొని యేడ్చెను.

"పిల్లా! ఎందుకేడ్చెదవు? నిజముగా నీపెనిమిటి బ్రతికియున్నాఁడా? నీకతఁడు కనఁబడునా?

"అమ్మగారూ! బ్రతికియున్నాఁడు. వర్ధమానములో నున్నాఁడు అని వర్ధమానమునుండి వచ్చినమనుష్యులు చెప్పినారు. అతఁడక్కడ కాపుర ముండఁబోలు! అందుచేత నన్ను మఱచిపోయెనేమో? అమ్మగారూ! మీరు తిరిగి వర్ధమానము వెళ్లుదురు కదా? ఈపేదదానియవస్థ కొంచెము మనస్సులో జ్ఞాపక ముంచుకొంటిరా మీవల్ల నాకెంతో సాయమగును."

"పిల్లా! నాచేతనైనపక్షమున ఆలాగే చేసెదను. నీపెనిమిటి నిన్ను రమ్మని కోరినపక్షమున నీవు వర్ధమానము వత్తువా?"

“అమ్మగారూ! తప్పక వచ్చెదను. ఈయూరిలో నామొగము చూచువారే లేరు. నేను బంకూరావఱకు నడిచి వచ్చినాను. ఈపైకి వెళ్ళలేను. నాదగ్గఱ డబ్బు లేదు. పైగా నాపెనిమిటి నన్ను గుర్తుపట్టునో లేదో. మీరు వర్ధమానము తిరిగి వెళ్లినతరువాత ఈపేదబాలికదానిమాట కొంచెము జ్ఞాపక ముంచుకొంటిరా మీకెల్లప్పుడు బాగుండవలెనని దేవునకు దండములు పెట్టుకొందును.”

“ఇటువంటి మంచికోరికలు కోరినందుకు దేవుఁడు నిన్ను రక్షించును. పేదవాండ్ర మొఱలు భగవంతునకు దేవాలయములలో మంత్రములకంటె ముందుగా వినఁబడును. పిల్లా! ఈరూపాయి పుచ్చుకో. మేము జగన్నాథము నుండి వచ్చువఱకు ఈరూపాయి ఖర్చుచేసికొని బ్రదుకు. నాపేదబాలికస్నేహితురాలిని నేను మఱచి పోనులే.”

పందొమ్మిదవ ప్రకరణము.

అడవికోట.

మూఁడవనాఁడా బాటసారులగుంపు రమారమి యైదుగంటలు దీర్ఘప్రయాణముచేసి విష్ణుపురము జేరెను. ఈయూరు చిరకాల మొకచిన్న రాజ్యమునకు రాజధానియై యుండెను. ఇప్పు డది యొక కుగ్రామము. అందలికోట యడవిలో మాటుపడియున్నది. చుట్టునున్న కందకము నానావిధములైన మొక్కలతో నిండియున్నది. పురాతనదేవాలయములు, రాచనగళ్ళు నాశనములైనవి. ఉన్నతములైన బురుజులు, విశాలములైన ద్వారములు నాశనములో సైతము ఒకవిధమైన గాంభీర్యమును జూపుచుండును. హిందూదేశ మిప్పటికి నిట్టిపాడుకోటలతో నిండియున్నది. ఇవి యన్నియుఁ బూర్వపురాజుల యౌన్నత్యమును, బరస్పరయుద్ధములను జ్ఞప్తికిఁ దెచ్చుచుండును. అటువంటి పాడుప్రదేశములలో విష్ణుపురములో మనస్సునకు నచ్చునది గంభీరమైనది మఱియొకటిలేదు.

ప్రశాంతమైన యీగ్రామమునందు హిందూసబ్ మేజస్ట్రీటొకఁడు కచేరి తీర్చియుండెను. అతఁడు పూర్వము జగత్కిశోరరాయల నెఱిఁగి యుండుటచేత సకుటుంబముగా నాయన జగన్నాథయాత్ర వెళ్ళుచున్నవార్త విని, వారిని సగౌర

వముగాఁ దన యింటికిఁ దోడ్కొనివచ్చి వారికి సకలసౌఖ్యములు కలుగు నట్లేర్పాటుచేసెను. అతఁడు ప్రత్యేకముగా స్త్రీల కొకగది యిచ్చి రోగికి మఱియొకగది యేర్పాటుచేసెను. మఱియొకగది లేకపోవుటచేత నారాత్రి శరచ్చంద్రునిఁ దనగదిలోనే పండుకొనఁబెట్టుకొనెను.

సాయంకాలము చల్లఁబడినతోడనే మేజస్ట్రీటు శరచ్చంద్రుని దోడ్కొని పోయి పాడుకోట చూపెను. అది పూర్వము పెద్దపట్టణము. దానిచుట్టు రమారమి యేడుమైళ్ళప్రాకారముండెను. నడుమనడుమ బురుజు లనేకములు కలవు. ఈచుట్టు గోడలలోపల పట్టణముండినది. పాడుపడుచున్న యిటుకమేడలు మిద్దెలిప్పటికినిఁ గానఁబడుచున్నవి. ఈపాడుపట్టణములో సగము పాడుపడి, యడవి మొక్కలతో నిండినదేవాలయము లెన్నోగలవు. శోధించి త్రవ్వి వెదకువారి కిప్పటికి గొప్పగొప్ప ధాన్యపుగాదులు కట్టినచోట్లు కనఁబడును. సమీపారణ్యములోఁ బండ్రెండడుగులన్నరపొడవు గలిగి పదియొకండంగుళముల పాతిక కైవారముగలకన్నము గలిగిన ఫిరంగియొకటి యున్నది. ఈఫిరంగి సగమిసుకలోఁ గప్పఁబడియున్నది కాని రెండువందలయేండ్లనుండి గాలితాపులు, వానదెబ్బలు తగిలినను లోహము త్రుప్పుపట్టలేదు. చేత చెడిపోవలేదు.

ఆవనప్రదేశములలోఁ దిరిగి, లోపలిపట్టణముయొక్క సింహద్వారముదాటి వెళ్ళునప్పటికి వెనుక ననేకశతాబ్దములా పట్టణమేలిన రాజులవంశస్థుఁ డొకడు శరచ్చంద్రునకుఁ గనబడెను. అతఁడిప్పు డాస్థలమందే కాపుర ముండెను. కాని రాజ్యహీనుఁడై, దీనుఁడైయుండెను. పూర్వ మతిప్రబలమై యుండిన రాజవంశముయొక్క మొలకయై, శిథిలమైన తమ పూర్వరాజధానియొక్క పాడుగోడల లోనే వసించు చుండిన యాపేదపురుషునిఁ జూచి యాతని పితృపితామహుల యాత్మ లెంతశోకించుచున్నవో కదా! విష్ణుపురరాజ్యము దానికి సంబంధించిన భూములుకూడ నన్యాక్రాంతములైనవి. అందుచేత జగమెల్ల మఱచిపోయిన యారాజవంశముయొక్క సంతతివాఁడగు నీపురుషుఁడు దారిద్ర్యముతో దినములు వెళ్ళఁబుచ్చు చుండెను. బ్రిటిషుగవర్నమెంటువారతని కొక చిన్న యుద్యోగము నిచ్చిరి. మూర్ధాభిషిక్తులవంశస్థుఁడైన యాపురుషుఁడు ప్రస్తుత ప్రభుత్వమువారనుగ్రహించి తనకుఁ జేసినమహోపకారమున కెంతయుఁ గృతజ్ఞుఁడగుచు, దినమంతయుఁ బాటుపడి తనయుద్యోగధర్మమును శ్రద్ధతో నెఱవేర్చు చుండును.

ఆచిన్న యుద్యోగస్థునిఁజూచి శరచ్చంద్రుఁ డెంతో జాలిపడెను. అతనిని మేజస్ట్రీటు రాత్రి తన యింటికి భోజనమునకు రమ్మని పిలిచెను. మూఁడు

దినములు ప్రయాణము చేయునప్పటికి జగత్కిశోరుని దేహస్థితి యెంతో బాగుపడెను. మేజస్ట్రేటు పూర్వరాజవంశపు సంతతివానిని వెంటఁబెట్టుకొని సాయంకాల మింటికి వచ్చునప్పటికి కిశోరరాయలు పడకకుర్చీమీఁదఁ గూర్చుండెను.

వారు రాఁగానే యతఁ డిట్లనియెను. "ఈపూర్వసంస్థానముల చరిత్రలు కనుగొనవలెనని నాకభిలాష మెండు. కాని యీప్రాంతకోటగోడ లన్ని చూచుటకు నాకు శక్తిలేదు. ఇటువంటి యుత్కృష్టహతశేషములు గలరాజవంశములు బంగాళాదేశములో మిక్కిలి స్వల్పములు."

అనవుఁడు రాజవంశస్థుఁడు "మామీఁద మీ కెంతో దయ యుండుటచే నట్లనుచున్నారు. మామందిరములు నేలమట్టములైనవి. మా దేవాలయములు దిబ్బలగుచున్నవి" యని పలికెను.

"ఈపాడుదిబ్బలే మీవంశముయొక్క గొప్పతనమును జ్ఞాపకము చేయుచుండును. రెండువందలయేండ్లక్రిందట వర్ధమానరాజకుటుంబము, వీరభూమి రాజకుటుంబము, విష్ణుపురరాజకుటుంబము బంగాళానవాబుక్రింద విశేషరాజ్యములు సంపాదించి గొప్ప ప్రభుత్వములు చేసియుండెననియు, నందులో విష్ణుపుర మెవరికిఁ దీసిపోక విశేషప్రఖ్యాతిఁ బడసెననియు వింటిని."

"మీరట్లనుకొనవచ్చును గాని వర్ధమానవీరభూమి సంస్థానములు మాసంస్థానముతోఁ బోల్చి చూచినప్పుడు నిన్నమొన్నటివి."

"మీసంస్థాన మంతపురాతన మైనదా? దానిచరిత్ర మీనోటనే వినవలెనని కుతూహలపడుచున్నాను. ఎందుచేత ననఁగా దానిపూర్వవైభవము చక్కఁగాఁ దెలిసినవారు, చెప్పగలవారు మీరే."

"అయ్యా! ఆచరిత్ర మిక్కిలిదీర్ఘమైనది. అదియుఁగాక మావంశచరిత్రనే చెప్పుకొనుట భావ్యము కాదు."

"కాదు కాదు. నేను మీవలననే వినఁగోరుచున్నాను. నేను కుర్చీమీఁదఁ గూర్చుండఁగలిగి చాలకాలమైనది. పుట్టెడురోగపడి లేచినవాని కించుకవినోదముఁ గలిగించుటకై యీపురాతనచరిత్ర నాకెఱిఁగింపుఁడు. ఒకగంటకాలము దీనిక్రిందఁబోవును. అంతలో మీభోజనముకూడ సిద్ధమగును. నాకు నిద్రవేళకూడ నగును."

రాజవంశస్థుఁడు తనవంశచరిత్రము చెప్పుట కది నూఱవపర్యాయ మైనను విసుగులేక చెప్పఁదొడఁగెను. జగత్కిశోరుఁడు కుర్చీమీఁదఁ జేరఁబడి వినెను. ప్రాచీనవైభవసూచకము లగుజీర్ణశేషములను శరచ్చంద్రుఁ డప్పుడప్పుడే చూచి వచ్చుటచేత మిక్కిలి తమకముతోఁ జెవి యొగ్గి సావధానుఁడై గురువు చెప్పు పాఠము వినువిద్యార్థివలె శ్రద్ధతో నాలకించెను. పూర్వకాలచరిత్రలువిను కుతూహలమున జగత్కిశోరునితల్లియు భార్యయుఁ దెరచాటునఁ గూర్చుండిరి.

అతఁడు కథ యిట్లు ప్రారంభించెను.

"మావంశచరిత్రము పుక్కిటిపురాణములతో నిండి యున్నది. కాని మాసంస్థానపుగాథలలో నెట్లున్నదో యట్లు చెప్పెదను. అంతయు విన్నతరువాత కల్పితకథ లేవో, సత్యచరిత్ర లేవో మీరు తెలిసికొనవచ్చును.

వందలకొలఁది సంవత్సరముల క్రిందట ఉత్తరహిందూదేశమందలి మథురాపురప్రాంతములయం దుండెడియొక రాజు పూరీక్షేత్రమునకు యాత్రార్థమై వచ్చెను. అతఁడు తిరిగి పోవునప్పుడు దైవవశమున గర్భవతి యగుతనభార్య దారి తప్పిపోయి యేకాకినియై సంచరించి యొకచెట్టుక్రింద ప్రసవమై కుమారునిఁ గనియెను.

కనినతోడనే యామె చనిపోయెను. ఏవిధమునఁ జనిపోయెనో యెవరికినిఁ దెలియదు. పసిపిల్లవానిని కాస్మీతియావాగ్ది యనువాఁడు తీసికొనిపోయి సంరక్షించి తనకొడుకట్లు పెంచుకొనెను. పిల్లవాఁడు క్రమక్రమముగాఁ బెరిగి పెద్దవాఁడయ్యెను. ఈప్రాంతముల వసియించుబ్రాహ్మణుఁ డొకఁడు బాలునిఁ దనసేవకునిగాఁ దీసికొని పసులకాపరిఁ జేసెను.

ఆచిన్నపసులకాపరి యానాటున నున్నవాగ్దిజాతిపిల్లలతో నాడుకొనుచుండెను. ఒకనాఁ డతఁడు వనములోఁ దిరుగుచు, దారితప్పి యింటి కరుగలేక యలసి సొలసి నేలఁ బండుకొని నిద్రపోయెను. చెట్లయాకులసందునుండి సూర్యరశ్మి యతనిముఖముపైఁ బడెను. స్నేహితులు వానిని వెదకికొనుచు నచ్చోటికి వచ్చిరి. వచ్చిచూచునప్పటికి ద్రాఁచుబా మొకటి నానావర్ణములు గలతనపడగ విప్పి బాలున కెండదగులకుండ గొడుగుగాఁ బట్టెను. ఇది మహారాజచిహ్న మగుటచే నది చూచినవా రందఱు ముందుముం దితఁడు రాజు కాఁగల డని నిశ్చయించిరి.

ఆబాలుని పేరు రఘునాథసింగు. అంతలో నీదేశ మేలుచున్న ముసలిరాజు మృతినొందెను. అతని యుత్తరక్రియలు మిక్కిలిగొప్పగాఁ జేయఁబడెను. అవిచూచుటకు జనులు గుంపులుగుంపులుగా బోయిరి. చూడవచ్చినజనులలో రఘునాథుఁ డొకఁడు. అప్పుడు రాచయేనుఁగు జనసమూహమధ్యమునకుఁబోయి తొండముతో నాబాలకు నెత్తి ముసలిరాజుమృతిచేత శూన్యమైనసింహాసనమునఁ గూర్చుండఁ బెట్టెను. అప్పుడు జనులయక్కజ మేమి చెప్పుదును? బ్రహ్మాండము ప్రతిధ్వనించు నట్లు జనులందఱు ప్రతిధ్వనులు చేసిరి. అంతట మంత్రులు సామంతులు రఘునాథుని రాజుగా నెన్నుకొనిరి. పట్టాభిషేకసమయమున నతఁ డాదిమల్లుఁ డని బిరుదువహించెను.

కథ సాయంకాలము ప్రొద్దుపోవువఱకు జరిగెను. ఆకథకుఁడు రఘునాథుని యనంతరమున సింహాసనమునకు వచ్చినరాజులను గుఱించి చెప్పి, వారు యుద్ధములు చేసినతెఱంగు, నిరుగుపొరుగురాజుల గెల్చినవిధంబు, రాజ్యమును నలుదెసల వ్యాపింపఁజేసినభంగియు వర్ణించెను. అనేకాటవికజాతులతోడను, పురాతన మహారణ్యములతోడను నిండియుండిన యాప్రాంతభూములకన్నిఁటికి విష్ణుపుర రాజులే ప్రభువులై యధికారము చేసిరి.

శతాబ్దము తరువాత శతాబ్దము వచ్చెను. కాని యావంశముయొక్క మహాధికారము రవంతయు సడలక నానాఁటికి దృఢమయ్యెను. బంగాళాదేశమును బాలించిన యాఫ్ఘను ప్రభువులు సరిహద్దులలో నున్నయీసంస్థానము పేరే యెఱుఁగరు. పటానులవిజయధ్వజ మెన్నఁడు విష్ణుపురముఁ జొచ్చి యెఱుఁగదు. బహుదేశపరివ్యాప్తమై, క్రమసన్నాహసమేతమైన మొగలాయిచక్రవర్తుల యధికారము దాదాపుగ నుత్తరహిందూస్థానమం దంతట నాటఁబడెను. మహాపురుషుఁ డైన యక్బరుచక్రవర్తి పదియాఱవశతాబ్దమున హిందూస్థానమును బాలించినపుడు చక్రవర్తియొక్క బంగాళాదేశప్రతినిధికి విష్ణుపురసంస్థానము పేరునకుమాత్రము కొంచెము కప్పము కట్టెను. కాని మొగలాయిరాజ్యము నానాఁటికి క్షీణింపఁగానే వారి సరిహద్దులలో నున్న విష్ణుపురరాజ్యము మఱల నొకసారి విజృంభించి సంపూర్ణ స్వాతంత్ర్యము ననుభవించెను.

తరువాత పదునెనిమిదవశతాబ్దమున మావంతు వచ్చినది. తత్క్షణమున మహారాష్ట్రులు విజృంభించినపుడు ఫలవంతములైన బంగాళాదేశపు బయళ్ళను జయించుటకీయరణ్యమార్గద్వారమున రఘోజీభాన్స్లే యసంఖ్యాకములైన తన గుఱ్ఱపు

దళములను బంపెను. మేము మడమదిరుగక నిలిచితిమి. ఎన్నిసారులో పోరాడితిమి. కొండదారులు కాచుటకై కావలుల నియమించితిమి. వారిపేరు ఘాట్వాలాలు. ఆదినములలో మహారణ్యము లహర్నిశము యుద్ధరవములచేఁ బ్రతిధ్వను లిచ్చె ననియు కూసీనదీ తీరమందలి దట్టంపుటడవులయందు, మఱి యితరవనములందును బలుమాఱు గండడికయ్యములు జరిగిన వనియు పెద్దలు చెప్పుదురు.

రఘోజీభాన్స్లేయొక్క సేనాపతి యగుభాస్కరపండితుఁ డొకనాఁ డబ్బాటుగ విష్ణుపురద్వారములవద్ద సైన్యసమేతుఁడై నిల్చెనఁట. అప్పుడు మేము కోటతలుపులు మూసితిమి. బురుజులమీఁద మనుష్యుల నెక్కించితిమి. ఫిరంగులు దట్టించి బారు చేసితిమి. ఆఫిరంగులలోనొకటి నేఁటికినైతము భూమిలో సగము కప్పఁబడియున్నది. మహారాష్ట్ర సేనానాయకుఁడగు భాస్కరపండితుఁ డాఫిరంగి దెబ్బ తగిలి రణరంగంబున బడి చచ్చెనఁట. అది నిజమే.

కాని మహారాష్ట్రులు భయంకరశత్రువులు. వారితోఁ బోరాడుట కష్టము. ఏలయన మరాటి గుఱ్ఱపురౌతులు, మెఱుపుతీగెలు, లేడిపిల్లలు వారు మావలెనే కొండకనుమలన్నియు నెఱుఁగుదురు. వారికి దెలియనిగొందులు లేవు. ఉప్పెనవలె వారు విజృంభించి వచ్చి వెంటనే మాయ మగుదురు. అయినప్పటికి మేము వెనుకంజ యిడక ఱాళ్ళవలె నిలిచితిమి. ఏలయన మాబురుజులు గట్టిగా నున్నవి. ఫిరంగులు కాల్చువారు గురితప్పనివారు. మాశత్రువులు మహారాష్ట్రులు మాత్రమే కారు. మాకు సహజశత్రువైన వర్ధమానసంస్థానముతోఁ గూడ మేమనేక యుద్ధములు చేయవలసివచ్చెను. మహారాష్ట్రులు మాపై నెత్తివచ్చినప్పుడు వర్ధమానరాజు సమయమదేయని మానాశనము నిమిత్తము వారితోఁ గలసి కుట్రఁ జేసెను. ఇట్లనేకశతాబ్దములు ప్రభుత్వముచేసి విష్ణుపురసంస్థాన మిద్దఱువిరోధుల యిరుమనఁ బడి నశించినది. విస్తీర్ణమైన మాసంస్థానము కొంతవఱకు వర్ధమానప్రభువుల పాలఁబడెను. తక్కినది శత్రుప్రభువులు పంచుకొనిరి. మావంశముయొక్క యధికార మంతరించినది. మారాజధానియొక్కయు కోటగోడలయొక్కయు శేషములు వానిపూర్వవైభవమును మాత్రము చాటుచున్నవి.”

శరచ్చంద్రుఁడు చెవులు దోరఁబెట్టుకొని వినెను. కాని యారాజవంశస్థుని కథ జగత్కిశోరుని నిద్రపుచ్చెను.

ఇరువదవ ప్రకరణము.

బంధుగృహము.

రెండుదినములు ప్రయాణముచేసి యాబాటసారులు మిథునపురము జేరిరి. మిథునపురము మిథునపురమండలమునకు ముఖ్యపట్టణము. చుట్టుప్రక్కల నుండు పల్లియలలోనిజనంబు లదరిపడునట్లు బోయలు శ్రమనివారణార్థము విసుగు లేక చేయునోంకారధ్వనులతోఁ బల్లకులు పట్టణసమీపము చేరునప్పటికి మెఱియలవంటి దృఢకాయులగునలుగురుమనుష్యులు ప్రక్కదుకాణమువీఁదనుండి వచ్చి పల్లకుల కడ్డముగ నిల్చి యాగవలసినదని కేక వేసిరి. వారిమోటవాలకములం బట్టియు, వారు చేతులం దాల్చినదుడ్డుకఱ్ఱలంబట్టియు విచారించిచూడ పూర్వకాలమున వారు దారులుగొట్టు దొంగ లనుకొనుట కేవిధమైనసందియము నుండదు. కాని దినములు మారిపోయినందున వారు దొంగలు గాక, మిథునపురవాసులలో ముఖ్యపురుషుఁడగుబిపినబిహారిదత్తుయొక్క సేవకులై యుండిరి.

వర్ధమానపురవాసి యగుజగత్కిశోరరాయలును, మిథునపురవాసి యగు బిపినబిహారిదత్తునకును ముఖపరిచయము లేదు కాని యొకరి పేరొకరెఱుఁగుదురు. అంతియేగాక వారిద్దరు కాయస్థశాఖలోనివారగుటచే నేదోమూల వారికి బాంధవ్యము కలిసియుండునని వారు నమ్మియున్నారు. జగత్కిశోరరాయలు మిథునపురమునకు వచ్చునట్టిదినము శరచ్చంద్రుఁడు ముందుగా బిహారిదత్తునకుఁ దెలియఁజేసి తగినబసయు గావలసినయేర్పాటులు చేయవలసినదని వ్రాసెను. అందుచేతనే బిహారిదత్తుయొక్క సేవకులు యజమానునియాజ్ఞాప్రకారము బాటసారులను దత్తుగారివిశాలగృహమునకు దీసికొనిపోవుటకై వచ్చిరి. బిహారిదత్తు కిశోరరాయల నిమిత్తమై ముందుగ మంచము పఱుపు వేయించి వీధిగుమ్మమువద్ద నిలిచియుండి పల్లకి రాగానే కిశోరరాయలను జేయూత యిచ్చి దింపి మెల్లగా బాన్పుఁజేర్చి, స్త్రీలనిమిత్తమై యేర్పడినగదులలోనికి జగత్కిశోరునియాఁడువాండ్రను దీసికొని పోవలసినదని తనదాసీజనము నాజ్ఞాపించెను. వారందఱు కొంచెము విశ్రమించి ఫలాహారము తిని కూర్చుండినతరువాత దీపములు పెట్టిరి. అప్పుడు బిహారిదత్తు స్వభావమధురమైనశీలముతో గుశలప్రశ్న చేయుటకై వారికడను బోయెను.

"అమ్మా! పూరీయాత్రకుఁ బోవుచు మీరు మాపట్టణమును మాగృహమును పావనము చేసినందుకు నాకు మిక్కిలిసంతోషముగా నున్నది. నేను మీకుమారుని గుఱించి విశేషముగా వినియుంటిని. వర్థమానములో నింతటిగొప్పస్థితిలో నింతటి గొప్పస్థితిలో మఱియొకరు లేరు. ఆయనను చూడవలెనని చిఱకాలమునుండి కోరుచుంటిని. నాయదృష్టము చేతనే ఆయనయిక్కడకు విజయము చేసిరి. మీరు నాయిల్లు మీయిల్లుగా భావించి కొంతకాలమిక్కడ నుండవలెనని కోరుచున్నాను." అని యతఁడు రాయలతల్లి నుద్దేశించి పలికెను. అనవుడు నామె మేలిముసుఁగు వైచికొని యిట్లనియెను.

"నాయనా! నీవు మిక్కిలి మంచివాఁడవు. మామీఁద నెంతో దయఁజూపితివి. నీకిటువంటిశ్రమ కలుగఁజేయవలెనని తలఁచుకొన లేదు. మేము మిథునపురములో నొక్కరాత్రిమాత్రమే నిలువఁ దలచితిమి. ఆరాత్రికి మీయింటిసమీపమున నేదోబసకుదుర్తు వనుకొంటిమిగాని నీవిబ్బందిపడి మీయింటిలోనే బసయేర్పఱతు వనుకొనలేదు."

"అమ్మా! ఏదో బసా? మాపట్టణముగుండ మీరు ప్రయాణము చేయుచున్నప్పుడు మీ కేదో అద్దెకొంప తగినబస యగునా? నేను కొంపకట్టుకొని గ్రామములో కాపురము చేయుచుండఁగా నాకుఁగలిగిన ట్లింతగంజియన్నము పెట్టఁగలిగి యుండఁగా మీరు నాయింట బసఁజేయక వేఱొకచోట దిగినపక్షమున నాగృహమున కవమానము గాదా? నాకుటుంబమున కప్రతిష్ట కాదా? పదుగురు నవ్వరా?"

"అలాగే కానీ నాయనా! నీవును నాకు కుమారుఁడవే. నీయింట నుండుట తప్పుగాదు. జగన్నాథస్వామివారి యనుగ్రహముచేత మాజగత్కిశోరుఁడు శరీరారోగ్యము గలిగి చిరంజీవి యగునట్లు దీవింపు నాయనా!"

"అమ్మా! తథాస్తు. నీకొడుకు మంచియారోగ్యము కలిగి వర్థమానమునకు వెళ్లును. మునుపటికంటె మహోన్నతమైనదశ బొందును. మీకుమారునితోఁ గూడ వచ్చినశరచ్చంద్రుఁడు గొప్పవాఁడు. అతఁడు గొప్పవాఁ డగు నని యతని మొగముమీఁదనే వ్రాసియున్నది. అమ్మా! ఆశరచ్చంద్రునిఁ జూచినప్పుడు మాతమ్ముడు భిరాదుకు జ్ఞాపకము వచ్చును. అచ్చముగా నితనిది వాని వయస్సే. అతనివలెనే యితనుగూడ మిక్కిలి మంచివాడు. కలకత్తాలో వీరి కిద్దఱకు పరిచయము గల దని నానమ్మకము."

"నాయనా! వారిద్దఱు దీర్ఘాయుష్మంతులై వర్ధిల్లవలె. నేను చూచినంత వఱకు శరత్తు మిక్కిలి జాలిగుండెవాఁడు. ఈ ప్రయాణములో నాకతఁడు కుమారునికంటె మిక్కిలిగా సకలోపచారములు చేసినాఁడు కాని పసుము పిల్లవాండ్రకుఁ గలకత్తానగరము మిక్కిలి యపాయకరమైనస్థలము. కాలేజీపిల్లలు తాము చేయుచున్నవని యేమో తెలియక నడుచు చుందురు. ఎందుకు? మీతమ్ముఁడు సీమ వెళ్ళినాఁడు కాదా, అతడువచ్చిన తరువాత కులములో చేయునా? భగవంతుఁడు పరిపాలించవలె నాయనా! కాటికి కాళ్ళు చాపుకొనియున్న నావంటిముసలిది యింక నెన్నాళ్ళు బ్రతుకఁ గలదు. ముందుముందెట్టి విడ్డూరములు పుట్టునో చెప్పలేము."

"అమ్మా! విచారించవద్దు. ఆవిషయమై బెంగపెట్టుకొనవద్దు, కుఱ్ఱవాండ్రెప్పుడు కుఱ్ఱవాండ్రే. వాండ్రు తమకుఁ దోఁచినట్లే గాని చేయరు. వారు మంచివారై సరిగా నడుచుకొన్నపక్షమున దేవుఁడే వారికి సాయము చేయును. అమ్మా! నామాటనమ్ము. శరచ్చంద్రుఁడు దేశమున కలంకారుఁడై గొప్పవాఁడై యుండఁగా నీవు చూచెదవు. అంతవఱకు నీవు బ్రదికియుందువు. మాతమ్ముఁడు దేశస్థులలో మొదటివాఁడై పేరుప్రతిష్ఠలు సంపాదించువఱకు మాతండ్రి కూడ జీవించి కుమారునివైభవము చూచునని నానమ్మకము. అమ్మా! వారు వెఱ్ఱిచేష్టలు చేసినను పెద్దదానవు వారినాశీర్వదింపుము. సజ్జనుల యాశీర్వాదములు వ్యర్థములు కావు."

"నేను వారిని మనఃపూర్తిగా దీవించెదను. భువనేశ్వరుఁడైన జగన్నాథస్వామి శరచ్చంద్రుని, మీతమ్ముని దీర్ఘాయుష్మంతులను జేయుఁగాక! వారు వృద్ధిలోనికి వచ్చి సుఖపడుదురు గాక!"

"అమ్మా! మీరిక్కడ కొన్నిదినము లుందురు గాదా? రాణీగంజినుండి చాలదూరము వచ్చినారు. జగన్నాథము మీరువచ్చినంతకంటె ఎక్కువ దూరమున్నది."

"నాయనా! మే మైదుదినములనుండి ప్రయాణము చేయుచున్నాము. మేము తర్వాపడి వెళ్ళవలెను. అందుచేత రేపు ఉదయమే బయలుదేఱవలె ననుకొనుచున్నాము."

"అమ్మా! ఆలాగనవద్దు. ఐదుదినములు ప్రయాణము చేసినతరువాత మీకుమారుఁడు కొంచెము విశ్రమింపవలెను. మిథునపురములో నెన్నోదేవాలయములున్నవి. తీర్థవాసు లిక్కడిదేవతలను దర్శింపకుండ వెళ్ళరు. అధమపక్షము రెండుదినములైన నిలిచి యిక్కడ దేవాలయములను క్షేత్రములను చూచి పొండు. ఈరెండుదినములలో శరచ్చంద్రునకు మాపట్టణములోఁ జూడవలసినచోట్లు చూపెదను. మీకుమారుఁడును రెండుదినములు విశ్రమించినపిదప మఱింతదార్ఢ్యము కలిగి ప్రయాణము సులభముగాఁ జేయఁగలఁడు."

ఆతనికోరిక ప్రకారము వారు రెండుదినములు నిలిచిరి. మఱునాఁ డుదయమున బిహారిదత్తు శరచ్చంద్రుని దనగుఱ్ఱపుబండిమీఁద నెక్కించుకొని షికారు తీసికొని పోయెను. మిథునపురములో నున్నట్లు బండిషికారున కనువైనతావులు బంగాళాదేశములో మఱియొకపట్టణములో లేవు. ఎందుచేత ననఁగా జిల్లాలో సగము కంకరనేల. కాఁబట్టి బాటలు మెత్తగ నుండును. పశ్చిమభాగమునఁ జాల దూరము పోయినతరువాతఁ గంకరబాట నిమ్నోన్నతప్రదేశమున వేయఁబడుటచే నొకచో నెత్తుగ నొకచోఁ బల్లముగ నుండును. చుట్టుప్రక్కల స్థలము లడవివాలకము కలిగియుండును. ప్రశాంతి లేనిపూర్వకాలమున నెవఁడో యొకానొకరాజు కొండ మీఁద కట్టినయొకకోట యాపాడుచోటున కొకవింతగౌరవము గలిగించుచుండును. ఆకొండక్రింద "కూసీ" నది శిలాసైకతమయమైన తనగర్భముమీఁద గళగళప్రవహించు చుండెను. బిపినబిహారిదత్తు మిథునపురవాసులలో ప్రధానపురుషుఁడు. అప్పటిగవర్నరుజనరలుగారగు రిపన్ప్రభువుగారు విశ్వాసపాత్రము లయినజనులమీఁద పట్టణపరిపాలనాభారము కొంతనిలిపి క్రొత్తవిధులఁ గొన్నిఁటి నేర్పఱచి యుండిరి. దత్తు నిర్వహించు చుండినకార్యభారము లనేకములు గలవు. మిథునపురమునిసిపాలిటీకి బిహారిదత్తు చేర్మన్‌గా నియమింపఁబడుటచే నతనిపై మఱియొకక్రొత్తభారము పడెను. షికారువెళ్ళి తిరిగి వచ్చునప్పు డతఁడు మ్యునిసిఫల్ కచ్చేరివద్దనాగెను. ఆజిల్లాలోనియూరోపియన్ మేజస్ట్రీటు ప్రాతఃకాలమున షికారు వెళ్ళి తిరిగి వచ్చుచుండెను. అప్పుడు బిహారిదత్తు ఆయనను జూచి పలుకరించెను.

ఆజిల్లామేజస్ట్రీటునకు బిహారిదత్తుమీఁద నిష్టము, గౌరవము కలదు. అందుచేత నతడు గుఱ్ఱము దిగి మ్యునిసిఫల్ కచ్చేరి పరీక్షించుటకును నించుక సేపు సల్లాపము సేయుటకును లోనికి వెళ్ళెను.

"దత్తా! ఈనడుమ హిందూదేశమునందుఁ బ్రతిభాగమున గొప్పయుత్సవములు చేయుచున్నారని పత్రికలలోఁ జదువుచున్నాము కాదా?"

"ఔనయ్యా! హిందూదేశవాసులు కృతజ్ఞులు. వారిమేలుకొఱకు పాటుపడు నట్టి యుదారశీలునియెడఁ గృతజ్ఞులయి గౌరవ మెట్లు చూపవలెనో వా రెఱుఁగుదురు. రిపన్ ప్రభువువలె జనులహృదయానురాగములు వడసినరాజప్రతినిధి యీతరమున లేఁడు. అట్టిమహాపురుషుఁడు హిందూదేశమునుండి వెళ్ళిపోవుసమయము సమీపించుచున్నది. గావున ప్రజలు తమవిశ్వాసమును డగినవిధముగాఁ జూపఁగోరుచున్నారు."

"ఓ సరిసరి. మఱచిపోయితిని. నీవు రిపన్ పక్షపాతివి గాఁవా?" యని నవ్వుచుఁ బలికెను.

"అయ్యా! నేను రిప్పన్ గారియెడ సంపూర్ణపక్షపాతిని గాను. సగము పక్షపాతిని. ఏలయన నీమధ్య కలకత్తాలో రిపన్ గారివిషయమునఁ గొప్పగొప్పయుత్సవములు జరిగినవి. అవి చూచుటకు వెళ్ళనైతిని కాని నేను నాపిల్లల నంపితిని. కలకత్తానగరములోనదివఱ కెన్నఁడు లేనివిధమున వీధు లలంకరింపఁబడెను. బాణసంచ కాల్పఁబడెను. దీపములు వెలిఁగింపఁబడెను. మాపిల్ల లుదయాస్తమయము లదే గొడవఁ జెప్పుకొందురు. వాండ్రసంభాషణ విన మనకెంతో ముచ్చటగును."

"ఈయుత్సవము లేల జరుగుచున్నవో మీపిల్లలకుఁ దెలియునా?"

"అయ్యా! ఏడేండ్లవయస్సు గలచిన్నపిల్ల నొకదానినిఁ బిలిచి ఈయుత్సవము లెందుకని నే నడిగితిని. "ఎందుకా? రిపన్ ప్రభువు జనులయెడ దయగలవాఁడని, న్యాయవంతుఁడని, యీయుత్సవములు చేయుచున్నారు." అని యాపిల్ల సందేహింపకుండ పెటీలున నుత్తరము చెప్పెను. ఆయుత్సవము చూచిన మగవాఁడు కాని, యాడుఁది గాని, పసిబిడ్డ గాని యీకారణ మేమో యెఱుఁగకుండ నుత్సవముఁ జూచియుండ లేదు. అయ్యా! పసిబిడ్డనోటనుండి వెడలిన యాతొక్కుపలుకులు శిలాక్షరములై మాదేశచరిత్రము నలంకరించును."

"రిపన్ ప్రభువు నేఁడు మహానందభరితుఁడై యుండును. ఉండవలసినదే. ఈపట్టణమునకు సమర్థుఁడైన మ్యునిసిపల్ చేర్మను నిచ్చి రిపన్ ప్రభువు నా కుప కారము చేసినాఁడు. ఈరిపన్ ప్రభువల్ల చేర్మనుల నెన్నుకొనుట కధికారమియ్యఁ

బడినపట్టణము లన్నియు బిపినబిహారిదత్తువంటిసమర్థులనే యెన్నుకొన్నపక్షమున రిపన్ ప్రభువు చేసినమ్యునిసిపల్ స్వపరిపాలనావ్యవస్థ సంపూర్ణముగాఁ బ్రయోజనకారి కావచ్చును.”

“మీకు నామీఁద దయగలదు గనుక నట్లనుచున్నారు. నాశక్యమైనంతపని శరీరము దాఁచుకొనక నేను చేయుచున్నాను. కాని, హిందూదేశజనులు పూర్వకాలమున బుద్ధికుశలతయందుఁ గాని సామర్థ్యమునందుఁ గాని కొఱవడినవారు కారు. ఇంగ్లీషుకళాశాలలలోను, పాఠశాలలలోను మూఁడుతరములనుండి చదువుకొని విద్యావంతుల మైనతఱువాత మేము మాదేశపరిపాలనావిషయములలో జోక్యము కలుగఁజేసికొనుటకు సమర్థులము కాకపోయిన పక్షమున నిజముగా నధమస్థితిలో బడి యెందుకుఁ బనికిరానివార మైపోయితిమని నమ్మవలసినది.”

“నీమాటకొంతవఱకు నిజమే. అధికకృత్యములు మీకు మేమప్పగించినకొలఁది మీవల్ల మేమధికమైనపని పుచ్చుకొనఁగలము. రిపన్ ప్రభువుగారి వ్యవస్థనుబట్టి యేర్పడిన డిస్ట్రిక్టుబోర్డులకు నెన్నుకొనఁబడి వచ్చిన సభ్యులందఱు పనిచేయుట కిష్టము గలవారై మిక్కిలి యుపయోగకారులై యున్నారని నేను చెప్పఁగలను.”

“అంతకన్న నెక్కువమాట చెప్పఁగలను. రాజనీతిలో నిటువంటి యుదారభావప్రదర్శనము జనులమనములలోనున్న యసంతుష్టినిఁ దొలఁగించి హిందూదేశములో బ్రిటిషుసామ్రాజ్యమును స్థిరముగా సంస్థాపించును. మానవప్రకృతి యెల్లచోటుల నొకరీతిగానే యుండును. పరిపాలనలోఁ గొంతభాగము మాకప్పగించినయెడల మేము రాజభక్తిఁ గలిగి రాజ్యతంత్రనిర్వహణము చేయుదుము. అధికారము లేమియు, మాకొసఁగక మమ్ము దూరముగఁ దోలినపక్షమున మేము రాజభక్తిశూన్యులమై విరుద్ధవిమర్శకుల మగుదుము. బ్రిటిషుసామ్రాజ్యచరిత్ర మనము చదివితిమా, దేశస్థులను వ్యవహారదూరులుగఁ జేసినప్పుడెల్ల రాజభక్తిశూన్యత, యసంతుష్టి బయలుదేఱిన వని మనము తెలిసికొనగలము. వారిదేశవ్యవహారములలో వారికిఁ గొంతభాగ మప్పగించినప్పుడు సంతుష్టి, రాజభక్తి మొదలగునవి తత్ఫలములై యుండును.”

“దత్తూ! నీ వింగ్లాండులో నున్నపక్షమున నీవు గొప్పవక్తవై వేదికలమీఁద మహోపన్యాసములు చేయఁగల వని నాకుఁ దోఁచుచున్నది.”

"నేను మహావక్తనుగాను. నేనెన్నఁ డింగ్లాండు వెళ్ళియుండలేదు. కాని, నాగరకతగల యేదేశములోను దేశస్థులచేతిలోఁ గొంతవఱకైన వారి దేశపరిపాలనము లేకపోయినపక్షమున నది మంచిదొరతనము కాదని నాయభిప్రాయము. దేశస్థులకు దేశపరిపాలనవిషయమున నది గొంతప్రవేశ ముండినంగాని యాదేశవ్యవహారములు చక్కఁగా సమర్థింపఁబడవని నానమ్మకము."

"ఇది ప్రశస్తమైన ధర్మవాక్యము. ఉదారశీలురు వ్రాసినయేగ్రంథములో నుండియో నీ వీమాట యేరి తెచ్చితివని నే నెఱుఁగుదును. వాదములు విడిచి యథార్థవిషయములు మాటాడుకొందము. మొగలాయిచక్రవర్తులు, మహారాష్ట్రులు హిందూదేశసామ్రాజ్యము నిమిత్తము పోరాడుకొన్నకాలమునను, నౌకరిపెత్తనము లేకుండ, నౌకరిసెలవు లేకుండ నెవరికివారె యజమానులై పిండారిమూఁకలు దేశమును గొల్లకొన్నకాలమునను మీదేశములో స్వపరిపాలన ముండినదా?"

"పదునెనిమిదవశతాబ్దమున హిందూదేశములో జరిగినకార్యములను గలఁచుకొనకుము. ఏలయనిన యూరపుఖండమునందుఁగూడ నాకాలమున ననేకదేశము లట్లేయుండెను. కొన్ని మాదేశముకంటె హీనస్థితిలో నుండినవి. పందొమ్మిదవ శతాబ్దమునయూరపుఖండములోని దేశములస్థితిగతులు మునుపటికంటె బాగుండుటకుఁ గారణమేమన, బ్రజాసంబంధములుగల ప్రభుత్వములు స్థాపింపఁబడుటయే. హిందూదేశములో మేముకూడ నటువంటి ప్రభుత్వమే కావలయునని కోరుచున్నాము కాని ధర్మగర్హితమైన నిరంకుశాధికార మంగీకరింపము."

"దత్తూ! నీవు తెలివిగలన్యాయవాదివి. నీవు గవర్నమెంటుప్లీడరుగా నుండి నాపనికి మిగులఁ దోడ్పడితివి. యూరపుఖండములోని దేశములు మిక్కిలి హీనస్థితిలోనున్నప్పుడుసైతము స్వపరిపాలనబీజములు కలిగియుండెను. అటువంటిబీజములు మీహిందూదేశములో మొగలాయీలకాలమునను, మహారాష్ట్రులకాలమునను నున్నట్లు నీ ఉదాహరణములు జూపఁగలిగితివేని నీవింతకంటె నెక్కువతెలివి గలవాఁడవని నేనొప్పుకొందును."

"మాకు పూర్వము పార్లమెంటులులేవు. జనప్రతినిధులసంఘములులేవు. డిస్ట్రిక్టుబోర్డులులేవు. కాని దేశములో నున్న సేనాధిపత్యము, పరిపాలకత్వము మొదలయిన గొప్పపదవులన్నియు హిందూసంఘనాయకులకును, మహమ్మదీయసంఘనాయకులకును సమానముగా నియ్యఁబడు చుండెడివి. జమీందారులు వారిసంస్థాన

ములను వారే సరిగాఁ బరిపాలించుకొనెడివారు. గ్రామపంచాయతీలు గ్రామవ్యవహారములను జక్కఁబెట్టుచువచ్చినవి. చక్రవర్తి తమ దర్బారులోఁ గూర్చుండి తెలివిగానో తెలివితక్కువగానో పరిపాలించుచుండెడివాఁడు. అతని ప్రతినిధులు దేశమందలినానాభాగములను బరిపాలించుచుండెడివారు. మహాజనమంతయు బల్లెటూళ్ళలోనే యుండుచు వచ్చినది. ఆమహాజనము పంచాయతీమూలమున తనవ్యవహారము తానే చక్కఁబెట్టుకొనుచు వచ్చినది.”

“ఓహో! నీవు గ్రామపంచాయతీలమాట నెత్తుచున్నావా? నిజమే! మా ప్రభుత్వములో గ్రామపంచాయతీలు నశించిపోయినవని నే నప్పుడప్పుడు విచారించుచుందును.”

“అయ్యా! గ్రామపంచాయతి యనాగరకపద్ధతి కావచ్చునుగాని, ప్రపంచములో మనుష్యు లెఱిఁగిన స్వపరిపాలన లన్నిఁటికంటెఁ బురాతనమై పొగడ్తఁగన్న స్వపరిపాలనవ్యవస్థ యని నిస్సందేహముగాఁ జెప్పగలను. ఈనవనాగరకవ్యాప్తిచేత నది నశించినది. కావున జనులు తమవ్యవహారములను దాము చక్కఁబెట్టుకొనుటకై దానిస్థానమందే దైన నటువంటిపద్ధతి యొకటి మరల దలసూపవలెనని మేము కోరుటసహజము కదా! బ్రిటిషుప్రభుత్వము మాదేశములోఁబుట్టి పెరిగినస్వజాతీయప్రభుత్వముగానే మేము తలంచుట కిష్టపడుచున్నాము. కాని, మీరు బ్రిటిషుప్రభుత్వమును విదేశీయప్రభుత్వముగాను, మాకందరానిది గాను జేయుటకై శక్తివంచన లేక పాటుపడుచున్నారు. ఇట్లు మీరు చేసినంతకాలము బ్రిటిషుసామ్రాజ్యము మాదేశములోదృఢముగా నుండదు.”

“ఇంగ్లీషుపరిపాలకులు మీకోరికలను, మీయభిప్రాయముల ననుసరించి నడువరని మీయభిప్రాయమా?”

“వారట్లు చేయఁదలఁచుకొన్నను చేయఁజాలరు. ఎందుచేత ననఁగా బ్రిటిషువారుహిందూదేశములో జనులతోఁ గలసిమెలసి యుండక వేఱె యింగ్లీషుప్రపంచములోనుందురు. ఈలాగున మీరే నాతోఁ బలుమాఱు చెప్పియున్నారు. వారు తఱుచుఁగా గొప్పగొప్పసెలవులు తీసికొని మాటిమాటికి యూరోపుఖండమునకుఁ బ్రయాణములుసేయుచు హిందూదేశపుజనులతో నెంతమాత్రము గలసిమెలసి యుండరు. వారిలో నెక్కువమందికి జనులపై మిక్కిలి తక్కువసానుభూతి. వారిలో నధికసంఖ్యాకులకు మాయభిప్రాయములమీఁద నల్పగౌరవము. ఇన్నిమాటలెందుకు?

ఈనాటియాంగ్లేయోద్యోగస్థులు పూర్వకాలమందుండిన మన్రో, మాల్కమ్, ఎల్ఫి నిస్టన్ మొదలగుపరిపాలకులకంటె నెన్నోరెట్లు తక్కువవారై యున్నారు."

"ఔను! మేము పూర్వ మున్నట్లుగాక నేఁటికాలమున దారినిఁబోవుపక్షుల వలె మీదేశములో నివసించు చున్నా రన్నమాట నిశ్చయము."

"అందుచేతనే హిందూరాష్ట్రముయొక్క కార్యనిర్వాహకసభయందును, దేశ పరిపాలనయందును మాకు మునుపటికంటెఁ గొంతయధికారముండవలసినయవసరము వచ్చినదని నావాదము. మేము బ్రిటీషుపరిపాలన మంగీకరించి యున్నాము. బ్రిటీషుప్రభువులయదృష్టమే మాయదృష్టము. అందుచేతనే పరిపాలనము స్వజాతీయమై యుండవలయును గాని, విజాతీయమై యుండఁగూడదు."

"దత్తూ! ఈవిషయము నీవు కడుసమర్థతతోఁ జర్చించితివి. ఇది నీయభిప్రాయమే కాదు. విద్యావంతులైనమహాపురుషులయొక్క యభిప్రాయ మంతయు నట్టిదే. నీవంటిపెద్దమనుష్యులు బ్రిటీషుపరిపాలనముతో నభేదభావ మూని దానిలో నైక్య మొందిరనియు, బ్రిటీషుపరిపాలనము శాశ్వతముగా సాగుటవలన మీకుఁ గలిగెడులాభము లేవో, తెలిసి అనుభవసిద్ధముగా మీరు మాట్లాడు చున్నా రనియు నామట్టుకు నేనునమ్ము చున్నాను. కాని దత్తూ! మామీద నభిమానము లేనిమూర్ఖులు, మోటవాండ్రు పలువురు దేశమునందు గల రని నావలెనే నీవు నెఱుఁగుదువు."

"దేశస్థులను గొప్పయుద్యోగములలోనికి రానియ్యక, పరిపాలనవిషయములు వారికందనీయక మీరు నిష్కారణముగా నట్టిమూర్ఖులకు, మోటవాండ్రకు వారి మూర్ఖతవిడంబనమున కవకాశము కలిగించు చున్నారు. మీరు దేశస్థులయందు విశ్వాస ముంచుటవలన, వారిని నమ్ముటవలన మంచియుద్దేశము గలవారని, మతాభిప్రాయము గలవారని సమాదరింప వచ్చును వారిసహాయము, సహకారభావము స్వీకరింప వచ్చును. వెయ్యేల? బ్రిటీషుసామ్రాజ్యము జనసమ్మతమైనదిగాను, బలము కలదిగాను, స్థిరమైనదిగాను చేయవచ్చును. అట్లుచేయక హిందూదేశస్థులను గొప్పపదవులనుండి వెలివేసి, విశ్వసింపక పోవుదు రేని రాజభక్తి కలిగి మిత వాదములు చేయువారినిఁ గ్రుంగఁద్రొక్కుదురు. గౌరవహీనులఁ జేయుదురు. అసంతుష్టులై, రాజద్రోహులైనవారి యాటలు సాగనిచ్చెదరు. ఇదివఱకెన్నఁడు గని విని యెఱుంగనిమహాపాయమును మీ చేతులార మీరే నిర్మించుకొందురు.

మంచిదారి ద్రొక్కుదురో, చెడ్డదారి ద్రొక్కుదురో మీయిష్టము. సమయము వచ్చినది.''

ఆపలుకులు విని జిల్లామేజస్ట్రీటు నిమిష మాగి యాలోచనపూర్వకముగాఁ మెల్లగ నిట్లనెను. "దత్తూ! నీమాట సరి కాదని నేను నిశ్చయముగా జెప్పజాలను. ఇంగ్లీషువారొకసారి మంచిపని యని యేదైన భావించినప్పుడు వారు పట్టుదలతో దానిని తుదముట్టింతురు గాని వెనుకకు దిరుగరు. నాగలిచేతబట్టిరా చివరవఱకు వారు దున్నవలసినవారే. మీకు స్వపరిపాలన మవసర మని వారికి నచ్చవలెను. నచ్చినా, వారి నాపజాలము. నచ్చువఱకు వారిని గదపజాలము. ఐనను నేనిది చెప్పగలను. హిందూదేశమునకు స్వరాజ్యము వచ్చి తీరును. కాని యిది కాలక్రమమున బ్రాప్తించును. సరే! నేనింక వెళ్ళెదను. సలామ్. మీకచ్చేరీ నేడుతనిఖీ చేయలేను. మాటలతో నాలస్యమైనది. నిన్ను జూచినతరువాత మాటలాడక పోజాలను. నీయొద్ద నేదో మంత్రమున్నది. నీవు నన్ను గలిసికొన్నప్పుడు నా కేపనియు దోచదు.''

ఇరువదియొకటవ ప్రకరణము

సామంతరాజు

మిధునపురమునుండి బయలుదేఱి రెండుదినములు ప్రయాణముచేసి యాబాటసారులు సువర్ణరేఖానదీతీరమును జేరిరి. ఈనది బంగాళాదేశమునుండి యుత్కలదేశమును వేఱుచేయుచున్నది. ఈనదికి నుత్తరమున నున్నవారు బంగాళాభాష మాటలాడుదురు. దక్షిణమున నున్నవా రోఢ్రభాష మాట్లాడుదురు. ఓఢ్ర మనఁగా సంస్కృతభాషపుత్రికలలో నొకటి. పదమూఁడవశతాబ్దమున నీనదికుత్తరమున నున్న దేశము పఠానులచేఁ బరిపాలింపబడు చుండెను. కాని, దక్షిణమందున్న దేశము పదియాఱవశతాబ్దము తుదవఱకు హిందూరాజుల యేలుబడిలోనే యుండెను. అప్పుడు మహమ్మదీయు లుత్కలదేశమును జయించిరి. కాని వారు స్వల్పకాలముమాత్రమే పాలింపఁ గలిగిరి. ఏలయన, బదునెనిమిదవశతాబ్దమున మహా

రాష్ట్రు లీభాగమును జయించి మరల హిందూరాజ్యమును నెలకొల్పిరి. పందొమ్మిదవ శతాబ్దమున బ్రిటిషువా రాదేశమును స్వాధీనము చేసికొనిరి. ఈవిధముగాఁ గడచిననాలుగుశతాబ్దములలో నీసరిహద్దునేల యనేక ఘోరకర్మలను బ్రత్యక్షముగఁ జూచెను. ఓఢ్రులకు మహమ్మదీయులకు, మహమ్మదీయులకు మహారాష్ట్రులకు, మహారాష్ట్రులకు బ్రిటిషువారికి జరిగిన సంగ్రామము లన్నియు నీప్రాంతముననె జరిగెను. ఈసరిహద్దులయుద్ధములు జరుపవలసినకాలము గతించినది. సువర్ణరేఖానదీజలము తన పూర్వగౌరవమును స్మరించుకొనుచు నడచుచున్నదియుఁ బోలె మెల్లమెల్లఁగా సాగరమున సంగమించుచున్నది. జగత్కు శోగరాయలు సపరివారముగ దాటుచున్న సమయమున నుదయకాలప్రభాకరుని యరుణారుణకిరణములు సువర్ణరేఖాజలములపైఁబడి తళతళలాడఁ జొచ్చెను. జగన్నాథక్షేత్రము సమీపించినకొలఁది తైర్థికులసంఖ్య క్రమక్రమముగ నధికమయ్యెను. ఉత్తరహిందూస్థానమునుండియు, బేహారుదేశమునుండియు దృఢశరీరులగుమనుష్యులును, బంగాళాదేశపుపల్లియలనుండియు బట్టణములనుండియు గుంపులుగుంపులుగ స్త్రీలును, జగన్నాథము బోవుచుండిరి. హిందూప్రపంచముయొక్క దూరప్రదేశములనుండి స్త్రీలుపురుషులనక సమస్తవిధములైన జనులు సముద్రతీరమందున్న యాక్షేత్రమునకు మందలు మందలుగఁ బోఁజొచ్చిరి. ఒకహస్తము నేకమాసములవఱకెత్తి పట్టుకొని దానిలోనియెముక కొయ్యబారి చేయివాల్చుటకుఁ గాని కదపుటకుఁ గాని వీలులేని యవస్థలోనుండి రెండవ చేతితో సకలకార్యములు చేసికొనుచున్న యోగులుకొందఱు జగన్నాథస్వామికి మ్రొక్కుకొని నడువక యేనేల యుదయము మొదలు సాయంకాలము వఱకు వ్రాగిలంబడి సాష్టాంగనమస్కారములు చేయుచునే సందలకొలఁది మైళ్ళదూరము ప్రయాణముచేయు రోగబాధితులు కొందఱు, శరీరమందంతట బూడిదఁ బూసికొని పొడుగుజడలు తలనుండి వ్రేలాడు తాపసులు త్రిప్పుకొనుచు నెవ్వరితోఁ బలుకక కన్నులు మూసికొనుచు ధ్యానముచేయుచు నయాచితముగా జనులు పెట్టుభిక్షములవలనఁ బొట్టఁ బోసికొనుభక్తులు కొందఱు.

పంద్రెండు పదమూఁడు పదునాలవశతాబ్దములలో యూరోపుఖండములో వ్యాపించియుండిన సమస్తకష్టములు, సమస్తనియమములు, దేహపీడనములు, తపములు మొదలగునవన్నియు నేటికాలమున హిందూదేశములోఁ గానఁబడుచున్నవి. దీరవ్యాధులవల్ల నొప్పులవల్లఁ జిఱకాలమునుండి బాధపడురోగులు, దగ్గఱిచుట్టములను ప్రియబంధువులను గోల్పోయి దుఃఖపడుచున్న జనులు, దేహయాత్రయొక్క

చరమావస్థలోనున్న వృద్ధజనులు, హృదయకోశములయందు నిజవాంఛితములఁ గప్పి పుచ్చిన లేతకన్నియలు, పడుచుభార్యలు, బాధావిముక్తి నిమిత్తము, మోక్షము నిమిత్తము, మనోరథసిద్ధినిమిత్తము తండోపతండములుగ జగన్నాథక్షేత్రమును జేరుదురు. కాగన మెఱుఁగని యీమూఢవిశ్వాసమును జూచి తత్త్వశాస్త్ర పారంగతులు నవ్వవచ్చును. కాని దుఃఖకాలములందును, దుర్గతులసమయము లందును బహుశతాబ్దములనుండి యైకమత్యముగొలిపి మహాజనులను రక్షించినది విశ్వాసమే కాని తత్త్వశాస్త్రము కాదు. పూర్వచారిత్రములలో బశ్రస్తప్రక రణములని చెప్పఁదగినమహోత్కృష్టకార్యములను మహాజనులనేకముఖముగాఁ ద్రిప్పివేయించినది విశ్వాసమే గాని తత్త్వశాస్త్రము కాదు. గాలి సుఖప్రద ముగా నుండినందున జగత్కిశోరుఁడు సపరివారముగా నది దాటి మధ్యాహ్నము కొంచెమునే పాకనోటమాత్రము విశ్రమించి యావద్దినము ప్రయాణము చేసెను. అరుణభానుమండల మస్తగిరిమీఁద నిలుచునప్పటికి వారు బాలసూరుపట్ట ణముఁ జేరిరి. ఇది యుత్కలదేశములో జగన్నాథమునకు వెళ్ళుమార్గమున నున్న పట్టణములలో మొదటిగొప్పపట్టణము. ఈపట్టణము బంగాళాఖాతమున కెంతో దూరమునలేదు. ఇక్కడి సముద్రపుగాలి మనోహరమై యున్నందున నిది నివాస యోగ్యమైన తావయ్యెను. అందుచేత బంగాళాదేశమందు మన్యపుజ్వరము వ్యాపించియున్న మండలములలోని ప్రజలు కొంచెము మార్పునిమిత్త మప్పుడప్పు డీస్థలమునకు వచ్చుచుందురు.

అతిధిసత్కారతత్పరుఁడైనబాలసూరుజమీందారు పేరెన్నికఁ గన్నయా త్రికులను దనయింటికిఁ బిలుచుకొని పోయెను. అతిథిపూజయే హిందూగృహిణికిఁ బరమకర్తవ్య మని సనాతనధర్మము విధించుటచేత నాజమీందారునిరాణివాసపు జనము కిశోరరాయలతల్లికి భార్యకు లెక్కలేనన్ని యుపచారములు చేసిరి. ఆజమిందారుని రాణివాసపుస్త్రీలమాతృభాష యోఢ్ర మైనను వారు బంగాళ భాషఁగూడ మాట్లాడనేర్చిరి. కిశోరరాయలతల్లికి భార్యకు నోఢ్రముగూడ వచ్చును. అందుచేత రాత్రిప్రొద్దుబోవువఱకు రెండుభాషలలో యుక్తమైన సంభాషణ మంతఃపురములో జరిగెను. తరువాత నుత్కలదేశసాంప్రదాయసిద్ధ మైనవిందు పిండివంటలతో జరిగెను. కచేరిచావడిలో జమిందారు శరచ్చంద్రుని, జగత్కిశోరరాయలను విడియించెను. ఆసమయమునందే యుత్కలదేశసంస్థాన ప్రభు వగునొకసామంతరాజు జమీందారుని దర్శనము చేయుటకు వచ్చెను. ఉత్కలదేశము రెండుభాగములుగా విభజింపఁబడియున్నది. ఈభాగమును

నైసర్గిక స్వరూపములే సూచించు చున్నవి. బంగాళాఖాతతీరమున ననఁగా దూర్పుభాగమున నున్న సమభూములలో విద్యావంతు లయినజనులు కాపుర మున్నారు. వీరు ప్రత్యక్షముగా బ్రిటీషుపరిపాలనలో నున్నారు. పడమటివైపునఁ బర్వతమయ మైనయాటవిక ప్రదేశ మున్నది. అక్కడిజను లనాగరకులు. ఆదేశమును బ్రిటీషువారికి లోఁబడి హిందూసామంతరాజులు పరిపాలించు చున్నారు. ఈకొండరాజులలో నొకఁడు బాలసూరులో నున్నయూరోపియన్ మేజస్ట్రీటు గారిదర్శనము చేయవచ్చి, పిమ్మట జమీందారునిఁజూడవచ్చి, యచ్చట సాయంకాలమున జమీందారుతోడను, శరచ్చంద్రునితోడను, జగత్కిశోరరాయలతోడను, సరససల్లాపము లాడఁజొచ్చెను. ఆసియాఖండవాసులు తాల్చు వెలలేని దుస్తులతఁడు ధరించెను. అతని తలపాగయున్నత మై యపరంజినగిషీపనులతో నిండి యుండెను. శరీరచ్ఛాయ నలుపు. కాని, విగ్రహము పౌరుషసూచకమై యుండెను. వయసుముదిరినను నతఁడు విశేషదేహదార్ఢ్యమును గౌరవాస్పద మైన వర్చస్సును, దాల్చి యుండెను. బంగారుపని జేసినదువ్వలువలుధరించి యతని కొడుకులిద్దఱుఁ దండ్రికిఁ జెరియొక ప్రక్కఁ గూర్చుండి గదికావల చేతులలో వెండి కఱ్ఱలు దాలిచి స్వదేశసంస్థానప్రభువుయొక్క యంగరక్షకుల మని యొకవిధమైన గర్వము పూని కొందఱుసేవకులు నిలిచి యుండిరి. క్రిందవాకిటిలో వెండిబొంగడలు నెఱ్ఱనికుచ్చులు గలిగి మిక్కిలి డాబుగా నున్నపల్లకులు మెఱయు చుండెను. వాటిచుట్టును వాటిని మోయుబోయలు, సామంతరాజసేవకులు నిలిచి యుండిరి. పూర్వపద్ధతిసిపాయిలు కత్తులు, డాలులు చేతఁ బట్టుకొనిరి. రాజలాంఛన మగు నరుణఛత్రముదాల్చి కొందఱు చామరములుదాల్చి కొందఱు ఠీవితో నిలువంబడిరి. రాజుగారు తిరిగి ప్రయాణముచేయుటకుఁ గొందఱు చాకలివాండ్రు కాగడాలు సిద్ధముచేయుచుండిరి. కొందఱుసేవకులు చుట్టలు త్రాగుచు మాటాడుకొనఁజొచ్చిరి. మఱికొందఱు కాళ్ళుఁ జాపుకొని వెలికిలఁ బండుకొనిరి. జమీందారునిఁ జూడ వచ్చిన యీగొప్పరాజును చూడఁగానే వానివృత్తాంతము కొంత తెలిసికొనవలె నని కుతూహలము పుట్ట జగత్కిశోరుఁ డిట్లనియె.

"రాజా! నీప్రజలు బ్రిటిషువారిదేశములలో నున్నప్రజలవలె వంగాళీవారుకూడ నాంధ్రభాష మాట్లాడుదురా?" అనవుడు సామంతరా జిట్లనియె. "ఆహా! నాప్రజలలో ననేకు లోఢ్రులు. వా రోఢ్రభాషే మాట్లాడుదురు. బ్రిటిషువారిక్రింద నున్నయోఢ్రదేశములోనికాఁపులవలెనే నేల దున్నుకొని బ్రతుకుదురు. కాని, యతిదూరమున నున్న కొండలలోను నడవులలోను వెనుకటి యాట

వికజనులసంతతివా రున్నారు వారి సొంతభాషతో వారు మాటలాడుదురు. వారి పూర్వాటవిక జీవనము నిప్పటికిని వదలిపెట్టరు. వారి గ్రామము లనఁగా నట్టడవులలోఁ గొన్నిగుడిసెల గుంపులు వారి యాచారవ్యవహారము లన్నియు సృష్టికాదియం దుండిన వని చెప్పవచ్చును. నా సంస్థానములో విశేషభాగమున నా తండ్రికాలమున నీయాటవికులే నివసించుచు వచ్చిరి. ఇప్పుడు తక్కినచోట్లనుండువలెనే వా రంతకంతకుఁ బలుచవగుచున్నారు. ఏలయనఁ దముకంటె నెక్కువ నాగరకులగు నాంధ్రులు వచ్చి చేరుచుండుటచేత నీయాటవికులు వెనుకవెనుకకు ననఁగా దట్టమగునరణ్యములలోనికిఁ బోయి నివసించుచున్నారు.”

“మీ సంస్థానపరిపాలనము బ్రిటిషుదేశపరిపాలనమువంటిదే కాదా?”

“మేము బ్రిటిషువారిపరిపాలనమునే యవలంబించుచున్నాము. నా రాజధానిలో నొక న్యాయస్థానము, నొక కచేరి, యొక చెఱసాల, యొక ధర్మవైద్యశాల కలవు. కాని, మేము సాధారణముగ జనులను వారియిచ్చవచ్చినట్లు వదలివేయుదుము. వారు నెమ్మదిగా నడుచుకొన్నంతకాలము వారి గ్రామవ్యవహారములలో మేము జోక్యము కలుగఁజేసికొనము. వారివ్యవహారములలో మేము జోక్యము తక్కువకలిగించుకొంటిమా వారి గ్రామపరిపాలన మిక్కిలి బాగుండును. మొత్తము మీఁద నెమ్మదిగలవారు. రాజునందుభక్తిగలవారు. కాని, మీ సంస్థానప్రజలు కొన్ని సంవత్సరముల క్రిందట తిరుగుబాటు చేసిరని విన్నాము.”

“ఔను! నిజమే. అందులో కొంతవఱకు మా యుద్యోగస్థులదే తప్పు. వారు ప్రతిగ్రామమునుండి కొంతధాన్యము, కొన్ని పశువులు, పన్నుక్రింద మాకుఁ బంపుట యాచారము. మా యుద్యోగస్థులు వారు దున్నుకొనుచున్న భూములను గొలిచి ధాన్యమునకుఁ బశువులకుమారుగాఁ గొంతసొమ్ము పన్నుగా విధించి పుచ్చుకోవలయు నని తలంచిరి. ఆదిమపద్ధతులయందే యభిమానము గల యీజనులకు మా క్రొత్తపద్ధతు లర్థమైనవి కావు. పాప మా వెఱ్ఱివాండ్రు తమవిండ్లు, నమ్ములుఁ దీసికొని తిరుగబడిరి. కాని పితూరీ వెంటనే యడఁగి పోయెను.”

“అట్లయిన నేలకొలత మీరు మానుకొన్నారా యేమి?”

“మానుకొనలేదు. నాగరకులు కాఁపురమున్నచోట్ల నేలకొలత వేయించితిమి. వెనుకఁబడియున్న యామూర్ఖులను వారిష్టమువచ్చినట్లు బ్రతుకనిచ్చుటే మంచి దని తోఁచినది. నానాఁటికి నవనాగరకపద్ధతులు వానియంతట నవే వచ్చి

దేశములలోఁ బ్రవేశించును. అంతబలవంతముగా వానిని దేశములోఁ బ్రవేశ పెట్టుట లాభకరమని నేను తలంపను ”

“మీరు చెప్పినది సరియైనమాట. బాలసూరు మేజస్ట్రీటుగారుకూడ మీయభిప్రాయమునే బలపఱచుచున్నారని కూడ వింటిమి. ఆయన తఱుచుగా మీసంస్థానమునకు వచ్చి చూచుచుండునా? ”

“ఆహా! సంవత్సరమున కొకసారియో రెండుసారులో. ఆయన మాయందు మిక్కిలి యభిమానముగల పరిపాలకుఁడు. ఆయన మాసంస్థానమునకు వచ్చినప్పుడు మామందిరములలోని కాయనను నేను సంతోషపూర్వకముగా రానిచ్చి మా చెఱసాల, మాదర్బారు, మాయూరిలోని పాఠశాలలు చూపుచుందును. ఆయన మంచి వేఁటకాఁడు. ఆయనయు నేనును గలిసి కొన్ని నాళ్ళు వేఁటలాడుదుము.”

“మీరు సాధారణముగా తుపాకులతో వేటిని వేఁటాడికొట్టుదురు?”

“అడవులలోఁ బ్రతిజాతిజంతువు కలదు. పెద్దపులులు మునుపటియంత తఱుచుగాలేవు. కాని, చిఱుతపులులు సామాన్యముగాఁ గనబడు చుండును. ఎలుఁగుగొడ్డులు కనఁబడనిదినమే యుండదు. ఒకప్పుడు మే మడవిజంతువుల వేఁటకై కాలినడకనే పోవుదుము. కాని సాధారణముగా మేము చెట్లలో దాగి యుందుము. అడవిమనుష్యులనేకులు గుండ్రముగా నిలిచియుండి గొప్పచప్పుడు చేయుదురు. అప్పుడా జంతువులు జడిసి పైకివచ్చి మాదృష్టిపథమునఁ బడును. నిరుడు మేజస్ట్రేటు చక్కని యెలుఁగుగొడ్డు నొకదానినిఁ బట్టుకొని తెచ్చినాఁడు. దాని కూనలిప్పటికి నాయన యింటిలోనే యున్నవి.”

“మీ పెద్దపిల్లవాఁడుకూడ మంచిగురిగల వేఁటకాఁడని నేను విన్నాను.”

“ఔను! అతఁడు తుపాకి కడునేర్పుతో పట్టుకొనఁగలఁడు. కొద్దికాలములోనే యతఁడు పేరుగాంచెను. అతఁడు కొంచె మింగ్లీషు నేర్చుకొనవలసిన దని నాకోరిక. ఈదినములలో దేశపరిపాలన కింగ్లీషు చాల తోడుపడును. మే మింగ్లీషువారిచట్టములను సూత్రములను నవలంబింపఁ దలచుకొన్నాము; గనుక ఇంగ్లీషు భాష వాటిని దెలిసికొనుటలో మాకు మిక్కిలి సహకార మగును.”

“స్వదేశసంస్థానప్రభువులు ఇంగ్లీషుభాష నేర్చుకొన్నపక్షమునఁ జెడిపోవుదురని కొంద ఱనుచున్నారు.”

"వారిని పాడుచేయున దింగ్లీషుభాష కాదు—కాని, యింగ్లీషుభాష ప్రజలకు రాజునకుఁ బరస్పరసంబంధము పోఁగొట్టును. ఒకరికొకరు దూరమగుదురు. యుక్తవయస్కులు కాని రాజకుమారులు కటకములో విద్యాభ్యాసము చేయుచున్నారు. అందుచేత వారనేకసంవత్సరములు సంస్థానములలో నుండకపోవుట సంభవించును. అందువలన వారు ప్రజలనడుమనుండి నాతోఁ గలసి మెలసి యుండరు. వారు యుక్తవయస్కులై మరల సంస్థానములకు వచ్చినప్పుడు ప్రజలకు వారు క్రొత్త; వారికి ప్రజలు క్రొత్త. ఇది మిక్కిలి శోచనీయము. మీరు కావలసినంత యింగ్లీషు వారికి నేర్పింపవచ్చును. ఎంతయెక్కువ చదువుకొంటే మన కంత మంచిది. కాని, నడుమనడుమ సంస్థానప్రజలతోఁ గలసియుండు నట్లేర్పాటులు చేయవలెను. వారిమన్నఁ గాఁపుర ముండవలెను. వారితోఁ గలసిమెలసి తిరగవలెను. వారు తమప్రజలని తెలిసికొనవలెను. తెలిసికొని వారి కష్టసుఖములు తమవని భావింపవలెను. ఆపదలలో వారికొఱకై విచారింపవలెను. అట్లు చేయుటచేత రాజు ప్రకృతిజనరంజకుఁ డగును. శ్లాఘ్యపరిపాలకుఁ డగును. దయచూపితిమా భయంకరులగు నాటవికులుకూడ లొంగిపోవుదురు."

"ఈస్వదేశరాజులలో ననేకులు తమ ప్రజలయెడ నిజమైనదయఁ జూపుదురని మీరు తలంతురా?"

"చూపుదు రనియే నేను నమ్ముదును. ఉత్కలదేశములో నిరువదిసామంతరాజసంస్థానములు కలవు. నేను విన్నదానినిఁబట్టి దాదాపుగా సంస్థానాధిపతు లందఱు ప్రజారంజకులే. రాజులు మార్పుల నవలంబించుటలో సాధారణముగాఁ జురుకుతనముఁ జూపరు. అట్టివిషయములలోఁ గొంత బద్ధకించి వెనుకఁబడి యుందురు. అది మంచిగుణ మని నేను వాదింపనుగాని, క్రొత్తనిబంధనలు, నవీన పద్ధతులు నాగరకత లేనిమాయాదిమ ప్రజలకు భయము చిత్తవిక్షోభము గలిగించును. బ్రిటిషుదేశములో సంస్కరణవిషయమున మీ రెంతతలవిసురుగా వెళ్ళినను భయము లేదు. అనేకసహస్రసంవత్సరములనుండి వచ్చిన ప్రాచీననాగరకత కలదు. విశేషించి మీ కీనాఁటిమహోన్నత మైనవిద్యయు విజ్ఞానము కలదు. మాసంస్థానప్రజలు తక్కినవారికంటె ననాగరకులు. మేము మెల్ల మెల్లఁగాఁ గదలి మార్పులు చేసికొందుము. ప్రొద్దుపోయినది. ఇఁక మాకు సెలవు దయచేయవలయును."

మరునాఁ డుదయమున జగత్కిశోరుఁడు సపరివారముగాఁ బ్రయాణ మారంభించెను. అతైర్థికమార్గమున రెండుదినములు నడచినతరువాత వారు పవిత్రమైన వైతరణీతీరమును జేరిరి. ఈనది బ్రాహ్మణీనదితో గలిసి గొప్పవర్షములు కురిసిన సంవత్సరమున నుత్కలదేశములో విశేషభాగమును వరదతో ముంచియెత్తును. పడమటికొండలలోను మెట్టనేలలలోను బుట్టి యీరెండునదులు లక్కచెల్లెండ్రవలెఁ బయనముచేసి సమభూములలోఁబడి దొరలిపొరలి యొకచోఁ గలసి లోతును వెడల్పు గలయేకనదిగా నేర్పడి చండబలిరేవుదగ్గఱ సాగరసంగమముఁ జేయును. శీతకాలములో నీరెండునదులు సన్నకాలువలై పోవును. చుట్టు విశాలమైనయిసుకతిన్నె యుండును. కాని, జూలైనెలలో వర్షము లారంభింపఁగానే నదులు రమారమి యిరువదినాలుగుగంటలలో సంపూర్ణముగ మాఱిపోవును. వెనుకటిదినమున బచ్చనిచేలతో నిండియుండినప్రదేశ మంతయు మఱునాఁడు సాయంకాలము జలమయమై సముద్రమట్లుండును. గొప్పవర్షములు కురిసినసంవత్సరములందు గ్రామములు పల్లియలు వఱదలతో మునిగియుండును. మందభాగ్యులైన యాగ్రామవాసులు స్త్రీలతో బాలురతో వృద్ధులతో నుట్టిదిబ్బ లెక్కి, పచ్చిబియ్యముతిని, నీరు తీసిపోవువఱకు, వారిగుడిసెలు వాసయోగ్య మగువఱకు నానావస్థలపాలై ప్రాణసంరక్షణము చేసికొను చుందురు. ఈపూర్వసముద్రతీరమందు ప్రకృతివైపరీత్యములు బలవత్తరములై బహునష్టకములు కలిగించుచుండును. అనావృష్టిసంవత్సరమున దేశమందు సగముభాగమునఁ బంట లుండవు. మఱుచటిసంవత్సర మతివృష్టిచేతఁ గొంపలు మునిగి పొలములు జలమయములై మఱియొకవిధమునఁ బాటలు చెడి జనులు శ్రమపడుదురు.

జగత్కిశోరరాయలు వైతరణి బ్రాహ్మణితో సంగమించెడితావునకు మీఁదుగా నొకచోట వైతరణిదాఁటి పెద్దబాటవిడిచి కొంతకాలముత్కలదేశమునకు రాజధానియైన జాజిపురమును జూఁడగోరి ప్రక్కబాటను మరలెను. వేయిసంవత్సరములనాఁటి చిహ్నములు కొన్ని యాపట్టణమునఁ గలవు. అవి దాని ప్రాచీనగౌరవమును జాటుచుండును. ఏకశిలతోఁ జెక్కిన ఇంద్రాణీవిగ్రహము, కాళీవిగ్రహము, వారాహివిగ్రహము నచ్చటఁగలవు. జగత్కిశోరునితల్లి భయభక్తులతో నింద్రునిరాణియైననింద్రాణికి, వరాహదేవునిభార్యయైనభూదేవికి, మహాశక్తియగుకాళికి నమస్కరించెను. ప్రస్తుతము నామావశిష్టమైనయాప్రాచీనపట్టణమందలి పేదయిండ్లమీఁద గుడిసెలమీఁద నక్షత్రములు నిశ్శబ్దముగ వెలుతురుఁ జిమ్ముచున్న యారాత్రికాలమున నవనాగరకుఁ డగుశరచ్చంద్రుఁడుసైతము

గొప్పతన మెల్లఁ గోల్పోయినవిస్మృతప్రాచీనసామ్రాజ్యముయొక్క యాశేషభాగముల నక్కజముపడి చూచుచు దీర్ఘాలోచనతత్పరుఁడై చాలసేపు వానియెదుట నిలువంబడియుండెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

మతములు — దేవాలయములు.

మరునాఁడు జగత్కిశోరుఁడు జాజిపురము విడిచి రాచబాట నెక్కి బ్రాహ్మణీనదిని దాటి దినమెల్ల దీర్ఘప్రయాణము చేసి యుత్కలదేశమందలి నదులలో మహానదియని చెప్పఁదగినమహానదీతీరమును జేరెను.

పడమటికొండలలోఁ బుట్టి శిలామయము లైనసన్నత్రోవలఁ గొంతవఱకుఁ బ్రవహించి పిమ్మట సమభూములలోఁ బడి మిక్కిలి నిడివియైన యనంతరము రెండుపాయ లైనది. ఈరెండుపాయలనడుమ నున్నదీవియందుఁ బూర్వకాలమం దెవఁడో యొకరాజు పదియవశతాబ్దమున దుర్గమైనకోటఁ గట్టి కటక మనిదానికిఁ బేరు పెట్టెను. ఈకటకము నాఁటనుండి యుత్కలదేశమునకు రాజధాని యయ్యెను. శీతకాలములో నుండునదిమట్టముకంటె రమారమి యిరువదియడుగులయెత్తు గల రాతిగట్టు పట్టణముచుట్టు నొడ్డాణమువలె నున్నది. వర్షకాలమునందు నదిపొంగి పట్టణముమీఁదఁ బడకుండ నీగట్టు కాచుచుండును. పూర్వపుహిందూరాజులచేతను మహారాష్ట్రులచేతను నిర్మింపఁ బడినయీగొప్పగట్టు బ్రిటిషుద్యోగస్థులుగూడ జాగ్రత్తగాఁ గాపాడుచున్నారు. ఏలయన నగరరక్షణ కదియే యాధారము. వర్షకాలమున వరదలు వచ్చినప్పుడు పలుమాఱు లింజనీరులు భయముతో గడగడ వడఁకుచు జలవృద్ధి గనిపెట్టి చూచుచుందురు. ఎందుచేత నన గొన్నిసంవత్సరములందు నీరు రమారమి రాతిగట్టుపొడుగున వచ్చెను. అప్పుడు జనులు మిక్కిలి మనోవేదనతో దినములు గడపి రాత్రి నలుజాములు కన్నులు మూయక కాచుకొనియుందురు. వరద కొంచెమెక్కువగా వచ్చెనా నగరమంతయు మహాసరోవరమై పోవును. అనేకశతాబ్దములయనుభవముమీఁదఁ బూర్వహిందూరాజు

లారాతిగట్టుల గట్టించినందున వారిలెక్క సరియైనది. మిక్కిలి పెద్దసంవత్సరము నందుఁగూడ వచ్చినగొప్పవరద కూడ గట్టునకు రెండడుగులు క్రిందుగా నుండును. అందుచేత నగ మెప్పుడు జలమగ్నము కాలేదు. కొన్ని దినములవరకు నగరవాసులు వ్యాకులితమనస్కులై యుందురు. మిన్నునుముట్టుచుండునీరు దక్షిణదిశను నుత్తర దిశను బట్టణముప్రక్కనుండి ప్రవహించుచు మార్గమధ్యమందు నిర్మూలించిన వృక్షములను, తుడిచి పెట్టినపట్టణంబులలోను బల్లియలలోను గలయిండ్లకప్పులను బశువులను బచ్చికలను సంగ్రహించుకొని సాగరముం బ్రవేశించును. నదియెంత త్వరగాఁ బొంగినదో యంతత్వరగాఁ దీసిపోవును. గతదినసాయంకాల మెంతో యుపాయకరముగా నున్నది యొకప్పుడు మరునాఁడు తెల్లవాఱునప్పటికిఁ బూర్తిగాఁ దీసిపోయి నగరవాసుల కఖండానందము గలిగించును. వర్షకాలమున నతిభయంకరమై బహుదేశపరివ్యాప్తమైనయామహానది శీతకాలపుసాయంకాలమున సన్నగిలి ముందుగాఁ దనయిసుకతిన్నెయ పాన్పుమీఁద నిద్రించుచున్నదో యనునట్లు పాఱుచుండెను. జగత్కిశోరుఁడు సపరివారముగా నుత్తరమువైపునుండి నది దాటెను. కటకపురమందు హరివల్లభబోసు నాయకపురుషుఁడు. అతఁడు పలుకుబడి యెక్కువకలవాఁ డనియు, ధనవంతుడనియుఁ బేరువడయుటయే గాక యతిథిసత్కారమందు మితిలేనియభిలాష కలవాఁడని ప్రతిష్ఠ గాంచినవాఁడు. అతఁడుగూడ జగత్కిశోరజ్ఞాయులకులమువాఁడే. దూరపుఁ జుట్టఱిక ముండిన నుండవచ్చును. అతఁడు వర్ధమానపుజమీందారును దనయింటఁ దప్ప మఱియొక చోట బస చేయనీయ దలఁచుకొన లేదు. అతనిసేవకులు ముందుగానే యుత్తరపు గట్టునకుఁ బోయి పల్లకులమీఁదఁబడి మనుష్యులను దింపకయే యాపల్లకులను రేవు పడవలమీఁదఁ బెట్టించిరి. బోయలు నది దాటినతరువాత మరలఁ బల్లకుల మోయం దొడఁగిరి. పురజనులను జూచినతోడనే తమయాయాస మానాటికి కడముట్టిన దని సంతోషించుచు బోయలు మఱింతయుత్సాహముతో నోంకారధ్వనులు చేయుచుఁ బట్టణములోనికిఁ బోయిరి. అనుకొన్నవేళకు వారుగమ్యస్థానము జేరిరి. హరివల్లభ బోసు జగత్కిశోరరాయలను, శరచ్చంద్రుఁని స్వాగతపూర్వకముగ నాదరించి స్వగృహమును బ్రవేశింపఁజేసెను. అతని యింటిస్త్రీలు కూడ మిత్రకుటుంబము నందలిస్త్రీలు వచ్చినప్పుడు నెరవపలసినధర్మము మఱువక జగత్కిశోరునితల్లిని, భార్యను మిక్కిలిగౌరవముతో నెదుర్కొని లోనికిఁ దీసికొనిపోయిరి.

కిశోరరాయునితల్లి మంచితెలివి కలది. ఇంటివారిమాటలంబట్టి హరివల్లభుఁడు కొన్నిదినములవఱకుఁ దమ్మక్కడ నుండిపోనీక నిలుపఁ దలఁచుకొన్నాఁ డని

గ్రహించిభయపడి హరివల్లభుఁడు తన్ను జూడవచ్చినప్పుడు మఱునాఁ డుదయమున తాను పూరిజగన్నాథమునకు వెళ్ళవలె నని చెప్పెను.

ఆమెకు హరివల్లభుఁ డిట్లనియె. "అమ్మా! మేము పూర్వపద్ధతిమనుష్యులము. మామర్యాదలు కూడఁ బూర్వపద్ధతివే. మీ కుమారునివంటి, మీవంటి యతిథులు మమ్ము గౌరవించి మాగృహపావనముఁ జేసినప్పు డంతత్వరగా వెళ్లఁగలఁచుట భావ్యము కాదు. అమ్మా! అథమపక్షము వారముదినము లైన మాయింట నిలువక మీరు వెళ్ళిపోయినపక్షమున మాకు మీ రవమానముఁ గలిగించినవా రగుదురు. మమ్మెఱిఁగిన వారికందఱకు మేము చులక నై పోదుము. కాఁబట్టి మీరు ముందువార మీభోజనఱకు మాగృహమున నుండుఁడు. మీరు జగన్నాథ మొక్కదినములోఁ జేరునట్లు కావలసినయేర్పాటు లన్నియుఁ జేసెదను. ఇక్కడనుండి జగన్నాథ మేబది మైళ్ళకంటె నెక్కువలేదు. అంతవఱకు మీరు మాయింట నతిథులై యుండవలసినవారే. ప్రేమరసము జాలువారు చున్నయామాటమర్యాద యతిథులమనస్సులకుఁ గష్టముగా నుండెను. ప్రతిమాటలకొనుట వ్యర్థ మయ్యెను. కఠినోక్తులు నిష్ఫలము లయ్యెను. అందుచేత వారక్కడ మూఁడుదినము లుండవలసి వచ్చెను. శరచ్చంద్రున కక్కడ నుండుట సంతోషప్రద మయ్యెను. కలకత్తానగరమందలి మనోవేదనాప్రదము లైనతావులను విడిచి వచ్చిన తరువాత నతఁడీప్రయాణములో నవి యెల్ల మరచి యొకవిధ మైనదుఃఖ విమోచనమును బడసి కొంతమనశ్శాంతి నొంది సుఖపడు చుండెను. గంటలకొలఁదికాల మతఁడు నిశ్శబ్దముగా, నొంటిగా గుఱ్ఱముమీఁదఁ బ్రయాణము చేయు చుండెను. మార్గమధ్యమందున్ననిమ్నోన్నతము లగుకొండలు, కాఱడవులు, జనశూన్యము లైనబయళ్ళు వానిదీర్ఘాలోచనమున కవకాశము గలిగించెను. పగలు దీర్ఘప్రయాణము చేయునప్పుడు పూర్వపు సంతోషదినములు మనంబునకు జ్ఞప్తికి వచ్చు చుండును. పూర్వరంగములు, తనమనోరథము లైనవిగ్రహములు కన్నులయెదుటఁ బొడగట్టు చుండును. తనమేనఁ బులకాంకురము లెత్తించినమధురస్వరములు మరల శ్రవణగోచరములు కాఁజొచ్చెను. ప్రేమపూరిత మైన హేమునిసంభాషణము, కంఠాంబు[illegible]నట్లు వినఁబడు బిందుయొక్కమాటలు, ముద్దులుమూటగట్టు సుధయొక్కముగ్ధభావము వానిమనంబునకు జ్ఞప్తికివచ్చి యుత్కలదేశమందలి కొండలలోను వనములలోను బయనము చేయుచున్నప్పుడు సైతము వానిని విడువకపోయెను. పాపము! యోగ్యురా లైన యమునయొక్క మరణవార్త కటకములో నున్నప్పుడే శరచ్చంద్రునకుఁ దెలిసెను. ఆవార్త విని యతఁడు తన మనోరథభంగమును విడిచి సోదరి

వలెఁ దనతోఁ గలసి మెలసి యుండిన యాబాలిక యకాలమృత్యువును గూర్చి కన్నీరు గ్రుక్కుకొని లోలోపల నేడ్చెను. ఉమాబిందులు తన సోదరి యగు కాళికిఁ జిన్ననాఁటిమిత్రములు. శరచ్చంద్రునకు వారుముగ్గురు తోఁబుట్టువు లట్లుండిరి. ముగ్గురమీఁదఁ బ్రేమ యతనికి సమానమే. ఉమ గ్రామబాలిక లందఱికంటె నతిసుందరి. అందుచేత నల్లారుముద్దుగాఁ బెరిగినబిడ్డ. శరచ్చంద్రుఁడు పల్లియులలోనిజనులు చెప్పుకొనుకథలపై నాసక్తిగలిగి యవి వినుటకై తాల్పుకారు గ్రామమందలి చెఱువుగట్టునకుఁ బోయి సోమరియై చెట్లక్రిందఁ గూర్చున్నప్పుడు కలువ ఱేకుల నేలుకన్నుగవతో, ముద్దుగారు మోగముతో నుమ వాని వెంటవెంటఁ దిరుగు టలను లతనికి జ్ఞప్తికివచ్చెను. కాలక్రమమున నుమ వివాహితయై యుక్తవయస్కయై భర్తతోఁ గాపురము చేయఁజొచ్చెను. ఉమ ధనపురమునుండి పుట్టినింటికి వచ్చినదనువార్త గ్రామమున వ్యాపించినప్పుడెల్ల జనులాబిడ్డను జూచుటకై గుంపులు గుంపులుగా నామె పుట్టినయింటికడఁ గూడు చుందురు. ఆభాసురగాత్రి యిపుడస్తమించుటచేత, నాదీప మారిపోవుటచేత, శరచ్చంద్రునిమనోవీథి యంధకారబంధుర మయ్యెను.

ఉత్కలదేశముయొక్క పశ్చిమభాగమందలి కొండలలో శరచ్చంద్రుఁడు గుఱ్ఱమెక్కి పయనము చేయుచుఁ బలుమాఱు మిక్కిలి యనాగరకదశలో నాదిమ పద్ధతుల ననుసరించి బ్రతుకుచున్న యాటవికజనుల గుడిసెలసమీపమునుండి పయనము సేయుచుండును. రాత్రులు ఘాతుకమృగముల కునికిపట్టులైన దట్టపు వెదురుపొదలనతఁడు పలుమాఱు ప్రవేశించెను. ఉన్నతములైన పర్వతములెక్కి వానిశిఖరములమీఁదనుండి తన యెదుటఁ బటము పఱచినట్లు కనఁబడుచుండిన యుత్కలదేశపు సమభూములలోని పట్టణములను, వనములను, నదులను జూచి సంతోషించు చుండును. దర్శనీయములైన యిటువంటితావు లతని కానందప్రదము లయ్యెను. కటకములో నున్నకాలమున నతఁడు పట్టణమువదలి పడమటివైపున నున్నమెట్టనేలలఁ జూచుకొర్కెతో నతిదూరము వెళ్ళుచువచ్చెను. ఒకమాఱతఁడు ఢేనుకల్ సంస్థానము ప్రవేశించెను. ప్రవేశించి యొక మెట్టనేలపై నిలిచి చుట్టు ప్రక్కల నడవులతో నిండినకొండలు పచ్చనికనుమలు, పసిమిచాయలు వెదజల్లు వరిపొలములు గలగుండ్రనిమహారంగమును జూచునప్పటి కతనిహృదయ మనివఱ కనేకవారములనుండి యనుభవించి యెఱుంగనియొక విధమైన విశ్రాంతియు మహానందము నతఁ డనుభవించెను. అంతేకాదు, అంతకంటెమఱియు లోపలిభాగమునకు వనములను గుట్టలను గడచి యరిగి హిందాల్ సంస్థానము నరసింగపూర్

సంస్థానము ప్రవేశించి, హిందూదేశమందంతట పేరునడసిన బర్మ్యాల్ కొండ నడుమఁ గూడఁ బోచ్చెను. మహానది టికర్పర మొదలుకొని బర్మ్యాల్ కనుమ వరకు సన్నని కొండదారిబడి ప్రవహించును. నది కిరుప్రక్కల వనములతో నిండినకొండలు నిలువుగా గోడలు పెట్టినట్లు నిలిచియుండును. మయూరములు వనమందుఁ దరుచుగాఁ గానఁబడు చుండును. ఏనుఁగులు మొదలగు వన్యమృగములు దారితెరువు లేనియాయడవులలో నిరంతరము సంచరించు చుండును. మనుష్యశబ్దము వినఁబడు టరుదు. పర్వతాకృతిమై నిర్మలజలసమేతమైన యామహానదీ ప్రాంతముల నెన్నఁడు మనుష్యుఁడడుగు పెట్టిన జాడ లేదు. బర్మ్యాలువద్ద కొండలు కొంత వెనుకకు వెళ్ళును. అందుచేత నది యచ్చోట వెడల్పైనది. ఖల ఖలయని సార్థకనామధేయముగన్న యొకయేరు తత్సమీపమున కలకలనవ్వుచున్నట్లే ప్రవహించి యీమహానదిం గలియుచున్నది. ఈనదియొడ్డుననే మహారాష్ట్రులు 1804 సంవత్సరమున బ్రిటిషువారితోఁ గడపటి యుద్ధము చేసి యోడిపోయిరి. ఈయుద్ధములో నుత్కలదేశమును మహారాష్ట్రులు గోలుపోయిరి.

హిందూదేశమందు తప్ప పేరుమోసినదియు నుత్కలదేశమందు ముఖ్యమైనదియు, వేడుక పుట్టించునదియు నగు మఱియొకస్థానము కలదు. అది ఖాండగిరి. దాని మీఁద బౌద్ధవిహారములు, భువనేశ్వరునియాలయములుగలవు. జగత్కిశోరుని తల్లి యాదేవాలయములఁ జూడఁగోరినందున హరివల్లభుఁడు పయనము చేసి వారినక్కడికి బంపెను. అది కటకమునకు దక్షిణమునఁ బదియేను మైళ్ళదూరములో నున్నది. రెండువేలసంవత్సరముల క్రిందట నుత్తరహిందూస్థానమున కంతకుఁ జక్రవర్తియైన యశోకుఁడు బంగాళాదేశమును విస్తీర్ణమైన తనసామ్రాజ్యమునం గలుపుకొనియెను. అతఁడు బౌద్ధుఁడగుటచేత బౌద్ధశ్రమణులు, మతబోధకులు మతవ్యాప్తి చేయఁదలంచి యుత్కలదేశముం జొచ్చి నేటివఱకు నిలిచియున్న యాలయములఁ గట్టించి గుహలు నిర్మించిరి. అక్కడ పులిగుహ మొదలగుచిన్నగుహ లెన్నో కొండలలోఁ ద్రవ్వఁబడి యున్నవి. ఇవి పూర్వకాలము ననేకులు తమతపస్సు చేయు నొక్కొక్కశ్రమణుని వాసస్థానములు. వీనిప్రక్కనే గణేశగంఫ మొదలైనవిశాలగుహలు కలవు. ఇవి పూర్వకాలమున బౌద్ధులు సంఘములుగాఁ గూడి యారాధనలు సల్పుస్థలములు. ఇక్కడ రెండంతస్థులరాతిమఠ మొకటి కలదు. దాని పేరు రాణినూరు. దీనిలో నెన్నో గదులున్నవి. ఎన్నో పంచపాళి లున్నవి. తలుపులమీఁదఁ జాతిబొమ్మ లెన్నో, చెక్కఁబడియున్నవి. ఈమతము హిందూదేశములోఁ బూర్వకాలమునఁ బ్రబలియుండిన శిల్పులయొక్కయు, విగ్రహనిర్మాతలయొక్కయు, ప్రజ్ఞావిశే

షంబుల నేటినాగరకులకుసయితము సాటించుటకు నిలిచియున్న ప్రతిష్ఠాపితముల వలె భాసిల్లుచున్నది. పాడుపడిన యీ బౌద్ధవిహారములలో చాలసేపు తిరిగి యక్కజముపడు చుండ భువనేశ్వరదేవాలయములు చూచుచున్న స్త్రీలు వానిని రమ్మని వర్తమాన మంపిరి. అందుచేత నతఁడు వెడలిపోయెను.

ఈభువనేశ్వరమందే సింహవంశపురాజులు నివసించిరి. ఇట్టి దుర్భేద్యములగు స్థానములుండబట్టియే వా రుత్కలదేశము నైదవశతాబ్దము మొదలుకొని పండ్రెండవశతాబ్దమువఱకుఁ బాలింపఁ గలిగిరి. వారిరాజధానియగుభువనేశ్వరము ప్రాయశఃహిందూదేశమం దాకాలమున నున్ననగరములకు శిరోమణియై యుండవచ్చును. అక్కడిదేవాలయములలో గొప్పది యేడవశతాబ్దమునఁ గట్టఁబడెను. ఇంకను వందలకొలదిఁ చిన్నదేవాలయము లున్నవి ఇందులో కొన్ని పాడుపడకుండ మంచిస్థితిలో నున్నవి. ఇవియెల్ల రాజవంశస్థులప్రతాపమును గొప్పతనమును ఘోషించు చున్నవి. ఈనాఁటితైర్థికులు బాటసారులు పాడుపడి యున్న నీపట్టణమును మిక్కిలియక్కజంపడి చూచి పారము లేనిపరిశ్రమతోడను నిరుపమాన మగునేర్పుతోడను, మలచఁబడి, చిత్రింపఁబడిన రాతిపలకలతో నిర్మింపఁబడినట్టియు నూ రడుగులయెత్తునను రెండువందలయడుగులయెత్తునను నేకశిలాఫలకములచేతనే యమర్పఁబడిన పైకప్పు కలిగినట్టియు, బురాతనమహాభవనములయెట్టయెదుట నోట మాట లేక నివ్వెఱపడి నిలిచి యుందురు.

ఆఁడువాం డ్రా మహాదేవాలయముయొక్క యంతర్భాగమును జొచ్చిరి. భువనేశ్వరుఁడైనభువనేశ్వరునకు నేటికినయిఁతము యథావిధిగాఁ బూజానమస్కారములు జరుగుచున్నవి. ఆలయమందలిమహాగోపుర మొక్కటి మహోన్నత మై యున్నది. దానిమీఁద విగ్రహములు విశేషముగా జెక్కఁబడి యున్నవి. ఒక్కొక్కరాతిమీఁద నొక్కొక్కవిధమైనచిత్రరువు చెక్కఁబడి యున్నది. శిల్పిహస్తకౌశలము, బుద్ధికుశలత దెలియఁజేయనివిగ్రహ మొకటైనను లేదనుట యతిశయోక్తికాదు.

అప్పుడు జగత్కిశోరునితల్లి శరచ్చంద్రునితో నిట్లనియె. "ఇది దేవాలయముల పట్టణ మని నాకు దోఁచు చున్నది. ఈలాగున కట్టగలవారు దేవతలు గాని మనుష్యులుకారు. ఇటువంటిరాతిగుళ్ళు మనబంగాళా దేశములో విశేషముగా లేవు."

అనవుడు శరచ్చంద్రు డి ట్లనియె, "ఈపురాతనపట్టణ మిటువంటిమహాద్భుత దేవాలయములతో నిండియుండుటకు మనపూర్వులయొద్ద నరిమానుష మైన

యుత్సాహము నతిమానుషమైన ప్రజ్ఞ యుండి తీరవలయు. అమ్మా! పూర్వులు జన్మమున కేదో పరమార్థము పెట్టుకొని యుండెడివారు. దేవాలయము కట్టించుటో, సత్రము వేయుటో, సరోవరము త్రవ్వించుటో వారిపరమార్థము. ఈదినములలో మనమందరము పరమార్థమేమియు లేక బ్రతుకుచున్నాము.”

“నాయనా! నీమాట నిజము. విశ్వాస మున్నవారు విశేషకార్యములు చేయగలరు. ఇటువంటియాలయములు కట్టించినరాజులకు దేవతలు తప్పక సహాయము చేసెడివారు. బిడ్డలారా! పశుమవాండ్రు దేహదార్ఢ్యము కలవాండ్రు జన్మములు చరితార్థములగునట్లు ప మార్థనిమిత్తమై పాటుపడుఁడు. విశ్వాసముంచి యేదోపరమార్థము చేయవలె నని సంకల్పించుకొనుఁడు. అదే గురిగాఁ బెట్టుకొని పనిచేసినపక్షమున మీదేశమునకు మీరుకూడ నీదినములలో సయితమేదో కొంత యుపకారము చేయఁగలరు.”

ఇరువదిమూడవ ప్రకరణము.

ప్రతిజ్ఞ.

జగన్నాథక్షేత్రమునకుఁ గడపటిమజిలీ యైనకటకపట్టణమునుండి జగత్కిశోర రాయలు సపరివారముగా బయలుదేఱినప్పటికి మేఘాచ్ఛాదనము లేనిశీతకాలసూర్య మండలము వ్యాపారబాహుళ్యముచేత జనసమ్మర్దమధికముగాఁ గలిగినయానగరవీధు లలోఁ దేజంబు వెదజల్లి మెఱయుచుండెను. వారు మహానదియొక్క దక్షిణపుపాయను దాటిరి. ఈపాయ కొన్నిమాసముల క్రిందఁ బొంగి దేశమును దుడిచిపెట్టి ప్రస్తుతము చిన్న చిన్నకాలువలుగా మాఱి రెండడుగులలోతైన లేక యిసుకనది యని చెప్పఁ దగియుండెను. గుఱ్ఱము పల్లకులు రేవుపడవసాయముక్కర లేకయే నదిని దాటి, జగత్ప్రసిద్ధికన్న పూరీక్షేత్రమునకును, నదీతీరమునకును గలయేబదిమైళ్ళదూరము పయనము చేయసాగెను. దేశాచారమునుబట్టి యామడకొకచోట నుంచిబోయీలను బెట్టిరి. మధ్యాహ్నము నడిదారిలో భోజనమునిమిత్తము కొంతసేపాగవలసి వచ్చినను మొత్తముమీఁద సాయంకాలమగునప్పటికి బాటసారులు తమ గమ్యస్థానమును జేరఁగలమని నమ్మి యుండిరి.

హిందూదేశముయొక్క ప్రతిభాగమునుండి వచ్చునట్టి తైర్థికులసంఖ్య క్షేత్రము సమీపించినకొలఁది యడుగడుగున కధికము కాఁజొచ్చెను. వర్షకాలములో ననఁగా జగన్నాథస్వామివారిరథోత్సవసమయమునఁ బ్రతిదినము వేలకొలఁది మనుష్యులీదారింబోవు చుందురు. ఆయుత్సవసమయమునఁ గాలస్థితి బాగున్న సంవత్సరములలో రెండు మూఁడులక్షలుమందిజనులు చేరుదురు. తక్కిన ఋతువులలో జనసంఖ్య యంతవిశేషముగా నుండదు. కాని పండ్రెండుమాసములలోను ముఖ్యముగా మనోజ్ఞమైన శీతకాలమందు తైర్థికప్రవాహమెండిపోక యేదోవిధముగాఁ బ్రవహించు చుండును. దూరమండలములనుండి స్త్రీలు, పురుషులు, రోగులు, భోగులు, భిక్షుకులు, బైరాగులు, కుంటివాండ్రు, గ్రుడ్డివాండ్రు పిన్నవాండ్రు, పెద్దవాండ్రు దేహము చాలించులోపల నెన్నఁడో యొక్కసారి చూచితీరవలయునని కోరుచుండెడిజగన్నాథక్షేత్రమునకు నెట్టులో కాళ్ళీడ్చుకొని నానాశ్రమలు పడి పోవుదురు. విదేశప్రయాణము, నూతనస్థలదర్శనము మొదలగునవి నేటికాలమున యూరపుఖండములో మతసంబంధము విడిచి లౌక్యవ్యవహారములోఁ జేరిపోయినది. కాని హిందూదేశములో నిప్పటికినవి మతముతో నవినాభావమును బొంది జనులకు విధిచోదితధర్మములుగా నేర్పడినవి.

మధ్యాహ్నభోజనము నిమిత్తము విశ్రాంతినిమిత్తము జగత్కిశోరుఁడు సపరివారముగా బాటప్రక్కనున్న యొకయంగడిలో విడిసెను. పేదబాటసారులట్టి విశ్రమస్థానముల నపేక్షింపరు. వారు చెట్టుక్రిందనే ప్రొయిఁ బెట్టికొని యరగంటలో నిత్తడిపాత్రలో గాని కుండలో గాని కావలసిన యన్నము కూరలు వండుకొని తిని తిరిగి పయనము చేయుచుందురు. వాయవ్యమూలనుండి వచ్చు దృఢకాయులగు తైర్థికులు తరుచుగా నన్నమే వండుకొనరు. గోధుమపిండి పెరుగుతోడనో పాలతోడనో గలిపి భక్షించి సంతుష్టులగుదురు. ఒకగంటలో వంట మొదలైనయెల్లపనులు ముగియును. వంటకుండ లోపలఁ బాఱవేయుదురు. ప్రొయిలో నిప్పైనసరిగా నారిపోకమునుపే మూటలు ముల్లెలు భుజముల వేసికొని, కడపటి మజిలీనుండి జగన్నాథక్షేత్రమునకు బోవువఱకు మరల నెక్కడ బసదిగక యన్నపానములమాట దలపెట్టక తలవంచికొని యేకదీక్షతోఁ బయనము చేయుదురు.

అట్లు చనుచున్న తైర్థికులకు గొన్నిమైళ్ళదూరమునందే లోకానందకరమైన జగన్నాథస్వామివారి గోపురశిఖరము నేత్రపర్వాయమానమై గానఁబడును. అప్పుడు పవిత్రులైనతైర్థికులు ముందడుగుపెట్టక నిలిచియుండి చిఱకాలమనోరథమైన యీదేవాలయముయొక్క ప్రథమదర్శనమైనందునఁ బరమానందభరితులై

తమ సంకల్పము లీడేఱినందుకు జగన్నాథస్వామికి జయము, జయమని కేకలు వేయుదురు. ఈధ్వని నలుప్రక్కలనిండి మిన్నువయినట్లగును. తమ సన్న కంఠములతో స్త్రీలుకూడ నానందపారవశ్యమున నే కేకలువేసి ధ్వనిని స్థూలము చేయుదురు. జగత్కిశోరునితల్లియు భార్యయు తాము ఘోషాస్త్రీలన్నమాట మఱచి సాంప్రదాయవిరుద్ధముగాఁ బల్లకితలుపు లించుక తెఱచి జగన్నాథస్వామి వారిగోపురశిఖరమును తొంగితొంగి చూచి స్వామిని సన్నని గొంతుకతో వేఁడుకొనిరి. బంగాళాదేశమునుండియు, నుత్తరహిందూస్థానమునుండియు, బహువారములనుండియు, బహుమాసములనుండియు, దీర్ఘప్రయాణములు చేయుచుండిన మనుష్యులు తమపూర్వజన్మపుణ్యములు ఫలించినవనియు, దమకోర్కెతీఁగెలు చిగిరించినవనియు నమ్మి సంతోషింతురు. ఏలయన మనసారదర్శింపఁగోరిన పరమేశ్వరుఁడు దూరమున గోపురశిఖరములోనుండి కనబడుచు దమ మార్గాయాసము నపనయించుచున్నాఁడని వారు భావించుచుందురు. జగన్నాథస్వామికి జయము జయ మను కేకలు మాటిమాటికి భూనభోంతరములు నిండునట్లు వ్యాపించెను. అది చూచి శరచ్చంద్రుఁడు తనమనసుపట్టలేక పరుగు మాన్పించి గుఱ్ఱమును మెల్లమెల్లగా కేకలువేయుజనులగుంపునడిమికిఁ దీసికొనిపోయి యాయానందము తాను గూడ ననుభవింపఁజొచ్చెను. దేశమందలికోటానకోట్లజను లనేకమతస్థులుగా నేకజాతిగా యాలయములే చేసినపక్షమున, దేహయాత్రజరుపు మానవకోటి యుద్ధానిం దెలిసికొనలేక యజ్ఞానాంధకారమున దడవులాడుకొనుచుందురో యట్టి యఖండ తేజస్సు యొకమాఱుమూలకిరణము లైన వారిహృదయములలో బ్రవేశపెట్ట గలిగినపక్షమున హిందూదేశమందలిదేవాలయములు క్షేత్రములు నిష్ప్రయోజనములు కావని శరచ్చంద్రుఁడు తలంచెను. "జగన్నాథ జీకీ జయ్" యనుకేక తైర్థికు లందఱికంఠములమీద నొకచిత్రమైనపల్లవి యయ్యెను. ఎట్టకేలకువారు జగన్నాథముసమీపమున నున్న కట్టవంతెనమీదికిఁ వచ్చునప్పటికి జయజయధ్వనులు బయలుదేఱెను. మహానందముతోడను, సంతుష్టితోడను వారు పట్టణముఁ బ్రవేశించునప్పటికిసంధ్యాకాలచ్ఛాయలు నలుదెసలు వ్యాపించెను.

పూరీపట్టణము రాకముందే జగత్కిశోరరాయలపరివారమును గొందఱు పండాలు కలసికొని వారివృత్తాంత మడిగిరి. వేలకొలఁదిపండాలు జగన్నాథక్షేత్రముచుట్టుఁ దిరుగుచుందురు. వీరిలో గొందఱు తరుచుగా విశేషదూరప్రయాణము చేసి తైర్థికులను వెంటఁబెట్టుకొని పోదురు. భాగ్యవంతులవతను మాకు రావలె నని మాకు రావలె నని వారిలోవారు పెనఁగులాడుచుందురు. ఇట్టి పెనగు

లాట కిశోరరాయలవిషయమునఁగూడ జరిగెను. ఆవివాదముకూడఁ దక్కినవివాదములట్లే పరిష్కరింపఁబడెను. అట్లు పెనగులాడువారిలోనొకపండా తనప్రాత కాగితములలోనుండి వెనుకటితరములో జగత్కిశోరరాయలయొక్క పూర్వపురుషులలో నొకఁడు జగన్నాథక్షేత్రమువచ్చినట్లు తనయింట బసచేసి తనచే పండాగా నేర్పరుచుకొనినట్లు నిదర్శన మైనయొక కాగితమునుదీసి చూపి కిశోరరాయలవంశవృక్షమందలి పురుషులను జెప్పి వారిచుట్టములలో నెవ్వ రెవ్వరు జగన్నాథయాత్ర చేసిరో వారిపేరు లుగ్గడించి తనకుటుంబమునకు వారి కుటుంబమునకుఁ గలఁ సరియైనసంబంధము చెప్పి తన కెక్కువయధికార మున్న దని స్థిరపరిచి యాపావనక్షేత్రమున వా రున్నంతకాలము వారిం దానే కనుగొనుటకు సమ్మతించి వారిం దన యధీనము చేసికొనెను.

గవర్నమెంటువారిచట్టముప్రకారము లైసెన్సు చేయఁబడినగృహములలోనికి సామాన్యతైర్థికులను సామాన్యు లైనపండాలు తీసికొని పోవుదురు. భాగ్యవంతుఁడైన వర్ధమానపుజమీందారుని విషయమున నట్లు గా లేదు. పురవాసి యొకఁడు విశాలమైనతనభవనమును జమీందారుని యుపయోగమునిమిత్త మిచ్చి వేసెను. మఱియొక పండా వచ్చి తనన్యాయ మైనహక్కును హరించికొని పోకుం డున ట్లాపండా బ్రాహ్మణుఁడు రాత్రియంతయు నక్కడనే పండుకొని తిన్నగా నిద్రింపఁ జాలఁడయ్యెను.

జగత్కిశోరరాయలతల్లిమాత్రము నిద్ర పోలేదు. పూజ్యురా లైనయా యవ్వకాళితోఁ గలసి దీపముదగ్గఱగూర్చుండి శరచ్చంద్రున కిట్లనెను. "నాయనా! నా కొక్కమాట చెప్పు? నీవు వెనుకటిసంగతు లెఱుఁగుదువు. ఈగొప్పగుడి యెప్పుడుకట్టినారో చెప్పు? బహుమారమున సముద్రతీరమున జగన్నాథస్వామి యేల వెలసినాఁడో యాకారణముగూడ చెప్పు? నే నీరాత్రి నిద్ర పోను. జాగరము చేసెదను. నీకుఁగూడ నిద్ర సరిగా రా దని నేనుఁ దలఁచెదను. ముసలమ్మకోరిక తీర్పుము. జగదీశ్వరుఁ డైనజగన్నాథస్వామివారివృత్తాంత మంతయుఁ జెప్పుము."

ఆమెకు శరచ్చంద్రుఁ డిట్లు బదులుచెప్పెను. "ఆకథలు నాకంతబాగుగా దెలియవు. భువనేశ్వరుఁ డనుపేరు గలశివు నారాధించునుత్కలదేశప్రభువులు సింహవంశపు రాజులు కట్టించినభువనేశ్వరదేవాలయములు చూచితివి గదా? అవి యింతకంటెఁ బ్రాతవి. సింహవంశపురాజులయనంతరమున గంగవంశపురాజులు

సింహాసనమెక్కి యీదేశ మేలిరని చరిత్ర చెప్పుచున్నది. కాని వారు విష్ణుభక్తులు. ఆవంశమందలి మొదటిరాజులలో నొకఁడీకోవెలఁ గట్టించెను."

"అదెప్పుడు నాయనా! ఈమహాదేవాలయమును గట్టించి పుణ్యము గట్టుకొనిన యాగొప్పరాజుపే రేమి?"

"అనంగభీముఁ డని యతనిపేరు. ఆతఁడు రమారమి యేడువందలసంవత్సరముల క్రిందట సింహాసన మెక్కెను. జగన్నాథుఁ డైనవిష్ణుదేవుఁ డారాజునకు స్వప్నములోఁ గనఁబడి యుత్కలదేశపురాజధానీనగరములను విడిచి దక్షిణముగా సముద్రతీరమందలి యిసుకనేలలను బయన మైపోవలయు ననియు నక్కడఁ దనపేర నొకగుడి కట్టింపవలసినదనియు నాజ్ఞాపించిన ట్లొక కథ గలదు. అనంగభీముఁడు భగవంతునియాజ్ఞ శిరసావహించి యీగుడికట్టించె నఁట. ప్రాచీనరాజధానులు క్రమక్రమముగాఁ బాడుపడియెను. శివునియెడ భక్తి నానాఁటికి క్షీణించెను. క్రొత్తకోవెల యైనజగన్నాథస్వామియాలయము, విష్ణుభక్తి, కాలక్రమమున నభివృద్ధినొందెను."

"శివుఁడు, విష్ణుమూర్తి, యనునట్టివి పట్టి నామభేదము లే గాని భగవంతుఁ డొక్కఁడే. ఏపేరుతో మనము బూజించినను బూజ లందుకొనును. పుణ్యక్షేత్రములలో నగ్రగణ్యమైనవారణాసిలో నేటికిని శివపూజయే జరుగుచున్నది. అక్కడమీతల్లి చరమదినములు గడపఁదలఁచుకొన్నదికదా! అక్కడ ముఖ్యదేవాలయములన్నియు, శివాలయములే. ఇక్కడ పూరిలో కోవెల విష్ణుకోవెల. దేవుఁడు విష్ణుదేవుఁడే. జగన్నాథస్వామి యనుపేరుతో నున్నాఁడు. నే నేమియుఁ దెలియని యాఁడుదానను నాయనా! కాని తెలిసినవారు శివుఁడు, విష్ణుమూర్తి, యొకటే యని నాతోఁ జెప్పినారు. అతనినే యెన్నో పేరులు పెట్టి జనులు పూజింతురు."

"అమ్మా! ఆ తెలిసినవారు చెప్పినది నిజమే. ప్రపంచమందలియెల్లజాతులు సమారాధించునట్టిభగవంతుఁ డొక్కఁడేఁ కాని యజ్ఞానముచేత మనుష్యులు నామభేదములను గ్రహింపక యొకరినొకరు జంపుకొని రక్తములు ప్రవహింపఁజేసిరి."

"నాయనా! పుణ్యాత్మురాలైన మీతల్లిహృదయము వారణాసిమీఁదనే యుంచి యాపుణ్యక్షేత్రములోనే దినములు గడప నిశ్చయించుకొన్నది. మనము చక్కగా దేహయాత్ర గడపి ప్రపంచవ్యవహారములలోనుండి, సంసారపుగొడవలలోనుండి మరలఁదగినకాలము వచ్చినప్పుడు మనశాస్త్రములు విధించినధర్మమిదే.

జగన్నాథస్వామి నాకొమారున కెప్పటి యారోగ్యమియ్యవలె నాయనా! విధేయురాలైనమా కాళిని బిడ్డలతల్లిఁ జేసి దానియిల్లది దిద్దుకొనునట్లు చేయవలె నాయనా! భూలోకములో నేను జేయవలసినపని యయిపోయినది. ఎంతయైన జీవితశేష మీ క్షేత్రమునందే గడపఁదలఁచి స్వామివారి యిష్టప్రకారము నడుచుకొన్నపక్షమున జగన్నాథదేవుఁ డామెను భక్తురాలిగా నంగీకరించు నేమో!'' ఈచిట్టచివర మాటలో నున్నగంభీరమైన యర్థము విచారించి కాళి యడఁకెను.

మఱునాఁడుదయమునఁ దూర్పుదిక్కున భానుమండలము ప్రభావంతమై యుదయించి వెలుఁగొందెను. సూర్యోదయము కాఁగానే యామహాలయము యొక్క కవాటములు తెఱవఁబడెను. తెఱచినతోడనే తైర్థికప్రవాహములు పావనావరణములోఁ జొఱబడెను. అది విశాలమైన చతురస్రము. పొడవాఱు పందలయేబదియడుగులు. వెడల్పు నున్నందలనుప్పదియడుగులు. ఆయావరణము నిండ నెన్నో చిన్నదేవాలయములు, దేవతాపీఠములు కలవు. వాటినడుమ కైంకర్యములు జరిగెడుభోగమందిరముతోఁడను గానవినోదములు జరిగెడు నాట్యమందిరముతోడను, తైర్థికులు గుమిగూడునట్టి జగన్మోహనమందిరముతోడను, జగన్నాథస్వామివారివిగ్రహము లుండెడి విమానమను గర్భగుడితోడను మహాలయము భాసిల్లుచుండును. సంవత్సరమున కొకసారి రథోత్సవ కాలమున నీవిగ్రహములు కోవెల విడిచి వసంతక్షేత్రమునకుఁ దీసికొని పోఁబడును. ఉత్కలదేశ సామంతరాజులు కలపఁ బంపుదురు. ఆకలపతో మూఁడు గొప్పరథములు కట్టఁబడును. సంపన్నులగు భక్తులు పట్టుబట్టలు, జరిబట్టలు స్వామికిఁ బంపుదురు. విగ్రహములు మూఁడు; ఆవిగ్రహములు మూఁడు దెచ్చి జగన్నాథవిగ్రహ మొకరథము మీఁదను, బలభద్రవిగ్రహ మొక్కరథముమీఁదను సుభద్రావిగ్రహ మింకొక రథము మీఁదను బెట్టుదురు. వేలకొలఁది తీర్థవాసులు రథము త్రాళ్ళఁబట్టుకొని లాగుదురు. ఆసమయమున విశాలమైన వీథియు, దేవాలయ శిఖరములు, గృహముల పైకప్పులు, మనుష్యుల మయములై జనసముద్ర మట్లుండును. రథములు కదల నారంభింపఁగానే చప్పట్లు లాకాశము బీటలువారు నట్లు బయలుదేఱును. ఆ ధ్వనికి భేరీభాంకారములు తోడుసూపును. నిరుపమానమహోత్సవములు జరుగు ప్రదేశములలోసైత మటువంటి యుత్సవము లుండునా యని సందియముతోఁచునట్లు రథోత్సవము నిరుపమానవైభవముతో జరుగును.

రథములు దినదినము కొంచెము కొంచెముగా నడచును. తీర్థవాసులు మఱునాఁటి యుదయమున మఱింత యుత్సాహముతో త్రాళ్ళఁబూని పవిత్రమైనపాటు

పడుటకు సంతోషపూర్వకముగాఁ గుమిగూడుదురు. విగ్రహములను వసంతగృహమును జేర్చువఱకునీయుత్సవమిట్లే రమారమి యొకవారమువఱకు జరుగుచుండును. ఒకప్పుడింతకంటె నెక్కువకాలము పట్టును. ఈదినములలో తీర్థవాసులు పట్టణములో నున్నకోవెల లన్నిటినిఁ జూచి సముద్రములోనో, పుణ్యతటాకములోనో స్నానమాడి, స్వామివారికి భోగము చేసి నైవేద్యము చేసిన మహాప్రసాదమునే భక్షించుచుందురు. దినమునకు ముప్పదినలుపదివేలమంది దేవతాదర్శనము చేయుటకుముందు సముద్రములో స్నానము చేయుదురు. రమారమి లక్షజనులు ప్రతిదినము దేవాలయమునుండి దేవతానివేదనమైన భక్ష్యభోజ్యములు దెచ్చుకొని తినుచుందురు. ఈప్రసాదము మిక్కిలి పవిత్రమైనది. ఇది వర్ణభేదము, జాతిభేదములేక యెల్లవారికిఁ బంచిపెట్టఁబడును. మహాప్రసాదము గ్రహించుటకగ్రవర్ణమువారు సైత మంత్యవర్ణమువారి ప్రక్కను నిస్సంశయముగా గూర్చుందురు. వర్ణభేదమవశ్యమని నమ్మువారక్కడమాత్రము మినహాయింపు గలదని చెప్పుదురు. ఈమినహాయింపు మఱియేస్థలమునను మఱియేసమయమునను జనులొప్పుకొనరు.

ఈయుత్సవమైన తరువాతఁ దీర్థవాసు లనేకులు పట్టణము విడిచి పోవుదురు. ఎక్కువభక్తికలవారు స్వామిరథములు మఱలి వచ్చునప్పుడు వాటిని లాగి సాయము చేయుటకై మఱికొంతకాలముందు మొత్తముమీఁద రథములరాకపోకలకు మూఁడు నాలుగువారములు పట్టును. వర్షాకాలమందలి యీమూఁడునాలుగువారములు సంవత్సరమంతలోను జగన్నాథక్షేత్రమున మిక్కిలి పవిత్రమైనదినములు.

తైర్థికులల్పసంఖ్యాకులుగా సంవత్సరముపొడుగున నీక్షేత్రమునకుఁ బోవుచుందురు. జగత్కిశోరరాయులు వచ్చినప్పుడు చాలమంది తైర్థికులు చేరిరి. సూర్యోదయము కాకమునుపు మిక్కిలి పెందలకడలేచి, జగత్కిశోరునితల్లియు, భార్యయు భక్తితత్పరలై పండా చెప్పినచొప్పున నడువసాగిరి. ఆక్షేత్రములో మూఁడుపవిత్రసరస్సులు గలవు. ఇంద్రద్యుమ్నసరస్సు, మార్కండసరస్సు, శ్వేతగంగయని వాటిపేళ్ళు. సూర్యోదయముకాకమునుపే వారిద్దరాసరస్సులలో నొకదానిలో స్నానముచేసి యాదినమున కుచితమగునట్లు పట్టుబట్టలుకట్టుకొని నానాదేవాలయములుచూచుచుఁ గాలినడకను బట్టణమందు దిరుగఁజొచ్చిరి. కపాలలోచనుదేవాలయము, జంబుకేశ్వరుని గుడి, లోకనాథునికోవెల దర్శించి జగన్నాథాలయమున కావల నున్నమఠముల సందర్శించిరి. ఒకవీధినుండి యొకవీధికి, నొకయాలయమునుండి మఱియొకయాలయమునకుఁ బాదచారిణులై పోవుచున్నను, జగత్కిశోరునితల్లి గాళ్లనొప్పులు

కాని, యాయాసము గాని యెఱుఁగదయ్యెను. తీర్థవాసిని కుదయించునావేశము, బలము, కాళియందుఁగూడ నుదయించుటంజేసి యామె యేమియు నలగ లేదు.

ఆస్త్రీలిద్దఱు మఱల బసకు వచ్చునప్పటికి సూర్యబింబము నెత్తిమీఁదికి వచ్చెను. ఆలయమునుండి మహాప్రసాదము వచ్చును గనుక వారు బసలో వేరే వంటఁ జేసికొనలేదు. ఈమహాప్రసాదము చేయుటకుఁ దమడబ్బు కొంత పడునేని దమకు పుణ్యమని భాగ్యవంతు లగుతైర్థికులు భావింతురు. ఒక్కదినమందే యేబదియాఱుపిండివంటలువండి రాసులు రాసులుగాఁ బోయుదురు. ఇందునిమిత్తము ప్రతిదినము వేలకొలఁదిరూపాయలు వ్యయము చేయఁబడును. ఆపిండివంటలు స్వామికి నివేదనము చేసి చుట్టుప్రక్కలపల్లియలలోనిజనులకుఁ బంచిపెట్టుదురు. జగత్కిశోరుని పండాబ్రాహ్మణుఁ డాయనవద్దనుంచి పెద్దమొత్తమును లాగివేసెను. జగత్కిశోరుఁడు స్వామియాలయము ప్రవేశించునప్పటికిఁ బదిగంటలయ్యెను. శరచ్చంద్రు డతనిచేయి బట్టుకొని తీసికొనివచ్చెను. అతనితోఁదల్లియు భార్యయు గూడ వచ్చిరి. ఆయంగనలిద్దఱు చిన్నచిన్నగుళ్ళవద్దఁగొంతధన మిచ్చుచు వచ్చి, యందఱు కలసి జగన్నాథస్వామియాలయము సమీపించిరి. ముందుగా వారు భోగమందిరమును దాటి పిమ్మట గాన మందిరము నతిక్రమించి పలువురు తీర్థవాసులు పరివేష్టింప జగన్మోహనమందిరమునఁ నిలువంబడిరి.

వారియెదుట మందిరములోనే రమారమి పదియేనుగజములదూరమున మణిమయ మైనరత్నవేదిక యుండెను. దానిమీఁదనే దేవతావిగ్రహములు మూఁడును కలవు. ఆవిగ్రహములు తీర్థవాసులదృష్టిపథమునఁబడఁగానే పావన మైనయానంద పారవశ్యముచేత వారినోటనుండి కేకలు బయలుదేఱెను. పరమభక్తులహృదయపుటములనుండి ప్రార్థనలు నెమ్మదిగాఁ బయలుదేఱెను. ఎంతోయభిలాషతోను, నెంతో యాత్రముఁ దెలుపుచూపులతో నంధకారమయ మైనగర్భగుడిలో నున్న యావిగ్రహములను జూచి మూర్ఛావస్థలో నున్నట్లు మైమఱచిరి. నానాశ్రమల కాకర మైనయాత్ర చేయునప్పు డెన్నోమాసములు హృదయమందు వర్ధిల్లిన యాశలు సఫలము లైనవి. పావనహృదయములయందు గర్భితము లైనకోరికలు నెరవేఱినవి. భక్తి చేత సాష్టాంగనమస్కారములు చేయునప్పు డానందబాష్పములు భక్తురాండ్ర కన్నులనుండి స్రవించుచుండెను. ఎట్టకేలకు నియమితసమయము వచ్చెను. ప్రధానార్చకుఁడు సంజ్ఞచేసెను. అప్పుడందఱు స్వామిసమీపమునకుఁ బోవచ్చును. అంతట తైర్థికులు నిశ్శబ్దముగా నడుగు ముందుకు వేసి, భయభక్తు

లతో రత్నవేదికాసమీపమునకుఁ బోయిరి. ఆచీకటిగుడి నిశ్శబ్దమై యుండెను. భక్తులు పెదవి గదపక యూరకుండిరి. వెలవెలబోవుచు దీపములు మందకాంతిఁ జిమ్ముచుండెను. కాలుచున్న సుగంధద్రవ్యములతోగ మేఘములుగాఁ బైకి లేచుచుండెను. స్వామిదర్శనము చేయఁదలఁచి వచ్చినయాత్రికులు తడబడ పడుచు నిలువంబడ, పండాబ్రాహ్మణులు వారిని స్వామిసన్నిధికి దీసికొనిపోవుచుండిరి. ఆయుంగవలు తమ్మెక్కడికిఁ దీసికొని పోవుచున్నారో యెఱుఁగక గోడలు, స్తంభములు చూడక పండాలవెంటఁ బోయిరి. పవిత్రమైనదివ్యస్థలమున నుంటిమన్నమాటమాత్రమే యెఱిగి యుండిరి. నోటమాట లేక సాష్టాంగదండప్రణామము చేయునప్పుడు దేవతావిగ్రహములను మనసారఁ జూచుచుందురు.

నమస్కారమైనతరువాత భక్తులు తాము తెచ్చినకానుకలు వేదికమెట్లమీద సమర్పణము చేయుదురు. బిహారుదేశమునుండియు, నుత్తరహిందూస్థానమునుండియు, వచ్చినపేదకూలివాడు ధోవతికొంగున గట్టినమూట విప్పి రాగిడబ్బులు సమర్పించెను. వర్తకునిభార్య బుటేదారుచీర సమర్పించెను. చిల్లరవర్తకుని యిల్లాలు పూవులనర్పించెను. భాగ్యవంతులగుస్త్రీలు రత్నఖచితమైనకంకణములు, కంఠాభరణములు సమర్పించిరి. జమీందారులు మొహరీల నిచ్చిరి. సమస్తవిధములైనకానుకలను సమస్తవిధములైనజనులు సమర్పించి తమతమభక్తివిశేషమును వెల్లడిచేసిరి. జగత్కిశోరునితల్లి యందరికంటె జిట్టచివర గర్భగుడి వదలివెళ్ళెను. ఆమె గుడి విడుచునప్పుడు బాష్పములు కన్నులనుండి కార గుమారునియొక్కయు, గోడలియొక్కయు శిరస్సులుస్పృశించి చిరకాలమునుండి హృదయమున వర్థిల్లజేయుచున్న యాప్రతిజ్ఞను బయలుపుచ్చెను. ఓ జగన్నాథ! ఓలోకనాయకా! నాకుమారునకు దేహారోగ్య మిచ్చి, యైశ్వర్య మిచ్చి కాపాడుము. నాకోడలు కడుపెడుబిడ్డలతల్లియై గృహయజమానురాలై మనుమల మనుమరాండ్రనెత్తవలెను. ఈలోకములో నేను డెబ్బదిసంవత్సరములు బ్రతికినాను. నావని యైపోయినది. నేడు మొదలుకొని నేను నీసేవ జేసెదను. నాశరీరము నీకర్పించెదను. ఈపట్టణములో నేయుండెదను. ఈముసలి దానికి నీవే శరణంబవు. ఈసముద్రతీరమున నున్నవాడవు నీవే. నాహృదయమున నున్నవాడవు నీవే.

ఈప్రతిజ్ఞ వినఁగా నేయక్కడనున్న వారికందఱకు మేను కంపించెను. తల్లి కట్టిరహస్యమనోరథ మున్నదని జగత్కిశోరునకుఁ గాని, కాళికి గాని తెలియదు. ఆమెసంసారము నెంతో నేర్పుతో దిద్ది చక్కఁబెట్టుచువచ్చెను. ఆమె లేనిచో

గృహమున సంతోషమే యుండదు. అటువంటిసాత్వదేవతను ప్రతిజ్ఞావిముక్తురాలినిజేసి మరల వెంటఁబెట్టుకొనిపోవుటకు జగత్కిశోరరాయలు తనకున్న యావద్ధనమునైన నియ్యసిద్ధముగా యుండెను. ఆమె ప్రాణములకంటెఁ గొడుకునకుఁ గోడలికిఁ బ్రియమైనదగుటచే నామెను దోడుకొని పోకుండ నింటికి మరలి పోవుట యనఁగానే వారిహృదయములు శూన్యము లయ్యెను. కాన చేయునది లేదు. ప్రతిజ్ఞ నోటనుండి వచ్చెను.

అప్పుడు కాళి యేడ్చుచు నత్తగారికిట్లనియె. "అమ్మా! మిమ్ముఁ దీసికొనిపోకుండ మేము వర్ధమానము వెళ్ళము. గృహయజమానురాలు లేకుండ మాకు గృహ మేమిటి?"

"బిడ్డా! నీవే గృహయజమానురాలవు కమ్మా! నీవంతు వచ్చినది. బిడ్డల తల్లివికమ్మా! జగన్నాథస్వామి నామొఱ లాలకించినాఁడు. భూమిమీఁద నేను బ్రతుకవలసిన కాలమెంతో లేదు. చరమావస్థలో మావంటి ముసలివాండ్రు దైవభక్తిగలిగి, యూర్ధ్వలోకప్రయాణమునకుఁ బ్రయత్నము చేసికొనుచు నుండవలెనని ధర్మశాస్త్రములు వాదించుచున్నవి. ఈప్రపంచములో నేను వచ్చినపని యైనది. నామాట నేను చెప్పివేసినాను."

సుధాశరచ్చంద్రము

నాల్గవభాగము.

ఇరువదినాల్గవప్రకరణము.

సరస్సు.

పశ్చాత్తాపము.

శరచ్చంద్రునితల్లి కలత్తాకు వచ్చి యచటనుండినదినములు సంతోషశూన్యములుగా బెంగఁబెట్టుకొని గడుపవలసివచ్చెను. పుణ్యక్షేత్రమైన కాశిలోఁ దన జీవితశేషమును ధర్మమార్గమున భక్తితత్పరయై గడుప నామె యెంతో యభిలాష పడెను. కాని ప్రాపంచికపాశములు మరల నామెను సంసారగొడవలలోనికి లాగుకొని వచ్చినవి. వాటిబారినుండి తప్పించుకొని యెటులైనవారణాసిక్షేత్రమునకు మరలవెళ్ళి పడవలెనని యామె కోరుచుండెను. జగత్కిశోరరాయలను గురించియు నతనిభార్యనుగురించియు శుభవార్తలప్పుడప్పుడు సరిగా దెలియుచుండెను. వారిద్దఱు సురక్షితముగా మరల వర్ధమానమును జేరవలయుననియు, దాను సంసారబంధములనుండి వెండియు విముక్తిఁజెంది చరమావస్థలో నెఱపవలసినధర్మము నెఱపుటకు సామర్థ్యము కలుగఁజేయవలసిన దనియు, నుదయాస్తమయములు పరమేశ్వరుని వేఁడుకొనఁజొచ్చెను.

జగత్కిశోరునితల్లి యంత్యకాలము పూరీక్షేత్రమునందే గడుప దలఁచి యక్కడనే కాపురముండఁ దలఁచుకొన్నట్లామెకు జాబువచ్చెను. అది చూచుకొని యామెతనలో తా నిట్లనుకొనియెను. "నావియ్యపురా లదృష్టవంతురాలు. ఆమెవలె స్వధర్మమునెఱవేర్చి జీవితము కృతకృత్యము చేసికొన్నట్టిస్త్రీలు మిక్కిలి యరుదుగానుందురు. సంసారభారము కొడుకు కోడలు వహించినారు. వారిల్లు దిద్దుకొను చుండఁగా నామె కన్నులారఁజూచి సంతోషించినది. ఇప్పుడామె భక్తిమార్గమునఁ బడిపోయినది. అటువంటి యుత్తమజన్మము, ధార్మికవృత్తితోనే యంత మగుట యేమియాశ్చర్యము! ఓపరమేశ్వరా! నేను నీనిర్ణయప్రకారమే నడుచుచున్నయెడల నన్ను నీసేవకురాలనుగా నంగీకరించి, దుఃఖమగ్నుఁడైననాకుమారుని సముద్ధరింపుము."

కుమారునిమాట జ్ఞప్తికివచ్చినప్పుడెల్ల పాప మావృద్ధవితంతువుమొగము వెలవెలఁబాఱుచు లోనున్నబెంగఁ దెలియఁజేయు చుండును. ఆమెయాజ్ఞ శిరసావహించి శరచ్చంద్రుఁ డాత్మసౌఖ్యమును గోల్పోయినాఁ డని యామె యెఱుఁగును. మాతృవాక్యపరిపాలనమువలన నతనికిఁ గలిగిననష్టము గూడ నామె యెఱుఁగును. శరచ్చంద్రుఁడు తల్లికి వ్రాసినజాబులు తక్కువ. వానిలో విషయముగూడ సంక్షిప్తముగా నుండును. ఎప్పుడు వ్రాసినను బావమాట, లోఁబుట్టువుమాటే గాని తనమాటేమి వ్రాయఁడు. కలకత్తాకు మరలఁబోయి విద్యాభ్యాసము చేయఁదలఁచుకొన్నట్లు జాబులవలనఁ గనఁబడదు. ఒకనాఁడు సాయంకాలము శరచ్చంద్రునితల్లి దీపముదగ్గఱ నొంటిగాఁ గూర్చుండి కుమారునియొద్దనుండి వచ్చినసంక్షిప్త లేఖలను దిరుగవేయుచుండెను. అప్పుడామె హృదయము శూన్యముగ నుండెను. ఆమెమనస్సును భయ మావహించెను. ఆమె మనోగతము లైన యాలోచనల నెవ్వరికి విప్పి చెప్పలేదు. వానిని హృదయమునందే నిక్షిప్తము చేసి పలుమాఱు తనలో తానే వితర్కించుకొనుచు వచ్చెను. గంభీరుఁడును, దయాశాలియునగు తనకొమరునిజీవితము తనగర్వమువల్లను, దన లౌక్యమువల్లను భగ్నమైన దని యామెభయఁపడి వడకఁజొచ్చెను.

కూఁతురు డబ్బాటుగ నదృశ్యురాలయినదని విని యుమయొక్కతల్లి కలకత్తాకువచ్చెను. ఆమె పలుమాఱు శరచ్చంద్రునితల్లినిఁ జూచుచుండెను. దినదినము వారికనేకవిషయములగూర్చి దీర్ఘసంభాషణలు జరుగుచు వచ్చెను. తన కూఁతురు తనకుఁదక్కక బెంగ పెట్టిపోయినందు కామె సహజమైన దుఃఖముతోఁ జెప్పుకొని యేడ్చెను. ఆబిడ్డను దలఁచుకొనినప్పుడెల్ల మనస్సుదుఃఖపూరితమై

కన్నులు బాష్పపూరితములై యుండుననియు, నామెమాట యనుక్షణము స్మరణకు రాకమానదనియుఁ జెప్పి వగచి యిట్లనియెను. "అమ్మా! దైవమును నిందింప నేల? నేను చల్లనివిత్తనములపంట కోసికొనకతప్పునా. ఈజన్మములో నిటువంటి ఘోరదుఃఖము సంప్రాప్తించుటకు నేను పూర్వజన్మములో నెన్నిపాపములు చేసినానో. ఐశ్వర్యముఁ జూచి, కన్నులు పొరలు గప్పినందున జెడుదారులు ద్రొక్కుచున్న పడుచువానికి నాబిడ్డను గట్టిపెట్టితిని గాని, మఱి యేపేదవాని చేతిలోఁ బెట్టినను, నాతల్లి నాయందు పెద్దతనములో నాకు సంరక్షణ సేయుటకును, నాకు మనస్సంతోషము గలుగుటకును గంజియన్నము దినుచు నైన బ్రతికి యుండునుగదా?"

ఆమెకు శరచ్చంద్రునితల్లి యిట్లనియె "అక్కా! నిన్ను నీవు తిట్టుకొనవద్దు. భగవంతుఁడే మనకార్యముల నిర్ణయించును. మన మాయనచేతిలోని పనిముట్లము. నిన్నుఁ దిట్టుకొనవలసిన యవసరములేదు. ఎందుకంటే, మనయుమకు వివాహమైనప్పుడు దానిమగడు చెడిపోలేదు. తప్పుదారులు త్రొక్కలేదు. అందరివలెనే చదువుకొని బుద్ధిమంతుఁడై బాగుపడుననుకొన్నాము. అతడుమనయందరియిండ్లలోనివేయుఁ గలిగినంత భాగ్యవంతుఁడైనప్పటికి నడుమనడుమ తాల్పుకారు గ్రామమున కేలాగు వచ్చెడివాఁడో పట్టణములో నున్న పెద్దవారి నందఱను జూచి యేలాగు నమస్కారములు చేసి పోయెడు వాఁడో మనకన్నులతో మనము చూడలేదటమ్మా? ఆదినములన్నియు నాకు జ్ఞాపకమున్నవి. గ్రామమునకు వచ్చినప్పుడు ధనంజయుఁడు నన్ను జూడక వెళ్ళెడువాఁడు కాఁడు. పాపము! ఉమ నన్ను పిన్నీయని పిలుచు చుండుటచేత ధనంజయుఁడు నన్నత్తగారూ యనిపిలుచుచుండెడివాఁడు. నీయల్లు డాదినములలో నేను మావినపిల్లలందఱిలో బుద్ధిమంతుఁడు" ఉమతల్లి యామె కిట్లనియె "ఆగొడవలు త్రవ్వకమ్మా! నాగుండె పగిలిపోవును. అక్కా! నిజమే నీ వన్నమాట. మాధనంజయుఁడు జాలిగుండె గలపిల్లవాఁడే. అప్పుడుగా దిప్పటికైనజాలిగుండెవాఁడే. ఏమైననేమి? పెద్దగోతిలో దిగిచెడిపోయినాఁడు. నాతల్లిని బలిపెట్టినాను."

"అక్కా! విచారింపవద్దు ఉమకష్టములు గట్టెక్కినవి. తాల్పుకారు గ్రామములో నున్నటిదాక నాతొడమీదఁ గూర్చుండి నాప్రక్క నాడుకొని నన్ను పిన్నీ, పిన్నీ యని యెంతో ప్రేమతోఁ బిలుచుచు ముద్దుల మాటగట్టుచుండిన యాబిడ్డను దలఁచుకొన్నప్పుడు పిచ్చియెత్తిపోవు నేమో యని నాకు భయము వేయును. నాకన్నులనుండి నీటిబొట్లు రాక నెత్తురుబొట్లే రాలును. దానికి నేఁటికి

శాశ్వతవిశ్రాంతి కలిగినది. బ్రతికియున్నవాళ్లము మనమే దుఃఖములపాలై కష్టములనుభవింపవలెను. విశ్వేశ్వరుఁడు నాకొమరున కాయురారోగ్యములిచ్చి రక్షించవలె. బాధలతోను దుఃఖములతోను నిండిన యీ ప్రపంచపుగొడవలలోనుండ నేను మరలిపోయి కృష్ణా రామా యనుకొనుచుఁ గూర్చుండవలె."

"అక్కా! దేవుఁడు నీకుమారుని రక్షించును. ఏమంటే శరశ్చంద్రునివలె మంచితనము దయాదాక్షిణ్యములు గలపిల్లవానిని నాకన్నులతో నేఁ జూడలేను. అతఁడు హేమునకు, బిందునకు, సోదరునికంటె నెక్కువగా నున్నాఁడు. మీయల్లుఁడు యాత్రకు వెళ్లుచున్నప్పు డతనిసంరక్షణకొఱకు మీవాఁడు చదువుసహితము మానుకొన్నాఁడు. అక్కా! అతఁడు త్వరలోనే వచ్చి నీముసలితనమందు నీకుఁ జేయూతయై నీకానందము గలిగింపఁ గలడు."

ఈమాట వినఁగానే శరశ్చంద్రునితల్లి నిట్టూర్పు విడిచి సన్నని యెలుఁగున నిట్లనియె. "అతనిగుండెమీఁద గొప్పబరువున్నది. వాని బ్రతుకు సుఖములేనిదైపోయినది. అదే నాకు భయము."

"ఓహో! పాపము సుధను మీవాఁడు వివాహము చేసుకోవలెనని తలపెట్టినమాటా నీవిప్పు డనుచుండినది. అక్కా! ఆమాటెత్తకు. ఆకథ మనము మఱచిపోదము. హేముఁడు చిన్నవాఁడు. బిందువానికన్న చిన్నది. తెలివితక్కువపిల్లవానిమాటలు పాటిచేసి తెలివితక్కువ యాలోచనఁ జేసినారు. ఇదివఱకైనదానికే బిందు విచారించుచున్నది. ఇప్పుడు పొరఁబాటుచేతనైన నామె యాప్రసంగమెత్తదు. అక్కా! ఈయపనింద నీకొడుకునకు బాధించదు. అతడు మగవాఁడు. అతని కేమి? అటువంటి సంగతులు ఆఁడవాండ్రకు మనకు బాధకలిగించును. బిందు మరల నట్టి మాటే తలపెట్టదు. పాపము! సుధ యావజ్జీవనము తీరని యపనిందపాలైనది. అక్కా! సుధ మునుపటిసుధ కాదు సుమా పాపము! చిక్కిశల్యమై పోయినది. కన్నులు గుంటలు పడినవి. మొగము పాలిపోయినది. నెత్తురుచుక్క లేదు. అట్టె మాటాడదు. పగలెల్లనేదో పనిపాటలతోనే కాలక్షేపము చేయును. అది యెంతో సుకుమారి. పాపమీనింద కడచి యది యెట్లు బ్రదుకునో తెలియదు."

"అయ్యో కూఁతురా! సుధను తలఁచుకొంటినా నాబాధలు నేను మఱచిపోదును. చిన్నతనమందే వితంతువైపోయినది కాదా. ఈవృత్తాంతము జరిగినతరువాత వైధవ్యదుఃఖము రెట్టింపగును. కుఱ్ఱి పాడకట్టు, దానిలోప మేమున్నది?

ఎవరిలోపమని చెప్పఁగలను? నాకొడుకు దానిని వివాహ మాడవలె నని కోరినప్పుడు బిందు నురుద్దేశము లేకయే సమ్మతించెను. ఈ మధ్యకలకత్తాలో వితంతువివాహము లెన్నో జరిగినవి. మనశాస్త్రము లటువంటి వివాహముల నొప్పుకొనుచున్న వని పండితులు చెప్పుచున్నారు. అందుచేత నటువంటివివాహము తప్పు కాదని బిందు తలచియుండవచ్చును. చెల్లెలు శరశ్చంద్రుఁడు కలసి యనుకూల దాంపత్యము కలిగియుండినపక్షమున లోకము జోలియెవరికి కావలె నని యామె తలఁచి యుండును. ఔ నక్కా! బిందు మంచి యుద్దేశముతో నేచేసినది. ఆమెను నేను నిందించను. సుధను తీసికొని నాయొద్ద కొకసారి రమ్మని చెప్పు. ఒకసారి వాండ్రను జూడవలెననియున్నది. ఎంతో శాంతము వినయము గలపిల్లలు; వాండ్ర మొగములు జూచినయెడల నాకన్నులు చల్లఁగా నుండును."

"అక్కా! వచ్చి నిన్ను జూడవలసినదని తప్పక వారితోఁ జెప్పెదను. కాని వాళ్ళకు పగలెల్ల పనులే యుండును. నేను పెద్దదాన నైనాను. నేను వాండ్రకేవిధమైన సహాయము చేయఁజాలను. నే నేపని చేయవలెనని చేయిపెట్టినను ముందుగా నా కుమారుఁడే జ్ఞప్తికివచ్చును. కన్నులు నీళ్ళుగ్రమ్మి కనబడవు కూర తరుగుకొనునప్పుడు నాకును జ్ఞప్తికివచ్చును. ఆపనియంటే దానికెంతో యిష్టము. బియ్యము ప్రొయిమీద పడవేసితినా, యమజ్ఞాపకము వచ్చును. వంటలో నా కదియెంతో సాయము చేయుచుండెడిది. నేనిప్పుడు పనికిరానిదాన నైనాను. ఇప్పుడు నాకు సుధాబిందులుతప్ప మఱె దిక్కెవ రున్నారు? దైవమువాండ్రనైన దీర్ఘాయుర్దాయమిచ్చి కాపాడవలెను."

"వాండ్రు నాకు మాకాళీశరశ్చంద్రులవంటివారే. భూమిమీఁద నేనెన్నో దినములు బ్రదుకనని సుధాబిందులతోఁ జెప్పు. చిన్నప్పటినుండి నేను ప్రేమించినవారిని ముసలితనములో మరచిపో నని చెప్పు."

ఆమరునాఁడు సాయంకాలము శరశ్చంద్రునితల్లి బిందును జూడవచ్చెను. సుధాశరశ్చంద్రుల వివాహసంకల్పము చెడిపోయినతరువాత వారికుటుంబము నామె చూచుటకదే మొదలు. హేముడు పూజ్యురాలయిన యాయవ్వ నసాధారణమైన గౌరవముతో ప్రీతితో సన్మానించెను. పల్లకిలోనుండి చేయూఁతయిచ్చి యామె నుదింపి జాగ్రత్తగా బిందున్న గదిలోని కామె నతఁడు తీసికొనిపోయెను. ఆమెను జూచి బిందు వినయముతో నెదురుగావచ్చి పాదము లంటి నమస్కరించి యొక పీటమీఁదఁ గూర్చుండఁబెట్టెను. ఆయవ్వ రాక సుధయుఁ జూచెను గాని యా

వృద్ధాంగనయొక్క దయానురాగములకుఁ దగనిదియుంబోలె నామె నేరము చేసిన దానివలె సిగ్గుపడి తలవంచికొని గది విడిచి యావలకుఁ బోయెను.

“అమ్మాయీ బిందూ! యింతకాలమునుండి నన్నుఁజూచుట కొక్కసారియైన వచ్చినదానవు కావే మే? పిన్నీ, పిన్నీయని యెంతో ప్రేమతోఁ బిలచెడు దానవు. ఆముసలమ్మను మఱచిపోయినావా యేమి?”

“లేదు పిన్నీ నే నెప్పుడును మఱచిపోను. కలకత్తాలో మా కెన్నోచిక్కులు రోగములు సంభవించినవి మీ రెఱుఁగరా? తాల్పుకాచు వెళ్ళఁదలఁచుకొన్నాము. అక్కడ మావంటి పేదవాండ్రు స్వేచ్ఛగా సుఖముగా నుండవచ్చును.”

“నిజము నిజము బిందూ! ఈపెద్దపట్టణము ద్రవ్యవంతులకు నుద్యోగస్థులకుఁ గాని బీదవారికిఁ గాదు. ఇక్కడ నేనుగూడ నొంటిగ నున్నాను. సంతోషము లేదు. వారణాసి యెప్పుడు వెళ్ళుదునా యని కోరుచున్నాము. భూలోకబంధములు భేదించుట మిక్కిలి కష్టము. నాపని అయిపోయినది. నావంటి పెద్దవానికి దైవభక్తి, ధర్మకార్యములు జరిగినవి.”

“పిన్నీ! నీవు ధన్యురాలవు. జీవముయొక్కధర్మములు చక్కఁగా నెఱవేర్చితివి. నీజీవన మంతయు మొదటనుండి చివరవఱకు భక్తిమయము. వారణాసిలో నీవు జీవితశేషముఁ గడపుట నీవెనుకటి పవిత్రచరిత్రకుఁ దగి యున్నది. మేము సంసారపుగోడవలమధ్యను బడి యున్నాము. నియుదాహరణము పాపమార్గమునఁ బడిపోకుండ మావంటి వారికి మార్గదర్శక మగుఁ గాక! కాళి సుఖముగానున్నట్లు వార్త తెలిసినదా?”

“తెలిసినదమ్మా! భగవంతునియనుగ్రహ మున్నది. మాఅల్లుఁడు జగత్కిశోరరాయలు జగన్నాథస్వామియనుగ్రహముచేత రోగము కుదిరి బాగుపడినాఁడు. వారుమరల వర్ధమానమునకు వచ్చియున్నారు. నాకొడుకుకూడ నాకు జాబులువ్రాయుచున్నాఁడు కాని, తిఱుమేగా వ్రాయఁడు. తాను తిరిగి కలకత్తాకు వెళ్ళుటనుగుఱించి యేమియు వ్రాయఁడు.”

ఆమాటలకు బిందు ప్రత్యుత్తరమియ్యక యూరకుండెను.

“అమ్మాయీ బిందు! నాకొమరుఁడు కలకత్తా వచ్చువఱకు నేను కనిపెట్టుకొని యిక్కడ నుండఁజాలను. సర్వజ్ఞుఁడైన భగవంతుఁడే నాబిడ్డను నడిపింపఁ

గలఁడు. శరచ్చంద్రుఁడు పెద్దవాఁడైనాఁడు. తల్లిసాయ మపేక్ష్యము. నేనుండవలసినచోటు వారణాసి గాని యీస్థలము కాదు. జోక్యము కలుగఁజేసికొనుట వలన వానికి నష్టము కలుగును గాని లాభము కలుగదు."

బిందు దానికిని బదులు చెప్పలేదు.

"ఏది యెట్లయినను జాగుసేయక నేను వారణాసికిమరలి పోఁదలఁచినాను. బిందూ మిమ్ము మరలఁ జూడను గనుక నిన్ను, సుధను జూచి దీవించి వెళ్ళవలెనని వచ్చినాను. మీరు తల్లిలేనిపిల్లలు. నీమీఁద మీతల్లి కెంత ప్రేమో, నాకునునంతే ప్రేమ. మీరు సుఖపడునట్లు చేయుటకు నాకు భగవంతుఁడు తోడ్పడుగాక!"

ప్రేమరసపూరితములైన యామాటలువిని బిందు కన్నీరు విడిచెను కాని, యప్పటికి మాటాడ లేదు.

"పరమసాధువైన సుధయెక్కడ? దాని నొక్కసారి పిలు. నేను వెళ్ళకముందు దాని నొక్కసారి కౌఁగలించికొని దీవించవలయునని యున్నది."

బిందు సుధను దీసికొని వచ్చెను. తాల్పుకూరు గ్రామములో శరచ్చంద్రుని తల్లి చూచినప్పటికంటె సుధ పొడవెదిగి మిక్కిలి పలుచబడెను. ఆమె మెత్తని చెక్కిలు తెల్లఁబడెను. కన్నులు దీర్ఘవిచారమును సూచించెను. చేతులు సన్నగా పొడవుగానుండెను. చిన్ననాఁటి చిఱునవ్వు లామె పెదవులను విడిచి యెందో పోయెను. అతిబాల్యమున సంప్రాప్తమైన దీర్ఘవిచారము మొగమున నెలకొని యున్నట్లు స్పష్టముగఁ గనబడుచుండెను. ఈమార్పులు చూచి శరచ్చంద్రుని తల్లి భయపడెను. సుధ తలక్రిందకువంచి యామెపాదచరణము లంటినప్పుడు విచారజనితములో, పశ్చాత్తాపజనితములో బాష్పము లామెకన్నులనుండి బాలికశిరస్సుమీఁదఁ బడెను.

"బిడ్డా! దగ్గఱకు రమ్ము. నన్నుఁ గౌఁగిలించికొమ్ము! మనఃపూర్తిగా నంతఃకరణశుద్ధిగా దీవించనిమ్ము. ఈయైదాఱునెలలలోనే యెంతచిక్కిపోతివే తల్లీ! చిన్నతనమందే నీకుఁ దగనిదుఃఖము వచ్చిపడినదే యమ్మా. చిఱునవ్వువెన్నెలలు గాయు నీమొగము దుఃఖ మొందఁదగినదికాదు. నీసుందరనేత్రములు దుఃఖబాష్పములకుఁ దగినవికావు."

రాత్రి బిందు చుట్టముదగ్గఱ సుధను గూర్చుండఁబెట్టి బిడ్డలను బండుకొనఁబెట్టుటకు వెళ్ళెను. చమురు లేక దీపము మినుకుమినుకు మనఁజొచ్చెను. సుధ పిల్లి

కూనవలె జంకుచుఁ జిన్ననాఁడు గాల్పుకారులో నున్నప్పు డామెయొడిలోఁ గూర్చున్నట్లే యాయవ్వ యొగ్గఱఁజేరి కూర్చుండెను. ఆయవ్వమనస్సు పూర్వదినములను బూర్వవృత్తాంతములను దలఁచుకొని యప్రయత్నముగా నంతకంతకు మగను మఱింతదగ్గఱగాఁజేరఁదీసికొనియెను. పేదరాలంతయునైన సుగతల్లి సుధను దమయింటికిఁ దీసికొనివచ్చుటయు, సుధ వచ్చియురాని మాటలతోఁ దమ్ముఁ బ్రేమించువారి కొఱకు సులభముగాఁ బోవునట్టి శిశుసామాన్యసహజాంశ్రమముతోఁ జేతులుచాచి దనమీఁదఁబడుటయుఁ దానెత్తుకొని ముద్దాడుటయు నామెకు జ్ఞప్తికివచ్చెను. తల్లి పోయినతరువాత సుధ మాతాపితృహీనురాలై తానెప్పుడైనఁ బిలిచి యాదరించి నప్పుడు తల్లి పిలుపున కానందించినట్లే యానందించినదినమునుకూడ నామెకు జ్ఞప్తికివచ్చెను. అంతేకాదు. సుధ బాలవితంతువై తన దురదృష్టమును దెలిసికొనలేక బాల్యచాపలముతోను, ప్రేమతోను దన గృహమును, దన హృదయమును వెలయింపఁ జేసిననాఁటిదినములుకూడ నామెకుజ్ఞప్తికివచ్చెను. తాను గంగాసి వెళ్ళెడునాఁడు సుధ యేడ్చుచుఁ దనపాదములు విడువక తన మనస్సు కరిగించిన కథగూడ నామెకుమనోహరమయ్యెను. తల్లిచే దూపిల్ల గాయవ్వప్రేమచేతను, దయారసముచేతను వర్ధిల్లెను. ఇప్పుడుసైతము నాపెనూల నడుగంటఁజేసి యామె జీవనమును దుఃఖభాజనముజేసిన భయంకరవృత్తాంతములను మఱచిపోయి, చిన్న బిడ్డవలె నత్యంతవిశ్వాసముతో, మితిమీఱిన యనురాగముతో, నామెదగ్గఱఁ జేరెను. కొన్నివిషయములు లాయవ్వహృదయమునకు నొప్పి గలిగించెను. ఆమెహృదయమున గొప్ప బెంగ బయలుదేఱెను. ఆబిడ్డను దగ్గఱదీసి యామె కౌఁగిలించికొని మెల్లగా నేదో ప్రార్థనము చేసెను. "భగవానుఁడా! నేను పెంచినబిడ్డను నాచేతితోఁ గొట్టఁగూఁడదు. అల్పజ్ఞానముచేత నే నింతు కోపము చేసితిని. పరమేశ్వరా! నన్ను క్షమింపుము. నీయనుగ్రహము నాపైజూపవలెను."

ఇరువదిఅయిదవప్రకరణము.

ఊరటము.

కలకత్తానగరమున దక్షిణపుదిక్కున గలపేటలలో నాదిగంగాతీరమున జగత్ప్రసిద్ధమైనకాళీఘట్టదేవాలయము గలదు. పూర్వకాలమున గంగానది కాళీఘట్ట సమీపమునుండి సముద్రమునం బ్రవేశించు చుండిన దనియు నందుచేత భువనపావనమైనభాగీరథీతీరమున శ్రీకాళికాదేవాలయము నిర్మింపబడిన దనియు లోకులు చెప్పుకొందురు. గంగానది యీవైపునుండి ప్రవహించుట మానెను. అందుచేతఁ గాలక్రమమున నాదిగంగ యని పేరువడినయీపాయ తిప్పవేసికొని పోయెను. ఐన నీస్థలముపూర్వకాలమందువలెనే నేఁడుసైతము పుణ్యక్షేత్రముగా గణింపఁబడు చున్నది. కలకత్తాయను పేరుకాళీఘట్టముయొక్కయపభ్రంశము. కాళీఘట్టమనఁగా శ్రీకాళికాదేవి [illegible]ంచుఘట్టము. భక్తులనేకు లీపురాతనదేవాలయమునకుఁ దమభక్తిసూచకముగానెన్నోకానుకలఁ బంపుచుందురు. ఉత్సవదినములలోఁ గలకత్తానగరస్త్రీలతో దేవాలయము చుట్టునున్న సందుగొందులు నిండియుండును. ఆలయసమీపమున నున్నపావననదీజలము పావనత్వముగోల్పోయి క్రొత్తనీరు రాక నిలువయుండుటచేత హేయమైనను జనులందులో నేమునిఁగి పవిత్రులమైతిమని భావించి పట్టుబట్టలు తాల్చి మడికట్టుకొని యాలయమునకుఁ బోయి స్తవములు చదివి బలి సమర్పించి పూజలు చేసి వత్తురు. మతసంబంధములైనకర్మలు దీర్చినతరువాత యీపావనక్షేత్రమునఁ జేరునట్టివేనవేలుభిక్షుకులకు దమయొద్దనున్నసొమ్ము వెచ్చపెట్టి యన్నాతురుల కన్నము బెట్టించి పేదలకుఁ దమకుఁ దోచినంతసహాయము చేసి పుణ్యము గట్టుకొందురు.

శీతాకాలమున మనోహరమైనయొకనాఁటియుదయకాలమున శరచ్చంద్రుని తల్లి పల్లకి యెక్కి కాళీఘట్టమునకు వచ్చెను. ప్రొద్దునెత్తిమీఁదికి రాకమున్నె యాసాధ్విస్నానముచేసి దేవతాదర్శనము చేసి యర్చనము సమాప్తము చేసెను. తనకు మార్గప్రదర్శకుడు గా నుండుటకు దీసికొని వెళ్ళినయొకముసలిపండా బ్రాహ్మణునిసహాయమున దేవాలయమును విడిచి జనసమర్దము గలబజారును దాటి కొంతదూరమరిగి యొకచిన్నకుటీరము జేరెను. ఆకుటీరము చల్లనినీడలనిచ్చుచెట్ల నడుమనుండెను. ఆకుటీరపుగుమ్మముముందర నామె నిలిచి యుండెను. పండా బ్రాహ్మణుడు లోనికరిగెను. మఱియొకవృద్ధబ్రాహ్మణుడు వెలుపలికి వచ్చెను.

డెబ్బదివర్షములు వున్న దీర్ఘమై దృఢమైయుండినయాతనిసుందర కాయమును వంచి వేసి వానివిశాలఫాలభాగము ముడుతలపడజేసెను. అతనితల ముగ్గుబుట్టవలె నెఱసెను. పిల్లజుట్టు వెనుక వ్రేలాడుచుండెను. దేవతానామములు ముద్రింపబడినయొక రుమాలు నతడు పైన వేసికొని కఱ్ఱయూతగొని నిలువబడెను. తొల్పుకారుగ్రామమున నున్న ఘోషకుటుంబమున కీవృద్ధబ్రాహ్మణుడు గురువు. అతనితోగూడ నొక వడుచువాఁడు వచ్చెను. అతఁడు నడివయస్సున నుండెను. అతని మొగము వాని పావనత్వమును మతసంబంధమైననిష్ఠను సూచించు చుండెను. అతడు కాషాయవస్త్రములు ధరించెను. అతనిశరీరము సౌష్టవము కలిగి దృఢముగా నుండెను. అతని కన్నులు చిత్రముగా మెఱయు చుండెను. వెండ్రుకలు జడలుగా నల్లుకొనిపోయి యెఱ్ఱగా నుండెను. అతఁడు కాశీనుండి వచ్చిన బ్రహ్మచారి. శరచ్చంద్రునితల్లి మొదట గురువుపాదములకు సాష్టాంగనమస్కారము చేసి పిమ్మట బ్రహ్మచారికి దండప్రణామము చేసెను. వారామెను లేవనెత్తి యాశీర్వదించి కుటీరములోనికిఁ దీసికొని పోయిరి. "మానాయనగారు దేహారోగ్యము గలిగి సుఖముగా నున్నారా" యని యామెనడిగెను.

"అమ్మాయీ! భగవంతునియనుగ్రహముచేత నేను సుఖముగా నున్నాను. నా బిడ్డకూడఁ సుఖముగా నున్నదా? పిల్లలు సుఖముగా నున్నారా? గృహము సుఖాస్పదముగానున్నదా?"

"నాయనా! పరమదయాకరుఁడైనభగవంతుఁడు నాకు దీర్ఘాయుర్దాయము పోసినాఁడు. ఈలోకములో మనశ్శాంతి యెవరి కున్నది? నేను కలకత్తాలో నొంటిగానున్నాను. కాశీపురము వెళ్లఁగోరు చున్నాను. కాశీపట్టణమందె నాకు మనశ్శాంతికలదు. నాయల్లుఁడు జగన్నాథయాత్ర వెళ్ళినాఁడు. నాకూఁతురు గొడుకు వానివెంటఁజనినారు."

"అమ్మాయీ! వారు మంచిపని చేసినారు. జగన్నాథస్వామి యాయురారోగ్యములిచ్చి వారిని రక్షించును. బిడ్డా! భగవంతు నేనమ్ముకో. ముసలితనమందు నీ కతఁడే మనశ్శాంతిని సుఖమును ప్రసాదింపవలెను."

"ఆయనపాదములనే నేను నమ్ముకొని యున్నాను. భగవద్విశ్వాసమే నన్ను రక్షించు చున్నది. కాని యీఁడుదానను గనుక అప్పుడప్పుడు నాహృదయము చలించుచుండును. ఆఁడుదానిబుద్ధి యపమార్గములు పట్టించును. తండ్రీ!

నాకుఁ గలిగినకష్టములలో నీవే సాయము చేయవలయును. మహానుభావుఁడైన యీ బ్రహ్మచారిగూడ నాకు దగిన సలహా నిచ్చి తోడుపడవలెను."

అనవుడు బ్రహ్మచారి యిట్లనియె. "అక్కా — నావల్లనైనసాయము నేను తప్పక చేసెదను. నీవు నన్ను జూడకపోయినను వారణాసిలో నేను నిన్ను పలుమాఱు చూచియుంటిని. తాల్పుకారు గ్రామమునకు నేను క్రొత్తవాఁడను గాను. ఉమను బిందును కాళిని వివాహములు కాకమునుపు చిన్నప్పటినుండి నే నెఱుఁగుదును."

"అందులో బిందు సుఖముగా మగనితోఁ కాపురము చేయుచున్నది. అది యిద్దఱుపిల్లలతల్లి. పాపము! ఉమ పోయినది."

"ఉమ పోయినదా యేమి? గ్రామమునం దల్లారుముద్దుబిడ్డ గదా! ఆనాఁడు కల్ల నది చక్కనిచుక్క గదా! చెలికత్తెల కది పరమానందమును గలిగించునదిగదా. తళతళలాడుచున్న దానికన్నులు ముద్దులు మూటగట్టుదాని మొగము నాకెంతో బాగుగ జ్ఞాపకమున్నవి. ఆముద్దులబిడ్డ ఆచిన్నపాప యింతయల్పకాలమునఁ బోయిన దన్నమాట నమ్మఁజాలకున్నాను. అక్కా! అది యేలాగునఁ బోయినది? ఎప్పుడు పోయినది?

"రమారమి నెలక్రిందట అది యిల్లువిడిచి పోయినది. మఱి కనఁబడలేదు. వివాహవిషయమున నది మందభాగ్యురాలు. దాని కదే దీర్ఘవిచారము. తన దురదృష్టమునుగూర్చి యెల్లప్పుడు విచారించుచుండెడిది. తనకష్టమంతయు చేసికొనుటకది యేటిలోదిగి చచ్చినదని చెప్పకొనుచున్నారు."

"అక్కా! నే నామాట నమ్మను. అది నదిలో మునిఁగి చచ్చుచుండఁగా నెవ్వరు చూచినవారులేరు. ఆమెకష్టములు గట్టెక్కువఱకు బాల్యకాలమున నామె జీవితము నాచ్ఛాదించిన దుఃఖమేఘములు విడిపోవువఱకు నామె నేదేవాలయముననో నేపుణ్యక్షేత్రముననో జనులకన్నుల కగపడకుండ భగవంతుఁడే దాఁచియున్నాడని నాయభిప్రాయము."

"బ్రహ్మచారీ! నీమాటలు వేదవాక్కులవలె సత్యములు కావలె నాయనా! పాపము ఉమతల్లి నీవు దీర్ఘాయుష్మంతుఁడవు కావలెనని కోరి నీపేరుచెప్పికొని బ్రతుకును."

"బింధు ! కిద్దఱుపిల్లలా? పాప మామె సుఖముగా నుండవలె. తొల్లు కారులోఁగల బాలికలందఱిలో మిక్కిలిసాధువై, మంచిదై యెల్లవారికిఁ దలలో నాలుకవలెనున్న యాబింధుమొగము నాకు బాగుగా జ్ఞాపకమే. దానికొక చెల్లె లుండవలె. నేను చూచినప్పుడది పసిపిల్ల."

"అన్నయ్యా! దానికర్మముకూడ కాలినది. చిన్నప్పుడే అది యాధీనము తప్పి పోయినది."

"అక్కా! ఇది మిక్కిలి విచారకరమే. ఈవిధముగా దుఃఖపరంపరలతో నిండిన ప్రపంచములో నెవఁడు జీవింపఁ గోరును. పాపము దానితల్లి యెంతో మందభాగ్యురాలు. బిడ్డ తల్లికన్న మందభాగ్యురాలైనది. ఈడు రాకముందే వితంతువైనదా. సర్వేశ్వరుఁడు సర్వజ్ఞుఁడు. అట్టివారి కతఁడే తోడుపడువలె."

"అన్నయ్యా! నీమాటలు సత్యములు కావలయు. పాపము! ఆదిక్కుమాలిన పిల్లనుగురించియే నేను మిమ్మును మానాయనగారిని సలహో యడుగ వచ్చితిని. నామనస్సు మనస్సులో లేదు. నేను కష్టములో నున్నాను. నేను మీసహాయ మపేక్షించి మీతో నాలోచించుటకు వచ్చినాను."

ఆమాటలు విని గురు విట్లనియె. "అమ్మాయీ! సందేహింపక చెప్పు. నేనీప్రపంచపుగొడవలు మానుకొంటినని నీ వెఱుఁగుదువు. అందుచేత నాయాలో చన నీకంత ప్రయోజనకారి కాదు. ఐనను నేను నాశక్తిపంచనలేక నీకుసహాయము చేసెదను. కావలసిన యాలోచనము చెప్పెదను. మనవేదశాస్త్రములలో గొప్ప పరిజ్ఞాతలైన మహానుభావులు నవద్వీపములలో ననేకులున్నారు. లోకవ్యవహారము లన్నిటిలో వారాలోచన చెప్పి యభిప్రాయమునిచ్చుచుందురు. నిత్యకృత్యములలో ధర్మాధర్మములను దెలిసికొనఁగోరువారు వారియొద్దకు వెళ్ళుచుందురు. నాకాలము చెల్లిపోయినది. ఈచరమకాలములో నేను ప్రశాంతముగా దినములు గడుపవల యునని సంకల్పించుకొన్నాను."

"నాయనా! అది నిత్యకృత్యముల వ్యవహారమైనపక్షమున నే నింతదూరము శ్రమపడి వత్తునా? మీనిష్ఠకు భంగము కలిగింతునా? నేను దుఃఖములో నుంటిని గనుక ఊరటనిమిత్తము మీవద్దకు వచ్చితిని. మీరు మాకుటుంబగురువులు. నా మామగారికి మీరాప్తులు. మావారికి మీరు పురోహితులు. నాకు మనశ్శాంతియు సాయమును గావలసివచ్చినప్పుడు మీయొద్దకురాక మఱియెవరికడకుఁ బోదును?"

"అమ్మాయీ! విచారింపకు. నీకు నాచేతనైనంత సహాయము చేసెదను. కాశినుండి వచ్చిన యీచిన్నవాఁడు నాకు స్నేహితుఁడు. వేదములు గట్టిగాఁ జది వినవాఁడు. నీ వతని నెఱుఁగకపోయినను అతఁడు నిన్ను, నీవృత్తాంతమును చిన్ననాఁటనుండి యెఱిగినవాఁడు. అతఁడు కూడ శక్యమైనసహాయము చేయఁ గలఁడు. నీవు కదలి నాయొద్దకు వచ్చుటకు నీమనసులో నెంతో విచారముండి తీరవలయును. నిస్సందేహముగాఁ జెప్పు."

"నాబాధ విశేషముగానే యున్నది. అది చెప్పుటకుఁగూడ నాకు శక్యము గా కున్నది. మహాత్ముఁడైనయీబ్రహ్మచారి బిందుచెల్లెలను గుఱించి మాటలాడి నాఁడు. అది చిన్ననాఁడే వితంతువైనది. దాని కిప్పుడు యుక్తవయస్సు వచ్చి నది. నాకుమారుఁడు శరచ్చంద్రుఁడు దానిని వలచి యున్నాఁడు. దానినే గాని వివాహము చేసికొననని పట్టుపట్టి కూర్చున్నాఁడు. ఈవివాహము మీ రంగీకరించి తిరా వారిజన్మము సార్థకమగును. సుఖముగ జీవింతురు. నిషేధించితిరా వారీ భూమిమీఁదఁ జిఱకాలము జీవింపరు."

ఈసంభాషణ చెవినిబడఁగానే ముసలిజన్నిగట్టు కొయ్యబారిపోయెను. అతఁడు శరచ్చంద్రునితల్లిని వివాహకాలమునుండి యెఱుఁగును. హిందువుల యాచారములమీఁదను సాంప్రదాయములమీఁదను నామె కమితగౌరవము కల దనియు నెఱుఁగును. కుమారుఁడు వితంతువివాహము చేసికోఁ దలచికొన్నాఁడని యామె చెప్పినప్పుడతఁడు మహాశ్చర్యరసమగ్నుఁ డయ్యెను."

"అమ్మాయీ! హిందువులయాచారప్రకారము వితంతువివాహము నిషిద్ధ మని నీ వెఱుఁగవా? బ్రాహ్మణులు మహాపండితులు చెప్పఁగా విన లేదా? వినుట యెందుకు? నీవు నెఱుఁగుదువు."

"ఈనాఁటియాచార మెట్టిదని తెలిసికొనుటకు నే మీయొద్దకు రా లేదు. ఈమాటనిపించుకొనుటకు నేను మీయొద్దకు రావలెనా? ఆచారమునకు లోకాభి ప్రాయమునకు విరుద్ధముగా నడచునట్టిసమయములు ప్రతిమనుష్యునిజీవితములోను నుండును. ఇది మనయాచారములకు విరుద్ధమైనను దోషము గాకపోయినపక్షమునఁ జేయఁదగిన దగునా కాదా? ఇది మతవిరుద్ధమా? భగవంతునకాగ్రహము కలి గించుకార్యమా? ఈసంగతులు మీవలనఁ దెలిసికొనుటకై వచ్చితిని. తండ్రీ! ఆఁడుదానిదుఃఖకరవృత్తాంతము శ్రద్ధతో వినుము."

అని కన్నీరు విడుచుచు నామె వెనుక జరిగినవృత్తాంత మంతయు నతనితోఁ జెప్పెను. చెప్పుటలోఁ నామె తన గృహవృత్తాంతము శరచ్చంద్రునిచరిత్రము దెలిపి యుమయొక్కకథను నామె తల్లియొక్కకథను నెఱిఁగించి పిమ్మట హేమునియొక్కయు, సుధాబిందులయొక్కయు వృత్తాంతములు తెలిపెను. తెలిపి వెండియు సుధాబిందులు కలకత్తానగరమునకు వచ్చినతెఱంగు శరచ్చంద్రుఁడు దినదినము వారి యింటికి వెళ్ళి సేమ మఱసి వారిసౌఖ్యములకై పాటుపడుచు నాదరించినవిధంబు నటులుండ నతనిహృదయంబు సుధపై నిలిచినప్రకారంబు మరుగుపఱచ కెఱిఁగించెను. తరువాత సుధపై నపవాదములు పుట్టుటయు నామె కవమానములు సంభవించుటయు, శరచ్చంద్రుహృదయ మాశాభగ్నమై విషాద పూరిత మగుటయు నాయవ్వ బాష్పపూరిత నేత్రయై విన్నవించి చరమకాలములోఁ దనజీవితముచుట్టుఁ గ్రమ్ముచున్నదుస్సహదుఃఖాంధకారమును జ్ఞానతేజోమూర్తు లగుగురువులు కటాక్షవీక్షణకిరణములచేత దవ్వుగఁ బాఱఁదోలి కుటుంబమును రక్షించి తన కూరట గలిగింపవలసిన దని వేఁడుకొనెను.

వేఁడుకొని మఱియు నిట్లనియె. "మనము మనయల్పజ్ఞానమునుబట్టి నడచుచుందుము. ప్రపంచధర్మము వేఱు. సత్యము వేఱు. ఉమయొక్కతల్లి బిడ్డను వర్ధమానపట్టణమందు మిక్కిలి భాగ్యవంతున కిచ్చి వివాహము చేసెను. చేసినందుకు దాని గతియేమైనది? నాప్రక్కను గూర్చుండి కంటికి నేలకు నేకధారగా నహోరాత్రములు దుఃఖించు చున్నది. ఆదుఃఖ మామె హృదయమున గొప్పపిడుగువలె బడినది. నేనుగూడ గొంతకాలము గర్వము గలిగి యుంటిని. అందుకు నాకుఁ దగిన ప్రాయశ్చిత్తమైనది. ప్రపంచము నాకంధకారమయమై సంతోషశూన్యమైయున్నది. నాయాశ లన్నియు శరచ్చంద్రునిమీఁదను నాకూఁతురు కాళిమీఁదను, సుధాబిందులమీఁద నున్నవి. వారల తల్లి చచ్చిపోవునప్పుడు వారిని నాకప్పగించి పోయినది. సుధాశరచ్చంద్రులనురాగబంధమును నేను త్రెంపివైచితిని. కాని యాచిన్నపిల్లల బ్రతుకు దిక్కుమాలినదానను నేనుపాడుచేసితి నని నామనస్సు బాధపెట్టుచున్నది. తండ్రీ! మనశాస్త్రము లేమనుచున్నవో చెప్పు. తల్లి నైనందుకు నేను చేయవలసినవిధి యేమొ చెప్పు."

తల్లి కుమారునిదీనచరిత్రమును జెప్ప విని కరుణామయుఁ డగుగురువు జాలిపడి బాష్పములు విడిచెను. వైధవ్యదుఃఖభారవినమ్రయై యిడుమలు గుడుచుచున్న సుధనెత్తిమీఁద నిందలు పడిన వని వినినప్పుడు బ్రహ్మచారికన్నులు కోపముచే నెఱ్ఱపడెను. ఇద్దఱు క్షణమాత్ర మూరకుండిరి.

ఎట్టకేలకు గురువు తనమిత్రుఁడైనబ్రహ్మచారినిఁ జూచి యిట్లనియె. "కుమారా! చెప్పు. కాశీదేవాలయములలో నున్నపుణ్యగ్రంథము లన్నిఁటిని నీవు శోధించితివి. సాధువుయొక్కయు బ్రహ్మచారులయొక్కయు ముఖములనుండి యనేకధర్మములు విని యుంటివి. నీదృష్టినుండి మనవేదశాస్త్రము లొక్కమాట యైన దాచ లేవు. సరస్వతీదేవి నీకు వరప్రసాదము చేసినది. నీకు వశమైనట్లు వాగ్దేవి యీకాలమం దెవ్వరికిని వశవర్తిని కాలేదు. అతిదుఃఖపడుచున్ననీసోదరికి మనంబున నూరట గలుగునట్లు దయాగర్భితములై ప్రేమ చిలుకునట్టిపలుకు పలుకుము. మనమనోగతములైనతలంపులను నాకంటె నీవుస్ఫుటముగాఁ జెప్పఁగలవు. అందుచేత నీవే పలుకుము."

"అక్కా! నీవు నావల్ల నేమి తెలిసికొనఁగోరుచుంటివి. నేను నీ కెట్లు సాయము చేయఁగలను?"

"చిరకాలమునుండి కలియఁగోరుచున్న యీయువదంపతుల సమాగమ మశాస్త్రీయమైన యధర్మమేమో చెప్పుఁడు. వితంతు వివాహములు జరుగఁగూడదని భగవంతుఁడు శాసించినాఁడేమో చెప్పుఁడు."

"ఈశ్వరుని శాసనములను మన మతఃకార్యములవలన నూహింపఁగలము గాని యిది యాతని శాసనమని నిర్ణయింపఁగలమా? వేదములు పరమేశ్వరుని శాసనమునకుఁ బ్రతిధ్వనులు."

"అన్నయ్యా! అట్లేకానీ. వేదము లేమనుచున్నవో నాకుఁజెప్పు?"

"వివాహితలైన స్త్రీలు భర్తృమరణానంతరమున మహాపతివ్రతలై బ్రహ్మచర్యలు నడుపవలసినదని వేదములు చెప్పుచున్నవి. కాని, చేసికొనఁ దలఁచుకొన్న వితంతువులు పునర్వివాహము చేసికొనఁ గూడదని శాసించుటలేదు. చిన్నబిడ్డగా నున్నప్పుడు భర్తనుగోల్పోయిన సుధవంటివితంతువునకు శాస్త్రములు స్పష్టముగా వివాహము నంగీకరించుచున్నవి. ఈశ్వరకృపావిశేష మట్టివివాహములను నిషేధింపదు. ప్రపంచమిదివఱకే దుఃఖపూరితమై యున్నది. మనుష్యుల బుద్ధిహీనత దానిని మఱింతదుఃఖభాజనము సేయుచున్నది.

"అన్నయ్యా! అమృతప్రాయములైన యిటువంటిమాటలు నీనోటవచ్చినందుకు నీకు వేయినమస్కారములు. కాలానుసారముగా మనము కదలవలసి

వచ్చినపక్షమున జనాభిప్రాయము పూర్వాచారము మొదలగువ వీదినములలో మునల నాపఁగలవా? ”

“అక్కయ్యా! ఔను. సత్యమార్గమున నడుచువారిని జనాభిప్రాయము, పూర్వాచారము, నిలుపఁజాలవని నీవు వినియుంటివిగదా? మహానుభావుఁడైన విద్యాసాగరుని గుఱించి వింటివిగదా! అతఁడు విద్వాంసులకంటె విద్వాంసుఁడు. దయాళువులకంటెఁ బరమదయాళుఁడు. పావనులకంటెఁ బావనుఁడు. మనశాస్త్రములు వితంతువులు శాశ్వతవైధవ్యదుఃఖ మనుభవింపవలసినట్లు శాసించుట లేదని యతఁడు చాటించినాఁడు. మనప్రభువులు విదేశీయులైనను జ్ఞానవంతులై వితంతు వివాహములు శాస్త్రీయములని ప్రశస్తమైన ధర్మశాస్త్రములు నిర్మించినారు. ఈ తరములో హిందూవితంతువు లెందరో వివాహములు చేసికొని పతివ్రతలై పరమసంతోషముతోఁ గాపురములు చేయుచున్నారని నీవు వినియుంటివి. నీకుమారుఁడు తనయిచ్చవచ్చినవిధమున వివాహము చేసికోవచ్చును. దయామయుఁడైన పరమేశ్వరుఁడు దోషరహితులై చిత్తశుద్ధిగల సజ్జనులకలయికలు సౌఖ్యభాజనములు చేయును.”

అప్పుడు గురు విట్లనియె. “అమ్మాయీ! బ్రహ్మచారి సరిగాఁ జెప్పినాఁడు. వెళ్ళి యతని యాజ్ఞాప్రకారము చేయుము. లోకులు కాకులు. ఇష్టమువచ్చినట్లఱచెదరు. నీవు నేను నటువంటిలోకులమాటలను నిరాకరింపవలసినకాలము వచ్చినది. నీవు నీకుమారునకు సుఖముఁ జేయవలసినధర్మము చేయుము. పరమదయాళుఁడైనభగవంతుఁడు భూమిమీఁదఁ బుట్టినతనపుత్రికలు పారములేనిదుఃఖ మనవసరముగ ననుభవింపవలసినదని కోరఁడు. అతఁడే వారి కూరట గల్గించు సౌఖ్యప్రదమైనమార్గములఁ జూపుచున్నాఁడు. తండ్రీ! చిత్తమున కూరటగలిగించు మీపలుకులచేతను బ్రహ్మచారియొక్కవచోవిశేషములచేతను నామనంబు తేరినది. ప్రాణము చల్లఁగానున్నది. ఇటువంటి పరమపావనుల యుపదేశబలమునఁ దల్లిబిడ్డలయెడ నెంతపని చేయఁగలదో యంతపనియు నేనుజేసెదను. నమ్ము నామాట. నేను చిరకాలము జీవింపను. సుధా శరచ్చంద్రులు వివాహమాడి యన్యోన్యానురాగము గలిగి చిఱకాలము సుఖముగ జీవింపవలయునని నేను కడసారి ప్రార్థనఁ జేయుచున్నాను.”

ఇరువదిఆరవప్రకరణము.

రాజగృహము.

సుందరమైన వర్ధమానపట్టణమును విషాదమేఘ మావరించెను. బంగాళాదేశమందలి గొప్పసంస్థానములలో వర్ధమానసంస్థాన మొకటి. ఆసంస్థానప్రభువు రోగపీడితుఁడై మరణమునకు సిద్ధముగానుండెను. అతనికి సంతతిలేదు. బజారునందు దర్బారునందు నంతఃపురమునందు పదిమంది చేరినచోటులయందు నెల్లవారిమనస్సులను సంక్షోభ పెట్టునట్టివిషయ మొక్కటే. ఈయన మరణానంతరము రాజెవ్వరు? రాజుగారిభార్య యెవనిం బెంచుకొనును? రాజు తల్లి యట్టిపెంపు నంగీకరించునా?

సంతతిలేక యే గొప్పరాజయినమృతినొందునప్పుడు హిందూదేశస్థులమనంబులటువంటిప్రశ్నలు కలఁతబెట్టుచుండును. మృతినొందినరాజునకు బుత్రసంతానము లేకపోయినయెడల వానిభార్య మఱియొకపిల్లవానిని దెచ్చి దత్తస్వీకారము చేసికొనవచ్చు నని యనేకసహస్రవర్షములనుండి వ్యవహారములను బోధించుచున్న ధర్మశాస్త్రము లధికారమిచ్చు చున్నవి. అది యాచార మైనరాజకుటుంబములలోనే గాక సామాన్యకుటుంబములలో సైతము వర్తించు చున్నది. ఆదత్తుఁడు ధర్మశాస్త్రమును బట్టియు నాచారమును బట్టియు మృతినొందినవానికిఁ బుత్రుఁడై యతని సర్వస్వమునకు వారసుఁడై యుండును. పెంపుడుతల్లి యతనిం దన యింటికిఁ దీసికొనివచ్చి పెంచును. కుటుంబసాంప్రదాయములంబట్టి యతని నడపించును. అనుకూల మైనయీవ్యవస్థవల్ల సంతతి లేక నశించవలసినయనేకరాజకుటుంబములు పారంపర్యము గలిగి ప్రఖ్యాతములై యున్నవి. ఈదత్తస్వీకారములవల్ల జ్ఞాతులలోఁ బోరాటములు నశించును. వ్యాజ్యములకు వెళ్ళనక్కఱలేదు. అన్యబాధ లనేకములు తగ్గిపోవును. సంస్థానప్రభువుపురుషసంతానశూన్యుఁడై చనిపోవునప్పుడు తాను స్వయముగ బెంచుకొని యైనఁ దనభార్యకు ననుజ్ఞ యిచ్చి యైనఁ దనవంశము పారంపర్యము నిలుచు ననియుఁ దనసంస్థానమన్యాక్రాంతము గాక యుండుననియు ధైర్యసంతుష్టులు కలిగి చావ వచ్చును. ప్రయోజనకర మైన యీవ్యవస్థను మత మే యంగీకరించు చున్నది. సంతానశూన్యుఁడై మృతినొందిన వానియాత్మ "అపుత్రస్య గతి ర్నాస్తి" యను నార్యోక్తినిఁబట్టి యుత్తర

క్రియలు చేయువారు లేక సంతోషశూన్యమై పరలోకమున కరుగును. దత్తపుత్రుఁడౌరసునివంటివాఁడే గనుక సూత్రక్రియలలోప ముండదు. అందుచేత నాత్మశాంతి కలుగును.

ఆంగ్లేయప్రభుత్వముగూడ హిందువులయొక్క యీసనాతనధర్మము నంగీకరించెను. హిందూదేశమును దనచిత్తమువచ్చినట్లు పరిపాలింపఁ దలచినయొక గవర్నరుజనరలు స్వదేశసంస్థానప్రభువులు చేసికొనుపుత్రస్వీకారములు పని కిరా వని శాసించెను. వారసులు లేకుండబోయిన సంస్థానములను బ్రిటీషు రాజ్యమునకు గలిపికొనవలయు ననియతఁ డాశాసనము నేర్పరచెను. బుద్ధిపూర్వకముగాఁ జేసినయీగొప్పయన్యాయమే 1857 సంవత్సరమున జరిగినగొప్పసిపాయి పితూరికి ముఖ్యకారణము. ఆఘోరకృత్యమైనతరువాత నింగ్లాండుదేశపురాణియగువిక్టోరియామహారాణీ హిందూదేశప్రభుత్వమును వర్తకసంఘముచేతిలోనుండి తీసికొని తాను స్వయముగ దాల్చి 1858 వ సం॥రమున జేసిన మహాప్రకటన ద్వారమున వంశపారంపర్యము నిలుపుకొనుటకై స్వదేశసంస్థాన ప్రభువులుదత్తస్వీకారము చేసికొన వచ్చునని శాసించి యెల్లవారికి నమ్మిక గలిగించెను.

వర్ధమానసంస్థానప్రభువులు బలుమాఱు సంతానశూన్యులై దొరతనము వారిచ్చిన యీహక్కు నుపయోగించుకొనిరి. అప్పుడు వర్ధమాన మేలుచుండిన పడుచురాజు సంతతిలేక మృతినొందుటకు సిద్ధముగ నుండినను రాజెవ్వఁ డగునన్నప్రశ్న క్రొత్తగాఁబుట్టినది గాదు. అదివఱకు సంస్థానముల నట్టిప్రశ్న పెక్కుసారులు పుట్టి జనులమనంబులను కలఁత పఱచినది.

ఒకనాఁడుమధ్యాహ్నము పట్టణమందు ముఖ్యులైనపురుషులు మువ్వురు రహస్యముగా నొకగదిలోఁ జేరి యాలోచనఁ జేయఁ దొడగిరి.

వర్ధమానపట్టణమందు బ్రిటిషుప్రభుత్వమువా రేర్పఱచినకమీషన రొకఁడుండును. ఇతఁడు మిక్కిలిగొప్పయుద్యోగస్థుఁడు. అతఁడు వర్ధమానసంస్థానమును రమారమి కోటిజనులు కలమతీరైదు జిల్లాలను బరిపాలించుచు నధికారము సేయుచుండును. అతఁడు వర్ధమానమునందే కాపుర ముండి తక్కినమండలములను సంవత్సరమున కొకసారి చూచి యామండలముల సరిగా నుంచుటకుఁ దానుపూచీ పడియుండును. అతఁడు జను లందఱతో నత్యంతసంబంధము కలిగి యుండును. ఆమండలములలోని విషయము లన్నియు నతనికడకే దీర్పునిమిత్తము వచ్చును.

బహువ్యవహారసంబంధము లైనకాగితములు కట్టలుకట్టలుగా వచ్చిపడి యతని కాలము విశేషముగా నాక్రమించును. కలకత్తాలో నున్న ఇండియాగవర్న మెంటుతో నతనికి నిరంతరము సంబంధముండుటచేత నతఁడు తనయధికారమునం దున్నజిల్లాలకు నిండియాగవర్న మెంటువారితో నాలోచించి యుత్తరువులు పంపుచుండును. పంపినయుత్తరువులు సరిగా నమలు జరిగినవో లేదో గమనించు చుండును. పనితొందర గలయొకదినమున నెడతెంపు లేనికార్యభారముచేత విసికి మధ్యాహ్నకాలము నతఁడు తేయాకునీళ్ళు పుచ్చుకొన్నతరువాత వర్ధమానసంస్థాన మునుగూర్చినవిషయములను జర్చించుటకై తాను చేసినయేర్పాటుచొప్పున తనకచేరిగదిలోఁ జేరి యున్నపెద్దమనుష్యులను గలసికొనుటకై యాగదిలోనికిఁ బోయెను.

అట్లు వచ్చినయిద్దఱుపెద్దమనుష్యులలో ముఖ్యుఁడు వనవిహారుఁడు రాజ్య కుటుంబమునకుఁ గలబంధువులలో నితఁ డత్యంతసమర్థుఁడు బలాఢ్యుఁడు. వన విహారుఁడు సర్వవిధములచేత నుత్తమపురుషుఁడు. ఆజిల్లాలలో నతనికంటె గొప్ప గుఱ్ఱపుసవారులేఁడు. అతనికంటె గొప్పవేటకాఁడు లేఁడు. అతనికంటె నేర్పుతో నాలుగుగుఱ్ఱములబండిని మిక్కిలి యపాయకరము లైనస్థలములందును సన్నని దారులన డుమను నడుపఁగలవాఁ డింకొకఁడు లేఁడు. వేటయం దతనితమకము సహజమైనది. ఆంగ్లే యులు విందులు చేసికొన్నప్పు డతఁడు సరిగ నాంగ్లేయుఁడువలెనే వ్యవహరింప నేర్చెను. అందుచేత నక్కోట నున్న యూరోపియన్ స్త్రీలు సకలప్రజ్ఞలుగల యాక్షత్రియుని సహజమైనఠీవి మెచ్చి కొనియాడఁజొచ్చిరి. ఈనుగుణసంపదలకుఁ దోడు వానికడ వ్యవహారములు చక్కఁబెట్టుటకుఁ గూర్చుండి పనిజేయుటకు మిక్కిలి యభిరుచి యుండెను. అట్టియోపికయు నట్టితమకము నుండుటచేత జిర కాలానుభవముగల గొప్పయుద్యోగస్థులుకూడ వానియుక్తి కచ్చెఱువడి వర్ధమాన రాజుకుటుంబమునం దక్కఱకు వచ్చునట్టిమనిషి యతఁడే యని నిరూపింప జొచ్చిరి. అతఁడదివఱకె సంస్థానవ్యవహారములఁ జక్కఁబెట్టుటలోఁ గొంత ప్రధా నస్థాన మాక్రమించెను. సంస్థానవిషయమైన తీర్పేదియు వనవిహారునిసమ్మతిఁ బడయకుండ జరుగుటలేదు.

అతనితో వచ్చిన రెండవపెద్దమనుష్యుఁడు *నెమ్మదిఁగలవాఁడు. మంచి యాలోచన గలవాఁడు. ఏజోక్యమునకుఁ బోనివాఁడు. దుర్బలశరీరుఁడు. చిన్న ప్పుడే తల నఱసినది. అతనిపేరు సత్యచరణుఁడు. అతఁడు వర్ధమానములో

గొప్పన్యాయవాది. బంగాళాదేశములో నతనిసమానులరుదుగా నుందురు. అతఁడు మితభాషి. అడిగిన ప్రశ్నములకు మాత్రము సరిగా నాలోచించి తగిన ప్రత్యుత్తరములు చెప్పును. అతఁడు పదిమందిలో దిరుగుట కిష్టముగలవాఁడు కాఁడు. విందులకు సభలకుఁ దఱుచుగాఁ బోయెడివాఁడు కాఁడు. తనపని యేమో తనగొడవయేమో. ఆపనిలో నతనిని మించినవాఁడు లేనేలేఁడు. సమానులు స్వల్పసంఖ్యాకు లుండవచ్చును. ఆస్థానమండలి గొప్పగొప్ప యుద్యోగస్థులు వానిసలహా లేకుండ ధర్మశాస్త్రసంబంధములైన వ్యవహారములలో దిగెడువారు కారు. బంగాళాదేశమండలి గొప్ప ధర్మశాస్త్రవేత్తలు సత్యచరణునితో బరిచయము గలిగియుండి వానిని మిక్కిలిగ గౌరవింతురు.

పరిచారకుఁడు తేయాకునీటిపాత్రలు తీసివేసినతరువాత వారిక ముప్పురకు సంభాషణ మారంభమయ్యెను. కమీషనరు ముందుగా నిట్లనియెను. "మనకిప్పుడు మరల నొక పెద్దబెడదవచ్చి పడినది. వర్ధమానరాజ్యము తిరిగి గొడవలలోఁబడునని తోఁచుచున్నది."

"ఔను? ఆలాగే కనబడుచున్నది. ఈరాజ్యముయొక్క యావత్తుచరిత్రము మొదటినుండియు నిట్లే చిత్రకథవలె జరుగుచున్నది." యని వనవిహారుఁడు బదులుచెప్పెను.

"సరిగా నాలాగే జరుగుచున్నది. రెండువందల సంవత్సరములకంటెఁ బూర్వమునుండి దీనిచరిత్ర కలదు గదా?"

"ఔను! మహాసాహసుఁడైన ఆబూరాయలు పంజాబుదేశమునుండివచ్చి వర్ధమానమునఁ గాపురముండి 1657 సంవత్సరమున నీసంస్థానమును స్థాపించెను. క్లైవు ప్లాసీయుద్ధము గెలుచుటకు సరిగా నూరేండ్లకుముందు సంస్థానము స్థాపింపఁబడినది. కాని యాబూరాయలమనుమఁడైన కృష్ణరామునికాలములో రాజ్యము వృద్ధిబొందినది. అతఁడు రాజ్యమున కనేక ప్రదేశములుకలిపి మొగలయిచక్రవర్తి వద్దనుండి తనయధికారము స్థిరమగుటకు ఫర్మానాలు పుచ్చుకొనెను. అతనికాలమందు జరిగినపితూరికథ మీరెఱిఁగి యుండవచ్చును. ఏమననది యాంగ్లేయచరిత్రతో సంబంధము కలది."

"అంత చక్కఁగా దెలియదు. మాకు మాయాంగ్లేయచరిత్రము తెలిసిన దానికంటె నుద్యోగస్థులతో బ్రతిదినము జఱుగునట్టి యుత్తరములవ్యవహారము బాగుగా దెలియును."

"ఎట్లుగరా? సుబ్బసింగను నతఁడు పితూరిచేసి యుద్ధమునందు కృష్ణరాముని జంపెను. ఈపితూరిలో యింగ్లీషువారు కలకత్తాలోనున్న తమ సరకుల కొట్లుచుట్టు గోడపెట్టుకొని బలపఱచుకొనిరి. ఆపితూరిచరిత్ర చిత్రకథవలె సమాప్తినొందినది. సుబ్బసింగు కృష్ణరామునికూఁతురు సౌందర్యముఁ జూచి యామెను బలవంతముగఁ గౌఁగిలించుటకుఁ బ్రయత్నము చేసెననియు, నుత్తమ క్షత్రియకన్యయైన యాయువతీమణి పితృఘాతుకుఁడైన యాదురాత్మునిపొందురోసి వానిని ఖడ్గముతోఁ బొడిచి చంపెననియు వాడుకగలదు."

"అది చిత్రమైన వచనకావ్యము కాఁగలదు. వనవిహారుఁడా! నీవాకథ యేల వ్రాయఁగూడదు."

"వ్రాతనాకుఁ దగినపనికాదు. అందులో నేర్పుకలవారికావిషయము నేను విడిచివేయుచున్నాను."

"నీవు చెప్పినదిసరే! వ్రాత నీపనికాదు. నీవు గొప్పకార్యములు చేయుటకు జన్మించితివి కాని గ్రంథకర్తవగుటకు జనింపలేదు. ఈసమయమందు నీకుఁ గావలసినంత పనియున్నది. కానీ, చెప్పు చెప్పు. కృష్ణరాముఁడు సుబ్బసింగు ప్రపంచమునుండి యదృశ్యులైన తరువాత వర్ధమానము రాజ్యముమాటేమైనది?"

"కృష్ణరామునిమనుమఁడైనకీర్తిచందునితో నీవంశము నిజముగాఁ బ్రారంభమైనది. తూర్పునను నుత్తరమునను నతఁడు చాలాభాగములను సంస్థానములలో గలుపుకొనియెను. వాడుక నిజమైనపక్షమునఁ బడమటదిక్కున నడవిలో నేదో మూలనున్న విష్ణుపురవృద్ధరాజుకూడ వానిమూలమునఁ గొంతనష్టపడియెను. కాని కీర్తిచందుఁడు తనసంస్థానమును వృద్ధిజేసికొనుటతోఁ దనివినొందక స్వదేశరక్షణార్థమై కూడనడుముపట్టుకొని నిలిచెను. మహారాష్ట్రులు బంగాళముమీఁద దండెత్తి వచ్చినప్పుడు బంగాళము నేలుచుండినమహమ్మదీయునిపక్షమున నిలిచి కీర్తిచంద్రుఁడు పలుమారుపోరాడెను. 1740 వ సంవత్సరమున కీర్తిచందుఁడు మృతినొందినప్పుడు వర్ధమానరాజ్యము బంగాళాదేశములో నంతట ముఖ్యమైనదయ్యెను."

"తరువాత నేమి జరిగినది?"

"ఆకథ మిక్కిలి దీర్ఘమైనది. సంగ్రహముగాఁ జెప్పెదను. ఆంగ్లేయులు బంగాళాదేశమునకు సర్వాధికారులైనప్పుడు తేజచందుఁ డనువాఁడు వర్ధమానపు

రాజయ్యెను. అతఁడు కీర్తిచందునకు మూఁడవతరమువాఁడు. పాపము! తేజచందునిదృష్టి కప్పటి గవర్నరుజనరలైనవారను హేస్టింగ్సుచే నియమింపఁబడిన కలెక్టరులు పూర్వపుమహారాష్ట్రపు కలెక్టర్లకంటెను తురకకలెక్టర్లకంటెను నధికతరబాధకులై యుండిరి. మీరు వారనుహేస్టింగ్సుయొక్క చరిత్రమును, రాజులు సరిగా గడువునాటికిశిస్తు చెల్లింపఁజాలనందుకు వారి నతఁడు చెఱసాలలో నుంచిన కథలు మీ రెఱుఁగుదురు కదా!”

ఎఱుఁగుదును గాని అప్పుడు వారన్ హేస్టింగ్సు ప్రాణముమీఁదికే వచ్చినది. అందుచేత నతఁడు రాజులనుబట్టి సొమ్ముకొఱకు పీడింపవలసివచ్చెను. కాని యతనియనంతరమున గౌర్నరుజనరలైనకారన్‌వాలీసుప్రభువు వానికంటె నుపకారకుఁడై పరిపాలనమునందుఁ గల లోపముల నన్ని సవరించెను.”

“నిజమే! 1793 వ సంవత్సరమందు కారన్‌వాలీసుప్రభువు నేలపన్ను ప్రతిసంవత్సరము మార్పుచెందకుండ శాశ్వతముగ నెంతోకొంత యియ్యవలసినదని యేర్పాటుచేయుటచేత బంగాళాదేశపురాజకుటుంబములు నాశనమొందకుండ నిలిచెను. నేఁటికాలమున నేల విశేషముగఁ బండినపక్షమున నది యంతయుఁ బ్రజలకే పోవును. హిందూదేశమందలి పరగణాలన్నిఁటిలో బంగాళాదేశము మిక్కిలి భాగ్యవంతమై యైశ్వర్యమున కాస్పదమై యున్నది.”

అనవుఁడు నవ్వి కమీషన రిట్లనియె—“మీజమీందారులు 1793 వ సంవత్సరమందు నేలపన్నువిషయమై జరిగినశాశ్వతవ్యవస్థకు సంతోషింతురు. కాని మాదృష్టి కది మఱియొకలాగున నున్నది. గవర్నమెంటువారికి రావలసినశిస్తునకు హద్దు నేర్పరుచుటచేత సర్కారున కది నష్టము కాదా? రావలసినసొమ్ము రాక పోవుచుండుట లేదా? మీరు జమీందారులు కనుక మాదృష్టితో మీరు చూడ లేదు. కాని సత్యచరణునివంటిలాయరు దీని విషయమై యేమియభిప్రాయపడును?”

అంతసేపటినుండియు సత్యచరణుఁడు మాటలాడక వారిసంభాషణవినుచుండెను. అప్పుడు కమీషనరు తనయభిప్రాయ మడిగినందున నధరస్పందము చేసి మెల్లన నిట్లనియె. “అయ్యా! గవర్నమెంటు ప్రజలమేలునిమిత్తమై యున్నది. ప్రజలహితమునకు విరుద్ధములైనహక్కులు గవర్నమెంటువారి కుండఁజాలవు.”

“నీ వన్నది సరే! కాని కృషి వృద్ధిచెందినకొలఁది భూములమీఁదశిస్తు హెచ్చుకట్టి దొరతనమువారు సొమ్మెక్కువతీయుట ప్రజలకుఁగూడ లాభకరము కాదా?”

కాదయ్యా కాదు! అది హిందూదేశములోఁ బనికిరాదు. హిందూదేశములో మా నేతపనులు, తక్కినచేతిపనులు క్షీణించినవి. మా వాణిజ్యమంతయు యూరోపియనువర్తకులచేతిలో నున్నది. మా దేశమందలిగను లన్నింటిలో యూరోపియనువర్తకులే పెట్టుబడి పెట్టి పనిచేయించు చున్నారు. కాఁబట్టి మాజాతికిజీవనాధారము భూమిమీఁదఁ బండినపంట యొక్కటే. మా దేశపుజనసంఖ్యలో నైదువంతులలో నాలుగువంతులు నేలదున్నుకునే బ్రదుకు చున్నారు. ఆవిషయములో గవర్నమెంటువారు కొంతహద్దు నేర్పరచి యంతకంటె నెక్కువ పుచ్చుకో మని నియమమేర్పరుచుకొన్నపక్షమున జనులు క్రమక్రమముగ బాగుపడి భాగ్యవంతులగుదురు. ఆలాగున మీరు బంగాళాదేశములో నేలపన్నుకు హద్దునేర్పరచినారు. అందుకే బంగాళాదేశము బాగున్నది. చెన్నపురి రాజధానియందును, బొంబాయి రాజధానియందును, ఉత్తరహిందూస్థానమందును మీ రీవిధముగా నేలపన్నుకు శాశ్వతవ్యవస్థ నేర్పరుప లేదు. కాఁబట్టి యాపరగణాలు నిరంతరదారిద్ర్యమునకు నెలవులై యున్నవి.”

“సత్యచరణుఁడా! అది నీవేలాగున ఋజువు చేయఁగలవు.” అని కమీషన రడిగెను.

“కాటకములచరిత్రమే నామాట ఋజువు చేయును. శాశ్వతవ్యవస్థ యున్న బంగాళాదేశములో క్షామములు మిక్కిలి తక్కువ. కడచిననూరుసంవత్సరములలో ప్రాణాపాయములు కలిగించినకాటకములు లేనే లేవు. తక్కినపరగణాలలో క్షామములు మెండు. ప్రాణనష్ట మధికము. 1877 సంవత్సరమం దనఁగా ధాతసంవత్సరపుకరవునకు చెన్నపురిరాజధానిలో నేబదిలక్షలమంది చచ్చి పోయిరి.”

“కాని, బంగాళదేశములో గవర్నమెంటువారు శిస్తునకు హద్దు నేర్పరుచుటచేత జనుల కట్టి సహాయము కలుగునో నాకుఁ దెలియకున్నది. నామిత్రుఁడైన వనవిహారునివంటి జమీందారుల కాపద్ధతి యుపయోగకరముగా నున్నది. వారు విశేషధనము ప్రోగుచేసి తెలివిమాలినపనులకుగాను వ్యయము చేయుదురు. కాని జనుల కేమిలాభమో చెప్పుమా?”

“అయ్యా! పంట విశేషముగాఁ బండినప్పుడు బంగాళాజమీందారుల కేమియు లాభములేదు. అట్టి పంటవలన లాభము సామాన్యముగ జనులే యనుభవించి బాగుపడుదురు. బంగాళాదేశమందలి పాటకప్రజనులు, సామాన్యసంసారులుకూడ దాచుకొన్నసొమ్ము భూములమీఁదఁ బెట్టుచుందురు. పంటలు బాగుగా బండెనా దానివలన మఱింత బాగుపడుదురు. కారనువాలీసుప్రభువుయొక్క ధర్మకార్యము చిరసౌఖ్యప్రదమై కొద్దిమందికిమాత్రమే గాక కోటానకోట్లజనులకు నుపకారమై సౌఖ్యము నాపాదించుచున్నది. ఇండియాకు వచ్చినరాజప్రతినిధులలో లారెన్సుప్రభువు, కానింగుప్రభువు మిక్కిలి గొప్పవారు. వారిద్దరుగూడ హిందూదేశమందలియెల్లపరగణాలలో నేలపన్ను విషయమున శాశ్వతవ్యవస్థ నేర్పరుపవలయునని పాటుపడిరి. వారి ప్రయత్నములు కొనసాగియుండినపక్షమున నేఁటి కాలమున మన మిన్ని కరవులమాట వినకపోయియుందుము.”

“సత్యచరణుఁడా! కొంతవఱకు నీమాట సరియే. నీకుఁ దెలిసినట్లు బనులలోని యంతరువులు, విభాగములు నాకుఁ దెలియవు. కాని భూమిమీఁదఁ బంటలు విశేషముగఁ బండినప్పుడు దానిఫలము గొప్పవారు మొదలుకొని కొద్దివారివఱకు నెల్లవారు సమానముగా ననుభవింపవలసినదని మీరు చెప్పెడిపక్షమున మీమాట నేనంగీకరించెదను. కాని జనులందఱు విశేషఫల మనుభవించు చున్నప్పుడు గవర్నమెంటువారు కూడ దానిలో గొంతభాగ మనుభవింపఁగూడదా? గవర్నమెంటు జనులమేలుకొఱకే యున్నదని మీయంతట మీరే యన్నారుకదా! గవర్నమెంటువారికంతు వచ్చెడు లాభమంతయు జనులమేలునిమిత్తమే యుపయోగపడును. అధన మేదోరూపమున మరల జనులకే వెళ్ళిపోవును. అందువలన జనులవర్తకము చేతిపనులు వృద్ధిపొందును.”

“అయ్యా! మాదురదృష్టవశమున హిందూదేశములోమట్టు కావిధముగా జరుగదు. రమారమి ముప్పదికోట్ల రూపాయలు అనఁగా మాదేశస్థులు గవర్నమెంటువారికిఁ జెల్లించెడు శిస్తులో సగము ప్రతిసంవత్సరము మీయింగ్లాండుదేశమునకుఁ మాదేశమునుండి బోవుచున్నది. దానికిఁ దగినప్రతిఫలము మీదేశమునుండి మాకు వచ్చుట లేదు. మేము పన్నులక్రింద నిచ్చుదానిలో సగము దేశములోనుండి వెళ్ళి జనుల కేరూపమునను వచ్చుటలేదు. నేఁటికాలమున భూమండలమున నేదేశ మీవిధమున నష్ట మనుభవించుటలేదు. ఇటువంటినష్టము ప్రపంచములో నేదేశము సహింపలేదు. ఇట్లు నష్టపడుచున్నదేశమున దారిద్ర్యముండక, కాట

కములుండక సుక్షేమముండును? ప్రాచీనకాలమందు, రోమురాజ్యము గాలుదేశమును, ఈజిప్టుదేశమును, సిసిలీద్వీపమును, పాలెస్టైను దేశమును దోచుకొని వాటిని దరిద్రదేశములు చేసి తాను బాగుపడెనని మీరు నిందించుచున్నారు. అమెరికాఖండమును, హాలండుదేశమును, దోచుకొని తానుభాగ్యవంతు రాలైనదని స్పేయినుదేశమును మీ రధిక్షేపించు చున్నారు. ఇంగ్లండు హిందూదేశములో నటువంటి పద్ధతులేయవలంబించినమాట తాను తెలిసికొన లేకున్నది. హిందూదేశమును గొప్పకరువులకునికిపట్టుగా, దారిద్ర్యమునకు జన్మభూమిగాఁ జేయుటయే గాని యీవిధమైన ధనసంపాదనమువల్ల రో మెంతబాగుపడినదో ఇంగ్లాండునంతే బాగుపడును. స్పేయి నెంతముందఱకు వచ్చినదో మీదేశ మంత ముందరకు వచ్చును. నాయభిప్రాయము నేను దాచక చెప్పినందుకు నన్ను క్షమింపవలెను. కాని యీవిషయము మీరు మేముకూడ గట్టిగా నాలోచింపవలసిన విషయమే.”

“మీరు మీయభిప్రాయములను న్యాయముగఁ జెప్పినారు. అందుకు మిమ్ము నేను మెచ్చుకొనుచున్నాను. నేను మీతో నేకీభవింపఁజాలను. కాని కొన్నివిషయములలో మీవాదమే సరియై యుండవచ్చును. నామట్టుకు నే నెప్పుడును మితవ్యయమే చేయవలయు నని చెప్పుచుందును. ఏటేట హిందూదేశమునుండి ధనమీవిధముగాఁ బోవుటమాకిష్టము లేదు. కాని ప్రస్తుతవ్యవహారము చూచుకొందము. కారనువాలీసు ప్రభువు బంగాళాదేశమునందు శాశ్వతవ్యవస్థ చేసినప్పుడు తేజచందుఁ డుండినాడని యతనికాలపుసంగతులు వనవిహారుడు చెప్పుచుండెను. అది యేమో విందము.”

“ఔనండి! కాని యింక నేను చెప్ప వలసినది విస్తారము లేదు. 1832 సంవత్సరమందు తేజచందుడు మృతినొందెను. అప్పు డొక దొంగవారసుడు బయలుదేఱెను. అతఁ డొక గొప్పవ్యాజ్యము తెచ్చెను. అది దేశమున గొప్పసంక్షోభము కలిగించెను. కాని యాదొంగవారసులు చివర కోడిపోయిరి. దత్తపుత్రుఁ డైనమహతబుచందుఁడు గెలిచెను. గొప్పసంస్థానమునకు గొప్పప్రభు వై యతఁడు వ్యవహార మెంత చక్కఁగాఁ జేసెనో, 1855 సంవత్సరమందు బయలుదేఱిన సంతలు జాతివారిపితూరీలో గవర్నమెంటువారి కతఁ డెట్టిరాజభక్తితో సాయము చేసెనో, 1857 సంవత్సరమందు జరిగిన శిపాయిపితూరీలో నతఁ డేరీతిని గవర్నమెంటువారిపక్షమున వహించి తోడుపడెనో, యెట్టకేలకు 1894 సంవత్సరమందు గవర్నమెంటువారు రాజప్రతినిధిగారిశాసననిర్మాణసభలో సభ్యుఁడుగా నేర్పరచి యతని నెట్లు గౌర

వించినో మీకందఱకు దెలిసినవిషయమే. సుప్రసిద్ధమై దీర్ఘమైనయాతనిజీవనము ముగిసినతరువాత నిప్పటిరాజు సింహాసన మెక్కెను. ఆతనిసద్గుణము లేమియు నితనివద్ద లేవు కదా! ఇత డేలినదేస్వల్పకాలము. సంస్థానము పాడుచేసెను. అధికారము దుర్వినియోగము చేసెను. అప్పుడు మిక్కిలి చిన్నతనమందే తన దురాచారములకు బలియై మంచ మెక్కి మరణమునకు సిద్ధముగా నున్నాడు."

"వనవిహారీ! ఇది నిజముగా విచారకరమే! నాకు మిక్కిలిదుఃఖముగా నున్నది. బంగాళాదేశపుజమీందారు లందఱు మహతబుచందునవలె బుద్ధిమంతులై తమతమసంస్థానములను బాగుచేసికొని మంచి వారై యుండవలయు నని బ్రిటీషు గవర్నమెంటువారు కోరుచున్నారు. ఇప్పుడు పెంచుకొనఁబడు చున్నపిల్లవాఁడు క్రమమైన విద్యాభ్యాసము కలిగి చిన్నతనమందుఁ జెడిపోకుండ కట్టుదిట్టముగ నుండవలె నని కోరుచున్నాము. ఎవరిని పెంచుకోఁదలఁచుకొన్నారో మీ రేమైన జాడకట్టితిరా?"

ప్రశాంతమై దుర్భేద్యమైన యాక్షత్రియుని సుందరముఖమునుబట్టి యతని యింగిత మెఱుఁగుటకు సాధ్యము కాదు. అతఁ డిట్లు బదులు చెప్పెను. "అది చిన్నరాణియొక్క యిష్టముమీఁద నున్నది. లేదా రాజుగారితల్లియిష్టముమీఁద నుండును. ఆమె తనయిష్టప్రకారము చేయునట్టిస్వభావము కలది. అత్తగారిమాట కోడలు మన్నించును."

"రాజుతల్లి మంచిపిల్లవాని నేరి తీసికొని వచ్చునా?"

"అయ్యా! తీసికొనివచ్చు నని నమ్మకము కలదు. ఆమె మంచిమనస్సు కలది. చనిపోయిన మహతబుచందునకుఁ దగినభార్య. ఆమె నన్నుఁ జిన్ననాట నుండి యెఱుఁగును. అప్పుడీరాజకుటుంబమే నన్ను బోషించినది. ఆమె నన్నెప్పుడు మిక్కిలిదయతో నాదరించుచు వచ్చినది. కాలక్రమమున నామెకు నామీద గలగౌరవము తగ్గిపోయినను నే నామెయెడ ధర్మము తప్పినకార్యము చేసిన పాపమునఁబోను. ఆమెయెడ గౌరవవిహీన మైనమాట నానోట నెన్నఁడు వెడలదు."

"వనవిహారీ! నీవంటివానియొద్దనుండి తద్వ్యతిరేక మైనకార్యము వచ్చు నని మే మనుకొందుమా. కాని ముఖ్యాంశము విచారణచేయుదము. మీపిల్లవాఁడు మిక్కిలి చక్కనివాఁడు కదా? వర్ధమానములో నతఁ డందరికంటె తెలివికల

వాఁడు. చురుకైనవాఁడు. ఇప్పటిరాజుగారును మీరును ఏకజాతివారు ఏకశాఖవారును కదా? రాణికి మీపిల్లవానిమీఁద నభిమాన మనియు, నతనినే పెంచుకొనువనియు వాడుక గలదు. అదినిజమైనపక్షమునమీరే యతనికిఁ జదువు చెప్పించి విద్యాబుద్ధులు నేరుపవచ్చును. కాలక్రమమున నతఁడు బాగుపడి మహాతబుచందంతవాఁడై ప్రసిద్ధిఁ గాంచును. నే నూహించినదానిలో నసంభవ మేమైన నున్నదా?" అని కమీషనరుదృష్టి యతనిమీఁద నిలిపెను. కాని వనవిహారుల మొగము మునుపటివలెనే దుర్భేద్యమై తలంపులను వెలిబుచ్చలేదు.

"రాజుగారితల్లి నాకుమారుని పై నభిమానము నిలుపు నని నే ననుకొనను. చిన్నరాణి నాకుమారునిఁ బెంచుకొన నిశ్చయించు నేని రాజుగారితల్లి పెంపు చెల్లగూడ దని కోర్టులలో దిగి పోరాడవచ్చును."

"ధనప్రయోగమువలన మార్గము సుగమము కాదా? రాజగృహమందలికొట్లు సొమ్ముతో నిండియున్న వని వాడుక. రాజుగారితల్లి కభిమానము గలబాలకు లెవరైన నున్నపక్షమునవారికిఁ గావలసినధనమామెయిచ్చివేసి మీ కుమారునిదత్తత కంగీకరించిన బాగుండును."

"రాజుగారితల్లి యున్నతమనస్కురాలు. ఆమె ధనము పాదధూళిగాఁ జూచును. కొట్లలో నున్న ధనమంతయు నామె కిచ్చివేసినను ఆమె దానిని గడ్డిపరకఁగాఁ జూచి యేతమ్మునకో, యేబంధువునకో, యిచ్చివేయును. ఆమె పెద్దది. పుణ్యాత్మురాలు. ఆమెను సొమ్ముక్కఱ లేదు. ధన మామె కాశను గలిగింప లేదు."

ఆసంభాషణము మఱియొకగంటసేపు జరిగెను. కాని యిదమిద్ధమని కార్యనిశ్చయము కాలేదు. చిన్నరాణి యెవరిని దెచ్చుకొనునో యని వర్ధమానపురవాసులందఱు మిక్కిలియాత్రముతో గనిపెట్టియుండిరి. దత్తతకుదగినబాలకు లందరియొక్క గుణాగుణములు, భోగ్యాభోగ్యములు చాటుగదులలోను, లాయరులకచ్చేరులలోను చర్చింపబడఁజొచ్చెను. ఇట్టి తలంపులలో బట్టణమంతయు రెండుభాగము లయ్యెను. చిన్నరాణిచేయబోవు కార్యనిశ్చయము నెల్లవారు మిక్కిలి యాత్రముతో నిరీక్షించుచుండిరి.

కమీషనరుగూడ నామె జేయుకార్యనిశ్చయమున కెదురుచూచుచుండెను. ఆసాయంకాలము వనవిహారుఁడును, సత్యచరణుఁడును సెలవుతీసికొనిపోవునప్పు డతఁ డిట్లనియె. "ఆమె యెవరిని బెంచుకొన్నను సరే. ఆదత్తపుత్రుఁడు తన

కృత్యములను జాగ్రత్తగా నెఱవేర్చుటకుఁ గావలసిన విద్యాబుద్ధులు జాగ్రత్తగాఁ జెప్పించెదము. యుక్తవయస్కుఁ డగువఱకు నా బాలకుని సంస్థానము బ్రిటీషు గవర్నమెంటువారు చక్కఁబెట్టియుందురు. గొప్పమహారాజునకు గావలసినవిద్య, బుద్ధి, కార్యాసక్తి మొదలగునవి యలవడుటకే ప్రయత్నములు కావలెనో యాప్రయత్నములన్నియు దొరతనమువారు తప్పక చేసి బాలకుని బాగుచేయుదురు.”

ఇరువదిఏడవ ప్రకరణము.

సాయంకాలపు విందు.

కమీషనరుదగ్గఱ సెలవుపుచ్చుకొని వనవిహారుఁడు జగత్కిశోరరాయల గృహమునకు గుఱ్ఱపుబండిమీఁద వెళ్ళెను. కిశోరరాయలు, వనవిహారుని, మఱికొందఱు మిత్రులను సాయంకాలమునఁ జిన్నవిందునకుఁ బిలిచెను. జగత్కిశోరరాయలు జగన్నాథక్షేత్రమునుండి వచ్చెను. అతని దేహస్థితిచక్కఁబడుటచే నతఁడు క్రొత్త మనుష్యుఁడువలె నుండెను. మునుపటికంటె శరీరమునకు బలము వచ్చెను. బలమే కాక పడుచుఁదనముకూడ వచ్చినట్లుండెను. అతని మేనత్తలు, తమ్ములు, మఱియితరబందుగులనేకులు విశాలమైనవానిపైత్రుకగృహమునందు నివసించుచుండిరి. కాని జగత్కిశోరరాయలు మాత్రము పట్టణమందు మిక్కిలి తెరపిగా నున్న చోట భార్యాసమేతుఁడై తోటలో నొకయింటఁ గాపురము సేయుచుండెను. రాణిగంజిలో నున్న యతనివైద్యుఁ డావిధముగాఁ జేయవలసినదని యుపదేశము జేయుటచే నతఁ డాహితోపదేశము ననుసరించుట మంచిదని తలంచెను.

జగత్కిశోరునియొక్కయు, భార్యయొక్కయు, బంధువులలో నొకగొప్పమార్పు కలిగెను. అతఁడు రోగపీడితుఁడైన దినములలో భార్య చూపినశ్రద్ధను, జాగ్రత్తను నిద్రాహారములు లేక చేసినసేవను నతఁడు కడుమెచ్చెను. అతని మనస్సు కలఁగిపోయెను. అందుచే నతఁడు మహాపతివ్రతయై పరమభక్తురాలైన భార్యయెడ మునుపటికంటె నధికానురాగముఁజూపి యెక్కువదయ గలవాఁడై యుండెను. తాను జబ్బుపడినప్పుడు తననిమిత్త మెప్పటికప్పుడు పాలు కాచి గిన్నెలో బోసి

యిచ్చుచు, దనకు నిద్రవచ్చువఱకు మెల్లగ నేవో చల్లనిమాటలు చెప్పి లాలించుచు, తఱువాత పాదములొత్తుచు రాత్రి ప్రొద్దుపోవువఱకుఁ దనసంరక్షణమే యామె చేయుచుండుట యతఁడు కనిపెట్టి చూచెను. తనకు మెలఁకువ వచ్చి చూచినప్పు డామె తనప్రక్కనే కూర్చుండి తనకు నిద్రపట్టినదో లేదో యని యామె యాతురపడుచుండుట నతఁ డెన్నోసారులు చూచెను. దాదాపుగా రాత్రి యంతయు మేలుకొని నాలవజామున జీఱకొంగుఁబఱచుకొని తనపాదములయొద్ద బండుకొనుటయు నతఁడు స్వయముగఁ జూచెను. తెల్లవారఁగానే యామె స్వసౌఖ్యము జూచుకొనక తనపథ్యపానములు చేయుచు, తన సౌఖ్యములనిమిత్తము పాటుపడుచు నుండుటయు నతనికి స్వానుభవమైనవిషయమే. అవి యన్నియుఁ జూచిన పిమ్మట మగని కా యిల్లాలిమీఁద నతిశయప్రేమ పొడమెను. అట్టి భక్తి గలభార్యమీఁద ననురాగము గలుగుట యాశ్చర్యమా!

భార్యాభర్తలిద్దఱు ప్రత్యేకముగాఁ గాఁపురము సేయుచున్నయింటికి రమారమి యిరువదిసంవత్సరములవయస్సు గలయా బాలిక యజమానురాలై యిల్లు దిద్దుకొనుచుండెను. అతఁ డామెను తఱుచుగాఁ గలిసికొని తన వ్యవహారములలో నామె యాలోచన మడుగుచు శీతకాలమున రాత్రులు ప్రొద్దుపోవువఱకు మనోజ్ఞములైన యామెపలుకులు విని యానందించుచుండెను. ఒక సంగతి యొకరి కాదినములలో మిక్కిలి బాగుగాఁ దెలిసెను. అందుచేత వారిహృదయములు కలిసిపోయెను. వివాహమైనతరువాతఁ జిన్నపెండ్లికూఁతురు క్రమక్రమముగా నవనవోన్మేషము కలిగి యుక్తవయస్కురాలై సంపూర్ణయువతియై గృహయజమానురాలైనప్పుడు హిందూదేశములో నిషధముగా భార్యాభర్తల కన్యోన్యానురాగము గలుగుచుండును. మొదట బాలికయై కాపురమునకు వచ్చి పతిభక్తి మొదలైన యుత్తమలక్షణములు నేర్చికొని యువతియైనపిదప లలితమైనయనురాగమును జూపును. అట్లుదయించినయనురాగము యావజ్జీవము నిలుచును. లేతప్రాయమున నేర్చికొన్న పతిభక్తిని భార్య జన్మమధ్యమున నెన్నఁడు మఱువదు. భర్తయు బాలికయై మొదటఁ దనవద్దకు వచ్చి తనబిగియారుకౌఁగిళ్ళ నణఁగి పెనఁగి, తన శిక్షలోఁ బెఱిగి విలాసవంతురాలై, యనురాగవతియై యువతీరత్నమైనయా భార్యను జన్మాంతమువఱకు గాఢానురాగముతోఁ జూచును.

ఆసాయంకాలమున జగత్కిశోరరాయలు కచేరిచావడిలోఁ దాను పిలిచినపెద్దమనుష్యుల నెదుర్కొని సన్మానించుచుండగా సుఖముగా జగన్నాథయాత్ర చేసివచ్చి

నందుకు బహూకరింపవచ్చినయువతులతోఁగలసి కాళి యింటిలోపల ముచ్చటలాడు చుండెను. అధికారములోను, పలుకుబడిలోను క్రమక్రమముగా వృద్ధియగుచున్న వనవిహారుని జగత్కిశోరుఁడు హృదయపూర్వకముగ సన్మానించి యాదరించెను. అతనికే కాదు. తన యాహ్వానమందుకొని నొక్కరొక్కరుగా వచ్చినమిత్రుల నందఱ యథోచితముగ సత్కరించి గౌరవించెను.

కిశోరరాయులు హృదయపూర్వకముగా సల్లాపములు చేయుచు వనవిహారునితో యొకమూలగూర్చుండెను. అప్పుడు బహుదీపములతో వెలయుచున్న యా విశాలమందిరమున వీణానాదము, గాత్రగానము వ్యాపించెను. వనవిహారునకు లాలాసాహేబని రెండవపేరుకలదు. మిత్రులా పేరుతోఁ దఱచుగాఁ బిలుచుచుందురు. "లాలాసాహెబు! నిన్ను మరల జూచెడిభాగ్యము నాకుఁ గలిగినందుకు మిక్కిలిసంతోషించుచున్నాను. నేను వర్ధమానపట్టణమువిడిచి వెళ్ళినప్పుడు మరల బ్రతికివత్తునని తలంపలేదు."

"జగత్కిశోర! నిన్నిటువంటిమంచిదశలో జూడఁగలిగినందులకు సంతోషమునొందితి. నీకింకను నలువదియేండ్లయిన నిండలేదు. నీవింక ననేకసంవత్సరములు సుఖముగా జీవింపవలెనని మేము గోరుచున్నాము. ప్రయాణము, స్థలమూర్పు నీకెంతో మేలు చేసినది. నీవు మునుపటికంటె పడుచువాడవులాగున గనబడుచున్నావు."

"ఔను! లాలాసాహేబూ! ఈప్రయాణము నాకెంతో మేలుచేసినది. ఇల్లు విడిచి వెళ్ళుట కెన్నడిష్టపడనిజనులకు మనకు ప్రాచీనమహర్షులు తీర్థయాత్రలు విధించినప్పుడు కేవలము మతసంబంధములైనకర్మలు చేయించుటయే వారియుద్దేశ్యముకాదు. అంతకంటె నధికములైన యుద్దేశము లేవోయుండితీరవలయు. తీర్థయాత్రయనగా స్థలముమార్పు, ప్రయాణము, నూతనప్రదేశసందర్శనము. తీర్థయాత్ర మనదేహస్థితిఁ జక్కఁజేయును. జీవితకాలము వృద్ధియగును."

"ఔను! అదినిజమే. కాని పూజ్యురాలయినమీతల్లి పూరీక్షేత్రములోనే యుండిపోవుటకు నిశ్చయించుకొన్నదట!"

"ఔను. ఆమె లేనిబలిమి ప్రతిదినము మాకుఁ గనఁబడుచున్నది. కాని యామె చరమకాలమును ప్రశాంతముగా గొడవలు లేకుండ గడుపుటయే మంచిది. ఎందుచేతననఁగా మాసంసారమువంటిగొప్పసంసారము చక్కఁబెట్టుటచేత నామె

దేహస్థితి యిదివరకే చెడిపోయినది. ఆమె పూరీక్షేత్రములో నెక్కువకాలము బ్రతుకును. ఎక్కువ సౌఖ్యముగనుండును. ఆమె క్షేమ మెప్పటికప్పటికి నాకుఁ దెలియుచున్నది.''

“ఔనది యాలాగే! మీ యాబిడకూడ నీతీర్థయాత్ర సుఖము సంపూర్ణముగా ననుభవించిన దఁటకాదా? ఆబిడ యెవరినో యొకవివాంద్రకన్యకను వెంట దీసికొనివచ్చినది. దాని నెక్కడనుండి పట్టి తెచ్చినది? అది బారివాంద్రపిల్ల కాదా? దాని మొగము చక్కగా నున్నది. గొప్పయింటిహిందువుని మొగమువలె నున్నది. మీ యాబిడయొద్ద పనికత్తెగా నుండుటను మఱి యేజాతిలోనుండియు నిటువంటిపిల్ల దొఱకదని నేను నిశ్చయముగాఁ జెప్పఁగలను."

“ఔను! ఆకుఱ్ఱది బారివాంద్రపిల్ల. నాభార్య బంకూరానుండి తీసికొని వచ్చినది. దాని కొక పెద్దకథ యున్నది. దానిని మగఁడు విడిచిపెట్టినందున దిక్కులేక యున్నది. ఆమోటమగనిని వెదకికొనుట కది యిక్కడికి వచ్చినది."

“నిజముగానే? ఎవఁ డామూర్ఖుఁడు. ఇటువంటి చక్కనిగొల్లచిన్నదానిని వదలిపెట్టి దేశములవెంటఁ దిరుగుచున్న యీనిర్భాగ్యుఁ డెవఁడు''''

“లాలాసాహేబూ! అదే నీతో నేను సరిగాఁ జెప్పఁదలఁచుకొన్నసంగతి. మేము వానిని కనుగొన్నాము. వానిపేరు మధుబారి. అతఁ డొకతోటవాఁడు. వాఁడే యీవిశ్వాసఘాతకుఁడు. ఆగులాము తనభార్యను తిరిగి చేపట్టునట్లు మీ యావచ్ఛక్తి వినియోగించి చేయవలెను.''

“మనము యావచ్ఛక్తి వినియోగింపనక్కఱ లేదు. వాఁడు తనభార్యను గలసి కొన్నపక్షమున మిక్కిలియదృష్టవంతుఁడే. తా నింటియొద్ద విడిచిపెట్టివచ్చిన చిన్నపెండ్లామును మరలఁ దీసికొనివచ్చుటకు బంకూరా వెళ్ళవలె నని పలుమా ఱతఁడు నాతోఁ జెప్పుచువచ్చెను. అది నా కిప్పుడు జ్ఞప్తికి వచ్చినది. ఈయడవి మనుష్యులసంగతి నీవెఱుఁగవా? వీళ్లు దేశద్రిమ్మరులు. చాంద్రను దూరమున నున్న పెండ్లముకంటె దగ్గఱనున్న సారాగిడ్డంగి మిక్కిలిప్రియమైనది.''

“ఆవిషయములోఁగూడ మేము పెండ్లికూతునకు మాట యిచ్చినాము. వానిని మనము కనిపెట్టి యుండవలెను. పోషింపవలసినభార్యయుండఁగా వాఁడు తెచ్చిన సొమ్మంతయు పాడుచేయఁదలఁచుకొన్నపక్షమున మన మూరకుండఁ గూడదు."

"అవుని మన మాపడుచుపెండ్లాముకే యొప్పగింపవచ్చును! కొందఱు యువతులు ముఖారవిందములు మధురలావణ్యసమేతములై యుండినను మనస్సులు దృఢములై యుండును. కొందఱు పడఁతులచేతులు నవపల్లవకోమలములై యుండినను బండతనమునకుఁ జేరువడి కొరగానిమోటుమగలను నినుపగుద్దులతోఁ గొట్టినట్లడఁచి వంగఁదిసి గడగడ వడంకఁజేయును. ఎట్టకేల కాబండమగలు దయఁదలంచి రక్షింపుమని భార్యలపాదాక్రాంతులగుదురు. ఈపడుచువారిపడంతి తన యింటికి యజమానురాలై కొలఁదికాలములో తనమాట చెల్లించుకొనకపోయిన యెడల నా పేరు మారు పేరు పెట్టు. మొగములను బట్టి నేను గుణములను జెప్పఁగల నని నాకుఁ బేరు కలదు. ఆ పేరు నేటితోఁ బోవలసినదే. తప్పిపోయిన మగనిని బట్టుకొనుట కాకుఱ్ఱది కాళ్ళీడ్చుకొనుచు బంకూరానుండి వచ్చి మగఁడు చేయి చిక్కినతరువాత వాని నెట్లు లాఁగఁదీయవలెనో తెలియకుండునా? మధుబాబు యీసారి సారాగిడ్డంగిలో కనబడెనా ఏపందెమువేయుమన్న నా పందెము వేయుదును."

"లాలాసాహేబూ! రాజుగారిదివాణములో నామిత్రుఁడైనహేమచంద్రున కుద్యోగ మిచ్చినందులకు నాకు మిక్కిలి సంతోషముగా నున్నది. అతఁడు మర్యాద గలవాఁడు. తగినవాఁడు కాని పనిమండిలోకి వచ్చి గొప్పలలోఁ బ్రవేశించునట్టి స్వభావముకలవాఁడు కాఁడు. ఐదాఱుమాసములు కలకత్తానగరమున నుండియుఁ దగినపని సంపాదించుకొనలేకపోయినాఁడు. మీ రతనిని నమ్మి యుద్యోగ మిచ్చి సహాయము చేసినారు. హేముఁడు మీవిశ్వాసమునకుఁ బాత్రుఁడు. అతనిని నేను చక్కఁగా నెఱుఁగుదును."

"జగత్కిశోర! ఇటువంటి పెద్దమనుష్యుని నాకు సిఫారసు చేసినందుకు నేనే మీయెడలఁ గృతజ్ఞుడనై యుండవలెను. సంస్థానములో నేను కొంతకాలమునుండి పని చేయుచున్నాను. మనుష్యులతెలివితేటలు కనిపెట్టుటలో నాకుఁ గొంత ప్రజ్ఞకలదు. ఈహేమచంద్రునికంటె మంచివానిని నేనదివఱకెన్నఁడైన దివాణములో నుద్యోగమునకుఁ దీసికొని వచ్చితినో లేదో సందేహమే. ఇంత యెందుకు? అదివఱకు కాపరగణా యంతయు మిక్కిలి యల్లరిగా నుండినది. ఇతని నక్కడకుఁ బంపినతరువాత మునుపటియల్లరి యడఁగి ప్రశాంతముగా నున్నది. దివాణపుమొహరు వేసిన వ్రాత కాగితములమీఁదకంటె హేమచంద్రునినోటిమాట మీఁద రయితులకు విశ్వాస మెక్కువగా నున్నది. సంస్థానములలో జఱిగెడు గడ

బడ లన్నిఁటికి సంస్థానాధిపతులు వారిచేతఁ బంపఁబడిన యుద్యోగస్థులు ముఖ్యకారణ మని నాయభిప్రాయము. హిందూదేశపు రైతులకంటె మెత్తని కృషీవలులు, రాజభక్తి గలకృషీవలులు ప్రపంచమందు మఱెక్కడను లేరు. కాని వారిని మనము ధర్మము తప్పకుండ దయతోఁ జూచినంతకాలమే యట్లుండురు."

"మీ రెంతపరిశీలించినను ఈక్రొత్తయుద్యోగస్థునికంటె జాలిగుండె గలవాఁడు, న్యాయదృష్టి గలవాఁడు, మఱియొకఁడు కనఁబడఁడు. తాల్లూకారుగ్రామములో నితని యిల్లు కోర్టువలె నుండును. రైతులలో వచ్చువివాద లన్నిఁటి నితడు పరిష్కరించును. ఆపరగణాలోనున్న జను లెక్కడనో కొండఱుతప్ప సాధారణముగ వ్యాజ్యములు వేసికొని కోర్టు కెక్కరు. హేముని భార్యనుగూడ నే నెఱుఁగుదును. ఆచుట్టుప్రక్కల ఆమాత్రపు తెలివైనది, సాధువైనది మఱియొకతె లేదు. తెలివిమాలిన రైతులు సరిహద్దును గుఱించియో, బీడునేలను గుఱించియో వివాదపడుచున్నప్పుడు హేముని భార్య రైతులభార్యలను బిలిపించి వాండ్రతో మాటలాడి తానే యావ్యవహారము కొంతవఱకుఁ జక్కబెట్టును. వెంటనే వివాద మడఁగిపోవును. ఆతెలివిమాలిన మొద్దులు మగవాండ్రు తగినకారణము లేకయే పోరాడుచున్నా మని తెలిసికొని యిండ్లకుఁ బోదురు."

"నిజముగ వారి దనుకూలదాంపత్యము. వర్ధమానసంస్థానపుటుద్యోగస్థుల విశ్వాసమునకుఁ బాత్రము లై వారు చిరకాలము సుఖింప వలయు. హేముని మాట తలఁచినప్పుడు నీబావమఱంది శరచ్చంద్రునిమాట నాకు జ్ఞప్తికివచ్చును. అతఁడు హేముని మిత్రుఁడు. అతనిమాట యేమి చేసినావు?"

"అతఁడు మాతో జగన్నాథము వచ్చినాఁడే. మమ్ము బాలసూరులో గలసికొన్న యుత్కళదేశపుసామంతరాజు వానిమీద మిక్కిలి ప్రీతి గలిగి తన సంస్థానములో పనియిచ్చి దగ్గఱ నిలుపుకొన్నాఁడు. అతడు చాకచక్యము గలవఁడు చువాఁడు. క్రొత్తతావులు చూచుటలోను, క్రొత్తపనులు పట్టుదలతో జేయుటలోను మావాని కభిలాష మెండు. ఈస్వల్పకాలములోనే మావాఁ డెన్నోదురాచారములను దొలగించి యాసంస్థాన మెంతోవృద్ధి చేసినాడని చెప్పుకొనుచున్నారు. అతడు సంస్థానములో నున్న ప్రతికొండమీఁది కెక్కును. ప్రతిచరియలో దిగి చూచును. అడవులలోను నిర్జనములై భయంకరములైన గొంకవనములలోను దిరుగుచున్న నతని కెంతో సంతోషము. సంస్థానములో నున్న వేటకాఁడు కానీ, సగము మృగప్రాయుఁడగు కొండదొర కానీ యెవఁడైనను సరే అతడు తన స్నేహితుడే యని భావిం

చనివాఁడు, అతఁడు తనమిత్రుఁడని విశ్వసించనివాఁడు, సర్వాధిపాలకుఁ డని యతనిని గౌరవించనివాఁడు. విశ్వయముగ లేఁడు."

"సరే! ఇది యంతయు శరచ్చంద్రుఁడు మంచివాఁ డని చాటు చున్నది. జనులజీవయాత్రలో క్రొత్తపుంతలు గల్పింప సామర్థ్యము గలవారు, మంచినడత గలవారు, చాకచక్యము గలవారు మనకుఁ గా వలయును. కాని జగత్కిశోర! మీవాఁడు స్వగృహము విడిచి, మిత్రులను బాసి, యత్యంతప్రేమ గలతనసోద రిని విడిచిపెట్టి విదేశములో నుండుటకు, వనభూములలోను పర్వతప్రాంతముల లోను నివసింప వలయు నను నభిలాష మే కారణమా? లోకములో నున్నవాడుకే నిజమైనపక్షమున నతని ప్రవాసమునకు వలపే మూలకారణము. వలపు సఫలము గాక భగ్నమగుటచే నతఁడు దేశములపాలై పోయినాఁడని వినియుంటిని."

"ఓహో! లాలాసాహెబూ! అది నీచెవిని బడినదా? నీ కిటువంటిసమా చారములెలాగున తెలియు చున్నవో, నీ వేరీతిగా జ్ఞాపక ముంచుకొంటివో యని నే నాశ్చర్యపడు చుందును."

"మిత్రుఁడా! నాయునికి ఎప్పటి కప్పుడే యుపాయములతోఁ గూడిన దని నీ వెఱుఁగుదువు. నన్ను జూచి చిఱునవ్వులు నవ్వువారిలోను, నాచుట్టు చేరి కొలువుసేయువారిలోను నేను తేఁ హృదయమున చెకిపోయినను సంతోషించువా ర నేకులుకలరు. కాబట్టి నే నెల్లప్పుడు నాకన్నులు తెఱచి చూచు చుండవలెను. నాచెవులు దోరఁబెట్టి యెల్లమాటలు విను చుండవలెను. మీకుఁ దెలియనిదారుల నుండి నాకెన్నో సమాచారములు చిత్రకధలు ప్రతిదినము తెలియు చుండును."

"అలా గుండవలసినదే! నా బావమఱఁదిమాట చెప్పెద వినుము. అతఁడు కలకత్తాలో నొకచిన్నదానిని వలచినమాట నిజము. ఆచిన్నది హేమునిమఱఁ దలు. కాని యది వితంతువు. వితంతువు మరల వివాహము చేసికొనుట మనలో తప్పుగదా?"

"మనవాఁడు హిందూవితంతువులు పునర్వివాహములు చేసికొనుట లేదా? మనవేదశాస్త్రము లట్టివివాహముల నొప్పు కొను చున్న వని గొప్పగొప్పపండి తులు చెప్పుచున్నారు. ఆధర్మశాస్త్రముల యొప్పుదలనుబట్టియె బాలవితంతువుల తలిదండ్రులు కొన్నివివాహములు చేసినారు. శరచ్చంద్రుఁడు గట్టిగా వివా హము చేసికొనఁ దలఁచుకొన్న పక్షమున నతనిదారి నతని నెందుకు వదలివేయఁ గూడదు? మనోరథసిద్ధి భంగమైనకారణముచేత నెంతో యక్కఱకు వచ్చునట్టి కుఱ్ఱవాఁడు తనబ్రతు కంతయు పాడుచేసికొని చెడిపోవు చుండఁగాఁ జూచుట న్యాయమా? అది యెంతో విచారకరము."

"లాలాసాహేబూ! నీవు సంఘసంస్కర్తవలె మాటాడుచున్నావే?"

"జగత్కిశోర! అట్లు కాదు. నేను లోకవ్యవహార మెఱిఁగినమనుష్యుఁడువలె మాటాడుచున్నాను. మనవేదశాస్త్రములంటే నాకుఁ గలగౌరవముకంటె మఱియెవ్వరి కెక్కువ లేదు. ఆశాస్త్రములు మనలను నడిపించుట కేర్పడినవి కాని మనకు సంకెళ్ళు వేయుట కేర్పడలేదు. ప్రపంచ మంతయు ముందుకుఁ గదలుచున్నయీకాలమున మనముగూడ ముందంజ వేయవలదా? జగత్కిశోర! నామాట నమ్ము. మనకు వ్యతిరేకముగా నెందఱెన్ని చెప్పినను జెప్పనీ. హిందువులము, కార్యవాదులము, కావలసినకార్యము చల్లఁగా జేసికొని పోవుదుము. మనము సోమరులము కాము కాని మెల్లమెల్లగాను జాగ్రత్తగాను నభివృద్ధిఁ జెందుచున్నాము. రామమోహనరాయలనాఁటినుండి కాలానుసారముగా మనవలెఁ దమయాచారవ్యవహారములను మార్చి చక్కఁజేసికొన సాహసించినజాతి నాకు ప్రపంచమున మఱియొకటి యుండుట యరిది. మన మభివృద్ధి చెందుచున్న పూర్వాచారపరాయణులము. ఈరెండును పరస్పరవిరుద్ధములైనమాటలని నీవనుకొనవచ్చును. గాని అట్లు గాదు."

"లాలాసాహేబూ! నీవు చెప్పినదంతయు నిజమే, కాని యెవరియభిప్రాయములను మనము మిక్కిలిగా మన్నించుచుందుమో యట్టిపెద్దలనేకు లిప్పటికిని వితంతువివాహము పేరు చెప్పిన నెంతమాత్ర మొప్పుకొనరు."

"శరచ్చంద్రుఁ డాపిల్లను వివాహమాడుట కెవరొప్పుకొనలేదు. మీతల్లి కిష్టములేదా యేమిటి?"

"కాదు కాదు. ఆమె లోకవ్యవహారసంబంధమే లేదు. ఆమెమనస్సు హృదయము జగన్నాథస్వామిపూజమీఁదను, పూరీక్షేత్రముమీఁదను నిలిచియున్నది."

"అట్లైన శరచ్చంద్రునితల్లికే యిష్టము లేదా యేమిటి?"

"ఔను! మాయత్తగారే కాశీనుండి వచ్చి ఈవివాహము చెడఁగొట్టినది. కాని తనమూలమున కుమారునకుఁ గలిగినబాధ క్రమక్రమముగా నామె తెలిసికొని తల్లి ప్రాణమగుటచేత జాలిపడి విచారించి, పుణ్యాత్ములైనపెద్దలతో నాలోచించి యావివాహము వెంటనే జరిగించవలసినదనియు, జరిగినతరువాత కొడుకును కోడలును దన యాశీర్వాదము బడయుటకు వారణాశికిఁ బంపవలసినదనియు, మ మ్మాజ్ఞాపించినది. వర్తమాన మంపి యామె కలకత్తా విడిచి కాశీకి వెళ్ళిపోయినది."

"అట్లైన వివాహమున కాటంక మే మున్నది? తమ్ముఁడు వితంతు వివాహము చేసికొనుట మీ యాఁడవాండ్ర కిష్టము లేదా యేమిటి? సోదరుఁడు భగ్న మనోరథుఁడై చెడిపోయి యావజ్జీవము కష్టపడునట్లు నీ యాబిడ కోరినపక్షమున నామె చక్కఁగా నాలోచింపలేని దని నే ననుకొనవలసి వచ్చును."

"నాభార్యకు వేఱె యభిప్రాయములేదు. తల్లి యభిప్రాయమే యామె యభిప్రాయము. మా యాబిడ పసిమనసు. మెత్తని స్వభావము గలదయ్యును సోదరునిసుఖమునిమిత్తమై యెంతకైన పోఁగొట్టుకొనఁ దలఁచుకొన్నది. కాని నాకే ధైర్యములేదు. నేను సందేహించుచున్నాను."

"ఛీ! ఏమిమాట యిది. మగవాఁడవై యుండియు ధైర్యముఁ జూపుము. ఆఁడువాండ్రకే లేనిపిచ్చిపిచ్చిభయములు నీకుండఁదగునా? ఆభయముఁ బాఱఁదోలుము. నేను శరచ్చంద్రుని జూచినాను. మనుష్యులస్వభావములను జూడఁగట్టుటలో నేను కొంతవఱకు గట్టివాఁడను. అతఁడు గొప్పదేశసేవకుఁడు. మహాకార్యములను జేయ సమర్థుఁడు. అట్టివాఁడును చిన్నతనమందు భగ్నమనోరథుఁడై కాలము పాడుచేయఁగూడదు. జగత్కారా! నీవు దీని కొడంబడి చేతిలో చేయివేయుము. ఈరాత్రి నేను బాబూకు తంతివార్త నంపెదను. ఉత్కల దేశపుసామంతరాజును నే నెఱుఁగుదును. నా యుత్తమతఁ డాకుఱ్ఱవానిని విడిచిపెట్టును. నేను వర్తమాన మంపినరెండుదినముల లోపుగా గాని లేక పొగరోడమో, పొగబండియో దీసికొని రాఁ గలిగినంతవేగముగా గాని యతఁ డిక్కడికి వచ్చును. అట్లు రాకపోయినయెడల పడుచువాండ్ర మనోగతములు నే నెఱుఁగ నన్నమాట యబద్ధమే."

"లాలాసాహేబూ! నీ ప్రజ్ఞకుఁ దగినసలహా చెప్పితివి. నీసలహా నావంటి పిరికివానికి దౌర్బల్యము పోఁగొట్టి ప్రోత్సాహము కలిగించుచున్నది. గొప్పతనమునకుఁ దిసికొనిపోవుమార్గమున నీవు సాహసించి నడచుచున్నావు. నీకు మిక్కిలి గొప్పపదవికని పెట్టుకొని యున్నది. నీకుమారుఁడు వర్ధమానపురాజగుకాలము, గవర్నమెంటువారివల్ల నీకు రాజబిరుదము వచ్చుకాలము నేను చూచెదను. నేను నీసలహా నొప్పుకొంటిని. ఇదిగో! చేతిలో జేయి వేయుచున్నాను. నీయెడల నే నెప్పుడును కృతజ్ఞుఁడనై యుందును."

ఇరువదియెనిమిదవ ప్రకరణము.

పశ్చాత్తాపము.

విందులకు వచ్చినమిత్రులు పోవుచుండుటచే గానధ్వని క్రమక్రమముగ సన్నగిల్లినది. మంగళకరంబగు దీపములు మాత్రమే కాంచబడినవి. జగత్కిశోరరాయలు లోపలికిఁజేరి భార్యప్రక్కను గూర్చుండి శరచ్చంద్రునకు వనవిహారికను పంపఁదలచిన తంతివార్తను గురించి గుసగుసలాడెను. పరమపావనురాలైనకాళి యీసంతోషవార్తవిని భర్తకుఁ దనకృతజ్ఞతను దెలియఁజేయుటకు దగ్గఱఁ జేరెను. దేశములు పాలైపోయిన తనప్రియసోదరుఁ డొకయింటివాఁడై సంసారసుఖ మనుభవింపఁ గలఁడనియు, దిక్కుమాలి కడుదుఃఖ మనుభవించుచున్నసుశీల సత్పత్నియై గృహయజమానురాలై ప్రసాదింపఁగల సకలానందములను నిఁకఁ బట్టియుండు ననియు నొకతలంపు తనమనంబునఁ బొడఁగానే కాళికన్నులనుండి బాష్పములు వెడలెను. ఆమెదాని కోరిక లెంతోదూరము త్రెస్సినాటును. కాళి యొక్క కోమలమనస్సు తనసోదరునకుఁ బుట్టఁగలబిడ్డల ముద్దుమొగములఁ జూచినట్లు, తప్పటడుగు లిడుచు నాబిడ్డలు తనయొద్దకు వచ్చి వచ్చియు రాని త్రొక్కునుడులతో అత్తా అత్తా యని పిలుచుచుండినట్లు, వాండ్రు దుమ్ములో నాడుకొని వచ్చి యాదుమ్ము తనమీఁదఁ బడునట్లు మీఁదనెక్కి త్రొక్కినట్లు, తాను ముద్దులాడినట్లు, భావించుకొనఁ జొచ్చెను. ఆసంకల్పరంగమున నామెకు బిందుకూడ గనఁబడెను. బిందుమాట స్మరణకు రాఁగానే చనిపోయినయామెమాట జ్ఞప్తికి వచ్చెను. దానితో విషాదచ్ఛాయ వచ్చి మేలుకొనియుండియు స్వప్నములు గనుచున్న యామె మనంబును గ్రమ్మెను. ఆముగ్గురుబాలికలు చిన్ననాటనుండియుఁ గలసి తిరిగిరి. హతశేషులైన యిరువురు చెలికత్తెల హృదయములయందు ప్రియమిత్రమైన యామెయవస్థ మఱపురాక యెప్పటికప్పుడే క్రొత్తయై విషాదజనకమై యుండెను.

అటులుండ రాత్రి రెండవజాముగూడ గతించెను. దీపము మినుకుమినుకు మనఁజొచ్చెను. భార్యాభర్తలు తమసంతోషపుతలంపులను, విచారపుతలంపులను తెంపులేక చెప్పుకొని గుసగుసలాడుచుండిరి. అప్పుడు వీధితలుపు నెవరో కొట్టినట్లు చప్పుడయ్యెను. జగత్కిశోరుఁడు చెవియొగ్గి వినెను. ఆచప్పుడు మఱల వినఁబడెను.

ఇంతప్రొద్దు పోయినప్పుడు వచ్చి పిలిచెడువా రెవరు? నౌకరు లందఱు పండుకొని నిదురపోయినారు. నేను వెళ్ళి తలుపు దీసెద నని జగత్కిశోర రాయలు పలికి వెలుపలికి నడిచివెళ్ళెను. భార్య యతనివెంట నడుగులు చప్పుడు కా కుండ మనంబున నేదో యిట్టిదనరానియూసఁ బెట్టుకొని మెల్లఁగా వెళ్ళెను.

క్రొత్తమనుష్యుఁడు లోపలికి వచ్చెను. వెలుఁగు మందముగా నుండుటచే జగత్కిశోరుఁ డతనిని గుర్తుపట్ట లేదు. కాళి తటాలున వెనుకకుఁ దిరిగి ప్రక్క గదిలోనికిఁబోయి తన ఘోషాస్థలములో నిలిచి క్రొత్తమనుష్యునివైఖరి కనిపెట్టుచుండెను.

“అయ్యా! మీ రెవరు? ఈయర్ధరాత్రము వేళ నేమిగావలసి వచ్చినారు” అని జగత్కిశోరుఁ డడిగెను.

— జగత్కిశోర! పూర్వ మొకానొకప్పుడు నేను నీమిత్రుఁడను. నేనిప్పుడు నీమిత్రుఁడ ననిపించుకొనుటకుఁ దగను. మనపూర్వస్నేహమునుబట్టి యీరాత్రి యిక్కడ తలదాచుకొనుటకు వచ్చితిని. తూర్పు ఉదయమున నాదారిని నేఁ బోయెదను.

ఆకంఠధ్వని మఱచుటకు వీలులేనిది. ఐశ్వర్యాధికారము గలిగి మున్ను గొప్పవాఁడై యుండినధనంజయుఁ డావిధమునఁ బాడైపోవుచుండుట చూచి జగత్కిశోరుఁడు మహాశ్చర్య మొందెను. మొగము కృశించెను. కన్నులు గుంటలు పడెను. తలవెండ్రుకలు చిఱకాలమునుండి చమురెఱుఁగక మోటబారి చీకాకు బడి మొగముమీఁద బడుచుండెను. అతనివాలకము మృత్యుదేవతకాశ్రయ మైనట్లు కనఁబడెను. ఆధనంజయునిచరిత్రమును సాధు వైన యుమచరిత్రమును దలఁచు కొనఁగానే జగత్కిశోరునిమనంబున నొకవిధ మైనయేవ పుట్టెను. కాని సహజ మైనగృహస్థధర్మ మాయేవను జయించెను. జగత్కిశోరుఁడు దయాపూర్వకముగా నతనితో మాటలాడెను. ధనంజయా! ఏమిది? మనము కలిసికొని చిఱకాల మైనది. నీ విటువంటిదుర్దశలోనికి వచ్చితివా? కొన్నిమాసములక్రిందట నీ వీ దేశములో మిక్కిలిగొప్పవారిలో నొకఁడవై యుంటివి. మీయూరిలో నెంతగొప్పవాఁ డైనను మీదర్శనము చేయుట తన కెంతో గౌరవముగ దలంచుచుండెడివాఁడు కదా? అదియెల్లఁబోయి చివర కింతగతి పట్టినదా? తలదాచుకొనుట కిల్లులేక నేఁడు దేశద్రిమ్మరి వై యుంటివా? కాని ధనపురములో నీకుగొప్పభూములు మేడలు మిద్దెలు యున్నవి కావా? అవెవరు చూచుచున్నారు. నీ విలాగున నెందుకుఁ దిఱుగుచున్నావు.

"మాతండ్రియున్నప్పుడు మావ్యవహారములు చూచునతఁడే విశ్వాసము కలిగి యిప్పుడుగూడ మాయిండ్లు భూములు చూచుచున్నాఁడు. అవి మామేనల్లునకు వెళ్ళిపోవునవే కావా? నావంటి నిర్భాగ్యునకవి యుండఁదగవు. నేను ఘోర పాపము చేసినాను. దానిఫలము పూర్తిగా ననుభవించినాను. నాకు విశ్రాంతి కావలయును. కాని యది ప్రపంచములో దొరకుటలేదు. నాచిన్నతనములో నాకుఁ గొందఱుస్నేహితు లుండెడివారు. వారిలో మిక్కిలిసాహసవైనది భార్య యొకతె. చచ్చిపోయిన నాభార్యయు నీభార్యతోఁబుట్టువు కంటె నెక్కువగ నుండెడిది. నేను తాల్పకారు వెళ్ళినప్పుడు నీభార్య నెన్నిసారులో చూచి పలు కరించుచు వచ్చినది. పరమసాధ్వియై యతిదయాశాలిని యగునీభార్యనే నభ్యాగతుఁడనై యీరాత్రి యిక్కడికివచ్చి యుండుటచేత నన్ను దీవించి మంచిమాటలాడి యామె నన్నాదరింపవచ్చును. నేను రేపువెళ్ళెదను. ఇఁకముందామె కెన్నఁడును కనుపడను. బాధపట్టను."

అతిదీనములగు నతని పలుకులు విని కాళి దుఃఖమును ధరింపలేక యతఁడున్న చోటునకు సత్వరముగబోయి మేలిముసుంగు క్రిందఁ గన్నులు వత్తుకొనుచుండఁ జిన్నతనమువలెనే యాతని చేయిఁ బట్టుకొని లోపలిగదిలోనికిఁ దీసికొని పోయి యొకచో గూర్చుండబెట్టి గద్గదకంఠయై భర్త కిట్లనియె. భర్త మన యింటికి వచ్చి గౌరవింపఁబడలేదని యతను యాత్మవిషాదము నొందు నేమో కదా. అతఁడెటువంటి బ్రతుకు బ్రతికినను మాయమ్మమగఁడే కదా. మీ రాతని ప్రక్కను గూర్చుండి యోదార్పవలయు. ఇతఁడేదేని యాహారము కావలసి యున్నాఁడు. మిక్కిలిదుర్బలుఁడుగా నున్నాఁడు. నే నీలోపున మిక్కిలిత్వరగా నేదేని యుపాహారము సిద్ధముచేసి పట్టుకొనివచ్చెదను.

అని చెప్పి కాళి వంటయింటిలోనికి వెళ్ళెను. కిశోరరాయు లభ్యాగతి ప్రక్కను గూర్చుండెను. ధనంజయుఁడు తనకు నిదివఱకు జరిగిన దీనవృత్తాంత మంతయు నతనితోఁ జెప్పి యిట్లనియె.

"ధననష్టమునకు నే నంతగా గుందుటలేదు. ఏమన నేను ధనము విశేషముగా గోలుపోయినను నావాస్యములు ముఖాసాలు నిలిచి యున్నవి. మిత్రులు నన్ను వదలి వేసినారనువిచారముగూడ నంతగాలేదు. పూర్వము నాకు మిక్కిలియాప్తులుగా నుండునట్టిస్నేహితులు వ్రేలుచాపి నన్నొరులకుఁ జూపించి నన్ను దిరస్కారభావముతో జూచి నన్నుగురించి గుసగుసలాడుచున్నారు. ఈయేకాకిత్వములోనే నాయవమానమునుగూడ నిర్విచారముగ భరింపగలిగి యున్నాను. కాని నాజీవితమును గేవలమూ

నరకవాసప్రాయముగ జేయుచున్నయామహాదుఃఖ మొకటియున్నది. మహాపతివ్రతయై నిష్కలంకచరిత్రయై నన్నే ప్రేమించి, నన్నే నమ్మియున్న పరమసాధ్విని నానా బాధలుపెట్టి క్రౌర్యము గలిపి చంపివేసితి నన్నయా చింత బాధించుచున్నది. అదే నా హృదయమును గాల్చుచున్నది. నెత్తురుచుక్క లేకపాలిపోయినయామె మొగము రేయుంబగళ్ళు నన్ను వేధించుచున్నది. స్వప్నములయందైనను తెల్లని మొగముగల యొకానొక యువతి రెప్పవేయక కన్నులు నాపై నిగుడ్చి చూచుచున్నట్లు కనబడును. నేనెంతో భయపడి కేకలువేయుచు గుభాలున నిద్రలోనుండి లేచుచుందును. స్త్రీహత్యామహాపాతకము నావెంట నంటియున్నది. దానివలన నే నే నున్మత్తుఁడనైతిని. ఈమనఃక్లేశము నే నింక చిరకాల మనుభవింపఁ జాలను."

"ధనంజయా! నీవు ధైర్యముఁ దెచ్చుకొనుము. నీవు గొప్ప పాపము చేసితివన్నమాట నిజమే. మనశాస్త్రము లేమి చెప్పుచున్నవో యెఱుఁగుదువా? స్త్రీలు దుఃఖపడిన పక్షమున భగవదనుగ్రహము లేక నాశనమగుదురని చెప్పుచున్నవి కాని యెంతఘోరపాప మైనను ప్రాయశ్చిత్తము లేని పాపము లేదు. నీప్రాయశ్చిత్తము మిక్కిలి భయంకరమై చిరకాలముండి నీచే ననుభవింపఁ బడుచున్నది. ఈశ్వరుని నమ్ముకో! నమ్ముకొంటివా నీకు మనశ్శాంతి కలుగును."

ఈమాటలు ధనంజయుఁడు సరిగా వినకయే [illegible] మాటలాడక తనలోఁ దానే యిట్లు మాటలాడుకొనఁ జొచ్చెను. "నే నొకసారి తాల్పుకారు గ్రామమున మా అత్తగారియింటియొద్ద నుంటిని. అది వెన్నెలరాత్రి. గ్రామవాసులందఱు గాఢముగ నిద్రించుచుండిరి. అప్పుడు సుమతియు నేనును వెన్నెలలో షికారువెళ్ళి చెఱువుగట్టున నేకాంతముగఁ గూర్చుండి నీళ్ళకేసి చూచితిమి. అప్పుడామెను నేను బిగియారఁ గౌగిలించుకొని హృదయము హృదయమునకుఁ జేర్చి మేలిముసుగు దీసి మొగము మొగముతోఁ జేర్చి ముద్దాడి యానందలహరిలో నోలలాడితిమి. అప్పుడు నిన్నొక్క నిముసమైన నే విడఁబాయఁ జాలను. మన ప్రేమకు చుక్కలతో నిండినయాకాశము సాక్షి. నాజీవితాంతము వఱకు నిన్నే ప్రేమించెద" నని యామెతో నంటిని. చంద్రప్రభాప్రసారణముచే నత్యంతశోభాయమానమైన నాఁటి యామె ముఖము తెల్లబారినను కృశించినను నాకన్నులకుఁ గట్టినట్లు కనఁబడుచున్నది. కనఁబడి మా ప్రేమకు సాక్షియైన నక్షత్రాకాశము నంక వేలుపెట్టి చూపుచున్నది. నేను చేసిన ప్రమాణముఁ దప్పితిని. ఆకాశవాణిదృష్టిలో నే నసత్యవాది నైతిని."

ఆకథల నన్నిఁటిని జ్ఞాపకము చేసికొనను. నీకుఁదప్పక పిచ్చియెత్తును."

"నాకొకసారి జబ్బుచేసినప్పుడామె పుట్టినింటనుండి ధనపురమునకు వచ్చెను. నాకు మందిచ్చువైద్యుఁడు పెదవివిఱచి తెల్లబోయి దగ్గఱ నున్నవారి చెవులలో గుసగుసలాడెను. నాతల్లి నాయవస్థ జూచి వ్యాకులము నొంది నా యెదుట నేడ్చినపక్షమున నేను భయపడి బెంగపెట్టుకొందునేమో యనుభయమున గదివిడిచి యావలకుఁబోయి పలుమాఱేడ్చుచు వచ్చెను. కాని యుమ యెందు చేతనో మిక్కిలి ధైర్యముకలిగి యుండెను. ఆమెహృదయము చలింపలేదు. ఆమె రాత్రియనక పగలనక నాప్రక్కనేకూర్చుండి యెన్నోసారులు నా చెవిలో భయ పడవద్దు. భగవంతుఁడు మనల నిద్దఱను వేఱుచేయఁడని ధైర్యము చెప్పుచు వచ్చినది. ఆమె యనురాగాతిశయముచేత నాకెంతో ధైర్యము కలిగి జీవింతు ననుయాసపుట్టెను. ఆనాఁటిస్థితి నాకన్నులయెదుట నిప్పుడు కనఁబడుచున్నది. నిశ్శబ్దమై మూసినతలుపులు కలిగి చీకటిచీకటిగానున్న యాగదిలో మగని మంచము ప్రక్కను గూర్చుండి యుపచారము చేయుచుండిన విసుగులేని యాయిల్లాలిని బరమశాంతురాలైన యాయిల్లాలిని నేనిప్పుడునయితము చూచుచున్నాను. భార్యను జంపుటకుఁ గాబోలు ఆపాడుభర్త బ్రదికెను."

"ధనంజయా! నీపుణ్యమాయెను. ఆగొడవలో దిగకు."

"అన్నిఁటిలో దారుణమైనది కలకత్తాలోని యాకపటరంగమే. నాగుఱ్ఱపుబండి వెళ్ళుచున్నప్పుడు బాటమీఁద చెట్టుప్రక్కను చలిచేత వడకు చుండిన యొకదీనురాలిం జూచితిని. దీపపువెలుతు రామెమొగమున తళుక్కు మని ప్రకాశించెను. ఆమె కన్నులు నాపై నిలిచి నిశ్శబ్దమైన ప్రార్థనముచేసెను. కాని పెదవులు కదలలేదు. ఆచీఁకటిలో నామెను విడిచి బండి సాగిపోయెను. కలకత్తానగరమందలి యాటకత్తెయొకతె నాప్రక్కను బండిలో నపుడు గూర్చుండెను. అది చక్కనిదే కాని నట్టిపాముముండ. నాచేత పరాభూత యైననా భార్య యాచలిలో నిలిచి యుండి నశించిపోయెను."

కాళి యుపాహారములు సిద్ధము చేసికొనివచ్చి ధనంజయునియున్మత్తప్రలాపములు వినుచు నొక్కయరగంట యావల నిలిచెను. వినివిని యామె దుఃఖము తట్టలేక మేలిముసుగు దీసి యావల బాఱవైచి మితభాషిత్వమును వదలి చిత్త సంక్షోభముచేత గద్గద మైనకంఠముతో నిట్లనియెను.

"నీచే నట్లు పరాభవింపబడినయాపరమసాధ్వి నీవలన మహాప్రాయశ్చిత్తముగోరుచున్నది. ప్రాయశ్చిత్తమే మనగా బరిశుద్ధమైన బ్రతుకు బ్రతుకుట. గతించిన దోషమునకు బశ్చాత్తాపము బొందుట. ఆమెను దలచుకొని యామెపేరు

నీవు గౌరవింతువేని యామె శిష్టమైనసత్ప్రవర్తనము సదాచారము గలిగి నీ విక ముందు నడతువేని స్వర్గస్థురాలైనయుమ వెనుకటితప్పులు క్షమించును."

హృదయభావమును సంపూర్ణముగా వెలిబుచ్చిన యామెదృఢస్వరము విని ధనంజయుఁడు త్రుళ్ళిపడి తన యున్మత్తప్రలాపములను మాని మృదుస్వరముతో నెమ్మదిగా నామెకిట్లనియె. 'కాళీ! నిశ్చయముగా నీవట్లు తలంతువా? స్వర్గములో నున్న యాయుమ నాతప్పులు క్షమించునా?'

కన్నీరుపెట్టుకొని కాళి యిట్లనియె. "తప్పక క్షమించును. నీవు మంచినడత గలిగి బ్రతికితివా తప్పక క్షమించును. బ్రతికియున్నప్పు డుమ యెంత బాధ పడినదో భగవంతున కెఱుక. నేను దానిని జక్కఁగా నెఱుఁగుదును. అంత బాధపడు చున్నప్పటికి దాని కెప్పుడు నీమీఁద రవంతయైన కోపములేదు. నీమీఁద మొదలే లేదు. భూదేవత కదా మాయుమ. అది నీవు చేసినయపకారము లన్నిఁటిని మఱచిపోయి స్వర్గమునందుండి నీ కెంతో మేలు చేయును. నీవు దానినే నమ్మికొన్నపక్షమున నిన్నుఁ గాపాడును."

ఈపలుకులు విన ధనంజయుని సంక్షుభితహృదయముమీఁద నమృతవర్షము కురిసినట్లయ్యెను. కొంతసే పంగ ఱూరకుండిరి. చిన్నబిడ్డవలె నతఁడు కాళి యెక్కడికి వెళ్ళిన నక్కడికి వెంటవెళ్ళెను. ఆమె యాజ్ఞాప్రకారము కొంచె ముపాహారము పుచ్చుకొని, యొకచో విశ్రమించెను. మంచముమీఁదఁ బండుకొనఁగానే బాష్పప్రవాహము కన్నులనుండి స్రవించి హృదయస్థితమైన దుఃఖభారమును దింపుపఱచెను. పశ్చాత్తాపముఁ జెందిన యా పాపకర్ముఁడు నిర్విచారముగా నిర్మలముగా గాఢనిద్రఁ బోయెను. ఉమ తన్నెడఁబాసినది మొద లటువంటి సుఖనిద్ర యతఁ డెన్నఁడు బోయి యెఱుఁగఁడు.

ఇరువదితొమ్మిదవ ప్రకరణము.

అన్వేషణము.

ఉమ దబ్బాటుగ నదృశ్యురాలు కాకమునుపు వ్రాసియుంచిన జాబును మఱునాఁ డుదయమున ధనంజయుఁడు జగత్కిశోరరాయలకుఁ జూపెను. జగత్కిశోరుఁడు దానిని భార్యకుఁజూపెను. ఆమె బాష్పాకులలోచనయై దానిం జదివెను.

అదిచదువఁగానే కాళియొక్క మనస్సునఁ జిన్న యాశాంకురము మొలకలెత్తెను. ఎత్తుటయు నామె యిట్లనియె. "ఉమ గంభీరమైనది. చేలదికాదు. మత విషయములు బాగుగాఁ దెలిసినది. సామాన్యపు మందభాగ్యురాలివలె నాయుమ కూడ చులకనగాఁ బ్రాణత్యాగము చేసికొనునా? కాళీఘట్టమునం దగుపడిన బ్రహ్మచారి నాయమ్మతో నుమ తనదుఃఖములు మఱచిపోవుటకుఁ బుణ్యజీవనముఁ జేయుటకుఁ నేపుణ్యక్షేత్రముననో నాఱువేసము వేసికొనియుండిన నుండవచ్చునని సందర్భవశమునఁ బలుకలేదా? మహానుభావుఁడైన యాబ్రహ్మచారిమాటలు సత్యము కాఁగూడదా? ఆమెవ్రాసిన యీజాబులో వర్ధమానపట్టణమందలి నూటయెనుబది దేవాలయములమాట యామె యెత్తినది. ధనంజయునిభార్య యచ్చోట బ్రతికి యుండవచ్చునా? మహాదోషభార మాతని హృదయమునుండి దింపివేయఁబడుట కాధారముండవచ్చునా?"

ఈయాశ పునాదిగాఁ జేసి వా రాదినమంతయు నల్లికపై యల్లిక యల్లి యచ్చట నుండవచ్చు నిచ్చట నుండవచ్చునని యూహింపఁజొచ్చిరి. సాయంకాలమునఁ గిశోరరాయలును భార్యయు నతనిని దేవాలయమునకుం గొనిపోయిరి. ఆయాలయములను మహాతబుచందురాజు కట్టించెను. ఉన్నతగోపురములతో నవి యొకదానిప్రక్క నొకటి వరుసగా నుండెను. మహాతబుచందుఁడు పూర్వ మక్కడికి వచ్చి యెముకలు నొప్పిరెత్తువఱకు మొగమునఁ జెమటకాల్వలు గారువఱకుఁ బ్రదక్షిణము చేసి ప్రతిదేవాలయముముందట సాష్టాంగనమస్కారము చేయుచుండెడివాఁడు. రాజుగారితల్లి నేఁటికి సైతమీ దేవాలయములకుఁ బోయి దేవతాదర్శనముఁ జేయుచుండును. ఆదేవాలయముల వ్యయమంతయు సంస్థానపు ధనమునుండియే. ఇతర స్థలములనుండి వర్ధమానమునకుఁ దండోపతండములుగ వచ్చెడు యాత్రికులు పూర్వ

రాజులభక్తి మూర్తీభవించినట్లున్న యా యాలయంబులకుఁ బ్రదక్షిణములు చేసి దేవతలం గొలిచి పోవుచుందురు.

జగత్కిశోరుఁడును భార్యయు భక్తిశ్రద్ధలతో దేవతలను దర్శించి నమస్కరించి యర్చించిరి. ధనంజయుఁడుమఱియొకసారి కన్నీరువిడిచి దుఃఖోపశమనముఁ జేసికొనెను. పాడు బ్రతుకు బ్రతికి చేసినమహాపాతకములను భక్తి మొదలగువానిచేఁ బోఁగొట్టుకొనవచ్చునని భార్య కట్టకడపటజాములోఁ జేసిన హితోపదేశము నతఁడు జ్ఞప్తికి దెచ్చుకొని యాయాజ్ఞ యీశ్వరాజ్ఞఁగా నెంచి దాని ననుసరించెను.

సాయంకాలము కొంత ప్రొద్దుపోయినతరువాత గాలి పవిత్రుఁడైన దేవాలయార్చకుఁడుండు కుటీరమునకుఁ బోయెను. అతఁడు మిక్కిలివృద్ధుఁడు. అతనిం జూచి యామె దండప్రణామములం జేసి యాశీర్వాదములు బడసి యిట్లు బలికెను. "తండ్రీ! ఈవిగ్రహములనర్చించుచు చిరకాలమునుండి మీరిచ్చటనే జీవించినారు. అనేక తైర్థికులను మీరు దీవించినారు."

"బిడ్డా! నీ వట్లనవచ్చును. ఈదేవాలయములు నాయధీనము చేసినవాఁడు మహాతబుచందుఁడు. ఆవృద్ధరాజును నేను పలుమాఱు ఒకదేవాలయమునుండి మఱియొకదేవాలయమునకుఁ దీసికొనివెళ్ళి విగ్రహములఁ జూపితిని. ఆయన నిజముగా మిక్కిలిగొప్పవాఁడు. మన యాంగ్లేయప్రభువులుగూడ నతని ప్రభావ మెఱుఁగుదురు. ఎఱుఁగుటచేతనే బిరుదు లిచ్చి గౌరవించిరి. గొప్పతన మేమిటందువేమో? అతని మనస్సెప్పుడును మతముమీఁదనే యుండెడిది. వార్ధకదశలో నతఁ డొక్కనాఁడైన నిక్కడకు రాకుండ దేవతాదర్శనముఁ జేయకుండ నూరక యుండలేదు. కాని యేమిశాశ్వతము? వెళ్ళిపోయినాఁడు. అంతతోఁ బోయినదా? ఆయనయనంతరము వచ్చిన యీ చిన్నరాజుగూడ మనలను విడిచి వెళ్ళిపోవుచున్నాఁడు."

"తండ్రీ! ఇక్కడ దేవతాపూజఁ జేయువారు రాజులుమాత్రమే కారు."

"కాదు బిడ్డా! కాదు. పరమశివుని యాలయములు పవిత్రహృదయులతో వచ్చునట్టి భాగవతోత్తము లందఱకు సమానముగానే ప్రవేశింపఁదగినవి."

"జీవితములో దుర్లభమగు దుఃఖోపశమనము మతమునందుఁ గాంచవలయునని దుఃఖభారము క్రిందఁబడి నలిగిపోయిన హృదయములతో నిక్కడకు వచ్చి యుండినభక్తుల ననేకులను మీరు చూచి దీవించి యుందురు గదా?"

"ఆహా! అప్పుడప్పు డట్టివారి నెందఱినో నేను కలిసికొని యుంటిని. ఎందుచేతనన మందభాగ్యులకు మహాదేవుని చరణముదప్ప యన్యథాశరణ మెక్కడ నున్నది."

"అట్టివారిలో నొకదానికథ మీకు జ్ఞాపక మున్నదా? అది వయస్సునఁ జిన్నది. ముఖము లక్షణమైనది. అదికూడ వచ్చి తన దీనచరిత్రము మీతోఁ జెప్పి కొని దుఃఖతారకమైన మీయాలోచన మడిగి యుండవచ్చును. ఎంతో కాలమై యుండదు. కొన్నివారముల క్రిందటనే."

"అబ్బో! ఇద్దరా, ముగ్గురా? అటువంటి వాండ్రెందఱో వచ్చుచుం బోవు చుందురు. కాని నాకటువంటిచిన్నదాని నొకదానిని జూచినట్లు జ్ఞాపకమున్నది. అది మిక్కిలి యందకత్తె. మొగముం జూడఁగానే మహావిచారములో నున్నట్లగ బడినది. నే నామెవంక నెన్నో సారులు చూచిచూచి దుఃఖకారణ మడిగితిని. అది బాలవితంతువు. గుండెపగిలి తెగయేడ్చినది."

"తండ్రీ! దానివిషయమై కాదు నే నడుగుచున్నది? ఇది పెండ్లియైనదే. ఏబాలవితంతు వెన్నఁడు ననుభవించి యెఱుంగనిఘోరదుఃఖము లనుభవించి యిది భర్తను విడిచిపెట్టి వచ్చినది. ఆమహాదుఃఖముచేత నదికూడ మీదర్శనము చేయు టకు వచ్చియుండునని నే ననుకొంటిని."

"బిడ్డా! నీవు జ్ఞాపకము చేయుటవలన జ్ఞాపకము వచ్చినది. నేను చెప్పి నది బాలవితంతువుమాట కాదు. మఱచిపోయినాను పెండ్లియైనదానిమాటే. వితంతువువలె నది యుంమలేనిపంచె కట్టుకొని వచ్చినది. దండలయందుఁగాని చేతు లకుఁగాని మెడలోఁగాని, నగలు లేవు. కాని కాలుపలుగట్టుకన్నీరు తుడుచు కొనుట కామె చేతులెత్తినప్పుడు పుణ్యస్త్రీలయొద్ద గనఁబడు ఇనుపబిళ్ళ నాకుఁ గనఁబడినది. అన్నినగలు తీసివేసినను పుణ్యస్త్రీ యదిమాత్రము తీసివేయదు. వితంతువు మగఁడు పోఁగానే దానిని తీసిపాఱవేయును. దానివాలకమునుబట్టి, కట్టినబట్టనుబట్టి యది వితంతువని నేను భ్రమించితిని గాని యది నిజముగా మగఁడు బ్రతికియున్న యాఁడుదై యుండవచ్చును."

"తండ్రీ! ఈమాత్రముమాటలు చెప్పి మాకు ధైర్యము కలిగించితివి. భగవం తుఁడు నిన్ననుగ్రహించుఁగాక! నీజీవిత మెంతపవిత్రమో నీచరమకాలముకూడ నంత సుఖాస్పదమగుఁగాక! కాని యామె మీతో తనబాధలు చెప్పికొన్నదా?

చెప్పు తండ్రీ! చెప్పు. వినుటకుఁ జెవులు తొందరపడుచున్నవి. ఏదోమంచి వార్త వినఁబడునను నాసచేత నాహృదయము ముబ్బిపోవు చున్నది."

"బిడ్డా! నే నెఱింగిన దంతయుఁ జెప్పెదను. ఆమె తనగొడవేమియుఁ నాతోఁ జెప్ప లేదు."

"తాల్పుకారునుండి గాని ధనపురమునుండి గాని వచ్చినట్లయినఁ జెప్పలేదా."

"ఎక్కడ నుండి వచ్చినదో యామాట చెప్పనే లేదు."

"కలకత్తాలోఁ దనకొకచుట్టము పక్కము లేకుండ, స్నేహితులు లేకుండ నేకాకియై యింతో దౌర్భాగ్యస్థితి ననుభవించినట్లయినఁ జెప్పలేదా?"

"ఆమె కన్నీరు విడుచుటచేత దౌర్భాగ్య స్థితిలో నుండెనని నే నూహించి తిని గాని నోటితో నేమియుఁ జెప్పలేదు."

"మగఁడు తననిమిత్తము వెదకుకొనుచు వచ్చినప్పుడు తా నీదేవాలయము లలో నుందు ననియైనఁ జెప్పలేదా?"

"మగనిమాటే యెత్తలేదు. తిరిగి వచ్చుటమాట యంతకు ముందే లేదు."

"ఎక్కడికి వెళ్ళఁదలఁచుకొన్నదో, ఎక్కడఁ గనఁబడునో చెప్పినదా?"

"పుణ్యనదీతీరములందున్న దేవాలయములఁ జూచుచు నెందలో తీర్థవాసు లక్కడనుండి యిక్కడకు నిక్కడనుండి యక్కడకుఁ దిరుగుచుందురు. ఆమెయు వారివలెనే యొకచోట నిలువక దివ్యస్థలము లన్నిఁటికిఁ బోవు చుండును."

"తండ్రీ! దానినిగురించి మీకేమియుఁ దెలియదన్నమాటే. ఏమాత్రము జ్ఞాపకమున్నను సరె, చెప్పుఁము. ఏమి యానవాలు చెప్పినను సరె, సందర్భవశమున నాడినమాట యేదియైనను సరే, ఎందుకంటే దానిభర్తయొక్క సుఖము, బ్రతుకు, సమస్తము మీమాటలనే యాధారము చేసికొని యుండును."

"బిడ్డా! ఒకమాటయైన నాడలేదు. ఒక్క యానవాలైనఁ జెప్పలేదు. అందరివలెనే వచ్చినది. దేవతాదర్శనము చేసినది. కాని యెందుచేతనో తెగ యేడ్చినది. మరునాఁ డుదయమున వెళ్ళి పోయినది."

ఆయనవద్ద సెలవు పుచ్చుకొని కాళి దడదడగొట్టుకొను గుండెలతో భర్త యొక్క సన్నిధికి వచ్చి యర్చకుఁడు చెప్పిన స్వల్పవృత్తాంత మతని కెఱిగించెను. జగత్కిశోరరాయలు మిక్కిలి యాత్రముతోఁ బ్రతిదేవాలయముకడకుఁ బోయి ప్రతిపూజారిని, గంటి కగపడిన ప్రతిసేవకుని యేవో కొన్ని ప్రశ్నలడుగఁ జొచ్చెను. ఒక చక్కని చిన్నది వితంతువేషము వేసికొని యాదేవాలయములో నొకనాఁటిరాత్రి తలదాచుకొని మఱునాఁ డుదయమున నెక్కడికో యాత్ర వెళ్ళినదని వారందఱుఁ జెప్పిరి. వారిలో నొక సేవకురాలిట్లనియె. "పాప మా యిల్లాలిమగఁడు అప్పటికి స్వల్పకాలము క్రిందటనే పోయి యుండును. ఏమంటే, మొగముమీఁద కుంకుమబొట్టు పెట్టుకొన్న యానవాలు కనఁబడుచునేయున్నది."

"కాని యామెతోఁగలసి వెళ్ళినతైర్థికు లెవ్వరు? వర్ధమానమునుండి యెవ రైనవెళ్ళిరా?" యని జగత్కిశోరుఁ డడిగెను. ఆలయములోనే కాపుర ముండు నట్టి యొకపిల్లవాఁ డక్కడఁ జేరినగుంపులోనుండి యిట్లనియె. "లేదు. వారందఱు క్రొత్తవారే. గోవిందునితల్లిమాత్రము నే నెఱిఁగినది. ఆమెది గోయిపురము. ఆమెకూడఁ దీర్థయాత్ర వెళ్ళినది. ఆమె తిరిగి వచ్చినది."

కాళి దేవాలయము విడిచి పల్లకియెక్కి యింటికి వెళ్ళునప్పటి కర్ధరాత్ర మయ్యెను. కాని జగత్కిశోరరాయలుమాత్ర మింటికిరాలేదు. ఆతఁడు ధనంజయు నితోఁ గలసి గోయిపురగ్రామమునకు వెళ్ళెను. రాత్రి యంధకారమయమై యుండెను. కాలినడక కనుకూలములైన చేలగట్లు మిక్కిలి సన్నముగా నుండెను. పైగా వాటిమీఁద శీతకాలపు మంచు కురిసియుండుటచే నవి తడిసి యుండెను. మిక్కిలి యాత్రము గల యాబాటసారులమీఁద నక్షత్రములు గగనమునుండి మిణుకుమిణుకు మనుకాంతులతో స్వల్పతేజమును బ్రసరింపఁజేసెను.

తెల్లవారక ముందే వారాగ్రామముఁజేరి గోవిందునితల్లిని మేలుకొలిపిరి. ఆమె విశేషమేమియుఁ జెప్పలేదు. ఆచిన్నది తనప్రక్కను గూర్చుండి యెంతో యేడ్చినదనియు, తన దురవస్థ యేమో యెవరికిం జెప్పలేదనియు, నామె చెప్పి కన్నుల నీరు పెట్టుకొని యెట్టకేల కిట్లనియె. "అది యెంతో మంచిది. నాయనా! చిన్నపిల్ల. కాని దైవము తిన్నఁగాఁ జూడలేదు. అందుకని వితంతువైపోయినది. కాలినడకను, రైలుమీఁద మేమెన్నోరోజులు కలసి ప్రయాణముచేసి యెన్నో క్షేత్రములు చూచితిమి. కాషాయవస్త్రములు కట్టుకొన్న యోగినులగుంపులలో నామె తరచుగాఁ గలిసి యుండెడిది. వారివలెఁ దాను గూడ కాషాయవస్త్ర

ములు గట్టుకొని వారితో పోవలె నని కోరిక యున్నట్లు చెప్పుచు వచ్చినది. మేము మందలము బాటప్రక్కను గూర్చున్నప్పుడామె చెట్టుక్రింద వంట చేసికొన్నది. వంటనఁగా మఱేమియులేదు. ఏదో వట్టియన్నము గంజి. అప్పుడు నీ దురవస్థ యేమిటమ్మా యని నేనడిగితిని. అడిగినందుకేమైనఁ జెప్పినదా? ఏడ్చి యూరకుండినది. తన తల్లిదండ్రులు తాల్పుకారులో నున్నారనియు, అత్తవారి యూరుధనపుర మనియు మాత్రము చెప్పినది."

తాల్పుకారు ధనపురగ్రామములపేరులు వినఁగానే ప్రశ్నలు వేయువారి మనస్సులలో నాశాకిరణము మఱియొకటి బయలుదేఱెను. ఆతీర్థవాసిని నిశ్చయముగా సుమయేయని వారు నమ్మిరి.

"ఆమెను మీరు కడపారి యెక్కడఁజూచితిరి? ఆమెను మీరెక్కడ విడిచి వచ్చితిరి? చెప్పమ్మా చెప్పు. నీమాటలవల్ల మా కామెజాడ తెలిసినపక్షమున ధనపురమందలి కోట్లలోని ధనమంతయు మీకాళ్ళదగ్గఱకు వచ్చియుండును. భార్యావియోగముఁజెంది విలపించుచున్న భర్తయావజ్జీవము మీయెడలఁగృతజ్ఞుఁడై మిమ్ము దీవించుచుండును" అని ధనంజయుఁడు పలికెను.

"అయితే నాయనా! దానికి మగఁడున్నాఁడా? ఆపిల్ల వితంతువు కదా? అయ్యో! పాప మెంతదిక్కుమాలినదై పోయిన దయ్యా! దేశాలపాలై పోయినది. నే ననుకొన్నాను. దానికెంతో మొగమాటము, చేటు సిగ్గు. ఒకరితో మాటలాడ నిష్టము లేనిది. ఏదోమూల నొంటిగాఁ గూర్చుండుచు వచ్చినది. కుంకుమబొట్టు పెట్టిన యానవాలు మొగముమీఁద కనఁబడుచుండినది. కాని మే మెన్నోదినములు కలిసి ప్రయాణము చేసినను మగనిమాట యామెయెత్తనే లేదు."

అనవుడు ధనంజయుఁడు గుండెలు కొట్టుకొన నిట్లనియెను. "అమ్మా! అది యటుండనిచ్చి, ఆమెను మీ రెక్కడ విడిచిపెట్టితిరో, ఆమెను మీ రెక్కడ కడపటిసారి చూచితిరో ఆస్థలము చెప్పుడు?"

"మే మిద్దరము వేఱు కాలేదు. నే నామెను విడిచిపెట్ట లేదు. మే మందరము కలసియే తిరిగి వర్ధమానమునకు వచ్చితిమి. ఆమె నాతో కలసి మాయూరు వచ్చి మా యింటిప్రక్క నున్నకుటీరములోఁ దనవంట దానే చేసికొని కొన్ని దినము లుండినది. కాని జను లందఱు ఈమె యెవ రీమె యెవరని యెన్నోప్రశ్న లడుగఁజొచ్చిరి. ఆ బాధపడలేక రెండుదినములక్రిందటనే యీయూరు విడిచి

పెట్టి గయ వెళ్లుచున్న యాఁడువాండ్రతో గలసి వెళ్ళిపోయినది. కాషాయవస్త్రములు ధరించి యోగినులలోఁ గలసిపోదు నని చెప్పినది.”

అప్పుడు ధనంజయుఁ డిట్లనియె. “మిత్రుఁడా! నాపని యైపోయినది. ఇఁక మీఁద నేను నాభార్యాసమాచార మడుగుటతో నే కాలము పుచ్చెదను. ఈజీవితములో నాకు మఱియొకపనిలేదు. ఇల్లు వాకిలి విడిచినదేశద్రిమ్మరిని నన్ను నీభార్య దయతో నాదరించినది. సజ్జనులయాదరణమునకు, సహాయమునకు, నేను తగనివాఁడ నైనను మీరు నన్నాదరించి సహాయముచేసితిరి; నాహృదయముమీఁదనుండి గొప్ప భారము దిగినది. మహాదోషకళంకము నాయాత్మమీఁదనుండి తుడిచి వేయఁబడినది. నాభార్య యిప్పటికిని జీవించి యున్నదని నే నిప్పుడు తెలిసికొంటిని గనుక నా కిప్పు డెంతో బలము వచ్చినది. ఆమె నాకగపడువఱకు నే నీవిధముగా వెదకికొనుచు వెళ్ళెదను. లేదా, యీ యన్వేషణములో నశించి పోయెదను.”

వర్ధమానపట్టణమునుండి బంకిపురమున కొకరాత్రి ప్రయాణము. బంకిపురమునుండి ప్రత్యేకముగా నొకశాఖామార్గ మున్నది. ఆమార్గముమీఁద రైలు బండియెక్కిన పక్షమున గయాక్షేత్రమునకుఁ బో వచ్చును. ఆనగరమునిండ దేవాలయము లున్నవి. తైర్థికు లైనహిందువులు గుంపులుగుంపులుగఁ బ్రతిదిన మిక్కడకు వచ్చి చచ్చిపోయిన పితృపితామహాదులకు, బంధువులకు పిండములు వేయుదురు. గయలో నున్నఫల్గునదిమీఁద స్నానఘట్టములు కట్టబడి యున్నవి. అక్కడ నుదయాస్తమయములు మాతాపితృభక్తు లగుపుత్రులు, దుఃఖార్తు లైనబంధువులు, మృతినొందినవారియాత్మలకు శాంతి గలుగజేయుటకు శ్రాద్ధకర్మములు చేయుచుందురు. మృతినొందినవారిమీఁద హిందువుల కున్నంతభక్తియు, గౌరవము మఱి యేజాతివారికి లేదు. గయాక్షేత్రమునఁ జేయుశ్రాద్ధకర్మములకంటె పితృదేవతాకము లైనపుణ్యకార్యములు వేఱు లేవు.

ఆపట్టణమునకుఁ దైర్థికులు ప్రతిదినము తండోపతండములుగా వచ్చి యొకనాఁడో, యొకపూటయో యచ్చట విడిసి, తాము వచ్చి పోయినట్లు రవంత యైన గుర్తునిలుపక వెడలిపోవు చుందురు. అట్టినగరములో దనపే రెవ్వరికి జెప్పక ప్రచ్ఛన్నముగా వచ్చి ప్రచ్ఛన్నముగా వెళ్ళిపోయినయొకానొకయాఁడుదాని సమాచారము తెలిసికొనుట యసాధ్యము కదా! ఐనను ధనంజయుఁడు ధైర్యము విడువలేదు. భార్యాన్వేషణమే యతనిజీవితముయొక్క పరమార్ధము అపరాధమునకు దగినప్రాయశ్చిత్తము జేసికొనుటయే యతనిసంకల్పము.

ఎండలో మిక్కిలియుడుకబోయు చున్నమధ్యాహ్నకాలమున ధనంజయుడు గయలో దుమ్ము రేగుచున్న వీధులవెంబడి దిరుగ జొచ్చెను. అతడు ప్రతిదుకాణము దగ్గఱ భోగట్టా జేసెను. రాతిచిప్పలకు రాతిపళ్ళెములకు గయ ప్రసిద్ధి. తన భార్యనుగుఱించి యత డావర్తకుల నెన్నో ప్రశ్నలు వేసెను. దేవాలయము ప్రక్కను సందుగొందులలో నిత్తడివిగ్రహముల నమ్మెడుస్త్రీలను బురుషులను విసుగు లేక సమాచారమడిగెను. వీధిమూలలయం దతడు కొంచెముసేపు నిలువబడి దేవాలయములలోనుండి వచ్చెడిమనుష్యులగుంపులను పరిశీలించి చూచెను. పూజారులను, బాటసారులను, ప్రశ్నలు వేయుచు నేటిగట్టుమీద నెన్నోసారులు తిరిగెను.

సాయంకాలము గడచి రాత్రి ప్రారంభమయ్యెను. కాని యన్వేషణము ముగియ లేదు. బాటప్రక్కన నొకయంగడిలో నత డటుకులు కొని తిని ఫల్గునదిజలము కొంచెము త్రావి శ్రమ దరి(క్రొ...ను మెట్లమీద గొంతసేపు కూర్చుండెను. దేవాలయఘంటానాదము సాయంకాలసేవాసమయ మైనదని ఘోషించెను. సాయంసమయమందమారుతములు నదిమీదనుండి వచ్చి చల్లగా వీచెను. ధనంజయుడు తిరిగితిరిగి యున్నందున కాళ్ళు నొప్పలుపట్టి యలసిసొలసి దుఃఖభారమున గుండి రాతిస్థంబమునకు జేరబడి నిద్రపోయెను.

అది చీఁకటిరాత్రి; ఆస్థల మప్పటికి నిర్మానుష్య మయ్యెను. క్రమక్రమముగా దేవాలయమునందును బజారునందును ధ్వని మందగించెను. చల్లగాలి యంతకంతకు జలిగాలిగా మాఱెను. అట్టిసమయమున నెవరోవచ్చి కడుడస్సినయాబాటసారిని జేతితో మెల్లగ స్పృశించిరి. ఆస్పర్శ యతనిని మేలుకొలిపెను. అతఁడు కన్నులుదెఱచి తనయెదుట మెట్లమీఁద నిలిచియున్నయొక ముసలిబ్రాహ్మణుని జూచెను. ఆబ్రాహ్మణుఁడతని కిట్లనియె.

“నాయనా! నీవెవ్వరు? తైర్థికు లందఱు బసలకు వెళ్ళి పండుకొనిరి. ఈయర్ధరాత్రమువేళ నీ విక్కడ నొంటిగా నెందు కున్నావు?”

“తండ్రీ! నేను వర్ధమానమునుండి వచ్చుచున్నాను. రెండుదినములక్రిందట నిక్కడికి నొకబాటసారులగుంపు వచ్చినది. ఆగుంపును వెదకికొనుచు వచ్చినాను. ఆగుంపుతో నొకచిన్నది వచ్చినది. ఆమెను దీసికొని పోవలె నని భర్త కోరుచున్నాఁడు”

"ఆగుంపులో నున్న మనుష్యులపేళ్ళెఱుఁగుదునా?"

'అహా! తెలియును.'

"ఐతే నీవు కష్టపడి వెదకికొననక్కఱ లేదు. నాతో రా?"

ఆబ్రాహ్మణుఁ డతనిని దేవాలయమునకుఁ దీసికొనిపోయెను. వందలకొలఁది పండాలు దేవాలయావరణములోఁ గాపుర ముండిరి. ఆయన్వేషణము గురించియు, వెదకి తెచ్చినవారికి వచ్చుగొప్పబహుమానముల గురించియు విని వారందఱు గుంపుగూడిరి. ఆ పేర్లు కనుగొనుటకై పండా లందఱు తమతమపుస్తకముల కట్టలు తిరుగవేసిరి. గయలో నడుగుపెట్టినతీర్థికు లందఱిపేళ్ళు చిత్రగుప్తునిలెక్క వంటియాపండాబ్రాహ్మణుల పుస్తకములలో నెక్కి తీరును.

"కనఁబడినది. కనఁబడినది. అది యైదుగురుమనుష్యులతండా; తల్లి, తండ్రి పెండ్లి యైనకుమార్తెలిద్దరు, వారితో నొకవితంతువులిద్దరు వచ్చిరి." అని యొక పండా చెప్పెను.

"ఆవితంతువు పే రేమి?" యని ధనంజయుఁ డాత్రముతో నడిగెను.

"అది నాపుస్తకములో లేదు. ఆబిడపేరు లేమియుం జెప్ప లేదు. తొల్ప కారులో జన్మించిన దఁట. ధనపుర మత్తవా రఁట."

'ధనపురమా యేమిటి మీయభిప్రాయము?'

"ఐ యుండ వచ్చును. వ్రాత సరిగా లేదు. అలుకుకొని పోయినది."

"ఆతండా యిప్పు డెక్కడున్నది?"

'ఇప్పటివఱకు గయలోనే యున్నా రని నే దలంచెదను. నేను వారిని వెంటఁ బెట్టుకొని దేవాలయము లన్నియుఁ జూపితిని. సాయంకాలమునందు వారు చేయవలసిన దానములు జేసి, తాము బసదిగినయంగడిలో నిద్రింపఁబోయిరి.'

'ఆయంగడి యెక్కడ?'

"అది మిఠాయి గోపాలునియంగడి."

"అయ్యా! త్వరపడు. త్వరపడు. ఆతండా యిప్పటికి నచ్చట యుండెనా నీకు మంచిబహుమానము దొరకును."

ఆయర్ధరాత్రము మిఠాయిగోపాలుఁడు గాఢనిద్రనుండి మేలుకొల్పఁబడి కన్నులు నలుపుకొనుచు, "ఇదేమిటయ్యా! అర్ధరాత్రమువేళ, నిద్రపోవు చున్న మర్యాదస్థు లైన పేదసంసారులను లేవఁగొట్టి తీసికొని వచ్చు చున్నా రేమి? మీరు పోలీసువారా యేమిటి? కూనీ యే దైన జరిగినదా యేమిటి పట్టణములో?' వని సణుగుకొనుచు వచ్చెను.

తళతళ లాడు చున్న తెల్లనిరూపాయయొకటి తక్షణము వానిచేతిలోఁ బడెను. అది సణుగులను గొణుగులను నిమిషములో నంత మొందించెను.

"ఈరాత్రి నీయంగడిలో నిద్రపోవు చున్నతండామనుష్యులతో నేను కొంచెము మాటలాడవలసి యున్నది. నిన్నింతోసేపు మేలుకో బెట్టను." అని ధనంజయుఁ డతనితోఁ బలికెను.

"అది యేతండా?"

"ఎఱుఁగవా. ఒక మగవాఁడు, నలుగు రాఁడువాండ్రు గలసి వచ్చినతండా. వారు వర్ధమానమునుండి వచ్చిరి. వారిక్కడ రెండుదినములనుండి యున్నారు."

"అయ్యో! వారు సాయంకాలము భోజనము కాఁగానే వెళ్ళిపోయిరి. ఒక జామైనది బయలుదేఱిరి."

"ఐతే వా రెక్కడికి వెళ్ళినారయ్యా?"

"అది నే జెప్పలేనండి! నే నేమి పోవీసువాఁడనా. పెద్దమనుష్యులు బోవు చున్నప్పుడు మీ రెక్కడికి వెళ్ళు చున్నారని యడుగుటకు" అని వారందఱక్కడ నుండఁగానే గోపాలుడు తడకలు దింపి యంగడి మూసివేసి లోపలికిఁ బోయెను.

"ఒక్కనిముస మాగవోయి. నీయంగడి విడిచి వారేలాగున బోయిరి" యని ధనంజయుఁ డడిగెను.

"హరనాముని యెద్దుబండి యద్దెకుఁ గుదుర్చుకొని పోయిరి. ఆఁడువాండ్రు నలుగురు బండెక్కిరి. మగవాఁడు వెనుక నడచుచు పోయెను" అని యతఁడు లోపలనుండి చెప్పి యతఁడు పండుకొనెను. చులకనగా చేతిలో బిళ్లకుడుమువలె రూపాయి పండినందున సంతోషముగా నిద్రపట్టెను.

"అయ్యా! మేము చేయవలసిన దింతకన్న నే మున్నది? ఈపాటికి వ్యర్థమైన ప్రయత్నములు మాని యింటికి వెళ్లండి. తప్పుదారి త్రొక్కిన యాయిల్లాలు తిరిగి తిరిగి విసికి వేసారి బుద్ధితెచ్చుకొని మరల మగనికడకుఁ దానే పోవును. దేశ దిమ్మరియైనయాఁడదానిని, గాలిని, పట్టుకొని యెవఁడు బంధింపఁ గలఁడు?" యని యాపండాపలికెను.

"అయ్యా! నీవనవసర మైనమాట లాడకు. మనపని యింకను ముగియ లేదు. ఆబండివానియిల్లు కనుగొందము" అని ధనంజయుఁడు కొంచెము విసిగికొని పలికెను.

తిరిగితిరిగి వారు బండివానియిల్లు దెలిసికొనిరి. చప్పట్లు గట్టిగా కొట్టగా కొట్టగా, తలుపులుతట్టగాతట్టగా, పాపము! బండివానిభార్య మేల్కొనెను. మేలుకొని తన మగఁడు పన్ను లియ్యనందున వానిని బట్టుకొని తీసికొని పోవుట కై వచ్చిన సర్కారుబంట్రోతులు వచ్చియుండి రనుకొని భయముతో గడగడవడఁకుచు నామె తలుపులు తెఱచెను. తెఱచి యేడ్చుచు "బాబయ్యా! ఆయన యింట్లో లే డండి" యని బదులుచెప్పెను.

"నీమగఁడు మనుష్యుల నెక్కించికొని యేదో యూరికి రాత్రి బండి తోలుకొని పోయినాఁడు కాదూ?" యని ధనంజయుఁ డడిగెను.

"వెళ్ళినాఁడు బాబూ! కాని, సరకారువారిపన్ను లెగవేయఁడండి. పెద్దమనిషి బాబయ్యా!" యని వడఁకుచున్న యాపడఁతి ప్రత్యుత్తర మిచ్చెను.

"అమ్మా సర్కారుపన్నులకోసము రాలేదు మేము. ఒకయాఁడది తప్పిపోయినది. ఆమెను వెదకికొనుచు వచ్చినాను."

"అయ్యో దేముఁడా! నాపెనిమిటిపని యేమవుతుందో కదా; బాబూ యెవరి భార్యను? యెవరి కూఁతురిని? మామగమనిషి యెఱిఁగిఉండి దాచఁడండి బాబయ్యా. నేరక చేసినాఁడండి బాబయ్యా! ఆలాటి ఆఁడమనిషిని నాకొంపలోనికి జేరనియ్యనండి బాబయ్యా. మేము పేదవాళ్ళమే కాని బాబయ్యా, పరువుగలవాళ్ళము. సీమరాణిగారి అనుగ్రహమువల్ల బ్రదుకుచున్నాము బాబయ్యా!"

"అది మే మెఱుఁగుదుమమ్మా. నీపెనిమిటిమీఁద మేము నేర మేదియూ మోపలేదు. ఆతప్పిపోయినయాఁడదాని పెనిమిటి ఆబిడ్డ యేలాగున వెళ్ళినదో తెలిసికొని రమ్మని మనుష్యులను బంపినాఁడు. అందుకోసము హరనాథునిబండి యే వైపువెళ్ళినదో, యేయూరు వెళ్ళినదో యని తెలిసికొన వచ్చినాము" అని ధనంజయుఁడు వలికి యామెచేతిలో నొకరూపాయ పెట్టెను.

ఆమె ధైర్యము తెచ్చుకొని యిట్లనియె. 'అది నేఁ జెప్ప లేను బాబయ్యా! మామగనుసిషి తీసికొనిపోయినమనుష్యుల నైనా నేను చూడ లేదు. ఈరాత్రి యొనిమిదిగంటలకు బండి గోపాలునిదుకాణముదగ్గఱకు తీసికొని వెళ్ళినాఁడు. బాటసారు లక్కడనే బండెక్కినారు.'

'అతఁడు తిరిగి యెప్పుడు వచ్చును? ఎంతదూరము వెళ్ళుచున్నాఁడో యెప్పుడు తిరిగివచ్చునో నీతో జెప్పకపోవునా' యని ఘండాబ్రాహ్మణుఁ డడిగెను.

‘రేపు పొద్దు నెత్తిమీఁదికి వచ్చేటప్పటికి కూఁడు తయారుగానుంచమన్నాఁడండి బాబయ్యా. మద్దినాలకు బుద్దగయనుండి రాఁగల నని చెప్పినాఁడు.’

అనవుఁడు ధనంజయుఁడు మహోత్సాహముతో దాపున నున్న పండాబ్రాహ్మణుని జేయిబట్టి బుద్ధగయకు వెళ్ళుబాటవైపునకు లాగి యిట్లనియె. ‘చాలు; బుద్ధగయ యిక్కడికి కొంతో దూరము లేదు. బండి జాముక్రిందటనే బయలుదేఱినది. పండాజీ ధైర్యము తెచ్చుకో! మనము తెల్లవారకముందే బుద్ధగయఁ జేరఁగలము. త్వరగా నడిచితిమా త్రోవలోనే బండిని కలసికొనఁ గలము.’

అని పలుక నాపండాబ్రాహ్మణుఁడు తనపడినశ్రమకు గొప్పబహుమానము లాగివేయ వచ్చునని దృఢముగా నమ్మి ‘అలాగే చేయవచ్చును లెండి’ యని బదులుచెప్పి తనలో ‘భర్తను విడిచి పెట్టి మఱికొందరుభార్యలీ లాగున లేచివచ్చి మాపాలఁ బడినపక్షమున మారొట్టె నేతిలోఁ బడును గదా’ యనుకొనెను.

గయాబ్రాహ్మణు లందఱివలెనే యాపండాకూడ దృఢదీర్ఘకాయుఁడు. ధనంజయుఁడు దేహబల మంతగా లేకపోయినను నీవిషయమున గట్టిమనోనిశ్చయము కలిగి యున్నవాఁడు. ఆచీఁకటిరాత్రి మైలుతరువాత మైలు వారువిసవిసనడిచిరి. అప్పుడప్పుడు నేల నిమ్నోన్నతముగా నున్నచోట్ల నడుగుజారిపడుచుండిరి. ఒకరితో నొకరుతరచుగా మాటాడుట లేదు. ఒకటిరెం డెద్దుబండ్లు తమ కెదురుగా వచ్చినప్పుడు హరనామునిబండినిగూర్చి వా రడిగిరి. కాని, వారిప్రశ్నలకుఁ దగినయుత్తరములు రా లేదు. దారినిఁ బోవుప్రతిమగవానిని, ప్రతియాఁడదానిని వారు ప్రశ్నలు వేయఁజొచ్చిరి. కాని యావర్ధమానపుతండాసంగతి తెలియ లేదు.

అలసిసొలసి బాటసారులు బుద్ధగయఁ జేరునప్పటికి నుదయకాలసంధ్యారాగ మగ్నిజ్వాలవలెఁ బ్రదీప్తమై పొడుపుకొండ నలంకరించెను. తైర్థికులబండ్లు నిలిచెడుచోటు, బండియెద్దులకు మేతపెట్టుచోటు కనుగొనుటకు వా రంతగా శ్రమపడ లేదు. కొంతభోగట్ట చేసినతరువాత బండిమనుష్యుఁడైనహరనాముని వారు కనుగొనిరి. అతఁడు రాత్రియంతయుఁ బయనము చేసి చల్లగాలిలో నుండుటచే నప్పుడు చుట్టగాల్చుచు హాయిగాఁ జలిమంట కాగుచుండెను.

అతనిని జూచి పండా యిట్లనియె. ‘ఓయీహరిసామ్! గయనుండి బుద్ధగయకురాత్రి యకాయకీని బండి గట్టుకొని వచ్చినందుకు మంచికిరాయి దొరికినది కాఁబోలు.’

"పండాజీ! లేదు. లేదు. తీర్థవాసులు పూర్వమిచ్చినట్లిప్పుడు దబ్బిచ్చుటలేదు. అదిగాక మునుపటియంతమందిగూడ వచ్చుట లేదు. ఇంతకు మాబండివాండ్ర గ్రహచారమది. మాతండ్రితాతలు బండితోలి బ్రతికినారు గదా యని మేమును విడువలేక తోలుచున్నాము. లాభములు లేవు. నేనేమాత్రమో మీకు బాకీయున్నాను. జ్ఞాపకమున్నది. వడ్డితోగూడ సంవత్సరములోపుగా మీకిచ్చివేయక మానను. కాని యీరోజున నాసంపాదన కొంచెమే. ఇది మీకిచ్చినపక్షమున నాపెండ్లము బిడ్డలు పస్తుపడవలసినదే."

'నీపెండ్లము మంచిది. పస్తుండ లేదు. ఈమధ్యాహ్నము నీవు వెళ్ళునప్పటికి మంచికూరవండి నీకన్నము సిద్ధముగా నుండును. నాకియ్యవలసినబాకీ వసూలుచేసికొనుటకు నేనిక్కడకు రాలేదు. ఈతీర్థవాసుఁడు మిక్కిలిదయగలవాఁడు. ఈయన నీకేదోబహుమాన మియ్యఁదలఁచుకొన్నాఁడు. అది నీకిప్పించుటకు వచ్చితిని. ఈరూపాయపెట్టి నీభార్యకు మంచికోక కొని తీసికొనిపో. నీవు రాత్రి తీసికొనివచ్చినమనుష్యులెక్కడ నున్నారో చెప్పు' బండివాఁడు కన్నులు మిక్కిలి యాత్రముతోను సంతోషముతోను మెఱయ నిట్లనియె. "పండాజీ! భగవంతుఁడు మీకు మేలుచేయవలె. నాపెండ్లము బిడ్డలు మీపాదములకు మ్రొక్కుచుందురు. నాయనా! ఇప్పుడే కాదు; మీరు మాకెన్నోసారులు దయగలిగి యుపకారము చేసితిరి. కాని నేను తీసికొనివచ్చినమనుష్యులెవరో నేను బాగుగా నెఱుఁగను. బండిలో నలుగురాఁడువాండ్రు కూర్చుండిరి. ఒకమగవాఁడు వెనుక నడచివచ్చెను."

"సరే! అదియంతయు మే మెఱుఁగుదుము. మీతండా యేస్థలమునుండి వచ్చినదో చెప్పు? ఆయాఁడువాండ్రేలాగున నున్నారో చెప్పు."

"బంగాళాదేశములో గొప్పయింటియాఁడువాండ్రవలెనే వారు దుస్తులు ధరించినారు. అందులో నొకాబిడ పెద్దది. ఆమె కిద్దరుకూఁతుఁ లున్నారు. వారు పెండ్లిలేనివారే. వారుకట్టినబట్టలనుబట్టి నేను పెండ్లయిన దనుకొన్నాను. నాలుగవయాబిడ కొంచెముదూరముగాఁ గూర్చున్నది. ఆమెచేతులకు కాళ్లకు నగలు లేవు. పండాజీ! ఈతీర్థముల కెంతమందో చిన్న వితంతువులు వచ్చుచుందురు."

"వారిక్కడికి వచ్చి యెంతసేపైనది. ఎక్కడికి వెళ్ళియుందురు? నీబండిలో వారు తిరిగి గయకు వెళ్ళుదురా,"

'లేదు పండాజీ! నాకిరాయి యిచ్చి నన్ను పంపివేసినారు. అయితే వారిక్కడ ఒకరోజు రెండురోజులో ఆగుదురని నేననుకొనుచున్నాను. మేము వచ్చియొకగంటయైనది. బుద్ధగయ పెద్దగ్రామము కాదు. వెతికితిరా మీకు వారు తప్పక కనబడుదురు. దాటిపోవుటకు వీలులేదు.'

అప్పుడు ధనంజయుఁ డిట్లనియెను. ‘‘పండాజీ! నీవు చేయవలసినపని సమాప్తమైనది. రాత్రి మీరుచేసినసహాయమున కివిగో యీరూపాయలు తీసుకొనుడు! తక్కినపనినాకు వదలివేయండి! ఇంతవఱకు సాయము చేసినభగవంతుఁడు ముందు గూడ నాకుసాయము చేయక పోఁడు!’’

పండాబ్రాహ్మణుఁడు హరనామునిబండియెక్కి గయకుఁబోయెను. ధనంజయుఁడు తనయన్వేషణము సాగించెను. తూర్పున రేఖలు తోఁచినది మొదలు సూర్యోదయమువఱకు తైర్థికులుమూగునట్టి ప్రతియంగడియందుఁ బ్రతిస్థలమునందు నతఁడు భోగట్టా చేసెను. అట్లు చేసిచేసి యెట్టకేల కతఁడు వర్ధమానపుతండాను గనుగొనెను. అతఁడామెను జూడగానే యతని హృదయ మాశాబద్ధమై దడదడ కొట్టుకొనెను. ఆతండాలో మగవానిం జూచి యతడిట్లు పలుకరించెను.

'అయ్యా! మీరు వర్ధమానపుపురవాసులఁట! మీకునమస్కారము. నేనుగూడ వర్ధమానపువాడనే. మీరీయాడవాండ్ర నీపుణ్యక్షేత్రమునకు యాత్రనిమిత్తము తీసికొనివచ్చితిరి గాఁబోలు. పరమేశ్వరుఁడు వారిహృదయములకుమిక్కిలిప్రియములైన కోరికలను బ్రసాదించుఁ గాత! కాని మీపండా మీతో మఱియొకచిన్నదివచ్చినదని చెప్పినాఁడు. ఆమె నా కిక్కడ కనఁబడదేమి? ఆమె యెక్కడికి వెళ్ళియుండును?'

ఆమాటలు విని యతఁడిట్లనియె——‘‘మహాప్రభూ! నమస్కారము. నాచత్వారపు కన్నులతో నేను సరిగాఁ జూచుచున్నానో లేదో కాని, మీరు మా ధనపూరు జమీందారుగా రని తోఁచుచున్నది. మీగ్రామములలోనే మాకాపురము. నా పూర్వపుణ్యమువల్ల నేను మి మ్మీరోజునఁ గలిసికోఁగలిగితిని. ధనపురముజమీందారుగారికి వంగి నమస్కారము చెయ్యండే!’’ అని భార్యతోను బిడ్డలతోను చెప్పెను.

ఆస్త్రీ లట్టు వంగి నమస్కరించిరి. భార్య భర్తతో నేమో గుసగుసలాడెను. అనంతర మతఁడు గట్టిగా నిట్లు పలికెను. ‘‘ఏలినవారిభార్య కలకత్తాలో మృతి

కోడలినట్లు భూయాబిడ చాల విచారించుచున్నానని మనవిచేయుచున్నది. ఫలిత కారణ తీరిగి సుఖముగా వివాహము చేసికొని కొడుకులను గని మనుమలనెత్తి చిరకాలము జీవింపవలె నని భగవంతుని వేడుచున్నది. మీకొడుకులు, మనుమలు మీవంటిమంచివారై సంస్థానము నిలుపవలె నని గూడ కోరుచున్నది.'' నాపుకు ధనంజయుఁడు ''దిక్కుమాలిన కోరికలు. నీకోరికలు తగలఁబెట్ట'' యని తనలో ననుకొని పైకి మృదువుగా నిట్లనియె.—

'అమ్మగారికి నానమస్కారములు చెప్పండి! అటువంటిమంచికోరికలు గావిషయమై యామె కోరినందుకు మిక్కిలి సంతోషించుచున్నాను. కాని మీతో వచ్చిన యాచిన్నదానిని గురించి మీ కేమి తెలియునో చెప్పండి.'

అన నతఁడు పడుచుజమీందారునివంక ననుమానముతో నెగాదిగఁ జూచెను. ఎందుచేత నన, మునుపు కలకత్తాలో ధనపురపుజమీందారు చేసినచేష్టలుకొన్ని యతఁడు వినెను. అందుచేత యాత్రనిమిత్తము గయకుఁ బాఱిపోయివచ్చిన చిన్నదానినిగురించి యాజమీందారు భోగట్ట చేయుట యతని కంతయిష్టముగా లేక పోయెను. కాఁబట్టి యతఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

'అయ్యా! ఆమెనుగురించి నేను విశేషముగఁ జెప్ప లేను. ఆమె బాలవితంతువు. తీర్థయాత్ర చేయుటకై మాతండాలోఁ జేరినది. అందుకని మేము మాతో దీసికొని వచ్చినాము. ఆమె దురుద్దేశములతో వచ్చెనా? పాలించుటకు భగవంతుఁ డేయున్నాఁడు. మే మొకరిజోలికి సొంటికిరానిగృహస్థులము. అటువంటివాండ్రతోఁ బ్రయాణముచేయుట కిష్టపడము. ఆమె మమ్మిప్పు డెందుకు విడిచిపెట్టినదో, యెక్కడికి వెళ్ళినదో కనుగొనవలసినంతయవసరము మాకు లేదు.'

ధనంజయుఁడు మహాశాభంగముచేతను, కోపముచేతను నావిష్టుఁడై పెదవి కఱచుకొనెను. అతనితల తిరిగెను. గుండెలు నీరై పోయెను. అతఁడాతండాను విడిచి సుప్రసిద్ధ మైనబుద్ధగయదేవాలయమునకు నెమ్మదిగ నడచి వెళ్ళి యేమియు దోఁచక దస్సిపోయి మెట్లమీఁదఁ గూర్చుండెను.

అప్పు డొక గ్రామస్థునికూతుఁరు దాపున నున్న పశువులసాలనుండి పాలు తీసికొని తనయింటి కాదారిని వెళ్ళుచుండెను. పాలిపోయి మనోవేదనావివశుఁడైనయా చిన్నవానిమీఁదఁ దానికన్నులు పడెను. అది యక్కడ నిలిచి తలమీదికి మేలిముసుగు లాగుకొనెను. స్త్రీజనమునకు సహజ మైనజాలి యప్పుడా మెహృద

యమున నంకురించెను. అతనిసుందరముఖారవిందముమీఁద విషాదచిహ్నములనామె కనిపెట్టెను. అతడు దీర్ఘప్రయాణమున బడలినాడనియు చేరాస కలిగి యున్నవాడనియు నామె కనిపెట్టి యతనితో నిట్లనియెను. ,,అయ్యా! నేను బ్రాహ్మణుల పిల్లను. నా చెంబుతో మీరు త్రాగవచ్చును.”అని యతనిప్రక్కను గూర్చుండి పాల చెంబు దక్షిణమార్గమునినోటికడ బెట్టెను, అత డాపాలు త్రాగి మెట్లమీఁదనే నిద్రపోయెను,

---

ముప్పదవప్రకరణము.

తపస్విని.

హిందూదేశమునందలి నానాపుణ్యక్షేత్రములలో బుద్ధగ యవంటిపరమ పావనస్మారకచిహ్నములు కలది మఱియొకటి లేదు. క్రీస్తునకుముందు రమారమి రైయిదువందల సంవత్సరములక్రిందట భూమిమీఁదఁ జిఱకాలము తిరిగితిరిగి వేసారి నయొకబాటసారి, యిప్పుడు ధనంజయుఁడు వివశుఁడై పండుకొనినచోటనే కూర్చుండి పాపకర్మరులై సద్గతిభ్రష్టు లగు చున్నమనుష్యులదుర్గతినిఁగూర్చి విచారించి వారికి మోక్షప్రాప్తి గల్గునుపాయ మెద్దియని వితర్కించి మనోవేదన నొందు చుండెను. ఆబాటసారి గౌతమబుద్ధుఁడు. అతఁడు బోధించినమతము బౌద్ధమతము. ఆమత మీకాలమునఁ బ్రపంచములోఁ గలమానవజాతిలో నాలవ వంతుజనముచేత ననుసరింపఁబడు చున్నది. పాపరహితమైన పరిశుద్ధజీవనము సర్వభూతదయ, మనలఁగొట్టి బాధించువారియెడ క్షమ, మనలంద్వేషించువారియెడ గాఢ ప్రేమ మొదలగునుత్కృష్టధర్మముల నామహాత్ముఁడు హిందువులకు, హిందువులకే గాదు తోడిమానవులకు బోధించెను. ఆధర్మములను హిందూదేశమందలి పేదలు సాదలు విని యవలంబించిరి. అవి చీనాదేశమునను, జపాన్ దేశమునను బర్మాదేశమునను, సింహళద్వీపమందును గలజనులచేత నంగీకరింపఁబడినవి. భరతఖండమున కనతిదూరమున నున్నతార్తారుదేశమును, సైబీరియాదేశము మున్నగుచోట్లఁగూడ వ్యాపించెను.

హిందూదేశచక్రవర్తులలో నగ్రగణ్యుఁడని చెప్పదగినయశోకుఁడు క్రీస్తుశకమునకు ముందు మూఁడువందలసంవత్సరములక్రిందట బౌద్ధమత మవలంబించి యామతధర్మములను బోధించుటకు మహనీయు లగుబోధకులను ఆనాఁటివారికిఁ దెలిసినప్రపంచముయొక్క కొట్టకొనలకు పంపెను. ఈబౌద్ధమతబోధకులు నేర్పుతో నుత్కలదేశవాసులకు క్రొత్తమతమం దభినివేశము గలిగించిరి. ఈజిప్టు, సిరియా, మాసిడాన్, సైరిని, ఈపిరస్ ననియెడు నైదుపశ్చిమరాజ్యములలో బౌద్ధమతబోధనము విపులముగాఁ జేసిరి. ఏసుక్రీస్తు పుట్టినప్పు డతనిజన్మస్థాన మగుపాలస్టైన్ దేశములో భూతదయాక్షమ మొదలగునుత్తమధర్మములను జనులకు బోధించుచు బౌద్ధసంఘములు నివసించుచుండెను.

మహాత్ముఁడైనయశోకచక్రవర్తి గతించినతరువాత ననేక సంవత్సరశతములు చెల్లినపిదప దేశాభిమానపూరితుఁడైనమహాత్ముఁడు హిందువుఁడెవఁడో మున్ను మహానుభావుఁ డగుగౌతమబుద్ధుఁడు సర్వభూతదయాత్మక మైనమతము మనంబునఁదొలుతొల్త భావించినస్థాన మాచంద్రతారార్కసంస్థాయిగా నుండునట్లు జగత్ప్రసిద్ధ మైనయాదేవాలయమును గట్టించెను. ఆగొప్పదేవాలయము పూజానమస్కారములు లేక కాలవశమున శైథిల్యముపాలయ్యెను. ఈకథాకాలమునకుఁ గొంచెముపూర్వము బ్రిటిషుగవర్న్మెంటువారు దయాదరప్రేరితులై భరతఖండముయొక్క ప్రాచీనౌన్నత్యమునందుఁ గలగౌరవముచేత గుడి మరమ్మతు చేయించి మంచిస్థితియం దుంచిరి. ఆదేవాలయపుమెట్లమీఁదనే పాపము! ధనంజయుఁడు నిద్రించి హృదయవేదన మఱచెను.

ఉదయకాలప్రభాకరుఁడు దేవాలయముయొక్క యున్నతశిఖరమును దన యరుణతేజముచే మెఱయఁజేసి నలుదెసలఁ గాంతులు వెదజల్లెను. బౌద్ధమతసంబంధము లగువిగ్రహములు బొమ్మలు నానాఁట దొరకినప్పుడెల్ల దెచ్చి దేవాలయసమీపమున నొకచోట జాగ్రత్త పెట్టిరి. సింహళద్వీపమునుండియు బర్మాదేశమునుండియు బుద్ధగయాక్షేత్రమును సందర్శింప వచ్చినబౌద్ధతైర్థికులను గాషాయవస్త్రములను దాల్చిన శ్రమణుఁడొకఁడు దివ్యస్థలములకుఁ దీసికొనిపోయి దర్శనీయములను చూపుచుండెను. హిందూమతస్థు లగుతీర్థవాసులు గూడ నిందందుఁ దిరిగి చెట్లక్రిందవండుకొనుటకై నిప్పులురాజవేసిరి. కొందఱువర్తకులు తమకొట్లు తెఱచి సరకులు వెలుపలికిఁ దీసిరి. తీర్థవాసులకు మిక్కిలిప్రియము లగుబొమ్మలు మొదలగు చిత్రవస్తువులను గొందఱు విక్రయింపఁదొడఁగిరి. దట్టము లగుచెట్లతో, గడ్డియుం

డ్లతో, భవంతులతో నిండిన చిన్నగ్రామము బుద్ధగయ, దేవాలయమును జుట్టి యుండెను.

గుడిమెట్లమీఁద నిద్రించుచున్న ధనంజయుని ప్రక్క నొకయంగన కూర్చుండెను. కాషాయవస్త్రములు ధరించినను నాయువతి బౌద్ధశ్రమణి కాదు. ఆమె హిందూమతస్థురాలు. సన్న్యాసిని యై యుండవలె లేక తపస్విని యై యుండవలె, ఆమె తలవెండ్రుకల నెల్ల రుద్రాక్షమాలతోఁ గట్టుకొనియెను. ఆరుద్రాక్షమాలలో గొంత భాగము మెడ మీఁదను భుజములమీఁదను వ్రేలాడుచు నామెను మేలిముసుఁగయ్యెను. ఆమె శరీరము నిండు నట్లు మెయ్యి కప్పునంతగ పొడవుగ నొకకాషాయవస్త్రము నడుమునకు గట్టుకొనియెను. సన్న్యాసులు ధరించుదండ మామె చేతిలో నుండెను. పాదములకు నగలు లేవు. అలసి మేనుమఱచి నిదురించుచున్న యా బాటసారివంక నామె యొన్నోసారులు చూచెను. అన్నిమారు లామె కన్నులు బాష్పపూరితము లయ్యెను.

ఆనిద్రితుఁడు మేల్కొనునప్పటికిఁ జాల ప్రొద్దెక్కినది. తననేత్రములవంకఁ జూచుచున్న యానేత్రములను జూచినతోడనే యతఁడు మహాద్భుతము నొంది కన్నులుమూసికొని చేతులు రెండుఁ బైకెత్తి భగవంతు నిట్లు వేడుకొనెను. 'ఓదయామయా? పరమేశ్వర! ఇది స్వప్నమే యైనపక్షమున నాకు మఱలఁ దెలివి రాకుండఁజేయుము.'

"స్వామీ! ధనపురప్రభూ! నన్ననుసరించి మీ రిక్కడ కేల వచ్చితిరి? ఇల్లులేక దేశద్రిమ్మరి నైననన్ను మీ రనుసరింపఁ దగునా? తపస్వినీముఖమునుండి వెలువడినమాటలు పూర్వగాథలను: బూర్వకాలములను జ్ఞప్తికిఁ దెచ్చునట్టిమనోజ్ఞ మైనపాటవలె నాతని చెవులకు వినం బొనరించెను.

"నాయాత్మ నంటియున్నపాపకళంకమును భగవంతుడు తుడిచి వేసెనా? నాప్రాణమా? నా ఉమా! నాప్రియురాలా! నిన్ను ప్రాణములతోఁ జూడఁ గలిగితినా?"

"మీయుమ గాదు. మీప్రియురాలు గాదు. మీభార్య గాదు. ఓధనపురప్రభూ! నే నేమనుష్యునకు భార్యగానుండుట మానుకొంటి ననియు, నామనస్సు నాహృదయము, నాశరీరము, నాప్రాణము భగవంతునకే యర్పణ చేసికొంటి ననియు నామేననున్న కాషాయవస్త్రముతే చెప్పుచున్నవి" యని యాయంగన మెల్లఁగాఁ బ్రత్యుత్తరమిచ్చెను.

ఇద్దఱు నొకనిముస మూరకుండిరి. కొంతసేపటికి ధనంజయుఁ డిట్లనియె. "ఉమా! నీచేతులు నాచేతులమీఁదఁ బెట్టుము. చెడిపోయిననాతల పిచ్చిపిచ్చి తలంపులఁ దలంచి నీవు లేనిదే యున్నట్లూహించుకొనుట లేదనియు, నిజముగా జీవించి నీవు యున్నావనియు, స్వానుభవమువలన నన్నుఁ గ్రహింపనిమ్ము."

అన నుమ తనహస్తముల మీఁదవైచి చిరపరిచితమైన యాస్పర్శచే మేను గగుర్పొడువ నించుక వడఁకెను. వడఁకుటయు నామె వెంటనే తన చేతులను వెనుకకు లాగుకొనెను.

"ఉండుము. ఉండుము! ఉమా! నన్ను నీపాదములు స్పృశింపనిమ్ము. క్షమింపుమని నిన్నుఁ వేఁడుకొందును. ఎందుకంటివా చిన్నప్రాయమున నీకు నేను గలుగఁజేసిన కష్టము లిన్నియన్ని కావు. నాహృదయమునుండి నిన్ను దరిమివేసితిని. హృదయమునుండియే కాదు. నాయింటనుండికూడఁ దరిమివేసితిని. శుద్ధాంతకాంతవైన నిన్ను దేశద్రిమ్మరిఁ జేసితిని."

అని యతఁ డాయుంగన రెండుపాదములు బట్టుకొని గడగడవడఁకుచు గన్నీటితో నామెపాదములను దడుపుచుండెను. వడఁకుచున్న యాపురుషుని పట్టువిప్పించుకొని తన పాదముల నావలికి దీసికొనుట కామె గిజగిజ తన్నుకొని యెట్లో యావలఁబడెను. వడియీసారి యతని దగ్గఱనుండక కొంచెమున దూరమున నిలిచి సన్ననియెలుఁగుతో నిట్లనియె. "స్వామీ! ధనపురప్రభూ! పూర్వాశ్రమవృత్తాంతము స్మరణకుఁ దేవలదు. గతంనాస్తి. అది మనయిరువురినడుమ భూస్థాపితము కావలసినదే. ఎవ్వఁడు మనపాపకళంకములనెల్ల గడిగివేయు సమర్థుఁడో యాతని క్షమార్పణము వేడుఁడు."

"ఆహా! అతఁడే నాపాపములను క్షమించుఁగాక! ఆతని కరుణారసమే నాకిప్పుడు విశేషముగఁ గావలసియున్నది. నేనెంతచిత్తక్షోభము నొందితినో నీవు తెలిసికొన్నపక్షమున నీవుగూడ నన్నుఁ దప్పక క్షమింతువు. గతవృత్తాంతము మిగుల భయంకరమై ఘోరమై పవలును రాత్రియు నన్ను వేధించినది నాకంతట తలయేఱువట్టినది. దృష్టి మందగించినది. నేనధమస్థితిలోఁ బడితిని. అందుచేత నాకూపిరి సలుపలేదు. నాయెడల దయఁ జూపువారులేరైరి. ఘోరమరణము నావల్ల గలిగెనని స్త్రీహత్యచేసిన మహాపాతకుండనని, నేనహోరాత్రములు కుందితిని. నామనసు మండిపోయెను. నానెత్తురు పేరుకొని పోయెను. నాగుండె కొట్టుకొనుట మానెను."

"కటకటా! మీరుమహాదుఃఖమనుభవించినారు. దుఃఖార్తులకు దయాసముద్రుఁడగు పరమేశ్వరుఁడే శరణము."

"అర్ధరాత్రమున హత్యలు నాయెదుట జరిగినట్లు నేను స్వప్నములు కాంచితిని. ఆఘోరస్వప్నములోనుండి నేను మేలుకొని భయకంపితుండనై కేకలు వేయుచు గుభాలున లేచితిని. అనంతరము ననధూహృదయము నాశనము చేసితి ననియు మధుర జీవనము మంటిపాలు చేసితి ననియు నేను గ్రహింపఁగలిగితిని. గ్రహించి బిగ్గఱగా నేడ్చితిని. నాయేడ్పు వినువారెవ్వరు? నాపై జాలిపడు వారెవ్వరు."

"ఓధనపురప్రభూ! అలా గనవద్దు. తాను పరిత్యజించిన జీవితముయొక్క పూర్వవృత్తాంతమును గాని, తత్సంబంధములైన సుఖములు గాని దుఃఖములు గాని తపస్విని చెవులఁ బడరాదు."

"ఓహో! భక్తిమార్గమునఁ బడినయెడల మనస్సున కూరట గలుగునని నీవు సంసారసంబంధములైన సుఖములు దుఃఖములు వదలుకొంటివి కాఁబోలు. ఇఁక నా యవస్థ యెట్లుండెనో చూడు! నీవు విడిచిపెట్టివచ్చిన ప్రతివస్తువు, పూర్వపరిచితమైన ప్రతిపదార్థము సూదులవలె నాకన్నులలో గ్రుచ్చుకొని నాకు బాధ కలిగించెను. ఆబాధ పడలేక యెట్టకేలకు మిక్కిలి యసహ్యమైన యాకలకత్తా గృహము విడిచి తలదాఁచుకొనుట కేదైన ప్రశాంతమయినయిల్లు దొరుకునా యని వాడవాడలంబడి తిరిగితిని. నే నొక సారి మనబిందుగారియింటికి వెళ్ళితిని. ప్రపంచములో నెక్కడనైన శాంత ముండినపక్షమున నది యామెగృహమందే యున్నది. ఆమెహృదయమునందే యున్నది. చిన్నతనములో నీవంటే ఆమె కెంతో ప్రేమ అలాటి ప్రేమ మఱియెవ్వరికి నుండదు. నీ పేరామె కిప్పటికి జ్ఞాపకమే. ప్రాతస్నేహితులమాట అంతచక్కగా జ్ఞాపకముంచుకొనువారు మఱిలేరు. ఆమె యనుగ్రహమును నేను వేడుకొంటినా నామె నన్ను క్షమియించి మనస్సున కూరట గలిగించునని నేను ననుకొంటిని.

ఉమ కన్నులు తడి యయ్యెను. మరలఁగలసికొను నాశలేక తాను విడిచి వచ్చిన బాల్యస్నేహితురాలియొక్క మాట వినఁబడఁగానే కాషాయవస్త్రముల యడుగున మాటువడియుండు హృదయము శోకావిష్టమయ్యెను.

"నేను బిందు గృహమునకు వెళ్ళియుంటిని! కాని యామె కలకత్తా విడిచి తొల్పుకారునకు వెళ్ళినది అక్కడకు వెళ్ళుటకు నాకు మొగము చెల్లినదికాదు. అప్పుడు కాళిమాట జ్ఞాపకము వచ్చినది ధనపురము బయలుదేఱి వర్ధమానమునకు రాత్రింబగలు నడచితిని. రాత్రులు పల్లెలలో గుడిసెలలోఁ దలఁదాచుకొనుచు గడ్డిపాన్పులమీఁదఁ బండుకొనుచుఁ బయనము చేసితిని. ఒకనాటి రాత్రి మిక్కిలి ప్రొద్దుపోయినతరువాత వర్ధమానము చేరి వడకుచున్న చేతితో ధనంజయుని తలుపు

తట్టితిని. వారు జగన్నాథ యాత్ర చేసి క్రొత్తగా వచ్చి యిల్లు చేరిరి. వారు నన్నెంతో దయతో నాదరించిరి. కాళి నా దుఃఖములు శ్రద్ధతో వినెను. సహజముగా మిక్కిలి మృదువైన యామె హృదయము జాలిచే గరగిపోయెను. ఆమె చిన్నప్పుడు పట్టుకొన్నట్లే నా చేయి బట్టుకొని గదిలోనికిఁ దీసికొనిపోయి నీ పేరు గౌరవించి నీయిష్టప్రకారము నేను నడచుకొనుచున్న నీవు నన్ను దప్పక క్షమింతువని నాతో నొక్కి చెప్పినది. ఆమాటలు బహుసంతాపమున మరుగుచున్న నాహృదయముమీఁద నమృతవర్షబిందువులవలెఁ బడెను. నీవు వెళ్ళిపోయిన తరువాత నేను హాయిగా నిద్రించినరాత్రి యారాత్రియే. ఆమె చూపినదయకుఁ బ్రేమకు భగవంతుఁ డామెను రక్షించుఁగాక!”

అట్లు చెప్పి ధనంజయుఁ డొక్క నిముసమాగెను. రెండు కన్నీటిచుక్కలు చెఱియొక్క కంటినుంచి దిగి చెక్కులమీఁదఁ బడి జారెను. పిమ్మట నతఁడు మునుపటికంటె నెమ్మదిగాఁ దనకథ వినిపించెను.

“ఉమా! నీప్రణయమునకు గడపటిగుర్తుగా నీవు విడిచిపోయినజాబు నిరంతరము నాహృదయమునం దున్నది. ఆజాబునుబట్టి నేను నూటయెనిమిది దేవాలయముల కఱిగితిని. కాళియు నామెమగఁడును నచ్చోటికి నావెంట వచ్చిరి. నిన్ను గుఱించి వారేమియు నెఱుఁగరు. వారు నన్ను గోయిపురమునకుఁ బంపిరి, నీవు గయకు వెళ్ళితివని నాకక్కడ దెలిసినది. నేను నిన్ను గయను వచ్చితిని. నీకొఱకు గుడిలోను బజారులలోను వెదకితిని. ఎదప్రక్కను నీమీఁద నొకకల గంటిని. ఇంక నధికముగాఁ జెప్పవలెనా? భగవంతుఁడు నాయుమను నాకిచ్చినాఁడు. నాప్రాణము నాకిచ్చినాఁడు. నాయాత్మ నాకిచ్చినాఁడు.”

తపస్విని వేషముక్రిందనున్న యా స్త్రీ హృదయము మఱియొకసారి శోకపూరితమయ్యెను. ఆ స్త్రీ నేత్రములు మఱియొకసారి బాష్పాకులితము లయ్యెను. గద్గదస్వరముతో నాతపస్విని యిట్లనియె. “ఓధన ప్రభూ! మనుష్యమాత్రులకు క్షమించుటకు శక్తిలేదు. భక్తవత్సలుఁడగు పరమేశ్వరుఁడే మనజీవితములఁ బరిశుద్ధములుగఁ జేయఁగలఁడు. కాని పతితురాలిని యామెదాని ప్రార్థనలు ప్రయోజనకరములగునేని మీనిమిత్త మా ప్రార్థనలు రేపుమాపు కరుణాసముద్రుఁడు పతితపావనుఁడు నగు పరమేశ్వరుని సన్నిధికఁ బోవుచుండును. మీరు దారుణదుఃఖమనుభవించినారు. అది దీర్ఘకాలము గాఢ మనుభవించినారు. పూర్వకృతదోషము మీరు భయంకరప్రాయశ్చిత్తముఁ జేసికొన్నారు. ఈ నాహృదయము మీయెడల రవంతయైన క్రోధము గలిగి యుండదు నేను జీవించియుండినంతకాల మిట్లే. ఇందుకు భగవంతుఁడే సాక్షి.”

“ఉమా! దయారసపూరితములైన యీపలుకులకు నిన్ను భగవంతుఁ డాశీర్వదించుఁగాక! నేను నీయెడల దోషములు చేసితిననియు, నీవు యోగ్యురాలవై నన్ను క్షమించితివనియు నేను జీవితాంతము వఱకు జ్ఞాపక ముంచుకొందును. దోషములు చేసి మలినస్వాంతుఁడనై నేను నిన్ను [illegible] చేరితిని. నాదోషాపహరణార్థము నీవు భగవంతుని ప్రార్థించితివి. ఇక్కడికి నాకథ ముగిసినది. నీదుఃఖవృత్తాంతము చెప్పుము. నీ వేకాకినివై యిట్లు సంచరించు టేల చెప్పుము!

“ధనపురప్రభూ! కాదు. నావృత్తాంతము దుఃఖకరమైనది కాదు. తన్ను శరణు జొచ్చువారికి పరమేశ్వరుఁడు దుఃఖములు బాపి యూరట గలిగించును గదా? తపస్వినీశీలము గ్రహించి తీర్థయాత్రలు చేయుచు ధర్మకార్యముల నెఱపుచు భక్తితత్పరలై జీవయాత్ర గడపునట్టి యంగన లీదేశమున నెంతోమంది కలరు. నేనట్టివారి నెందఱనో కలిసికొంటిని. వారు దేశమంతటఁ దిరిగి మానవనేత్రములు సాధారణముగాఁ జూడజాలని యనేక పుణ్యక్షేత్రములను సేవించినారు. గంగామాతకు జన్మభూములైన గోముఖమందలి మంచుదిబ్బలు కన్నులారఁ జూచినారు. కాశ్మీరమందలి మంచుకొండలలో దాగియున్న దివ్యస్థలములు మెట్టినారు. దక్షిణాపథంబున సీతారాములనివాసము చేతఁ బావనమైన గోదావరీసరంబుల కఱిగినారు. కృష్ణాకావేరితీరములం దున్న ప్రాచీనదేవాలయముల సందర్శించినారు. సర్వవ్యాపకుఁడైన దేవదేవుని, వాని పేరఁ గట్టఁబడిన దివ్యస్థలములలో దర్శించుటయు, దుఃఖార్తులై, రోగపీడితులై, వేదనపడు చున్న యాదేవదేవుని భక్తుల నాదరించి యేదియేని సహాయము చేయుటయు వారి పవిత్రసంకల్పము. వారి జీవనము యోగినీజీవనము. అనదయైన యీ పేదరాలినిఁగూడ వారు దీవించి తగుసహాయము చేయుట కొడంబడిరి. వారిసాంగత్యముచేత సంసారసంబంధములైనదుఃఖములను మనోవేదనలను నేను మఱచి పోదును. వారితపస్వినీవేషము నేను ధరించితిని. వారివలె మిక్కిలిపవిత్రజీవితమును గడపుటకై ప్రయత్నించెదను. అట్టి పవిత్రజీవితమునందే నిజమైన యానందము కలదు.”

“ఉమా! నీసంకల్పము మిక్కిలిగొప్పది. అది నీపూర్వశుద్ధచరిత్ర సమరూపమై యున్నది. కాని భగవంతుఁడు తన దివ్యస్థలములను దర్శించి సేవించువారిపూజానమస్కారములను మాత్రమే పరిగ్రహించునని నీ వనుకొనుచున్నావా? సంసారముఁ జేయుచుఁ దుర్బలు లగు స్త్రీపురుషులకుఁ జేయూత యిచ్చువారిని, నిరుపేదలను నిర్గతికులను రక్షించువారిని, అంతశ్శత్రువులను గెలిచి పరిశుద్ధజీవనము నడుపువారిని, భగవంతుఁడు చూడఁడని నీయభిప్రాయమా?”

'కాదు! సంసారముఁ జేయుచు ధర్మమార్గ మవలంబించువారు దేవాలయములలోనిక్కైంకర్యములకంటె నెక్కువకైంకర్యమును, యజ్ఞవేదికలమీఁద నిచ్చు బలికంటె నెక్కువ బలిని దేవదేవప్రీత్యర్థమై చేయుచున్నారని మనగ్రంథములలో వ్రాయబడియున్నది. సంసారయాత్రకుఁ దగనియాడువాండ్రు దగనిమగవాండ్రు గదా దుర్బలత్వముచేతఁ దావసవృత్తి నవలంబించుచున్నారు. ధనపురప్రభో! అట్టిదుర్బలత్వముచేత బాధపడువారిలో నేనొకర్తను. సంసారధర్మముల నేను సరిగా నడువఁజాలనైతిని. ఇంక సన్యాసమే నాకుఁ బరమగతి.'

'ఊమా? సంసారధర్మములు నీవు సరిగా నడువకపో లేదు. మహారణ్యములలోను నిర్జనస్థలములలోను తపస్సు చేసినమునులలోను బ్రహ్మచారులలోను నీకంటె నెక్కువక్లేశము నొందినవా రుండరు. నీవలెఁ బరమశాంతముతో మహాధైర్యముతో దుఃఖముల ననుభవించినవారుగూడ నుండరు. సంసారధర్మములను సరిగా నడుపఁజాలనివాడను నేను. పవిత్రపదార్థములమీదికి హృదయమును ద్రిప్పినవాడను నేను. దుర్బలు డగువాడను నేను కాబట్టి చేయూత గావలసినవాడను నేను. సహాయము కావలసినవాడను నేను. తప్పుదారిని బడిపోయినమగనియండ నుండి చేయూతయిచ్చి యతనిని మంచిదారిని నడిపించుటకు దోడుపడగూడదా?'

ధనపురప్రభూ! నన్ను తప్పుదారిని దింపవద్దు. ఆడుదానిమనస్సు మిక్కిలి దుర్బలమైనది. అది సాధారణముగా మంచిదారిని నడువనే నడువదు. నడుచుచున్న దానిని మీరు మరల్పవద్దు.

"ఊమా! నామాట య టుండనిమ్ము. పాపము పుత్రికావియోగముచేత నత్యంతవైక్లబ్యము నొందినమీతల్లి నైనఁ జూడ వలదా. ఆమె పెద్ద దైనది. ఏకపుత్రికావిషయము. పెత్తనములో నామె కూరటఁ కలుగజేయుటకు మరెవ్వరు లేరు కదా! కాలమాసన్నమైనప్పుడు నోట నీళ్ళు పోయువారు లేరుకదా! నిన్ను కని పెంచినందుకిదియా ప్రతిఫలము. ఆమెజీవిత మస్తమించుకాలమున నామెకు రవంత యాహ్లాదమునీవు గలుగజేయ గూడదా?'

"ప్రాణేశ్వరా! నేను రాజాల నని తెలిసియు నన్ను వదలివేయగూడదా?"

"అక్కచెల్లెండ్రమీఁగ నైన జూచినంతప్రేమ నీపై జూపి నిన్నిప్పటికిని ప్రేమచే జూడగొను చున్ననీప్రియమిత్రము బిందును గౌగిలించుకొనుటకైన నొకసారి రా గూడదా? బిందుపిల్లల నొక్కసారి యెత్తుకొని ముద్దాడరాదా?

లేత పెదవులతో వాండ్రు మాపిన్నియేది, మాపిన్నియేది యని ముద్దులు మూట గట్టున ట్లడుగుచుందురే. నీకు బ్రియమిత్ర మైనకాళిదగ్గఱ జేరి వెనుకటిసోదరీ మైత్రి నెఱపలదా? పాపము! తల చెడి దుఃఖసముద్రనిమగ్న యైనననుఁ నూరార్పఁగూడదా? ఇంటియొద్దకఱిగి చేయవలసినయీధర్మములకంటె సన్యాసినీధర్మములు మిక్కిలి యుత్కృష్టములని నీవనుకొనుచున్నావా?

బంధుమిత్రజనములతలంపులు మనస్సున బాదరకాగానే వెక్కివెక్కి యేడ్చుచు 'నాకిల్లు లేదు వాకలి లేదు' అనెను.

అనవుఁడు ధనంజయుఁ డిట్లనియె. "ప్రియురాలా! నీకిల్లు లేకేమి? పశ్చాత్తప్తుఁడైన నీమగనిహృదయమే నీకు దివ్యభవనమైన యిల్లు. క్రొత్తగా నీవు కాపురమునకు వచ్చిననాఁటికాలముఁ దలచుకో! నాకన్నులకు నీవెంత బ్రేమమైయుంటివి. కర్మవశమున నేను తప్పుదారులపట్టితిని. నేను భ్రష్టుఁడనైతిని. ఘోరపాపము చేసితిని. కాని ఉమా! నమ్ము నామాట. నీయనురాగము నేనెన్నఁడు మఱువ లేదు. క్రొత్తపెండ్లికూఁతురవై యెప్పుడు మనోహర మైనదానవై యెప్పుడు మధుర మైనదానవై కనఁబడుచున్నావు. నవోఢవై మాయింటికివచ్చి నాశిక్షలో నేపెరిఁగి నిండుజవ్వనము దాల్చిననాటికంటె వేదనాదోదూయమానమైన నాహృదయమున కిప్పు డెక్కువ ప్రియమును గూర్చుచున్నావు. ఇఁకముందు ధర్మార్థకామముల యందు నిన్నతిచరింపను. ఈధర్మపరిపాలనము నాచేతఁ జేయింపుము! నాయందు దోషారోపణము లేకుండ నన్నుఁ గాపాడిన పరమేశ్వరునియెడల నేను కృతజ్ఞుఁడనై యుండెదను."

ఉమ మేను కంపించెను. కన్నీటిచేఁ గంఠము పూడిపోయెను. మానవహృదయములోఁ బ్రభవించు ప్రతిరసమును లోఁబఱచుకొని యడచివేయవచ్చును. జ్ఞాపకమున్న ప్రతివిషయమును జెరిపివేయవచ్చును. కాని పతివ్రతయైన కాంత తాను మున్ను మనసార వలచి ప్రేమించిన యామనోనాథుని యనురాగమును మాత్రము మఱువ జాలదు. మృదువైన స్త్రీహృదయమునుండి బయలుదేఱుచున్న ప్రేమరసచిహ్నములనడఁచి కప్పిపుచ్చుటకై యాతపస్విని యెంతో ప్రయత్నము చేసెను. ఎట్టకేల కామె మాటలాడినప్పుడు మనోదౌర్బల్య మెంతదాచినను దాగక స్పష్టమయ్యెను. "ఓధనపురప్రభూ! దుర్బలురాలైన యాఁడుదానిని వదలివేయుము. మనము కలసికొన్నాము. విడిపోయినాము. ఎవరు త్రొక్కినపుంతలో వారు నడుచుట మంచిది. పరమేశ్వరకైంకర్యమునందు నాకభిలాషయున్నది. దానిచే నాకు దుఃఖోపశమన మగును. సంసారములో నాకట్టియభిలాషకలుగ లేదు. ధన

పురస్వామీ! మీమట్టుకు మీకును గొప్పకార్యాంతరములు గలవు. మీ పేదరైతులకు సాయము చేయవచ్చును. మీస్థితికిఁ దగినట్లు మీ దేశమునకు, జాతికి సేవ చేయవచ్చును. ఉత్కృష్టధర్మములు మీ చేతఁ జేయించుటకు మిమ్ము గాపాడినపరమేశ్వరుని గొలువవచ్చును. స్త్రీలోలతకంటె నివి మహోత్కృష్టములైన ధర్మములు కావా? స్వామీ! ఈధర్మముల నెఱవేర్చి దీనురాలైన యీ యాఁడుదానిని దాని యిచ్చవచ్చిన తెఱంగున బోవుటకు వదలివేయరాదా? ఇట్లు చేయుట బాగుండును. తరువాత నాతలనరసినప్పుడు మనము గలసికొంటిమేని మనము మొదట దేనిలోఁ ప్రవేశించి కృతకృత్యముగా లేకపోతిమో యా సంసారసంబంధమైన సమాగమమును మరల నపేక్షింపక కేవలమిత్రములవలె నుండవచ్చును.”

“ప్రియురాలా! ఉమా! నేను కృతకృత్యుఁడను కానిమాట నిజము. నీవు నా ప్రక్క మఱియొకసారి నిలుతువేని దైవసహాయమున నేనీసారి కృతకృత్యుఁడను గాఁగలను. నేను నీకపకారముఁ జేసితిని. అపమార్గములు పట్టితిని. తిరిగి గృహస్థుఁడ నగుటకు నాకుఁ దోడ్పడుము. దేవునియెదుట చాగిలంబడి మ్రొక్కుట మఱచిన నేను నీయెదుటఁ జాగిలపడి మ్రొక్కెదను. ఓ నా దేవతా! నాకు సహాయము చేయుము. నీకుఁ దగినవాఁడను నే ననిపించుకొనుటకుఁ దోడ్పడుము.”

“ప్రాణేశ్వరా! లెండు లెండు. నేనెల్లకాలము నీభార్యనే యనిపించుకొందును. నామాట నమ్ము! నేను జీవించినంతకాలము, నేను నీభూమిమీఁద దిరిగినంతకాలము, నాహృదయమున మీపైఁ బ్రేమనిలిపి యుండును. ప్రాణేశ్వరా! ఇందు మోస మేమియు లేదు. నా జీవితము పరమేశ్వరుని కర్పణము చేయుచున్నాను గనుక నన్నాఁడుదానినిగఁ జేసిన యా పరమేశ్వరుఁడు అతఁడు తన హృదయములో భక్తివిషయమునఁ బెంపవలసిన ప్రేమరసమును బెంచు గాక! నామనసులో నున్నది నిష్కల్మషముగా నొప్పుకొంటిని గావున నే నేర్పరుచుకొన్న పద్ధతి ప్రకారము నడుచుకొననిండు. నాహృదయమున మీవిగ్రహమే యుండునని మీ రెఱుఁగుదురు. మరుగులేక మన తలంపుల నెఱుఁగజాలిన పరమేశ్వరునకు నేను జేయు ప్రార్థనలో మీ పేరుగూడ గలిపి చేసెదను. కాషాయవస్త్రధారణము చేసిన పిదప మరల సంసారమునందెట్లు ప్రవేశింపఁగలను?” అని యుమ యేడ్చుచుఁ బలికెను.

“కాదు. ఓ ప్రియురాలా! ఓ స్త్రీశిరోమణీ! నీహృదయము నారీధర్మాచరణమునందు నిష్ఠితమైయున్నదేని యీ కాషాయవస్త్రధారణము నిన్ను వారింపదు. వివాహమునాఁటి రాత్రి నీవు భుజముపైఁ గట్టుకొన్న యీ యినుపబిళ్ళ నీవు తీసి